TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204132
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T84.2/V44S Accession No. T550

Author వెంకటశాస్త్రి - కె

Title శ్రీమద్భాగవతము

This book should be returned on or before the date last marked below.

శ్రీకృష్ణాయ పరబ్రహ్మణే నమః.

అఖిలకలికల్మషాపహంబగు

శ్రీమద్భాగవతము

ఆంధ్రవచనము.

మూఁడవభాగము. (627-1010)

బ్రహ్మశ్రీ కేతవరపు - వేంకటశాస్త్రిగారిచేఁ

ప్రణీతము

శ్రీ దేవరాజసుధీమణిపరిశోధితము.

ఆనందముద్రాలయమున ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనివారిచేఁ

ప్రకటితము.

1925.

(Copy-Right Registered)

All Rights Reserved.

Copyright 1913—By **R. Venkateshwar & Co., Madras,**

This book is fully protected by an Indian and Foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language and offer it for sale A substantial copy of the words, ideas or illustrations contained herein constitutes an infringement of a copyright, and notice is hereby given that suit will be filed in every case of infringement.

కాపీరైట్ - 1913 వ సం॥ ఆర్. వేంకటేశ్వర్ అన్డ్ కంపెనీ వారు కాపీరైటుదార్లు. ఈ పుస్తకము ఇండియా కాపీరైటు చేతను పరదేశీయమైన కాపీరైటు చేతను సురక్షితమైనది. ఎవరుగాని యీపుస్తకమును సంపూర్ణముగా గాని లేక యిందొక భాగమునుగాని తాము వేఱుగా ప్రకటించుటకును, మఱియొక భాషయందు తర్జుమా చేసి క్రయమునకు నిచ్చుటకును, హక్కు ఈయఁబడదు. ఇందుఁగల పదములనుగాని భావములనుగాని పటములనుగాని ఏమాత్రమైనను కాపీ చేసినయెడల అది కాపీరైటును ఉల్లంఘించిన ట్లగుటచే అట్టివారు దావాకు లోనగుదు రని దీనిచేఁ దెలియనగును.

౪ విషయసూచిక.

సునీతి ధ్రువుని నోదార్చి తపంబునకుఁ బంపుట	635
నారదుండు ధ్రువునికడకు వచ్చుట	636
నారదుఁడు ధ్రువునకు హితోపదేశము చేయుట	637
నారదుఁడు ధ్రువునకు నారాయణునాకారము చెప్పుట	642
నారదుఁడు ధ్రువునకు నారాయణమంత్ర ప్రభావమును జెప్పుట	643
నారదుఁ డుత్తానపాదునిఁ జూడఁబోవుట	644
ధ్రువుండు మధువనంబునఁ దపం బొనరించుట	645
నారాయణుఁడు ధ్రువునకు సాక్షాత్కరించుట	647
ధ్రువుఁడు నారాయణుని నుతించుట	648
జీవేశ్వర భేద నిరూపణము	651
ఉత్తానపాదుఁడు పురంబునకు వచ్చుధ్రువు నెదుర్కొనుట	657
ధ్రువుండు యక్షులతో యుద్ధము చేయుట	661
స్వాయంభువుండు ధ్రువునితో యుద్ధము మానుమని చెప్పుట	665
విరోధ ముడిగియున్న ధ్రువునిఁ గుబేరుఁడు చూడ వచ్చుట	672
ధ్రువుండు తపంబునకై బదరికావనంబున కేఁగుట	677
ధ్రువునిసమీపమున కాకసమునుండి విమానము వచ్చుట	678
మైత్రేయుండు విదురునకు వేనునిచరిత్రము చెప్పుట	686
వేనునికి మునులు పట్టము గట్టుట	690
మునులు వేనునికడ కేఁగుట	691
మునులు వేనునిశరీరమునుండి సృష్టి చేయుట	695
మునులు పృథురాజునకుఁ బట్టము గట్టుట	697
వందిమాగధులు పృథురాజుగుణముల వర్ణించుట	[illegible]
గోరూపధారిణి యగుభూమి పృథురాజును నుతించుట	

భూమి పృథురాజునకుఁ గర్తవ్యము నుపదేశించుట	713
పృథువు గోరూపధారిణి యగుభూమివలన నోషధులను బిదుకుట ...	715
ఇంద్రుఁడు యాగాశ్వము నపహరించుట	719
బ్రహ్మ పృథువున కుపదేశము చేయుట	723
విష్ణువు పృథువునకు దేహాత్మలకుఁ గల్గుభేదము నిరూపించుట ...	726
పృథువు నారాయణుని నుతించుట	732
పురవర్ణనము	735
పృథువు సభాసదులను బూజించుట	738
పృథురాజునొద్దకు సనకాదు లరుగుదెంచుట	751
పృథువు భార్యతోఁ దపోవనంబున కేఁగుట	762
పృథురాజుభార్య యర్చి యగ్నిప్రవేశ మగుట	765
ప్రచేతసులు తపోవనంబున కేఁగుట	770
శంకరుఁడు ప్రచేతసులకు హిత ముపదేశించుట	771
భగవంతుని రూపవర్ణనము	774
శంకరుఁడు పరమేశ్వరుని నుతించుట	776
నారదుఁడు ప్రాచీనబర్హికి జ్ఞానోపదేశము చేయుట... ...	782
పురంజనోపాఖ్యానము	782
పురంజనుండు బుద్ధితో సంభాషించుట	789
పురంజనుఁడు వేఁటాడుట	796
ప్రజాగరుఁడు గంధర్వులతోఁ బోరాడుట	805
పురంజనుఁడు పరలోకమున కేఁగుచు భార్యాదులనుగూర్చి వగచుట	812
పురంజనుఁడు స్త్రీయై జన్మించుట	844
మలయధ్వజుఁడు తపం బాచరించుట	815
వైదర్భి సహగమనము చేయుట	817
నారదుఁడు ప్రాచీనబర్హికి హితోపదేశము చేయుట	824
నారదుఁడు ప్రాచీనబర్హికిఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట ...	837
రాయణుని నుతించుట	846

నారదుండు ప్రచేతసులయొద్దకు వచ్చుట 851
నారదుఁడు ప్రచేతసులకుఁ దత్త్వ ముపదేశించుట 851

పంచమస్కంధము.

ప్రియవ్రతోపాఖ్యానము 859
బ్రహ్మ మునిగణములతోఁ బ్రియవ్రతునిపాలి కేఁగుట... .. 860
ఆగ్నీధ్రుఁడు పూర్వచిత్తినిఁ జూచి మోహించుట 871
నారాయణుండు నాభికిఁ బ్రత్యక్ష మగుట... ... 876
ఋషభుండు సన్న్యసించి యడవుల కేఁగుట 891
భరతోపాఖ్యానము 899
వృషలుని సేవకులు భరతునిఁ గాళీమందిరమునకుఁ గొనివచ్చుట .. 913
జడభరతుఁడు రహూగణునకుఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట .. 918
రహూగణుఁడు భరతునిఁ గొన్ని ప్రశ్నంబు లడుగుట .. 929
భరతుఁడు రహూగణునకు నాత్మస్వరూపమును జెప్పుట .. 933
శుకుఁడు భరతసంతతిని దెలుపుట 952
గయోపాఖ్యానము 953
శుకుండు రాజునకు భూపరిమాణాదులను జెప్పుట ... 957
గంగానదికి వేలువేలు నామంబులు గల్గుట 964
శుకుఁడు రాజునకు భద్రాశ్వాదులందలి విశేషములను జెప్పుట .. 971
రమ్యకవర్షముఁగూర్చి దెలుపుట 978
శుకుఁడు భారతవర్షమున నుపాస్యులను జెప్పుట 988
శుకుండు భారతవర్షమునఁ గల నదీశైలముల నిరూపించుట ... 990
శుకుఁడు ప్లక్షాదిద్వీపములవృత్తాంతము చెప్పుట 995
శాల్మలద్వీపవృత్తాంతకథనము 997
కుశద్వీపవృత్తాంతము 998
క్రౌంచద్వీపవృత్తాంతము 999
శాకద్వీపవృత్తాంతము 1001
పుష్కరద్వీపవృత్తాంతము 1002

పటములపట్టిక.

శ్రీమన్నారాయణుఁడు ధ్రువునకు ప్రత్యక్షమై శంఖముతో కపోలములు తాఁకుట. వానికి దివ్యజ్ఞానము గలుగుట 647

పృథుచక్రవర్తి యాగమునందు ఇంద్రుఁడు యాగాశ్వమును అపహరించుట 719

అగ్నీధ్రుఁడు పూర్వచిత్తిని జూచి మోహించుట ... 871

నదీతీరమున జింక సింహగర్జనముచే గర్భమును స్రవించుట ; భరతుఁడు దాని నెత్తికొనుట ... 903

నీశ్వరుండను. దేవుఁడు, మనుష్యులు ననెడి నామభేదములుగాని రూపభేదములుగాని లేకపోవుటచేఁ గేవలము ద్రష్టనై యుందును. నేనొకప్పుడును సంకోచము నొందనిజ్ఞానముగలవాఁడను. నేను బ్రకృతిపురుషసంబంధము గలవాఁడనైనను దద్గతమగు జడత్వమునుగాని పరిణామము నొందుటనుగాని యజ్ఞత్వమును గాని దుఃఖిత్వముగాని పొందక వర్తించుచుందును ఓయీ! సూక్ష్మములగు ప్రకృతిపురుషులే స్వరూపముగాఁగలిగి సమస్త హేయగుణముల విసర్జించి కల్యాణగుణములు గలిగిన నేను త్రిగుణాత్మికయగు నాప్రకృతియందు సంకల్పరూపమగు జ్ఞానముచే జీవునిమూలమునఁ బ్రవేశించి చతుర్ముఖునిమూలమున విశ్వమును సృజించుచు. నేను స్వయముగా నే పరిపాలించుచు, రుద్రరూపమున సంహరించుచు, నాయాకృత్యములకుఁ దగిన సంజ్ఞలను (బ్రహ్మవిష్ణుశివనామములను) ధరించుచున్నాను. కావునఁ జడచిదాత్మకమగు ప్రపంచమనెడి కార్యరూపముగాను, సూక్ష్మదశను బ్రకృతిపురుషులే శరీరముగాఁగల కారణరూపముగాను, నున్నవాఁడను నేనొక్కఁడనే కాని నాకంటె నితరవస్తువు లేదని యెఱుంగుము. విశ్వమంతయు నాస్వరూపమే యగుటచేతను నాకంటె వ్యతిరిక్తమగు వస్తువు లేకపోవుటచేతను, మద్వ్యతిరిక్తమగు స్వతంత్రవస్తువున్నదనుట దేహాత్మభ్రాంతిమూలకమే. మఱియుఁ గార్యావస్థను, గారణావస్థను బొందియున్న ప్రకృతిపురుషులు శరీరముగాఁ గలిగి ప్రకృతిపురుషులలోఁ బ్రవేశించియుఁ దద్గతదోషములను బొరయక * స్వసమానమగు

---

* ఇందులకు మూలము. "అద్వితీయే" అనియున్నది. "అద్వితీయ" యనుపదమున కర్థము రెండవవస్తువు లేనివాఁడని చెప్పరాదు. తనతోసమమగు

ద్వితీయవస్తువు లేనివాఁడనై స్వాధికమగు మఱియొకవస్తువుతో శూన్యుండనై హేయగుణము లేమియును లేక స్వరూపముచేతను గుణములచేతను సర్వాధికుండనై యున్న నాయందు నాకు శరీరభూతములగుటచే నన్ను విడిచి వేఱుగానుండని బ్రహ్మరుద్రాది భూతములను, స్వతంత్రించి వేఱుగా నుండెడివానినిగా బ్రహ్మజ్ఞానములేని మూఢులు చూచుచుందురుగాని జ్ఞానులట్లు చూడరు. * ఇంతియకాక దేహాత్మభ్రాంతి గలవాఁడయినను

ద్వితీయవస్తువు లేనివాఁడని యర్థముచెప్పవలెను. "యశ్చాచోళనృపస్సమోద ద్వితీయోనాస్తిభూతలే" అను చోట చోళనృపతితో సముఁడగువాఁడు లేఁడని యర్థముకాని వానికంటె నితరుఁడులేఁడనికాదు. అట్లేయిట నూహింపవలెను.

* ఇందులకు మూలము: "త్రయాణామేకభావానాం యోనపశ్యతి వై భిదాం। సర్వభూతాత్మనాం బ్రహ్మన్ స శాంతి మధిగచ్ఛతి" అనియున్నది. ఇట "ఏకభావానాం = ఒకనియందు సత్తగల, త్రయాణాం = బ్రహ్మవిష్ణురుద్రులకని యర్థముచెప్పి, ఈముగ్గురికంటె నతిరిక్తమగు మఱియొకపదార్థము గలదని యూహించుచున్నారు. కాని యది యయుక్తము. గొప్పవానమెప్పడును జగత్కారణమందుండఁదలయును గావునను, అట్టిజగత్కారణత్వము "ఆత్మేశ్వర ఉపద్రష్టా" అనుశ్లోకముచే విష్ణువునకే కలదనిచెప్పఁబడినది కావునను, నావిష్ణువుకంటె నుత్కృష్టమగువస్తువు మఱియొకటిలేదని చెప్పవలసియున్నది. మఱియు "తస్మిన్బ్రహ్మణ్యద్వితీయే కేవలే పరమాత్మని" అనుశ్లోకముచే విష్ణువు సర్వోత్కృష్టుఁడని యొక్కఁడనే చెప్పియున్నాఁడు. కావున విష్ణువుకంటె మఱియొకయుత్కృష్టవస్తువున్నదని యోజింపరాదు. మఱియు గొందఱు "ఏకభావానాం" అనుపదమునకు "ఏకస్వరూపులని చెప్పి ముగ్గురికిని తాదాత్మ్యమును వర్ణించుచున్నారు. కాని యదియును యుక్తముకాదు. బ్రహ్మరుద్రులు జీవులనియుఁ గర్మవశ్యులనియు, విష్ణువునకు నియమింపఁదగినవారనియు, నారాయణునివలన బ్రహ్మరుద్రులు జన్మించిరనియు,

బురుషుఁడు శిరస్సు మొదలగు నవయవములలో నొకదానినైన నపరకీయముగాదనియుఁ దనకంటె వేఱుగానుండఁ దగదనియుఁ

"నారాయణాద్బ్రహ్మాజాయతే" "నారాయణాద్రుద్రోజాయతే" ఇత్యాది శ్రుతులందుఁ జెప్పఁబడుచున్నది. కానఁ దత్స్వరూపులగు బ్రహ్మరుద్రులకుఁ బరబ్రహ్మమయిన విష్ణువుతోఁ దాదాత్మ్యమునంగీకరింపరాదు. ఆలోచింపఁగా "బ్రహ్మా నారాయణః శివశ్చ నారాయణః॥ శ్లో॥ బ్రహ్మా నారాయణాఖ్యోసౌ కల్పాదౌ భగవాన్యథా। ప్రజాస్ససర్జ భగవాన్ బ్రహ్మా నారాయణాత్మకః। తతస్సభగవాన్విష్ణూ రుద్రరూపధరోవ్యయః। తతః కాలాగ్నిరుద్రోసౌ భూత్వా సర్వహరో హరిః। సర్గస్థిత్యంతకరణీం బ్రహ్మవిష్ణుశివాత్మికాం। ససంజ్ఞాంయాతి భగవానేక ఏవ జనార్దనః॥" ఈ మొదలగు ప్రమాణముల వలన బ్రహ్మవిష్ణుమహేశ్వరుల కైక్యమున్నట్లు గానవచ్చుచున్నను, నంతమాత్రమున నైక్యమంగీకరింపరాదు. శ్రు॥ "నారాయణాద్బ్రహ్మా జాయతే॥ నారాయణాద్రుద్రో జాయతే। నారాయణాద్ద్వాదశాదిత్యా రుద్రా వసవ స్సర్వాణిచ్ఛందాంసి। నారాయణాదేవ సముత్పద్యంతే॥ ఏకోహవై నారాయణ ఆసీత్। న బ్రహ్మా। నేశానః। ఏకోహవై నారాయణ ఆసీత్। న బ్రహ్మా నచ శంకరః। సముని ర్భూత్వా సమచింతయ త్తత ఏతే వ్యజాయంత విశ్వో హిరణ్యగర్భోఽగ్నిర్యమో వరుణ రుద్రేంద్రాః॥ శ్లో॥ యన్నాభిపద్మాదభవన్మహాత్మా ప్రజాపతిః। తత్ర బ్రహ్మా చతుర్ముఖోఽజాయత సోఽగ్రే భూతానాం మృత్యుమత్యసృజ త్త్రియక్షం త్రిశిరస్కం త్రిపాదం। ఖండపరశుం। బ్రహ్మణః పుత్రాయ జ్యేష్ఠాయ॥ శ్లో॥ బ్రహ్మాదక్షాదయః కాలస్తథైవాఖిలజంతవః। విభూతయో హరేరేతా జగతస్సృష్టిహేతవః। రుద్రః కాలాంతకాద్యాశ్చ సమస్తాశ్చైవ జంతవః॥" ఇత్యాదులందు భగవంతుడగు విష్ణువునకును, బ్రహ్మరుద్రులకును బరస్పరము భేదమున్నట్లు గానవచ్చుచున్నది. కావునఁ ద్రిమూర్తుల కైక్యమంగీకరింపరాదు. మఱియు మూలమున "త్రయాణాంభావానా" మని విష్ణువుతో బ్రహ్మరుద్రులను గలిపి యుచ్చరించినంతమాత్రమున బ్రహ్మరుద్రులు విష్ణువు సమానులనియుఁ జెప్పరాదు. శ్లో॥ "సృష్టింతతః కరిష్యామి త్వామావిశ్య ప్రజాపతే।" "హరోహరతి తద్వశః" ఇత్యా

దప్పక చూచుచుండును. అట్లు నాయందాసక్తముగుచిత్తము గలపురుషుఁడు భూతముల నాకంటె వేఱుగానుండఁ దగనివని

దిస్థలములందు నారాయణుఁడే బ్రహ్మరుద్రులందావేశించి సృష్టిప్రళయంబుఁ జేయుచున్నట్లుతోఁచుచున్నది కాన నారాయణుఁడు సర్వోత్కృష్టుఁడనియు నతనితో సమానులు లేరనియు తెలుంగువది. ఇంతియకాక మూలమున "సర్వభూతాత్మనా" మని "త్రయాణాం" అనుదానికి విశేషణము చేయఁబడినది. ఆలోచింపఁగా త్రిమూర్తులుగూడ సర్వభూతములకు నంతరాత్ములని యర్థము వచ్చుచున్నదని బ్రహ్మరుద్రులుగూడ సర్వభూతస్వరూపులని చెప్పరాదు "ఏష సర్వభూతాంతరాత్మాఽపహతపాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః । అంతః ప్రవిష్టశ్శాస్తాజనానాం సర్వాత్మా॥ మమాంతరాత్మాతవచ యేచాన్యేదేహిసంజ్ఞితాః" అనునీశ్రుతిస్మృతులప్రమాణముచే నారాయణుఁడే సర్వభూతములకు నంతరాత్మగాయున్నట్లు తెలియవచ్చుచున్నది. బ్రహ్మరుద్రులు జీవులు కావున వారణుస్వరూపులు. అణుస్వరూపులగువారు సమస్తభూతములకునంతరాత్మలైయుండుటయసంభవము. మఱియు "తద్వైతత్పశ్యన్నృషిర్వామదేవః। ప్రతిపేదే అహంమనురభవం సూర్యశ్చ కక్షీవానృషిర్విప్రః । త్వంవాఅహమస్మిభగవోదేవతే । అహంవై త్వమసిభగవోదేవతే । తద్యోఽహంసోఽసౌయోఽసౌసోఽహం అహంహరిస్సర్వమిదంజనార్దనః। అన్యత్తతఃకారణకార్యజాతం" "ఆత్మేతిత్వూపగచ్ఛంతి గ్రాహయంతిచ" ఈ మొదలగువానియందు విష్ణువే సర్వభూతములకు నంతరాత్మయనియు నతఁడే పరమాత్మయనియుఁ దెలియవచ్చుచున్నది. కాన బ్రహ్మరుద్రులు సర్వభూతముల కంతరాత్ములని గ్రహింపరాదు. కావున "ప్రియోహిజ్ఞానినోఽత్యర్థమహంసచ మమప్రియః" "జ్ఞానీత్వాత్మైవమేమతః" ఈ మొదలగు ప్రమాణములచే జ్ఞానులయిన బ్రహ్మరుద్రులు నాకు మిక్కిలి ప్రియులగుటచేతను, నాకుశరీరభూతులగుటచేతను, వారలకుఁజేసినయపరాధము నాకుఁ జెందును. కావున నోదక్షా! ఇట్లు నాకుశరీరభూతులగు బ్రహ్మరుద్రులనుగూడ నీశ్వరులఁగాభావింపక యొక్క నారాయణుఁడే బ్రహ్మరుద్రరూపముగాను స్వయముగాను నున్నాఁ

తలంచుచుండును. కావుననే పురుషుఁడు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ముగ్గురుగలరని మనంబున భావింపక విష్ణువొక్కఁడే యీశ్వరుఁడనియు, నతఁడే బ్రహ్మరుద్రులయి యవతరించుచున్నాఁడనియుఁ దలంచునో వాఁడు క్రమముగా మనశ్శాంతిని బొంది ముక్తుండగును" అనియిట్లు భగవంతునివలన నుపదేశమును బొంది దక్షుఁడు తానొనరించెడుక్రతువుచే హరి నారాధించి స్వర్గమందును భూమియందునుగల దేవతలకెల్ల నొసఁగదగు నట్లు భాగముల నర్పించి పూజించెను. పిమ్మట సమాహితచిత్తుఁడై దక్షుఁడు యాగభాగము నర్పించి రుద్రునిఁగూడిఁ బూజించెను. పిమ్మట సోమపానము చేయువారును జేయనివారు నగు దేవతలను బూజించెను. ఇట్లుచేసి దక్షుఁడు ఋత్విజులతోఁగూడ నవభృథస్నానము గావించెను. అంత దేవతలు తనప్రభావముచేతనే సమస్తసిద్ధులను బొందిన దక్షునకు ధర్మాసక్తమగు బుద్ధినొసంగి దివంబున కేఁగిరి. ఓవిదురా! సతీదేవి యిట్లు పూర్వదేహమును విడిచి హిమవంతుని భార్యయగు మేనకాదేవిగర్భంబునంబుట్టి పార్వతి యనునామము గలదయి సర్వదా శంకరునే భజించుచుఁ, బ్రళయకాలమందు దనన్యగతిక యగు మాయ పరమపురుషుని వరించునట్లు శివుని వరించినదని విని యున్నాను. దక్షాధ్వరధ్వంసియయిన శంకరుని యత్యద్భుత చరిత్రమును నేను బృహస్పతికి శిష్యభూతుండును, భగవద్భక్తుఁడునగు నుద్ధవునివలన వినియున్నాను. ఓవిదురా! న

ని యెవఁడు తెలిసికొనునో సమస్తమును బ్రహ్మముగా భావించున్న యా పురుషుఁడు మనశ్శాంతిని బొంది ముక్తుండగును. అని నారాయణుండు దక్షున కుపదేశించెను.

రుండు భక్తిశ్రద్ధాసమన్వితుండై శంకరుని యద్భుతచర్యల తోఁగూడిన యీచరిత్రమును జక్కఁగఁ బఠించినవాఁడు సమస్తపాపములవలన విముక్తుండగును. పరిపూర్ణంబగు నాయువు నొందును. మఱియు నెవ్వఁడీచరిత్రమును వినునో వాఁడు నట్టి ఫలంబులఁజెంది వర్తించును. ఇందుల కెంతమాత్రము సందియము లేదు. ఇది యేడవ అధ్యాయము.

ఓ కౌరవశ్రేష్ఠా! నీకు మనుపుత్త్రికల వంశములను వర్ణించి చెప్పితిని. ఇంక స్వాయంభువమనుపుత్త్రుల వంశంబుల వర్ణించెద. అంతకుముందుగా నొకకథ చెప్పవలసియున్నది. వినుము. బ్రహ్మకు సనకాదులయిన కుమారులు పుట్టిరని చెప్పియున్నాను. వారిలో మరీచ్యాదులు గృహస్థులైరి. కాని సనకాదిమునులును నారదుండును, హంసుండును, నారుణియు, యతియు ననువారలు మాత్రము గృహస్థాశ్రమంబు చేకొనక బ్రహ్మనిష్ఠులయి యూర్ధ్వరేతస్కులై సంచరించిరి అందుచేత వారి వంశంబులు వర్ధిలలేదు. బ్రహ్మపుత్త్రుఁడధర్ముండనువాఁడు కలండు. ఆయధర్మునికి మృషయనెడి భార్యయందు దంభుఁడను కుమారుండును, మాయయను కుమారికయుఁ గలిగిరి. ఆమాయాదంభులు సోదరులైనను వర్తంబువలన భార్యాభర్తలయిరి. ఆమిథునము సంతానరహితుఁడయిన నిర్ఋతి చేరఁదీసి దంభునిఁ కుమారునిఁగాను మాయను గోడలిగాను నెంచికొని వర్ధించె. ఆదంపతులకు లోభుండను కుమారుండును, నికృతియను బుత్త్రియుం బుట్టిరి. సోదరులయిన నికృతిలోభులు దంపతులై క్రోధుండను పుత్త్రుని హింసయనెడి కన్యకను బుట్టించిరి. అంత వారలిరు

వురు దంపతులై కలియను బుత్త్రిని దురుక్తియను కుమారికం బడసిరి. అంతఁ గలియు దురుక్తియు దంపతులై భీతియనుకూఁతును మృత్యువను కుమారునిం బడసిరి. పిమ్మట నాభీతి మృత్యువులు దంపతులై యాతన యను కుమారికను నిరయ మను కుమారునిఁ బడసిరి. ఇది యధర్మని వంశము. వెనుక వర్ణింపఁబడిన మాయాదంభాదులు సంసారహేతువగు నధర్మవృక్షమునకు శాఖలచందంబున నఱలుచుందురు. శ్రేయస్కాముఁడయిన మానవుఁడెన్నఁడు వానిదరికేఁగుట యుక్తముకాదు. ఈ యధర్మాదుల సృష్టినే ప్రతిసర్గ మని చెప్పుదురు. ఓ విదురా! ఇఁక స్వాయంభువుని వంశమును వర్ణింతును వినుము. స్వాయంభువునకు శతరూప యనుభార్యయందుఁ బ్రియవ్రతోత్తానపాదులనుకుమారు లిరువురు కలిగి రని చెప్పియున్నాను. వా రిరువురు విష్ణువుకళలను ధరించి లోకమును రక్షించుటకయి యుదయించిరని తెలిసికొనుము. ఆ యిరువురు రాజకుమారులలో నుత్తానపాదుఁ డనువానికి సురుచి సునీతి యను నిరువురు భార్యలు కలరు. ఆభార్యలలో సురుచిపతికి మిక్కిలి ప్రియురా లయినది. రెండవభార్య సునీతి సత్ప్రవర్తనకల దయినను నతనికిఁ బ్రియురాలు కాకపోయెను. ఉత్తానపాదునకు నప్రియురాలయిన సునీతికి ధ్రువుఁడను నొకకొమరుండు కలఁడు. ఆసురుచికి నుత్తముఁడను నొకకొమరుండు కలఁడు. ఒకనాఁ డుత్తానపాదుఁ డొక్కచోఁ గూర్చుండియుండఁగా సురుచిపుత్త్రుఁడయిన యుత్తముఁడును సునీతిపుత్త్రుఁడయిన ధ్రువుఁడును దండ్రియొద్దకే తెంచిరి. ఆసమయమున సురుచిపుత్త్రుఁడు పరువడి నరుదెంచి తండ్రితొడపయిఁ గూర్చుండుట కభిలషింప నపుఁడా కుమారునిఁ దొడ

పయి నధివసింపఁ జేసి యతని యభిలాషమును నెఱవేర్చెను. ఆసమయంబున ధ్రువుండుకూడ నరుదెంచి తండ్రి తొడమీఁదఁ గూర్చుండుటకుఁ బ్రయత్నించెను. కాని యతఁ డందుల కంగీకరింపఁడయ్యె, అంత ధ్రువుండు చేయునదిలేక క్రిందనే నిలిచి యుండెను. అది చూచి సురుచి రాజునకుఁ దనయందును దనపుత్త్రునియందును మెండుగ దయగలదని గ్రహించి మిగుల సంతసించి గర్వించి, చిన్నని మోముతో నున్న ధ్రువునిఁజూచి పరిహాసముగా నిట్లనియె. "కుమారా! ఏలచిన్నబోయెదు? తండ్రితొడపై గూర్చుండుటకు నీ వర్హుఁడవుకావు. తండ్రియంకము నధివసింపఁదగినంత భాగ్యము గలవాఁడవయినచో నాగర్భమందే జనింతువు. నీకట్టియోగ్యత లేదు.కనుక నే దురదృష్టవంతురాలైన యా సునీతిగర్భమందుఁ బుట్టితివి. ఇప్పు డొక పనిచేయుము. నీవుపోయి హరినిగూర్చి తపం బాచరించి నాగర్భమందుఁ బుట్టునట్లు వరంబుఁ వేఁడుము.అట్లయి ననీకోర్కె నెఱవేఱఁగలదు." అని యిట్లు పలికిన సవతితల్లివాక్యములు చెవులకు ములుకులవడువున నాటినఁ గ్రోధావిష్టమానసుండయి దండతాడితంబయిన సర్పంబుచందంబున నిట్టూర్పువుచ్చుచుఁ,గన్నీరు కాల్వలుగట్ట దుఃఖించుచు నాస్థలమునుబాసి తనతల్లియయిన సునీతి మందిరంబున కరుదెంచెను. అట్లు శోకాకులితస్వాంతుడయి వచ్చిన తనకుమారుంజూచి సునీతి మిగుల విచారించుచు నెదురుసనికొనివచ్చి తొడలపయి నిడుకొని పురజనులవలన సురుచిపల్కిన వాక్యంబులు విని మిక్కిలి దుఃఖించి ధైర్యంబువిడనాడి దావాగ్నిచేఁ దహింపఁబడిన లతచందంబున శోకాగ్నిచే దహింపఁబడి మాటిమాటికి సవతివాక్యంబులఁ దలంచుకొనుచు నిట్టూర్పువు

చ్చుచుఁ, గన్నులనుండి బాష్పధారలను బ్రవహింపఁ జేసెను. ఇట్లు
కొంతవడి దుఃఖించి ధైర్యంబుఁ దెచ్చికొని యేడ్చుచున్న కుమా

సునీతి ధ్రువుని నోదార్చి తపంబునకుఁ బంపుట.

రుంజూచి యోదార్చుచు నిట్లనియె. "ఓముద్దుకుమారా! దుఃఖ
ముతో నేమి ప్రయోజనము? పూర్వజన్మమందు మనమెవరినో
దుఃఖింపఁ జేసితిమి. కావున మనకిట్టిదుఃఖము సంప్రాప్తమయి
నది. ఎవరికయినఁ దా నొనర్చినకర్మమును దా ననుభవింపక
తీఱదు. నాయనా! ఆసురుచి వాక్యము సత్యమే! నేను మిగుల
దురదృష్టవంతురాలను. అట్లుకానిచోఁ బెండ్లాడినభర్త నన్ను
భార్యనుగాఁ జెప్పుకొనుటకును సిగ్గుపడునా? లోకములో భ
ర్తలు భార్యల నెంతో గౌరవముతోఁ జూచుచుందురు. అట్టి
గౌరవము నాకు లేదు సరియేకదా? యతనిభార్య ననిపించుకొను
టకయిన యదృష్టము లేదు. అకటా! భర్తలగౌరవముఁ బడయు
నంతటియదృష్టముత్తమురాండ్రకుఁ దక్క నావంటి పాపాత్మురా
లికి సంభవించునా? దురదృష్టవంతురాలనగు నాగర్భమందుఁ
బుట్టినవాఁడవు కావున నీవును దురదృష్టవంతుడవే. నావంటి
పాపాత్మురాలిగర్భమందు జనించితివి. కనుక నీసవతితల్లి పల్కిన
కారుమాటలు పడవలసివచ్చినది. లేనిచో నట్టిమాటచే నొప్పిం
పఁబడి దుఃఖమునకుఁ బాత్రుండవు కావుగదా? నీసవతితల్లి చె
ప్పినట్లుగానే తండ్రితొడపైఁ గూర్చుండఁ గోర్కె పుట్టినచో హరిని
గూర్చి తపంబాచరింపుము. నీవు మాత్సర్యమును విడిచి యామె
వాక్యమునే సత్యముగాఁ జేయుము. నారాయణుని నారాధిం
చుటవలన సమస్తమనోరథంబులును సమకూరును. పూర్వము
బ్రహ్మ విష్ణువు నారాధించియె చతుర్దశభువనములలో [illegible]

మయిన పదవినిఁ జెందియున్నాఁడు. మఱియు నీతాతయగు స్వాయంభువమనువు నిశ్చలమయినభక్తితో నారాయణు నుద్దేశించి గొప్పదక్షిణలతో యాగంబుల నొనరించి యతని సంతసింపఁజేసి భూలోకమందును స్వర్గలోకమందును బ్రశస్తములయిన సుఖము లనుభవించి మోక్షము నందెను. నీవు నట్టి భక్తవత్సలుఁడయిన విష్ణువు నెస్మరించుచు నుత్కృష్టమయిన తపము నాచరింపుము. అందులకు నారాయణుండు సంతసించి నీమనోరథము నెఱవేర్చునుగాని నెఱవేర్పకపోఁడు. ఆశ్రయించిన నట్టి భక్తవత్సలునే యాశ్రయింపవలెను. కాని సామాన్యుల నాశ్రయించిన లాభ మేమి? మఱియు నావిష్ణువు యోగీశ్వరుల చేత సైతము వెదుకఁబడుచుండును. అఘటనఘటనాసామర్థ్య మాతనికేఁ దక్క నింకొకరునకు లేదు. అతఁడే ముక్తిప్రదుఁడు. అతఁడే సర్వలోకాధిపతి. అట్టి మహానుభావునియందు నీమానసంబును జేర్చి నిజధర్మంబుల విడనాడక యతనినే శరీరమధ్యమున నున్నదహరాకాశమందు వెలయుచున్న పరమాత్మనుగా భావించి సేవింపుము. నీదుఃఖముల నశింపఁజేయఁజాలువాఁడు నారాయణునికంటె మఱియొకఁడు లేఁడు. బ్రహ్మాదులును, దనయభిలషితమును నెఱవేర్చుకొన లక్ష్మియు,సంతతమతనిస్మరించుచు వెదకుచుందురు. కాన నతనినే యాశ్రయింపుము.'' అనిపలికిన పరమహితదాయకంబులయిన తల్లివాక్యంబులను విని తనకుఁదానే సమాధానము చేసికొని ధైర్య మవలంబించి నారాయణుండే ది

నారదుండు ధ్రువునికడకు వచ్చుట.

క్కని తలంచి ధ్రువుండు తనతండ్రిపురంబును విడిచి చనియె.ఆసమయంబున సకలలోకచరిష్ణువగు నారదుఁ డచ్చటికే తెంచియ

తనిచే యథావిధిగ సత్కృతుండయి యాతనియుద్యమంబు దెలిసికొని పాపవినాశనకరంబయిన తనకరతలంబును ధ్రువునిశిరంబున నిడి యాతని దీవించి తనలో ని ట్లనుకొనియె. "అయారే! ఈ పిల్లవానిధైర్యం బేమని కొనియాడుదు! మానం బీతనికిఁ బ్రాణంబుకంటె నుత్కృష్టమయినట్లు గానవచ్చుచున్నది. తనపినతల్లి యాడిన దురుక్తులను మానసంబున నిడికొని చిన్నవాఁడయ్యును ధైర్యంబవలంబించి తపంబాచరింప వనంబునకుఁబోవ సిద్ధపడుచున్నాఁడు. ఈ క్షత్త్రియబాలుని ప్రభావ మేమని వర్ణింతును? ఈతనిచర్య నాకు మిగుల నబ్బురంబు గొలుపుచున్నయది" అని యిట్లులనుకొని బాలుండైన ధ్రువున కిట్లనియె. "ఓ రాజకుమారా! సకల సంపదలతో నిండియున్న మీమందిరంబును విడిచి యెటకేఁగుటకుఁ బ్రయత్నించుచున్నావు? నీప్రవర్తన మరసిచూడ నీవు స్వబంధుజనకృతమయిన యవమాన మనెడునగ్నిచే సంతప్తుండవయినట్లు తోఁచుచున్నది. నీవృత్తాంతమును దెలియఁజేయుమ"ని తెలిసియుఁ దెలియనివిధంబున నడుగుచున్న నారదునిం గాంచి ధ్రువుం డి ట్లనియె. "ఓమునిసత్తమా! మీరు యోగదృష్టిచే నావృత్తాంతమును దెలిసికొంటిరా యేమి? మీరు తలంచినతలంపు నిక్కంబు. మాపినతల్లి దురుక్తులనెడి బాణంబుల నామనంబునకు గాయంబు కావించినది. అట్టిమనంబును సమాధానము చేసికోలేను. ఆదురుక్తిబాణక్షతంబును భగవత్పాదారవింద ధ్యానంబనెడి రసాయనంబుచే మాన్చుకొందు" ననుడు

నారదుఁడు ధ్రువునకు హితోపదేశముఁ జేయుట.

విని నారదుం డి ట్లనియె. "ఓరాజకుమారా! నీవు పిల్లవాఁడవు. నీవు సంతతము క్రీడలచేఁ గాలక్షేపము చేయువాఁడవు. కాని

పెద్దవాఁడవు కావు. ఆటపాటలలోఁ గాలముపుచ్చఁ దగినంత చిన్నప్రాయముగల నీకు మానావమాన వివేచనము తగదు. నీ కట్టి మానావమానవివేకము కలిగినచో నందువలన మోహముదక్క నితరమయిన యసంతోషహేతువు లేదు. మఱియు నది దేహము నాత్మగాఁ దలంచుటవలనఁ గలిగినది కాని యాత్మసంబంధమయినది కాదు. ఇంతమాత్రంబునకై నీ విట్లు పంతగించి తపంబునకై పయనంబు కట్టుట యుక్తము కాదు. మఱియు బుద్ధిమంతుఁడౌరులవలనఁ దనకుఁ బ్రాప్తమగుచున్న సుఖదుఃఖంబులను దైవవశంబులుగాఁ దలంచి నిత్యసంతుష్టుండయి యుండుఁ గాని, దుఃఖములు వచ్చినప్పుడు రిత్తవిచారంబు మనంబునఁ బెట్టుకొనండు. మఱియు సుఖంబు లరుదెంచునప్పుడు పరమానందంబును జెందండు. అట్లుకాక నీవు తల్లినియోగంబును దలయందిడుకొని భగవదనుగ్రహంబు సంపాదింపఁ దలంచితివేని యాభగవంతుని గూర్చి నీకుఁ గొంచెము తెలియపఱిచెదను. పిమ్మట నాభగవదారాధనము కష్టమో సులభమో నీకే తెలియును. నాయనా! లోకేశ్వరుండయిన యీశ్వరుని యనుగ్రహము వడయుట మిగులఁ గష్టము. పెక్కుజన్మంబులనుండి భగవదారాధన మొనర్చుచు, సంతత మతనినే మనఃపద్మంబుల సంస్మరించుచుఁ, దదేకనిష్ఠులై, నిస్సంగులై వర్తించు మునీశ్వరులయిన నాతనిమార్గమును సరిగఁ దెలిసికొనలేక మోహమునుఁ బొందుచున్నారు. అతనియనుగ్రహంబు వడయుట కెన్నియో జన్మములు దారవ్రాయవలసి యుండును. కాని యది యొక్కజన్మముతోనే లభించునది కాదు. ఈవాక్యము లనుభవముఁబట్టి చెప్పుచున్నాను. కాని నోటికివచ్చినట్లు లెల్లఁ బలికినవి కావు. మహానుభావులయిన

మును లే భగవన్మార్గమునుగనుఁగొనలేరని చెప్పవలసియుండఁగాఁ బసిబాలుఁడవయిన నీవెట్లు కనుగొనఁగలవో యోజింపుము. కావున భగవదనుగ్రహము పడయుట దుస్సాధంబు. నీవా ప్రయత్నము వదలుము. నీవు ప్రయత్నించుట వృథాప్రయాసమగును కాని సఫలముకానేరదు. యత్నముచేయనిచో భగవంతునివలన శ్రేయస్సుపొందుట యెట్లని శంకింతువేని చెప్పెద నాలింపుము. శ్రేయస్కాలము సంప్రాప్తమయినప్పుడు నీవు ప్రయత్నింపవచ్చును. కాని యిప్పటికీ ప్రయత్నము విడువుము. మఱియు భగవంతునిచే విహితములయిన సుఖదుఃఖంబు లనుభవించుచు, నిట్లనుభవించుటవలనఁ బుణ్యపాపరూపములయిన కర్మములు క్షయమునుబొందుటచే మోక్షముసంప్రాప్తమగునని యాత్మను సంతసింపఁ జేయుచుఁ బరఁగువాఁడు మాయామండలము నతిక్రమించియున్న వైకుంఠమును బొందుచున్నాఁడు. ఇదియునుంగాక పురుషుండు తనకంటెను గుణాధికుఁడయిన వానినిఁజూచి యసూయచెందక సంతసింపవలయును. తనకంటె గుణహీనులయిన మానవులను బరిహసింపక కరుణింపవలయును. తనతో సముఁడయి యుండువానితో స్పర్థచేయక స్నేహముచేయవలెను. ఇట్లు ప్రవర్తించినవాఁ డాధ్యాత్మికాది తాపత్రయముచేత నెన్నఁడును సంతప్తుండుకాఁడు.'' అని యిట్లుపదేశించుచున్న నారదునిఁగాంచి ధ్రువుం డిట్లనిరెను.''ఓమునీంద్రసత్తమా!నీవు కృపాళుండవు. కావుననే సుఖదుఃఖంబులచేఁ బరిభూతులయి వర్తించు మావంటివారికి మనశ్శాంతి కలుగున ట్లుపదేశించితివి. అట్టిశాంతి మాయంతట మేము గ్రహింపలేము. సరియేకదా? మీవంటి మహాత్ములు దెలియఁబఱుచుచున్నను దెలిసికొనునంతబుద్ధి లేని

వారము. నీవు మహాత్ముండవును, సర్వసముఁడవును కనుక వచ్చి మావంటివారిని జూపులచేఁబవిత్రులఁగాఁ జేసి యుపదేశింపఁబూనుకొంటివి కాని మఱియొక్కరుం డట్లుచేయునా? చేయఁడు.మఱియు వాఁడు పరులు దుఃఖించుచుండ మనకేమని యుపేక్షించుచుండును. మహానుభావుండ వగు నీయుపదేశించిన యుపదేశమునకు మిగుల సంతసించితిని. కాని నీయుపదేశము మాపినతల్లియగు సురుచి దుర్వాక్యంబులనెడి శరపరంపరచే వినిర్భిన్నంబై గాయపడియున్న నామానసంబును బ్రవేశింపఁజాలకున్నది. నీవుచెప్పిన ప్రకారము కొందఱుమహాత్ములు పరులు తమ్మును దూలనాడినను "దైవవశంబువలన నిట్లు సమకూడినది" యనితలంచి యూరకుండఁగలరు. వారలను నేను జూచియున్నాను. కాని నేను భయంకరమయిన క్షాత్త్రధర్మము నవలంబించియున్నాఁడను. అందువలన నే యవినీతుండనయి వర్తించుచుందును. ఇట్టినాయందుఁ బ్రవేశించిన భవదుపదేశంబు సఫలంబు కాకున్నది. మఱియు భవదుక్తప్రకారము తక్కినవారలు పరుల నిందావాక్యములను సహించిన సహింతురు గాని క్షత్త్రియులుమాత్రము సహింప నొల్లరు. నేనును క్షత్త్రియవంశసంభవుండ నగుటంబట్టి మాపినతల్లి వాక్యంబులకు సహింపలేకున్నాను ఇప్పుడు నేను ముల్లోకములయందు నుత్తమమైయుండు పదంబును గోరుచున్నాను. అట్టి మనోరథప్రాప్తికై ప్రయత్నించియున్న నాకు సాధుమార్గం బేదియయిన నుపదేశింపుము. నీవు మునీంద్రులలో నెల్ల నగ్రగణ్యుండవు. పరోపకారశీలుండవు. పరోపకారంబు చేయుటయే వ్రతముగా నేర్పఱిచికొని వర్తించుచున్నావు. సృష్టికర్త యగు బ్రహ్మయూరు

వులనుండి యుద్భవించితివి. ఓసత్తమా? వీణె శ్రుతివేసి సంతతము నారాయణుని పరమపావనచరిత్రంబులఁ బాడుచుఁ బరోపకారపారీణుండ వయి వర్తించు నీకు నావంటివానికోర్కెఁ దీర్చుట యవశ్యకర్తవ్యంబు." అని యిట్లు ధ్రువుండు పలుకుచున్న గంభీరవాక్యములకు నారదుండు మిగుల సంతసించి యతనిని గరుణారసపూరితను లయినచూపులచే సంతసింపఁజేయుచు నిట్లనియె. "కుమారా! నీనిశ్చయంబునకు మిగుల సంతసించితిని. మీతల్లి యగునునీతి యుపదేశించినమార్గము మిగుల యుక్తమయినది. ఆమార్గము నీ వవలంబించినచోఁ దప్పక కార్యసిద్ధి పొందఁగలవు. మఱియు లోకములోఁ బురుషుం డెవ్వఁడేని ధర్మార్థకామమోక్షములలో నొకదాని నపేక్షించినచో నట్టివానికి భగవదారాధనరూపమయి యుపాయముదక్క మఱియొకటి లేదు కావున నీవును ధర్మాదిసాధనభూతమయిన భగవదారాధనను సలుపుము. అట్టి భగవదారాధన సలుపుటకుఁ దగిన ప్రదేశము యమునాతీరమునందున్న మధువనముదక్క మఱియొకటి లేదు. అది సిద్ధాశ్రమభూమి. మిగులఁ బవిత్రమైనది. అట్టిస్థలంబునఁ దపంబాచరించువాఁడు తప్పక భగవంతుని సాక్షాత్కారముఁ జేసికొనఁగలఁడు. అందులకు సందియము లేదు. ఆస్థలమునకుఁబొమ్ము. నీకు శుభంబగుఁగాక. నీవచ్చటికేఁగి నిర్మలములయిన యమునానదీపుణ్యజలంబుల స్నానము గావించి నిత్యకృత్యంబుల నిర్వర్తించికొని కుశసమూహముచే నాసనంబు కల్పించుకొని యందుపవేశించి రేచక పూరక కుంభకము లనెడి ప్రాణాయామత్రయముచేత మనశ్చాంచల్యమును దొలంగించుకొని, భగవంతుని ధ్యానముసేయుము.

నారదుఁడు ధ్రువునకు నారాయణునాకారముఁ జెప్పుట

ఓ నృపకుమారా! ధ్యానింపఁదగిన భగవంతుం డెట్టివాఁడో చెప్పెదను వినుము. ఆభగవంతుఁడు సర్వదా యనుగ్రహాభిముఖుఁడై ప్రసన్నమయిన వదనముకలవాఁడై సుందరమయిన కనుబొమలుకలవాఁడయి యుండు. అతఁడు చక్కనిచెక్కిళ్లుకలవాఁడై, సమస్తబృందారకులలోను మహనీయమయిన సౌందర్యముచే నొప్పుచు భక్తులకాశ్రయభూతుఁడయి యుండు. అతనికి రమణీయము లయిన యవయవములుగలవు. అతనికి నెఱ్ఱనియధరోష్ఠంబును, పద్మపత్రవిశాలములయిన నేత్రములును గలవు. అతఁడు చూచువారిచూపులకు సుఖరూపుఁడయి వర్తించు. అతఁడు సమస్తలోకములకు శరణ్యుండై దయారసంబునకు సముద్రము వంటివాఁడై శ్రీవత్సలాంఛనముచే వెలయుచునుండు. అతఁడు నల్లనిమేఘమువలె వెలయుతనుద్యుతులచేతను వనమాలచేతను నలరుచుండు. అతఁడు కౌస్తుభము మొదలగు నాభరణంబులచే నలంకృతమగు మెడగలిగి శంఖచక్రగదాదులచే భూషితమయిన బాహుచతుష్కముకలవాఁడై యుండు. అతనికిఁ జంద్రసంకాశమయిన కిరీటముకలదు. అతఁడు పీతకౌశేయముచేఁ బరివేష్టింపఁబడి యుదంచితములయిన కాంచననూపురములుకలిగి నేత్రములకానందదాయకమయిన యంగసౌష్ఠవము కలిగియుండు. అతనికి వజ్రమణులవలె నలరుచున్న నఖపంక్తిచే సుందరమయిన పాదారవిందములు కలవు. మఱియు నతఁడు భక్తులహృదయకమలములందు నివసించుచుఁ బ్రేమాతిశయమును వెలువరించుచూపులు కలిగి వర్తించు. అట్టిభగవంతునిరూపము నేకాగ్రమయిన మనంబుతో ధ్యానము సేయవలయును. అట్లు కొంతకాల

ము ధ్యానించినచో నతనినిరతిశయసౌందర్యమును జూచుచుఁ బరమసుఖమునందుచున్న మం౦ం శాంతినిరూపమునుండి మరిగిడి రాలేదు. ఇట్లు నీ వానరించుచు నారాయణమంత్రమును జపింప

——◆ నారదుఁడుధ్రువునకు నారాయణమంత్రమును జెప్పుట ◆——

వలయును. ఆమంత్రము నిరతిశయ మైనది.రహస్యముగానుంపఁ దగినది. అది "ఓంన్నమోభగవతే వాసుదేవాయ"యని ద్వాదశాక్షరసంయుత మయినది. ఈమంత్రమును జపించుచు, దేశకాలవిభాగములను దెలిసి ద్రవ్యప్రచురమయినపూజను భగవంతునికిఁ జేయుచుండునది. ఈమంత్రమును నేడురాత్రులు భక్తిసంయుతుఁడై జపించినచో దేవతాసందర్శనమునుఁ జేయఁగలఁడు. ఆభగవంతునిపూజకై పవిత్రమైన జలమును, పుష్పమాలికలను, కందమూలఫలాదులను, భుజపత్రవృక్షములచర్మములను, దూర్వాంకురంబులను, భగవంతునికిఁ బ్రీతిదాయకములయిన తులసీదళములను, సంపాదింపవలయును.ఇట్లు ద్రవ్యములను సంపాదించి శంఖచక్రాదిమండలములచే నలంకృతమయినభూమియందు వాసుదేవునిఁ బూజింపవలయును. ఇట్లుచేసి పురుషుఁడు జితేంద్రియుఁడై,మితభాషియై,ధ్యానోపయుక్తమయిన మనస్సుగలవాఁడై,స్వేచ్ఛాయుత్తమైన యవతారములను ధరించుటచే దేవమనుష్యాదులతో సజాతీయునిఁగాఁ జింతింపఁబడనుపడని భగవంతునిహృదయాపద్మమందు జేర్చి,ధ్యానంబుచేయుచు వాసుదేవ మంత్రంబుచేత నేభగవత్పరిచర్యలను జేయువలయును. ఓరాజకుమారా!ఇట్లు మనోవాక్కాయముల నేకముగాఁ జేసి నిరతిశయభక్తిసంపన్నుండై భగవంతునియారాధనంబునల్పినచోభగవంతుండు తప్పక భక్తుని యభిలషితంబును నెఱవేర్పక మానఁ

డు. మఱియు విరక్తుండయిన మానవుఁ డీచెప్పిన ప్రకారము భక్తియోగముచే నారాయణుని నారాధించినచోఁ దప్పక మోక్షము నందఁగలఁడు" అనియిట్లు నారదుఁ డుపదేశింప ధ్రువుండు మిగుల సంతసించి తనకార్యమును సాధించుకొనుటకుఁ బుణ్యమగు మధువనమున కభిముఖుండయి పోయెను. అనంతరము నార

నారదుఁ డుత్తానపాదునిఁ జూడఁబోవుట.

దుం డుత్తానపాదుని యంతఃపురంబునకుఁ బోయి యతనిచే నర్చితుం డై సుఖాసీనుం డై రాజున కిట్లనియె. "ఓమహీపాలకా! నీవు సవిచారస్వాంతుఁడవయినట్లు తోఁచుచున్నది. కారణమేమి? ధర్మాదులయిన పురుషార్థములలో నేదయిన నశించినదా ఏమి?" యని యడుగుచున్న నారదునకు నరనాయకుం డిట్లనియె "ఓ మునీంద్రా! స్త్రీజితుండ నై దుష్టవృత్తి నై, కఠినచిత్తుండ నై వర్తించు నేను బంచవర్షప్రాయుండయిన నాకుమారుని జననితోఁ గూడ నింటనుండి వెడలఁగొట్టితి. అక్కటా! స్త్రీజితుండనయిన నాజన్మంబు కాల్పనా? అయ్యో! ఎట్టిదుష్కార్యంబు చేసియుంటిని. ఎంతకఠినహృదయుండ నైతిని! ప్రేమాతిశయమును వెల్లడి చేయుచుఁ దండ్రి నగు నాయంకపీఠి నారోహింపఁ దలంపుతో వచ్చుచున్న పిల్లవానిఁ జేరఁదీయక వద్దనివారించితిని. అక్కటా! నావంటిదుర్మార్గుఁడు లోకమందు మఱియొకరుఁ డుండునా? ఆ పిల్లవాఁడు మందిరము విడిచి యడవికిఁ బోయినాఁడఁట! వనమందు శ్రమనొంది యాఁకలిఁగొని యసహాయుఁడై వాఁడినముఖారవిందముగల్గియున్న యాబాలు నేమృగములు చంపి భక్షించునోకదా"! అనియిట్లు విచారించుచున్న రాజుంజూచి నారదుం డిట్లనియె. మానవనాథా! నీవు విచారింపఁబనిలేదు. నీకుమారున కెంత

మాత్రము భయములేదు. అతఁడు దైవముచే రక్షింపఁబడు చున్నాఁడు. మఱియు నిఁకమీఁద నబ్బాలుండు లోకంబులోఁ గీర్తిమంతుండై ప్రకాశింపఁగలఁడు. అతఁడు మిగుల దుష్కరమయినను భగవదారాధనముసలిపి యతనిసంతసింపఁజేసి యతనివలన వరములనుబడసి నీకీర్తిని బ్రపంచకమందుఁ బ్రకాశింపఁజేయుచు శీఘ్రకాలములోనే రాఁగలఁడు. విచారమునొందకుము?” అనియిట్లు నారదుఁడు పల్కి యతని వీడ్కొని సురలోకంబున కేఁగె. అంత నుత్తానపాదుండు దాఁజేసినకార్యంబునకు మనంబున మిగుల వగచుచు రాజ్యలక్ష్మిని నిరాకరించి ధ్రువునిపయిఁ దనచిత్తంబిడి సంతత మతనినే ధ్యానించుచుండెను. అట్లు ధ్రువుండు

ధ్రువుండు మధువనంబునఁ దపం బొనరించుట.

మధువనంబునకుఁబోయి యమునయందుఁ దానములాచరించి యారాత్రి యుపవసించి సమాహితచిత్తుండై నారదోపదిష్టమార్గంబునఁ బరమపురుషు నారాధింప నారంభించెను. మూఁడేసిదినంబులకొకపర్యాయము వెలఁగపండ్లను, రేఁగుపండ్లను, నాహారముగాఁ గావించుకొని, శరీరస్థితి ననుసరించి వర్తించుచు నొక్కమాసంబు హరిపూజనంబు గావించెను. అంతనుండి యాఱేసిదినంబులకొకపర్యాయము జీర్ణపర్ణంబుల నాహారంబుగాఁగొనుచు, హరిపూజఁగావించుచు రెండవమాసంబునుగడపె. అనంతరము ధ్రువుండునిశ్చలుండై నవరాత్రంబుల కొకపర్యాయ ముదకభక్షణముగావించుచు, మూఁడవమాసమున హరి నారాధించె. అప్పటినుండి ద్వాదశదినంబులకొకపర్యాయము వాయువునుమాత్రమే భక్షించుచు జితశ్వాసుండై నాలవమాసంబున నరవిందాక్షుని పాదపద్మముల నర్చించి భజించెను. అంతనుండి యలయక నిరు

చ్ఛ్వాసుండై యేకపదంబున నిలువఁబడి స్తంభాకృతిని వహించి, నైదవమాసంబున హరి నారాధించి సేవించుచు విషయముల నుండి యింద్రియములను మఱలించి మనంబును హృదయపద్మంబున నిర్బంధించి భగవంతుని దివ్యమంగళవిగ్రహము నారాధించుచు, గోచర ప్రపంచమును మఱచియుండె. ఇట్లు నిశ్చలమానసుండై మహత్తత్త్వము మొదలు పృథివి వఱకుఁగల భూతములకును నవి సృజించిన చేతనములకును ధారకుఁడును, బ్రకృతికిని జీవులకీశ్వరుండు నగు భగవంతుని ధ్యానము సేయుచున్న ధ్రువుని తేజఃపుంజమును సహింపలేక యూర్ధ్వలోకము లన్నియుఁ జలింపదొడంగెను. ఆతని పాదాంగుష్ఠము నేలమోపియున్న కారణంబున భూమి సహింపలేక క్రిందికిఁ గ్రుంగిపోయి గజేంద్రముచే నధిష్ఠింపఁబడిన నౌకవలెఁ గుడియెడమ పార్శ్వంబుల కొక్కొక్క పర్యాయము వంగఁజొచ్చెను. మఱియు నా ధ్రువుండు చరాచర విశ్వమం దున్న నారాయణుని ధ్యానించుచున్న సమయంబుల నూర్ధ్వలోకములవారు తపోగ్నిసంతాపమును సహింపలేక యుచ్ఛ్వాసవాయువును విడువఁజాలక పీడితులై నారాయణుని సన్నిధికిఁ బోయి నమస్కరించి "ఓ నారాయణా! అనాథులమైన మమ్మును రక్షింపుము. నీకంటె మాకు దిక్కు లేదు. మా ప్రాణవాయువులు నిరోధింపఁబడుచున్నవి. ఇందులకుఁ గారణమేమో తెలియఁజాలము. మాయందు దయయుంచి యీ బాధనుండి మమ్మును దొలఁగించి రక్షింపుము. శరణ్యుఁడవని యెంచి నీసన్నిధికి నరుదెంచినారము. మారక్షణభారము నీదే" యని వేఁడుచున్న దేవతలయందుఁ గరుణించి నారాయణుం డిట్లనియె. "ఓ సురలారా! మీ రెంతమాత్రము భయపడకుఁడు. ధ్రువుండను నొక

బాలకుండు నన్నుంగూర్చి ఘోరంబుగఁ దపం బాచరించుచున్నాఁడు. నేనుబోయి యాతని కిష్టవరంబులిచ్చి తపంబు మాన్పించెదను. కావున మీరు మీనిలయముల కేఁగుఁడు. అతఁడు ప్రాణనిరోధము చేయుటవలన మీకందఱికిఁ బ్రాణనిరోధము కలిగినది. సమస్తమునకును నిశ్వాసోచ్ఛ్వాసములనిచ్చు నే నతనిహృదయమున బంధింపంబడియుంట మీకెల్ల ప్రాణనిరోధము కలుగక మానును" అని పలికిన దేవతలందఱు నారాయణునికి నమస్కరించి తమతమ నెలవులకేఁగిరి. ఇది యెనిమిదవయధ్యాయము.

నారాయణుండు ధ్రువునకు సాక్షాత్కరించుట

అంత నారాయణుండు తనభక్తునిఁజూడవలయునని నిశ్చయించి గరుడు నధివసించి మధువనంబునకుఁ బోయెను. అట ధ్రువుండు నిశ్చలభక్తియుతుండై యోగవిపాకముచేఁ దీవ్రమయిన బుద్ధికలవాఁడై, తనహృదయమను పద్మమందొక్కమాఱు మెఱుపుఁదీవచందంబున మెఱసి తత్క్షణమె యంతర్ధానము చెందిబహిర్భాగంబున నిలిచియున్న నారాయణునిఁ జూచి భయభక్తులు చెలంగ సరభసంబున లేచి నేత్రముల జూచుచున్న వాఁడుంబోలెను, నాస్యముచే ముద్దుగొనుచున్న వాఁడుంబోలెను, బాహువులచేఁ గౌఁగిలించుకొనువాఁడుంబోలెను; నతనికి సాష్టాంగదండప్రణామంబులు గావించి, భగవంతుని నుతించుటకుఁ దలంచుచుండెను; కాని నుతించుట యెట్లో తెలియక పోవుటచే వెలవెలఁబోవుచుండెను. అప్పుడు సర్వాంతర్యామియయినభగవంతుండుధ్రువుని ప్రవర్తన మరసి దయాళువై వేదమయంబై నతనశంఖంబును న

తన కపోలంబునఁ దాఁకించెను. అంత ధ్రువునకు జీవేశ్వరనిర్ణయవి
భాగము, వేదార్థప్రచురములయిన వాక్యంబులు నుద్భూతంబుల
య్యె. అందువలన నబ్బాలకుండు సంతసించి భక్తిసంయుతుండై సర

ధ్రువుఁడు నారాయణుని వినుతించుట.

భసత్వంబును విడిచి హద్దులేని కీర్తిగల భగవంతు నిట్లు నుతింప
నారంభించె "దేవా! నీ వఖండశక్తిమంతుండవు. నీదివ్యమంగళ
విగ్రహమును నుతింపఁబూనియు నుతింపలేక యున్న నావాగిం
ద్రియమును నీసంకల్పరూపజ్ఞానము చేఁ బ్రవేశించి నిన్ను నుతిం
పఁదగినంత శక్తిగలుగునట్లు చేసినావు. అఘటితము లగువానిని
ఘటింప సామర్థ్యముగల నీ కిది యెంతయుఁ దగియున్నది. మఱి
యు స్వశరీరభూతములయిన హస్తచరణాదులగు కర్మేంద్రియము
లను, శ్రవణాదులగు జ్ఞానేంద్రియములను, నంతఃకరణచతుష్టయ
మును, తదధిష్ఠాన దేవతలను బ్రవేశించి జీవముకలదానినిగాఁ జే
యుచున్నావు. ఇట్లు జీవాంతరాత్మవై జ్ఞానాదిషడ్గుణములు గలి
గి వర్తించు నీకు నమస్కారము. కానవచ్చుచున్న సమస్త జగం
బును వివిధరూపములుగా మార్చుటకు సమర్థమయి, సత్త్వాది
గుణరూపమై, సమస్తకార్యముల నొనరింప నుపయోగపడునదై
నిన్ను విడిచి యుండలేని ప్రకృతిచేత సృజించి, కార్యకారణభూత
ములై సత్త్వాదిగుణమయములై యున్న పదార్థములందు జీవశ
రీరకుఁడవయి ప్రవేశించి వాస్తవముగా నీవొకఁడవైనను, పొట్టివి
యును బొడుగయినవియుఁ, దిన్ననివియు, వంకరయయినవియు
నగు కట్టెలందు *వహ్ని యుపాధినిబట్టి నానారూపములఁ గా

---

*ఇట వహ్నిదృష్టాంతము వలన, వహ్ని | పొట్టివియును, దీర్ఘములును దిన్న
నివియు, వంకరయయినవియునగు దారువులందు వెలుఁగుచున్నప్పుడా యగ్నికి,

నవచ్చునట్లు నానా విధములుగాఁ బ్రకాశించుచున్నావు. ఓ దేవా! చతుర్ముఖుండు మొదట విశ్వమును సృజింపఁదగిన జ్ఞానములేనివాఁడయి నిన్ను శరణుచెంది నీవలనఁ దాదృశజ్ఞానమును సంపాదించుకొని నిద్రించినవాఁడు మేల్కొన్న చందంబునఁ బ్రబుద్ధుండయి సమస్తప్రపంచమును సృజించెను. బ్రహ్మకు నట్టి జ్ఞానమిచ్చిన మహానుభావుండవు నీవే? అట్టి నీపాదమూలము, తాపత్రయముచే బాధితులగువారికి మోక్షప్రద మయినది. ఓ పరమేశ్వరా! నీవు సమస్తమును బ్రాణవంతముగాఁ జేసి జ్ఞానమొసంగు మహోపకారివి. ఆయుపకారమును దెలిసికొన్నవాఁడెవఁడు నిన్ను సేవింపఁడు? ఆనీయుపకారము నెవఁడు మఱవఁగలండు? ఓ దేవా! నీవు కల్పవృక్షంబువలె నాశ్రితుల యిష్టముల నెఱవేర్చువాఁడవు. ఇంతియగాక నీవు జననమరణాదుల లేకుండఁ జేసి నిరతిశయమగు మోక్షము నీయ సమర్థుండవు. అట్లు మోక్షము నీయ సమర్థుండగు నిన్ను సేవించి నీయనుగ్రహము సంపాదించుకొనియు మేము మోక్షసుఖమునుగోర నపేక్షింపక నరకప్రాయమయినను సంసారమం దుండఁదలంచుచు, శవప్రాయమగు శరీర మనుభవింపఁతగిన సుఖములను గోరుకొనుచున్నాము. ఆలోచింప మేము దాఁటఁదరముకాని నీమాయవలన మోహితులమై జ్ఞానహీనులమయి యున్నామనుట నిక్కము కదా; ఓయీా! స్వర్గముగూడ సుఖము లొసఁగూర్చుచుండ దానిని, దాని నపేక్షించువారిని, నిందించి మోక్షమును దానిఁ గో

దారుగతములగు పొట్టితనముగాని పొడవరితనముగాని తిన్నఁదనముగాని వంకరతనముగాని లేనివిధమునఁ జిదచిత్తులయందుఁ బ్రకాశించుచున్న పరమాత్మకుఁ దదీయములయిన దోషములు పొరయవని తెలియవచ్చుచున్నది.

రుచున్న నిష్కాములను నేల కొనియాడెదవనియడుగుట యుక్తముకాదు. నీపాదకమలములను ధ్యానించుటవలనఁగాని నీభక్తుల కథలను వినుటవలనగాని మానవులకు సంప్రాప్తమగు సుఖము స్వభావసిద్ధమయి యష్టగుణరూపమయియున్న మోక్షసుఖమనుభవించినను గలుగఁజాలదు. నీపాదముల స్మరించువారికిఁ గలుగు సుఖము మోక్షసుఖమనుభవించువారికే కలుగునప్పుడు కర్మానుభవానంతరమున, యమునిచే భగ్నములగు విమానములనుండి జారిపడుచున్న దేవతలకు లభించునా? లభింపనేరదు. నీపాదభజనసుఖమునకుఁ గైవల్యమే సమానముగానప్పుడు తక్కిన సుఖములెట్లు సరిపడును? కావున నిరతిశయమగు నానందసుఖంబులనిచ్చు నిన్ను నశ్వరసుఖముల నపేక్షించిన మేము మందభాగ్యులమనుటకు సందియము లేదు. అయినను మహాత్ములసంగమువలన నీగుణకథామృతమును ద్రావి మదించి తాపత్రయమును దొలఁగించుకొని దుఃఖబహుళమయి దుస్సహమయియున్న సంసారసాగరమును దరింపఁగలను. కావున దుష్టగుణరహితుడవయి యుదారగుణములు గలిగిన నీయందు నిరంతరమును భక్తిని జూపుచున్న మహాత్ముల స్నేహము నాకుఁ గలుగునట్టు లనుగ్రహింపుము. ఓపద్మనాభా! నీపాదారవిందములందున్న సుగంధము నాఘ్రాణించిన భక్తులలో నొకఁడయినను మరణశీలమయినను మిగులఁ బ్రియముగాఁ గానవచ్చు శరీరమును దన్ను ననువర్తించు పుత్త్రాదులను స్మరింపఁదలంచునా? ఓ దేవా! నీవు స్థూలరూపముకంటెను సూక్ష్మరూపముకంటెను విలక్షణుండవు. కావున నే స్థూలరూపమును బురస్కరించుకొనివచ్చు జననమరణములు లేనివాఁడవు. స్థావరములచేతను, పశువులు, పక్షులు, అండజము

లు, దేవతలు, మనుష్యులు మొదలగుచరములచేతను, నంతటను
వ్యాప్తమయి, చిదచిదాత్మకమయి మహత్తత్త్వము మొదలు
పృథివివఱకు ననేకవిధములయి విచిత్రము లయిన యాకారము
లు కలదై బ్రహ్మాండరూపమగు నీస్థూలరూపము నెఱుఁగుదును.
స్థూలరూపమునకంటెఁ బరమయి దివ్యమంగళ విగ్రహరూపము
ను, దేనివిషయమై, దేవమనుష్యాదులలో సమమయిన దనువా
దముకాని, నిర్విశేష మనువాదముగాని చెల్లదో యా నీసూక్ష్మ
రూపమునుగూడ నెఱుంగుదును. మఱియుఁ గల్పాంతమందుఁ జి
దచిదాత్మకమగు ప్రపంచమును నీజఠరమందుంచికొని స్వానుభ
వైకశీలుండవయి శేషసహాయుఁడవయి యా శేషతల్పమందు యో
గనిద్ర ననలంబించియుండి సముద్రమునంటి నీనాభికుహరము
నుండి వెలువడి కాంచనమయమై,లోకాత్మకమైయున్న పద్మము
నందు లోకములసృజింపఁదగిన బ్రహ్మను బుట్టించితివి.ఇట్టి యనం
తశక్తివగు నీకువందనంబులర్పించుచున్నాను.ఓయీ!జీవునికివలె
స్థూలసూక్ష్మశరీరములు గలవాఁడనైనచో నాకును వానికినిఁ
గల భేదమేమియని యందువేని చెప్పెద. నవధరింపుము.

జీవేశ్వర భేదనిరూపణము.

దేవా! నీవు కర్మాధీనుండవుకాక స్వేచ్ఛచేతనే దివ్యమంగళగు
ణములుగల రూపములు జగత్పాలనము నిమిత్తము ధరింతువు.
జీవుఁడట్లుకాక కర్మవశ్యుఁడయి కర్మాయత్తము లగుశరీరముల
ను దాల్చుచుండును. యజ్ఞారాధ్యుఁడవగు నీవు ప్రకృతిపురుషు
లకంటె వ్యతిరిక్తుఁడవు. జీవుఁడు ప్రకృతివిలక్షణుఁ డయినను దా
నికి లోఁబడియుండును. నీవు సంకోచమునొందని సంకల్పరూ
పజ్ఞానముచే సర్వదేశములందును సర్వకాలములందును స

ర్వావస్థలయందును లోకంబుల కనిష్టనిరసనంబును, నిష్ట ప్రాప్తిని గలిగించుచుందువు. నీవు నిత్యముక్తుఁడవు. జీవుఁడు నిత్యముక్తుఁడు కాఁడు. నీ వసంకుచితజ్ఞానవంతుండవు. జీవుఁడు కర్మాయత్తుం డగుటం జేసి సంకోచవికాసయోగ్యమయియున్న జ్ఞానముకలవాఁడు. నీవు స్వభావంబువలననే నిర్వికారుండవు. జీవుఁడు స్వభావగుణంబువలననే వికారియై వర్తించును. ఇందువలన నీకును జీవునకును భేదము గలిగియున్నది. వెనుక వర్ణించిన ముక్తత్వాది గుణంబులు ముక్తునికిఁ గలిగియున్నను నీకును ముక్తునికిని భేదము లేదు. నిత్యముక్తుండవయిన నీవు ముక్తులందంతరాత్మవై ప్రకాశించి ధారకుండవయియున్నావు. జగత్కారణమవు. ముక్తులట్టివారలు కారు. మఱియు నీవు సత్త్వరజస్తమోగుణ పరిణామములయిన లోకంబుల కధిపతివి. షడ్గుణపరిపూర్తుండవు. దేవా! వివిధశక్తియుక్తంబులయిన జ్ఞానాదులోకవ్యాపారప్రవర్తకుండవయియును బాహ్యాభ్యంతరంబునం జేసి నీయందే లీనము లగుచుండును, మఱియు నీవు దేశముచేతను, గాలముచేతను, వస్తువులచేతను, బరిచ్ఛేద్యుండవు కావు. నీవు విశ్వోత్పత్తికారణుండవు. ఆనందస్వరూపుఁడవు అట్టి పరబ్రహ్మస్వరూపుఁడవయిన నీపాదపద్మముల కభివందనంబులు గావింతు. నీపాదంబులనే శరణుఁబొందుచున్నాను. ఓదేవా! సర్వపురుషార్థప్రదుండవయిన నీవు నిష్కాములము కాక సకాములమై తుచ్ఛఫలంబుల నాసించి నిన్నుఁగొల్చునట్టి మావంటిదీనులను బ్రేమించి నవప్రసూతయగు గోవు తనవత్సను స్తన్యపానంబునొసంగి కాపాడుచు వృకాదిభయంబులను దొలఁగించి రక్షించుచు నున్నవిధంబున మాయపేక్షించిన కోర్కులదీర్చి సంసారభయమువలన

రక్షించుచుందువు" అని సత్యసంకల్పుఁడయిన ధ్రువుం డిట్లు భగవంతుని నుతించి యతనిపదకమలంబుల స్మరించుచు మిన్న కుండఁజూచి దాసులం దనుగ్రహముగల నారాయణుండు ధ్రువునిఁ గరుణావలోకనంబులచేఁ జూచుచు నాతనిస్తోత్రంబునకు మిగుల నానందించి యిట్లు పలికెను. ఓబాలకా! నీభక్తికి మిగుల సంతసించితిని. నీవెందులకై తపం బాచరించితివో యా నీయభిమతంబు నాకవగతమయినది. ఆనీమనోరథము దుష్ప్రాపమయినను నీయందున్న ప్రేమాతిశయముంబట్టి నీకొసంగుచున్నాను. నీకు శుభమగుఁగాక. కట్టుస్తంభంబుచుట్టును గోమహిష్యాదులు పరిభ్రమించుచున్నట్లు ధర్ముఁడు నగ్ని మొదలగువారును, సప్తర్షులును నక్షత్రరూపులయి నాపదమునకుఁ జుట్టును దిరుగుచుందురు. అట్టి దీప్తిమంతమయిన మఱియొక పదంబు లోకంబుల లేదు. అది యితరులకు దుష్ప్రాపంబు. అది లోకత్రయము నశించినను నశింపదు దానిని నీవు నిరువదియాఱువేలవత్సరంబు లతిక్రాంతము లయినతరువాత సంప్రాప్తంబగు. అంత దనుక భూమియందుండి పితృర్పితమయిన రాజ్యంబును పరిపాలించుచుండుము. నీతండ్రియగు నుత్తానపాదుం డిప్పుడు రాజ్యభారంబు సహింపనోపక నీకొసంగి వానప్రస్థుండై చను. నీసోదరుఁడగు నుత్తముండు మృగయావిహారార్థం బడవికేఁగి సర్పదష్టుండై కాలధర్మంబు నొందు. నీపినతల్లియగు సురుచియుఁ గుమారుని వెనుక నరణ్యంబునకుఁబోయి యచ్చట దావాగ్నిచేఁ జుట్టఁబడి ప్రాణముల గోలుపోవును. అందువలన నీవు నిష్కంటకంబుగా రాజ్యంబు పరిపాలించుచు ధర్మమార్గంబులఁ బ్రజలనడిపించుచుఁ బుష్కల దక్షిణలనొసంగి పౌండరీకాది యాగంబు

లచే నన్నుఁ దృప్తిపొందించి యీలోకమందు సమస్తసౌఖ్య
ముల ననుభవించి పిమ్మట నాపాదపద్మంబులను సంస్మరించుచు
సప్తమహర్షి మండలముకంటె నూర్ధ్వభాగమం దున్నదియు స
మస్తలోకములచే నమస్కరింపఁబడుచున్నదియు, మదనుగ్రహ
ములవలనఁ బొందఁబడినదియునగు నుత్తమస్థానమును బొందుము.
దానినుండి మగుడఁ బుట్టుకకు రావు" అనియిట్లుపలికి నారాయ
ణుండు ధ్రువునకు వలసిన కోర్కెనొసంగి యతఁడు చూచుచుండఁ
గనే, గరుడవాహనారూఢుండై వైకుంఠమున కేఁగెను. అంతధ్రు
వుండును భగవదనుగ్రహమువలనఁ బరులకు దుష్ప్రాపంబయి
యున్న యుత్తమపదంబునొందియు స్వాభావికానందము కలిగిం
పనిదనెడి కారణమున మిగుల సంతుష్టిజెందక తనపురంబునకుఁ
బోయెను" అనియిట్లుచెప్పిన మైత్రేయుంజూచి విదురుండిట్లనియె.
"ఓమునీంద్రా! ధ్రువుండు సకలయోగీశ్వరులకు దర్శనీయుండయి
న నారాయణునారాధించి సాక్షాత్కరింపఁజేసికొని పరులకెవ్వరి
కిఁ బొందనలవికాని పదంబును బొందియు సంతసింపక తన్ను నకృ
తకృత్యునిగాఁ దలంచుటకుఁ గారణమేమి?" అనియడిగిన విదురు
నకు మైత్రేయుం డిట్లనియె. "కౌరవ్యా! ఆధ్రువుఁడు తనమనం
బును విచారంబునకు లోనగునట్లుగాఁ జేయుటకుఁ గారణంబుం
దెలిపెద వినుము. ధ్రువుండు తనపినతల్లిపల్కిన ప్రల్లదంబుల కు
ల్లంబునసైఁపలేక ముక్తిప్రదుఁడయిన భగవంతుని ప్రత్యక్షము
కావించుకొనినను ముక్తినపేక్షింపక సాధారణపదమున భిలషించె
ను. అందువలన నాతఁడిట్లు తనమనంబున విచారింపఁదొడంగెను.
అయ్యో! నేనెంత తెల్విలేనిపనిచేసితిని. జితేంద్రియులైన సనం
దాదులయిన ననేకజన్మంబులచే నభ్యసించిన సమాధియోగము

చే భగవంతుని సాక్షాత్కరింపఁ జేసికొనిరి. కాని నేను సమాధి
యోగముచే నాఱుమాసముల కాలములోనే భగవంతుని సాక్షా
త్కరింపఁ జేసికొని యతని దివ్యమంగళవిగ్రహమును గాంచి స్తో
త్రాదులచే నాతని సంతసింపఁ జేసి యతని పాదమూలంబు చెంత
కొంతవడి వసించియు దేహాభిమానంబు గలవాఁడనై భగవంతు
ని పాదమూలంబులకు దూరీకృతుండనైతిని. అకట! నాచేసికొన్న
దుష్కార్యంబునకు నేనెంతయు విలపింపవలసియున్నది. దురదృష్ట
వంతుఁడు చేతికిదొరకిన పెన్నిధినైనఁ బాఱవైచుకొనును గాని
తత్ఫలము ననుభవింపలేఁడు. ఆచందంబుననే నేనుం బెన్నిధి
వంటివాఁడును ముక్తిప్రదుఁడు నగు నారాయణుని బ్రసన్నునిఁ
గావించుకొనియు నతనివలనఁ బరమానంద దాయకములయిన
నిత్యసుఖముల నపేక్షింపక యనిత్యసుఖములను కోరుకొనియు
న్నాను. అమృతమునువిడిచి హాలాహలమును గోరుకొన్న నా
వంటి తెల్వితక్కువవాఁ డుండునా? అకటా! మహాత్ముండైన
నారదుండు "మానావమానవివేకము మోహమునఁబడఁద్రోచి
దేహాత్మభ్రమమూలకంబయి యసంతోషహేతువగు" నని
చెప్పియున్నాఁడు. ఆతనివాక్యంబు తథ్యం బాయె. నాకట్టిమానా
వమానవివేకమె లేనిచో నాకింత దేహాభిమానంబు గలుగునా?
గలుగదు. దేహాభిమానంబు లేనిచో నేను బరమపదంబునకే
ప్రయత్నింతునుగాని యిట్టి తుచ్ఛపదంబును గోరికొందునా?
ఇంతకుఁ దాఁ జేసినకర్మంబుల ననుభవింపక తీఱునా? నేను దుర్జ
నుండనై నారదునివాక్యంబుల సరకుగొనక దురత్యయమయిన
భగవన్మాయను సమాశ్రయించి దేహాభిమానము కలవాఁడనై
యబ్రహ్మాత్మకమయిన మఱియొకవస్తువు లేకపోయినను మాపిన

తల్లియు నామెకుమారుఁడును శత్రువులనెడి భేదబుద్ధిగలవాఁడనయి యీ భేదమనెడిమహారోగంబుపాలయి దురంతమయిన తాపంబు ననుభవించుచున్నాను. నాతపంబు వ్యర్థమయినది. నాపడసినయభిమతంబు నీచమయినది. మఱియు ముక్తీశ్వరుఁడయిన భగవంతుని యనుగ్రహంబును సంపాదించి యతనివలన దేహాభిమానమును యాచించుకొంటిని. నావృత్తాంతంబంతయుఁ జక్కఁగ యోజింపఁ జక్రవర్తియనుగ్రహంబును సంపాదించి యతండడిగినవరంబు లిచ్చెదనని పలికినప్పుడు చేరెఁడు నూకల నిప్పింపుఁడని కోరికొనుబుద్ధిహీనుని వర్తనమును బోలుచున్నది. లోకములో మహానుభావులు భగవంతుని పాదారవిందములందలి పరాగమును వహించి సంతత మతని నే సేవింపఁ దలంపు గలవారయి యతనిదాస్యముదక్క మఱియొకవస్తువును గోరికొనరు. అట్లు కోరుచున్నవారలు బుద్ధిహీనులా? వారలవృత్తాంతములను జక్కఁగ సరసి భగవత్పాదారవిందసేవను గోరికొనిన నెంత బాగుగ నుండునని విచారించె" నని చెప్పి వెండియు నిట్లనియె.

అట్లు ధ్రువుండు తనపురంబున కభిముఖుండై వచ్చుచుండఁ గొందఱుపురజనులు పర్వెడిపోయి రాజును సమీపించి 'దేవా! మీకుమారుండగు ధ్రువుం డరుదెంచుచున్నాఁడని చెప్పిరి.' కాని యాయుత్తానపాదుఁడు "ఆ! ఏమీ! యిది! నాకుమారుఁడు వచ్చుచున్నాఁడా? ఇది యసత్యము. నాకుమారుఁడెక్కడ? వచ్చుటయెక్కడ! నాకుమారుఁడెక్కడనో వనమందు మృగంబులచేఁ జంపఁబడియుండును. జచ్చినవాఁడు బ్రదికివచ్చుటయెట్టిదో నాకుమారుం డరుదెంచుటయట్టిది. అయిన మంగళగుణుండైన నాకుమారునిఁ జూచునంతటి యదృష్టముకలదా?" అని యిట్లు

పలుకుచు ధ్రువునిరాక యసత్యముని తలంచుచుండెను. అంతటఁ

ఉత్తానపాదుఁడు పురంబునకు వచ్చుధ్రువు నెదుర్కొనుట.

జారులువచ్చి ధ్రువునిరాక సత్యమని నమ్మఁబలికినవిని పూర్వము నారదుం డాడినపల్కులు స్మరించుకొని సత్యంబని నిశ్చయించి యమితానందభరితాంతరంగుఁడయి యట్టివార్తలనుఁ గొనివచ్చినవారి కమితమగు ధనంబును గానుకగా నొసంగి యుత్తుంగహయములతో నలరుచున్నదియుఁ గాంచనమయమైనదియునగు రథంబు నారోహించి బ్రాహ్మణులతోను, కులవృద్ధులతోను, మిత్రబాంధవామాత్యులతోను, గూడికొని మంగళవాద్యఘోషలు చెలంగఁ బురంబునుండి బయలు వెడలి కుమారునిఁజూడవేడుకచే నతివేగముగా నెదుర్కొనఁ జనియెను ఆసమయమున సురుచియు, సునీతియుఁ గాంచనమయములయిన పల్లకీలలోఁ గూర్చుండి. రాజు ననుసరించిరి. ఇట్లు కొంతదూర మెదురుగఁ జని వచ్చుచున్న యాధ్రువకుమారుం జూచి రథము నిలుపుమని సారథి కాజ్ఞాపించి యతఁ డట్లుచేయ సరభసంబున దిగి ప్రేమపరవశుండై పోయి నారాయణపాదసంస్పర్శనంబుచే సమస్తపాపంబులం దొలంగించుకొని వచ్చినకుమారుని సమీపించి యాలింగనము చేసికొనెను. ఇట్లు రాజకుమారునిఁ గౌఁగిలించుకొని యాతనిమూర్ధమును మాటిమాటికి మూర్కొనుచుఁ గనులనుండి వెలువడుచున్నయానందబాష్పబిందుసందోహముచే నాతనిస్నానముచేయించెను. అంత ధ్రువుండును దండ్రిపాదముల కభివందనములు గావించి దీవనలను బడసి తరువాతఁ దల్లుల యొద్ద కేఁగి సాష్టాంగదండప్రణామంబు లాచరించెను. అంత సురుచి తనపాదములకు నమస్కరించిన యారాజకుమారుని

లేవఁదీసి యాలింగనముఁ గావించుకొని "చిరాయుర్భవ" యని దీవించెను. ఓవిదురా ! చూచితివా? సవతితల్లియయిన సురుచికి సైత మెట్టిప్రేమ జనించినదో. పల్లమునకు నీరు ప్రవహించునట్లు తనసద్గుణములచే హరిని సంతసింపఁజేసిన వానినందఱు జనులును ననుసరించుచుందురు. అనంతరము ధ్రువుండు నుత్తముండు నన్యోన్యమాలింగనంబు గావించుకొని పులకితాంగులయి యానందబాష్పముల విడిచిరి. అనంతరము సునీతి ప్రాణంబులకంటెఁ బ్రియతముండయి తనకు నమస్కరించినకుమారు నాలింగనంబు చేసికొని తదంగసంస్పర్శంబువలన సుఖం బనుభవించుచు మనోవ్యథలను దొలఁగించుకొనెను. మఱియు వీరమాతయు నైన సునీతి కుమారునిఁ జూచినసంతోషాతిశయముచేత నయనంబులనుండి బాష్పజలంబును, నాబాష్పములచేఁ దడిసిన స్తనంబులనుండి క్షీరంబులను స్రవింపఁజేయుచు బుత్త్రప్రేమను వెలిపుచ్చెను. అంతట సమాత్యాదిజనులందఱు రాజుంజూచి, "ఓమహీపాలా! నీయదృష్టంబు మిగుల మంచిది. లేనిచో సుగుణవంతుఁడయినకుమారుఁడు నష్టప్రాయుం డయ్యుఁ దిరిగి లభించునా? నీపూర్వపుణ్యవశమువలన మఱల నీకుమారుం బడసితివి. ఈసుగుణవంతుం డీభూమండలంబు నెల్లఁ జక్కఁగఁ బరిపాలింపఁగలండు. ఏవాని పాదభక్తులు దుర్జయమయిన సంసారమును జయించుచున్నారో యాభగవంతుఁడు పూర్వజన్మంబున మీచే నర్చితుండై యుండును. లేనిచో నీకింత యదృష్టము సంభవించునా?" అని ఇట్లు జనంబులచే నుతింపఁబడుచు నుత్తానపాదుండు తనయిరువురుకుమారుల నొకగజంబుపై నధిరోహింపఁజేసి సమస్తపరివారంబు గొలుచుచుండ మహా

నందంబుతోఁ బురంబుఁ బ్రవేశించెను. ఇట్లు రాజు పురంబును బ్రవేశించి మనోహరములయిన మకరతోరణంబులచేతను, గదళీ స్తంభంబులచేతను చూతాశోకాదిపల్లవంబులచేతను, ముత్యాలసరములచేతను, సదీపములయిన యుదకకుంభంబులచేతను, గప్పుఁజక్కఁగ నలంకృతంబులయిన ద్వారంబులుగలవై కాంచనమయమయిన పరిచ్ఛదంబులచే నొప్పు గోపురంబులచేతను, బ్రాకారంబులచేతను, మందిరములచేతను, గనుల పండువు లొనరించుచున్నవై పన్నీటిచేఁ గలయంపి చల్లఁబడి యున్నవైన వీథులం బడి పోవునప్పు డుభయపార్శ్వంబుల నుండు మేడల పయినుండి యంతఃపురస్త్రీలు లాజలను బుష్పంబులను గురియింపఁజొచ్చిరి. మఱికొందఱు పురస్త్రీలు రాజునకును రాజకుమారులకును పుష్పఫలాదులను గానుకలగా సమర్పించి యాశీర్వాదంబుల నొసంగుచుండ ధ్రువుం డంతటిచే సత్కృతుం డగుచు నెడనెడ వారు చేయుచున్న మధురగానంబుల విని సంతసించుచుఁ, జనిచని తన తండ్రిగారి మందిరంబును బ్రవేశించెను. ఇట్లు ధ్రువుండు కనకరత్నమయమయి కన్నులకు విందు గొలుపుచున్న జనకభవనంబును బ్రవేశించి జనకుఁ డయిన యుత్తానపాదునిచే మిగుల గౌరవింపఁబడుచు స్వర్గమందున్న దేవపతివలె మిగుల సౌఖ్యముల ననుభవించుచుండెను. మఱియు ధ్రువుండు పాలనురుఁగువలె, మృదువులును, దెల్లనివియు, నువర్ణమయములును, నగు శయ్యలయందు శయనించుచు, మహార్హములై రజతమయములయి యలరుచున్న యాసనంబులఁ గూర్చుండుచు, స్ఫటికరత్నఖచితములును, మరకత మాణిక్యమయములు నగు కుడ్యములచేతను, దేవకాంతలఁ బోలుయువతీ

రత్నముల చేతనుఁ బ్రకాశించుచున్న మందిరములయందు సంచరించుచు, వివిధములయిన తరుబృందములచేత సుందరమయి విహంగమముల కలకలంబులచే వీనుల విందుగొలుపునట్టి యుద్యానవనములయందును, హంసలు, కన్నెలేడిపిట్టలు మొదలగు జలవిహంగముల నినాదములచేఁ బొలుపారుచు, బద్మకువలయాదులచే నిండినవయి రత్నమయములయిన సోపానములచేఁ బ్రకాశితములై యలరారుచున్న దిగుడుబావులయందును విహరించుచుఁ గాలము పుచ్చుచుండెను. అంత నుత్తానపాదుఁడు యుక్తవయస్కుఁడైన తనకుమారునిఁ జూచి మిగులసంతసించి మంత్రుల యనుమతినిఁ బొంది ప్రజానురంజకుఁడయిన ధ్రువునికి మహావైభవముతోఁ బట్టాభిషేకము కావించెను. అనంతర ముత్తానపాదుండు తన్ను ముదుసలివానిఁగా నెఱింగి ముక్తికిఁ దగిన యుపాయము నాలోచించుచు విరక్తుండై రాజ్యమును బురమును బంధువులను విడిచి తపం బొనరింప వనమునకుఁ బోయెను ఇది నవమాధ్యాయము.

అనంతరము ధ్రువుండు ప్రజానురంజకముగా రాజ్యమును బరిపాలించుచు శింశుమారుఁడను పేరుగల ప్రజాపతితనూజను భ్రమియనుదానిని బెండ్లియాడి కల్పుఁడు వత్సరుఁడు ననునిరువురఁ బుత్త్రులం బడసె. మఱియు వాయుపుత్రికయగు నిడాదేవిని వివాహమాడి యువతిజనంబులకు మన్మథునివలెనున్న యుత్కలుఁ డనుకుమారునిఁ గనియెను. ఆధ్రువునిసోదరుం డయినయుత్తముండు మృగయాకుతూహలుండయి యడవికిఁబోయి హిమవన్నగంబున సంచరించుచు నొకయక్షునిచే వధింపఁబడియె.

ఆతండు పెండ్లిచేసికొనకయే చచ్చుటచే సంతతి లేదయ్యె. తన కుమారుని మరణవార్తను విని సురుచి దుఃఖసంతప్తయై వనం బుఁ బ్రవేశించి కార్చిచ్చుచే నావరింపఁబడి మృతినొందె. అంత ధ్రువుండు భ్రాతృమరణంబునకు మిగుల దుఃఖించి తన్మరణంబు యక్షకృతం బగుట తెలిసికొని కోపాగ్నిచే సంతప్తహృదయుం డయి జయశీలుం డయిన యరదం బెక్కి యక్షులకు నివాసభూతం బయిన యలకాపురంబునకుఁ బోయెను. ఇట్లు ధ్రువుండు పోయి పోయి యక్షబృందంబులచే సంకులంబయి హిమాలయపర్వతము ల కనుమలలో నున్న యలకాపురంబును బొడగాంచి సమీపిం చి దశదిశలును బ్రతిధ్వనినాదంబు లిచ్చునట్లు తన శంఖమును బూరించెను. ఆశంఖ ధ్వని నాలకించి యక్షస్త్రీలందఱు మిగుల భయంపడిరి. అప్పు డలకాపురీరక్షకభటు లాశంఖధ్వానమున కు సహింపక కోపావిష్టమానసులై శస్త్రాస్త్రధారులయి పర్విడి వచ్చి ధ్రువునిఁ జుట్టుముట్టిరి.

ధ్రువుండు యక్షులతో యుద్ధము సేయుట.

అంత ధ్రువుండు తన్నుఁ జుట్టుముట్టి వచ్చుచున్న యక్షులం బొడఁగాంచి శత్రుభయంకరం బయిన తన కార్ముకం బెక్కిడి యొ క్కొక్కనిపయి మూఁడేసి బాణంబులం బ్రయోగించి యొక్కొక్కరు ఱు నొప్పించెను. వార లా దెబ్బలకుఁ దాళఁజాలక యాతని పరాక్రమంబునకును గరలాఘవంబునకును నచ్చెరువడి నుతించు చు సతికోపంబూని పాదతాడితంబు లయినసర్పంబులవడువున లేచి చాపంబు లెక్కుపెట్టి యొక్కొక్కరొక్కొక్క బాణషట్కం బును బ్రయోగించి ధ్రువుని నొప్పించిరి. మఱియు నాయక్షులలో బలశాలురైనవారు ధ్రువుండొనర్చినయపకారంబునకుఁ బ్రతీకా

రముసేయఁదలఁచి యాధ్రువుని, నతనిసారథిని,పరిఘములు, పట్టిసములు, ఖడ్గములు, గండ్రగొడ్డండ్లు,శక్తులు,చిత్రపుంఖములుగల బాణములును,వర్షముగాఁ గురియించి ముంచిరి. ఇట్లుపదుముగ్గురు యోధు లొక్కపెట్టునఁ దాఁకి బాణవర్షములు గురియింప నావర్షంబులచే నావృతులయిధ్రువుండును బరిచారకులును మేఘబృందంబులచే నావృతము లయినపర్వతములచందంబున నదృశ్యు లయిరి.అది చూచి యాకసంబునఁ దిరుగుచున్న సిద్ధబృందంబులు ధ్రువునకపాయంబు వాటిల్లె నని తలంచి హాహాకారంబులు సేయుచు "అక్కటా ధ్రువుం డనుసూర్యుండు యక్షు లనుసముద్రంబునం గ్రుంకె" ననిపలుకుచు మిగుల విచారింపఁజొచ్చిరి. ఆసమయంబున యక్షులందఱు మిగుల సంతసించుచు "మేమే జయము పొందితి" మని భావింపఁదొడంగిరి.అంత ధ్రువుండు దన్నావరించి యున్ననీహారంబును భేదించుకొని వచ్చు సూర్యునిచందంబున శరవర్షమును భేదించుకొని బయలువెడలి వచ్చి ధనుష్టంకారమును గావించుచుఁ దద్ధ్వనిచే శత్రుసమూహంబులకు భయంబు గలిగించుచుఁ, బుంఖానుపుంఖంబుగా బాణములఁ బ్రయోగించుచుండ నాబాణపరంపర, మహామారుతంబు మేఘబృందంబులఁ జెల్లాచెదరుగఁ జేసినట్లు లాశత్రుసమూహమును జెదరఁగొట్టెను. ఆసమయంబున ధ్రువునిచేఁ బ్రయుక్తములయిన బాణంబులు మహారభసంబునఁబోయి పర్వతముల భేదించు పిడుగులవడువున శత్రువులకవచములను భేదంచి దేహములం బ్రవేశించెను. ఇట్లు ధ్రువునిబాణపరంపరచే ఖండింపఁబడిన కుండలమండితములయిన శిరంబులచేతను, స్వర్ణతాళములఁ బోలినయూరువులచేతను, సుందరములయినబాహువులచేతను, నమూల్యములయినయలం

కారములచేతను, దలపాగలచేతను, సంకులమయి యున్న యుద్ధభూములు వీరులకు మిగుల మనోహరముగాఁ బ్రకాశించుచుండెను. ఇట్లు చంపఁబడఁగా మిగిలిన యక్షులు ధ్రువుని సాయకములచే ఖండితములయిన యవయవములు గలవారలయి యాతనిధాటికి సైఁపలేక సింహమునుజూచి భయపడి పర్విడు గజంబులవలె నలుదిక్కులకుఁ బర్విడఁజొచ్చిరి.అంత ధ్రువుఁడు యుద్ధభూమియందు శస్త్రపాణియయియున్న శత్రువునుగానకయలకాపురమును జూడనిచ్ఛ కలవాఁడయినను "శత్రువులు పెక్కుమాయలుకలవారుకావుననట్లుచేయుటయుక్తముగా" దనితలంచిపురంబునుజొరక సారథితోఁ బ్రసంగించుచుండె.ఆయవసరంబున మేఘగర్జితమువలెభయంకరమయినశబ్దము వినవచ్చె.దానివలన మగుడశత్రువులు తనకుఁ బ్రతీకారము చేయఁదలంచి వచ్చుచున్నట్లుభావించి జాగరూకుఁడయియుండె. అంతమహామారుతంబు ధూళులచే దిక్కులఁగప్పుచు ప్రబలముగా వీవఁజొచ్చెను. కనురెప్పపాటుకాలములోనేమేఘబృందంబులుగగనభాగంబును గప్పిగర్జితములచేతను భయమునుగలిగింపఁ జొచ్చెను. ఇట్టులా మేఘములు కొంతవడి భయంకరముగసంచరించుచు రక్తమునువిణ్మూత్రములను,బూయమును,మాంసమును,వర్షింపఁదొడంగెను. మఱియు నాకసముననుండి కబంధములు పడఁజొచ్చెను.సకలదిక్కులయందు నాయుధములను ధరించిప్రయోగించుచున్నవీరులు కనఁబడఁజొచ్చిరి. విషాగ్నులను వెడలఁగ్రక్కుచున్న సర్పములు గజములు శార్దూలాదిక్రూరమృగములు నల్గడలఁ బర్విడఁ జొచ్చె. ఆసమయంబున సముద్రము ప్రళయకాలమందువలె ఘోరముగా ధ్వని సేయుచు భూమిని ముంచుచు మహాతరంగములచే మి.

గుల భయంకరముగా విజృంభించెను. ఇట్లు పలువిధము లయిన
మాయలుగల్పించి యారక్షస్సులు ధైర్యవంతులు కానివారికి
భయము పుట్టునట్లుచేసిరి. అంత ధ్రువుం డసురమాయనుజూచి
దానిని దప్పించుకొనుట మిగుల దుస్సాధ్యంబని తలంచి యేమి
యుఁ జేయ నిష్టపడకయున్నసమయంబున మునీంద్రులందఱు
ధ్రువుని సమీపించి, "ఓరాజా! నీవెంతమాత్రము భయపడకు
ము.నీకు శుభంబులు కలుగుఁగాక. భగవంతుండగు నారాయణు
నినామస్మరణమె మానవులను భయంకరమయిన మృత్యువు
నుండి తప్పించుచున్నది అతఁడీమాయను నశింపఁజేయలేఁడా?
శీఘ్రముగా నాతఁడు నీశత్రువులను నీమాయను నశింపఁజేయుఁ
గాక" యని పలికిరి. ఇది పదవయధ్యాయము.

అంత ధ్రువుండు మునీంద్రులవాక్యంబులవిని యాచమనముఁ
గావించి నారాయణాస్త్రమును వింటఁదొడిగెను. ఓవిదురా! ఇ
ట్లు ధ్రువుండునారాయణాస్త్రమునుసంధింప గుహ్యకులచేనిర్మిం
పఁబడిన మాయలన్నియు, జ్ఞానోదయముకలిగినపిమ్మట నశించెడి
రాగద్వేషాదులవలె నశించెను. పిమ్మట ధ్రువుండు నారాయణా
స్త్రమును ప్రయోగించి మఱియుఁగలహంసపక్షములచే నలంకృ
తములై నిశితములై స్వర్ణమయములయిన పుంఖములు కలవై
యొప్పుచున్న మఱికొన్ని శరంబులను బ్రయోగింపనవి భయంక
రవంబులై వనమును బ్రవేశించు మయూరములచందంబున శ
త్రుబలంబులను బ్రవేశించెను. అట్లు ధ్రువుఁడు ప్రయోగించిన
బాణములచేఁదాడితు లయిన యక్షులు కోపావిష్టమానసులై
యాయుధములను ధరించి సర్పంబులు పడగలెత్తికొని గరుత్మం

తునిపయిఁగవిసినట్లు గవియ నారంభించిరి. అదిచూచి ధ్రువుండునిశి
తశరంబులను వింటసంధించి యాశత్రువులశిరస్సులను బాహువు
లను గంఠములను ఛేదించి యర్కమండలంబును భేదించివారిని
యోగీశ్వరులు ప్రవేశించుచున్న యూర్ధ్వలోకమునకుఁబుచ్చెను.
ఇట్లు ధ్రువుండు ప్రళయకాలరుద్రునివలె యక్షానీకంబులఁ జెం
డాడుచు వర్తించుచుండ నదిచూచి యతని పితామహుఁడయిన
స్వాయంభువమనువు మునీంద్రులతోఁగూడ నచ్చటికరుదెంచి
యాతని కిట్లనియె.

—స్వాయంభువుండు ధ్రువునితో యుద్ధము మానుమని చెప్పుట.—

ఓవత్సా! సమ్మోహాత్మకమయిన యజ్ఞానముచేఁ గలిగిన
దియుఁ బాపహేతువయినదియునగు కోపంబును బెంచి నిరపరా
ధులగు నిందఱపుణ్యాజనుల నేల చంపితివి? చాలు. ఇంకనైన యు
ద్ధముఁడుగుము. ఓయీ! ఈకృత్యము సత్పురుషు లాచరింపవల
సినది కాదు. సత్పురుషనిందితమయినయీకృత్యము నావంశమం
దుఁబుట్టినవారాచరింపఁదగినది కాదు. ఈయక్షులు నాసోదరుండ
యినయుత్తమునిఁ జంపియుండఁగా నిరపరాధు లెట్టులగుదురు? సా
పరాధులను జంపినఁ బాపముండునా?' అనియందువేని చెప్పెదవి
నుము. ఓభ్రాతృవత్సలా! నీవు భ్రాతృస్నేహముచే నీవాపనిచేయు
టయుక్తమే. కాని యొక్కయక్షుఁడపరాధము చేసినంతమాత్ర
మునఁదక్కినయక్షులనందఱిని సంహరించుట తప్పు. మఱియుఁదన
కొకఁడపరాధముచేసెనని మగుడ వానికిఁ బ్రత్యపకారముచేయఁ
బూనుట దేహాత్మాభిమానముగల పశువుల కుచితముకాని భగ
వద్భక్తులయి వర్తించుసాధువుల కెంతమాత్రము తగినదికాదు.
దేహాత్మాభిమానముగలమూఢులచే దురారాధ్యుండును సర్వాం

తర్యామియునగు నారాయణుఁడే సర్వభూతాత్ముఁడై యున్నట్లు
భావించియతనికంటె నన్యమగువస్తువేదియు లోకమున లేదని ని
శ్చయించి యింతకుఁబూర్వము హరినిసమారాధించి యతనియను
గ్రహబలంబుచేనుత్తమపదమునుబొందితివి. అట్టిభగవద్భక్తుఁడవ
యిన నీవుపాపకృత్యములనాచరించుటతగునా? మఱియునీవుభగ
వద్భక్తుండవుకావున భక్తులకుఁదగిన సన్మార్గము నవలంబించి లో
కమునకట్టి సన్మార్గమును గఱపుటయుక్తము. కానియిట్టిక్రూరకృ
త్యము లాచరించుట తగదు. నీవుభగవంతునికిని భగవద్భక్తులకు
ను సమ్మతుఁడ వయియుండవలయును. నీవిట్టిదుష్టకార్యంబులాచ
రించినచో నీవు పరమాత్మకు విరోధివై యుందువు. 'ఓయీ! భూ
తద్రోహముచేసిన భగవద్భక్తి తొలంగునా' యని యడుగనవ
సరంబులేదు. భగవద్భక్తుండయినవాఁడు, సాపరాధులను స
హించుచుండవలయును. దుఃఖితులనుజూచి సహింపక కరుణార
సమును వెలిపుచ్చుచుండవలెను. సమస్తజంతువులను భేదబుద్ధి
చేఁ జూడక వానితో మైత్రిచేసి మెలంగవలయును. సర్వభూ
తములయందు సమభావము కలిగియుండవలయును. అట్లయిన
చో భగవంతుండు ప్రసన్నుండు కాఁగలఁడు. అట్లుకాక కొన్నిభూ
తములయెడ విరోధ మవలంబించినచో నతఁడు ప్రసన్నుం
డుకాఁడు. ఆహరి సర్వభూతములయందు నంతరాత్మయయి
యుండుటచేతను, దేవమనుష్యాదులందఱు నతనికి శరీరభూ
తులగుటచేతను, నతనికి శరీరభూతులయిన దేవమనుష్యాదు
లలో నొకని కపకారముచేసినచో నాయపకార మతనియందే
పర్యవసన్నమగుచుండఁగానతం డెట్లు ప్రసన్నుండు కాఁగలఁడు?
కావున భూతద్రోహము చేసిన భగవంతునికిఁ దనయం దనుగ్ర

హము తప్పును. 'ఓయీ! భగవదనుగ్రహము లేక పోయినఁ బోనిమ్ము. అందువలన నష్టమేమి?' యని వలనుపడదు ప్రతిమనుష్యుఁడును భగవదనుగ్రహమును సంపాదింపవలయును. పురుషుఁడు సర్వాత్మస్వరూపుఁ డగునభగవంతుని నుపాసించుచుఁ దితరోపకరణములచే భగవంతునిఁ బ్రసన్నునిఁగాఁ గావించుకొనినచోఁ బ్రాప్తించు భగవత్ప్రసాదముండుటచేఁ గామక్రోధాదులవలన విముక్తుఁడై సకలక్లేశరహితమగు దాయుక్తమయిన వైకుంఠమున కేఁగుచున్నాఁడు. అందువలన భగవంతునికి వ్యతిరిక్తులమయి వర్తించుట తగదు. మఱియుఁ బంచభూతంబులచేతఁ బ్రారంభింపఁబడి దేవమనుష్యాదిశరీరరూపములుగాఁ బరిణతమయి రెండువిధములయి యున్న స్త్రీపురుషులు సంగమించుటవలనఁ బ్రాణికోటి యుద్భవించుచున్నది. పంచభూతపరిణామములగు స్త్రీపురుషస్వరూపములగు రెండుశరీరములవలన స్త్రీపురుషరూపములు సంభవించుచున్నవి. అవి పంచభూతాత్మకములే కదా? ఈ స్త్రీపురుషశరీరసృష్టియుఁ బ్రజనితమయిన సృష్టియుఁ బరమాత్మకు శరీరమైన మాయను సంబంధించిన సత్త్వాదుల తారతమ్యసంబంధమువలననే కలుగుచున్నది. కలిసియున్న యాత్రిగుణములందు రజోగుణసంబంధ మధికముగా నుండి తక్కినగుణములు తక్కువగా నున్నయెడల సృష్టి జరుగుచుండును. సత్త్వగుణ మధికముగానుండి తక్కిన వల్పముగా నున్నయెడల స్థితియు, దమోగుణమధికముగానుండి తక్కినగుణములు తక్కువగా నున్నయెడల నాశనము ప్రవర్తిల్లుచుండును. సృష్టిస్థితిలయములకు సత్త్వాదులే కారణములు. ఇందువిషయమయి యీశ్వరుఁడు నిమిత్తమాత్రుఁడయి యుండును. అట్లుసమస్తమునకు నిమిత్తమాత్రుఁడయిన భగవం

తునిసన్నిధియందుఁ గార్యకారణరూపమయిన ప్రపంచమంతయు నయస్కాంతము సన్నిధినిలోహమువలెఁ జలించుచుండును. ఆయీశ్వరుఁడు కర్త గాకపోయినను సృష్టిస్థితిలయములకు హేతుభూతమయిన సత్త్వాదిగుణములు మిశ్రితములగుటకుఁ గారణమయిన కాలరూపశక్తిచేత, సత్త్వాదిగుణప్రవాహముచేఁ గర్మాధీనులయిన దేవమనుష్యాది రూపముగాను, సుఖదుఃఖతారతమ్యము గలుగునట్లుగాను వ్యవస్థచేయఁబడిన ప్రపంచమును సృజించుచున్నాఁడు. స్వయముగా హంతగాక ప్రపంచమునంతను లయమును బొందించుచున్నాఁడు. అయారే! ఆభగవంతునిచేష్ట నూహింప శక్యముకాదు కదా! మఱియు నాకాలస్వరూపుఁడయిన పరమాత్మ పిత్రాదిమూలకముగా సృష్టికావించుచున్నాఁడు. మృత్యుమూలముగా సృష్టినాశనమును గావించుచున్నాఁడు. పరమాత్మకుఁ బ్రజలందఱు సమానులే! అతనికి శత్రువులు లేరు. మిత్రులు లేరు. ప్రసరించున్న వాయువును రజఃకణము లనుసరించి ప్రవర్తించుచున్నట్లు సమస్తభూతములు సకలనియామకుఁడయిన భగవంతు ననుసరించి ప్రవర్తించుచుండును. ఆభగవంతుఁడాయాభూతముల కర్మముల ననుసరించి యాయుర్వృద్ధినిగాని, యల్పాయువునుగాని ప్రాణులకు నొసంగుచుండును.అందువలన భూతముల నాశనమునకుఁ దత్కృత పూర్వకర్మమే కారణముగాని మఱియొకటి కాదు.కొందఱు సుఖమునకుఁ బుణ్యము కారణమనియు దుఃఖమునకుఁ బాపము కారణమనియు,భావింతురు. మఱికొందఱు ప్రకృతిపురుషపరిణామస్వభావమే సుఖదుఃఖకారణమందురు. కొందఱుకాలస్వరూపము కారణ మని తలంతురు. ఒకకొందఱు పరమపురుషు

సంకల్పమే సుఖదుఃఖకారణంబు కాని మఱియొకటికాదందురు. ప్రకృతిపురుషవిలక్షణుండయినభగవంతుని సంకల్పమే ప్రపంచకమునకు సృష్టిస్థితిలయములను గలిగించుచున్నది. అట్టిభగవత్సంకల్పము నెవఁడెఱుంగును? ఓకుమారా! నీభ్రాత యగునుత్తమునిమరణమునకు భగవత్సంకల్పమే కారణము కాని యీకుబేరానుచరు లెంతమాత్రమును గారు. ఇట్లు భగవంతుఁడు లోకములసృజించుచుఁ బెంచుచు, లయించుచు నున్నను నాతఁడెప్పుడును గుణకర్మములకు వశుఁడయి యుండఁడు. మఱియుఁ జిదచిదాత్మకమయిన భూతసంఘములయందంతరాత్మరూపుఁడయి యుండి యాయాభూతముల కర్మములను బురస్కరించుకొని తదనుగుణమయిన ఫలము నొసంగుచు నియామకుఁడయి వర్తించుచున్నాఁడు. ఆతఁడే సమస్తభూతముల యుత్పత్తివినాశాదులకుఁ గారణభూతుఁడు. ఆతఁడే శక్త్యాత్మకమయిన మాయచే లోకముల సృజించుచుఁ, బెంచుచు, లయమును బొందించుచు నున్నాఁడు. ఓకుమారా! తన్ను భజింపనివారికి సంసారబంధముల నొసంగుచుఁ, దన్ను గొలుచువారికి మోక్షము నొసంగుచున్న భగవంతుని స్వప్రకాశకునిఁగాను, జగదాధారకునిఁగాను, సర్వభూతాత్మకునిఁగా నిశ్చయించి భజింపుము. ఆనారాయణునికంటె నధికుఁడింక లేఁడు. బ్రహ్మాదిదేవతలు సైతమతనియాజ్ఞఁ జొప్పునఁ బ్రవర్తింపవలసినవారే. మఱియు వృషభాదులు నాసికారజ్జువులచే బంధింపఁబడి మానవులకు వశములయి సకలకార్యముల నెఱవేర్చుచున్నట్లు బ్రహ్మాదిదేవతలందఱు పరమాత్మ మాయాపాశముచే బద్ధులయి యతనికి వశులై సతతము భక్తితోఁ బూజల నర్పించుచుందురు. అట్టి బ్రహ్మాదు లేయు

తనికి వశులయి కైంకర్యము చేయుచున్నప్పుడు మనవంటి వారిసంగతి వేఱె చెప్పవలయునా? మనమందఱ మా భగవంతునికి వశులమై యున్నాము. కనుక నాతని కానందము కలుగునట్లు కర్మములనాచరించి యతనియనుగ్రహము నొందుటయే యుక్తకార్యము. మఱియు నీవు పంచవర్షప్రాయుఁడవయి యున్నప్పుడే, సవతితల్లియగు సురుచివాక్యములకు సహింపలేక ప్రాణాస్పదురాలయినను దల్లిని విడిచి వనమునకేఁగి యతినిష్ఠాగరిష్ఠుండవయి భగవంతు నారాధించి ప్రత్యక్షముఁ గావించుకొని ముల్లోకములకు శిరోభాగమందున్నదై యుత్కృష్టమై యున్న పదమును బొందితివి. ఇప్పుడు నయితము కడుభక్తితో నాపరమాత్మనే సేవించుచుండుము. ఏజీవాత్మయందు దేవమనుష్యాదిరూప మగు ప్రపంచము లేకపోయినను బుణ్యపాపకర్మములచే నున్నట్లు బ్రతీయమాన మగునో; ముక్తాత్ముఁడయిన యట్టి జీవాత్మయందు నంతరాత్మగా నున్నవాఁడను. హేయగుణములు లేక నిరాకారశూన్యుఁడయి నిరుపమానమహిమ గలిగి నిత్యముక్తుఁడై యున్న పరమాత్మను మనంబునఁ గనుఁగొని సేవింపుము. 'ఓయీ! నే నింతకుముందు భగవంతుని సేవించి యతనియనుగ్రహమును బడసితినే. మరల నిప్పుడతని నేల భజింపవలయు' నని యడుగుదేని చెప్పుచున్నాను వినుము. నీవు పూర్వము భగవంతుని సేవించి యతనిదయను సంపాదించితివి. నిశ్చయమె! కాని నీవప్పుడహంకార మమకారములతోఁ గూడికొని భగవంతుని నారాధించితివి. అందువలననే నీకుఁ బ్రాకృతస్థానము లభించినదికాని పరమపదము లభించినదికాదు. కావున నీ విప్పుడు ప్రత్యగాత్మశరీరుఁడై షాడ్గుణ్యసంయుతుఁడై దేశముచేతను కాలముచేతను

వస్తువుచేతను బరిచ్ఛిన్నుండుకాక గేవలానందరసస్వరూపము గలిగి సమస్తశక్తిసంయుతుండై యున్న పరమపురుషునియందు నిర్హేతుక మయిన భక్తినిం జూపుచు, వర్తించితివేని యహంకారమమకారములచే దృఢపడియున్న యావిద్యాగ్రంథిని భేదించి ముక్తుండవు కాఁగలవు. ప్రస్తుతము నీవు కోపావిష్టమానసుండవయి యున్నావు. ఇట్టులు కోపమునవహించుట యుక్తము కాదు కోపము సమస్తపురుషార్థములకుఁ బ్రతికూల మయినది. కోపముగలవాఁడొక్క పురుషార్థమునయిన సంపాదింపనోపలేఁడు. ఆకోపము నెక్క రోగము తనకును బెఱవారికిని భయంబును ననర్థమును గలిగించును. బుద్ధిమంతుఁ డట్టికోపరోగమునకు వశుఁడై యుండఁడు. నీవు నట్లు నాచెప్పిన తత్త్వవాక్యములనెడు నౌషధమును బానముచేసి దానిని దొలఁగించుకొని బాగుపడుము. నీవు కోపాతిశయముచే యక్షులను సంహరించి దిక్పాలుండయి మహాగౌరవముతో వర్తించుచున్న కుబేరునకు నపకారము జేసితివి. అట్టిదేవతల కపకారము చేసినమర్త్యుఁడు శ్రేయస్సులను బొందుట కష్టము. అట్టిమహాత్ములకుఁ గోపము వచ్చినచో మనకులము నశించుట సిద్ధము. కావున మనకులమును నశింపఁజేయునంతటికోపము కుబేరునికి రాక పూర్వమే నీవతనియొద్దకుఁ బోయి వేఁడుకొని యనుగ్రహమును సంపాదింపుము. అట్లైనచోనే మనకులము నిలుచునుగాని లేనిచో నిలువదు. నీవు కుబేరునిపాలికి వేగముగాఁ బొమ్ము. అతనిఁ బ్రార్థింపుము'' అనిస్వాయంభువమనువు మనుమఁడయిన ధ్రువునికిట్లు తత్త్వముపదేశించి ధ్రువునిచే నభివందితుండయి, మునీంద్రులతోఁ గూడఁ దనపురంబునకుఁ బోయెను. చతుర్థస్కంధమున నేకాదశాధ్యాయము.

విరోధ ముడిగినధ్రువుని గుబేరుఁడు చూచుట.

అంతధ్రువుండుపితామహునివచనంబులను దలధరించి కోపము నుడిగి యుద్ధంబు చాలించి కుబేరానుగ్రహంబు సంపాదింప సమకట్టుచున్న సమయంబునఁ గుబేరుం డాతనియభిప్రాయ మెఱింగి యక్షచారణాదులచేఁ బరివేష్టింపఁబడి ధ్రువుండున్నతావున కరుదెంచి బద్ధాంజలియైనయాతనికిట్లనెను. "ఓక్షత్రియబాలకా! నీవు పెద్దలవాక్యములందు గౌరవముంచి కోపమునుండి మరలితివి. కావున నేను మిగులసంతసించితిని. నీవు పాపరహితుఁడవయి వర్తింపుము. 'ఓయీ నేను బుణ్యజనవధ కావించియుండఁగా పాపరహితుఁడ నెట్లగుదు'నని విచారించ నవసరము లేదు. నాయనుచరులయిన యక్షులు నీసోదరునిఁ జంప లేదు. నీవు యక్షులను జంప లేదు. భూతముల యుత్పత్తి వినాశములకుఁ గాలస్వరూపుఁడయిన యీశ్వరుఁడే కారణభూతుఁడు. 'ఓయీ! నాచేతులతో నేను బ్రయాసము చెందుచు సమస్తయక్షులను జంపియుండ నీశ్వరుఁడు చంపినాఁడనుట యెట్లు?' అనియందువేని చెప్పెద విను. పురుషుఁడు దేహముకంటె విలక్షణమగు నాత్మనుగూర్చి చక్కఁగఁ దెలిసి యుండవలయును. కానియాతనికి నట్టితత్త్వజ్ఞానము లేక పోవుటవలన సంతతము దేహము నాత్మగా భావించుకొనుచుండును. అందువలన 'నేను వానినిఁ జంపితిని' 'నీవు వానినిఁ జంపితివి' యనెడిబుద్ధి స్వప్నబుద్ధివలెనే*యన్యథాజ్ఞానస్వరూపమయినది.

---

*అన్యథాజ్ఞానమనఁగా. నొకవస్తువునందు మఱియొకవస్తువు ధర్మమున్నదనెడిబుద్ధియే-శంఖము తెల్లగానుండుట ప్రసిద్ధము. పైత్యాదిదోషములు గలవానికా శంఖము పచ్చగాఁగానవచ్చును. అప్పుడు వాఁడు శంఖము పచ్చగానున్నదని భావించును. ఇప్పుడు వానికి ధర్మియగు శంఖమనెడిబుద్ధి గలిగినను దానియందుం

డు తెలుపనెడి ధర్మము పసుపనెడి ధర్మముగా తోఁచుచుండ అట్లు శంఖమందున్న తెల్లఁదనమును బచ్చఁదనముగా భావించుట యన్యథాజ్ఞానము. విపరీతజ్ఞానమనఁగా, నొకవస్తువునుఁ జూచి మఱొకవస్తు వనుకొనుటయే. ముత్తెపుచిప్పను జూచి రజత మనుకొనును. అట్లు రజతము కానిదానిని రజతమనుకొనుట విపరీతజ్ఞానము. స్వప్నావస్థయందిట్టి జ్ఞానములు కలుగుచుండును. స్వప్నము పురుషునికి నొకవస్తువున నున్న ధర్మమును మఱియొక ధర్మముగాను, నొకవస్తువు మఱియొక వస్తువునుగాను దోఁపించును, కాని యది యెప్పటికిని వాస్తవము కాదు. ప్రస్తుతమున "నేను చంపితిని" "నీవు చంపితివి" అనుబుద్ధి యన్యథాజ్ఞానవిపరీతజ్ఞానరూప మయినదయే. "నేను" అనెడిపదము చేతను, "నీవు" అనెడిపదము చేతను దేహమందున్నయాత్మ చెప్పఁబడుచున్నది. కాని దేహము చెప్పఁబడలేదు. కావున, "నేను" అనుపదమునకర్థము కాని దేహమును "నేను" అనుపదమున కర్థముగ నాత్మనుగా భావించుటయే విపరీతజ్ఞానము. మఱియు నొరులను జంపనివి కాన నాత్మయందును, దేహమందును, హననకర్తృత్వము లేదు. అట్లు హననకర్తృత్వములేని దేహాత్మలయందు హననకర్తృత్వరూపధర్మము నారోపించుటయే యన్యథాజ్ఞానము. "ఆత్మ చంపునది కాదు. చంపఁబడునదియుఁ గాదు" అనునర్థము గీతలలోఁ గూడఁ జెప్పబడినది. 'శ్లో. యఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతం। ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే, ఎవఁడాత్మ యొరులను జంపునని తలంచునో, యెవఁడాత్మ యొరులచేఁ జంపఁబడుచున్నదని భావించునో, వా రిరువురు యాథార్థ్యజ్ఞానములేనివారు. అంతియ కాని యాత్మ మఱియొక దానిని జంపలేదు. మఱియొక దానిచే నాత్మ చంపఁబడదు. ఈహేతువుచే నాత్మకు హననకర్తృత్వము లేదని యెఱుంగునది. ఒకవేళ నాత్మకు లేకపోయినను దేహమునకుఁ గలదనియు భావింపరాదు. దేహమెల్లప్పుడును బుట్టుచున్నది. ఎల్లప్పుడును నశించుచున్నది. ఈవిషయము గీతలలోఁ జెప్పఁబడినది. శ్లో. అథచైనం నిత్యజాతం నిత్యం వా మన్యసే మృతం। తథాపి త్వం మహాబాహో నత్వం శోచితుమర్హసి,, ఈదేహము నిత్యము పుట్టుచున్నట్టుగాను నిత్యము నశించుచున్నట్టుగాను తలంచుచున్నావు. కావున నిత్యము మృత

* దేహాత్మబుద్ధి వాస్తవముగా సుఖమునకుఁగాని దుఃఖమునకుఁ గాని హేతువు కాక జననమరణరూపసంసారమును, స్వభా

మయిన దేహమందు హననకర్తృత్వముకాని హననకర్మత్వముకాని యారోపించి దుఃఖింపరాదని భావము. కావున దేహమందుఁగూడనట్టిధర్మములనారోపింపరాదు. ఈచెప్పుటవలన హననక్రియలోఁగర్త కాని కర్మ కాని కాకయున్నను దేహమందునునాత్మయందును నటువంటి బుద్ధిగలుగుట యన్యథాజ్ఞానవిపరీతజ్ఞానములనుండియే యనియును, నట్టి యన్యథాజ్ఞానవిపరీతజ్ఞానములు లనాదిగావచ్చుచున్న యవిద్యారూపమగు నజ్ఞానమువలనఁ గలుగుచున్నవనియుఁ జెప్పుటచే నది స్వప్నబుద్ధివలెనే యర్థశూన్యమయినదని యెఱుంగనగు. అన్యథాజ్ఞానవిపరీతజ్ఞానము లవిద్యవలనఁ గలుగుచున్నవనుటకు గీతలలోఁ జెప్పఁబడినది-

‘‘శ్లో. అనాత్మన్యాత్మబుద్ధిర్యా అస్వే స్వమితి యా మతిః। అవిద్యాతరుసంభూతం బీజమేతద్ద్విధా స్థితం’’ అనఁగా, ఆత్మ కానిదేహమం దాత్మబుద్ధియుఁ దనది కాని వస్తువునందుఁ దనదనెడి బుద్ధియు, నవిద్యావృక్షమువలనఁ బుట్టి రెండువిధములుగా నున్నబీజమే యని యర్థము. కావునఁ బ్రస్తుతమునఁ గుబేరుఁడు ధ్రువునితో ‘‘ఓయీ! నీవు యక్షులఁ జంపుటలో వ్యాపారము చేయుటయు, నందువలన శ్రమఁ జెందుటయు నీయాత్మకు గాని దేహమునకుఁ గాని లేదు. అయిన నది యన్యథాజ్ఞాన విపరీతజ్ఞానములచే నట్లు తోఁచుచున్నది. కావున నీ విందులకయి విచారింపవల దని యుపదేశించెను.

*ఇటుఁ గుబేరుఁడు ధ్రువునకిట్లు సెప్పెను. ఓధ్రువుఁడా! నీవు యక్షులను జంపినట్లును, యక్షులు నీతమ్మునిఁ జంపినట్లును భావించుచున్నావు. మఱియు జంపుటకు వ్యాపారముచేసినట్లును, నందువలనఁ గలిగిన యాయాసముచెమ్మట మొదలగువాని ననుభవించుచున్నట్లును, ప్రత్యక్షముగా మీరుఁజూచుచున్నారు. కాని హననాది కర్తృత్వము కాని, యందువలనఁ గలుగునాయాసము చెమ్మట మొదలగునవి కాని, మీ రనుకొనునట్లు లాత్మకు లేవని ‘‘హన్తా చేన్మన్యతే హన్తుం’’ ‘‘య ఏనం వేత్తి హన్తారం’’ మొదలగు ప్రమాణములవలనఁ దెలియవచ్చుచున్నది. అట్లె దేహమునకుఁ గూడ లేవని ‘‘అథ చైనం నిత్యజాతం

వసిద్ధముగ గుణాష్టకము గలయాత్మయందు నట్టిగుణములు లేవనెడి విపరీతజ్ఞానమును, గలిగించుచుండును. ఇట్లు మహా నర్థములు గలిగించుచున్న దేహాత్మబుద్ధిని విడువవలయును. మీ రనుభవించితి మనిన స్వేదశ్రమాదులు కూడ సద్వారకముగా భగవంతునికే చెందుచుండును. అందువలన నీవెంతమాత్రమును విచారింపకుము. ఓభూపకుమారా! నీకు శుభమగుఁగాక. నీ విక నీమందిరంబున కరుగుము. చిదచిద్రూపమగు ప్రపంచమే శరీరముగాఁ గలవాఁడగుటచే సర్వభూతములును నాత్మయు నతఁడేయని గ్రహించి యింద్రియముల కగోచరుఁడయినను యోగీశ్వరుల మానసంబులచే ధ్యానింపఁదగిన చరణకమలములతో నొప్పుభగవంతుని సర్వదా భజింపుము. ఆ భగవంతుని సామాన్యునిగాఁ దలంపకుము. అతఁడు సంసారమును మొదటికి ఛేదించినవాఁడు. మఱియు నతఁడు భజించువారిసంసారబంధంబులనుగూడ ఛేదింపఁజాలినవాఁడు. అతఁడు

నిత్యం వా మన్యసే మృతం। తథాపి త్వం మహాబాహో నైవం శోచితు మర్హసి॥ అనువాక్యమువలనఁ దెలియవచ్చుచున్నది, కావున హననాదిక్రియలలో మీరు కర్తలనునది యజ్ఞానమువలనఁ గలుగుచున్నది. కాని యది వాస్తవముకాదు. హననాదిక్రియలందుఁ జెమ్మటపట్టుట మొదలగువానిని మీరనుభవించుచున్నట్లు తలంచుచున్నారు. కాని మీస్వేదశ్రమాదులు గూడ సద్వారకముగా భగవంతునికే చెందుచుండును. అదెట్లు చెందునని సందియమొంద నవసరములేదు. "కాఠిన్యవాన్యో బిభర్తి తస్మై భూమ్యాత్మనే నమః" ఇత్యాదులందు భూమియందుండు కాఠిన్యాదులు భూమిశరీరకుఁడగు నీశ్వరునకు సద్వారకముగాఁ జెందునట్లు మీ రనుభవించుచున్నట్టులు తలంచుచున్న స్వేదశ్రమాదులుగూడ సద్వారకముగా మీయంతరాత్మయైయున్న భగవంతునికే చెందుచుండును. కావున నెంతమాత్రమును విచారింపఁదగదని భావము.

సత్త్వాదిగుణప్రచురమై, తనకుఁ గార్యసాధనియై యున్న తన మాయను లోఁబఱుచుకొని దానికి నియంతయై యున్నాఁడు. కావున నిట్టి భగవంతుని మోక్షమపేక్షించి కొలువుము. ఓనృపకుమారా! నీవింక సంకోచమువిడిచి యేది నీకిష్టమో దానిఁ గోరుము. ధర్మార్థకామములలో నీ కేదయిన నిష్టమయినచోఁ గోరుము, వరమిచ్చెదను. నీవు సంసారమున బ్రహ్మాదులకుఁ బూజనీయుఁ డగునారాయణునిపాదపద్మముల సంతతము భజించుచుఁ దదాసక్తచిత్తుఁడవై యుందువని విందుము. నీవు త్రివర్గము నపేక్షింతువా?" అని యిట్లు కుబేరుఁడు వర మడుగుమని నియమింపఁగా భగవద్భక్తుఁడును మహామతియు నగుధ్రువుండు తరింపఁ దరముగానిదయిన సంసారమును దరింపఁజేయఁజాలిన దృఢమగు హరిస్మరణమును గోరుకొనెను. కుబేరుండది విని సంతోషపూర్వకముగా ధ్రువునకు వరం బొసంగి యతఁడు చూచుచుండఁగనే యంతర్ధానముచెందెను. ధ్రువుండును దన పురంబున కరిగెను. అనంతరము ధ్రువుండు పురోడాశాది ద్రవ్యములచేతను, ఋత్విజుల వ్యాపారములచేతను, ఇంద్రాదిదేవతలచేతను బ్రకాశితములును విస్తారములగుదక్షిణలు గలయాగములచేతను, కర్మములకుఁ దగినఫలం బిచ్చు నారాయణుని నారాధించెను. మఱియును సమస్తభూతములందు నంతరాత్మయై ధారకుఁడై కావుననే సర్వశబ్దవాచ్యుఁడై సత్త్వాదిగుణరహితుఁడై, యాశ్రితరక్షకుఁడై యున్నభగవంతునియందు నవిచ్ఛిన్నమగు భక్తిఁగలవాఁడయి ధ్రువుండు తనయందును సకలభూతములందును నంతరాత్మయై యున్నయాభగవంతుని సాక్షాత్కారము చేసికొనెను. ఓవిదురా! ప్రజలు సుస్వభావము కలిగి ధ్రు

హ్మణసేవాపరాయణుం డయి దీనులందు వాత్సల్యము గలిగి రక్షించుచు, ధర్మముల మర్యాదలు చెడకుండఁ గాపాడుచున్న ధ్రువునిఁ దండ్రినిగా భావించి సేవించిరి. ధ్రువుండు సుఖ మనుభవించి పుణ్యకర్మమును, దుఃఖ మనుభవించి పాపకర్మమును, నశింపఁజేసికొనుచు నిరువదియాఱువేలవత్సరంబులు భూమిని బరిపాలించెను. ఇట్లతఁడు సావకాశచిత్తుఁడయి బహుసంవత్సరములు గలిగి పెక్కుయాగము లొనరించుటచేఁ ద్రివర్గసాధనమయియున్న కాలమును గడపి కుమారునకు రాజ్యమొసంగెను.

ధ్రువుండు తపంబునకై బదరికావనంబున కేఁగుట.

అనంతరము ధ్రువుండు దేహము మాయాత్మక మగునీ ప్రపంచక మంతయు జీవునియందుఁ బ్రకృతిసంబంధమువలనఁ గలిగిన దనియుఁ, బ్రకృతిపరిణామరూపమైన దనియు, స్వప్నమందుఁ గానవచ్చు గంధర్వపురమునవలె నున్న దనియుఁ దలంచెను. ఆరీతిగా నే యతఁడు దేహము, భార్యలు, పుత్త్రాదులు, స్నేహితులు, చతురంగబలయుక్త మగుసైన్యము, ధనము, మనోహరము లగు విహారభూములు, జంబూద్వీపాత్మక మగుభూమండలము, స్థిరములు కావని నిశ్చయించి వానిని విడిచి విశాల మగుబదరికావనంబున కేఁగెను. ధ్రువుం డచ్చట విశాలమగు బదరికావనమందు నిర్మలమును బవిత్రము నగుజలమందుఁ దానమాడి, యింద్రియంబుల నియమించి, స్వస్తికము మొదలగు యోగాసనములచే వాయువును బంధించి, శ్రోత్రాదులగు నింద్రియంబుల నన్నింటినిమనస్సునొక్కచోఁ జేర్చుకొని, భగవంతునిదివ్యమంగళ విగ్రహమునందు మనస్సునుఁ బ్రవేశింపఁజేసెను. ఇట్లు చేసి భగవంతునికంటె విజాతీయ మగువస్తువు లేదనువిశ్వాసము కల

వాఁడయి భగవత్స్వరూపమును ధ్యానము సేయుచు సమాధి నవలంబించెను. ఇట్లు ధ్రువుండు ప్రతిదినమును భగవంతుని యందు భక్తిని వర్ధిల్లఁ జేసికొనుచు, నానందబాష్పధారలచేఁ దడియుచుఁ, బులకాంకురములు శరీరమందు వ్యాపింప, హృదయము సంద్రవింప, దేహాత్మాభిమానమును విడిచి యాత్మ మనస్సత్త్వాది ధర్మములలోఁ గానున్నట్లుగాఁ దలంపలేదు. ఇట్లుండఁ గొంతకాలమునకు నుదయించినపూర్ణచంద్రునివలె దనకాంతులచే దశదిక్కులను బ్రకాశింపఁజేయుచు నాకాశమునుండి భూమికిఁ దిగుచున్న యొకదివ్యవిమానమును బొడఁగాంచెను. తరు

(ధ్రువునకై పరమపదమునుండి విమానము వచ్చుట.

వాత నాలుగుభుజములు గలిగి, శ్యామలవర్ణముతో నొప్పుచు, యౌవనారంభవయస్సునందుండి యరుణపద్మములవంటి నేత్రములు కలవారయి, గదలను ధరించి, ప్రశస్తములగు వస్త్రములఁ దాలిచి, కిరీటముచేతను, ముత్యాలహారములచేతను, భుజకీర్తులచేతను, సుందరములగుమకరకుండలములచేతను, మిగుల నొప్పారుచు విమానాగ్రమున వెలయునిరువురు దేవతాశ్రేష్ఠుల నతఁడు చూచెను. ఇట్లు చూచి ధ్రువుండు వారిని నారాయణమూర్తికింకరులనుగా నెఱింగి, భయసంభ్రమములు మనంబునఁ బెనఁగొనుటచేఁ బూజాక్రమమును మఱచి, భగవంతుని నామములను మాత్రమే పఠించుచు దోసిలిబంధించి వారికి నమస్కరించెను అంత భగవంతునికిఁ బ్రియభటులగు నందసునందులిరువురును. విష్ణుపాదపద్మములందుఁ దనచిత్తము నుంచి వినయసూచకముగా మెడను వంచి నమస్కరించినధ్రువునిఁ గాంచి మందహాసము సేయుచుఁ, బ్రీతిపూర్వకముగా నిట్లు పలికిరి. "ఓ

రాజా ! నీకు శుభమగుఁ గాక. నీకు భద్రమగుఁగాక. సావధానుండవయి నా వాక్యంబుల వినుము. నీ వయిదేండ్లప్రాయము గలిగినప్పుడు తపంబునచే భగవంతుని మెప్పించితివి. జగదాధారకుఁ డగు నా భగవంతుని సేవకులము. నిన్ను భగవత్పదమునకుఁ గొనిపోవుటకయి వచ్చినారము. ఓ మహాత్మా ! నీ వన్యులచే సాధింపఁ గరాంబు కాని విష్ణుపదమును సాధించితివి. అందఱకంటెను మీఁదుగా నున్న సప్తమహర్షులుగూడ నాపదమును బొందలేక చేయునది లేక చూచుచున్నారు. మఱియుఁ జంద్రాదిగ్రహంబులును నక్షత్రంబులును నా పదమునకుఁ జుట్టును దిరుగుచుండును. భగవద్భక్తులకు శాంతులై శమదమాది గుణములతోఁ గూడికొని, దేహము ప్రకృతిపరిణామ మనియు, నాత్మ జ్ఞానస్వరూపమనియు, భగవంతుఁడు సర్వాంతర్యామి యనియుఁ దలంచుచుఁ గావున నే. తగువిధముగా దానమానాదులచే సకలభూతముల సంతోషింపఁ జేయుచు, సిద్ధప్రాయులయియున్న వా రాపదమును సులభముగాఁ బొందుదురు. ఓ విదురా ! భగవంతుని ప్రాప్యునిగాను బ్రాపకునిగాను సాధారముగాను దలంచుచున్న ధ్రువుఁడు ముల్లోకములకును స్వచ్ఛమగు చూడామణివంటివాఁ డాయెను. బంధింపఁబడిన గోమహిషాదులు సస్యముల భక్షింపనెంచి మహావేగముతోఁ గట్టుస్తంభంబు చుట్టును దిరుగుచందంబున సూర్యచంద్రాదినక్షత్రముల సమూహము లా ధ్రువమండలంబుచుట్టును నిత్యంబును బరిభ్రమించుచుండును. నారదుఁడు వీణ వాయించుచు బ్రహ్మసత్రయాగమందు భగవంతునిమాహాత్మ్యమును గూర్చి ప్రసంగము వచ్చినప్పుడు ధ్రువుని మహిమను దెలుపు మూఁడు శ్లోకములను

గానము చేసెను. ఆశ్లోకములయర్థమును వివరించెద వినుము. "ఓ మహాత్ములారా! పతివ్రతయగుసునీతికి మారుఁడగు ధ్రువుఁడు చేసిన తపంబునకుఁ బ్రాప్తమగుపదవిని బొందుటకు వేదవాదులగు మునీశ్వరులయినను సమర్థులుకారు. అట్లుండ రాజులు సమర్థుల గుదురని చెప్పఁదగియుండునా? ఆధ్రువుఁడు సవతితల్లి యగు సురుచివాక్యము లనెడిబాణములచే భేదింపఁబడి, కావుననే మిగుల బాధనొందుచునై దవసంవత్సరముననే వనంబునకుఁబోయి నా యాజ్ఞానుసారంబుగాఁ దపంబుచేసి వశుండుగాని వాఁడయినను, భూతమైత్ర్యాదిగుణంబులచే భగవంతుని వశము గావించుకొని యుత్తమపదంబును జెందెను, భూమియందేరాజయినను మనంబుచేతనైనను నాపదమును బొందవలెనని తలంపలేఁడు. అది యైదాఱువత్సరంబుల కాలములోనె వైకుంఠమును బొందించును" అనిచెప్ప విని యచ్చటివా రాశ్చర్యము నొందిరి. ఓవిదురా! సజ్జనులకు సమ్మత మయి, యధికకీర్తి గలవాఁడయిన ధ్రువునిచరిత్రంబును నీవడిగితివి. కావున దానినిఁ బూర్తిగాఁ జెప్పితిని. ఓరాజా! ఆపదమును నీజనకాదులు గాని యితరులు గాని యిదివఱకెప్పుడు నధిష్ఠించి యుండలేదు. కావుననే యది సర్వలోకములకును వందనీయమయినది. అది విష్ణుసంబంధియైనది. అది సర్వోత్కృష్టమయినది. అట్టియుత్తమస్థానమును నీ వధిష్ఠింపుము. ఓమహానీయా! ఈ విమానము భగవంతునిచే నీనిమిత్తమంపఁబడినది. కావున నీ వీవిమానాగ్రమునందుఁ గూర్చుండ నర్హుండవు" అని పలికిన నందసునందులమధురవాక్యంబు లాలకించి భగవంతునికిఁ బ్రియుఁడయినధ్రువుండు స్నానము గావించి నిత్యకర్మముల నెఱవేర్చుకొని యలంకరించుకొని మును

లకు నమస్కరించి యాశీర్వాదములఁ బొందెను. అనంతర మ
తండు విమానాగ్రమును బూజించి దానిఁ జుట్టును దిరిగి నమ
స్కరించి నందసునందులపాదములకుఁ గూడ వందనము లర్పించి
హిరణ్మయరూపమును దాల్చి దాని నధిష్ఠింప నిచ్ఛగించెను.
ఆసమయంబున దేవదుందుభులు మొరసెను. ఇంకను వాద్య
విశేషము లగుమృదంగాదులు వాయింపఁబడెను. గంధర్వాదులు
గానముచేసిరి. పుష్పవర్షములు కురిసెను. అప్పుడు ధ్రువుఁడు
స్వర్గలోకము నధిష్ఠింపఁ దలంపుగొని దీనురా లగుతల్లిని విడిచి,
దుర్గమ మగుస్వర్గమునుగుఱించి పోవుచున్నానని తల్లిని స్మరిం
చుకొనెను. అంత నందసునందు లాతనియభిప్రాయము నెఱింగి
విమానముచేఁ బోవుచున్నసునీతి నతనికిఁ గానవచ్చునట్లు చేసిరి.
అతఁ డందులకు సంతసించి విమానముచేఁ బోవుచు మార్గమం
దచ్చటచ్చట విమానారూఢు లయినదేవతలు తన్నునుతించుచుఁ
దనపైఁ గుసుమవర్షములు గురియఁజేయుచుండఁగా నాదిత్యాది
గ్రహములస్థానములను గ్రమముగాఁ జూచెను. ఇట్లు ధ్రువుఁడు
నందసునందాదులచే నడిపింపఁబడుచున్న విమానముచేఁ బో
వుచు ముల్లోకములను, సప్తర్షులను సైతమతిక్రమించి యున్న
దియు కల్పాంతపర్యంతముండెడిదియు నగు విష్ణుపదమును
బొందెను. ఆపదము స్వీయకాంతులచేఁ బ్రకాశించుచున్నది.
దాని కాంతిచేతనే ముల్లోకములును బ్రకాశించుచున్నవి.
అది నిష్కరుణులచేఁ బొందఁ దరముకానిది. సర్వభూతము
లందును మైత్రిగలిగి వర్తించువారికిఁ బొందఁదగినది. ఆధ్రు
వచరిత్రము, వినువారికి ధనమును సంపాదించిపెట్టును; మ
హాయశంబు నార్జించును; ఆయుర్దాయము నిచ్చును. అది మంగ

శప్రదమైనది. ఇది స్వర్గమును సంపాదింప సమర్థమైనది. అది ధ్రువస్థానమును బొందింపఁగలదు. అది మనఃపీడను నివారించును; అది ప్రఖ్యాతిని గలిగించును. అది సమస్తపాపములను తొలఁగించును. ఈధ్రువచరిత్రము నెవరు మాటిమాటికిని శ్రద్ధతో విందురో వారి కాధ్యాత్మికాదు లగు తాపములను నశింపఁజేయుభగవద్భక్తి జనించును. ఆచరిత్రమును వినువారికి సంపద అకంటె గొప్పతనమును దాని సంపాదించుసామయమును లభించును. మఱియు వారికి శీలాదిగుణములును తేజంబును గౌరవంబును సంప్రాప్తమగును. శ్రద్ధాళుఁడై పురుషుఁ డీధ్రువచరిత్రమును ప్రాతఃకాలమందును, సాయంసమయంబునను, బ్రాహ్మణసభలందుఁ బున్నమయందును, అమావాస్యయందును, శ్రవణనక్షత్రయుక్తమగు దినమందును, సంక్రమణములందును, ఆదివారమునందును, సప్తమియందును జదువుచుండవలెను. నిష్కాముఁడయిన భగవద్భక్తుండు శ్రద్ధాయుక్తులగు వారి కీచరిత్రమును వినిపింపవలెను. అట్లు నిష్కామముచే వినిపించువాఁడు స్వయముగా సంతుష్టుఁడగును. వాఁడట్లు చేసినచో వానిఁ జూచి భగవంతుండు కూడ సంతోషించును. తత్త్వజ్ఞాన మెఱుంగనివానిని భగవన్మార్గమందుఁ బ్రవేశింపఁ జేసి జ్ఞాన మొసంగిన మహాత్ముని దేవత లందఱును ననుగ్రహింతురు. ఓవిదురా! ఎవఁడు చిన్నతనంబుననే తల్లిని, గ్రీడాసాధనములనువిడిచి, విష్ణువును శరణుపొంది లోకమందుఁ బ్రసిద్ధుఁడై పుణ్యాత్మపరుండాయెనో యాధ్రువుని చరిత్రము నీకుఁ బూర్తిగాఁ జెప్పితిని. ఇది పండ్రెండవయధ్యాయము.

ఓపరీక్షిన్మహారాజా ! మైత్రేయునిచే వర్ణింపఁబడిన ధ్రువ చరిత్రమును విని భగవంతునియందు భక్తిభావమును వృద్ధిచేసికొన్న విదురుండు మఱికొన్ని వృత్తాంతంబులఁదనకుఁజెప్పవలసినదని యడుగ నారంభించెను. ఓమునీంద్రా ! నారదుఁడు ప్రచేతసుల సత్రమునందు ధ్రువమహిమను వర్ణించె నని చెప్పితివి. ఆప్రచేతసు లెవ్వరు ? ఎవని పుత్త్రులు? వా రెవరికులమందుఁ బ్రఖ్యాతులైరి ? వా రెక్కడ సత్రయాగమును జేసినారు ? ఎవఁడు పంచరాత్రాదులగు నాగమముల నుపదేశించి శ్రీహరి పూజావిధానము నంతను దెలియఁజేసెనో యానారదుండు భగవద్భక్తుఁడనియు, భగవంతుని బ్రత్యక్షముగాఁ గనఁదగిన శక్తి గలవాఁడనియు నెఱుంగుదును. మఱియు నా నారదునిచేతనే తమతమ వర్ణాశ్రమములకుఁ దగినధర్మముల నాచరించి వానిచేతనే యజ్ఞభోక్తయగు భగవంతుఁ డారాధింపఁదగినవాఁడని చెప్పఁబడియె. మహానుభావుఁడగు నట్టి నారదునిచేఁ బ్రచేతసులసత్రమందు వర్ణింపఁబడిన కథల నన్నింటిని వినఁ గుతూహలపడుచున్న నాకుఁ బూర్తిగాఁ జెప్పుము' నావుడు మైత్రేయుం డి ట్లనియె. 'ఓవిదురా! ధ్రువునకు ఉత్కలుఁ డనుపుత్త్రుఁడు కలఁడని చెప్పితిని. ఆయుత్కలుఁడు తనతండ్రి యగు ధ్రువుండు వనంబున కరిగినపిమ్మటఁ దనకుఁ బ్రాప్త మయినసార్వభౌమ సంపదలను సింహాసనమును జేకొన నిష్టపడ లేదు. అతఁడు పుట్టినది మొదలు రాగద్వేషాదులకు మనమందెడమీయక యున్నవాఁడు. కావుననే రాగులై వర్తించువారితో స్నేహము చేయ లేదు. మఱియు నతఁడు సమదర్శియై యాత్మకు శరీరభూతమైన లోకమును నట్టిశరీరములకు ధారకుండయిన యాత్మను,విమర్శించి

చూచెను. అతఁడు ప్రత్యగాత్మను బ్రహ్మశబ్దవాచ్యునిఁగాను సుఖ
స్వరూపునిఁగాను, దేహాదులు లేనివానిఁగాను జ్ఞానరసమే స్వభా
వముగాఁ గలవానిఁగాను, ధర్మభూత మగు నానందగుణము గల
వానిఁగానుఁ దలంచి స్వస్వరూపజ్ఞానము ననుసంధించుకొనుచు,
దత్త్వజ్ఞాన మనెడియగ్నిచే సమస్తకర్మబంధములను దహింపఁ
జేసికొని తాను దేహాదులకు విలక్షణుఁడని యెఱిఁగి, యాత్మ
స్వరూపముకంటె నన్య మగు దాని నొల్లకుండెను. అతఁడు జడుని
వలెను, చెవిటివానివలెను, వెఱ్ఱివానివలెను, మూఁగవానివలెను,
గానవచ్చుచున్నను బుద్ధివిశేషముచే వారలను బోలక మంటలు
లేని యగ్నివలెఁ బ్రకాశించుచుఁ దనమాహాత్మ్యమును వెల్లడిం
పక ప్రవర్తించుచుండెను. మంత్రులును గులవృద్ధులును నట్టి
యుత్కలునిఁ జూచి జడునిగాను, వెఱ్ఱివానిఁగాను దలంచి వాని
విడిచి భ్రమికుమారుఁడయి యుత్కలునికన్నఁ జిన్నవాఁడయి
యున్నవత్సరుని రాజుఁగా జేసిరి. ఆవత్సరునికి సర్వర్ధియను స్త్రీల
లామ ప్రియభార్య. అతఁ డామెయందు పుష్పార్ణుఁడు, తిగ్మకే
తుఁడు, ఇషుఁడు, ఊర్జుఁడు, వసువు, జయుఁడు, నాఁబడు నార్వు
రఁ బుత్త్రులం బడసెను. అపుష్పార్ణునకుఁ బ్రభ యనియు దోష
యనియు నిరువురుభార్యలు కలరు. అందుఁ బ్రభ యనుభార్యకుఁ
బ్రాతర్మధ్యందినసాయము లనునామములుగల మువ్వురు కుమా
రులు కలిగిరి. రెండవభార్య యగు దోషకుఁ బ్రదోషుఁడనియు,
నిశీథుఁడనియు, వ్యుష్టి యనియు, మువ్వురుపుత్త్రులు పుట్టిరి.
వారిలో వ్యుష్టియనువానికిఁ బుష్కరిణియనుభార్యయందు సర్వతే
జనుఁడనుకుమారుఁడుదయించెను. సర్వతేజనునకు నాకూతి యను
భార్యయందుఁ జక్షుస్సంజ్ఞ గల మను వనుకుమారుండు వొడమె.

ఆమనువునకు నడ్వల యనుభార్య గలదు. అతని కానడ్వలయందు, ఋరుఁడు, కుత్సుఁడు, త్రితుఁడు, ద్యుమ్నుఁడు, సత్యవంతుఁడు, ఋతుఁడు, వ్రతుఁడు, అగ్నిష్టోముఁడు, అతిరాత్రుఁడు, ప్రద్యుమ్నుఁడు, శిబి, యుల్ముకుఁడు, నాఁబడు పవిత్రు లగుపన్నిద్దఱు పుత్త్రులు గలిగిరి, వారిలో నుల్ముకుఁడు పుష్కరణి యనుభార్యయందు, అంగుఁడు, సుమనసుఁడు, స్వాతి, క్రతువు, అంగిరసుఁడు, గయుఁడు, నాఁబడు నార్వుర నుత్తమకుమారులం గనియెను. వానిలో నంగుఁడు సునీథ యనుభార్యయందు వేనుఁడను పేరు గల దురాత్ముఁడగుపుత్త్రునిఁ బడసెను. కాని యాభూపాలుఁడు కుమారుఁడగు వేనుని దుష్టస్వభావమును జూచి మిక్కిలి దుఃఖించి, పురమునుండి వెడలిపోయెను. ఓవిదురా! వజ్రాయుధమువంటి వాక్కులు గలమును లతని దుష్టస్వభావమును జూచి సైఁపఁజాలక శపించిరి. ఆశాపమువలన వేనుఁడు మృతి నొందెను. ఆసమయమున రాజు లేకపోవుటచే దొంగలు చెలరేఁగి ప్రజలను బాధించి వారివస్తువులను నపహరింపఁ జొచ్చిరి. అప్పుడు మునులు వేనుని దక్షిణకరమును మథింపఁగాఁ బృథు రాజు నారాయణాంశముచే జన్మించె ననెను. అదివిని విదురుండు మైత్రేయున కిట్లనియె. 'ఓమైత్రేయా! సుస్వభావుఁడును, సజ్జనుఁడును బ్రాహ్మణభక్తిగలవాఁడును, మహాత్ముఁడు నగునంగభూపాలునకుఁ దండ్రికి గోఁత పుట్టించునంతటి దుష్టత్వము గలకుమారుఁ డెట్లుగాఁ బుట్టెను? అసాధువుల శిక్షింప వ్రతముఁ బూనిన వేనునియం దెట్టి యపరాధమును జూచి ధర్మకోవిదు లగుమునులు శపించిరి ? రాజు దిక్పాలురయంశంబువలన జన్మించి ప్రజలఁ బాలించును. అట్టిరాజు పాపాత్ముఁ డయినను జంపఁదగినవాఁడు కాఁడే? నీవు

ప్రకృతి పురుషేశ్వరుల తత్త్వ మెఱిఁగిన వారిలో నుత్తముఁడవు. కావున నీవు, భక్తుఁడనై శ్రద్ధ గలవాఁడనై యున్న నాకు సునీథా పుత్త్రుఁ డగు వేనుని చరిత్రమును వివరించి చెప్పుము' అని పలుకుచున్న విదురుని వాక్యంబులు విని మైత్రేయుం డి ట్లనియె.

మైత్రేయుండు విదురునకు వేనుని చరిత్రమును చెప్పుట

ఓ విదురా! అంగభూపాలుఁడు యాగములలో నుత్తమ మయిన యశ్వమేధమును నారంభించెను. ఆయాగమందు వేదాధ్యయన సంపన్నులగు ఋత్విక్కులచేఁ బిలువఁబడియుఁ దేవతలు హవిర్భాగములనిమిత్తము రాలేదు. అది చూచి యచ్చెరువంది ఋత్విజు లంగభూపాలునిఁ జూచి యి ట్లనిరి. "ఓ రాజా! నీవు దేవతలనిమిత్త మొసంగిన హవిర్భాగములను నాయా దేవతలు వచ్చి గ్రహింపలేదు. ఆహవిర్ద్రవ్యములు నిర్దుష్టములైనవే? అవి నీచేత శ్రద్ధచే సంపాదింపబడినవే? యాగాంగము లగు మంత్రములుగూడ స్వరయుక్తముగా నక్షరలోపములు లేకుండ నుచ్చరింపఁబడినవే. ఋత్విజులుకూడ మంత్రోచ్చారణమందు మిగుల సామర్థ్యము కలవారే. ఇట్లు భక్తిశ్రద్ధలచేఁ జేయఁబడుచున్న క్రతువునందు దేవతలనిమిత్తము రవంతయేని యపరాధంబు చేసినట్లు తెలియఁగము. యాగాదికర్మములందు గుణదోషములఁ జూచునట్టి దేవత లే కారణమున స్వకీయభాగముల స్వీకరింపకున్నారో తెలియకున్నది. కాని మఱియెవ్వరిచేతనైనను దేవహేళనము చేయఁబడి యుండును. లేనిచో నిట్లు జరుగదు. ఆహేళన చేసినవారిఁ దెలిసికొనము" అని ఋత్విజులు పలుకుచున్న వాక్యంబు లాలకించి మిక్కిలి దుఃఖించి యంగభూపాలుఁడు యాగమందు మౌన మవలంబించినవాఁ డయ్యెను సదస్యుల

యాజ్ఞానుసారముగా మౌనమును విడిచి యచ్చటసభాసదులం జూచి దేవతలు రాకుండుటకుఁ దగినకారణము నడుగ నిట్లనియె. 'ఓ సభాసదులారా ! ఈయాగమునందు దేవతలు వచ్చి సోమపాత్రములఁ గొనకుండుటకుఁ గతంబేమి? దేవతలకు నేనేమి యపరాధము చేసితిని? మీరు చెప్పవలయును' నావుడు సభాసదులతని కిట్లనిరి. 'ఓరాజా! నీవీజన్మమునఁ బాపమును గొంచెమేనియుఁ జేయలేదు. కాని పూర్వజన్మంబున నీవు చేసిన పాపమొకటికలదు.అందుచేతనే గుణాధికుఁడవైనను నీకు సంతానము లేదు. నీ వపుత్త్రుఁడ వగుటచే దేవతలు వచ్చి యజ్ఞభాగంబులఁ గొనలేదు. కావున నిప్పుడు పుత్త్రకామేష్టిని జేయుము. యజ్ఞభోక్త యగుభగవంతుఁడు నీకుఁ బుత్త్రు నొసంగును. నీవు శ్రీహరినే పుత్త్రునిగాఁ గోరితివి కావున సకలదేవతలతో నతఁడు వచ్చి తన భాగంబును జేకొనును. దేవతలును దమతమ యాగభాగంబులం దప్పక చేకొందురు. ఇట్టి తుచ్ఛవరంబుల నారాయణుం డిచ్చునా? యని సందియమంద నవసరంబులేదు. ఏజనుఁ డేప్రకారముగాఁ దన్ను నారాధించునో వాని కాయావరంబులను హరి తప్పక యొసంగును.'' అనువాక్యంబులను విని ఋత్విజు లంగరాజునకుఁ బుత్త్రుఁడు సంభవించునిమిత్తము యజ్ఞరూపుఁ డగువిష్ణువునకుఁ బురోడాశము నొసంగిరి. అంతఁ గనకమయము లగుస్వచ్ఛవస్త్రముల ధరించినపురుషుఁ డొకఁడు సువర్ణపాత్రముచే నెన్నగాఁ బక్వ మయినపాయసాన్నమును స్వీకరించి యగ్నిగుండమునుండి బయలు వెడలి వచ్చెను. అప్పుడు బుద్ధిమంతుఁ డగునంగరాజు బ్రాహ్మణుల యనుజ్ఞ నొంది దోసిలి బంధించి పాయసమును గ్రహించి

తాను స్వయముగా నాఘ్రాణించి సంతోషభరితుం డయి తన భార్య కొసంగెను. అంత సునీథ పురుషునిఁ గలిగించునట్టియాపా యసమును భుజించి పతియనుగ్రహమువలన గర్భమును ధరించి నెలలు నిండినతోడనే కుమారు నొక్కని గాంచెను. అబా లుఁ డధర్మాంశమువలన నుద్భూతుఁడగుటచే బాల్యమునుండి యు నధార్మికుఁ డాయెను. ఒకనాఁ డంగరాజకుమారుఁ డగు వేనుఁడు విల్లెక్కువెట్టి, వేఁటకాఁడై, వనమందు సంచరిం చుచుఁ గ్రూరుఁడయి, దీనము లయినమృగములను జంపెను. అట్లు, చంపుచున్నవానిఁ జూచి జను లందఱును భీతు లయి 'ఇదిగో వేనుఁడు వచ్చుచున్నాఁ' డని యఱవఁ జొచ్చిరి. మఱియు వేనుఁడు క్రీడాస్థానమునందు విహరించుబాలురను స్నేహితులను బలాత్కారముచేఁ బట్టుకొని క్రూరుఁ డయి దయారహితుఁ డయి, పశువులను జంపినవిధమునఁ జంపెను. అంగరాజు దురా త్ముఁ డగుకుమారునిఁ జూచి నానావిధము లయినయుపాయము లచే వాని మంచిమార్గమును ద్రొక్కింపఁ జూచెను; కాని ప్రయో జనము లేకపోయెను. అంత నంగుఁడు దురాత్ముఁ డగుకుమా రుని దుష్టవర్తనము మాన్పింప సమర్థుఁడు కాని యప్పుడు మిక్కిలి దుఃఖించుచు నిట్లనుకొనెను.'ఏలోకములో నెవరుసంతా నము లేనివారో, యెవరు దుష్టు లగుపుత్త్రులవలన దుర్భరమగు దుఃఖంబునుబొందరో, వారు పూర్వజన్మమున భగవంతు నెక్కు డుగాఁ బూజించి పుణ్యవంతులయి యుందురు. ఎవనివలన నరుల కు నపకీర్తియు నధర్మమును సంభవించుచున్నవో, యెవనివలన నందఱతోను విరోధమును నపార మయినమనోవ్యథయు సంప్రా ప్తమగుచున్నవియో, యేపనివలన ననేకులు క్లేశములను బొందు

చున్నారో తనకు మోహముచే బంధనము కల్పించు నాదుష్టపు త్రునిఁ బండితుఁడెవఁడు లెస్సఁగా మన్నించును? ఆలోచింపఁగా గ్రమక్రమమున మోహముకలిగించి సంసారదుఃఖంబుగలిగించు మంచిపుత్రునికంటె గృహములను దుఃఖభాక్కులఁగాఁ జేసి మర్త్యులకు సంసారముమీఁదరోతపుట్టించు దుష్టపుత్రులే శ్రేష్ఠులని తలంచెదను. మోహము కలిగించు పుత్రులకంటె వైరాగ్యము గలిగించువారే యుత్తములు కదా?" అని యిట్లంగరాజు మిగుల నిర్వేదమునొంది యర్థరాత్రమందు నిద్రనుండి లేచి, నిద్రించుచున్నసునీథను విడిచి యెవ్వరికిని గానరాకుండఁబలువిధములగు సంపదలచేఁ దులదూఁగుగృహంబునుండి బయలుదేఱి వనంబునకుఁ బోయెను. అనంతరము పురోహితులు మొదలగువారును, ప్రజలును దమప్రభువు వైరాగ్యమును బొందినవానిగాఁ దెలిసికొని యందులకు మిగుల దుఃఖితులయి భయమునొందుచు భూమియందు వెదక నారంభించిరి; కాని కుత్సితయోగులు తమహృదయమం దుండిన పరమపురుషునిఁ గనుఁగొనలేని చందమున నాసమీభూములందే వర్తించుచున్నను రాజును దెలిసికొనలేక పోయిరి. తరువాతఁ బురోహితాదులు ప్రభువుజాడలను దెలిసికోలేక విఫలప్రయత్నులయి విడుచుచు నొకచో సంఘముగా నున్నఋషులను బొడగాంచి నమస్కరించి ప్రభువు కానరాలేదని విన్నవించుకొనిరి. ఇదిపదుమూఁడవయధ్యాయము

అంత లోకములకు క్షేమముగోరుచున్న భృగ్వాదులగు మునులందఱును, బ్రజలను బరిపాలించురాజు లేకపోవుటచేఁ బ్రజలందఱును బశుసామ్యమును బొంది విచ్చలవిడిఁ జరింతురని తెలిసి

వీరమాతయగు సునీథకు నావృత్తాంతమును దెలిపి మంత్రిమొదలగువారికసమ్మతుఁ డయినను వేనుని భూమికి రాజుఁగా జేసిరి.

—వేనునికి మునులు పట్టము గట్టుట—

ఇట్లు భయంకరముగ శిక్షించువేనుఁడు సింహాసన మెక్కి రాజ్యముఁబాలించుచున్నట్లు తెలిసికొనిచోరులు మొదలగువారు పాములకు భయపడుచున్న యెలుకలవలె దాఁగఁజొచ్చిరి. అంత సింహాసనాసీనుం డగు వేనుండు లోకపాలురయైశ్వర్యములవంటి యైశ్వర్యములు గలవాఁడగుటచే మిగుల గర్వించి జ్ఞానహీనుం డయి తన్నుఁ దాఁ బొగడికొనుచుఁ దన్ను మహాబుద్ధిమంతునిఁగాను మహాభాగ్యవంతునిఁ గాను దలంచుకొనెను. ఇట్లు వేనుం డైశ్వర్యమదముచే బుద్ధిహీనుఁ డై నిరంకుశమగు మదగజమువలె నూర్ధ్వగమనముగలరథము నధిష్ఠించి భూమ్యాకాశములు చలించునట్లు తిరుగుచు, "ఓబ్రాహ్మణులారా! యాగములఁ జేయరాదు. హోమాదులను జేయరాదు. దానములఁ జేయరాదు" అని యన్నిచోట్లను భేరీధ్వనులతోఁ జాటించి సమస్తధర్మములను నివారింపఁజేసెను. యాజ్ఞికులయినభృగ్వాదిమును లొక్కచోఁ గూడికొని దుష్టుఁ డగువేనునిచేష్టలను జూచి యతనివలన లోకులకు సంప్రాప్త మగుచున్నదుఃఖంబునుగూడ విమర్శించి దయతో నిట్లు పలికిరి. "అకటా; రెండుకొనలందును మండుచున్నకాష్ఠంబునకు మధ్యంబున నున్నపిపీలకాదులకు రెండువైపులనుండియు భయంబు సంప్రాప్తమగుచున్నట్లు లోకులకిప్పుడు చోరులవలనను బరిపాలించెడిప్రభువువలనను భయంబు సంభవించుచున్నది! దేశ మరాజకమయియుండినఁ బ్రజలకుఁ జోరాదులవలన బాధ గలుగునని యూహించి మేము రాజ్యం

బునకుఁ దగనివాఁ డయినను వేనుని రాజాసన మెక్కించితిమి! ఇట్లుండ నిప్పుడు రాజువలనఁగూడ లోకులకుఁ గష్టములు కలుగుచున్నవి. ప్రజలకింక నెట్లుగా సుఖంబు గలుగును? మఱియుఁ బామునకుఁ బాలు వోసి పెంచినను నది పోషకునకు హాని నేచేయును. దుష్టజంతువగు దానిస్వభావ మదియ. అట్లె సునీథకడుపునఁ బుట్టినవేనుఁడు స్వభావముచేత నే దురాత్ముఁడయినను మన మతనిని రాజుగాఁ జేసితిమి. ఇప్పు డతఁడు తనక్రూరత్వమువదలక ప్రజలను జంప నిష్టపడుచున్నాఁడు. అయిన మన మతనిని జక్కనిమాటలచేఁ బ్రార్థింతము. ఆమాటల నతఁడు విననిచో మన మెట్లుగా నతని శిక్షించినను నందువలన మనకుఁ బాతకంబు సంప్రాప్తము కాదు. మనము వానిదుష్టచేష్టలను జక్కఁగా నెఱిఁగియు దురాత్ముఁ డగువానినిఁ బ్రభువునుగాఁ జేసితిమి! మనము రాజునుగా జేయుటచేత నే యతఁడు భూతములకు ద్రోహము చేయుచున్నాఁడు. మనమూలముగా భూతములకు బాధలు సంభవించినవి. మనము వీనిని రాజత్వమునుండి మఱలించితిమేని భూతద్రోహమువలన జనించినపాపము మనకుఁ గలుగదు. ఇట్లు మనము ప్రార్థించినను దురాత్ముఁ డయినవేనుఁడు మనప్రార్థనమును గై కొనకున్నచో లోకాపవాదయను నగ్నిచేత నే మిక్కిలిదగ్ధుఁడయియున్నవానిని మనతపోబలాగ్నిచే దహింతము'' అని ఇట్లు నిశ్చయించుకొని మునులందఱును గోపము తెలియకుండునట్లు లతనిపాలికరిగి సామవచనములచేఁ బ్రార్థనాపూర్వకముగా నిట్లు పలికిరి.

మునులు వేనునికడ కేఁగుట.

'ఓరాజా! నీయాయువును, సంపదలను, బలమును, కీర్తిని, వర్ధింపఁజేయ నెంచి చేయుచున్న మా విజ్ఞాపనము సావధానచిత్తుం

డవయి వినుము. ఓభూపాలా! మనోవాక్కాయకర్మములచే నొనర్చినయీశ్వరారాధనరూపధర్మము లోకులను దుఃఖంబులేనివారిఁగాఁ జేయును. ఆధర్మము విరక్తులకు నక్షయమగు మోక్షసుఖంబును గలిగించును. ఓవీరా! సరాగులకు లోకసుఖమును, విరాగులకు మోక్షసుఖంబును నొసంగు నీశ్వరారాధనరూపధర్మంబును నశింపఁ జేయరాదు. అట్లు చేసినచో నృపాలునియైశ్వర్యము పూర్తిగాఁ దొలంగును. ఓరాజా! దుష్టులయిన మంత్రిమొదలగువారివలననుఁ జోరాదులవలనను భయంబు గలుగకుండఁ బ్రజలను బాలించువాఁ డీలోకంబుచేఁ బూజింపఁబడుచుఁ బరలోకంబునందుఁగూడ సుఖంబు లనుభవించును. ఓమహాత్మా! ఎవ్వని దేశమందును, బురమందును, నున్న నాలుగువర్ణములవారును, నాలుగాశ్రమములవారును, తమతమ వర్ణాశ్రమాచారధర్మములచేతను యజ్ఞభోక్తయును బ్రభువు నగుభగవంతు నారాధించుచుందురో, ప్రజలపాలనరూపకర్మమందు జాగరూకుఁ డగునయారాజును జూచి సర్వాత్ముఁడును జగత్కారణుఁడును నగుభగవంతుఁడు సంతోషించును. బ్రహ్మాదులకుఁ గూడఁ బ్రభు వయినభగవంతుఁడు సంతుష్టినిఁ జెందినచో లోకపాలురతోఁ గూడినలోకము లన్నియు నాదరము కలవయి భగవత్తోషకుఁ డయినవానికొఱకుఁ బూజల నిచ్చుచుండును. వారికిఁ బొందరానివస్తువేది కలదు? మఱియు సర్వలోకములను, లోకపాలురను దేవత్వముఁ బొందించు యజ్ఞములను నియమించుచు, ధర్మాధర్మములఁ దెలుపువేదమే స్వరూపముగాఁ గలిగి యాగస్వరూపుఁ డయి తపస్స్వరూపుఁడయి యున్నభగవంతుని నీసంపదలనిమిత్తము పూజించుచున్న స్వదేశజ

నుల ననువర్తింపఁ దగుదువు. మఱియు నీదేశమందుఁ గల బ్రాహ్మణాదులు నిరంతరము చేయుచున్న యాగములచేత భగవంతునికి శరీరభూతు లగు నింద్రాదిదేవతలు యథావిధిగా నర్చింపఁబడినవారై సంతసించి యిష్టవరంబుల నిచ్చుచుందురు. అట్టిదేవతలను నీవు హేళనచేయుట తగదు" అని యిట్లు మునులు విజ్ఞానము చేయఁగా విని వేనుం డిట్లనియె. "ఓమునులారా! మీ రందఱు నిశ్చయముగా బుద్ధిహీనులు. మీ ధర్మమును ధర్మముగాఁ దలంచుచున్నారు. మీవంటివా రన్నాదుల నిచ్చి రక్షించురాజును విడిచి యితరుని భజించుచున్నారు. కావున మీరు ధర్మమార్గమును విడుచుచున్నారు. ఏమూఢులు రాజరూపమున నున్న యీశ్వరుని హేళనము చేయుదురో, వారిలోకమందును బరలోకమందును సుఖములఁ బొందక దుఃఖంబునే పొందుదురు. కుత్సితస్త్రీలు నిజభర్తయందుఁ జూపఁదగిన భక్తిని జారభర్తయందుఁ జూపుచుందురు. అట్లే మీరుకూడ బ్రభువగు నాయందు భక్తియుంపక యెవఁడో యజ్ఞపురుషుఁడని వానియందు భక్తిని చూపుచున్నారు. ఆయజ్ఞపురుషుఁ డనఁగా నెవఁడు? నిగ్రహానుగ్రహసమర్థు లగు విష్ణువును, బ్రహ్మయు, నీశ్వరుండును, శంకరుఁడును, నింద్రుఁడును, వాయువును, యముఁడును, సూర్యుడును, మేఘుఁడును, కుబేరుఁడును, చంద్రుఁడును, భూమియు, నగ్నియును, వరుణుఁడును, నింకను దక్కుఁగల దేవతలును రాజుదేహమందు నివసించుచుందురు. కావున రాజే సర్వదేవమయుఁడని చెప్పవచ్చును. అందువలన నోవిప్రులారా! మీరు మచ్చరమును వెలిఁబుచ్చి నన్నే పూజింపుఁడు. నాకే బలుల నర్పింపుఁడు. నాకంటె నారాధ్యుఁ డగు పురుషుఁ డెవ్వఁడు గలండు? " అని

యిట్లు విపరీతబుద్ధియునుఁ బాపాత్ముఁడును, దుష్టమార్గగామియు
నగు వేనుండు ప్రార్థితుండయ్యును,మునులప్రార్థనమును దిరస్కరించి
మంగళభ్రష్టుఁడాయెను.ఓవిదురా! ఇట్లు తన్నుఁ బండితునిఁగాఁ
దలంచుకొను వేనుఁడు తమ్ముఁ దిరస్కరింపఁగా మునులు లోక
ములకు మంగళప్రదంబగు తమప్రార్థనము వ్యర్థమైనం జూచి య
తని మిగులఁ గోపించిరి. అప్పుడు మునులు "ఈవేనుఁడు స్వభా
వముచేతనే క్రూరుఁడు. కావుననే పాపకార్యములకు వెఱవఁడు.
వీఁడుజీవించుచు లోకమును నిశ్చయముగా బూడిదగాఁ జేయుచు
న్నాఁడు. వీఁడు చచ్చుఁగాక, చచ్చుగాక. ఈ దురాత్ముఁడు
రాజుగా నుండఁదగఁడు. యజ్ఞపతి యగువిష్ణువునుగూడ సిగ్గులేక
నిందించుచున్నాఁడు. ఎవనియనుగ్రహమువలన నిట్టి యైశ్వర్య
మును బొందెనో,యావిష్ణువును దురాచారుఁడగు వేనుండుతక్క
నన్యు లెవ్వరు నిందింప నెంతురు.?"అని ఇట్లుమునీశ్వరులు నిశ్చ
యించుకొని యధికమగు కోపము గలవారయి భగవన్నిందచేఁ
బూర్వమే హతుఁడయిన వేనుని హుంకారములచేఁ జంపిరి.ఇట్లు
మునులు వేనునిఁ జంపి తమయాశ్రమంబుల కరిగినపిమ్మట
సునీథ దుఃఖించుచు వేనునికళేబరమును మంత్రసహితమగు యు
క్తిచేఁ బరిపాలించెను. అట్లు వెడలినమును లందఱు నొకనాఁడు
సరస్వతీనదికేఁగి తజ్జలంబులమజ్జనంబాడి నిత్యాగ్నిహోత్రముల
నెఱవేర్చుకొని తత్తీరంబునఁ గూర్చుండి భగవత్కథలను జెప్పుకొ
నుచుండిరి. అంతట మహోత్పాతములు లోకభయంకరములై
కనిపించెను. మును లామహోత్పాతములను జూచి మిక్కిలివిచా
రించి 'రాజు లేనిభూమియం దున్నవారికిఁ జోరాదులనుండి దుః
ఖంబులు రాక మానునా?' అని పలుకఁజొచ్చిరి. వీ రట్లనుకొను

చుండఁగా నన్నిదిక్కులందును దిరుగుచు ధనాదికమును హరించుచున్నదొంగలవలన విస్తారముగుపరాగము లేచి వ్యాపించెను. మఱియు వారె ధనమును హరించుచున్నదొంగలవలనను రాజు లేకపోవుటచేఁ బరస్పరమును జంపుకొనఁదలంచు లోకులవలనను గలుగుచున్న యుపద్రవమును, దొంగలతో నిండి యరాజకమయి, బలరహితమయి యున్న దేశంబును జూచి, వేనునివలె హుంకారములచే దొంగలను జంప సమర్థులయినను, నందువలనఁ బాపము జనించునని తలంచి దొంగలను వారింపరైరి. ఆలోచింప సమస్తము బ్రహ్మాత్మకమని తలంచుచు, నందులకుఁ దగిన శమాదిగుణములు గలవాఁడై యున్న బ్రాహ్మణుఁడు దీనులరక్షింపక యుపేక్షించినచో నట్టివానితపంబు పగులు వాఱినకుండలోనిజలంబువలెఁ దొలంగిపోవును. కావున నుపేక్షించుటవలనఁ గూడఁ దపోవ్యయము గలుగుచున్న దనియు, నంగరాజు వంశజులు సర్వదా హరి నాశ్రయించువార లగుటచే వ్యర్థము కాని పరాక్రమముగల రాజులు పుట్టుచుందురు గావున నీ తనివంశ మంతయు పొందరాదనియు, నిశ్చయించి ఋషీశ్వరులు మృతి నొందిన వేనునియూరువును బలముచే మథించిరి. అట్లు చేయఁగా నందువలన బాహుకుఁ డనునరుఁ డొకఁ డుద్భవించెను. ఆబాహుకుఁడు కాకివలె మిక్కిలి నల్లనయి, చాల పొట్టియునై పొట్టిచేతులును పెద్దచెక్కిళ్లును గలిగియుండెను. వాఁడు త్రుంపుడుమాట లాడువాఁడు. మఱి లోఁతుగ నడఁగిననాసికయు నెఱ్ఱని నేత్రములును, నెఱ్ఱని తలవెండ్రుకలును, గలిగియుండెను. ఇట్టి యాకారము గల పురుషుఁ డుదయించి యవనతుఁడయి యేమి

మునులు వేనుని శరీరమునుండి సృష్టి చేయుట.

చేయుదునని దీనముగాఁ బలుకఁగా వానిం జూచి మునులు రాజ్యంబున కనర్హుం డని యెంచి "నిషీద" (కూర్చుండుము) అని పలికిరి. ఓవిదురా! మునులు నిషీదయని పలుకుటచే బాహుకుఁడు నిషాదజాతికి మూలపురుషుఁ డాయె. వీడు పుట్టుచు వేనుని సమస్తపాపమును స్వీకరించెను. గాన వానివంశమందుఁ బుట్టినవారు నైషాదులని పిలువబడుచుఁ బురాదులందునివసింపక పర్వతములందుండు కాననంబుల నివసించుచుందురు. అనంతరము మునులు పుత్రహీనుఁ డయిన వేనుని బాహువులను మథింపఁగా దంపతు లిరువురు జన్మించిరి. ఇట్లుదయించిన దంపతులనుగాంచి బ్రహ్మవాదులగు మునులు వారలను భగవదంశము వలన జన్మించినట్లు తెలిసికొని పరమసంతోషమును జెంది పలికిరి. "ఈపురుషుఁడు భువనమును పాలింప లీలావతారమునొందిన విష్ణువే. ఈస్త్రీలలామయు నారాయణు నెప్పుడును విడిచియుండ నొల్లని లక్ష్మీదేవి కళలధరించి యుద్భవించినది ఈమిథునములోఁ బురుషుఁడు కీర్తిని మిక్కిలి విస్తరింపఁ జేయును. కాన నధికమగుకీర్తిగలిగి పృథుమహారాజను పేరఁ బ్రఖ్యాతుఁడు కాఁగలఁడు. కీర్తి నివిస్తరింపఁ జేసినవారిలో నితఁడు ప్రథముఁడు. మఱియు నీద్వంద్వములోనిస్త్రీలలామ, సుందరమగుదంతములుకలిగి సద్గుణములను భూషణములను మిగులఁ బ్రకాశింపఁ జేయునదై, "అర్చి" యను పేరితో వర్తించెడిలక్ష్మియే. కావుననీ పురుషునిబతిగా వరించి సేవించును. మఱియునితఁడు లోకము రక్షింపహరియంశమువలన నుదయించినవాఁడు కావుననీమెయును నతనినివిడిచియుండనొల్లని శ్రీమహాదేవియంశమువలన జన్మించినది. అందువలన దాంపత్యముచితమైనది. ఇట్లు పృథురాజును విప్రులు నుతించు

చుండఁగా గంధర్వులు గానముచేసిరి. సిద్ధులు పుష్పవర్షములను గురియించిరి. అప్సరసలు నృత్యములుసలిపిరి. ఆకాశమున దేవదుందుభులు మొరసెను. కొందఱు మృదంగంబుల ధ్వనిచేసిరి. మఱికొందఱు శంఖంబులఁ బూరించిరి అచ్చటికి దేవతలును మునులును బితృదేవతలును నేతెంచిరి. అంతట లోకమునకు గురువగు బ్రహ్మ దేవతలతోను దిక్పాలురతోను వచ్చి పృథురాజు దక్షిణహస్తమునందు విష్ణువుచేతియందువలెఁ జక్రాదిరేఖ లుండుటనుఁ జూచి యతని నారాయణాంశసంభూతునిఁగాఁ దలంచెను. మఱియు నెవనికి రేఖాంతరములచేఁ బ్రతిహతము కాని చక్రరేఖ చిహ్నితమై యుండెనో యా పరమపురుషుని యంశమువలన జనించినపృథురాజునకు బ్రహ్మవాదు లగు బ్రాహ్మణు లభిషేకము చేయ నారంభించిరి. అంత నన్నిదిక్కుల నుండియుఁ బ్రజ లభిషేకమునకుఁ దగినసాధనములను స్వీకరించి వచ్చిరి. మఱియు నదులును, సముద్రములును, హిమవదాది పర్వతములును, వృక్షములును, సర్పములును, స్వర్గాదులును, ఔక్కల సమస్తభూతములును బృథురాజునకుఁ గానుకలుగొని

—•◆ మునులు పృథురాజునకు పట్టముఁ గట్టుట ◆•—

వచ్చినవి. అప్పుడు పృథురాజు మంచివస్త్రములను వైజయంతి యనుపుష్పమాలను, గిరీటాదు లగు నలంకారములను ధరించి చక్కఁగ నలంకరించుకొని భార్యయగునర్చిచే సంయుతుఁడయి రెండవయగ్నివలెఁ బ్రకాశించెను. ఆసమయమునఁ గుబేరుఁడు సువర్ణమయమయినసింహాసనమును దెచ్చి యాతని కిచ్చెను. వరుణుఁడు చంద్రునివలెఁ బ్రకాశించుచు, జలబిందువులను స్రవించుచున్నగొడుగును గానుకగా నొసంగెను. వాయువు చామర

ముల నర్పించెను. ధర్మపురుషుఁడు కీర్తిప్రచుర సుగుపూలదండ నిచ్చెను. దేవేంద్రుఁడు కిరీటమునొసంగెను. యముఁడు దుష్టుల శాసింపఁదగిన దండము నిచ్చెను. బ్రహ్మ వేదమయమగు కవచము నర్పించెను. సరస్వతి యుత్తమమగుముత్యాలహారము నిడెను. విష్ణువు దనయంశముచే జన్మించిన పృథురాజునకుఁ దనచక్రాంశముచే నిర్మింపఁబడిన చక్రము నొకదాని సమర్పించెను. లక్ష్మీదేవి యెడతెగనిసంపదలఁ గలిగించెను. ఈశ్వరుండు పది చంద్రులతో సదృశ మగుఖడ్గము నిచ్చెను. గౌరీదేవి శత చంద్ర మనుపేరుగల కవచము నిచ్చెను. చంద్రుఁడు సుధామయము లగు తురంగములను నతిసుందరమగు రథంబు నిచ్చెను. అగ్ని కొమ్ముతో నిర్మిత మగు కార్ముకము నిచ్చెను. సూర్యుఁడు తనకిరణములవలె సన్నిస్థలంబులందును జొర సమర్థములగుబాణముల సమర్పించెను. భూమి యోగమయములైన పాదుకలను దెచ్చియిచ్చెను. ఆకాశము ప్రతిదినమును బూజార్హ మగు పుష్పములనొసంగెను. మునులు సత్యములగు నాశీర్వచనముల నొసంగిరి. సముద్రుఁడు తనయందుద్భవించిన శంఖము నిచ్చెను. నదులును, నదములును, పర్వతములును రథమార్గంబు లనిచ్చెను. అప్పుడు దేవతలలోఁ గొందఱాడిరి. కొందఱుపాడిరి. కొందఱు మృదంగాదులను మ్రోయించిరి. ఆసమయంబున వందిమాగధులు వచ్చి పృథురాజును నుతింపనిలిచిరి. ఇట్లు తన్ను నుతించుటకు వచ్చినవందిమాగధులను బొడంగాంచి మహాప్రభావము గలపృథురాజు మందహాసము చేయుచు మేఘగర్జనము వలె గంభీర మగువచనంబులచే నిట్లు పలికెను 'ఓసూత! ఓమాగధా! ఓవందీ ! నాగుణము లిప్పుడు లోకమందు నుంతేనియుఁ

ప్రసిద్ధి కెక్కలేదు. అట్లుండఁగా మీరు చేసినస్తోత్ర మెట్లుగాఁ దగియుండును. లోకమందుఁ బ్రఖ్యాతి నొందినగుణములే నుతింపఁ దగినవికాని యప్రఖ్యాతములు కావు. అట్టివాని వర్ణించినస్తోత్రములు వ్యర్థము లగును. కావున నాగుణములు ప్రసిద్ధిఁ జెందకుండఁగా నన్నుఁగూర్చి మీరు పలికెడుస్తోత్రవాక్యములు వ్యర్థమగునుగాన ప్రస్తుతమున స్తోత్రము చేయకుఁడు. కాలాంతరమందు నాగుణములు ప్రసిద్ధములు కావచ్చును. అప్పుడు స న్నాశ్రయించినగుణములను, నాయశంబును నుతింతురుగాక. మధురవాక్కులు గల వందిమాగధులారా! సభ్యులు నుతింపుఁడనుటచే నుతించుచున్నామని యనకుఁడు. ప్రశస్తకీర్తియగు భగవంతునిగుణములుస్తోత్రార్హము లయియుండగావానినివిడిచి నీచగుణములు గలనన్ను నుతింప సభ్యులు నియోగింతు రని నేను నమ్మను. ప్రస్తుతమున నీయందుఁ బ్రసిద్ధగుణములు లేకపోయినను మున్ముందు నీకలవడెడిప్రసిద్ధగుణములను నుతించుచున్నా మని యందు రేని చెప్పెద వినుండు. ప్రస్తుతమున సద్గుణములు లేకపోయినను మహాత్ములగుణములను సంపాదింప సామర్థ్యము గలవాఁ డయినను వందిమాగధులచే నెవఁడు స్తోత్రము చేయించుకొనును? వచ్చుకాలంబున శౌర్యాదిగుణములచే శత్రువిజయాదులు తప్పక సంప్రాప్త మగుననుతలంపునఁ దన్నుఁ బొగడించుకొనినవాఁడు కుత్సితుఁడు. వాఁ డాక్షేపింపఁ దగినవాఁడు. వాఁడు లోకులు పరిహసింతు రనుబుద్ధి లేనిమందుఁడు. మఱియు లోకమున బుద్ధిమంతు లగువారు తాము నిరతిశయము లగు సద్గుణములు గలవా రయినను, సద్గుణములను సంపాదింప శక్తు లయినను, దమగుణములు జగత్ప్రఖ్యాతము లగుచున్నను, సిగ్గు

చెందుచు నాత్మప్రశంసలను నిందింతురు. కావున నో వందిమాగధులారా! నే నుత్తమకార్యములచే నింకను లోకంబునఁ బ్రసిద్ధిని గాంచలేదు. అట్లుండ నేను బాలునివలె నెట్టుగా స్తోత్రము చేయించుకొందును?' అని పలికెను. ఇది పదునాల్గవయధ్యాయము.

సుధారసతుల్యము లగు పృథురాజువాక్యములను విని మునులు చిత్తములు సంతసిల్లి నియోగింపఁగా వందిమాగధులు భగవదంశసంభూతుఁ డగుపృథురాజును స్తోత్రము చేయ నారంభించిరి. ఓమహారాజా! నీవు దేవతలగుణములవంటిగుణములచేఁ బ్రకాశించుచు, నాత్మసంకల్పముచే భూమియం దవతరించిననీమహిమను వర్ణింప మాకు శక్తి చాలదు. నీవు దుష్టుం డగు వేనునిశరీరంబువలన జన్మించినను భగవదంశసంభూతుండ వయి యనంతకల్యాణగుణములు గలిగి యున్ననీపౌరుషమును వర్ణింప బ్రహ్మాదులబుద్ధులె భ్రాంతిని జెందుచుండ మావంటివారిసంగతి చెప్ప నేల? ఆలోచింప నీమహిమను వర్ణింప సమర్థులము కాము. అయినను నారాయణాంశసంభూతుండ వగు పృథురాజుకథామృతమునం దాదరము కలవార మయి మేము మునుల యుపదేశప్రకారముగా శ్లాఘింపఁ దగిననీయద్భుతకార్యములను జగంబున విస్తరింపఁ జేసెదము. ఈపృథురాజు వర్ణాశ్రమధర్మముల నాచరించువారిలో నుత్తముఁడు. కావున నే సమస్తలోకమును ధర్మమందుఁ బ్రవర్తింపఁ జేయుచు, ధర్మమర్యాదలను రక్షించుచు, నాధర్మములకును ధర్మానుష్ఠానపరులకును, విరోధు లగువారిని నశింపఁ జేయుచు నున్నవాఁడు. ఈపృథురాజొక్కఁడే లోకపాలు

వందిమాగధులు పృథురాజుగుణముల వర్ణించుట.

రగునింద్రాదులకుఁ గార్యోపయోగులయి యపృథక్సిద్ధములయిన యసాధారణగుణములను దన దేహమందుఁ బాలనపోషణాదులచే నీలోకమునకు హిత మగునట్లుగాను, యాగాదులచేఁ బరలోకమునకు హితమగునట్లుగాను, ధరించుచున్నాఁడు. మఱియునితఁడు సూర్యుఁడెనిమిదిమాసములును దనకిరణములచే లోకమును దపింపఁజేసి జలమును స్వీకరించి వర్షాకాలము రాఁగానే యాజలమునువర్షరూపముగా నిచ్చి రక్షించుచున్నట్లు, తగిన కాలమునఁ బన్ను వేసి లోకమునుండి ధనమును గ్రహించుచు దుర్భిక్షకాలమునందు లోకులకు మరల నిచ్చుచున్నాఁడు. ఇతఁడు సకలభూతములందును సమబుద్ధితో వర్తించును. పాదాదులచేఁ దన మస్తకము నాక్రమించువారయినను నార్తితోఁ గూడుకొన్నచో నితఁడు వారియందు మిక్కిలి దయగలవాఁడయి యపరాధముల సహించును. భూమి కెట్టి సహనగుణము కలదో యితని కట్టిసహనగుణము కలదు. ఇతఁడు నరదేవరూపము దాల్చినశ్రీహరియే. ఇతఁడు వర్షము లేక ప్రజలు ప్రాణముల విడుచుచున్నప్పుడు వర్షము గురియించి యింద్రునివలె రక్షించుచున్నాఁడు. ఇతఁడు ప్రేమసహితము లగుచూపులు గలిగి స్వచ్ఛమయినచిఱునవ్వుచే సుందర మయి యున్నతనవదనచంద్రబింబముచే, లోకమును వృద్ధి పొందించుచున్నాఁడు. ప్రవేశమందుఁ గాని నిర్గమించుటయందుఁగాని యితనిమార్గము నొరులు గనుఁగొన లేరు. ఇతఁడు చేయుచున్న కార్యము లొరులకుఁ దెలియఁబడవు. గంభీర మగునితనియభిప్రాయమును నితరు లెవ్వరును దెలిసికొనఁజాలరు. ఇతఁడు విత్తము నధికముగా భద్రముగా

నుంచుకొనుచున్నాఁడు. ఇతఁ డపారమగు మాహాత్మ్యమునకును గుణములకును నిలయభూతుండు. ఇతఁడు సముద్రములచే నావరింపఁబడినవరుణునివలె గూఢ మగునాత్మ కలవాఁడు. ఇతఁడు మనస్సుచేతనైనను శత్రువులకుఁ బొందఁదరము కానివాఁడు. ఇతని పరాక్రమాదులను శత్రువులు సహింపలేరు. ఇతఁడు సమీపస్థుఁడయియున్నను దూరమందున్నవానివలెఁ బౌరుషాదులచేఁ దిరస్కరింపఁబడువాఁడు కాఁడు. ఇతఁడు వేనుఁడనెడియరణియం దుదయించినయగ్నిహోత్రునివలెఁ బ్రకాశించుచున్నాఁడు. ఇతఁడు చారులచే సమస్తభూతములవృత్తాంతములను జూచుచు, దేహధారణమునకు హేతుభూతుఁ డగునాత్మవంటివాఁ డగునాయువుచందంబున నుదాసీనుఁ డయి యుండును. ఈపృథురాజు శత్రువులకుమారునినైనను, దండనార్హుఁడు కానిచో దండింపఁడు. తనకుమారుఁ డయినను దండనార్హుం డయిన దండించి తీఱును. ఇతఁడు ధర్మమందు ధర్మరాజును బురుడించును. సూర్యకిరణము లెంతవఱకుఁ బ్రసరించునో యంతవఱకు నితనియాజ్ఞయు రథమును నిరాటంకముగాఁ బ్రవర్తించుచున్నవి. ఇతఁడు వ్యాపారములచేతను లోకమును రంజింపఁ జేయుచు, మనోరంజనాదిగుణములు గలవాఁ డగుటచేఁ బ్రజలచే రాజని పిలువఁబడుచున్నాఁడు. ఇతఁడు సఫల మగుచున్న సంకల్పముకలవాఁడు. ఇతఁ డెప్పుడును సత్యమునే పలుకుచుండును. ఇతఁడు బ్రాహ్మణులందు సాధువు. వృద్ధుల సేవించును. సర్వభూతములకును శరణమిచ్చును. తగినవారిని మన్నించును. దీనులయెడ వత్సలుఁడై యుండును. పరస్త్రీలయందుఁ దల్లియందువలెనే భక్తి నుంచును. భార్యను దనయర్ధశరీరమునుగాఁ జూచును. ప్రజలప

రాధము లొనర్చినను దోషముల నెన్నక తండ్రి కుమారులను వలెఁ బ్రీతితోఁ జూచుచుండును. బ్రహ్మవాదులకు దానుం డయి ప్రవర్తించును. ప్రాణులకాత్మవలెనే యితఁడు సమస్తజంతువులకు మిక్కిలి ప్రియుఁడు. స్నేహితులకితఁ డానందము వెల్లిగొలుపును. విరాగులయి వర్తించుమహాత్ములతో నితఁడు స్నేహముచేసి వెలుఁ లుచుండు. దుర్జనులందు యమసదృశుఁడయి వర్తించు. మహావీరుం డగునీపృథురాజు బలముచే భూమినుండి యోషధులను సంగ్రహించును. ఇతఁ డీభూమిని తనవింటికొప్పచేఁ బాధాదిరహితముగాఁ జేయును. ఇతఁడు సద్గుణములకు నిలయుం బని వేఱ చెప్పనేల? ఇతఁ డనంతకల్యాణగుణములు గలభగవంతుఁడే కాఁడా? ఎవఁడు వికారాదులు లేక వర్తించునో, యెవఁడు త్రిజగంబులకధిపతియో, యాపరమాత్మయే తన కంశభూతుఁడగు* జీవుఁడుగా నవతరించెను. ఏజీవునియం దావేశించి యవతరించె నని యడుగుదువేని చెప్పెదను వినుము. తత్త్వవిదు లేజీవునియందుఁ బ్రతీయమాన మగుచున్నను బ్రకృతిపరిణామరూప మగు దేవమనుష్యాదిభేదము సత్యము కానట్లు చూచుచున్నారో యాజీవుని

---

* ఓయీ? భగవంతుఁడు జీవశరీరకుఁడయి తనయంశముచే నవతరించెనని చెప్పితివి. అట్లయినజీవునియందుఁ బ్రసక్తములగుచున్న దోషములన్నియును బరమపురుషునియందుఁ బ్రసక్తములగుచున్నవాయని ప్రశ్నింపరాదు. ఆలోచింప భగవంతుఁడు జీవశరీరకుఁ డగుటవలన దోషములు ప్రతీయమానములగుచున్నను దేహగతములగు చిన్నతనము ముదుసలితనము మొదలగుధర్మములు జీవుకిని సంభవింపనివిధంబున జీవునియందుఁ గల అజ్ఞత్వాదిదోషములుపరమపురుషునిఁ జెంగవు. పరమాత్మమాయను వశముగావించుకొని కర్మాదులకు వశుఁడుగాక యుండుటచే ననర్థము లెంతమాత్ర మతనిఁ జెంద నేరవు.

యుం దావేశించి యవతరించెను. కావునఁ బృథురాజు భగవంతుని యంశావతార మని చెప్పుదురు. ఈపృథురాజుదయపర్వతపర్యంతము గలభూమండలమును రక్షించును. తనకంటె నధికుఁడగు శూరుఁడు కాని సమానశూరుఁడు గాని లేకపోవుటచే విచ్చలవిడిగాఁ జరించుచు నితఁడు జయశీలమగురథము నెక్కి ధనుర్బాణములను ధరించి సూర్యునివలె దక్షిణముగాఁ బ్రదక్షిణము చేయుచుండును. ఇట్లు ప్రదక్షిణము చేయుచున్న పృథురాజునకు దిక్పాలురును సమస్తజనులును నచ్చటచ్చటఁ గానుకలను సమర్పించుచుందురు ఆదిక్పాలురభార్యలును, నారాజులభార్యలును నితనియశంబును జెప్పుకొనుచు నితని భగవంతునిగాఁ దెలిసికొని తమలోఁ దా మిట్లనుకొనుచుందురు. "ఈరాజు ప్రజాపాలనమం దధికారము వహించినవాఁడు. ప్రజలకు జీవనోపాయమును జేయఁదలంచుచుండు. ఇతఁడు గోరూపధారిణి యగుభూమినుండి యోషధులను బితికెను. ఇతఁ డింద్రునివలెఁ దనవింటికొప్పుచే లీలగాఁ బర్వతములను భేదించి భూమిని సమముగాఁ జేసెను. వాలమును మీఁదికెత్తి విచ్చలవిడి జరించుసింహమువలెనే యెప్పు డితఁ డాజగవ మనునింటిని ధ్వనిచేయుచు శత్రువుల సహింపరాని పరాక్రమము గలవాఁడయి భూమియందుఁ జరించునో యప్పుడే ధర్మవిరోధులగు చోరాదులు ప్రతిదిక్కునందును నడఁగిపోయిరి. ఇతఁడు సరస్వతీనది యుద్భవించినస్థలమగు బ్రహ్మావర్తమందు నూ రశ్వమేధములు చేసెను. ఇతనినూఱవయాగమును బ్రవర్తిల్లుచుండగా నింద్రుండు వచ్చి యజ్ఞాశ్వము నపహరించెను. కుఱియు నితఁడు తనగృహమునకు సమీపమున నున్నవనమం దనహాయుఁడై యున్నవాఁడును భగవంతుఁడు నగునన

త్కుమారుని భక్తిచే నారాధించి పరబ్రహ్మపదవిని బొందింపఁ జాలిసతత్త్వజ్ఞానమునుబడసెను.'' అనియిట్లు ప్రథిత మయినశక్తి గలిగి నిరుపమానమగు పరాక్రమము చేనొప్పినపృథురాజుఁగూర్చి చెప్పుచున్న ప్రబంధరూపములగు గాథలను వినఁగలరు. మఱియు నితఁడు నిజబలముచే లోకకంటకులగు దురాత్ములను జయించి నిరర్గళ మగునాజ్ఞతో దిక్కుల జయించును. సురాసురులు తనప్రభావమును వర్ణింపఁగా భూమికి భర్తయై యుండును. ఇది పదునేనవ యధ్యాయము.

అని యిట్లు నుతించుచున్న వందిమాగధులవాక్యములు విని గుణములచేతను సత్కృతకర్మములచేతనుబ్రఖ్యాతిగాంచి, యారాజా వందిమాగధులకు వస్త్రములను నగలను బహుమానముగా నిచ్చి వారుచేసిననుతికి మెచ్చుకొని సంతోషించెను. అనంతరమతఁడు బ్రాహ్మణులు క్షత్త్రియులు మొదలగు నాలుగుజాతులను, సేవకులను, మంత్రులను పురోహితులను, దైవికులను, తాంబూలం బమ్మి జీవించువారిని, పురవాసులను, దేశవాసులను, నిజజనులను లెస్సగా గౌరవించె నని మైత్రేయుండు చెప్పఁగా విని విదురుం డిట్లనియె. ''ఓమునీంద్రా! కామరూపిణి యగుభూమి యేమికారణంబున గోరూపంబును ధరించెను? పృథురాజు దాని నేల పితికెను? ఆదోహనక్రియయందు వత్సమెక్కడిది? పితుకుటకుఁ బాత్రమేది? పర్వతాదులచే నిమ్నోన్నతయగు భూమి యెట్లు సమముగాఁ జేయఁబడినది? పృథురాజు యాగాశ్వమును దేవేంద్రుఁడేల యపహరించెను? ఓమునీంద్రా! బ్రహ్మవిదులలో నుత్తముఁ డయినసనత్కుమారునివలన నుపాసనాత్మకజ్ఞానముతోఁ

గూడినజ్ఞానమును బొంది పృథురాజే గతిబొందెను? ఈవృత్తాంతములను దెలుపుము. మఱియు శోభనమగు కీర్తి గలభగవంతుని యంశావతారమగు పృథురాజునుసంబంధించినదియు వినువారికి బుణ్యము సంపాదించునదియు నగుకీర్తిని, నింకను మిగిలినసమాచారములనుఁ దెలియఁజెప్పుము. ఓమహాత్మా! నీకును భగవంతునకును నేను భక్తుఁడను. మఱియు నధికమగుప్రేమ గలవాఁడను. కావున భగవంతుఁడు పృథురాజురూపముగా నవతరించి భూమినుండి యోషధులను బితికికట్టికథను నాకుఁ జెప్పఁదగినవాఁడవు." అని యిట్లు విదురుండు వాసుదేవకథనుగూర్చి ప్రశ్నింపఁగా విని మైత్రేయుండు సంతోషించినవాఁడై యావిదురుని నుతించి యిట్లు చెప్పెను. 'ఓవిదురా! పృథురాజు విప్రులయును నుతిచొప్పునఁ బట్టాభిషిక్తుఁడై జనసమూహములను రక్షింపఁ బూనినప్పుడు ప్రజ లన్నములేక క్షీణించి రాజునొద్దకువచ్చియిట్లనిరి. "ఓరాజా! చెట్టుతొఱ్ఱయందుండినయగ్ని చెట్టును దగ్ధము చేయుచున్నట్లు జఠరాగ్ని మమ్మునుఁ దపింపఁజేయుచున్నది. నీవు మాకు జీవనమిచ్చుదాతవు. అధిపతివి. బ్రాహ్మణులచే నీవు సాధింపఁబడితివి. అట్టినీకు మే మిప్పుడు శరణుఁజొచ్చుచున్నాము. ఓ మహారాజా! నీవు మాకు నాహారాదుల నిచ్చి రక్షించెడిదాతవును లోకములను బరిపాలించువాఁడవును. కావున మే మన్నములేకెంతకాలములో మృతి నొందకుందుమో యంత కాలములో నాఁకటిచిచ్చుచేఁ బీడితుల మగుమాకన్న మొసంగి రక్షింప బ్రయత్నింపుము." అనిపలుకుచున్న ప్రజలదీనాలాపముల నాలకించి పృథురాజు చిరకాల మాలోచించి ప్రజలన్నములేక క్షీణించుటకుఁ గారణమును దెలిసికొనెను. ఇట్లు చింతించి యోషధుల

నన్నింటిని భూమి హరించినదని నిశ్చయించి త్రిపురాసురహంతయగు రుద్రునివలెఁ గోప మూని ధను వెక్కుపెట్టి బాణమును ధనువునందుఁ గూర్చెను. ఇట్లు ధనుర్బాణధరుఁడగు పృథురాజును జూచి భూమి భయమువలన గడగడ వడఁకుచు గోరూపమును ధరించి కిరాతకునికి భయపడి పరువెత్తుచున్న లేడివలెఁ బరువెత్త నారంభించెను. అది చూచి పృథురాజు కోపోద్దీపితుఁడై కన్నులెఱ్ఱవాఱుచుండఁగా వింట బాణము సంధించి యాగో వెచ్చటికిఁ బర్విడునో యచ్చటికెల్లఁ బర్విడఁ జొచ్చెను. అంత నా భూమి దిక్కులను విదిక్కులను భూమ్యాకాశంబులను జరించుచుఁ దాఁ బోవుచున్నచోట్లయందెల్లఁ బృథురాజు వచ్చుచుండుటఁ జూచి, మృత్యువును జూచిన ప్రజవలె మిగుల భయంబు చెంది, లోకమందుఁ దనకుఁ రక్షణోపాయము గానలేక మిగుల సంతాపము నొందుచు మఱలెను. ఇట్లు మఱలి భూమి పృథురాజుం జూచి. "ఓ దేవా ! ఓ బుద్ధిమంతా! నీవు స్త్రీలు వధకుఁ దగనివారన్న ధర్మమును జక్కఁగ నెఱుఁగుదువు. ఆపద నొందినవారియెడ వాత్సల్యముకలవాఁడవు. భూతములను రక్షింపఁ బూనుకొన్నవాఁడవు. కావున భూతములం దంతర్భూతనైయున్న నన్నుఁ దప్పక రక్షింపుము. భూతముల రక్షింపఁ గంకణము కట్టుకొనిన నీవు నిరపరాధ నగు నన్నుఁ జంప నేల తలంచుచున్నావు ? ధర్మజ్ఞుఁడ వగు నీవు స్త్రీనైన నన్నెట్లు చంపుదువు? లోకములో సామాన్యజనులుకూడ నపరాధము చేసినను నాఁడువారలను జంపరు. అట్లుండఁగాఁ గరుణాళువులయిన మీవంటివారు నిరపరాధ నగు నాఁడుదానిఁ జంపఁబూనరాదని వేఱె చెప్పవలయునా? నేను సమస్తప్రంచమునకును నాధార

మను. నాయందు సమస్తమును బ్రతిష్ఠితమైనది. అట్టినన్ను సంహరించి దృఢ మగునావను బ్రద్దలు చేసి యందులోనిజనముల జలముల ముంచినట్టునిన్నును బ్రజలను జలంబులనెందులకుముంచుకొనెదవు?"అనుచున్నభూమిపలుకులువిని పృథురాజిట్లనియె. "ఓపృథివీ; నీవు నాశాసనము ననువర్తించినదానవుకావు. కావున నిన్నుఁజంపెదను. నిరపరాధనగు నన్నేల చంపెదవని యడిగితివి. కాని నీవు రాజనగు నా యాజ్ఞమీఱుట యనునొకయపరాధము గావించితివి. ఇంతియకాక నీవు యాగములందు దేవతారూపమునవచ్చి భాగమును బొందుచున్నావు. కాని ధాన్యాదులను నొసంగలేదు. ఇట్లు నీవు పరులు చేసినయుపకారమును మఱచి యుండుట రెండవయపరాధము. ఓయీ! అపరాధమును జేసినను గోరూపధారిణి నగునన్నుఁజంపుట నీకుచితముకాదనియుందువేని చెప్పెద వినుము. గోవు ప్రతిదినమును దృణాదికము నెక్కువగా భుజించి పాలుకొంచెమేనియు నొసంగనిచో నదితప్పక దండనార్హమయినదే. నీవు నారీతిగనే యాగాదిభాగములఁగొనుచు ధాన్యాదులనొసంగమిచే దండనార్హమువే? నన్నుఁజంపినచో ప్రజలయాఁకలిదీఱునా? కావుననట్లు చేయుటతగదని శంకింపరాదు. ఆకలిబాధ కోర్వఁజాలక నలుదిక్కుల వ్యాపించుచు, నార్తులై యున్న ప్రజలదుఃఖమును నాబాణములచే శాంతి పొందించెదను. మఱియు లోకములోఁ బురుషుఁడైనను స్త్రీయైనను నపుంసకుండైనను, దన్నుఁదాఁ బొగడుకొనుచుఁ గావుననే యధముఁడై భూతములందు దయ లేక వర్తించినచో రాజు స్త్రీపురుషాదివిమర్శనమును విడిచి వారిని జంపవచ్చును. అందువలన రాజునకుఁ బాపము సంభవింపదు. మఱియు నీవు

గర్వించినదాన వై "నేను లేకపోయినచో సమస్తమును జలములో మునింగి పోవు"నని తలంచుచున్నావు. కపటగోరూపమును దాల్చిననిన్ను నాబాణములచే నువ్వుగింజలంత లేసి ముక్కలుగా ఖండించి నాయోగబలముచేతనే ప్రజలను నన్నును ధరించెదను." అని యిట్లు పలుకుచు విస్తారమగు కోపమును వహించి యమునివలెఁ బ్రవర్తించుచున్న పృథురాజునకు భూమి భయపడి గడగడవడఁకుచుఁ బాదములపయిం బడి నమస్కరించి దోసిలిం బట్టి యిట్లనియె. 'ఓమహాత్మా! నీవు*నిన్ను విడిచి వేఱు

గోరూపధారిణి యగుభూమిపృథురాజును నుతించుట.

గ నుండఁజాలనిమాయచే దేవమనుష్యాదులను గలిగించి యా దేవమనుష్యాదులగు వ్యష్టిజీవులే శరీరముగాఁ గలవాఁడవు.†మ

---

* దీనిచే భగవంతుఁడు ప్రకృతిపురుషులే శరీరముగాఁ గలవాఁడనియు జగంబునకుఁ గారణుం డగుటయుఁ జెప్పఁబడినది.

† ఓయీ! ప్రకృతిపురుషశరీరకుఁడయినను భగవంతునికిఁ బ్రకృతిపురుషగతము లగుసత్త్వాదిగుణములు గలవని చెప్పితివి. భగవంతుఁడుఁగూడ జీవునివలెఁ బ్రకృతిగుణములు గలవాఁడయినచో జీవునికి నతనికిఁ గలభేద మేమి? అని యందువేని చెప్పెదను విను. భగవంతుఁడు ప్రకృతిపురుషులే శరీరముగాఁగలవాఁడు. కావున శరీర మయినప్రకృతిపురుషులమూలమున నాగుణములు గలుగుచున్నవి. కాని వాస్తవముగాఁ గలుగలేదు. శ్రు॥ కాఠిన్యవాన్యో బిభర్తి తస్మై భూమ్యాత్మనే నమః. ఇత్యాదిస్థలములందు భూమియందుండు కాఠిన్యము సద్వారకముగా భగవంతునికిఁ గలదని చెప్పఁబడినది. కానిస్వభావసిద్ధముగానున్నట్లు చెప్పఁబడలేదు. అట్లె ప్రకృతిపురుషులు శరీరముగాఁగలవాఁడగుటచేఁ బ్రకృతిపురుషులందున్న సత్త్వాదిగుణములు భగవంతునికి సద్వారకముగాఁ గలవని తెలియనది. అంతియకాని యతనికి సత్త్వాదిగుణములు లేవు. కావున భగవంతుఁడు నిర్గుణుఁ డని చెప్పుశ్రుతు లుపపన్నము లగుచున్నవి.

ఱియు నీవు ప్రకృతిగుణ విశిష్టుఁడవగుటవలనఁ దన్మూలమున సత్త్వాదిగుణములు గలవాఁడవు. నీవు ప్రకృతిఁగూర్చియు జీవునిఁగూర్చియునీశ్వరునిఁగూర్చియు యథార్థమగుజ్ఞానము గలిగియాజ్ఞానముచే, [1] ద్రవ్యభ్రమతోను, [2] క్రియాభ్రమతోను [3] కారకభ్రమతోనుగూడిన [4] షడూర్ములను దొలఁగించుకొనుచున్నావు. కావుననే నీవు ప్రకృతిపురుషులకంటె విలక్షణుఁడవయి పరమపురుషుఁడవయితివి. అట్టినీకు వందనంబు లర్పించుచున్నాను. మఱియు నీవు సర్వజ్ఞుండవు. సర్వశక్తివి యయిననిన్ను,నీవురచించినజగంబున కంతర్యామి నగునేనెట్లు వచింపఁగలుగుదును?

---

1. ద్రవ్యభ్రమ యనఁగా, పృథివ్యాదిద్రవ్యములచే నారంభింపఁబడిన దేహము నాత్మగా భ్రమించుటయే.

2. "నేను నడుచుచున్నాను" "నే నిచ్ఛగించుచున్నాను" "నేను ద్వేషించుచున్నాను" అను క్రియలు వాస్తవముగా దేహగతములు. అవి దేహగతములయినను వాని నాత్మగతము లనితలంచుటయేక్రియాభ్రమయనఁబడును.

3. కారకభ్రమయనగా "అధిష్ఠానం తథాకర్తా కరణంచ పృథగ్విధం। వివిధాంచ పృథక్చేష్టా దైవంచైవాత్రపంచమం। శరీరవాఙ్మనోభిర్యత్కర్మప్రారభతేనరః। న్యాయ్యంవావిపరీతంవా పంచైతే తస్యహేతవః। తత్త్రైవంసతి కర్తారమాత్మానం కేవలంతు యః। పశ్యత్యకృతబుద్ధిత్వా న్నసపశ్యతి దుర్మతిః॥" అనఁగా శరీరము, ఆత్మ, సాధనమును, వివిధములగు చేష్టలు, దైవము,నీయైదును కర్తలు.మనోవాక్కాయములచే నరుఁడేకర్మమును జేయునో యాకర్మ కీయైదును కర్తలు. ఇట్లుండఁ గేవలమునాత్మయే కర్తయనువాఁడు దుర్మతియని భావము. ఇటఁ గర్తృత్వమయిదింటి యందుండఁగాఁ గేవలమాత్మదే యని తలఁచుటయే కారకభ్రమ యనఁబడును.

4. ఆఁకలియు, దప్పియు, శోకము, మోహము, ముదుసలితనము,మృత్యువు అనునివి యాఱును షడూర్ము లనిపించుకొనును.

కావున నన్ను వేఱురీతినిం దలంపక రక్షింపుము. ఓపరమపురుషా! నీవు బ్రహ్మశరీరకుండ వయి సమస్తవ్యష్టిజీవులను సృజించితివి. అట్లు చేసి యాజీవులకు స్థానభూతనగు నట్లు నన్ను సృజించితివి. ఇప్పుడు ప్రకృతిచేఁ గల్పిత మగు దేవమనుష్యాదిప్రపంచ మంతయు నాయం దున్నది. నీవే నన్ను జీవాధారముగా సృజించి యిప్పు డాయుధంబును గేల ధరించి స్వతంత్రుఁడ వయి చంపుటకు యత్నించుచున్నావు. ఇట్లుండ నీకంటె నితరుల నెవరిని శరణముఁ జొత్తును? మఱియు నీ వాత్మయే యాధారముగాఁ గలిగి యిట్టిదని యూహింప శక్యము కానిదై స్వసంకల్పముచేతఁ జరాచరమగు ప్రపంచమును సృజించితివి. నీ వట్టిసంకల్పముచేతనే జగంబును గాపాడ నుద్యుక్తుఁడ వయితివి. అంతియ కాని కాలాగ్నిరుద్రాదులయవతారంబు పూని చంపుటకుఁ బ్రవర్తింప లేదు. కావునఁ బ్రజలఁ బాలించుట యనుధర్మమునఁ బ్రవర్తించుచున్న నీవు ప్రజలకు భోగ్యపదార్థములఁగాను, భోగసాధనములఁగాను, భోగస్థానములఁగాను నున్న నన్నెందులకుఁ జంపఁ దలంచుచున్నావు? ఓదేవా! నీవు మొదట నొక్కండవయినను బ్రహ్మరుద్రాదిజీవరూపమున నానావిధము లయితివి. అట్టియీశ్వరుండవగు నీచేష్టితమును దుర్జయ మగునీమాయచే మోహితచిత్తుల మగు మే మెట్లుగాఁ దెలిసికోఁగలము? ఓమహాత్మా! నీ వచిద్ద్రవ్యము జీవునిపుణ్యపాపకర్మములు, కాలము, జీవుఁడు, మొదలగుశక్తులచేత నీప్రపంచమునకు సృష్టిస్థితిలయములఁ గల్పించుచున్నావు. సృష్టిస్థితిలయములకుఁ గారణములయి కార్యోన్ముఖములయి కావుననే పరస్పరము విరుద్ధము లయియున్నశక్తులు గలిగి కారణభూతుండ వయి ప్రకృతికంటెను బురుషునికంటెను విలక్షణుఁడ

వయియున్న నీకు నమస్కారము. ఓమహాప్రభూ! నీవు నీయందు నీచేత సృజింపఁబడి పృథివ్యాదిభూతంబులతోను శ్రోత్రాదు లగు నింద్రియములతోను, నంతఃకరణముతోను గూడియున్న, ప్రపంచము స్థాపింపఁదలంచి కర్త్రాయత్తము లగుజన్మాదులు లేకపోయినను యథేష్టముగా నేదివ్యవరాహరూపము దాల్చి సుప్రసిద్ధుండవయిజలములఁజొచ్చి నీచే నిర్మితమగుజగంబునకాధారభూతమగు నన్ను రసాతలంబునుండి యుద్ధరించితివి. ఆయాదివరాహమూర్తివగునీవిప్పుడు నీటిపై నావవలెనే యాధారభూతమగు నాపయినున్న ప్రజలను రక్షింపఁదలంచి యీరూపముగా నవతరించితివి. అట్లు లోకరక్షణమునకై యవతరించిననీవు మిగులఁ గోపమూని తీవ్రమగుశరములఁ దాల్చి పాలనిమిత్తము గోరూపధారిణి నగునన్నుఁ జంపఁదలంచుచున్నావు గదా! ఈశ్వరుని యవతారములును చేష్టలును నీశ్వరసంబంధినియు సత్త్వాదిగుణకార్యములకుఁ బ్రధానభూతయు నగుమాయచే మోహితచిత్తుల మగుమావంటియజ్ఞులచే నెట్లుగాఁ దెలియఁబడును. కావున హిరణ్యాక్షాదివీరులను జంపుటచే మిగులఁ గీర్తిని గలిగించు నీ యవతారములకు వందనంబులు. ఇది పదియాఱవయధ్యాయము.

అని యిట్లు పృథివి పృథురాజును స్తోత్రముచేసినను నతని కోప ముపశమింపలేదు. అతఁడు కోపోద్దీపితుఁ డయి కావుననే చలించుచున్నయధరోష్ఠములు గలిగి భయంకరుండై యుండెను. అట్టిపృథురాజును జూచి భూమి మిగుల భయము చెంది తనకుఁ దానే భయంబును దొలంగించుకొని యతని కిట్లనియె. ‘ఓపృథురాజా! కోపమును బూర్తిగా నశింపఁజేయుము. నా చెప్పినవాక్య

మును వినుము. తుమ్మెద ప్రతిపుష్పమునుండియును మకరందమును మాత్రమే గ్రహించుచున్నట్లు సారాసారములను విచారింప నేర్పుగలపండితుండు కేవలమును సారమును మాత్రమే గ్రహించి యసార మగుపదార్థమును విడుచును. కావున సారజ్ఞుఁడవగు నీవు నావాక్యములందుఁ గలసారమును గ్రహించి యసా

భూమి పృథురాజునకుఁ గర్తవ్యము నుపదేశించుట.

రములను విడువుము. ఓమహారాజా! ఉపాయమువలన సమస్తము సిద్ధించును. పురుషులకుఁ బురుషార్థము కలిగించునిమిత్తము తత్త్వదర్శు లగుమునీంద్రులు, కృషి, గోరక్షణము, వాణిజ్యము మొదలగు జీవనోపాయముల నీలోకమందు నిర్ణయించియున్నారు. మఱియుఁ బరలోకము విషయమయి స్వర్గసాధనభూతము లగునగ్నిహోత్రాదు లగు నుపాయంబులు కూడ నిర్ణయింపఁబడియున్నవి. ఇట్లుపూర్వము మునులచే నిర్ణీతములగు జీవనోపాయముల నెవఁడు శ్రద్ధాళు వయి యనుసరించి చేయునో వాఁడు సుఖముగానే యుపాయసాధ్యము లగువస్తుజాతమును బొందును. మఱియు విద్వాంసుఁడయినను బెఱవాఁడయినను బూర్వులచేఁ జూపఁబడినుపాయములను దిరస్కరించి స్వబుద్ధిచేతనే పురుషార్థసాధనములు కానివానినగువానిఁగాఁదలంచి పురుషార్థమును సాధింప నుపాయములు కానివాని నుపాయములుగాను దలంచి, ప్రారంభించినచో వానికనేకములగు విఘ్నములు సంప్రాప్తము లగును. ఒకవేళ విఘ్నములు గలుగుచున్నను ధైర్యముతోనోర్చి యాయుపాయాభ్యాసములనునారంభించినను ఫలంబు లీయఁదగి యుండవు. ఓరాజా! పూర్వము బ్రహ్మ యీలోకమునిమిత్తమును, యాగాదులమూలమునఁ బరలోకనిమిత్త

మును, నోషధులను సృజించెను. లోకపాలనమందును యాగాదుల నొనర్చుటయందును శ్రద్ధ లేని కొందఱు దురాత్ములచే ననుభవింపఁబడి యాయోషధులు నశించుచుండె. అప్పుడు నేను నీవంటిలోకపాలురచేఁ బాలింపఁబడక తిరస్కరింపఁబడి, యాయోషధుల నందఱు నపహరించుచుండుటఁజూచి వార లనుభవించిన నవి మఱుఁగఁ బుట్టవనియు, నవి లేనిచో యాగాదు లొనరింపఁ దగదనియు నాలోచించి, యాగాదులకుపయోగించు నోషధులను స్వీకరించితిని. నేను వానిని స్వీకరించి చిరకాల మగుటచే నవి నాయందు నిశ్చయముగా క్షీణించినవి. అయినను వాని నొక యుపాయముచే మఱల సంపాదింపవచ్చును. ఆయుపాయమును జెప్పెదను వినుము. ఓమహాబాహూ! భూతముల వర్ధించునో రాజా! నీవు భూతములకు బలప్రద మగునన్నము నొసంగఁ దలంచితివేని, గోరూప నగు నా కొకవత్సమును, నొకపాలపాత్రను పాలను బితుకువానిని గల్పింపుము. నీ నట్టిసామగ్రిని సంపాదించినచో నేను నీవిషయమున వాత్సల్యము కలదాన నై పాల రూపమున నున్నయోషధుల నొసంగుదును. ఓవీరా! పర్వతాదులచే నెచ్చుతగ్గులు గా నున్న నన్ను సమము గాఁ జేయుము. అట్లయినచో మేఘముచే వర్షింపఁబడినజలము వర్షాకాలము గతించినను నాయందన్నిస్థలముల నుండును. నీ వట్లు చేయనిచో నాయం దొక్కనీటిచుక్క యయినను నుండదు. ఓరాజా! నీకు భద్రమగుఁ గాక." అని యిట్లు భూమిపలికిన ప్రియవాక్యమును విని తాను బితుకువాఁడై, తన చేతులఁ బాత్రముగాఁ జేసిస్వాయంభువ మనువును వత్సముగా నేర్పఱిచి, సకలౌషధములకు మూలములగు పాలను బితికి భూమియందుఁ జల్లి యోషధులను మొలపించెను.

పృథువు గోరూపధారిణి యగుభూమివలన నోషధులఁ బితుకుట.

పృథురా జిట్లు చేసినపిమ్మట సారాసారములఁ దెలిసినపండితులు గొంత యాగోవువలనఁ బాలు పితికి యన్నివస్తువులందు నుంచి సారవంతములుగాఁ జేసిరి. అనంతరము పృథురాజునకు వశమ యినయాగోవునుండి పెక్కురు తమ కిష్టము లగువస్తువులను స్వీకరించిరి. అట్లు పితికినవారిని వివరించి చెప్పెదను. వినుము, ఓవిదురా! వసిష్ఠాదు లగుమునులు బృహస్పతిని వత్సముగాఁ జేసి యింద్రియములను బాత్రములుగాఁ జేసి పవిత్రమై ఛందోమయ మైనపాలను పితికిరి. పిమ్మట దేవత లందఱును దేవేంద్రుని వత్సము గాఁ జేసి బంగారుకలశమును సంపాదించి మనంబునకు శక్తినిచ్చు వీర్యమును, నింద్రియశక్తి నిచ్చునోజమును, దేహశక్తి నిచ్చుబల మును గలిగించునదై క్షీరాత్మకమైనయమృతమును బితికిరి. తరువాత దానవులు ప్రహ్లాదుని వత్సముగాఁ జేసి యినుపపాత్ర మందు గౌడీ, పైష్టి, మాధ్వి యను మూఁడువిధంబు లగు మద్య మును గలిగించుపాలను బితికిరి. అనంతరము గంధర్వులు, విశ్వా వసును వత్సముగాఁ జేసి పద్మరూప మగుపాత్రమందు వాఙ్మా ధుర్యము నొసంగుపాలను బితికికొనిరి. అప్పుడే యచ్చరలు సౌం దర్యముఁ గలిగించుపాలను బితికికొనిరి. అటుపిమ్మటఁ బితృదేవ తలుసూర్యుని వత్సముగాఁ జేసి కాల్పఁబడని మట్టిపాత్రయందు దమ కన్నము నొసంగుపాలను శ్రద్ధతోఁ బితికికొనిరి. అనంతరము సిద్ధులు కపిలుని వత్సముగాఁ జేసి యాకాశమును బాత్రమునుగాఁ జేసి యణిమాదిసిద్ధులను గలిగించుపాలను బితికికొనిరి. పిమ్మట విద్యాధరులుగూడఁ గపిలుని వత్సముగాఁ జేసి యాకాశ మనుపా

త్రమునందే, యాకాశగమనము మొదలగు విద్యలను గలిగించు
పాలను బితికికొనిరి. తరువాత నాశ్చర్యరూపముల ధరించుపురు
షులు మయుని వత్సముగాఁ జేసి యంతర్థానముఁ బొందుట, య
ద్భుతరూపములఁ దాల్చుట మొదలగు మాయల నీయం జాలు
పాలను బితికికొనిరి. ఆవెనుక మాంసభక్షు లయినయక్షులును, ర
క్షస్సులును, భూతములును, పిశాచములును, రుద్రుని వత్సము
గాఁ జేసి కపాలమును బాత్రముగాఁ జేసి మద్యమువలెనే మత్తత
గలిగించురక్తము నొసంగుపాలను బితికికొనిరి. అనంతరము పడ
గలు లేనిపాములును బడగ లున్నపాములును, కాటు వేయుటే
స్వభావముగాఁ గలపాములును, కద్రూసంతతి యగుపాములును
తక్షకుని వత్సముఁగాఁ జేసి రంధ్రము లనెడిపాత్రములందు విష
రూప మగుపాలను బితికికొనినవి. పిమ్మటఁ బశువులు రుద్రుని
వాహన మగువృషభమును వత్సముగాఁ జేసి యరణ్యమును బాత్ర
మునుగాఁ జేసికొని తృణము నొసంగుపాలను బితికికొనెను. తరు
వాత శార్దూలాదులగుమృగములు సింహమును వత్సముగాఁ జేసి
తమ కళేబర మనుపాత్రమున మాంసము నొసంగుపాలను బితికి
కొనెను. తరువాతఁ బక్షులు గరుత్మంతుని వత్సముగాఁ జేసి కీటాదు
లనుచరములను ఫలాదు లగునచరములను నొసంగుపాలను బితికి
కొనెను. వృక్షములుమఱ్ఱిచెట్టును వత్సముగాఁ జేసి, వెగటు, పులుపు
మొదలగు వేఱువేఱు రసముల నీఁజాలిన పాలను పిసికొనినవి,
పర్వతములు హిమవంతుని వత్సముగాఁ జేసి తమసానువులను బా
త్రములుఁగా జేసి గైరికాదిధాతువుల నొసంగుపాలను బితికికొనిన
వి. ఓవిదురా! ఇట్లు సమస్తజాతులును దమజాతిలో ముఖ్యుఁడగు
వానిని వత్సముగాఁ జేసి తమతమపాత్రములందుఁ దమకోర్కుల

నెఱవేర్చుపాలను వేఱువేఱుగాఁ బితికికొనెను. ఇట్లన్నాదులను గోరుచున్న పృథురాజు మొదలగువారు తమ కభీష్టమగునన్నము నొసంగుపాలను బితికికొనిరి. అనంతరము పృథురాజు సంతుష్టుఁడై సమస్తకామములను నెఱవేర్చినభూమిని కుమారికగా భావించి ప్రేమించెను. ఆవల రాజరాజయినపృథువు మిగుల సామర్థ్యము గలవాఁడయి తనవింటికొప్పుచేఁ బర్వతశృంగములను గుండఁజేసి భూమండలమును జాలవఱకు సమముగా నుండునట్లు చేసె. ఇట్లు పృథురాజోషధులను బితికి భూమిని సమపఱచి ప్రజలకు జీవనమునొసంగుచుఁ దండ్రి బిడ్డలనువలెఁ బోషించుచు, భూమియందచ్చటచ్చటఁ బ్రజలకు నివాసములను గల్పించెను. వానిని వివరించెద వినుము. అతఁడు గ్రామములను, పురములను, వివిధము లగుదుర్గములను గల్పించెను. మఱియు, గొల్లపల్లెలను, గోనివాసస్థానములను, సేనానివాసస్థానములను, బంగారము ప్రబలునట్టిస్థలంబులను, కృషీవలులు నివసించుపల్లెలను, బర్వతప్రాంతములందుండి ఖర్వటము లనఁబడుగ్రామములను, గల్పించెను. పృథురాజునకుఁ బూర్వము పురగ్రామాదులు లేవా యని యడుగకుము. ఆరాజునకుఁ బూర్వమం దెచ్చటను బురగ్రామాదులు లేవు. అందుచేఁ బ్రజలకు సుఖము లేకపోయెను. కాని యిప్పుడు పృథువు కల్పించినపురాదులందుఁ బ్రజలు యథేష్టముగాను సుఖముగాను నచ్చటచ్చట నివసించిరి. ఇది పదియేడవయధ్యాయము.

ఓవిదురా! పృథురాజోషధులను సంపాదించి, భూమిని సమపడునట్లు చేసి యనంతరము స్వాయంభువమనువున కాశ్రమ

మై సరస్వతీనదిచేఁ బ్రకాశించుచున్న బ్రహ్మావర్తమను సిద్ధక్షేత్రమందు నూఱు అశ్వమేధయాగములఁ జేయ సంకల్పించెను. పృథు విట్లు శతాశ్వమేధంబులు చేయుచుంటను దేవేంద్రుండు తెలిసికొని యాగములచేఁ దన్ను మించునని నిశ్చయించుకొని, సహింపలేక పోయెను. ఆబ్రహ్మావర్తము మిగులఁ బుణ్యమైనది. ఆక్షేత్రమునకు సర్వాంతరాత్ముండును, జ్ఞానాదిగుణములు గలవాఁడును, సమస్తలోకమునకును హితముపదేశించువాఁడును, యజ్ఞములచే నారాధనీయుండును, యాగఫలమొసంగువాఁడును నగునారాయణుండు వచ్చెను. ఆసమయంబున బ్రహ్మరుద్రు లతని వెంబడించి వచ్చుచుండిరి. సేవకులతోఁ గూడ లోకపాలురును నతని సేవించుచుండిరి. గంధర్వులును, మానులును, నచ్చరులును నతనిదివ్యచరిత్రముల గానముచేయుచుండిరి. సిద్ధులును, విద్యాధరులును, దైత్యులును, దేవతలును, గుహ్యకులు మొదలగువారును, సునందుఁడు నందుఁడు మొదలగు తనయనుచరశ్రేష్ఠులు నతనిఁ బరివేష్టించి వచ్చుచుండిరి, మఱియుఁ గపిలుండును, నారదుండును, దత్తాత్రేయుఁడును యోగీశ్వరులగు సనకాదులు భగవంతుని పాదసేవయందు వేడుకగలభక్తులును నతని ననుసరించి వచ్చుచుండిరి. ఇట్లు నారాయణుండును దేవతలును మునులును వచ్చి యుండుటచే నాబ్రహ్మావర్తము మిక్కిలి పవిత్రమయినది. అచ్చటిభూమి నేయిమొదలగు హవిస్సుల నిచ్చుచుండెను. మఱియుఁ గోరినను గోరకున్నను నది యభీష్టవస్తువులనెల్లను సమకూర్చుచు యజమానుఁ డగుపృథురాజునకుఁ గూడ నిష్టప్రయోజనముల సఫలముగాఁ జేయుచుండెను. అచ్చటినదులు చెఱకురసము, ద్రాక్షారసము మొదలగు

రసములను, పాలును పెరుఁగును నన్నపానాదులను, నేతిని,దక్ష్ మును, గలిగి ప్రవహించుచుండెను.అచ్చటివృక్షములు శాఖోప శాఖలచే విస్తరించి మకరందములను స్రవింపఁజేయుచుఁ బుష్పఫలాదులను వహించుచుండెను. అచ్చటికి సమీపమున నున్న సముద్రములు రత్ననికరములను గలిగి వర్తించుచుండెను. పర్వతములు,భక్ష్యములు, భోజ్యములు, ఉడికినపదార్థములు,నూరిన పదార్థములు నాఁబడు నాలుగువిధము లగుపదార్థముల నిచ్చుచుండెను. అట్టిబ్రహ్మావర్తమున యాగ మొనరించినపృథురాజునకు దిక్పాలకు లందఱును గానుకలుగొనివచ్చి యర్పించిరి. ఇట్లు నారాయణుని యావేశావతర మగుపృథురాజు నభ్యుదయంబును గాంచి యింద్రుండు సహింపలేక యతఁ డొనరించు యాగమునకు విఘ్నము గలిగించెను.ఆవిఘ్న మెట్టిదియో చెప్పెదను వినుము. పృథురాజు తొంబదితొమ్మిదియశ్వమేధంబులఁ

—●●◆ ఇంద్రుఁడు యాగాశ్వము నపహరించుట. ◆●●—

బూర్తిచేసి నూఱవయశ్వమేధంబుచే నేదస్వరూపుఁ డగుభగవంతు నారాధించుచుండఁగా నింద్రుండు సహింపలేక యొరులకుఁ గానరానివాఁడయి యాగాశ్వము నపహరించెను. ఇట్లపహరించి యశ్వముతోఁగూడ నాకాశమార్గమునఁ జరుగుచుజటలు మొదలగువాని ధరించి ధర్మమూర్తివలెఁ గానవచ్చుచున్నను నధర్మమార్గమునఁ బ్రవర్తించుచుఁ బాషండధర్మమును గవచము ధరించునట్లు ధరించి యున్నయింద్రుఁ డత్రిమునికంటికిఁ గానవచ్చె. అంత నత్రిముని పృథురాజుకుమారుని కీయుదంతమును దెలిపెను. అది విని మహారథుఁడగు పృథురాజుకుమారుండు కోపోద్దీపితుఁడై యాయింద్రు ననుసరించిపోవుచు “ నిలు

వుము, నిలువుము" అని కేకవేసెను. అంతట నింద్రుఁడు నిలిచెను. ఆయింద్రుఁడు జటలను ధరించి శరీరమం దంతటను భస్మమలందికొని యుంటచే మూర్తిమంతమగు ధర్మమువలెఁ గానవచ్చుచుండెను. పృథుపుత్త్రుఁ డతనిఁజూచి యతని ధర్మమూర్తిగా భావించి బాణములఁ బ్రయోగింపక మరలెను. అంత నత్రిముని యశ్వహర్తయగునింద్రునిఁ జంపక మరలివచ్చిన పృథుపుత్త్రునిఁ జూచి యి ట్లనియె. "ఓకుమారా! వాఁడే యాగాశ్వమును హరించెను. వాఁడే దేవేంద్రుఁడు. ఆయన దేవతారాధనరూపమగు యాగమునకు విఘ్నముఁ గావించినవాఁడు. కావున వీఁడు దేవతలలో నధముండని తలపోయుము. వీని నింద్రుఁడని గౌరవింపక వెంటనే పోయి జయింపుము" అని చెప్పి యింద్రునిపై మరలఁ బంపెను. అంతఁ బృథుపుత్త్రుఁ డత్రివాక్యంబుల విని మిగులఁ గోపము వహించి మదగజము ననుసరించిపోవుచున్న సింహమువలె నాకసమునఁ బోవుచున్నయింద్రు ననుసరించెను. ఇంద్రుఁ డది చూచి తనపాషండరూపమును నశ్వమును విడిచి యచ్చటనే యంతర్ధానము చెందెను. అంతఁ బృథుపుత్త్రుఁ డశ్వమును దీసికొని తండ్రియజ్ఞస్థానమునకుఁ బోయెను. అప్పుడు మును లందఱును నారాజకుమారునియద్భుతకార్యమున కానందించి విజయముచేసి యశ్వమును గొనివచ్చెనుగాన విజితాశ్వుఁ డనుసార్థకనామము నతని కొసంగిరి. అనంతర మింద్రుండు గాఢాంధకారమును సృజించి యందుచే నొరులకుఁ గనఁబడనివాఁడయి బంగారపుత్రాళ్లచే యూపమున బంధింపఁబడి యున్నయశ్వమును మరల నపహరించి పూర్వమువలె నాకాశమార్గమునఁ బోవుచుండెను. వాని నత్రిమహాముని చూచి విజితాశ్వునకు

జూపించెను. కాని విజితాశ్వుఁడు కపాలమును ఖట్వాంగమును ధరించి యున్నవానిఁ జూచి యశ్వహర్త యని తెలిసికోలేక యుండ నత్రిముని మరల వాని నియోగించెను. అప్పుడు విజితాశ్వుఁడు కోపము వహించి యింద్రునిఁ జంప బాణము సంధించెను. ఇంద్రుఁడదిచూచి యశ్వమును బాషండరూపమును విడిచి యంతర్ధానము చెందెను. అంత విజితాశ్వుఁ డాహయము ను గొని తండ్రియాగశాలకుఁ బోయెను. ఓవిదురా! యింద్రుండు దాల్చినపాషండరూపమును లోకమునఁ గొందఱు బుద్ధిహీనులు దాల్చుచుందురు. మఱియు నింద్రుఁడు పృథురాజునశ్వము నపహరింపఁ దాల్చినరూపము లన్నియుఁ * బాపషండములే. పాపములయొక్క షండము (సమూహము) కలవారు కావునఁ బాషండు లని జగంబునఁ బ్రసిద్ధినిఁగాంచిరి. పృథురాజు యజ్ఞమునకు విఘ్నముకల్పింపనెంచి యింద్రుండు ధరించి విడిచినవియు, ధర్మము కాకపోయినను ధర్మమువలెఁ గానవచ్చుచున్నవియు, ననుకూలముగ లభించుచున్నవియు, నగు మితసంభాషణము దిగంబరత్వము కాషాయవస్త్రములు, భస్మధారణము మొదలైన పాషండాచారములందు నరులకు ధర్మము లనెడిభ్రాంతి కలిగెను. కాని యవి యెంతమాత్రము ధర్మసమ్మతములుకావు. అనంతరము మితము లేనిబలము గల పృథురాజింద్రుఁడు చేయుచున్నవిఘ్నమును దెలిసికొని క్రుద్ధుండయి విల్లునమ్ములు గొని యింద్రునిఁ జంప బాణమును సంధించెను. ఇట్లు దేవేంద్రునిఁ జంపఁ గృతనిశ్చయుండై కోపముచే

* ఇటఁ బాపషండమనఁగాఁ బాపసమూహ మని యర్థము. పాప+షండ='పాషండ' అనఁగాఁ బాపసమూహ మని యర్థము వచ్చినది.

దుర్నిరీక్ష్యుండయి పరులకు సహింపరానిబలవేగములుగలవాఁడయి యున్న పృథువునుగాంచియత్రి మొదలగుమునులు వారించి యతని కిట్లనిరి. "ఓమహారాజా! నీవు కోపింపకుము. నీయాగమునకు విఘ్నములు కలిగించుచు నీకీర్తిచే హతప్రభుఁడయియున్న దేవేంద్రుని బలవత్తరము లగునాహ్వానమంత్రములచేత, రప్పించి మంత్రబలముచేతఁ బశుపురోడాశముల హోమముచేసినట్లు వహ్నికి వానిని హోమము చేసెదము" అని చెప్పి ఋత్విజులు హోమసాధనములగు స్రుక్కులను గైకొని కోపసంయుతులై హోమము చేయుచుండఁగా బ్రహ్మ యచ్చటికరుదెంచి యాకృత్యమును నివారించుచు నిట్లనియె. "ఓఋత్విజులారా! ఋత్విక్కర్మమును జక్కఁజేయ నధికారము గలమీకు దేవేంద్రుండు వధార్హుండుకాఁడు. ఇంతియు కాక యజ్ఞము భగవంతునిశరీరము వంటిది. అట్లె దేవతలందఱును భగవంతునికి నిరతిశయప్రీతిని గలిగించు శరీరమువంటివారు. అట్లుండ భగవంతునికి శరీరభూతమగు యాగముచేత నతనికి శరీరభూతుఁ డగునింద్రునిఁ జంపుట కేల తలంచుచున్నారు? ఓబ్రాహ్మణులారా! పృథురాజు చేయుచున్న ధర్మరూప మయినయీకార్యమును నశింపఁజేయుట కింద్రుఁడు పూనికొని ధర్మవిరుద్ధము లగు పనులను గొన్నింటిని జేసియున్నాఁడు. ఆపనులు పాషండులాచరింపఁదగినవి కాని మంచివా రాచరింపఁదగినవి కావు. అట్లుండ నింద్రుండాచరించుట గొప్పయన్యాయ మని తలపోయుఁడు. ఇప్పటికిఁ బృథురాజు తొంబదితొమ్మిదియాగములు చేసి యున్నాఁడు. తొంబదితొమ్మిదిమాత్రమే చేసినప్పటికిని బృథు వింద్రునివలె గొప్పకీర్తి గలవాఁడు కాఁగలఁడు" అని పలికి బృథువునుఁ జూచి "ఓరా

బ్రహ్మ పృథువున కుపదేశముఁ జేయుట.

జోత్తమా! నీవు పెక్కులుయాగములను జక్కఁగ నాచరించితివి. ఈయాగములే చాలును. నీవెప్పుడును ముముక్షువులు చేయవలసినధర్మములు చేయుట మంచిదికాని యిఁక నీదృశకర్మముల నాచరింపఁదగవు. మఱియు నీవు నీమనంబున దేవేంద్రునిగూర్చి కోపించుట యుక్తముకాదు. ఆయింద్రుఁడును నీవును భగవంతునికి శరీరమువంటివారలు. అట్లుండ మీరన్యోన్యము విరోధమువహించుట యింతేనియు నర్హముకాదు. నీకు మంగళములు కలుగుఁగాక. ఓరాజా! సావధానచిత్తుండవయి నావాక్యము వినుము. యజ్ఞమునకు విఘ్నము కలిగినదని చింతింపకుము. లోకమున దైవహతమయిన తనకార్యమును సర్వదాతలంచుకొనెడి పురుషునిచిత్తము కోపాతిశయము గలదయి మోహమును బొందును కాని శాంతిని బొందలేదు. ఇంద్రుండొనర్చినపాషండకృత్యములచే నీయాగమందు ధర్మసాంకర్యము కలిగినది. కావున నాక్రతువు దేవతలకుఁ బ్రియముఁ గొలుపఁజాలదు. దేవతలకుఁ బ్రియముగొలుపఁజాలనియాగముఁ జేసిన నేమిలాభముకలదు? ఈయాగమును మానుము. నీయజ్ఞమునకు విఘ్నముకల్పించిన యింద్రునిచే నశ్వాపహరణకాలమందుఁ గల్పితము లయినపాషండధర్మములు చిత్తమును దమవంకకు లాగికొనుచు జనులను దమయధీనులఁగాఁ జేసికొనును. ఇంద్రునిదురాగ్రహమువలన నెట్టియనర్థము సంప్రాప్తమయినదియో చూచుము. ఓధర్మజ్ఞా! వివిధసిద్ధాంతములకనురూపముగుధర్మము మీతండ్రియగువేనుఁడొనర్చినయన్యాయమువలన నశించినది. అట్లు నశించినధర్మమునురక్షించుటకు నీవిప్పుడావేనునిశరీరమునుండి యుదయించితివి. నీవు దు

రాత్ముఁడగు వేనునిదేహమువలన బుట్టినను, నారాయణాంశము వలన జన్మించినకారణమునఁ దండ్రిదుష్టగుణములు నీయందు లేవు. ఇట్లు నారాయణాంశమువలన జన్మించిన నీవు, ఏయభిప్రాయంబునఁ బ్రజాపతులు జగత్తును సృజించియున్నారో, యాయభిప్రాయమును విచారించి వారిసంకల్పమును బూరింపుము. ప్రజాపాలనాధికారము వహించిననీ కిది యెంతయుఁ దగియున్నది. మఱియు లోకమున కనర్థము కలిగించుపాషండమార్గము దేవేంద్రుఁ డవలంబించినమాయయే. అది యధర్మమునకుఁ దల్లి వంటిది. కావున నీవు నాయింద్రమాయను జయింపుము. అట్లుచేయుటకు నీవు సమర్థుండ" వని యిట్లు లోకగురు వయినబ్రహ్మ చక్కఁగ నుపదేశింపఁగా సకలదిక్కులకు నధిపతి యగుపృథు వతఁడు చెప్పిన చొప్పున నింద్రునితో సఖ్యముఁగావించుకొనెను. అనంతర మవభృథస్నానముఁ గావించి విపులము లగుసత్కర్మములు గలపృథురాజునకు యజ్ఞమందుఁ దృప్తు లగుదేవతలు పెక్కువరంబుల నొసంగిరి. అనంతరము సఫలము లగునాశీర్వాదములు గలబ్రాహ్మణులందఱును బృథురాజు శ్రద్ధతో నొసంగెడి దక్షిణలను స్వీకరించి సంతుష్టు లయి, మగుడ సత్కరింపఁబడి యారాజున కాశీర్వచనములఁ గావించిరి. ఓవిదురా! యాగమును జూడ నేతెంచినపితృదేవతలను, దేవతలను, మానవులను జక్కఁగ నతఁడు దానముచేతను, మానముచేతను బూజింపఁగా వారు సంతసించి తమతమ నెలవులకేఁగిరి. ఇది పదునెనిమిదవ యధ్యాయము.

అనంతరము జ్ఞానాదిషడ్గుణములు గలవాఁడును, యోగరక్షకుఁడును, సకలయోగములందు నారాధ్యుఁడును నగు పరమపురుషుండు, పృథురాజు యజ్ఞములచేఁ దన్నుఁ దనివిఁబొందింపనానందభరితుండయి,యింద్రసహితుండై వచ్చిపృథుపుత్రో నిట్లనియె. 'ఓరాజేంద్రా! నీవు నూఱశ్వమేధములు చేయవలెనని సంకల్పించికొని యుండఁగా నీయింద్రుఁడు దానికి భంగముగలిగించినాఁడు. కావున నపరాధియైనయింద్రుని క్షమింపవలెను. దుస్సహ మగునపరాధము నెట్లు క్షమింతునని ప్రశ్నింపరాదు. ఓ రాజా! లోకములో మానవశ్రేష్ఠములును దేహాత్మలతత్త్వమును జక్కఁగాఁ దెలిసినవారును నగు పరోపకారులు దేహమాత్మకంటె భిన్నమయిన దని గ్రహించినవా రగుటచే, దేహాత్మాభిమానముచేత, నపరాధము చేసినను భూతములకు ద్రోహము చేయరు. కావున నీ వాయపరాధమును సహింపవలెను. సన్మతులయిననీవంటిపురుషులు గూడ దేవమాయచే మోహము చెంది దేహాత్మాభిమానముచే భూతములకు ద్రోహముచేయుచున్నచోఁ జిరకాలమునుండి మహాత్ములను సేవించుటవలననీకుఁ బ్రయాసము తప్పవేఱుఫలము గానరాదు. సన్మతు లగుపురుషులు దేహాత్మాభిమానమును బురస్కరించుకొని భూతములకు ద్రోహము చేయరు. కావుననే దేహాత్మాభిమానముచేతను, స్వతంత్రాభిమానముచేతను. నవిద్యవలనఁ గలిగెడి శబ్దాదివిషయక మగు నిచ్ఛచేతను, గామమువలనఁ గలుగు పుణ్యాపాపరూప కర్మములచేతను, దేహ ముద్భవించుచున్న దని యెఱింగినవారై, ప్రకృతిపురుషేశ్వరుల తత్త్వములను దెలిసికొని, దేహమందనురాగము గలిగియుండరు. మఱియు నిట్లు శరీరసంబంధము గలి

గించుకొనక శరీరముచే సంపాదితము లయినగృహములందును, దారపుత్రాదులందును,ధనమందును, నేపండితుఁ డయినను మమకారమును జేయునా? ఎవ్వఁడును జేయఁడు? కావునఁ బండితుఁడు దేహాదులనిమిత్తమును దేహానుబంధులనిమిత్తమును, భూతద్రోహమును జేయరాదు. ఇంతియకాక మిక్కిలి భేదముగలిగి యున్న దేహాత్మ లొక్కటి యని తలంపరాదు. ఓరాజా! దేహా

—విష్ణువు పృథువునకు దేహాత్మలకుఁ గల్గుభేదము నిరూపించుట—

త్మస్వరూపములను జక్కఁగ వివరించిచెప్పెద నాలింపుము.ఆత్మ దేవమనుష్యాదిశరీరములం దున్నను,జ్ఞానైకాకారత్వముచే నంతట నేకరూప మై యుండును.దేహము దేవమనుష్యాదిభేదములచే నానావిధము లయియుండును. ఆత్మ నిర్మలమైనది. దేహము మలినమైనది. ఆత్మ స్వయంప్రకాశమైనది. దేహమట్టిది కాదు. ఆత్మ రాగద్వేషాదులు లేనిది. దేహము దోషాదియుక్తమైనది. ఆత్మ జ్ఞానానందాదిగుణముల కునికిపట్టై యుండును. దేహమున కట్టిగుణములు లేవు.ఆత్మ యణుస్వరూపమైనను ధర్మభూతజ్ఞానముచే సర్వమును వ్యాపించియుండును. దేహము సర్వవ్యాప్తము కాదు. ఆత్మ గృహాదులచే నావృతమైయుండదు. దేహమ ట్లావృతమై యుండును.ఆత్మ దేహేంద్రియాదులకు సాక్షియై యుండును. దేహమున కట్టిసామర్థ్యము లేదు. ఆత్మ దేహాదులందుఁ బ్రవేశించి ధారకమైయుండును. దేహము ధార్యము.కావున నాత్మ దేహమునకంటె విలక్షణమైన దని తెలియుము.అందుచేత నే దేహమునకుసంప్రాప్తములగు బాల్యయౌవనాదిదశలు దేహాదులకు ద్రష్టయగునాత్మకుఁ గలుగనేరవు. మఱియు దేహ

గతములగు బ్రాహ్మణత్వము మొదలగుజాతు లాత్మకుఁ జెందక పోవుటచేతనే యాత్మ శరీరమునకంటె వేఱయినదని చెప్పవచ్చును. దేహవిలక్షణ మగునాత్మ యెప్పుడైనఁ దెలియవచ్చునా? అని శంకింపరాదు. సుషుప్తియందు దేహగతము లగు బ్రాహ్మణత్వాది ధర్మములు తెలియఁబడక దేహవిలక్షణ మగు నాత్మపదార్థ మనుభూతి మగుచుండును. *ఓరాజా! ప్రకృతిపురుషస్వరూపములను

* పై రెండుశ్లోకములకును ప్రకృతిపురుషవిలక్షణ మైనపరమాత్మపరముగాను నర్థమును చెప్పవచ్చును.

ఓరాజా! పరమాత్మస్వరూపమును వివరించెద. నాలింపుము. పరమాత్మకు సమమయినవస్తువు గాని యాతనికంటె నధికమగువస్తువు గాని లేదు. అతఁడు పాపాదులు లేనివాఁడు. అతఁడు నిరుపాధికుఁడై స్వయముగాఁ బ్రకాశించుచుండు. అతఁడు ప్రకృతిపురుషసంబంధము గలవాఁడైనను దద్గతములయిన అజ్ఞత్వ దుఃఖిత్వాదిదోషములు లేనివాఁడు. అతఁ డనంతకల్యాణగుణములకు నిలయుండు. అతఁడు స్వరూపముచేతను స్వభావముచేతను సర్వవ్యాపియై యుండును. అతఁడు దేహాదులం దున్నవాఁడైనను వానికి లోఁబడియుండువాఁడు కాఁడు. అతఁడు సమస్తము సాక్షిరూపముగాఁ బ్రత్యక్షము చేసికొనఁగలఁడు. అతఁడు జీవాత్మకంటెను బరుఁడు. అతఁడు సర్వమందును బ్రవేశించియుండి శాసించుచు ధారకుఁడై యుండును. జీవుఁ డిందులకు విపరీతముగా నుండును. అతఁడు నానాకారములు కలిగియుండును. జీవుఁడు స్వయంప్రకాశకుఁ డయినను ప్రకృతివికారములగు దేహాదుల సంబంధముచే మలినుఁ డగును. అతఁడు వాస్తవముగా సత్యసంకల్పాదిగుణములు గలవాఁడయినను, నవిద్యావ్యామోహితుఁడు. కావున స్వరూపమును మఱచి కల్యాణగుణముల కాకరుండు కాకపోవుటయే కాక యజ్ఞత్వాదిగుణములనుగూడఁ జెందియుండును జీవుఁ డణుస్వరూపుండు కావున సర్వగామియై యుండఁజాలఁడు. అందువలననే జీవుఁడు దేహాదులచేఁ బరిచ్ఛిన్నుఁడైయుండు. అతఁడు స్వకృతకర్మఫల

నీకువివరించితిని. కావున నో మహారాజా! నీవును దేహసంబంధముව

ము ననుభవించువాఁడుగాని సాక్షియై యుండఁడు. అతఁడు పరమాత్మకు వ్యాప్యుఁడై యుండును. అట్లు పరమాత్మ ప్రకృతిపురుషులకంటె విలక్షణుఁడై యుండును; గావుననే ప్రకృతిజీవులు పొందుచున్న వికారిత్వము మొదలగుధర్మములును, కేవలము ప్రకృతిపురుషులందు మాత్రమే యున్న జడత్వాణుత్వాదులును, నా ప్రకృతిపురుషులకు సాక్షియైతదంతరాత్మయై యున్న పరమాత్మకుఁ జెందవు పరమాత్మ ప్రకృతిజీవులకు విలక్షణుఁ డయినవాఁడు. ఇట్లు ప్రకృతిపురుషేశ్వరులకు వైధర్మ్యమున్నదని చెప్పుటకు సుషుప్తియే యుదాహరణము. ఓరాజా! ఇట్లుజీవుఁడు పరమాత్మకంటె విలక్షణుండనియు, నతనికి భార్యుఁడనియు, నేమహానీయుఁడు తెలిసికొనునో, వాఁడు పాసనదశయందుఁ బ్రకృతియుక్తుఁడైనను నుపాసనానంతరమునఁ బ్రకృతిగుణములనుండి-విముక్తుఁ డగును, ఓరాజా! పురుషుఁ డిట్లు స్వవర్ణాశ్రమముల కుచితములగు నిత్యనైమిత్తిక ధర్మములను నిర్వర్తించుచు, నా ధర్మాచరణములవలనఁ గలుగుఫలము నపేక్షింపక ఇంద్రాదిసకలదేవతాస్వరూపుఁడనై సకలకర్మఫలములను నొసఁగుచు నిత్యుఁడనై యున్న నన్ను శ్రద్ధతో భజింపవలయును. అట్లు భజించినమనస్సు క్రమముగా రాగాదులనుండి తొలంగి నిర్మలమైనదగును. ఇట్లు పురుషుఁడు రాగద్వేషాదిగుణములను విడిచి, కావుననే నిర్మల మగునంతఃకరణము కలవాఁడై, యందువలన నాత్మస్వరూపమును, జక్కఁగా నెఱిఁగి, క్షుత్పిపాసాదులగు షడూర్మలను విడిచి, నాకు శరీరభూతమగు నపహతపాప్మత్వాదు లగు గుణాష్టకమును బొందుచున్నాఁడు. ఇంతియకాక పృథివ్యాదిభూతములకును, శ్రోత్రాది జ్ఞానేంద్రియములకును, వాగాది కర్మేంద్రియములకును మనస్సునకును, నధిపతియును, స్వరూపముచేతనే నిర్వికారుఁడును, నగు పరమాత్మ యుదాసీనుఁడై యున్నట్టు లెఱిఁగినమహాత్ముఁడు జీవద్దశయందుఁ గూడ సుఖమునే పొందును. ఓరాజా! పృథివ్యాదిభూతములు జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు చిత్తము, స్వరూపముగాఁ గలిగి ద్రవ్యాత్మకమై కావుననే దేవమనుష్యాది భేదములచే నానావిధమయిన లింగశరీరమునకు మార్పు గలుగుచుండును

లన సంభవించుసుఖమునందును,దుఃఖమునందును సముఁడవైయుండి యింద్రియములను నంతఃకరణమును వశముఁగావించుకొని

గాని ఆత్మకుఁ గలుగవు. కావున తత్త్వత్రియము నెఱిఁగినపండితు లామార్పులకుజంకి లింగదేహపరియుక్తులై యిచ్చుసంపదలందుసంతోషమును విపత్తులందు దుఃఖమును పొందక ప్రవర్తించుచుందురు. ఓయా! లింగశరీరమునకు మార్పుగల్గుచున్నట్లు పృథివ్యాదిధర్మములకు ధ్యతుఁడై యుండుటవలనఁగల్గుమార్పు ఆత్మయందు లేదా?అనిఁ జెప్పెదను. వినుము. అవును.ఆత్మకుద్రవ్యాద్యధ్యక్షత్వరూపవికార మున్నను నది జ్ఞానవికారరూపమైనది. ఆవికారమైనను ధర్మరూపజ్ఞానమందున్నది.కాని స్వరూపమందున్నది కాదు.కావున నాత్మ కూటస్థుఁడనియు మార్పులేనివాఁడనియుఁ జెప్పవచ్చును. దేహాదిరూపపరిణామము ద్రవ్యసమూహముదే కాని యాత్మది కాదు. ఓయీ! ధర్మభూతజ్ఞానమునకు మార్పున్నదని యంగీకరించుచున్నావు. ధర్మభూతజ్ఞానమునకు మార్పున్నచో ధర్మిభూతజ్ఞానమునకుఁ గూడ మార్పేల కలుగదు? దానిఁగూడ నంగీకరించినపరమాత్మకు కూటస్థత్వము సిద్ధించుటెట్లు? అనినచో సమాధానమును వినుము. కూటస్థత్వమనఁగా వికారములు లేకుండ నుండుటయే యని యర్థము. ఇంతియు కాక కూటస్థత్వమనఁగా నిత్యత్వమనియు నర్థము జెప్పవచ్చును. ఆలోచింప ధర్మిభూతజ్ఞానము నిత్యమే. అయినను దానికిఁ గర్మవిశేషముచే నొకప్పుడు సంకోచమును ఒకప్పుడు వికాసమును గలుగుచుండునని యంగీకరింపవలసి యున్నది. మఱియు నాధర్మభూతజ్ఞానమునకుఁ బ్రసరముకలదు. ఆజ్ఞానమున కట్టి ప్రసరము లేకపోవుటయే సంకోచమనఁబడును. దానికట్టిప్రసరము కలిగియుండుటయే వికాసమనఁబడును. జ్ఞానప్రసరమేకర్మవిశేషముచే సంకోచవికాసములను బొందుచుండుటచే ధర్మభూతజ్ఞానము గూడ ధర్మిభూతజ్ఞానమువలెనే నిర్వికారమనియు నిత్యమనియుఁ జెప్ప వలనుపడుటచే ధర్మభూతజ్ఞానమును బట్టియుఁ బరమాత్మ నిర్వికారుఁడును నిత్యుఁడును నగుచున్నాఁడు. కావునఁ బరమాత్మకుఁ గూటస్థత్వములో ననుపపత్తి యేమియును లేదు.

యుత్తమాధమమధ్యము లయిన దేవతిర్యఙ్మనుష్యాదులందు
దేహాతిరిక్తమగు సామ్యము ననుసంధానముసేయుచు, నీవు సం
పాదించి యున్నయమాత్యాదులతోఁ గూడి సమస్తలోకమును
సమముగా రక్షింపుచూ. ఓయీ! నాకు మోక్షముఁ గలిగింపక
యఖిలలోకరక్షణమును జేయు మని యేల చెప్పెదవని శంకింప
కుము. ఓయవనీశా! రాజు ప్రజాపాలనమును ధర్మయుక్తము
గాఁ జేయవలయును. అట్లు చేసినరాజు దేహమును విసర్జించిన
పిమ్మట ప్రజలపుణ్యములో నాఱవపాలు పొందును. రాజు
ధర్మయుక్తముగాఁ బ్రజలఁ బాలింపనిచోఁ బ్రజలవలన పన్ను
పుచ్చుకొన్నవాఁడు కావున నే తనపుణ్యమును బ్రజల కర్పించి
వారలపాపమును దా ననుభవించును. ప్రజలఁ బాలించుటవలన
నిట్టిలాభమును, నట్లు చేయకుండుటవలన నట్టినష్టమును గలదు.
కావున రాజునకుఁ బ్రజాపాలనమే శ్రేయస్సాధన మగుచున్నది.
అట్లుండ నీవు ప్రజాపాలన మేల చేయరాదు? నీ విట్లు ధర్మయు
క్తముగాఁ బ్రజలఁ బాలించినచో నీకు ముక్తికూడఁ దప్పక
లభించును. ఓరాజా! బ్రాహ్మణవర్యులకు ననుమతముగా వర్ణా
శ్రమోచితధర్మముల నాచరించుచు, దత్ఫలమును నపేక్షింపక,
ప్రజలలో దానును నొకఁడనియుఁ దనయందు స్వాతంత్ర్యము
నారోపించుకొనక, ప్రజలను రక్షించుచున్నచో బ్రజానురాగము
గల నీవు దగినసమయములయందు నీగృహంబులకు విచ్చేయు
సనకాదిసిద్ధులను సందర్శించి వారల యుపదేశంబున మోక్ష
మును బొందుదువు. ఓమానవేంద్రా! నీ శమదమాదిగుణముల
చేతను, సుస్వభావముచేతను, వశీకృతుఁడ నైతిని. సుస్వభావా
దులచే వశుఁడ నైనట్లు సమచిత్తము గలనేను పృథ్వీంద్రా

యజ్ఞాదితపంబులచేతను, యోగములచేతను, వశుండను గాను. నీ కేదైనను వరంబు నొసంగెదను. కోరుకొనుము. ఓవిదురా! లోకప్రభు వయిన విష్ణువుచేఁ బృథురాజీప్రకారము శాసింపఁబడి యతని యాజ్ఞను మిక్కిలి యాదరించెను. మఱియు దన యపరాధమును క్షమింపు మని యతని పాదములఁ బడి తన యపరాధమునకు సిగ్గుపడుచున్న దేవేంద్రునిఁ బ్రేమతో నాలింగనముచేసికొని యతనియెడఁ గ్రోధమును విడిచెను. అనంతరము సర్వరూపుఁడైన విష్ణువును, బృథురాజు సమర్పించిన పూజాసత్కారమును గైకొని తనలోకమునకుఁ బోవ నభిముఖుఁడై యుండియు, నిరతిశయభక్తిచేఁ దనపాదములను బట్టుకొని వదలక యున్న పృథువునందలియనుగ్రహముచే నాలస్యము చేయుచుఁ బద్మపత్రములవలె విశాలములయిన నేత్రములతోఁ జూచుచు వెడల లేక పోయెను. ఆపృథురాజునుఁ బ్రాంజలియై యానందబాష్పములచేఁ గన్నులు నిండుటచే హరినిఁజూడ సమర్థుఁడుకాక గద్గదకంఠముగలిగి యేమియును సంభాషింపనేరక మనస్సుచే హరిని కౌఁగిలించుకొనియుండెను. అనంతరము పృథువు, కన్నీటిని దుడుచుకొని, తనకంటికి గోచరుఁడై * కాలిచే భూమిని స్పృశించుచు గరుత్మంతునిబుజముపై హస్తాగ్రము నుంచియున్నహరిని గాంచి యిట్లనియె. ఓవరదా! నీవు బ్రహ్మాదులకుఁగూడ నధిపతివై వరముల నిచ్చువాఁడవు. అర్థకామాదు

* దేవతలు భూమిని స్పృశింపరు. ఐనను విష్ణువు తనపాదముచే భూమిని ముట్టుచున్నట్టు చెప్పఁబడినది. అట్లు చెప్పుటచే విష్ణువు పృథువునందలి కృపాతిశయమువలనఁ దనయొడలుమఱచి చేయఁదగినపని యేదియో తగనిపనియేదియో తెలియఁజాలక పోయె నని తెలియఁదగినది.

పృథువు నారాయణుని నుతించుట

లన్నియు నీశ్వర ఫలంబులు. అట్లు తెలిసికొనియుండియుఁ గొందఱు సత్త్వాదిగుణానుసారముగా వికారము నొందుచున్న సంసారు లనుభవింప వలసినవరములను గోరుచుందురు. కాని నేను ముక్తినైన నిచ్చు నీవంటిమహాత్మునిదయ వడసి యట్టితుచ్ఛవరములను గోరను. అట్లయిన మోక్షమును గోరుకొందువా యని యందు వేని, నేను దానిని గోరను. ఆమోక్షమునందు మహాత్ముల హృదయాంబుజములనుండి ముఖద్వారమునఁ బ్రవహించునీపాదపద్మ మకరందమును, నీసత్కీర్తిగుణములను వినుటయు నెట్లు సంభవించును? అవి లేనిమోక్షముతో నాకుఁ బ్రయోజన మేమి? కావున మోక్షమును గోరను. నీయనంతగుణములను వినుటకుఁ బెక్కుచెవుల నొసంగుము. ఇదియే నాకభీష్ట మగువరము. దాని నొసంగుము. అట్టివరముఁగోరితి వేమని యడుగు దేని చెప్పెద. విను. ఓసత్కీర్తిరాశీ! నీభక్తులముఖపద్మమునుండి స్రవించుచున్న నీపాదపద్మామృతలేశమును గొనివచ్చువాయువును గొంచెము, శ్వాసించినను, నద తత్త్వమార్గములను మఱచినసామాన్యయోగుల మగుమావంటివారికి మరల నీభక్తిని గలుగఁజేయుచున్నది. అట్లు నీభక్తిని వర్ధించు నీకీర్తిశ్రవణమే నాకు వలయునుగాని మోక్ష మక్కఱలేదు. కావున నీగుణశ్రవణమునకుఁ జాలినన్నికర్ణములనే నాకొసంగుము. మహాత్ములసహవాసము చేసి వారివలన నీగుణకీర్తులను విని సంతసించెదను. ఇంతియకాక నీగుణములను వివరించి చెప్పుమహాత్ములసహవాసము లభించినప్పుడు వారు నుతించుచున్న నీగుణములను లక్ష్మీదేవిసైత మత్యాదరముతో వినుచుండఁ గర్మజడుఁడయినపశువుతప్ప గుణగ్రాహియగు

పురుషుం డేవండు విననిష్టపడఁడు? కావునబద్ధులకంటెను,ముక్తుల కంటెను, నిత్యులకంటెను నుత్తముఁడవయి, సర్వజ్ఞత్వాదులగు ననంతకల్యాణగుణములు గలవాఁడవయి యున్న నిన్ను లక్ష్మీదేవి వలెనె నేనును నత్యాసక్తితో సేవించెదను. ఏకవస్తువును భజించునప్పుడు నాకును లక్ష్మికిని గలహము సంప్రాప్తమగునేమో యని భావింపకుము. దేవా! నీవు పరిచ్ఛిన్నుఁడవు కావు. నేనును లక్ష్మియుఁద దేకనిష్ఠతో నీచరణాబ్జములనుసరించుచున్నవారము. కావున మా కట్టికలహము కలుగనేరదు. ఓజగదీశా! ఆలోచింప జగజ్జనని యగులక్ష్మితో నాకు విరోధము కలిగినఁ గలుగవచ్చును. ఆలక్ష్మి చేయుచున్న కార్యములనే నేనునుఁ జేయఁగోరినప్పుడు కలహ మేల సంప్రాప్తము కాదు? అగుఁగాక.అందులకు నే భయ పడను. నీవు దీనవత్సలుఁడవు కావున నిన్ననితో విరోధించి నప్పుడు నాయందు బక్షపాతమునుంచినట్లు లక్ష్మితో విరోధించినప్పుడును నాయందుఁ బక్షపాతమును వహింపక మానవు. భక్తుల నాదరించినట్లు లక్ష్మి నాదరింపవని నేనెఱుఁగుదును. ఓలోకనాథా! యజ్ఞాదికర్మములందుఁ బ్రకృతివలన మాకు సంప్రాప్త మగు ఫలమంతయు ననర్థదాయక మైనదియె. ఇట్లనర్థదాయక మగు ప్రాకృతఫలమును సాధించుటచే నీచములైనను యజ్ఞాదులు భవదర్పితములైనప్పుడు నీవు భక్తిని గలిగించి, తన్మూలమున ననంతమును, శాశ్వతమును, నగు ముక్తి నొసంగుచున్నావు. ప్రకృతిసంబంధముచే మేము చేయున దెఱుంగక, యారాధన రూపము లయినయాగాదికర్మములను బహుపుత్రాదులైన యైహికాముష్మికసుఖముల నపేక్షించి చేయుచుండ మాకట్టి నీచఫలాశనువదలించి శాశ్వతస్థిరఫలమును గలిగించుట దీనవత్సలుఁడవగు

నీ కెంతయు సముచితముగానున్నది. ఓ దేవా! యాగాదికర్మములు తుచ్ఛములైనవి. కావుననే నిష్కాములయినపురుషులు మాయా గుణము లగుసత్త్వాదులచేఁ గలుగు దేహాత్మభ్రమను నాత్మ స్వాతంత్ర్యమైన దను భ్రమను నిరసించియున్న నిన్నుఁ దత్త్వజ్ఞానము కలిగినతరువాతనుగూడ సేవించుచుందురు. ఇంతే కాదు. నిరతిశయానందరూప మగునాత్మానుభవము తమకుఁ గలిగినను నీపాదపద్మస్మరణము తప్ప వేఱుఫలము నపేక్షింపనిసాధువులు నిన్ను భజింపక మానరు. ఇట్లుండ నీవు నిన్ను భజించెడినన్ను నుద్దేశించి, "ఇష్టవరము నిచ్చెదను గోరుము" అని పలికితివి. ఆవాక్యము జగమునకు వ్యామోహమును గలిగించుచు విషసంయుక్తమగు క్షీరమువలెనే యనర్థదాయకమని తలంచెదను. భక్తానుగ్రహశీలుండ వగునీకిది యింతేనియు నుచితము కాదు. పాశతుల్యమగు నీవాక్యముచే, జనుఁడు బంధింపఁబడక యున్నచో ఫలమోహితుఁడై ప్రవృత్తికర్మముల నాచరించునా? ఆచరింపఁడు. ఓయీశ్వరా! నీమాయచే స్వాత్మపరమాత్మజ్ఞానము లేక యున్న జనుఁడు దైవసంకల్పమువలన నిన్ను భజించుచు సత్యస్వరూపుఁడవయిననీవలన నర్థకామాదు లయిన సామాన్యఫలముల నేపొందినచో వాఁడు నీపాదమూలమునకు దూరీకృతుఁడగుచున్నాఁడు. కావున నీయంత నీవే కుమారునికి హితముచేయు తండ్రివలెనే మాకుహితము చేయ నర్హుండవు" అనిపలికినపృథురాజువాక్యములు విని సంతసించి నారాయణుండిట్లనియె. 'ఓమహారాజా! నీవు చక్కఁగాఁ జెప్పితివి. నీవైహిక ఫలముల నపేక్షింపలేదు. కావుననాయందు భక్తికలిగి నీవు స్వర్గమును మోక్షమునుగూడ హేయములుగాఁ జూడఁగలవు. ఓరాజా! నీనడవడికి నేను మిగుల సంతసిం

చితిని. నీవు నామాటయందు శ్రద్ధ యుంచి విడువఁదరముకాని దయినను రోషమును విడిచితివి; మఱియు నావాక్యమును మన్నించితివి. నావాక్యమును మన్నించుటే నాకుత్కృష్టమగునారాధనము ఓమహీశా! నాయందు నీకు భక్తివర్ధిల్లుఁగాక. దైవవశముచే విడువఁదరముగానిమాయను సులభముగా విడిపింపఁజేయు నీదృశమగుభక్తిని గలిగియుంట కానందమొదవెడును" అని పలికి యుతఁడుపలికినవచనమును నుతించి యతనిచేఁ బూజితుఁడై యతనినను గ్రహించినారాయణుండు తనలోకమునకేఁగనిశ్చయించెను. అప్పుడు దేవర్షులును, పితృదేవతలును, గంధర్వులును, చారణులును, పన్నగులును, కిన్నరులును, నచ్చరలును, నమరులును, దక్కినభూతములును, భగవదాత్మకబుద్ధి గలపృథురాజుచే యథార్థముగా బూజితులై యాగభూమినుండి కదలి భగవంతు ననుసరించిపోయిరి. అంత నారాయణుఁడు గురువులతోఁ గూడి చూచుచున్న పృథురాజుమనస్సు హరించుచున్నవాఁడుంబోలెఁ దనలోకమున కరిగెను. అంతట పృథురాజు తనకు దర్శనమిచ్చి యంతర్ధానము చెందనవాఁడును బ్రహ్మాదిదేవతలకు దేవుఁడు నగువాసుదేవునకు నమస్కరించి తనపురమున కరిగెను. పందొమ్మిదవయధ్యాయము.

పురవర్ణనము.

ఓవిదురా! పృథురాజు తనపురమును బ్రవేశించె. ఆపురము ముత్తెములసరులచేతను, బూలదండలచేతను, వస్త్రములచేతను, బంగారపుబహిర్ద్వారములచేతను, మిక్కిలి వాసనగొలుపు ధూపములచేతను వెలయుచు నానందము గొలుపుచుండెను. అందలి రథ్యావీథులన్నియును, జందనము, అగరు మొదలగు పరిమళ

ద్రవ్యములచే సిక్తము లయి యవాంకురములచేతను, దీపము లచేతనుఁ బుష్పములచేతను, ఫలములచేతను, నక్షతలచేతను, పేలాలచేతను, విలసిల్లుచుండెను. మఱియు రంభాస్తంభముల చేతనుఁ, జిన్నపోకవృక్షములచేతను నలంకరింపఁబడినవి. పలు రకములగు చిగుళ్లచే నవి మెంతయు నందము గలిగియున్నవి. అంతట నాపురప్రజలు తమరాజు వచ్చుటకు సంతసించి పలు విధము లగుపూజాద్రవ్యములను, ననేకములగు మంగళద్రవ్య ములను నవలంబించి రాజున కభిముఖులై నడచిరి. అప్పుడు నానాలంకారములచే భూషితలై ప్రకాశితలయి యున్న స్త్రీలు ను రాజాభిముఖులై నడువఁజొచ్చిరి. అంతఁ బృథువు శంఖనినా దములును, దుందుభిస్వనములును, అంతటను వ్యాపింప,ఋత్వి జుల వేదఘోష ప్రబలుచుండఁగా గర్వరహితుఁడై యందఱిచేఁ నుతింపఁబడుచు, దనమందిరమును బ్రవేశించెను. రథ్యాదులం దచ్చటచ్చటఁ బౌరులచేఁ బూజితుఁ డయినపృథురాజు వారల పూజలకు సంతసించి యాపురవాసులకును, జానపదులకును, దేశవాసులకును, నిష్టవరముల నొసంగి. యథార్థముగాఁ బూ జించెను. ఓవిదురా! ఉదారగుణుఁడును మిగులఁ బూజ నీయు డును, నగుపృథురాజు నిర్దుష్ట మగువ్యాపారముకలవాఁడయి, యీదృశము లగునద్భుతకర్మముల నొనరించుచు, భూమండ లమును బరిపాలించెను. అనంతర మతఁడు విపులమగు తనకీర్తి నీలోకమున నిలిపి పరమపదమును బొందెను.” అని మైత్రే యుండు విదురునకుఁ జెప్పెననియు నట్లె శుకుండు రాజున కెఱిం గించెననియు సూతుండు మునులకుఁజెప్పె వెండియు నిట్లనియె. ఓశౌనకమునీంద్రా! సకలసద్గుణములచే నుద్భూతమై గుణవం

తులచేఁ బూజిత మయినపృథురాజు కీర్తిని విని విదురుండు కథ
కుఁ డయినమైత్రేయునిఁ బూజించుచు బాగుబాగని నుతింపు
చు, ని ట్లనియెను. ఓమునీంద్రా! పృథురా జిట్లు బ్రాహ్మణులచే
నభిషిక్తుఁడయి దేవేంద్రాదులనుండియుఁ బూజలనుఁ బొంది,
విష్ణుసంబంధి యగువీర్యమును దనబాహువులందు నించి వైష్ణవ
బలపూరితము లగుబాహువులచే భూమిని దోహదము చేసి, యిం
క నేమేమి చేసెను? ఎవఁడుపృథ్వీదోహనాదులగునద్భుతకార్యము
లొనరించెనో యాపృథురాజుకీర్తిని బుద్ధిమంతుఁ డయినచో నెవఁ
డాలకింపఁడు? ఏమహనీయుఁడు భూమివలనఁ బితికి విడిచినవస్తుస
మూహమువలనసమస్తభూపతులు లోకపాలురతో నిదివఱకును
బ్రదుకుచున్నారో యనవద్యమగునాపృథువుచరితమునువివరించి
నాకుఁ దెలియఁజేయుము' అనియడిగినవిదురుంజూచిమైత్రేయుం
డిట్లనియె. 'ఓవిదురా! గంగాయమునానదులకు మధ్యముననున్న
బ్రహ్మావర్త మనుపుణ్యక్షేత్రమున నివసించుచుఁ, * బూర్వక
ర్మార్జితము లగుభోగములను మాత్రమే యనుభవించెను.
మఱియు నతఁడు తనశాసనమును సప్తద్వీపములయందును జెల్లు
నట్లు చేయుచుఁ, దనకో సముఁడగువానిని నొక్కనిఁ గానక

* ఇందులకు మూలము "ఆరబ్ధాన్" అని యున్నది. "ఇట ఆరబ్ధాన్"
అనుపదమునకుఁ బ్రాచీనకర్మార్జితములగుభోగములననుభవించుచుండెననియే
చెప్పవలెనుగాని యపూర్వములను సాధించెడిసాధనములను జేయుటచేనారబ్ధ
ములగువానిని గాదని యెఱుంగునది. ముముక్షువునకుఁ బాపమువలెను బుణ్య
మును ఫలమును గ్రహించి మోక్షమునకు భంగము గలిగించును గానఁ దాదృశ
పుణ్యమునువిడువవలెఁ చిన బుద్ధిమంతునకు భోగసాధనకర్మముల నాచరించుట
యసంభవము. కాన పృథు వట్లె చేసెనని భావము.

బ్రాహ్మణులను, భగవద్భక్తులను గాక తక్కినవారినిదగునట్లుదండిం
చుచుఁ బాలించుచుండెను. అతఁడొకప్పుడు మహాసత్రమును జేయ
సంకల్పించుకొనిదీక్షితుఁడై యుండెను. ఆమహాసత్రమున దేవతల
యు, బ్రహ్మర్షులయు, దేవర్షులయు మహాసభయొకటి ప్రవర్తిల్లెను.

పృథువు సభాసదులను బూజించుట.

అప్పుడు పృథు వాసభకు వచ్చినమహాత్ముల నందఱను యథార్హ
ముగాఁ బూజించి సభామధ్యమునం జుక్కలలోఁ జంద్రునివలెఁ
బ్రకాశించుచు, లేచి నిలువంబడియె. అతఁడున్నతుఁడై బలిసినదీ
ర్ఘబాహువులు గలవాఁడయి యుండెను. అతఁడు పద్మపత్రముల
వలె నరుణములయిన నేత్రములు కలవాఁడు. అతఁడు సుందర
మగునాసయు ముఖమును గలిగి ప్రసన్నుఁడై పరఁగుచుండెను.
అతనిస్కంధములు మిక్కిలి బలిసియుండెను. అతఁడు శోభనదం
తములును మందహాసమును గలవాఁడు. అతనికి విస్తీర్ణమయిన
వక్షస్థలమును బీవరము లయిననితంబములును గలవు. అతనికి
మూఁడయినవళులచే సుందరమై, రావియాకువలె మీఁద విస్తృ
తమై, క్రింద సంకుచితమైయున్న యుదరము గలదు. అతఁడు మిగుల
నింద్రియశక్తి గలిగియుండెను. అతని యూరువులు కాంచనము
వలె నుజ్జ్వలము లయి, పాదము లున్నతములయి యుండెను. అ
తని కేశములు సన్నములై, వంకర గలిగి మృదువులై, నల్లనివయి
యుండెను అతనికంఠము రేఖాత్రయయుతమయి శంఖమును
బోలుచుండెను. అతనిశరీరము శ్రేష్ఠములై యమూల్యములయి
యున్నదుకూలములచేఁ బ్రావృతమయి యుండె. అతనిసమస్తా
వయవములును సత్రదీక్షచే నాభరణరహితము లగుటచే స్వా
భావికశోభను వెలువఱుచుచుండెను. అతఁడు కాంతిమంతుం

డయి, పవిత్రపాణియయి, యుచితకర్మముల నెఱవేర్చియుండెను. అతఁడు సంతాపహారములును స్నిగ్ధములును, నగునేత్రములు గలవాఁడు. ఈదృశుఁడగు పృథురాజు సభ్యులను సంతసింపఁ జేయుచున్నవానివలె, శ్రావ్యమై, చిత్రపదములు గలిగి మృదులమై, యపశబ్దములు లేక, యర్థగంభీరమయి, యవ్యాకులమయినవాక్యములను బలికెను. "ఓసభ్యులారా! యీసత్రమునకు విచ్చేసినమీ కందఱకును భద్రమేకదా? ధర్మములఁ దెలియఁదలంపుకలవారు తెలియఁదగిన తమయభిలాషమును సత్పురుషుల చెంత విన్నవించుకొనవలెను. నేను బ్రహ్మచేఁ బ్రజలను శాసింప నియుక్తుఁడనైతిని. ఇంతియకాక ప్రజలను స్వీయము లగువర్ణాశ్రమధర్మములందు నిలుచునట్లు చేయుటకును జీవనము నిచ్చుటకును రక్షించుటకును గూడ నియుక్తుఁడనైతిని. ప్రజారక్షణాదికమును జేయునరపతి కెట్టిలోకములు వచ్చునని బ్రహ్మవాదులు పలుకుచున్నారో యాలోకములు ధర్మయుక్తముగాఁ బ్రజారక్షణాదికమును జేసిననాకు లభించుఁగాక. మఱియు ప్రజారక్షణాదికమును నేను జేయుచున్నప్పుడు చూచుచుసాక్షియైనయీశ్వరుఁడు సంతసించును. అతఁడు సంతసించిన నాకు ముక్తిత ప్పకను లభమైయుండును. అట్లు ధర్మయుక్తముగాఁ బ్రజలను శిక్షింపకయే పన్నును గ్రహించుచున్నరాజు ప్రజలపాపమునంతను ననుభవించును. వాఁడు స్వీయమగుజ్ఞానశక్తిని బలాదులనుసయితము గోల్పోవును. కావున, ఓప్రజలారా! మీకుఁ బ్రభువునైననానిమిత్తము మీరసూయారహితులై భగవదర్పణబుద్ధిగలిగిపిండప్రదానాదులవలెఁ బరలోకహితకరములైన మీమీవర్ణాశ్రమధర్మముల నాచరింపుఁడు. మీరట్లులోనరించినచో, నాయందుమీ

కెక్కుడనుగ్రహము గలదని తలంతును. ఓ దేవతలారా! ఓ పితృదేవతలారా! మీరా రసూయారహితులై, నాయనుశాసనము ననుమతింపుఁడు. పుణ్యమునుగాని పాపమునుగాని చేయువాఁడును, చేయించువాఁడును, వాని కనుమతించువాఁడును బరలోకమును బొంది సమఫలమునే యనుభవింతురు. కావున నాయనుశాసనము ననుమతించినమీరును సత్ఫలమును బొందకమానరు. ఓయుత్తములారా! * ఆస్తికులమతమందు, యాగాదులం దారాధింపఁబడి యాయాగఫలమును దత్కర్తల కిచ్చు

---

*నిరీశ్వరమతఖండనము—సాంఖ్యులు నిరీశ్వరవాదు లిట్లనుచున్నారు. ప్రకృతిపురుషులకంటె వ్యతిరిక్తుఁడగువాఁడును, ఈశ్వరుఁ డను పేరు గలవాఁడును లేఁడు. అట్లున్నట్లు ప్రమాణము కానరాదు. అతఁ డెప్పుడును గంటికిఁ గానరాకుండుటచేఁ బ్రత్యక్షప్రమాణము పనికిరాదు. అనుమానప్రమాణమును బ్రస్తుతోపయోగి కాదు. అనుమానప్రమాణ మెట్టిదనఁగా అనుమానప్రమాణమునకు సాధ్యమును, హేతువు దృష్టాంతము నుండవలెను. హేతువునుబట్టి సాధ్యమును సాధింపవలెను. అనుమానశరీర మెట్లన, 'పర్వతము, నిప్పుగలది. పొగగలది గనుక, వంటయింటివలెనే' అనఁగా వంటయింటియందుఁ బొగయుండుటచే నిప్పున్నట్లు చూచుచున్నాముకాన, పొఁగయుండుచోటులందెల్ల నిప్పుండక తీఱదు కనుక, పర్వతము పొగగలది కనుక నదియు నగ్నిగలదియె. ఇటఁ బర్వతమందు వహ్ని యున్నదని సాధించుచున్నాము. కాన వహ్ని సాధ్యము. పొగ హేతువు. వంటయింటియందువలె నన్నది దృష్టాంతము. మఱియు సాధ్యమును హేతువును నెప్పుడయిన నొకప్పుడు చూచి యుండవలెను. హేతు వయినపొగ యుండు నన్నిచోటులందును సాధ్యమగునగ్ని యుండక తీరదు. కావున హేతువుఁబట్టి వహ్నిని సాధించుచున్నాము. అట్లె యనుమానప్రమాణమునుబట్టియీశ్వరుని సాధింపవలసియుండును. కాని యట్లు వలనుపడదు. సాధ్య మగునగ్ని యెప్పుడయిన నొకప్పుడు మనకుఁ బ్రత్యక్షమై యున్నట్లు ఇట సాధ్యమగు బ్రహ్మ

నట్టి యీశ్వరుఁడొకఁడున్నాఁడనియు, నీలోకమందును పరలోకమందును, విచిత్రములగు భోగభూములును, వాని ననుభవించు

పదార్థముగూడఁ గంటికి గోచరమై యుండవలెను. సాధ్యమన నెట్టిదియో యెఱుంగనప్పుడు దానిని సాధించుటెట్టులు? అగ్నిని సాధించుటకు సాధనమగు పొగయును, దృష్టాంతమగు మహానసమును నున్నట్లు బ్రహ్మపదార్థమును సాధింపనట్టి వేవియును లేవు. కాన ననుమానప్రమాణము నిరాకరణీయము. శబ్దాదులుగూడ నీశ్వరుఁడున్నాఁడనుటకుఁ బ్రమాణము కాదు. ప్రమాదాదిదోషదూషితములగుటచేఁ బ్రమాణములుగాఁ జేకొనఁదగినవి కావు. మఱియు శ్రు॥ సత్యంజ్ఞానమనంతం, నిష్క్రియం నిష్కలం॥ ఇత్యాదులగు వేదవాక్యములుగూడ ప్రమాణములుగావు. లోకములో వృద్ధులవ్యవహారములకంటె నితరములగు నర్థములను బోధించెడిశక్తి శబ్దములకుఁ జాలదు. మఱియు వ్యవహారము కార్యబుద్ధిపూర్వముగఁ గలదగుటచేఁ గార్యరూపమగు నర్థము విషయమయియే శబ్దము ప్రమాణము కాని తదితరవిషయములందుఁ గాదు. మనుష్యశబ్దము కరచరణాద్యవయవవిశిష్టుఁడగు నొకవ్యక్తిని జెప్పుచున్నది కాన నాశబ్దమునందే సామర్థ్యముగలదు గాని యితరములందుఁ గాదు. లోకములోని శబ్దములను వృద్ధులు కార్యరూపమగు నర్థము నెఱింగియే వ్యవహరించుకొనుచున్నారు కాన వైదికశబ్దములనుగూడ గార్యరూపమగు నర్థమందే ప్రమాణముగా వ్యవహరింపవలయును. ఇట్లుండఁ గార్యరూపము కాని యీశ్వరునివిషయమై యెట్లు ప్రమాణము లగును? ఇట్లు ప్రమాణములు కానివేదములందుఁ జెప్పఁబడినఫలప్రాప్తియు నసంభవమే. "ఓయీ! ఇష్టాపూర్తం బహుధాజాతం, బ్రహ్మవిదాప్నోతి పరం॥ ఇత్యాదులచే నైహికఫలమును నాముష్మికఫలమును బ్రహ్మోపాసనమువలన బ్రహ్మప్రాప్తిరూపమగు ఫలమును లభించుచున్నట్లు చెప్పఁబడుచున్నదని శంకింపకుము. ఆశ్రుతులు సమస్తకర్మను లందును గర్తయగు జీవాత్మకుయాథార్థ్యమును దెలియఁజేయుటందేయుపపన్నములగుచున్నవి కానినీవనినట్లు తత్తత్ఫలప్రదాయకత్వమందు కాదు. ఓయీ! చిత్రపటాదులను పనిఁబూని నైపుణ్యముతో వ్రాయుచుండుట జూచుచున్నాము. ఆచిత్రపటాదు లాకరు

విచిత్రశరీరములును బెక్కులు గానవచ్చుచున్నవనియుఁ, బ్రకృతిపురుషులకంటె వేఱుగా నీశ్వరుఁడు లేనిచో నిట్టిసృష్టి లభించుట

వ్రాయకుండ నంత తాను గలుగుట చూడలేదు. అట్లె మయూరాదులగు చిత్రతరపదార్థములను సృజింప నీశ్వరుఁడు లేనిచో నవి యెట్లు పుట్టుచున్నవి? చిత్రపటాదులు స్వయంభూతము లయినట్లు మనము చూడలేదు కాన నవియు స్వయంభూతములు కావు. వానిఁ జేయువాఁడొకఁడుండవలెను. వాఁడే ప్రకృతిజీవులకంటె వ్యతిరిక్తుఁడగు నీశ్వరుఁడని యంగీకరింపక తీరదు. అతఁ డుండుట వలనఁ దదుపాసనాదికమువలన ఫలమును సంప్రాప్తమగుచున్నది అని ప్రశ్నింపరాదు. జీవుఁడు పుణ్యపాపరూపము లగు కర్మముల నాచరించుచున్నాఁడు. ప్రకృతి జీవుఁ డొనరించిన కర్మముల కనురూపము లగు చిత్రరూపములుగా మాఱుచుండును. అంతియ కాని దాని నట్లు మార్చువాఁడు లేఁడు. ఇంతియ కాక యౌషధవిశేష సంబంధమువలన నాప్యాయనము లగునవియు విషాదిసంపూరితము లగునవియు నగు నన్నాదులు నియమితకాలమందు సుఖమును దుఃఖమును గలిగింప హేతువులగుచున్నట్లు జీవుఁ డొనరించిన పుణ్యపాపముల సంబంధముచేఁ బ్రకృతియు దేశకాలవ్యవస్థలచేఁ దదనుగుణమగు రూపములుగాఁ బరిణమించుచున్నదని తెలియుచున్నది. కావునఁ బ్రకృతిపురుషులకంటె వ్యతిరిక్తుఁ డగు నీశ్వరుండు మఱియొకఁడు లేఁ"డని చెప్పుచున్నారు. కాని యది విశ్వసింపఁదగినది కాదు. ఓయీ! యాగాదులందుఁ బూజనీయుఁడును తత్తత్ఫలము నిచ్చువాఁడును నొక యీశ్వరుఁ డున్నాఁడు. అట్టి యీశ్వరుఁడు లేనిచో నీలోకమందును బరలోకములందును విచిత్రతరములగు భోగభూములును నాభూముల ననుభవించు విచిత్రశరీరులగు భోక్తలు నుండుట యసంభవము. ఈశ్వరుఁడుండుట చేతనే యది సంభవించుచున్నవి. ఓయీ! మీరు ప్రకృతియే జీవకర్మానుగుణముగా విచిత్రరూపముల నొందుచున్నదని చెప్పుచున్నారు. అది యుచితము కాదు. సర్వజ్ఞుఁ డగు నీశ్వరునిచే నధిష్ఠితము కాకుండఁ బ్రకృతి కట్టి విచిత్రరూపముల నొందు సామర్థ్యము లేదు. ఒకవేళ సర్వజ్ఞుఁడగు నీశ్వరునిచేఁ బ్రేరితము కాక ప్రకృతియే తనంత తాను విచిత్రరూపములు

యాసంభవమనియు, కావున నీశ్వరపదార్థ మున్నదనిఁ బెక్కురం గీకరించినారు. అట్టియాస్తికులలో మనువును నుత్తానపాదుఁడును,

---

గాఁ బరిణమింపఁగలిగినచో నది ప్రళయకాలమందు నట్టివిచిత్రరూపముల నేల పొందియుండరాదు? మఱియుఁ బ్రకృతి కట్టిరూపముల నొందుట యెల్లప్పుడును స్వభావమే యై యుండవలయును గాని యొకమాఱట్టిస్వభావముండుటయు మఱొకప్పుడు లేకపోవుటయుఁ గలుగదు. అగ్నిహోత్రమున కుష్ణత్వము స్వాభావిక మయినప్పు డగ్ని యాగుణమును విడిచి యుండుటను జూచుచున్నామా? అట్లె ప్రకృతికి విచిత్రపరిణామము స్వాభావికమే యయినయెడలఁ బ్రళయమందు లేకపోనేల? కావునఁ బ్రకృతి కట్టిసామర్థ్యము లేదనియు సర్వజ్ఞుఁ డగునీశ్వరుండే యాప్రకృతి నధిష్ఠించి యిట్టివిచిత్రరూపములుగా మార్చుచున్నాఁడనియు నందువలన నీశ్వరు నంగీకరింపక తీఱదనియు చెప్పవలసియున్నది. ఈశ్వరుని నంగీకరించినచో నాఁడు సత్యసంకల్పుఁడు కాన నతనికట్టిసంకల్పమున్నప్పుడు మానుటయు నుపపన్నమగుచున్నది. ఓయీ! కేవలము ప్రకృతి కట్టిశక్తి లేకపోయెను, జీవసంబంధమున దాని కట్టిశక్తి లభించినదని చెప్పరాదా యని యన్నచో నది యుక్తముగాదు. జీవుఁడు తానొనర్చినరూపకర్మముల కనుగుణముగాఁ బ్రకృతిని మార్చుచున్నచో స్వేచ్ఛచేఁ దన కనర్థమెవ్వఁడును తెచ్చికొన నిష్టపడఁడు కాన పశుపాదపాది శరీరముల నొందక యెల్లప్పుడు మంచిరూపములగా మార్చుచుండును గాని కర్మానుగుణముగా మార్పఁడు. దీనివలనఁ బాపానుభవ మెవ్వరికిని కలుగనే కలుగదు. కావున జీవాతిరిక్తుఁ డగునీశ్వరుఁ డున్నాఁడని యంగీకరింపవలెను. అట్లయినచో "శ్రు॥ ఇష్టాపూర్తం బహుధా జాతం జాయమానం" "యతః ప్రవృత్తిర్భూతానాం యేన సర్వమిదం తతం। స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః" అనఁగా నెవనివలన భూతములకు ప్రవృత్తి గలుగుచున్నదో యెవనివలన నీసమస్తము కలుగుచున్నదో యాయీశ్వరుని స్వవర్ణాశ్రమోచితములగు కర్మములచేఁ బూజించి మానవుఁడు సిద్ధిని పొందుచున్నాఁడని యర్థము.

ధ్రువుఁడును, బ్రియవ్రతుఁడును. నాపితామహుఁ డయినయంగ రాజును. బ్రహ్మయు, రుద్రుఁడును, ప్రహ్లాదుఁడును, బలియును, ని

శ్లో॥ తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్, క్షిపామ్యజస్రమశుభా నాసురీష్వేవయోనిషు॥ అనఁగా వెనుకఁ జెప్పఁబడిన నీచులనందఱిని సంసారమందును, నందులో నీచయోనులందును, బడునట్లు చేసెదనని చెప్పఁబడి యుండుటచేఁ బరమపురుషుండును సమస్తకామములను బొందినవాఁడును, సర్వజ్ఞుండును, సత్యసంకల్పుండును నగు పరమాత్మ, తనమాహాత్మ్యమునకుఁ దగిన లీలలందుఁ బ్రవృత్తుఁడై "ఈకర్మములు మంచివి. ఇవి చెడ్డవి" అని కర్మములను రెండువిధములుగా విభాగించి యాకర్మములను బురస్కరించికొని యాయాకర్మముల కుచితములగు దేహేంద్రియాదికమును వాని నియమించుటకుఁ దగినశక్తిని సకలజీవులకును సామాన్యముగా నిచ్చి తనశాసనములను దెలియఁజేయు వేదమును దెలిపి తదుపసంహారమునిమిత్తము జీవాంతరాత్మగాఁ బ్రవేశించి, నియమించుచు, నందులోఁ బుణ్యకర్మము లాచరించుచుఁ దన యాజ్ఞను మన్నించివర్తించువారిని దెలిసికొని ధర్మార్థ కామమోక్షములచే వర్ధింపుచుండును. తనశాసనము నతిక్రమించి వర్తించువారిని విరుద్ధఫలభాక్కులనుగాఁ జేయుచువర్తించుచుండును. ఇట్టివిచిత్రకర్మములు సంభవించుట యీశ్వరు నంగీకరించినచోనే సరిపడును. సత్యంజ్ఞాన మనంతమిత్యాది శ్రుతులచేఁ గర్మాంగభూతమగు జీవాత్మతత్త్వము నే తెలుపఁబడుచున్నవని చెప్ప వలనుపడదు. కర్తయైన బద్ధజీవుఁడయినను ముక్తజీవుఁడయినను మిడుగుఱుఁబురుగువంటివాఁ డనియును, నవిద్య మొదలగు హేయగుణములు గల వాఁడనియునుఁ జెప్పఁదగినవాఁడు. అట్టి బద్ధముక్తజీవులకుఁ గేవలము పరమాత్మయందు మాత్రమే యుండఁదగిన సకలదోషరహితత్వము, జ్ఞానానందత్వము మొదలగు ననంతకల్యాణగుణములు కలిగియుండుటయు, జగదాదులనుసృజించుటయు, సర్వజ్ఞత్వము, సర్వశక్తిత్వము మొదలగునవియు సంభవింపవు. అట్టి గుణములు పరమాత్మయందే యున్నట్లు శ్రుతులు చెప్పుచున్నవి. శ్రు॥ అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసస్సత్యకామ స్సత్యసంకల్పః॥

ట్టివారే మఱికొందఱును, నగ్రేసరులని చెప్పవచ్చును. వీరందఱును నానాజీవుల కర్మములకనుగుణముగా ఫలము నిచ్చువాఁడీశ్వరుఁడేయని నిర్ణయించియున్నారు. మఱియు ధర్మార్థకామములనెడి త్రివర్గము జీవులొనరించు ధర్మాదులకు ఫలమగుస్వర్గాదిలోకములును, మోక్షసుఖమును,నొక్కఁడగుపరమాత్మచేత నీయఁబడు చున్న కారణమున, ధర్మస్వరూప మెట్టిదియో, తద్విధాన మెద్దియో, యందులకు సాధములేవియో, యట్లొనరించుటకు ఫలమేదియో యెఱుఁగక దుఃఖభాజనులై యున్న వేనుఁడు మొదలగువారుతక్క తక్కినవారందఱు నీశ్వరుఁ డున్నాఁడనియె భావించియున్నారు. అచేతనములగు కర్మములకు నపవర్గాములనొసంగునంతటిశక్తి లేదు కావున సుకర్మదుష్కర్మద్వారకముగా జీవులకుఁ దత్ఫలంబుల నొసంగువాఁడీశ్వరుఁడే కాని మఱొక్కఁడు కాఁడు. ఆయీశ్వరునిపదకమలధ్యానము సకలానర్థములను దొలంగింపక మానదు. ఆధ్యాత్మికాదికమగుతాపత్రయముచే నాతురులైనవారలకు నాపరమేశ్వరుని పాదములసేవ దినదినమును వర్ధిలుచు ననేకజన్మములయందు సంపాదితమగుచిత్తమాలిన్యమును గంగాజలము మలినమునువలెనే తొలంగించుచున్నది. మనోమలము తొలఁగుటవలనఁ బెద్దలాభంబు గలదు. ఇట్లు మనోమలినమును దొలఁగించికొన్నమానవుఁడు వైరా

తదైక్షత బహుస్యాం ప్రజాయేయ. తత్తేజోఽసృజత. యస్సర్వజ్ఞ స్సర్వవిత్, యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ’ ఇత్యాదులన్నియు సిద్ధవస్తుపరములే కాని జీవపరములు కావు. కావునఁ బ్రకృతిపురుషులకంటె వ్యతిరిక్తుఁడగుపరమాత్మ యున్నాఁడనియు నతఁడట్టిగుణములకలవాఁడని యూ తెఱుఁగునది.

గ్యసంపన్నుఁడై, ప్రకృతికంటె వేఱయినయాత్మస్వరూపమును దెలిసికొని యాజ్ఞానవైరాగ్యంబులచేఁ గలిగినబలము గలవాఁడై భగవంతునిపాదమూలమందు నివసించుచు, విజాతీయవస్తువులందుఁ బ్రత్యయము విడిచి యతనియందే తనచిత్తమును నిలిపి జన్మమును, ముదుసలితనముమరణాదులను గలిగించుసంసారమును బొందఁడు. కావున "ఓసభ్యులారా! మీమీవర్ణాశ్రమముల కనుగుణము లగుకృత్యములచేతను, శమదమతపశ్శౌచాదులచేతను, ధ్యానముచేతను స్తోత్రములచేతను, బరిచర్యాదులచేతను, నిష్కపటులయి వర్తించుచుఁ గోరినదానికంటె నధికమగుఫల మొసగూర్చునని నిశ్చయించి సమస్తకామములనుఁ బూర్తిచేయుపాదపద్మములు గల పరమపురుషుని మీరు భజించుచుండుఁడు. మఱియుఁ బరమాత్మ హేయగుణములులేనివాఁడు. అనంతకల్యాణగుణములు గలవాఁడు. స్వరూపముచేతనే విజ్ఞానసాంద్రుఁడయి వఱలుచుండువాఁడు. ఆపరమేశ్వరుఁడే వేఱువేఱయిన వ్రీహ్యాజ్యాదు లగుద్రవ్యములును నీలశ్వేతాదు లగుగుణములను, నాలంభనాదు లగుక్రియలును, మంత్రములును, మొదలగువానిచే యాగస్వరూపుఁడయి యాగఫలాదులగు స్వర్గాదిలోకములును, వాని కాధారభూతులగు నగ్నీంద్రాదిరూపశరీరములును, వారలను జెప్పెడి యగ్నీంద్రాదిశబ్దములును దానే యగుచున్నాఁడు. ఓసభ్యులారా! వేయేల? వ్రీహ్యాజ్యాదు లగుయాగద్రవ్యాదిరూపముగాను, యాగాదులకు ఫలము లగుస్వర్గాదిలోకములుగాను, నింద్రాదులం దంతర్భూతుఁడై యాగఫలమిచ్చువాఁడుగాను, నున్నవాఁడు భగవంతుఁ డొక్కఁడేయని తెలిసికొనుఁడు. ఇట్లు దేవేంద్రాదుల నారాధించి

నవారు గూడఁ దదంతరాత్మ యగుపరమేశ్వరునినే పూజించిన వారగుటచే నందఱు నొక్కదేవతనే యారాధించునట్లు తెల్లమ గుచున్నది. మఱియుఁ బరమేశ్వరుఁడు ప్రకృతిచేతను, బ్రకృతి గుణము లగుసత్త్వాదులచేతను, సంస్కారములచేతను, బుణ్య పాపరూపము లగుకర్మములచేతను, నారబ్ధ మగుశరీరమునందు జీవాత్మద్వారకముగా శబ్దాద్యనుభవరూప మగుజ్ఞానమును, బొంది కర్మఫలములగు స్వర్గాదిలోకములుగాఁ గూడ నూహింపఁ బడుచున్నాఁడు కావునఁ గర్మములును, నాకర్మములచే నా రాధింపఁ దగినవాఁడును, నందులకు ఫలమును, దత్ఫల మనుభ వించువాఁడును నీశ్వరుఁడే కాని మఱొక్కఁడు లేఁడు. ఓయీ! శరీరసంబంధము కలిగినచోఁ బరమేశ్వరునికి శరీరగతదోషములు చెందక మానునా? యని శంకింపరాదు. దారువులం దగ్ని హోత్రము వెలయుచుండు. ఆదారువు స్థూలముగా నున్నప్పు డగ్నియు స్థూలముగా నున్నట్లును, నదియే దీర్ఘమయి యున్న ప్పుడు దీర్ఘముగాను, వక్రముగా నున్నప్పుడు వక్రముగాను గానవచ్చుచున్నను, వాస్తవముగా నగ్నికి దారుగతము లగు వ క్రత్వదీర్ఘత్వాదు లెంతమాత్రమును జెందవు. అట్లు పరమే శ్వరుఁడు జీవద్వారకముగా శరీరసంబంధము కలవాఁడయి యు న్నను శరీరగతము లగుదోషము లతనికిఁ జెందవు. కావున నా దేశమందు నివసించినమీ రందఱును దృఢసంకల్పులై మీ మీవర్ణాశ్రమములకుఁ దగినధర్మములచేత నింద్రాదుల కంత రాత్మయును, హితోపదేశముచేసి భక్తులను బాగుచేయువాఁ డును, దన్నాశ్రయించువారిపాపములను బాపువాఁడును నగు పరమేశ్వరుని నిరంతరమును సేవించుచుండవలయును. అట్లు

పరమేశ్వరుని భజించినవారలే నాయనుగ్రహమునకుఁ బాత్రు
లగుచున్నారు. ఓజనులారా ! పరమేశ్వరుఁడే దైవముకాని వే
ఱొకఁడు లేఁడని విశ్వసించి, తితిక్షచేతను కృచ్ఛ్రచాంద్రాయ
ణాది తపములచేతను, బ్రహ్మోపాసనముచేతను, నతిథిపూజలచే
తను, శమదమాదులచేతను, బ్రాహ్మణకుటుంబములు స్వయము
గానే ప్రకాశించుచుండును. కాన వానికెప్పుడు నేరాజును నప
రాధము చేయరాదు. బ్రాహ్మణరాజకులము లన్యోన్యానురాగ
ములై యొప్పుచుండవలయును. బ్రాహ్మణులందు గొప్పసామర్థ్య
ము కలదు. బ్రాహ్మణుల పాదాభివందన మొనర్చి హరి యెప్పు
డును దన్ను పడిచియుండనిలక్ష్మిని, కీర్తినిఁ బొందియున్నాఁడు. మ
ఱియు బ్రాహ్మణుల సేవించినవారిని జూచి హరి సంతసించుచుం
డును. ఆహా! బ్రాహ్మణసేవాపరాయణు లయినమన్వాదులకును
దేవుఁడు. ఆతఁడు మొట్టమొదటివాఁడు. అతఁడు స్వయంప్రకా
శుఁడు. అతఁడందఱియందు నంతరాత్మయై యుండును. అతఁడు
బ్రాహ్మణారాధనముచేఁ దప్పక తుష్టి చెందును. ఒకరిని బూజిం
చిన మఱొకరు సంతుష్టిఁ జెందుట యెట్లని తలంపరాదు. పర
మాత్మ సర్వాంతరాత్మ కావున బ్రాహ్మణారాధన మతనికిని జెం
దును. అందువలన మీ రందఱును సర్వవిధములచేతను బ్రహ్మ
కులము నారాధింపవలయును. మఱియు బ్రాహ్మణకులములను
సేవించుటచేఁ బురుషునిమనస్సు శీఘ్రముగా నుపాయాంతర మ
క్కఱ లేకయే శాంతమును జెందును. అట్లు శాంతమగు మన
స్సు గలవారి కేమికొఱంత గలదు? వారికసాధ్యమగువస్తు వేది
కలదు? మఱియు విప్రు లింద్రాది దేవతలకు ముఖమయి యుం
దురు. వారు పరబ్రహ్మయావేశావతారము లని చెప్పవచ్చును.

అందువలన బ్రాహ్మణారాధనమువలనఁ బరమాత్మ సంతసించును. ఇంతియకాక యగ్నిహోత్రుఁడు కూడ నింద్రాదులకు ముఖమే అయినను బ్రాహ్మణులు పరమేశ్వరునకుఁ బ్రియతములని యె ఱింగి శ్రద్ధచే బ్రాహ్మణముఖమందు హుతము చేసినహవిస్సు ను బరమేశ్వరుఁ డెంతసంతసముతో భుజించునో యగ్నియందు హోమము చేసినద్రవ్యము నంత సంతసముతో భుజింపఁడు. అం దులకుఁ గారణము బ్రాహ్మణులు కేవలము జ్ఞాననిష్ఠు లగుటయే. జ్ఞానవంతులు నాకుఁ బ్రియతములని భగవంతుఁడే స్వయముగాఁ జెప్పియుండెను. జ్ఞాననిష్ఠులగుబ్రాహ్మణులు తనకుఁ బ్రియతము లు కావున బ్రాహ్మణముఖమం దుంచినద్రవ్యమును స్వముఖ మం దుంచినట్లె యెంచి ప్రియముతోఁ దినుచుండును. ఓ సభ్యులారా! జ్ఞాననిష్ఠ మగుటచేత నే యగ్నికంటె బ్రాహ్మణులు తక్కృష్టులు. మఱికొన్నివిశేషములు గలవు. ఆబ్రహ్మణకుల ము రాగద్వేషాదిదోషములు లేనిది. అది యనాది యైనది. అది పరమాత్మస్వరూప మనియే చెప్పవచ్చును. బ్రహ్మసాక్షా త్కారమునిమిత్తమును, తాదృశబ్రహ్మజ్ఞానమునిమిత్తమును, ఉ పాసనచేతను, నుపాసనోపయుక్తము లగు జ్ఞానయోగకర్మయో గములచేతను, బవిత్రాచారములచేతను, వాఙ్నియమముచే తను, ధ్యానముచేతను, ధారణచేతను, వేదాధ్యయనాదుల చేతను గూడి యుండును. ఆవేదమును సామాన్య మయినది కాదు. అది పరమాత్మస్వరూపాదికమును సులభముగా నద్ద మందుఁ జూపినట్లు చూపును. ఓయార్యులారా! అట్టిబ్రా హ్మణుల పాదపద్మపరాగరేణువును నా కిరీటముమీఁద నెల్లప్పు డును దాల్చుచుందును. అట్లు చేసినవానిపాపములు త్వరగానే

నాశనమందును. అట్టివానిని సకలకల్యాణగుణములు నాశ్ర యించును. శీల మనుధనము కలిగి, కృతజ్ఞుఁడై జ్ఞానవృద్ధుల నాశ్రయించి యున్నకల్యాణగుణవంతుని సంపదలు స్వయముగానే వరించును. కావున బ్రాహ్మణకులమును, గోకులమును భక్తజనులును బరమేశ్వరుఁడును నాకుఁ బ్రసన్నులగుదురు కాక ''అని యిట్లు పలుకుచున్నపృథురాజును గాంచి పితృదేవతలును, దేవతలును, బ్రాహ్మణులును, సాధువులును సంతుష్టహృదయు లై "బాగు బా''గని యిట్లు నుతించిరి. "ఓరాజా ! తండ్రి కుమారునిచేఁ బరలోకములను సంపాదించుకొను నన్న జనశ్రుతి సత్యమయినది. పుంసంజ్ఞక మగునరకమునుండి రక్షించువాఁడు గాదా పుత్త్రుఁ డనఁబడును. నిన్నుఁ బుత్త్రునిగాఁ బడసినహేతువుచేఁ బాపాత్ముఁడై బ్రాహ్మణశాపహతుఁ డయిన వేనుఁడు నరకమును దరించెను. ఓరాజా ! హిరణ్యకశిపుఁ డనువాఁడొకఁ డుండెను. వాఁడు భగవంతుని నిందించి నరకకూపమునఁ బడ సిద్ధముగా నుండియుఁ, గుమారుఁ డయినప్రహ్లాదునిప్రభావముచే నరకము నతిక్రమించెను. అట్లె నీవలన నీతండ్రియును నుత్తమగతిఁ జెందెను. ఓరాజా ! సమస్తజనులకును నీయందు దృఢమయినభక్తి గలదు. కావున నీవు భూవలయంబును బరిపాలించుచుఁ బెక్కువత్సరంబులు జీవింపుము. ఓపవిత్రకీర్తీ ! ఉత్తమశ్లోకుఁడును. బ్రాహ్మణులకుఁ గూడ దేవుఁడును నగుపరమేశ్వరునిగుణములను వివరించి చెప్పితివి. ఇట్టి నీచేతను మేము సనాథుల మయి నిన్ను సేవిష్ణువుగాఁ దలంచుచున్నాము. ఓభూమీశ్వరా ! దయాళులగు మహాత్ములకుఁ బ్రజలయం దనురాగము కలుగుట స్వాభావికగుణము. కావున నీవు మమ్ముఁ బ్రేమించు

ట యత్యద్భుత మయినది కాదు. మఱియు దైవ మనువేఱు నామముతో వ్యవహరింపఁబడుచున్న కర్మములచే సంసారకూపమునం బడియున్న జ్ఞానమును గూడఁ గోల్పోవుచుంటిమి. ఇట్లుండ నీవు మా కిపుడు హితోపదేశము చేసి నరకమునుండి తప్పించి రక్షించితివి. బ్రాహ్మణులం దధిష్ఠించి, క్షత్త్రియులను క్షత్త్రకులము నధిష్ఠించి విప్రకులమును బోషించుచు, నారెంటి నధిష్ఠించి యీప్రపంచమును బోషించుచుఁ గేవలశుద్ధసత్త్వము కలిగియున్న పరమపురుషునియవతార మగు నీకు నమస్కారములు" అనిరి. ఇది యిరువదియవయధ్యాయము.

పృథురాజునొద్దకు సనకాదు లరుదెంచుట.

ఓవిదురా! విపులపరాక్రముఁ డగు పృథురాజును జనులు నుతించుచుండఁగా సూర్యునివంటి తేజస్సు గలిగిన నలువురు మును లచ్చటి కేతెంచిరి. ఇట్లు స్వతేజస్సుచే లోకములను బాపరహితములనుఁగా నొనర్చుచు నాకాశమునుండి దిగివచ్చుచున్న సనకాదిమునులను, జనులును బృథురాజును నచ్చెరువడి చూచిరి. అంతటఁ బృథురాజు వారిదర్శనమువలన నెగిరిపోవుచున్న ప్రాణములను మగుడరప్పించుకొనుటకై సభాసదులతోను సేవకులతోను శబ్దాదిగుణములనుగూర్చి లేచెడుక్షేత్రజ్ఞునిచందంబున లేచి నిలువఁబడెను. ఇట్లు లేచి గౌరవమునకు వశుఁడయి వినయముచే శిరస్సు వంచి, యర్ఘ్యపాద్యాదులచేఁ దత్కాలమునందే యథావిధిగాఁ బూజించెను. పూజించి వారినిర్మలపాదోదకమును శిరంబునఁ దాల్చి శీలవంతు లగువారిప్రవర్తనమును గౌరవించునట్లు చేసెను. అనంతరము పృథురాజు వేదికయందున్న

యగ్నిహోత్రములవలెఁ బ్రకాశించుచు బంగారు గద్దియలపై నుపవేశించి యున్నసనకాదులం గాంచి శ్రద్ధావినయములతో ని ట్లనియె. 'ఓమునిపుంగవులారా! నేఁ బూర్వజన్మమున నెంతటిపుణ్య మాచరించితినో కదా! లేనిచో యోగీశ్వరుల కయినను గానరానిమీదర్శనము నాకు సులభముగా లభించునా? మీవంటిమహాత్ములును, మంగళప్రదుఁ డయినవిష్ణువును నేపురుషునికిఁ బ్రసన్ను లగుదురో యతనికిఁ బరలోకమందు దుర్లభమగున దేది కలదు?ఏదియును లేదు. మఱియును సర్వజ్ఞుఁ డగుపరమాత్మను లోకహేతువు లగుబ్రహ్మాదులు చూడఁజాల నట్లే లోకమం దంతటను వర్తించు చున్నమిమ్మును జనులు చూడఁజాలరు. గృహస్థులు భాగ్యహీనులయినను సాధువులయినచో ధన్యులే యగుదురు. ఆసాధువులగృహములు పూజనీయములు. మఱియు మీవంటివారి కందఱకును స్వీకరింపఁ దగినవి. జలములు,భూములు, గృహాధిపతియుఁ, దక్కినభృత్యాదులును, బూజనీయులే. లోకములో సమస్తసంపదలచేతను నిండియుండినను, మానవులగృహములకు భగవంతుఁడు కాని భగవద్భక్తులు గాని,రానిచో నవి యన్నియుఁ బాములతో నిండిన చందనవృక్షములతో సమానములు. ఓమునులారా ! మీరు కుశలముగా వచ్చితిరా? మీరు బాలురయియుండియే ముముక్షువు లయితిరి.మీరింద్రియంబుల జయించి వర్తించుచున్నమహాత్ములరు.మఱియు మీరు గొప్పవ్రతముల నాచరించుచున్నారు. మీ రాచరించినవ్రతముల నితరముముక్షువు లెంతయోకాలమునకుఁగాని నిర్వర్తింపలేరు. ఓమహాత్ములారా ! శబ్దాదులగు విషయములకు లోనైన స్వకీయము లగుకర్మవిశేషములచే సంసా

రకరూపమందుఁ బడుచున్న మావంటివారికిఁ గుశల మెట్లు కలు
గును? అభ్యాగతుల మగుమాకుశలము నేల యడుగ లేదు. అని
శంకింపరాదు. బ్రహ్మానందానుభవపరు లయినమీవిషయమయి
కుశలప్రశ్న మడుగ నవసరము లేదు. మీవంటిమహాత్ముల కొకప్పు
డయినను దుఃఖములు సంప్రాప్తించు టెట్లు? మీయెడలఁ గుశ
లాకుశలరూపములునగు మనోవృత్తు లెప్పుడును సంభవింపవు. కాన
మిమ్ముకుశలమును గూర్చి యడుగకపోయినను నది యొకతప్పు
కాదు. ఓమహానీయులారా! నేను మీయందు నమ్మక ముంచి
తాపత్రయాతురుల మగుమాకు స్నేహితు లగుమిమ్మును నొక
విషయము నడుగుచున్నాను. సంసారమందు వర్తించువానికి
సులభముగాను శీఘ్రముగాను మోక్ష మెట్లు లభించు? మీరు
దయయుంచి యిందుకుఁ బ్రత్యుత్తర మొసంగుఁడు. ఇంతియ
కాక జ్ఞానవంతులకు నిరతిశయప్రేమవిషయుఁడును, జీవులకు
జ్ఞానాదుల నొసంగి సత్తావంతులఁగాఁ జేయువాఁడును, జ్ఞాని
రూపమున వర్తించువాఁడును, పరమేశ్వరుఁడు తనభక్తులననుగ్ర
హించునిమిత్తము భూమియందుఁ జరించుచుండు.' అనవుఁడు,
శోభనమును, న్యాయ్యమును, గంభీరార్థము కలదియు నల్పమై
నదియుఁ జెవులకింపయినదియు నగుపృథురాజువాక్యమును విని
చిఱునవ్వు నవ్వుచు సనత్కుమారుండిట్లనియె. 'ఓమహారాజా! నీవు
సర్వభూతములహితమును గోరుచున్నవాఁడవు. మఱియుఁ దత్త్వ
జ్ఞానము గలవాఁడవు. నీవు విద్వాంసుఁడవయినను, లోకమునిమి
త్త మడిగితివి కాన నీప్రశ్నము మిక్కిలియుక్తమయినది. లోకము
లోఁ దమకుఁ బ్రయోజనము కాకపోయినను లోకహిత మగు
దానిఁ గోరుట సాధులస్వభావము కదా? సరాగులకును విరా

గులకును దమకుఁ దమకు నిష్టము లగుభోగములను మోక్ష
మును గలుగుటకు మొదటిసాధనము సజ్జనసహవాసమేసుమీ ?
మఱియు సాధువులు సంభాషించుచుఁ జేసినస్వర్గమోక్షసాధన
ప్రశ్నము జగమునం దఱకును సుఖము గలిగించుచున్నది. ఓరాజా!
శ్రీహరిపాదారవిందములగుణములను వినుటయందు నీ కెక్కువ
ప్రీతి కలదు. అవ్యభిచరిత మగుహరికథాశ్రవణప్రీతి మనోమల
మును, బుణ్యాపుణ్యరూప మగుకర్మమును క్షీణింపఁ జేయును.
ఓమహారాజా! సత్త్వాదిగుణములు లేక స్వరూపకల్యాణగుణ
ములచేతనే మహత్త్వమును వహించి బ్రహ్మాదు లందు దృఢ
మయినప్రీతిఁ గలుగుటయు, నాత్మవ్యతిరిక్తము లగు దేహాదులం
దు నిరపేక్ష గలిగియుంటయు నివియే మోక్షసాధనములఁ
గూర్చి చెప్పుశాస్త్రములందు మానవులకు ముఖ్యసాధనము లని
చెప్పఁబడి యున్నవి. మఱియు భగవద్భక్తుల కనుకూలముగా ని
త్యమును బ్రవర్తించుటచేతనుఁ బిమ్మట భగవంతునిపుణ్యకథలను
వినుటచేతను, నర్థపరాయణులతోడను బ్రసంగించుటయందుఁ
దలంపు లేకపోవుటచేతను, ధనాభిలాషులకును గాముకులకును
సమ్మతము లగునర్థకామములను నపేక్షింపకుండుటచేతను, ద
త్త్వమునకు హిత మయినపురుషార్థమును దెలిసికొనుటచేతను,
గురు వుపదేశించినయాధ్యాత్మికయోగమును మననముచేయుట
చేతను, దాదృశ మగునాధ్యాత్మికయోగము నాచరింపఁగలిగెడి
త్వరచేతను, భగవదారాధనరూపములు నిత్యనైమిత్తికములు
నగుపంచమహాయాగాదుల నాచరించుటచేతను, పరమాత్మత
త్త్వమును దెలిసికొనుటచేతను, జాత్యాశ్రయాదులు కారణ
ముగాఁ గలుగునన్నాదు లనుభవించుటచే నాత్మయందుఁ గలుగు

సంతోషముచేతను, కేవలము భగవంతునిగుణములనెడియమృతపానమువలనఁ గలుగుసంతోషముచేతను, భూతములందు సాధుభావము గలిగియుండుటచేతను, భగవద్విషయక మగుస్మరణముచేతను, భోజనానంతరమందు హరిచరిత్రామృతము ననుభవించుటచేఁ గలుగుసుఖముచేతను, బాహ్యేంద్రియముల నియమించుటచేతను నంతరింద్రియముల నియమించుటచేతను శౌచాచారములచేతను, సాధ్యసాధనాదులను నిందింపమానుటచేతను, దేహధారణాదుల కుపయుక్తములు కానిచేష్టాదులను విడుచుటచేతను, శీతోష్ణాదు లగుద్వంద్వములను సహించియుంటచేతను,భక్తులచెవుల కలంకారభూతము లగుహరిగుణముల నుచ్చరించుటచే నతిశయించినభక్తిచేతను,నాత్మపదార్థము కాని దేహాదులం దప్రీతియును, సత్వాదిగుణరహితుఁ డగుబ్రహ్మమునందుఁ బ్రీతియును, శీఘ్రముగానే కలుగును. గురువుననుగ్రహంబును బొందినపురుషునకుఁ బరబ్రహ్మమందుఁ గలదృఢభక్తివైరాగ్యయుత మగుజ్ఞానవేగముచేఁ బలరహిత మై పంచభూతాత్మక మయినశరీరమును, నగ్ని తనకుఁ గారణ మయినయరణిని దహించు విధమున దహించును.ఇట్లు శరీరమును దహింపఁ జేసికొన్నవాఁడు దేహాదిగుణము లగురాగాదుల నన్నిటిని విడిచి, బహిర్భూత మగుశరీరమును, నంతర్భూతము లగురాగద్వేషాది గుణములను గనుఁగొనఁజాలఁడు. ఇంతియ కాక దేహము నశించినతోడనే స్వప్నదశయందువలెనే జీవపరమాత్మలకు వ్యవధానము కల్పించుశరీరంబును, దజ్జనితము లగురాగద్వేషాదులును దప్పక నశించును. ఓరాజా ! దేహమును నింద్రియాదులును, దేహేంద్రియాదులకంటె నన్యము లగు భోగస్థానాదులును,వాసనయను

పేరు గలయుపాధి నశించినతోడనే యవి యన్నియును నశించును గావునఁ గంటికిఁ గానరావు. సమస్తమైనజడపదార్థము గానవచ్చునప్పుడే తనకునుఁ బరమాత్మకును గలుగుభేదమును జూచుచున్నాఁడు. కాని ముక్తియందుఁ దనకు భగవంతునియాకారముతో సమానమగు నాకారము వచ్చుటచేఁ దనకును బరమాత్మకును భేదమును జూడఁజాలఁడు. ఎల్లప్పుడును శబ్దాదివిషయముల నాలోచించుపురుషునిమనస్సు, విషయములచే నాకర్షింపఁబడి, పురుషార్థములను, దత్సాధనములను విభాగించి నిశ్చయించెడిబుద్ధిసంబంధి యగుజ్ఞానమును, నదీప్రవాహము తీరస్థము లగుకుశాదులను హరించునట్లు హరించును. ఇట్లు విషయచింతనాదులచే వ్యవసాయము నశింపఁగానే కాలయోగములకు సంధాయక మయి, కాలాంతరములం దుపాసింపఁదగినదానిని దెలియఁజాలుచిత్తము, భ్రష్ట మగుచున్నది. ఇట్లుపాసనము నశింపఁగానే తనకును బరమాత్మకును గలయాథార్థ్యమును దెలుపుజ్ఞానము నశించును. పండితు లాజ్ఞాననాశనమునే యాత్మతిరోధాన మని చెప్పుదురు. స్వస్వరూపతిరోధానమువలన స్వస్వరూపమును విడిచి యాత్మ శబ్దాదివిషయములను బ్రేమించుటకంటె మఱియొకయనర్థము లేదు. శబ్దాదివిషయములయు, శ్రోత్రాదీంద్రియములయుఁ జింతనము మానవులసమస్త పురుషార్థములను హరించును. మఱియు నాశబ్దాదులచింతనముచేతనే పురుషునిచిత్తము శాస్త్రజన్య మగుజ్ఞానమునుండియు నుపాసనాత్మక మగుజ్ఞానమునుండియు భ్రష్ట మయి స్థావరత్వముఁ బొందుచున్నది. అనర్థదాయక మగునజ్ఞానమును దరింపఁ దలంచినవారొకానొకప్పుడును, ధర్మార్థకామమోక్షములకు మి

గుణవిరోధియైన శబ్దాదివిషయసంగమును జేయరాదు. ఆనాల్గు పురుషార్థములలోను మోక్షరూపపురుషార్థము నిత్యమైనది. కావున నదియె యందఱకున పేక్షింపఁదగినది. తక్కినమూఁడును ననిత్యములుగాననంతగాఁ గోరఁదగినవి కావు. ఉత్కృష్టాపకృష్టరూపము లగుసర్వపదార్థములును సత్త్వాదిగుణములవైషమ్యముచే సృజింపఁబడినవి కావునఁ బ్రళయమందుండఁ జాలవు. కాలరూపుఁడగు పరమాత్మచే విధ్వంసితము లగుటవలన వానికి క్షేమము కలుగదు. కావున నో మానవేంద్రా ! నీవు దేహేంద్రియప్రాణమనస్సులచే నావృతము లయినస్థావరజంగమములం దంతరాత్మయై ప్రకాశించువాఁడును, స్వయంప్రకాశుఁడును, స్వరూపగుణములచే వ్యాపకుఁడు నగుపరమేశ్వరునిఁ దెలిసికొని తచ్ఛరీరము నే నని యెంచికొనుము. పరమేశ్వరుఁడు జీవశరీరకుఁ డయినచో జీవగతదోషము లతనికిఁ జెందవా యని తలంపరాదు. క్షేత్రజ్ఞరూపుడగుపరమాత్మయందుఁ గార్యకారణరూపమున నున్న యీ దేవమనుష్యాదిజాత మంతయుఁ బూలదండయందు సర్పభ్రాంతివలెనే కలుగుచున్నది. అంతియ కాని జీవగతదోషము లతనికిఁ గలుగవు. మఱియు నతఁడు నిత్యముక్తుఁడు. అతఁడు స్వయముగాఁ బ్రకాశించువాఁడు. అతనికి స్వాభావికముగాఁ బ్రకృతిసంబంధము లేకపోయినను దనచే సృష్టములగుకర్మములచే మిశ్రితము లగువాసనలు గలవాఁడని తెలియుము. అయిన నవినరసింహాద్యవతారంబులఁ దాల్చినప్పుడు శ్వేతత్వాదులు విగ్రహమూలకముగా వచ్చుచున్నట్లె క్షేత్రజ్ఞరూపుఁ డయినపరమాత్మకుఁ గర్మసంబంధాదులు జీవాత్మమూలకముగానే కలుగుచున్నవి. కాని స్వతస్సిద్ధమై కలుగలేదు. ఓమహీతలాధిపా ! సమస్తమును భగవ

దాత్మకమైనదే యని భావించి యింద్రియగణమును వశము కావించుకొని యెవనిపాదపంకజభక్తిచే సజ్జనులు సమస్తకర్మవాసనలను విడుచుచున్నారో యాపరమాత్మయే ప్రాపకుఁడని నమ్మి నీవు సర్వదా భజింపుము. ఓరాజా! ఈసంసారసముద్రము మిగుల భయంకరమైనది. అరిషడ్వర్గ మనెడినక్రములతోఁ గూడియున్నది. అట్టిసంసారసముద్రమును నీశ్వరుఁ డనునావ లేకుండ దాఁటు దుస్తరము. కావున నీవు సేవనీయ మగుపరమేశ్వరునిపాదపద్మములను నావగాఁ జేసికొని, దుఃఖాత్మకమును దరింపఁ దరము కానిదియు నగుసంసారసముద్రమును దరింపుము" అనియిట్లు బ్రహ్మకుమారుఁడగుసనత్కుమారుఁడు తత్త్వము నుపదేశింపఁగా నాలించి సంతసించి పృథు రా జతనినుతించి యిట్లనియె. "ఓ మునిపుంగవులారా! తాపత్రయపీడితు లగువారియందు దయాళుఁ డయినశ్రీహరి నన్నుఁ బూర్వ మనుగ్రహించెను. ఆయనుగ్రహమును నాకుఁ జెందునట్లు చేయుటకే మీ రిచ్చటికి నేతెంచినారు. దయావంతులైనమీరు నాకోరికను బూర్ణముగా నెఱవేర్చినారు. నాదేహము మొదలుగాగలయీసమస్తమును మీవంటిసజ్జనులయనుగ్రహమువలనఁ గలిగినదే. మీయనుగ్రహమువలనఁ బొందినది మీ కీయ నర్హము కాదు. కావున మీరు నాకు బ్రహ్మోపదేశము చేసినందులకై గురుదక్షిణ యేమి యొసంగుదునా యని యోచించుచున్నాను. కావున నాప్రాణములను, ధనములను, సకలసాధనములు గలమందిరములను, రాజ్యమును, భూమిని, రత్నాగారములను మీకు గురుదక్షిణగా నొసంగుచున్నాను. దయతో స్వీకరింపుడు. వానినెట్లు పరిపాలించుటో మాకుఁ దెలియనప్పుడు వాని నిచ్చుటవలన

లాభ మే మని ప్రశ్నింపరాదు. సేనానాయకత్వమునకును, రాజ్యమునకును, దండనాధికారిత్వమునకును, నట్లే సకలలోకాధిపత్యమునకును వేదశాస్త్రములు తెలిసినవాఁడే యర్హుండుకాని తదితరుఁ డర్హుండు కాఁడు. బ్రాహ్మణుఁడు స్వకీయ మగునన్నము నే తినుచున్నాఁడు; తనవస్త్రము నే తాను గట్టుచున్నాఁడు. క్షత్రియాదులకు స్వయముగా నిచ్చుచున్నాఁడు. బ్రాహ్మణాను గ్రహమువలనఁ బొందినయన్నవస్త్రాదుల నే క్షత్రియాదిజాతుల వా రుపయోగించుకొను చున్నారు. ఓమునులారా ! ఆత్మవిచారమువిషయమై నిశ్చయముగా వేదమును ననుసరించినమీరు తరింపరానిసంసారసముద్రమును దరించుటకుఁ దగినయుపాయమును మా కుపదేశించినారు. అధికదయావంతు లయినమీవంటి వారు నిత్యమును నార్తులను రక్షించుటచేత నే సంతోషింతురు గాక. అంతియ కాని సంసారతరణోపాయమును దెలిపినమీవంటివారికి నమస్కారము చేఁ దప్ప ఎవఁడు ప్రత్యుపకారము చేయఁ గలఁడు?'' అని పలికి పృథురాజు సనకాదులను బూజింపఁగా నాత్మయోగమనుష్ఠానానుష్ఠాపనములచేరక్షించుచున్న సనకాదులు పృథురాజుశీలమును గొనియాడుచు నచ్చటివా రందఱును జూచుచుండఁగ నే యాకాశము నధిష్ఠించిరి. అంతటఁ బృథుమహీపతి సనకాదులయుపదేశబలముచే నాత్మయోగమునఁ బరమాత్మోపాసనమందు నియతుఁడై తనకోర్కు లన్నియును సమకూరెనని తలంచెను. మఱియుఁ బరమాత్మోపాసనమున కంగములైనవర్ణాశ్రమోచితకర్మములను దేశానుగుణముగాను గాలానుగుణముగాను యథాశక్తిగాను బరమేశ్వరప్రీతిగా నొనర్చెను. ఇంతియ కాక యతఁడు తా నొనర్చుకర్మములఫలము నం

తను బ్రహ్మాధీనముగాఁ జేసి సంగమును బాసి సకలకర్మములందును గర్తృత్వాభిమాని యైనప్రత్యగాత్మ ప్రకృతికంటె వేఱైనదని తెలిసికొనియే కర్మాచరణము చేసెను. ఓవిదురా! ఆపృథురాజు భోగస్థానము లగుగృహములందుఁ జరించుచున్నవాఁడయినను, సార్వభౌమసంపదలతోఁ గూడియున్నను, దేహాత్మభ్రమను విడిచి కావుననే శబ్దాదివిషయంబుల కధీనుండు కాక పంకాదులందుఁగాంతిచేఁ గానవచ్చుచున్నను దత్పంకదోషమును బొందనిసూర్యునివలెఁ బ్రవర్తించుచుండెను. ఇట్లు పృథురాజు భక్తియోగముచే సమస్తకర్మములను నాచరించుచు నర్చి యనుభార్యయం దాత్మతుల్యు లయిన యైదుగురుపుత్త్రులను గాంచెను. వారు విజితాశ్వుఁ డనియు, ధస్వకేశుఁ డనియు, (లేక ధూమ్రకేశుఁడు) హర్యక్షుఁ డనియు, ద్రవిణుఁ డనియు, వృకుఁ డనియు, నామములచేఁ బిలువఁబడిరి. మఱియుఁ బృథురాజింద్రాదిదేవతలందుఁ గలయసాధారణగుణముల ధరించుచున్నవాఁడై పరమాత్మచే సృజింపఁబడినసృష్టి నుచితకాలములందు రక్షించుచు మనోవాక్కాయకర్మములచేతను, సౌమ్యగుణములచేతను, బ్రజలనందఱను రంజింపఁజేయుచు, లోకరంజనము చేసి రాజనామమును ధరించినచంద్రునివలెఁ బ్రజారంజనమును చేసి యథార్థరాజశబ్దమును వహించెను. సూర్యుఁడు తనకిరణములచే జలమును గ్రహించి వర్షరూపమున మఱల నిచ్చునట్టువలెనే యతఁడు ప్రజలవలన ధనమును దీసికొని మగుడఁ బ్రజలకు నొసంగుచుండెను. అతఁడు ప్రతాపముచే నగ్నివలెనే శత్రువులకు దుస్సహుఁడై యుండెను. అతఁడు దేవేంద్రునివలెనే జయింపఁదరము కానివాఁడు. అతఁ డపరాధుల క్షమించుటలో భూ

మికిఁ దుల్యుఁ డగుచుఁ బ్రజలకోర్కులఁ దీర్చుటలోఁ గామధేను వున కెనవచ్చుచు, మేఘునివలె యథేష్టము గావస్తువులనువర్షించి ప్రజలకుఁ దృప్తి గలిగించెను. ఇంతియ కాక యమ్మహాత్ముఁడు సముద్రునివలె దుస్తరుండై, మేరువువలె నిశ్చలుండై, ప్రజా శిక్షయందు యమధర్మరాజును బోలుచు, నైశ్వర్యమునకు రత్నాకరుఁడయినహిమవంతునిఁ బోలుచు, మంత్రగోపనమందు వరుణునిఁ బురుడించుచు, ధనరక్షణమందుఁ గుబేరుని కీడగుచు, సర్వగామి యగుటలో వాయువునకు సరి వచ్చుచు, బలముచే తను దేజంబుచేతను దేహకాంతిచేతను దుస్సహత్వముచే తను రుద్రునకు సాటి యగుచు, సౌందర్యమునఁ గందర్పునిఁ గ్రిందుసేయుచు, స్వేచ్ఛాప్రవృత్తియందు సింహముతో నుపమ నొందుచు, వాత్సల్యగుణమందు స్వాయంభువమనువు బోలు చు, సామర్థ్యమందు బ్రహ్మను ధిక్కరించుచు, వేదవాదమందు బృహస్పతిని దిరస్కరించుచు, స్వాతంత్ర్యమందు హరిని విడం బించుచు వెలయుచుండెను. మఱియుఁ బృథురాజు గోవులందు ను, గురువులందును, బ్రాహ్మణులందును, విష్ణుభక్తులందును, మిగుల భక్తికలవాఁడై లజ్జచేతను, వినయముచేతను, సచ్ఛీల ముచేతను, నిరుపమానుఁ డయి పరోపకారముచే సుప్రసిద్ధుఁడై ముల్లోకములందు నివసించుపురుషులచే గానము చేయఁబడు సత్కీర్తిచే సకలస్త్రీలకర్ణబిలములందును శ్రీరామచంద్రుని వలెఁ బ్రవేశించెను. ఇది యిరువదియొకటవ యధ్యాయము.

పృథువు భార్యతోఁ దపోవనంబున కేఁగుట.

ఓవిదురా! పృథురాజొకప్పుడు తన్ను వృద్ధునిగా నెంచికొని స్వర్గాదిఫలము లల్పకాలస్థాయు లనుకొని తన దేశమం దున్న వారి నందఱను నాదరించి వర్ధించి స్థావరజంగమములకుఁ దగు విధమున జీవనము నిచ్చి, సత్పురుషులయందు ధర్మమును జూపుచుఁ బ్రజాపాలనరూప మగునీశ్వరాజ్ఞను నిర్వర్తించి, తన వియోగమును సహింపలేక రోదనము చేయుచున్నట్లు గాన వచ్చుకుమారికవలె నున్నభూమిని గుమారులందుఁ బొందుపఱచి, తనయెడఁబాటునకుఁ బ్రజ లందఱు విమనస్కు లగుచుండ, భార్యాసమేతుఁ డయి, వేఱుసాయము లేనివాఁడయి తపోవనమును బ్రవేశించి శమదమాదినియమముల నవలంబించి, వానప్రస్థు లాచరించెడియుగ్రతపంబులు జేయ దొరఁకొని పూర్వము భూమండలమును జయించుటకుఁబోలెనే యిప్పుడును దృఢప్రయత్నుఁడై యుండెను. మఱియు నతఁడు కృతనియముఁడై యొక్కప్పుడు కందమూలములను ఫలములను భక్షించుచు, నొకప్పుడుపండుటాకులం దినుచుఁ గొన్ని పక్షములందుఁ గేవల ముదకమునే త్రావుచు; మఱికొన్నిపక్షములందు వాయువును మాత్రము భక్షించుచుండెను. అతఁడు గ్రీష్మమందుఁ బంచాగ్నిమధ్యమం దుండియు, వర్షఋతువందు వర్షములో నిలిచియు శిశిరఋతువందుఁ గంఠదఘ్నజలంబులో నివసించియు, కటిక భూమియందుఁ బండుకొనుచు, నిరంతరమును మౌని యై ఘోరతపం బాచరించుచుండెను. అమ్మహాత్ముఁ, డట్లు శీతోష్ణాదిద్వంద్వంబులనోర్చి మౌనమవలంబించి యింద్రియముల నిగ్రహించి యూర్ధ్వరేతస్కుఁడై, వాయువును బంధించి, యిట్టితపంబు

నాచరించుచుఁ బరమపురుషుఁ డయినకృష్ణుని నారాధించుచుం డెను. ఇట్లు పృథువు క్రమక్రమముగా సంపాదించినతపంబుచేఁ గర్మమలంబును నశింపఁ జేసికొని ప్రాణాయామములచే మనంబును విమలంబుగాఁ జేసికొని యింద్రియవర్గమును వశము గావించుకొని, తన స్వబంధనములను దొలంగించుకొని సనత్కుమారుఁ డుపదేశించిన యాధ్యాత్మికయోగముచేఁ బరమపురుషుని భజించెను. ఈప్రవృత్తిధర్మముల నవలంబించి శ్రద్ధచే యత్నము చేయుచున్నసాధుఁ డగుపృథువునకుఁ బరబ్రహ్మమునం దవ్యభిచారిణి యగుభక్తి కలిగెను. మఱియు భగవంతునిపరిచర్య నిర్మలాంతఃకరణుఁ డైనపృథురాజునకు నాపరమాత్మను సంస్మరించుచున్నవానికిఁ గలిగినపూర్వోక్త మగుభక్తికిఁ బూర్ణత్వమును గలిగించె. అందువలనఁ బరజ్ఞానమును వైరాగ్యమును గలిగినవి. ఆతీవ్రజ్ఞానము నిశ్చయింపఁదగినదై ప్రకృతితత్త్వమును ఛేదింపఁదగినసామర్థ్యము గలది. అట్టిజ్ఞానముచే నతఁడు ప్రకృతితత్త్వసంబంధమును వదల్చుకొనెను. ఇంతియ కాక దేహాత్మబుద్ధిని విడిచి యాత్మస్వరూపయాథాత్మ్యమును దెలిసికొని కావుననే నిర్వ్యాపారుఁ డయి జ్ఞానముచేఁ బ్రకృతితత్త్వమును ఛేదించి యితఁడు భగవత్కథలందుఁ బరమప్రీతి కలవాఁడు కాన యోగమార్గములందుఁ బ్రమాదము లేనివాఁ డయి ప్రవర్తించెను. ఇట్లు పృథుమహీపతి యాత్మకుఁ బరమాత్మతో స్వతస్సిద్ధ మగు నపృథక్సిద్ధసంబంధము ననుసంధానముచేసి యష్టగుణావిర్భావమును బొంది ప్రాగ్భావసానము గలియఁగానే నిజకళేబరమును విడిచిపుచ్చెను. ఓయీ! యాతఁ డెట్లు కళేబరమును త్యజించి బ్రహ్మభావమును బొందెనో వివరించెదను. విను

ము. అతఁడు మడమచే గుదస్థానమును నిరోధించి మూలాధారమునుండి వాయువును మెల్లగా మీఁదుగా నాభిని బొందించుచు, నచ్చటినుండి క్రమముగా హృదయమును, వక్షఃస్థలమును, కంఠమును, శిరస్సును, బొందించెను. తరువాత బ్రహ్మరంధ్రమునం దావాయువును సంధించుచు, నణిమాదులగు నష్టైశ్వర్యంబులందును స్పృహ లేనివాఁడయి, వాయువును మహావాయువునందును, దేహమును పృథివియందును, దేహస్థమగు జలమును, తోయమందును, నింద్రియాధిష్ఠానవివరములు గగనమునందును, గారణము నతిక్రమింపకుండను సంకరము లేకుండను, ననుసంధానము చేసెను. ఓయీ! దేహస్థము లగు భూతాంశములను మహాభూతములతో ననుసంధానమును జేసితిని. ఇఁకఁ బృథివ్యాదితత్త్వముల కుత్పత్తిక్రమమునుబట్టి లయానుసంధానమును వచించెదను వినుము. పృథివీభాగమును, మహాభూతమయిన జలమునందును, నా జలమును దేజస్సునందును, నా తేజమును వాయువునందును, నా వాయువు నాకాశమందును ననుసంధానము చేసెను. తరువాత నింద్రియములందు మనంబును, నాయింద్రియాదులను శబ్దాదితన్మాత్రములందును, వానిని గారణమైనభూతాదులందును, లయమును బొందించి యాత్మను మహత్తత్త్వమునం దనుసంధానము చేసెను. పిమ్మట నామహత్తత్త్వమును సత్త్వాదిగుణములస్థితికి మూల మయిన యవ్యక్తమునందు సంధించెను. అనంతరము జీవుఁడయినపృథురాజు ప్రకృతిసంబంధము నిట్లు వదలించికొని జ్ఞానవైరాగ్యబలముచే భుక్తావశిష్టమైనపుణ్యాపాపకర్మములను విడిచి యష్టగు

ణావిర్భావము కలవాఁడయి యొప్పెను. పిమ్మట పృథురాజుభార్యయును సుకుమారవంతురాలును, నగునర్చి కాలితో భూమిని స్పృశింపనంతటిమహాభోగవంతురా లయినను, భర్తతోఁ గాలినడకనే దుర్గమవనంబులకేఁగి పాతివ్రత్యమందు మిగుల నిష్ఠ గలదయి యనవరతమును భర్తకుఁ బరిచర్యను సేయుచు మునులవలెనే కందమూలాదులను దినుచు నందువలన మిగులఁ గృశీభూతాంగి యై తనపతికరస్పర్శాదులచే సుఖ మనుభవించుచు దుఃఖ మన్న నెట్టిదో యెఱుంగకపోయెను. అంత నర్చి తనకును భూదేవికిని నధిపతి యైనపృథురాజు బుద్ధీంద్రియప్రాణాదులను విడుచుట చూచి శోకించుచు విలపించి తన్ను నాపత్నీతాపమునందుఁ జితి నిర్మింప నిశ్చయించెను. అట్లు నిశ్చయించి తత్కాలకృత్య

పృథురాజభార్య యర్చి యగ్నిప్రవేశ మగుట

ముల నాచరించి యచ్చటినదిలోఁ దానములాడి యుదారకీర్తిఁ డగుభర్తకు జలతర్పణంబు లొసంగి యాకాశమున నున్న దేవతలకు నమస్కరించి భర్తపదకమలములను సంస్మరించుచు నాచితికి మూఁడుమాఱులు ప్రదక్షిణము చేసి యగ్నిని బ్రవేశించెను. ఇట్లర్చిదేవి వీరశ్రేష్ఠుఁ డగుపృథురాజు ననుసరింపఁగా దేవతాస్త్రీలామెపాతివ్రత్యమునకు సంతసించి దేవతలతోఁ గూడ నామెను స్తోత్రము చేయఁ దొడంగిరి. మఱియు నాసమయమున నామందరపర్వతసానువందుఁ బుష్పవర్షములు గురిసెను. దేవదుందుభులు మ్రోయ నారంభించెను. అప్పుడు దేవత లొండొరులతో నిట్లు సంభాషింపఁ దొడంగిరి. "అహహా రే! ఇది యేమి వింత! యజ్ఞపతి యైననారాయణునిశ్రీమహాలక్ష్మివలెనే రాజాజయినపృథురాజును సర్వవిధములచేతను సేవించుచున్నయీయామె

యెంతయు ధన్యురాలు ఈమె పతివ్రతాశ్రేష్ఠురాలు కావునఁ జూచుచున్న మనల నతిక్రమించి దురూహమయిన పాతివ్రత్యాది కర్మములచేఁ దనభర్తను దప్పక యనుసరించి యూర్ధ్వలోకములకుఁ బోఁగలదు నిష్కామధర్మముల నవలంబించినవారగుచుం చలాయుర్దాయము కలవారయినను భగవత్పదమును సాధించుచున్నారు. ఇట్లుండఁగా వారు తక్కిన దేవపదములు సాధింతురని చెప్ప నందేమి కలదు? మోక్షమును సాధింపఁ దగినమనుష్యజన్మమును నతికష్టముచేఁ బొందియు, మోక్షము నపేక్షింపక విషయసుఖము లనుభవించువాఁడు దైవముచే వంచితుఁడయినవాఁడని చెప్పవచ్చును గదా! ఎంతకష్టము! ఎంత కష్టము!" అని దేవతాస్త్రీలు నుతించుచుండఁగా నర్చిదేవి జ్ఞానవంతులలో శ్రేష్ఠుఁడగు పృథురాజుఁ బొందినదై నారాయణునకాశ్రయభూతమగు వైకుంఠమునే పొందెను ఓవిదురా! *భగవంతులలో నుత్తముఁడయి మహాప్రభావసంపన్నుఁడయి యుదారచరిత్రుఁడయి, యున్న పృథురాజుచరిత్రమును నీకు సాంతముగా వర్ణించితిని. మహాపుణ్యసాధన మయిన యీ పృథురాజుచరిత్రమును సమాహితచిత్తుఁడై శ్రద్ధచేఁ జదివినను జదివించినను, నమ్మహాత్ముఁడు పృథురాజు పొందిన యుత్తమలోకమునే పొందును. బ్రాహ్మణుఁ డీచరిత్రమును విన్నచో బ్రహ్మ

---

* ఇందులకు మూలమున "భగవత్తమః" అని యున్నది. ఇట భగవంతుఁ డనఁగాఁ బరమేశ్వరుఁ డని యర్థము కాదు. శ్లో॥ ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానా మాగతిం గతిం । వేత్తి విద్యా మవిద్యాంచ సవాచ్యో భగవానితి. "ఉత్పత్తిలయములను, భూతములరాకపోకలను, విద్యను, నవిద్యను, ఎఱింగినవాఁడే భగవంతుఁ డని చెప్పఁబడును."

ర్చస్సు గలవాఁ డగును. క్షత్త్రియుఁ డీచరిత్రమును బఠించిన జగతీపతి యగును. వైశ్యుఁడు విన్నచో వైశ్యోత్తముఁ డగును. శూద్రుఁడు విన్నచోఁ దనజాతివారిలో నుత్తముఁ డగును. స్త్రీయైనను, బురుషుఁడైనను, నాదరయుక్తుఁ డగుమానసంబుతో నీచరిత్రమును ముమ్మాఱు విని, సంతానము లేనివాఁడు సంతానమును బొందును. నిర్ధనుఁడు ధనమును బొందుచున్నాఁడు. మఱియుఁ గీర్తిలేనివాఁడు కీర్తిమంతుఁడును, మూర్ఖుఁడు విద్వాంసుఁడు నగుచున్నాఁడు. ఈచరిత్రము శుభప్రద మయినది. ఇది ధనమును, యశంబును, నాయువును, స్వర్గమును, గలిదోషములఁ బాపికొనఁగినశక్తిని నొసంగును. ఫలాభిలాషులు ధర్మార్థకామమోక్షములను దప్పక సాధించునీచరిత్రమును శ్రద్ధచే విని తీఱవలయును. ఈచరిత్రమును విని యుద్ధయాత్రకు బయలు వెడలినచో నట్టిరాజునకు మిగిలినరాజులు పృథురాజునకు బలులు తెచ్చి సమర్పించినట్లు సమర్పింతురు. మఱియుఁ బురుషుఁ డన్యసంగములను విడిచి భగవంతునియందు భక్తి గలిగి యద్భుతపరాక్రమవంతులకుఁ బ్రియతమమును బరమేశ్వరుని మాహాత్మ్యమును దెలుపునదియుఁ బవిత్రమును నగుపృథురాజుచరిత్రమును వినవలయును; వినిపింపవలయును: పఠింపవలయును. అట్లు చేసిన నమ్మహాత్ముఁడు, పరమేశ్వరునందు స్థిరబుద్ధి గలవాఁడై పృథురాజు పొందినలోకమునే పొందును. ఈచరిత్రమును మానవుఁ డత్యాదరముచేఁ బ్రతిదినమును వినుచుఁ జదువుచు నున్నచో, నితరఫలములను విడిచి సంసారసముద్రమును దాఁటింప, నావలనంటెపాదపద్మములు గలభగవంతునియందు స్థిరబుద్ధిని పొందుచున్నాఁడు. ఇదియిరువదిరెండవయధ్యాయము.

ఓవిదురా! పృథురాజకుమారుఁడయినవిజితాశ్వుఁడు చక్రవర్తియై విపులకీర్తిగలవాఁ డయ్యెను. మఱియు నతఁడు సోదరులందుఁ బ్రేమ గలవాఁ డయి వారలకు దిక్కులఁ బాలింప నాజ్ఞ యొసఁగెను. అందు హర్యక్షునకుఁ దూర్పుదిక్కును ధూమ్రకేశునకు దక్షిణమును, వృకునకుఁ బశ్చిమదిక్కును, ద్రవిణున కుత్తరదిక్కును, బంచియిచ్చెను. పృథురాజునశ్వమేధమందు హయమును దాఁచి దేవేంద్రునివలన నంతర్ధానగతిని బొంది యంతర్ధానుఁ డనునామాంతరము గలవిజితాశ్వుఁడు శిఖండిని యనుభార్యయందు యోగ్యు లగుముగ్గురుపుత్త్రులను బడసెను. వారు వసిష్ఠునిశాపమువలన మనుష్యులందుఁ బుట్టఁదగినగార్హపత్యము, ఆహవనీయము, దక్షిణము ననునగ్ను లేకాన వారు మగుడ నగ్నిత్వమునే పొందిరి. హయాపహారి యైనయింద్రుఁడు తనకంటఁ బడినను జంప నిష్టపడనియుదారగుణుం డయినవిజితాశ్వుఁడు నభస్వతి యనుమఱియొకభార్యయందు హవిర్ధానుఁ డనుపుత్త్రునిఁ బడసెను. ఆహవిర్ధానుఁడు పన్నులనురాఁబట్టుట, ప్రజాదండనము మొదలగుదారుణకృత్యములు గలరాజవృత్తి నవలంబింపఁ దలంపు లేక దీర్ఘసత్త్రము నాచరింప నారంభించెను. అం దతఁడు ప్రకృతివిలక్షణ మగునాత్మస్వరూపము నెఱింగి భక్తులక్లేశములను హరించుచున్న పరమాత్మను బూజించుచు నిరంతరాయ మగుదీర్ఘసమాధిచే భగవల్లోకము నధివసించెను. ఓవిదురా! ఆహవిర్ధాననునకు హవిర్ధాని యనుభార్యయందు బర్హిషదుఁడు మొదలగు నార్వురుపుత్త్రులు గలిగిరి. వారిలో బర్హిషదుఁడు ప్రజాపాలనమందు నిపుణుఁ డయి, క్రియాకలాపమందును యోగములందును బరమనిష్ఠ గలవాఁ డాయెను.

మఱియు నతఁడు భూతలయమునంతను యజ్ఞవాటముగాఁ గావించి యొకచో యాగము చేసి ముగుడ నాసమీపభూమియందే యాగము లొనర్చుచు నిట్లు ప్రాచీనాగ్రము లగుదర్భలచే భూమండలమును గప్పెను. కావుననే యతనికిఁ బ్రాచీనబర్హి యనునామము గలిగెను. ఆప్రాచీనబర్హి సముద్రునికుమారికయును, బాలయు, సుందరాంగియు, సకలాలంకారశోభితయు వివాహమునకు యోగ్యురాలు నగుశతద్రుతిని వీక్షించి యగ్నియాజ్యధారనువలెఁ గోరికొనెను. నూపురధ్వనులను జేయుచు మెలంగుచున్న యాశతద్రుతినిఁ గాంచి విబుధులు, రాక్షసులు, గంధర్వులు, మునులు, సిద్ధులు, మానవులు, పన్నగులు, మిక్కిలి మోహమును జెందిరి. ప్రాచీనబర్హి యాశతద్రుతియందు, సమానము లగువ్రతాచారములు గలిగి ధర్మపారగు లయినప్రచేతసులనుపుత్త్రులను బదుగురఁ బడసెను. వారు తండ్రిచేఁ బ్రజాసర్గమందుఁ బ్రేరితు లయి తపం బొనర్చుటకై వనంబునకుఁ బోయి మార్గమధ్యంబునఁ గనవచ్చినశంకరునివలన నుపదేశ మందిన పరమాత్మతత్త్వమును ధ్యానించుచు, జపించుచు, సమాహితచిత్తులై పదివేలవత్సరంబులు భగవంతునిఁ దపంబున నారాధించిరి. అనిన విని విదురుండు మైత్రేయుం గాంచి "మునీంద్రా! శంకరునకును బ్రచేతసులకును, మార్గమందు సమావేశ మెట్లు కలిగెను ? శంకరుఁడు వారలకుఁ బ్రసన్నుఁడై యేమి యుపదేశించెను ? దానిని నాకు వచింపుము. ఓమునీంద్రా! దేహధారులకు సంసారమందు శివునితో స్నేహము గలుగుట దుర్లభము. మును లయిననుఁ దమ కిష్టుఁ డయినశివుని ధ్యానించిరే కాని యతనిసంగతిని బొందలేకపోయిరి. ఉత్పత్త్యాది జ్ఞానము గలశంకరుం

డాత్మారాముఁడగుటచే లోకంబునఁ దనకుఁ బ్రయోజనంబు లేక పోయినను దీనుల ననుగ్రహించుటకై స్త్రీసమేతుఁడై, భయంకరమూర్తియై చరించుచుండును." అనవుఁడు మైత్రేయుం డిట్లనియె. 'ఓవిదురా! ప్రచేతసులు తండ్రియైన ప్రాచీనబర్హివాక్యము శిరంబున నుంచి మిగుల గౌరవించి సృష్టినిమిత్తము తపం బొనరింప నెంచి పడమటిదిశ కేఁగిరి. వా రిట్లు చని చని సముద్రసమీపమున నొకసరోవరంబును బొడగాంచిరి. అది

ప్రచేతసులు తపోవనంబున కేఁగుట

మిక్కిలి విస్తీర్ణమయి జ్ఞానవంతునిమానసంబుచందంబున నిర్మలంబు లగుజలంబులు గలిగి మత్స్యసంకులంబయి విలసిల్లుచుండెను. దానియందు, నీలోత్పలములును, నెత్తగలువలును, పద్మములును, కల్హారములును, సామాన్యపుఁగలువలును నిండియుచుండె. మఱియు నందు హంసములు సారసపక్షులు చక్రవాకములు కారండవంబులు విహరించుచు మధురంబుగా ధ్వనులు చేయుచుండె. తత్తీరంబున నున్నవృక్షంబులు పుష్పితలతావేష్టితంబు లయి మదించినతుమ్మెదల మధురస్వరంబులకుఁ బులకితగాత్రంబు లయినట్లు చూపట్టుచుండెను. మఱియు నట నాయువు పద్మకోశంబులం దున్నపరాగంబును నలుదిక్కులను వ్యాపింపఁజేయుచుండెను. అట రాజపుత్త్రులు మృదంగాదిధ్వనులతో సమన్వితముగాఁ బలువిధములుగా దేవతలు పాడుచున్న గానంబును విని మిక్కిలి విస్మయముఁ జెందిరి. ఆసమయమునందే సహచరసమేతుఁడై యాసరస్సువలన బయలువెడలి గంధర్వకిన్నరకింపురుషాదులచే నుతింపఁబడుచు, దేవతలలో నుత్తముఁడయి, తప్తకాంచనసదృశ మగుదేహము గలిగి, నల్లనికంఠముతో నొ

ప్పుచుఁ బ్రసన్నవదనుం డయి, నేత్రత్రయముచేఁ బ్రకాశించుచు, నున్న శంకరునిఁ గాంచి యధిక కౌతూహలంబునఁ బ్రణమిల్లిరి. అంత భక్తవత్సలుఁడును, భక్తులయార్తిని హరించువాఁడు నగు శంకరుండు ధర్మజ్ఞులును, సచ్చరిత్రకలవారును, దనకు నతులయి నవారును, నగు ప్రచేతసులను గాంచి సంతసించి యిట్లనియె.

శంకరుఁడు ప్రచేతసులకు హిత ముపదేశించుట.

"ఓయీ! మీరు ప్రాచీనబర్హికుమారకులరు. మీతలంపు నాకు నవగత మయినది. మిమ్ము ననుగ్రహించుటకే మీ కిపుడు దర్శన మొసఁగితిని. ఓరాజపుత్త్రులారా! త్రిగుణాత్మక మగుమాయకంటెను జీవునికంటెను బరుఁ డయి, జ్ఞానాదిసద్గుణములు గలిగి యున్న వాసుదేవుఁడు నాకు మిక్కిలి ప్రియుఁడు. పురుషుఁడు స్వకులాచారధర్మముల నాచరించుచు నూఱుజన్మంబులు కడచినచో బ్రహ్మలోకమును బొందును. అటుపై నాలోకమును బొందును. పిమ్మట మాయాధికారానంతరము నేనును, బ్రహ్మేంద్రాదులును పొందుచుండఁగా నే ఆపురుషుఁడును నేత్రగోచరము కానివైకుంఠమును బొందును. కాని మీరు భగవద్భక్తు లయి యున్నారు. అట్లగుట నాకు భగవంతుఁ డెట్లు ప్రియుండో మీరు నట్లె యగుదురు, భాగవతులకు భగవద్భక్తులను మించిన ప్రియు లుండరు. ఓయీ! జపింపఁ దగినపరతత్త్వమును మీ కుపదేశించెదను. ఆతత్త్వము సాంకర్యరహిత మయి, ప్రకృతిపురుషులకంటె విలక్షణము. కావున నే, పవిత్రమై, మంగళమై, ధర్మార్థకామమోక్షములను సాధించున దయి, ముక్తిసాధనమయి యుండును" అని కృపాహృదయయుక్తుఁ డయి శంకరుండు నారాయణుఁడే ప్రాప్యుఁ డనియుఁ, బ్రాపకుఁ డనియు, భావించి

బద్ధాంజలు లయి యున్న రాజపుత్త్రుల కుపదేశించుటకు ముం దుగా సర్వాంతరాత్మ యగుభగవంతుని కిట్లు నమస్కరించెను. జ్ఞానవంతులను రక్షించునో పరమేశ్వరా! నీసర్వోత్కృష్ట మాత్మ విదులసుఖమునిమిత్తమగుఁగాక. సర్వదానిన్ను నుపాసించుచున్న నాకు బ్రహ్మానుభవసుఖము కలుగుఁగాక. సిద్ధరూపుఁడ వయిననీచే సంపాదిత మయినయాసౌఖ్యమును నాకును నిఖిలప్రపంచమున కు నొసంగు చున్ననీకు నమస్కారము. దేవా! నీవు లోకాత్మ కమగుపద్మము నాభియందుఁ గలవాఁడవు. నీవు భూతసూక్ష్మేంద్రి యస్వరూపుఁడవు. నీవు సమస్తలోకములకు నధికరణము వయి వాసుదేవుండ వని పిలువఁబడు చున్నావు. నీ వశనాపిపాసాదిషడూర్మ్యులు లేనివాఁడవు. కావుననే నీవు నిర్వికారుఁడ వయి యుందువు. నీవు నిత్యమును సంకోచము నొందనిజ్ఞానము కల వాఁడవు. అట్టినీకు నమస్కారము. ఓపరమపురుషా! నీవు సమస్తప్రపంచమును నీయందు లీనముఁగావించుకొని సంకర్షణుఁడ వనఁబడు చున్నాఁడవు. మఱియు నీవు ముఖాగ్నిచే లోకదాహ మొనరించు చున్నావు. నీవు నామరూపముల విభాగింపఁ దగ నంతసూక్ష్మము లయినచిదచిత్తులతోఁ గూడియుందువు. అయిన ను నాశరహితుఁడవు. మఱియు నీవు ధర్మార్థకామాదిపురుషార్థములను సాధించునుపాయములఁ దెలుపువేదము నుపదేశించి సమస్తమును బోధించుచున్నవాఁడవు. నీవు దురాత్ముల ఖండిం చుటకును, సజ్జనుల రక్షించుటకును, నవతరించినరామకృష్ణాద్య వతారముల విభవమునకు మూల మయినప్రద్యుమ్న వ్యూహ మవు. నీవు సర్వదేశములందును, సర్వకాలములందును, సమస్తమందు నొక్కమాఱుగాఁ బ్రవేశించి యనుశాసించువాఁడవు.

ఆట్టినీపాదములకు వందనములు. ఓపరమేశ్వరా ! నీవు మనఇంద్రియస్వరూపుఁడవు. నీ వనిరుద్ధవ్యూహమవు నీవు నీయందును నీయాశ్రితులందును బుణ్యాపుణ్యరూప మగుకర్మములను తేకొంచెఁ దఱిమి పరమహంస వనియు నపహతపాప్ముఁడ వనియుఁ బరఁగుచున్నావు. నీ వంతర్బహిర్భాగములందుఁ బూర్ణుండవయి యున్నావు. నీవు శోకాదిదుర్గుణములు లేనివాఁడవు.అట్టినీకునమస్కారంబులు. ఓపరమాత్మా! నీవు స్వర్గమునకును, మోక్షమునకును సాధనమవు. నీవు సర్వదా యోగీశ్వరులచిత్తమందుఁ బ్రకాశించుచున్నావు. నీ వగ్నిస్వరూపుఁడవు. నీవు చాతుర్హోత్రమునకు సాధ్యుఁడవు. నీవు యాగస్వరూపుఁడవు. వేయేల? యజ్ఞస్వరూపుఁడవును, యాగారాధ్యుఁడవును యజ్ఞఫలప్రదుఁడవును నై యున్నావు. అట్టినీకు నమస్కారములు. ఓదేవా ! నీవు దేవపితృదేవతలకు నన్నస్వరూపుఁడ వయి యొప్పుచున్నావు. నీవు వేదముల కధిపతివి. నీవు యాగమునకు ఫలమవు.నీవు జీవులకు శబ్దస్పర్శాదివిషయసుఖముల నిచ్చువాఁడవు. నీవామ్లకటులవణాది రసస్వరూపుఁడవు. అట్టినీ కభివందనములు. ఓయీశ్వరా! నీవు సకలసత్త్వస్వరూపుఁడవు. నీవు పృథివీస్వరూపుఁడవును,తద్గతి మగుగంధమవు నై యున్నావు. నీవే బలమవు. నీవే యోజస్సువు?నీవేత్రైలోక్యపాలకుఁడవు. అట్టినీకు నమస్కారములు. ఓదేవా ! నీవు శబ్దమే గుణముగాఁగలయాకాశమవు. నీవు వాయుతద్గుణస్వరూపుఁడవు.నీవుతిలలందు తైలమువలె జగముల యంతర్బహిర్భాగంబులందు వ్యాపించి యున్నావు. నీవు యజ్ఞదానాదిరూపము లగుపుణ్యములే యాకారముగాఁ గలవాఁడవు. నీవు లోకస్వరూపుఁడవు. నీవు జ్ఞానప్రచురుండ వయి యొప్పుచు

న్నావు. అట్టినీకు నమస్కారములు. ఓయీశా! నీవు నివృత్తిక ర్మములేని స్వరూపముగాఁ గలవాఁడవు. నీవు ప్రవృత్తికర్మస్వరూ పుఁడవును, తదారాధ్యుఁడవును, తత్ఫలప్రదాతవునై యున్నావు నీవు ఫలాపేక్ష లేకుండ నారాధించినవారికి ఫలరూపుఁడవయి యుందువు. మఱియు నీవు దుఃఖప్రదయగుమృత్యుదేవత వగు యుందువు. అట్టినీకు నమస్కారములు. ఓపరమేశ్వరా! నీవుధ ర్మాదులకు ఫలప్రదాయకుండవు నీవుసర్వజ్ఞుండవు నీవు స్వరూ పముచేతను గుణములచేతను సర్వోత్కృష్టుండవు. నీ వొకప్ర భువు బ్రతిహతము కానిజ్ఞానము కలవాఁడవు. నీవు కృష్ణాఖ్య మగుసిద్ధధర్మమే రూపముగాఁ గలవాఁడవు అట్టినీకు నమస్కా ములు. ఓయీశ్వరా! నీవు పురాణపురుషుఁడవు. నీవు కపిలావ తారముఁ దాల్చి సాంఖ్యేశ్వరుఁడవని ప్రసిద్ధి కెక్కితివి. నీవు ప్ర కృతిరూపశక్తిచేతను, కాలరూపశక్తిచేతను, లయరూపశక్తిచే తను గూడి యున్నవాఁడవు. నీవు [illegible] వయి సూ ర్యుఁడవయి ప్రకాశించుచున్నావు. నీ వహంకారతత్త్వమ వయి విలసిల్లుచున్నవాఁడవు. నీవు మనస్సే రూపముగాఁ గలవాఁడవు. నీవు హంసపదరూపంబునఁ బెంపుపొందుచు న్నాఁడవు. అట్టినీకు నమస్కారంబులు. ఓపరమాత్మా! భక్తు

భగవంతుని రూపవర్ణనము.

లచే నారాధింపఁబడుచుఁ గంటికిఁ గానరాక వఱలునట్టి నీస్వ రూపమును మాకుఁ గనఁబఱుపుము. నీరూపము భక్తులకుఁ బ్రియము నొసఁగును. అది యింద్రియముల యొక్క ప్రాణాదిగుణములచే దెలియఁబడదు. అది మిగులఁ గోమలమయి వర్షాకాలమేఘము ను బోలుచుండును. అది సకలసౌందర్యములకు నునికిపట్టు. ఆనీ

యుగ్మమైనను సుందరము లయి జానువులపర్యంతము వ్రేలాడు చున్న నాలుగు బాహువులు గలది. అది సుకుమార మైసుందర మై యున్న ముఖముతో నొప్పుచున్నది. అది తామరపువ్వులోని లోపలిదళములఁ బోలిన నేత్రములచేఁ బ్రకాశించుచున్నది. అది మిగులసుందర మగునాసికాబాహువులతోను, నాసికతోను వెలయుచున్నది. అది సుందర మగుదంతములును గలిగి సొగ సయిన చెక్కిళ్లతోను, ముఖముతోను రంగారుచుఁ గర్ణభూషణ ములతోను జెన్నారుచున్నది. అది ప్రేమచేఁ బ్రసన్నము లగు కడకంటిచూపులచే నలరుచుఁ గుంతలంబులచేఁ బ్రకాశించుచుఁ గ్రొత్తపద్మకింజల్కములవలెఁ బచ్చనిదుకూలములచే రాణించు చున్నది. అది నిర్మలము లగుమకరకుండలంబులచే మండిత మై, ప్రకాశించుచున్న కిరీటము, కడియములు, తారహారములు, అం దెలు, మొలత్రాడు మొదలగునలంకారంబులు గలిగి, శంఖచ క్రములచేతను, గదచేతను, పద్మముచేతను, వనమాలచేతను, నానావిధరత్నములచేతను, సొంపారుచున్నది. మఱియు నీయా కారము సింహస్కంధములవంటిస్కంధములందుఁ గుండలహారా దులకాంతులఁ గలిగి కౌస్తుభరత్నముచే నొప్పారుకంఠముచేతఁ గులుకుచు, శ్రీవత్సము గలదగుటచే, బంగారు రేఖలచే వెలయు నికషపాషాణంబున కీడువచ్చువక్షఃస్థలంబుం గలదై ప్రకాశించు చున్నది. అది యుచ్ఛ్వాసనిశ్వాసవాయువులచేఁ జలించునుదర రేఖలు గలిగి, సుందర మై, యశ్వత్థపత్రమువలె సొంపుగులుకు నుదరముచే విరాజిలుచున్నది. అది సుడివలెనే లోఁతయి తనవ లన నింతకుమున్ను నిర్గమించినప్రపంచమును మగుడ లోనికిఁ బ్రవేశింపఁ జేయుదానివలెఁ బొలుపారునాభి కలది. ఆనీయాకార

ము శ్యామలవర్ణము గలపిఱుఁదులందుమిక్కిలిప్రకాశించుపచ్చపట్టువస్త్రముచేతను, దానిమీఁద వెలయుబంగారుమొలత్రాటిచేతను, శోభిలుచున్నది. అది సమమయినయడుగులును, పిక్కలును, నూరువులును, నున్నతములు కానిజానువులును గలిగి నేత్రానంద మొనర్చుచున్నది. ఓమహానీయా! దళములవంటివ్రేళ్లను, గేసరములవంటినఖములును గలిగి శరత్కాలపద్మమున కీడువచ్చుచుఁ బాపములను దూలించుచు, భక్తభయమును బాపుచున్ననీపాదమును నాకుఁ జూపుము. నీ వజ్ఞానులకు గురువవై మార్గదర్శకుఁడ వై యుందువు. ఈవర్ణింపఁబడిననీరూపము, చిత్తశుద్ధిని గోరుచున్నమాకు ముఖ్యముగా స్మరింపఁదగినదే

శంకరుఁడు పరమేశ్వరుని నుతించుట

కాని ప్రత్యక్షము కాదు. నీరూపధ్యానము స్వధర్మముల నాచరించుపురుషులకు మోక్షసాధన మగుభక్తియోగముగాఁ బరిణమించును. నీవు మానవుల కందఱకును దుర్లభుఁడ వయినను బరమభక్తి గలవారికి, సులభుఁడ వగుచున్నావు. మఱియు నీవుభక్తియోగ మవలంబించినవారికి దక్కుచున్నావు. నీవు కైవల్యముకంటెను గాంక్షణీయుఁడవు. ఓమహానుభావా! యుపాయాంతరములచే నారాధనీయుఁడవు. కానినిన్ను దుస్సాధమయి యవ్యభిచారిణి యగుభక్తిచే నారాధించి త్వత్పాదమూలమును గాక స్వర్గాదిసుఖముల నెవఁడయినను గోరుకొనునా? ఎవ్వఁడును గోరఁడు అందులకుఁ గారణము లేకపోలేదు. యముఁడు ప్రభావముచేతను, నుత్సాహముచేతను, భ్రూక్షేపములచేతను, విశ్వమును నాశనము చేయుచున్నను, నీపాదమూలమును శరణుఁజొచ్చినవారి నేమియుఁ జేయఁజాలఁడు. మఱియు నీభక్తులతోఁ జేసిన

స్నేహమునకు. స్వర్గము సరి రాదు. మోక్షమును తులఁదూఁగ దు. ఇట్లుండ భక్తసహవాసమునకు నాశీర్వచనవిషయములగు పశుపుత్త్రాదులు సమానులగుదురా? ఓపాపరహితా! భక్తసహవాసము నిరతిశయగుణవత్తర మైనది. కావున నీయంశంబుచేతను, గంగోదకముచేతను గ్రమముగా నంతర్బహిర్భాగంబులందలి మలమును దొలఁగించుకొని భూతదయ కలిగి, సత్త్వగుణప్రధానముగుచిత్తముతో నొప్పుచు, సత్త్వైవృత్తిచే వాసికెక్కినసత్పురుషసహవాసము మాకు లభించుఁగాక. అది నీయనుగ్రహము లేక కలుగదు. కాన దయయుంచి యొసఁగుము. ఓమహనీయా! భక్తియోగముచే ననుగృహీతమయి, సత్త్వగుణము గలిగి పరిశుద్ధమగుపురుషునిచిత్తము, శబ్దాదివిషయములం దెప్పుడును సక్తము కాదు. తమోరూపమయినగుహయం దెప్పుడును లీనము కాదు. అప్పుడు ముని నీస్వరూపమును సుఖముగాఁ దెలిసికొనుచున్నాఁడు. దేనియందుఁ జిదచిదాత్మకమయినప్రపంచమంతయు వ్యక్తమగుచున్నదో, యేనీస్వరూపము సమస్తప్రపంచమునందును బ్రకాశించుచున్నదో, యాపరబ్రహ్మతత్త్వము *వెలుతురువలెను నాకాశమువలెను సకలమందును వ్యాపించియున్నది. ఓపరమేశ్వరా! నీమాయ సమస్తజీవులను దనవశము

---

*ఇటఁ బరమాత్మకు జ్యోతిరాకాశములతో సామ్యము చెప్పుటచే నాకాశము ఘటాదులందు వేఱువేఱయి కానవచ్చుచున్నను, దద్గతదోషముల నెట్లు చెందదో, జలమందుఁ బ్రతిఫలించినసూర్యునకు జలగతములగు చలనాదిదోషము లెట్లు పొందవో, యట్లె చిదచిదాత్మకమయిన సకలమందువ్యాపించి యున్నపరమాత్మకుఁ జిదచిద్గతములగుదోషము లేవియుఁ జెంద వని తెలియవచ్చుచున్నది.

గావించుకొని సంసారమునఁ ద్రోచి పెక్కు లనర్థంబులఁ గలిగించును. ఆమాయవలననే జీవునికి నానీశ్వరునికిని భిన్నుఁడనెడిబుద్ధి తాను స్వతంత్రుఁ డనెడిభ్రాంతియు గలుగుచున్నది. అది బహువిధరూపములుగాఁ బరిణమించుస్వభావముకలది. అట్టిమాయచేత నీవు ప్రపంచమును సృజించుచు రక్షించుచు మఱల సంహరించుచు నీవిట్టియనల్పకార్యము లొనర్చుచున్నను నిర్వికారుండ వయి స్వతంత్రుండ వయి యున్న నిన్ను శరణు వొందుచున్నాము. ప్రకృతివిషక్త మగునాత్మయొక్క ధాత్మ్యము మోక్షించిన మహాత్ములు శ్రద్ధానయుక్తులై ఫలాపేక్ష లేనిస్వవర్ణాశ్రమోపాచితధర్మములచేత, నీస్వరూపమును జెలియ నపేక్షించు యథాప్రకృతదివ్యమంగళశరీరుండ వగుని న్నారాధించుచుఁ గర్మయోగప్రకాశక మగు వేదమందును నాత్మతత్త్వజ్ఞానమును దెలుపు సాంఖ్యమందును గుశలు లగుచున్నారు. ఓజగదీశ్వరా! సృష్టికిఁ బూర్వమందు నీవు చిదచిదాత్మశక్తులను నీయందు నిమిడ్చికొని, కావుననే యసహాయుండ వయి యొక్కరుండవై వెలయుచుంటివి. అప్పుడు నీకు లీలలు గల్పించుటయే ప్రయోజనముగాఁ గలుగునదియు నిన్నువిడిచి వేఱుగానుండఁజాలనిదియునగునీమాయవలన రజోగుణము సత్త్వగుణము, తమోగుణమువిభాగింపఁబడినవి. అందురజోగుణాదులవలన మహత్తత్త్వము, దానివలనఁ ద్రివిధాహంకారము, తరువాతఁ గ్రమముగా నాకాశము, దానివలన వాయువు, దానివలన నగ్ని, దానివలన జలమును. బృథ్వియుఁ గలిగినవి. పంచీకృత మగునాకాశాదిభూతములవలన నండోత్పత్తియు, దానివలన బ్రహ్మాదిదేవతలును, వారివలన మరీచ్యాదులును, వారివలన మానవులును దిర్యక్కులును గలిగి

నవి. ఓ దేవ దేవా ! నీశక్తి యగు ప్రకృతిచే సృజింపఁబడినవారు దేవత లనియు మానవు లనియుఁ దిర్యక్కు లనియు, స్థావరము లనియు నాలుగువిధములుగాఁ బరిగణింపఁబడుచున్నారు నీవాచతుర్విధ మగుశరీరములందును నాత్మాంశక మగుజీవునిమూలమునఁ బ్రవేశించియున్నావు. ఇట్లు జీవాంతరాత్మవై ప్రవేశించిన నిన్నును బురుషునిఁగాఁ దెలిసికొనుచున్నారు. నీవే జీవుని కంతరాత్మవై ప్రవేశించితివో, యాజీవుఁ డింద్రియములచే సంపాదిత మగుశబ్దాదిభోగ్యజాతమును, దెనెటీఁగలు చేర్చిన తేనెనువలెనే యనుభవించుచున్నాఁడు. పిమ్మట దురూహ మగుతత్త్వము గలిగి కాలశరీరుఁడ వగునీవు మహావేగము గలవాఁడవై, భూతములచేతనే భూతములను బీడించుచు, దుస్సహావేగము గలిగిన మహావాయువు మేఘపంక్తులనువలె సకలభూతములను సంహరించుచున్నావు ఇంతియకాక యాలోచనములచే మిక్కిలి మత్తులై, శబ్దాదివిషయములందు సక్తులై, యిష్టపదార్థములు సంప్రాప్త మైనను, పేరాసతో వర్తించుచున్న వారలను నీవప్రమత్తుఁడవై క్షుధార్త మగుసర్ప మెలుకలను బట్టి బలాత్కారముగా మ్రింగినట్లు మ్రింగుదువు. ఓజగదీశ్వరా! నీయనాదరణముచే జ్ఞానమును గోలుపోయినవాఁ డయినను మానవుఁడు నిజాదృష్టమువలనఁ బండితుఁ డయినచో వాఁడెప్పు డయిన నీ పాదమూలమును విడువ నెంచునా? ఇంతియ కాక చతుర్దశమనువు లెవ్వానికి దినపరిమాణమును గలిగించుచున్నారో యాబ్రహ్మ సైతము నిశ్శంకచే నిన్నారాధించుచున్నాఁడు. మాకుఁ బెద్ద యగుబ్రహ్మయే నిన్నుఁ బూజించునప్పుడు మాసంగతి చెప్పనేల? ఓపరమాత్మా! సమస్తప్రపంచమును భవదాత్మకుఁ డయిన

రుద్రునిభయమువలన నశించును. ఈతత్త్వమును దెలిసికొనియున్న వారికి భయము లేకుండఁ జేయువాఁడ వయి దీపించుచున్నావు' అని యిట్లు శంకరుండు పరబ్రహ్మమును నుతించి ప్రచేతసులకుపదేశించి యిట్లనియె. ఓనృపనందనులారా! మీరు నావాక్యములందు విశ్వాసముంచి యీభగవత్ స్తుతిని జపించుఁడు ఈజపముచే మీకు భద్రము కలిగెడిని. మీరు స్వవర్ణోచితధర్మములను సర్వదా నాచరించుచు, పరమాత్మయందుఁ జిత్తంబులం జేర్చి మాటిమాటికిని నుతించుచు, సర్వభూతములందును వెలయుచు నంతరాత్మగా నున్నపరమాత్మను బూజింపుఁడు. ఓ రాజకుమారులారా! యీస్తోత్రమును బఠించుచు, మనస్సున నిలిపికొని, చిత్తమును నిశ్చలముగాఁ గావించుకొని, మౌనవ్రతమాచరించుచు, నాదరయుక్తులయి మీ రభ్యసనము సేయుచుండుఁడు. ఇప్పుడు మీకు నుపదేశించినతత్త్వమును మునీశ్వరుల కధిపతియును, బ్రజాభివృద్ధిఁ జేయఁ దలంచినవాఁడు నగు బ్రహ్మ ప్రజాసృష్టి చేయనెంచినభృగ్వాదుల మగు మాకు బూర్వమున నుపదేశించెను. ప్రజాసృష్టియందు మే మందఱమును బ్రేరితుల మయి, యీస్తోత్రముచే నజ్ఞానమును దొలఁగించుకొని, సకలప్రజలను సృజించితిమి. పురుషుఁ డెవఁ డైనను, సమాహితచిత్తుఁ డై వాసుదేవుఁడే ప్రాప్యుఁ డనియును, బ్రాపకుఁ డనియును, నాధారుఁ డనియును, నమ్మికొని నిత్యమీస్తోత్రమును బఠించుచు వేగముగాఁ దన కిష్టమగు శ్రేయస్సును బొందును. సమస్తశ్రేయస్సులలోను భగవదాత్మక మగుజ్ఞానమే ముఖ్యశ్రేయ స్సని చెప్పఁబడినది. ఆశ్రేయస్సుచేతనే జ్ఞానవంతు లగుమహాత్ములు పెక్కండ్రుపాయాంత

రములచే దుస్తరమగు దుఃఖసాగరమగు సంసారమును దరించుచున్నారు. ఓరాజపుత్త్రులారా! నేను జేసినయీస్తోత్రమును శ్రద్ధాసంయుతులై పఠించినపురుషుఁ డుపాయాంతరములచే నారాధింపఁబడని హరి నారాధించి హరివిషయభక్తినిఁ బొందుచున్నాఁడు. మఱియు నీస్తోత్రముచే సంతసింపఁ జేసి సర్వపురుషార్థములకుఁ బ్రభు వయిన పరమపురుషునివలన నిష్టశ్రేయస్సులను సత్వరముగానే చెందును. ఈ స్తోత్రమును బ్రాతఃకాలమందు లేచి ప్రాంజలులై వినినవాఁడును, వినిపించినవాఁడును, సకలబంధనములను వీడుచును. కావున రాజనందనులారా! నే నిప్పుడు చెప్పినపరమాత్మస్తోత్రమును సమాహితచిత్తులై మీరు జపము చేయుచుఁ దపం బొనరింపుఁడు. అంతమందుఁ బరమాత్మవలన మీయభీష్టములను బొందుఁడు. ఇది యిరువది మూఁడవ యధ్యాయము.

ఇవ్విధంబునఁ బ్రచేతసుల కుపదేశించి వారి లిచ్చుపూజలు కైకొని వారలు చూచుచుండఁగా నచ్చట నే శంకరుండంతర్ధానము చెందెను. అనంతరమందుఁ బ్రచేతసు లందఱును రుద్రుఁడుపదేశించిన స్తోత్రమును జపము చేయుచుఁ బదివేలవత్సరంబులు జలంబుల నిలిచి తపం బొనరించిరి. అటఁ బ్రాచీనబర్హికర్మములం దాసక్తుఁ డై యుండుటను జూచి యాత్మవిదుఁ డయిన నారదుండు కృపాళుండయి యతని కిట్లు జ్ఞానోపదేశమును జేసెను. "ఓరాజా! నీ వాచరించుచున్న యజ్ఞాదికర్మములచే నీవేమి శ్రేయస్సు నభిలషించుచున్నావు? ఒకచో నీవు దుఃఖనివృత్తిని, సుఖప్రాప్తిని గోరుకొనుచున్నచో యాగాదికర్మములచే

నుభయమును సాధ్యము కాదు.” అని పలికిన నారదునివచనము విని ప్రాచీనబర్హి యిట్లనియె. “ఓమహాత్మా! నేను గర్మకలాపముచే నాకర్షింపఁబడి యుత్కృష్టమయిన శ్రేయస్సేదియో యెఱుంగకున్నాను. కావున నీమానసమునకు నిర్మలత్వము కలిగించెడియుఁ, గర్మరూపబంధనములను వదల్చునదియు నగుజ్ఞానమును నాకుపదేశింపుము. ఓ మహనీయా! విడువఁ దగని ప్రవృత్తిధర్మములు గల సంసారములందు సంచరించుచు, సమస్త

నారదుఁడు ప్రాచీనబర్హికి జ్ఞానోపదేశము సేయుట.

ము నాదే యని తలపోయుచుం బుత్రాదులందుఁ బురుషార్థబుద్ధి నుంచి కావుననే మూఢుఁడనై నే నుత్కృష్టశ్రేయస్సును దెలియఁజాలనైతిని.” నావుడు నారదుం డిట్లనియె. ‘ఓరాజేంద్రా! యాగకర్మములందు నిర్దయాత్ముఁడ వయిననీవు వేలకొలదిపశువులను జంపితివి. చూడుము. నీచేఁ జంపఁబడిన పశువు లన్నియును నీవొనరించినపీడను స్మరించుకొనుచు నీ మరణకాలమును నిరీక్షించుచుండును. నీవు చచ్చినప్పు డాపశువులు మహాక్రోధమును వహించి తమవాఁడికొమ్ములతోఁ గ్రుమ్మి నిన్నుఁ జీల్చును. ‘ఓయీ! యాగాదులందు మారితము లయినపశువులకు స్వర్గము వచ్చునని వేదాదులందుఁ జెప్పఁబడినది. అట్లుండ నాపశువులు స్వర్గాదిసుఖము గలిగించినందులకు సంతసించునే కాని కోపము వహించునా?’ అందువేని ఓరాజా! నిరతిశయమగు పురుషార్థ

పురంజనోపాఖ్యానము

ము దెలుపు నొక యితిహాసమును జెప్పెదను. పురాతనమైనయా పురంజనచరిత్రమును నావధానచిత్తుండవై వినుము. * ఓ

* ఇట నారదుఁడు ప్రాచీనబర్హికిఁ దత్త్వోపదేశ మన్యాపదేశముగాఁ

రాజా! పూర్వకాలమునఁ బురంజనుఁ డను రాజొకండు కలఁడు. అతఁడు పెక్కు పురంబుల నిర్మించి పురంజనుఁ డని విఖ్యాతి గాంచెను. అతఁ డుదారకీర్తి కలవాఁడు. అతనికిఁ బరులచేఁ దెలియఁబడని చేష్టలుగల మిత్త్రుండు గలండు. అతనిపే రవిజ్ఞాతుఁ

జేయుచున్నాఁడు. అంతియు కాని ప్రత్యక్షముగాఁ జేయలేదు. ప్రత్యక్షముగా నేల చేయరాదు? సాక్షాదుపదేశము చేసిన వైరాగ్యోదయము కాకపోవునా? అందు వేని సమాధానము చెప్పెదను. వినుము. దేహాదులే యాత్మయనెడి యభిమానము చేతను, స్వతంత్రాభిమానము చేతను భ్రమింపఁబడి తత్త్వ మనఁగ నెట్టిదియో, యేది మేలో, యేది పురుషార్థమో, తెలియక విషయసుఖములే పరమపురుషార్థము లని తలంచుచు, నున్నవానికిఁ దత్త్వోపదేశము చేయుచున్నను జక్కఁగా మనస్సున కెక్కదు. కావున జననము, మరణము, జాగ్రత్స్వప్నసుషుప్త్యాద్యవస్థలును గలసంసారమును వర్ణించి యందుఁ గలదోషములను వివరించి చెప్పి, సంసారమంత హేయమయినది వేఱొకటి లేదనుబుద్ధిని బుట్టించి, తత్త్వోపదేశమును జేసినచో నది లెస్సగా మనస్సునకుఁ బట్టునని నిశ్చయించి, జీవుని నొకరాజుగాను, శరీర మొకపురముగాను, బరమాత్మ స్నేహితునిగాను, బుద్ధిని భార్యగాను నిరూపించి నారదుఁడు పురంజనోపాఖ్యానమును జెప్ప నారంభించెను. జీవుఁడు శరీరములను జన్మింపఁజేసి పురంజనుఁ డను పేరు వహించుచున్నాఁడు. జీవుఁడు విస్తృతమైనకీర్తి కలవాఁడు. ఇందులకుఁ బ్రమాణము. "అపహతపాప్మా విజరో విమృత్యు ర్విశోకో విజిఘత్సో ఽపిపాసస్సత్యకామ సత్యసంకల్పో నిర్వాణమయః" యనియు. "అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ। నిత్యస్సర్వగతస్స్థాణు రచలోఽయం సనాతనః" యనియుఁ గలవు. వీనిచే జీవుఁ డనంతకల్యాణగుణములు గలిగి కీర్తిమంతుఁ డగుచున్నాఁడు. జీవునకుఁ బరులచే నవిజ్ఞాతుఁ డగు పరమాత్మయే మిత్త్రుఁడు. జీవునకుఁ బరమాత్మ మిత్త్రుఁ డయినట్లు "మాతా పితా భ్రాతా నివాస శ్శరణం సుహృద్గతిశ్చ నారాయణః" యని శ్రుతులందుఁ జెప్పఁబడుచున్నది. తన

డు. ఆపురంజనుఁడు నివాసస్థానమును వెదకుచు భూమండలము నందుఁ గలపురములకుఁ బోయి యచ్చటచ్చటఁ గొంతకాలము వసించుచు సమస్తభూమండలమందును సంచరించెను. కాని తన కనుకూలమగు పురమును గానక దుఃఖితమనస్కుం డాయెను. *ఈపురంజనుఁడు సకలభోగ్యపదార్థములను గోరుకొనుచు, నానాభోగ్యవస్తువులు లభింపఁ జేసికొనుటకుఁ బ్రయత్నించి, మహీమండలమందుఁ గల సకలపురంబులు మంచివి కావని భావించెను. †ఇట్లు తిరుగుచు నతఁడు హిమాలయమునకు దక్షిణసానువునందు నవద్వారములతోఁ గూడియున్న యొకపురంబును గాంచెను. ఆపురము ప్రాకారములచేతను, సుద్యానవనములచేతను,

---

కు హితుఁడునుగ లిగించు పరమాత్మయాజ్ఞ నుల్లంఘించి సంసారజీవుఁడు తనపేరును నెఱుంగఁజాలఁడు. అట్టుండ రూపముసంగతి వేఱ చెప్ప నేల? మఱియు జీవునికి మిత్రుఁడయినపరమాత్మ విజ్ఞాతచేష్టితుఁడు. జగత్ప్రసిద్ధములగు జగద్వ్యాపారము మొదలగు చేష్టలు గలవాఁడు. ఇట్టె ముందుముందు క్రమముగా మూలమున వర్ణింపఁబడు పురంజనునితో సమముగా జీవునకు సమన్వయించుకొనవలెను.

*జీవపక్షమున = జీవుఁడు విస్తృతమగుకీర్తి కలవాఁడు. ఆతఁడు సంసారమందుఁ బడి తనపేరును గూడ మఱచుచున్నాఁడు. అతనికి జగత్ప్రసిద్ధములగు జగద్వ్యాపారములు గలపరమాత్మ హితుఁడు. ఆజీవుఁడు తన కనుకూలమయినభోగాయతనశరీరమును వెదకుచు, దేవాదిస్థావరాంతమువఱకుఁ గలశరీరములందుఁ బ్రవేశించుచుఁ బ్రకృతిమండలమందంతటను సంచరించెను. కాని తన కనురూపమగు దేవమనుష్యాదిశరీరమును బొందలేక మిగుల దుఃఖంబు నొందెను.

†మఱియు జీవుఁడు శబ్దాదివిషయములను గోరికొనుచు, నట్టిశబ్దాదివిషయము ననుభవింపఁ దగినశరీరమునిమిత్తము పరిభ్రమించుచుఁ దాఁ జూచిన వన్నియు మంచివి కావని తలంచెను

బురుజుల చేతను, గవాక్షముల చేతను, బహిర్ద్వారముల చేతను గూడి యున్నది. మఱియు నది వివిధము లగు గృహముల చేతను గనకమయములును, రజతమయములును, నయోమయములు నగు శృంగముల చేతను, వెలయుచున్నది. ఆపురము నీలములు స్ఫటికములు, గరుడపచ్చలు, ముత్యములు, మరకతములు, పద్మరాగములు, మొదలగు రత్నములచే స్థగితములగు మేడలచే రాణించుచుం గాంతికి భోగవతీపురమును బోలుచుండెను. *మఱియు నది సభామందిరముల చేతను, చతుష్పథముల చేతను, రాజమా

* జీవుం డిట్లు సంచరించుచు, నొకప్పుడు కర్మము లాచరించి తత్ఫల మందందగిన క్షేత్రము లగు నంధత్వపంగుత్వాదు లగు దోషములు లేని మనుష్య శరీరమనెడి పురమును జూచెను. అది నేత్రశ్రోత్రాదులగు తొమ్మిదిద్వారములు కలది. అది ప్రాకారములవంటి చర్మాదుల చేతనుం గూడినది. దానికి రోమపంక్తియే యుపవనము. బుజములు లనునట్టాలకములు గలది. దానికి రక్తమే పరిఖవలెం దనర్చుచున్నది. నవరంధ్రము లనుగవాక్షములు కలవు. రాజసాది భావములు శృంగములవలెం దనర్చుచున్నవి. మూలాధారాదు లగుచక్రములు గృహములవలె నున్నవి. హృద్గతము లగు నాడులే నీలశ్వేతాదు లగుచక్రములు. శరీరము సర్వాకారము లగు నాడులు గలదగుటచే భోగవతీపురమును బోలుచున్నది. మఱియు నట జీవుని కాశ్రయభూత మగుటచే హృదయము సభామందిరమువలెను చతుష్పథమువలెను బరమాత్మకుం గ్రీడాస్థాన మగుటచేతం గ్రీడాయతనమువలెను, చక్షురాదీంద్రియస్థానములు బురుజులవలెను, జీవుండు రాజ రాజమార్గమునం బోయి విశ్రమస్థానమును జేరునట్లు సుషుమ్నానాడీమార్గమునం బోయి మోక్షము నొందునుగాన సుషుమ్నానాడి రాజమార్గవలెను, సుషుప్తియందు జీవునకు విశ్రమస్థాన మగుపురీతత్తు విశ్రాంతిస్థానమువలెను, నాధారాదిచక్రములందున్న కర్ణికలు పగడపుటరుగులవలెను, నఱచేతులు నఱికాళులుం బతాకములవలెను ప్రకాశించుచుండెను.

ర్గములచేతను, క్రీడాదిస్థానములచేతను, సంగడి వీథులచేతను, విశ్రమస్థానములచేతను, ఒక్కెములచేతను, బగడంపువేదికల చేతను సంయుతమయి యలరారుచుండెను.*ఆపురంబునకు వెలుపలిభాగమం దొక యుపవనంబు గలదు. ఆయుపవనము సుర సాలాదివృక్షములచేతను, లతలచేతనుఁ బరివేష్టితమై యున్నది. మఱియు నందు ధ్వనిచేయుజలవిహంగంబులును, దుమ్మెదబంతుల కోలాహలములును గలసరోవరంబుచేఁ బ్రకాశించుచుండె. పుష్పవనమునందు హిమజలబిందువులను గుసుమపరాగమును ధరించి పుష్పవర్షములను గురియుచుఁ బ్రసరించుచున్న మందమారుతములు గలవు. అందుఁ జలించుచిగుళ్ళు గలిగినసుందరతరుబృందములును, బద్ధసంపదలును గలవు. ఆవనమునం దున్న వన్యమృగములు ఘాతుకత్వబుద్ధిని విడిచియున్నవగుటచే నెట్టిబాధయు లేకుండెను. అటఁ గోకిలాలాపములచేఁ బాంథులు తామే పిలువఁబడుచున్నట్లు తలంతురు. †ఆవనమునం దొక స్త్రీరత్నము విహరించుచుండెను. ఆమె పదుగురుభటులతో నభిముఖముగ వచ్చుచుండె

---

* విషయవర్గము బాహ్యోద్యానవనమువలెను, మఱియు శబ్దము పక్షికోలాహలమువలెను, గంధము గుసుమములవలెను, స్పర్శగుణము మందమారుతముమాడ్కిని, రూపము ప్రవాళములవలెను నొప్పుచున్నవి. శ్వశురస్యాలకాదిబాంధవులు వన్యమృగములరీతిని, నివృత్తిమార్గ మవలంబించినవాఁడు పాంథునివలెను, వెలయుచుండెను.

† అట జీవుఁడు బుద్ధిని బొడగాంచెను. బుద్ధి నూఱులకొలంది గలవృత్తుల కధిపతులైనజ్ఞానకర్మేంద్రియంబులతోఁ గూడికొని యభిముఖముగా వచ్చుచున్నది ఆమె యైదయినవృత్తులు గలప్రాణములచే రక్షింపఁబడుచున్నది. బుద్ధికి చేతనసంబంధము గలయపుడు ప్రౌఢురాలు కాని స్త్రీవలెనే యుండును గావున నాబుద్ధికి ప్రౌఢత్వము లేదు.

ను. ఆమెభృత్యులలో నొకఁడు నూఱుగురు స్త్రీల కధిపతియై యుండెను. ఆకన్యారత్నము శిరఃపంచకముచే నొప్పుసర్పముచే రక్షింపఁబడుచు, నప్రౌఢయై కామరూపిణియై భర్తను వెదకుచుండెను. ఆమె చక్కని నాసికతోను, సుందరములగు దంతములతోను, నిద్దంపుటద్దములఁ బోలిన చెక్కులతోను వెలయుచుండెను. ఆమెయాననము మిక్కిలిసుందరమైయుండెను. ఆమెకర్ణములందున్న కుండలములకాంతులచే గండస్థలములు ప్రకాశించుచుండెను. ఆమె సుందరమగు వేణితోను, నందములైన పిఱుందులతోను, బంగారుమొలత్రాటితోను, పాదములందు మధురంబుగ ధ్వనిచేయు నూపురంబులతోను, విలసిల్లుచు దేవకాంతను బురుడించుచుండెను. *యౌవనారంభముచే వృత్తములై సంశ్లిష్టములయి యున్న స్తనంబులు గలిగి లజ్జాతిశయముచే మేలిముసుంగు వైచికొనుచు, గంధగజమువలె మందగమనము కలదై, మందహాసము

* అది గంధాదిరసజ్ఞాన విశేషములచేఁ గామరూపిణి యగుచున్నది. అది యోగ్యమైన గంధాత్మకమయిన ఘ్రాణేంద్రియవృత్తి కలది. అది దంతవ్యాపారజన్యవృత్తి కలది. మఱియు నది యౌవనాద్యవయవజన్యవృత్తి కలది. అది కుండలాలంకృతమగు కర్ణములందలి శ్రోత్రేంద్రియవృత్తి కలది. అది స్తననితంబాదివ్యాపారములవలనఁ గలిగినహర్షవృత్తులు కలది. మఱియు మనస్సుతోఁ గూడినపదియింద్రియములు భటులవలెను, శతసంఖ్యాకము లగు నింద్రియవృత్తులు స్త్రీలవలెను, పంచప్రాణంబులు శీర్షపంచకముతో నొప్పుసర్పరాజువలెను నొప్పుచున్నవి. బుద్ధియుఁ బ్రాణాయత్తమైనప్రవృత్తి కలది కావునఁ బ్రాణము బుద్ధికంటె ముందుగా నడుచుసర్పరాజునుబోలుట సమంజసముగా నున్నది. బుద్ధి ననుసరించి యింద్రియవృత్తు లన్నియుఁ బోవును గాన ననుసరించుభటులతోఁ బోలుట యుక్తముగా నున్నది. కావున జీవుఁడు బుద్ధిని జూచి మోహించెను.

చేతను, సిగ్గుచేతను మో మొకక్రొత్తయుండవమునఁ గులుకు
చుండఁ బ్రేమాతిశయముచే మీఁదుగాఁ జలించుచున్న కనుబొమ
లను విండ్లచేఁ గటాక్షవీక్షణము లను బాణములను బ్రయోగించు
చున్న యాసుందరినిఁ గాంచి పురంజనుం డిట్లనియె. *ఓపద్మాక్షి!
నీ వెవతెవు? నీ వేజాతిదానవు? నీ వెవనికుమారికవు? ఎందుం
డి వచ్చుచున్నదానవు? ఈపురసమీపమందు నీ కేమిపని గలదు?
నీవృత్తాంతమును నాకుఁ దెలియఁ జేయుము. నిన్ను ననుసరించి
వచ్చునీపదునొకరు మహాభటులును నెవ్వారలు? సుందర ము
యినకనుబొమలు గలయో స్త్రీరత్నమా? ఈ స్త్రీ లెవ్వారలు?
నీకు ముందుగఁ బోవుచున్న యాసర్పరా జెవఁడు? ఓసుందరీ!
ఎవనిపాదపద్మములు సేవించుటవలన సమస్తవాంఛలును నెఱవే
ఱునో, యట్టిపురుషునిఁ బతిఁగాఁ బడయుటకయి మునివలె విజన
మగువనమందు సంచరించుచున్నదానవు. నీవు వరాహమూర్తిని
వెదకుభూదేవివా? లేక శంకరుని వెదకుభవానీదేవివా? బ్రహ్మ
నన్వేషించు సరస్వతివా? లేక విష్ణుమూర్తిని వెదకు లక్ష్మీదేవివా?
నీవు లక్ష్మీదేవి వయినచో నీచేతియందుఁ బద్మకోశము కానరా
లేదు. ఎచ్చటఁ బడిపోయినది. ఓసుందరాంగీ! ఆలోచింప నీరమా
దిదేవతలు భూమిని స్పృశింపరు. కాన భూమిని స్పృశించు నీవు
రమాదిదేవతలలో నొకర్తుకవును గావు అద్భుతచర్యలు గలిగి
వీరశ్రేష్ఠుండనైన నాతో విష్ణువుతో వైకుంఠము నలంకరించిన
లక్ష్మివలె నీపురము నలంకరించుటకు వచ్చినట్లు తోఁచుచున్నది.

---

* సుందరీ! నాతోఁ గూడ నీశరీరమును బ్రవేశించి సకలసుఖముల ననుభవించుటకు వచ్చినట్లున్నది. నన్నుఁ గోర్కులు మిగులఁ బీడించుచున్నవి. కాన నాయూవస్తువులను జేర్చి నా కానందము కలిగింపుము.

నీకటాక్షవీక్షణములచేఁ గలఁగినచిత్తము గలనన్నును, సిగ్గుచేతను బ్రేమముచేతను, మందహాసముచేతను, విలాసవంతము లగు నీకనుబొమలచేతను బ్రేరితుఁ డగుమన్మథుఁడు మిగుల బాధించుచున్నాఁడు. కావున నన్నుఁ గరుణింపుము. ఓసారసాక్షీ!

పురంజనుండు బుద్ధితో సంభాషించుట.

సుందర మగుకనుబొమలు గలిగి, మంచికనీనికలతో నొప్పుచు, సోగ లైనచల్లని నెఱికురులచే నొప్పుచున్నమై, మృదువు లగువాక్కులు గలిగి చిఱునవ్వుతో వెలయుచు, సిగ్గుచే నభిముఖమునకు రానొల్లనినీవదనమును నాకుఁ జూపుము” అని యిట్లు లింద్రియంబులకు వశుఁ డై తన్నుఁ బూజించుచున్న పురంజనునిఁ గాంచి మోహించి యతని మోహింపఁ జేయుచు, నను మోహించి గామె యిట్లనియె. *ఓరాజా! నిన్నును నన్నును సృజించి మన కిట్టినామములను గులమును గల్పించినపురుషుఁడెవఁడో మే మెఱుఁగము. ఓరాజేంద్రా! ప్రస్తుతమున నీపురియం దున్న నిన్ను నీపురియందుఁ బ్రవేశించి పరిపాలించువానిఁగాఁ దలం

---

* అని బుద్ధి జీవున కిట్లనియె. ఓరాజా! ఈశరీరము నెవ్వరు సృజించిరో యెఱుఁగను. ఈపదుగురు మనంబుతోఁ గూడినయింద్రియములు. మనస్సు మొదలగునింద్రియములు నిద్రించినప్పుడు ప్రాణము జాగ్రత్తతో శరీరమును గాచుచుండును. ఓజీవా! నీవు దైవసంకల్పమువలన నీమానవశరీరమును బొందితివి. ఇందు నూఱుసంవత్సరంబులు నివసించి యింద్రియంబులిచ్చుసుఖంబు లనుభవింపుము. ఓజీవా! కామి వయి యిష్టార్థములను విడువక, శబ్దాదికామములను గోరుచు, నున్ననీకంటెఁ బరు నెవ్వని నే వరింతును? అని పలికె జీవుఁడును బుద్ధియుఁ బరస్పరము సమయము చేసికొని మనుష్యశరీరమునఁ బ్రవేశించి విషయసుఖముల ననుభవించుచుండిరి.

చుచున్నాను. మన కిరువురకును నివాసస్థల మగునీపురమును నిర్మించి మనయిరువురకంటె విలక్షణుఁడయినపురుషుని నేమెఱుంగము. ఈపదునొక రగుమహాభటులును, నీస్త్రీలును నాకు స్నేహితులు. మఱియు భృత్యులు, నేను నిద్రించునసమయమున నీసర్పరాజు పురమునుఁ బాలించుచు మేల్కొనియుందును. నీవు దైవవశమువలన నీపురంబును బొందితివి. నీకు శుభములు కలుగుఁగాక. ఓశత్రుహంతా! శబ్దాదివిషయసుఖములను నీవు పొందుదువు. నేను నాస్నేహితులతోఁగూడ నీకు గ్రామ్యసుఖములను సంపాదింతును. ఓరాజా! నేను సంపాదించి యిచ్చుచున్న సుఖముల ననుభవించుచు నూఱువత్సరముల కాలమీపురంబున నుండుము. ఓరాజేంద్రా! నిన్ను నేరమింపఁజేయక విరక్తుండై, నిషిద్ధములు కానిసుఖముల నైన నపేక్షింపక, కాలాంతరమందు లభించు స్వర్గాదిఫలముల నెఱుఁగక, మృత్యువునకు భయపడుచు నున్న మఱొక్కని రమింపఁజేయుదునా? ఈప్రవృత్తిమార్గమందు, యాగాదిరూపధర్మము, అర్థకామములు, పుత్త్రసుఖము, మోక్షము, కీర్తియు, నిర్బాధము లగుపుణ్యలోకములును కలుగును. మఱియు గృహస్థాశ్రమము, పితృదేవతలకును, మునులకును, మానవులకును, భూతములకును, నాత్మకును, క్షేమము గలిగించుశరణ మని చెప్పుదురు. ఓవీరవరా! మహాప్రసిద్ధిఁ జెంది, త్యాగశీలుఁడ వయి, నేత్రానందకరుఁడ వయి, నిరుపమానుఁడ వయిననీవంటిభర్తను నిరుపమానురాలయిన యెవ్వతె వరింపకుండును? నీవు కరుణాతిశయముచేతను, సుందరహాసపూర్వక మగు క్రేఁగంటిచూపులచేతను, సమస్తదీనజనులబాధను తొలఁగించుచు వర్తించుచున్నవాఁడవు. సర్పరాజులవంటి నీబాహువులం

దే స్త్రీమానసము సక్తము కాదు?" అని వారిరువురును, బరస్పరము సంభాషించుకొని, యొక ప్రతిజ్ఞ చేసికొని, 'ఓప్రాచీనబర్హీ! యీపురమును బ్రవేశించి నూఱువత్సరంబులదాఁక సర్వసుఖముల ననుభవించుచుండిరి. అప్పుడు పురంజనుండు, చక్కఁగా నుతింపఁబడుచు, స్త్రీలచేఁ బరివేష్టింపఁబడి యందందుఁగ్రీడించుచు గ్రీష్మర్తువునం దొక్కనాఁడు క్రీడాజనిత మగుశ్రమంబును దొలఁగించుకొనుట కొకసరస్సును బ్రవేశించెను. ఓరాజా! వా రున్నపురంబు నభివర్ణింతు వినుము. *ఆపురమున కేడుద్వారములు మీఁదిభాగమున నమర్పఁబడినవి. రెండుద్వారములు క్రిందిభాగమున నమర్పఁబడినవి. ఆరెండుద్వారంబులు నాపురాధిపతి ప్రత్యేకముగా దేశములనుగూర్చి పోవుట కుంపఁబడినవి. మీఁదుగా నుంచఁబడిన యేడుద్వారములలో నైదుద్వారములు తూర్పుదిక్కున నున్నవి. ఒక ద్వారము దక్షిణముగాను,మఱొక్కటి యుత్తరముగాను నున్నవి. క్రిందుగా నుంచఁబడినద్వారములు పడమరదిక్కుగా నున్నవి. ఆద్వారములనామములను దెలిపెదను వినుము. తూర్పున నుండుద్వారములలో రెండు ఖద్యోత యనియు నావిర్ముఖి యనియుఁ బేరులు గలవి. అవి యొక్కచోటనె నిర్మింపఁబడినవి. ద్యుమత్సఖుఁ డయినరాజా ద్వా

* జీవపక్షమున, తూర్పున నొక్కచో నిర్మింపఁబడిన ద్వారము లనఁగా నేత్రములు. అం దెడమనేత్రము మిఱుగుడుబురువువలెను, స్వల్పప్రకాశము కలది. కుడికన్ను విస్తార మగుప్రకాశము కలది. జీవుఁడు చక్షురింద్రియముల కధిష్ఠానదేవత యగుసూర్యునితోఁగలసి ప్రకాశించుచుఁబదార్థములు జూచుచున్నాఁడు. అట్లె తూర్పున మఱొక్కచో నిర్మితము లయినమఱిరెండుద్వారము లనఁగా నాసికారంధ్రములు. జీవుఁడానాసిక కధిష్ఠానదేవత యగువాయువుతో నాద్వారములనుండి వెడలి గంధమును గ్రహించుచున్నాఁడు.

రములలోనుండి విభ్రాజిత మను దేశంబున కరుగుచున్నాఁడు. తూర్పున మఱొక్కచో నిర్మితము లయిన రెండు ద్వారములు నళిని యనియు, నాళిని యనియుఁ బిలువఁబడుచున్నవి. రాజవధూత యనుమిత్రునితోఁ గూడ సౌరభ మను దేశమును జూడ నేఁగును. *తూర్పున నున్నయైదవ ద్వారము ముఖ్య మను పేరు గలది. పురంజనుఁడు రసజ్ఞుఁ డనుమిత్రునితో నాద్వారమునుండి వెడలి బహూదన దేశమునకుఁ బోవును. విపణుఁ డనుమఱియొక స్నేహితునిఁ గూడి పణ మను పేరుగల దేశమునకుఁ బోవును. ఓరాజా! †దక్షిణదిక్కునం దున్నద్వారము పితృహూ వను పేరు గలది.

---

* జీవపక్షమున, తూర్పున నున్నవాసలో నైదవది యగుముఖ్యద్వార మనఁగా ముఖము. జీవుఁడు నాలుకసహాయముచే సమస్తరసములను గ్రహించుచున్నాఁడు. మఱియు వాగింద్రియసహాయముచే సమస్తవ్యవహారములను జక్కఁబెట్టుకొనుచు నున్నాఁడు.

† దక్షిణమున నున్నపితృహూ వనుద్వార మనఁగా, దక్షిణకర్ణము. ఆకర్ణము పితృలోకాదుల సాధించుప్రవృత్తిశాస్త్రములను వినఁదగి యుండుటచేఁ బితృహూ వని పిలువఁబడుచున్నది. ఎట్టివారికిని మొదటఁ ద్రివర్గము సాధించుకొని పిమ్మట మోక్షమునకుఁ బ్రయత్నించుట యుచితము గావునందులకుఁ దగినప్రవృత్తిశాస్త్రములను వినఁదగియుండుటచే దానికిఁ బ్రాథమ్యము కలిగినది. జీవుఁడు శ్రోత్రేంద్రియంబుతోఁ గూడ శబ్దమును గ్రహించుచున్నాఁడు. ఉత్తరమున నున్నదేవహూ వనుద్వార మనఁగా నెడమచెవి, బ్రహ్మఫలప్రాప్తిని గలిగించునివృత్తిధర్మములను జెప్పుశాస్త్రములను వినఁదగినదగుటచే వామకర్ణము దేవహూ వనునామమును వహించినది. జీవుఁ డాకర్ణమువలన శ్రోత్రేంద్రియముసాయమున సకలశబ్దములను గ్రహించుచున్నాఁడు. ఇట దక్షిణపాంచాల మనఁగాఁ బ్రవృత్తివిషయకశాస్త్రము లనియు, నుత్తరపాంచాల మనఁగా నివృత్తివిషయక మయినశాస్త్రములనియు నెఱుంగునది.

పురంజనుఁడు శ్రుతిధరుఁ డను మిత్రునితోఁ గూడి యాపితృహూ వను ద్వారమునుండి వెడలి దక్షిణపాంచాలములను జూడఁబోవును. అట్లె యుత్తరమున నున్న దేవహూ వను ద్వారమునుండి వెడలి యుత్తరపాంచాలంబునకుఁ బోవును. *మఱియుఁ బురికిఁ బశ్చాద్భాగంబున "ఆసురి" యను ద్వారము కలదు. పురంజనుఁడు దుర్మదుఁ డనుమిత్రునితోఁ గూడి గ్రామ్యక మను దేశమును గూడ నేఁగును. పురికిఁ బశ్చాద్భాగమున నున్న నిరృతి యను ద్వారమునుండి పురంజనుండు లుబ్ధకుఁ డను మిత్రునితోఁ గూడి వెడలి వైశస మను దేశమునకుఁ బోవును. †ఈపురద్వార

*పురపశ్చాద్భాగమున నున్న "ఆసురి" యను ద్వారమనఁగా శిశ్నము. జీవుఁడు దుర్మద మనుపయుపస్థేంద్రియముతోఁ గ్రామ్యజనకర్మ మగు మైథునాదులను జేయుచున్నాఁడు. మఱియుఁ బశ్చాద్ద్వారములలో నిరృతిద్వారమనఁగా గుదస్థానము. జీవుఁడు పాయ్వింద్రియంబుతోఁ గూడి నారకము నైన దుఃఖ మనుభవించును.

† పురద్వారములైన "అంధము' లను ద్వారము లనఁగా, పాదములును చేతులును. జీవుఁడు వానివలన నడుచుచు, సకలకర్మముల నాచరించుచున్నాఁడు. ఇటఁ బాణిపాదము లంధము లని చెప్పఁబడినవి. అనఁగా నజ్ఞము లనుట. ఇట "నిర్వాక్పేశస్కరౌ" అని పాదపాణులకు విశేషణముగలదు. అనఁగా నిర్వాక్=రంధ్రములేని, కేశస్కర పేశస్కర మనుపురుగు. దానివలెనే నిశ్ఛిద్రము లగుటచేఁ దెలివి లేని వగుచున్నవని యర్థము. ఆపురుగు తనయాస్యమునుండి నిర్గమించినద్రవ్యమువలన గూఁటినల్లి ద్వారములేకుండ జేసికొని యాహారాదులు లేక నశించును. దానివలెనే కాలుసేతులు ఛిద్రములు లేక పోవుటచే నజ్ఞములని భావము. పురంజనుఁడు విషూచీమనితో నంతఃపురము ప్రవేశించు టనఁగా జీవుఁడు మనస్సుతో హృదయమునుఁ బ్రవేశించుట. అట జీవుఁడు బుద్ధిచేతను, నింద్రియవృత్తుల చేతను గలుగుచున్న మోహాసంతోషాదులను జెందుచున్నాఁడు.

ములలో "అంధము" లను రెండు ద్వారములు కలవు, నరాధిపతి యగు పురంజనుం డా ద్వారంబులనుండియే నడుచు చున్నాఁడు. సకలకర్మముల నాచరించుచున్నాఁడు. *తరువాత బురంజనుండు విషూచీనుఁ డను మిత్రునితో నంతఃపురంబు ప్రవేశించును. అనంతరము పురంజనుఁడు దారసుతాదులవ లనఁ గలుఁగు మోహమును, బ్రసాదమును, సంతసమును బొందుచుండును. ఇట్లు పురంజనుం డజ్ఞుండై, కావుననే కామములందాసక్తుఁడై దైవవంచితుండై, బుద్ధి యను భార్య కోరినపనినే చేయుచుండెను. పురంజనుఁ డిట్లు భార్యావశుఁడయి యామె పానము చేయుచున్నఁ దానును బానము చేసి మదవివశుఁ డగుచు, నామె తిన్నప్పుడు తినుచు, నామె చరించినప్పుడు చరించుచు, నామె పాడునప్పుడు పాడుచు, నేడ్చినప్పుడేడ్చుచు నవ్వినప్పుడు నవ్వుచు, మాటలాడినప్పుడు, మాటలాడుచు, విచారము చెందినప్పుడు విచారించుచుఁ, బరువెత్తినప్పుడుపరువెత్తి, నిలిచినప్పుడు నిలిచి, శయనించినప్పుడు శయనించి, సర్వదా యనుసరించుచుండును. ఒకప్పుడు భార్య యేడ్చుచుండ దీనునివలె నేడ్చును. హర్షమును జెందినప్పుడు హర్షించుచుఁ, దాఁకినప్పుడు తాఁకుచు నుండెను. ఇట్లు పురంజనుండు భార్యచే మోహితుండై యవివేకియై మాయావంచితుఁడై, క్రీడామృగమువలెనే పరవశుఁ డయి వర్తించుచుండెను. ఇది యిరువదినాల్గవ యధ్యాయము.

---

* మఱియు జీవుఁడు బుద్ధికి వశుఁడై బుద్ధీంద్రియములు శబ్దాదివిషయములం దాసక్తము లయినఁ దాను నాసక్తుఁ డగుచు వర్తించుచుండెను.

*ఓమహారాజా! పురంజనుఁ డొకప్పుడు రథము నెక్కి పంచప్రస్థ మనువనమున కేఁగెను. †ఆరథ మయిదుగుఱ్ఱములతోఁ గూడిన దగుటచే శీఘ్రగమనము గలది. దానికి రెండుచక్రములును, రెండుదండికలును, దృఢ మయినయొకయిరుసును, మూఁడుధ్వజములును గలవు. మఱియు దాని కైదుబంధనసూత్రములు కలవు. ఆరథ మొకరజ్జువుచేతను, సారథిచేతను, రథికుఁడు కూర్చుండఁ దగినస్థలముచేతను, రెండుయుగబంధనస్థానములచేతను, నైదాయుధములచేతను, నేడుచర్మాదు లగునావరణములచేతను, నైదువిధము లగుగమనములచేతను, నొప్పుచుండెను. ‡కనకమయాభరణములతోఁ గూడినయిట్టిరథము నెక్కి స్వర్ణ

---

* జీవపర మయినయర్థము. ఓరాజా! సుషుప్త్యనంతరమం దొకనాఁడు జీవుఁ డనురాజు, కర్తృత్వము భోక్తృత్వము మొదలగువభినివేశ మనెడివిల్లు గలవాఁ డయి, శరీర మనురథము నెక్కి, పంచప్రస్థమునకుఁ బోయెను.

† ఆశరీర మనురథమునకుఁ బంచేంద్రియము లనునైదుగుఱ్ఱములుగలవు. అది శీఘ్రగమనముకలది. దానికహంకారమమకారము లనురెండుదండికలును, పుణ్యపాపము లనురెండుచక్రములును, ప్రధాన మనెడియొకయిరుసును, సత్వరజస్తమోగుణము లనెడిమూఁడుధ్వజములును, బంచప్రాణము లనెడిబంధనములును గలవు. ఆరథమునకు, మన స్సనెడిపగ్గమును, బుద్ధి యనెడిసారథియు, హృదయ మనెడియుపవేశస్థానమును, శోకమోహము లనెడియుగబంధనస్థానములును, కర్మేంద్రియము లనెడిపంచవిధగమనములును, సప్తధాతువు లనెడిచర్మాద్యావరణములును, రజోగుణప్రవృత్తి యనెడికవచమును, ననంతవాసన లనెడియక్షయతూణీరములును గలవు.

‡ అట్టిదాని నెక్కి యేకాదశేంద్రియము లనెడిసేనానాయకులు వెంబడింప శబ్దాదివిషయములు గలభోగస్థానమున కేఁగెను. జీవుఁ డిట్లుభోగస్థానము చేరి దేహపరవశుఁ డయి విడువఁదగనిబుద్ధిని విడిచి శబ్దాదివిషయాసక్తుఁడై

మఱియు వజ్రకవచమును దొడిగి, యక్షయతూణీరములఁ దాల్చి, పదునొకరు సేనానాయకులు గొల్చుచుండఁ బంచప్రస్థవనమునుఁ బ్రవేశించెను. ఆపురంజనుఁ డావనమును బ్రవేశించి గర్వించినవాఁడై ధనుర్బాణములను ధరించి, మృగములను వేఁటాడుటయం దాసక్తుఁడై యున్నవాఁడు కావున విడువఁ దగనిదయినను దనభార్యను విడిచి, తామసవృత్తి నవలంబించి, కోపపరీతమనస్కుఁడై యందందు సంచరించుచు, వాఁడిబాణములఁ బ్రయోగించి మృగసంహార మొనర్పఁ దొడఁగెను. * ఓప్రాచీన

పురంజనుఁడు వేఁటాడుట.

బర్హిన్నృపాలా! మృగములను జంపి శ్రాద్ధాదికర్మములు సంప్రాప్త మయినప్పుడు వానిలోని మాంసము తప్పక పెట్టవలయు ననియె విహిత మయినచో రాజుమాత్రము వనమునఁ బ్రవేశించి పవిత్రము లయినమృగములను మాత్రమే వానిలోఁ గావలసి యున్నవానినే చంపవలయును. అంతియ కాని విచ్చలవిడి మృగములను జంపరాదు. ఇది శాస్త్రనిర్ణీత

తామసవృత్తి నవలంబించి కామాదులకు విరోధు లగువారియందుఁ గోపము వహించి కర్మములచేఁ బొందింపఁబడుశబ్దాదివిషయములనాత్మాధీనములు కావించికొనెను.

* జీవుఁడు భోగస్థానమును బొందినను దనకు నియతము లగుభోగములను బొందినప్పుడే జీవుఁ డజ్ఞానాదులకు లోఁగఁడు అంతియ కాక స్వేచ్ఛగా భోగముల ననుభవింపఁ గోరుకొన్నచోఁ గర్మవశుఁడై యందువలన సంసారమునం బడి దేహాత్మవివేకమును మఱచి నరకమును బొందును. మఱియు జీవుఁ డిట్లు వాసనాప్రాప్తము లగుపుణ్యపాపకర్మముల ననుభవించుటచే శిథిలము లయిన యవయవములు గలవాఁ డగును. ఆవిషయానుభవము సర్వభూతదయ లయినజ్ఞానులకు మనంబుచే స్మరింపనైనను సహ్యము కాకుండెను.

మయిన కార్యము. ఇట్లుండఁ బురంజనుఁ డవలంబించినది తామసప్రవృత్తి యని యనక తీఱునా? అట్టిశాస్త్రవిషయములను దెలిసికొని సమయానుగుణముగా హింసాకృత్యము నాచరించినచో రాజు నియతకర్మములందలి జ్ఞానము కలవాఁ డగుటచేఁ బాపములను బొందఁడు. ఓరాజేంద్రా! ఇట్లాచరింపక నియతకర్మముని విచ్చలవిడి మృగములను జంపినచో వాఁ డహంకారమమకారములను బొంది కర్మముల కధీనుఁ డగుచున్నాఁడు. అట్లు కర్మబద్ధుఁ డగుటచే సంసారమునం బడి జ్ఞానము లేక నరకమును బొందును.* అనంతరము పురంజనుఁ డిట్లు వేఁటాడుచుండ విచిత్రము లగు ఱెక్కలు గల బాణములచేఁ దెగిన యవయవములు గలిగిన మృగముల నాశనము దయాళులకు మిగుల దుస్సహమయి చూపట్టెను. మఱియు నతఁడు చెవులపిల్లులు, వరాహములు, కారుదున్నలు, గవయమృగములు, రురుమృగములు, ఏదుఁబందులు, మొదలగువానిఁ జూచుచు, నవి పవిత్రము లయినను, గాకపోయినను, నవి విహితము లయినను గాకపోయినను, గంటికిఁ గానవచ్చువాని నెల్లఁ జంపుచు, వేఁటవలన మిగుల

---

* జీవుఁ డిట్లు విహారించుచు విహితములను నవిహితములను నైనవిషయముల ననుభవించి శ్రమచెందెను. ఓరాజా? రాజసబుద్ధికిఁ గార్యమయిన జాగ్రదవస్థను, తామసబుద్ధికిఁ గార్యమయిన స్వప్నావస్థను దెలిపితిని. ఇంక "ప్రవృత్తించ నివృత్తించ కార్యాకార్యే భయాభయే, బంధంమోక్షంచయావేత్తి బుద్ధిస్సాపార్థసాత్వికీ" అనెడిసాత్వికబుద్ధినిగూర్చి చెప్పెదను మఱియు సాత్వికబుద్ధి సంసారియైన జీవునకు లభించుట దుర్లభము. అదిలభింపనప్పుడు పరితాపము గలుగును. తద్బుద్ధినిగూర్చియుం దత్సాధనములనుగూర్చియుం జెప్పెదను. జీవునొకరాజుగాను, బుద్ధిని బట్టమహిషినిగాను, నింద్రియవృత్తులను నంతఃపుర స్త్రీలనుగాను గ్రహింపుము.

డస్సినవాఁడాయెను. *అంత పురంజనుఁడు క్షుధచేతను దప్పిచేతను బీడితుఁడయి, వేఁటనుండి మఱలి పురముఁ బ్రవేశించి స్నానము గావించుకొని యుచితాహారములను గొని శ్రమను దొలఁగించుకొని యుండెను. అనంతరము పురంజనుఁడు సామంతభూపాలురు చేయుమన్ననలు గొని చక్కఁగ నలంకరించుకొని యగురుధూపమును వేసికొని శరీరమునకుఁ జందనములఁదికొని పూలదండలు ధరించి, ధూపలేపాదులచే సంతోషము కలిగి, తృప్తుఁడై కావుననే మన్మథచంచలితహృదయుఁడై తనభార్యయందుఁ దలంపు గలిగి, యంతఃపురంబునకుఁ బోయి తనపట్టమహిషిని గానకపోయె.† ఓరాజా! పురంజనుఁడంత విచారపరీతుఁడై, యంతఃపుర స్త్రీల కిట్లనియె. "ఓసుందరులారా! రాణితోఁగూడ

---

* జీవుఁడట్లు క్షుధచేతను దప్పిచేతను దవుఁడై స్వప్నవిషయానుభవమనెడివేఁటనుండి మగిడి దేహాగతమయినహృదయస్థానమును బొంది కొంత యాయాసమును దొలఁగించుకొనుచుండును. అనంతరము జీవుఁడు కామపరవశుఁడయినరాజు గృహమందవర్తించుచున్నభార్యను జూడలేకవివశుఁడైనట్లు దేహాంతర్వర్తియైనబుద్ధిని జూడలేక విచారము నొందెను.

† బుద్ధిమూలకములగునింద్రియవృత్తులనుగాంచివానిలో దేనివలనసాత్త్వికబుద్ధి యుదయించునో యని చింతించెను. మఱియు వివేకము లేక వర్తించుటకంటె దేహత్యాగమే మంచి దని తలంచెను. జీవుఁడు విరహావివశుఁడయినపురుషుని (ప్రౌఢ యైనస్త్రీ) తదనుకూలము లయినహితోపదేశాదులను జేసి శోకమును దఱిమి సుఖమును గలిగించునట్లువివేకాత్మకయగుబుద్ధియుఁగూడమాటిమాటికిని హితోపదేశమునుజేసి జ్ఞానము గలిగించి దుఃఖసముద్రమునుండి తొలఁగించును. అట్టిది యెచ్చటికేఁగిన దని తలపోసెను. జీవుండిట్లు బుద్ధిని పొందవలె నని యెంచియింద్రియవృత్తులన్నియు బుద్ధిమూలకము లగుటచే నేయింద్రియవృత్తిచేతనుబుద్ధి తనకులభింపక భర్తచేఁదిరస్కృతయగుభార్యవలెనే విముఖి యై యున్నదని నిశ్చయించి నాబుద్ధి యింతకాలమునకు విపరీత యై

మీ కందఱకును బూర్వమువలెఁ గుశలము కలదు కదా ? గృహము లన్నియు శోభాహీనము లయి, పూర్వమువలెనే సంతోషదాయకము లై యుండ వేమి? చక్రాశ్వాదులు లేనిరథమునందువలె, తల్లిగాని, పతివ్రత యైన భార్యకాని, లేనిగృహమునందు దీనునివలె నివసింప నెవఁ డిష్టపడును ? నా ప్రియురాలగుబుద్ధి యెచ్చట నున్నది? ఆమె దుఃఖసముద్రములో మునిఁగిననన్నును మాటిమాటికిని నుద్ధరించుచుండెడిది. ఆమె మిగుల వివేకము కలది.'' అని యడిగినపురంజనునకు నంతఃపురస్త్రీ లిట్లనిరి. ''ఓనరనాయకా ! నీప్రియురాలినిశ్చయ మేమో మే మెఱుంగము. ఆమెకుఁ గలిగినవ్యసనకారణమును మే మెఱుంగము. శత్రుహంతా ! ఆమె యాస్తరణరహిత మగుభూమియందు శయనించి యున్నది. చూడుము'' నాపుడు వారివాక్యము విని పురంజనుండు పోయి భూమిపైఁ బడియున్నభార్యను జూచి తత్సంపర్కముచే జ్ఞానమంతయుఁ జంచలము కాఁగా మిక్కిలిదుఃఖమును బొందెను. అనంతర మతఁడు పరితాపము నొందుహృదయముతో మృదువచనములు పలికి భార్య నూఱడించుచుండెను. కాని యామె ప్రణయకలహమునకుఁ గారణ మెఱుంగకపోయెను. సాంత్వనకుశలుఁ డయినపురంజనుఁ డామె ననునయించుచుఁ బాదములను బట్టుకొని తొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని లాలనచేయుచు ని ట్లనియె. *ఓసుందరీ ! కొందఱు ప్రభువు లపరాధము

యున్నదికదా యని విచారము నొందెను. ఇట్లు చేసి బుద్ధిదైవాయత్త మగుటచే, బుద్ధిని పొందుటకుఁ దగినసాధనములను వెదకియును గాంచలేకపోయెను.

* ఇదిమొదలు బుద్ధినివిడిచి వర్తింపనని ప్రతిజ్ఞఁ జేయుచు, స్వవశీకృతయగుబు

చేసినభృత్యులను గనికరించి తనవార లని యెంచి యపరాధమునకుఁ దగునట్టులు దండనచేయరు. అట్లు శిక్షింపఁబడనిభృత్యులు మందభాగ్యు లని చెప్పవచ్చును. మఱియుఁ బ్రభువులు తనయపరాధమునకుఁ దగినశిక్ష విధించుట తనకు హితమై యుండఁగా నది తెలిసికొనక రాజదండనమునుండి తప్పించుకొను వాఁడు వట్టిబుద్ధిహీనుఁడు. అపరాధియైనవాఁడు రాజు తన్ను దండింపకున్నను బలాత్కారము చేసి యతనిచే దండింపఁబడవలయును. కావున నీవు రాణివి. నేను భృత్యుఁడను. నే నపరాధము చేసితిని. ఆ నాయపరాధమును నీవు క్షమించినను నేనంగీకరింపను. నీవు విముఖురాలవు కాక నన్ను దండింపుము. ఓ దేవీ! ఓవీరపత్నీ! సుందర మగునకనుబొమలు కలదానా! మాకు రాణి వయిననీ వట్లు దండించి యనురాగముచేతను, లజ్జచేతను, మంథరమై సొగసయినమందహాసము గలిగి, నల్లనిముంగురు

వేకాత్మక యగుబుద్ధి ననుసంధానము చేసికొనెను. మఱియు రాజ్ఞి వలెనే నన్ను రక్షింప సమకట్టియున్నబుద్ధి యింతకాలమును దనకుఁ గలుగకుండుటయేమంచిదని తలంచెను. ఏమన, బుద్ధి కలుగకపోవుటచేఁ దల్లడిల్లి పాటుపడుచుఁ బరితాపము నొందుచు నామెను మిక్కిలి యనురాగముతోఁ జూచుచుండును. అందుచే నపరాధమైనభృత్యునియందు రాజు దయ లేకుండుట భృత్యుని కెంత హితమో యపరాధియైన తనకు బుద్ధ్యనుగ్రహము కలుగకుండుట యంతమంచి దని తలంచె నిరతిశయసుఖము కలిగించుబుద్ధి గల్గిన సుఖి నౌదు నని యెంచెను. మఱియు జీవుఁడు ప్రారంభదశయం దున్నబుద్ధి నిర్మలముగానుండక పోవుటచేత, దానిని ప్రియుఁడు తిరస్కరించుటచే దుఃఖించులలనవలె నున్న దనిభావించి తాను నహంమమాభిమానమును విడిచి బుద్ధిని గొంచెము ప్రసన్నముఁ గావించుకొని యిఁకమీఁద బుద్ధియు క్షుద్రమై యే కార్యముల నెఱవేర్పఁ గొందు నని నిశ్చయించెను.

లచే నలంకృతమై, యున్నతనాసికచే నొప్పుచు, మృదువచనము లాడుచు నున్న నీముఖమును నాకుఁ జూపుము. ఓవీరపత్నీ! నీ కపరాధము కావించినపురుషుఁడు బ్రాహ్మణుఁడు కాని భగవద్భక్తుఁడు కాని కానిచోఁ దప్పక హానినందించెదను. నీప్రియుండనగునేను జీవించి యుండఁగా ముల్లోకములయంతర్భాగమందును బహిర్భాగమందును భయము లేకుండ వర్తించుపురుషుఁడుండునట్లు నేఁ దలంచను. ఓసుందరీ! నీమొగ మిదివఱకెప్పుడును దిలకరహితమై యుండలేదు. ఇప్పుడు నీమొగము మలినమై, హర్షరహితమై, కోపావేశముచే భయంకరమై, కావున నే ప్రకాశింపక, ప్రేమరహితమై, యున్నట్లు తోఁచుచున్నది. మఱియు నీస్తనములు శోకబాష్పములచేఁ దడిసి కాంతి దక్కియున్నవి. అట్లె బింబసమమగు నీయధరము రాగశూన్యమై కానవచ్చుచున్నది. ఇట్లుండుటకుఁ గారణ మేమి? నీయానతి లేక వేఁటకుఁ బోయితిని. ఆనాయపరాధము సహించి ప్రసన్నురాలవు కమ్ము. మదనపీడితుఁడనై ధైర్యము పోఁగొట్టుకొని నీకు వశంగతుఁడనైన నన్ను దయఁజూచి రక్షింపుము. నీసేవ చేసెదను. నీయానతిచొప్పున నే వర్తింతును. ఇరువదియాఱవయధ్యాయము.

---

*అని యిట్లు ప్రార్థించుచున్న భర్తను గాంచి పురంజనుని భార్య

---

* జీవుని లోకరాజును గాను బుద్ధిని బట్టమహిషినిగాను నేర్పఱిచి భార్యను విడిచి వేఁటకుఁ బోవుటచే నామె ప్రణయకోపమును వహించుటయును భర్తచే నోదార్పఁబడి శాంతిఁ బొందినట్లును జీవుఁడు బుద్ధిని విడిచి రాజసకర్మములంజొచ్చుటయు నటుచే బుద్ధి గానరానందున మిగుల విచారించి యొకయింద్రియవృత్తిచే మగుడ సాత్త్వికబుద్ధినిబొంది దానిని దన కభిముఖిని

మెల్లగాఁ దనవిలాసములచేఁ దనవశము గావించుకొని, యతని సంతసింపఁజేయుచుఁ దానును సంతసించెను. అంతఁ బురంజనుండు మంగళస్నాత నై, శుభ్రవస్త్రమును దాల్చి, మంగళములయిన చందనకుంకుమాదులను ధరించి, తనివి దీర భుజించి తన సమీపమునకు వచ్చిన ప్రియురాలిని గాంచి మిక్కిలి సంతసించెను. *అనంతర మతఁడు ప్రియురాలిచేఁ గౌఁగిలింపఁబడి తానును బ్రియురాలికంఠమును దృఢముగఁ గౌఁగిలించుకొని యేకాంతమం దన్యోన్యము రహస్యవాక్యములచే వివేక మాకర్షింపఁబడఁగా బ్రమదాసహితుఁ డయి యిది రాత్రి యనియు, నిది పవలనియుఁ గాలవేగము తెలిసికొనలేకపోయెను. మఱియు నతఁడ మూల్య మయినతల్పమందు శయనించి ప్రియురాలిభుజమును తలగడగాఁ గొని విషయసుఖముల ననుభవించుచు, నజ్ఞానతిర

గాను బ్రసన్నురాలనుగాను జేసికొనెనని వెనుకటియధ్యాయమున వర్ణింపఁబడియె. ఇప్పుడు మహారాజు పట్టమహిషితోఁ గూడి క్రీడించునట్లు జీవుఁడు బుద్ధితోఁ గూడి విహరించుట నీయధ్యాయమున వర్ణింపఁబడును జీవుఁడు, రుచిరాంబరాదులచే సుందరతర మయినపట్టమహిషిని దన కనుకూలనుగాఁ జేసికొన్నమహారాజువలెనే రాజసబుద్ధిని ననుకూలనుగాఁ జేసికొనెను.

*మఱియు రాజుభార్యను గౌఁగిలించుకొనునట్లు జీవుఁడుబుద్ధితో దృఢసంబంధము కలవాఁడాయెను. రాజు గుహ్యభాషణములచే నాకర్షింపబడినట్లు జీవుఁడు శబ్దాదివిషయచింతనములచే నాకర్షింపఁబడెను. రాజు భార్యనుగూడి మహాతల్పమందు శయనించినట్లు జీవుఁడు బుద్ధిని గూడి హృదయస్థానమున శయనించెను. రాజు భార్యబాహువు తలగడగాఁ జేసికొని శయనించిపారవశ్యముఁ జెందినట్లు జీవుఁడు బుద్ధిపారవశ్యమును చెందును. రాజుతనభార్యవలనఁగలిగినసుఖములే పురుషార్థము లని భావించునట్లు జీవుఁడు బుద్ధివలనఁ గలిగినవిషయసుఖములే పురుషార్థము లని భావించుచుండెను.

సక్తుఁడయి, తనభార్య పురుషార్థ మని భావించెను. కానితన స్వరూపమును గాని పరమాత్మస్వరూపమును గాని తెలిసికో లేకపోయెను. ఓరాజా! ఆపురంజనుండు కామాదులచే మలిన మయినచిత్తము గలిగి భార్యతోఁ గ్రీడించునప్పు డతనియౌవన కాల మంతయు క్షణకాలమువలె నతిక్రమించెను. * ఇట్లతనికి నేఁబదివత్సరంబులు చనునప్పటి కతని కాభార్యయందుఁ బదు నొకొండువందలపుత్త్రులు కలిగిరి. మఱియు నాపురంజనుఁడు దలిదండ్రులకును సోదరులకును యశంబు గలిగించువారును, సత్ప్రవర్తనముచేతను నౌదార్యముచేతను, సద్గుణములచేతను, భాసితులయినవారును నగునూటపదిమందికుమారికలను బడసెను. అనంతర మాతఁడు పితృవంశవర్ధను లయినకుమారులకు హితాహితముల నుపదేశించుభార్యలను, గుమారికలకు విషయసుఖములు గలిగింపఁ జాలుభర్తలను గొనివచ్చి పెండ్లికావించెను. ఆపురంజనునిపుత్త్రులలో నొక్కొక్కని కొక్కొక్కనూఱుగురు కొమరులు గలిగిరి. † వారిచేత నాతనివంశము పాంచాలదేశమం

---

* "రాజుపుత్త్రిలనుబడసినట్లు జీవుఁడుబుద్ధివలన నింద్రియపరిణామరూపములను బొందెను ఆరాజు కూఁతులను పడసినట్లు జీవుఁ డింద్రియపరిణామానంతరమందుఁ గలుగుబుద్ధివృత్తులఁ బడసెను. రాజు తలిదండ్రులయందును సోదరులందును బ్రేమను గలకుమారికలను బడసినట్లు జీవబుద్ధులందును నింద్రియపరిణామములందును బ్రేమను గలవృత్తులను బడసెనని తెలియఁదగినది. రాజు పాంచాలదేశమందుఁ దనవంశము వర్ధిల్లునట్లు జీవుఁడు తనవంశము వర్ధిల్లుటకయి యింద్రియపరిణామములకును నింద్రియవృత్తులకును దగిన దాంపత్యము సమకూర్చెను.

† రాజు పుత్త్రాదులతోఁ గూడి తనవంశమును వర్ధించినట్లు జీవుఁ డింద్రియపరిణామములతోను, బుద్ధివృత్తులతోను గూడి సంసారమును వర్ధింపఁజే

దుమిక్కిలి యభివృద్ధి చెందెను. ఆతనిపుత్త్రులు గృహాకోశముల ననుసరించి జీవించుచుండఁగాఁ బురంజనుండు మమకారాసక్తుఁడై ప్రవర్తించుచు లోకమునుశరీరమును మఱచి వర్తించుచుండెను. మఱియు నతఁడు నానావిధవిషయసుఖముల నభిలషించుచుఁ బశువులను జంపుటచే హింసాగర్భములై, కావుననే భయంకరము లయియున్న యాగములచేఁ బితృదేవతలను, దేవతలను,నీపలెనే యారాధించెను. ఇట్లతఁడు ఫలము నభిలషించి తత్సాధనము లగుకర్మములందుఁ బ్రసక్తుండై మఱియుఁ గుటుంబపోషణాకులుం డాసక్తచిత్తుఁడై యుండఁ బురంజనునకుఁ బ్రియురాండ్రకు నప్రియ మయినజరాసమయము సంప్రాప్తమాయెను. ఓరాజా! ఆశుగమనము గలిగి సంవత్సరరూపుఁడై ప్రఖ్యాతిని చెందినగంధర్వాధిపతిగలఁడు. ఆమహాబలునికడ నసాత్త్వికు లయిన సేవకులు మున్నూటయఱువండ్రు గలరు. వారుసగోష్ఠము దాయుర్దాయరూప మయినధనము నపహరింతురు. ఈట్లు చండవేగుఁ డయినయాసంవత్సరుఁ డనుగంధర్వపతికి, రాత్రిరూప లయినగంధర్వస్త్రీలును గలరు. వారు సకలసాధనములచే నిర్మితమగుపురము నపహరింతురు. *కావునఁ జండవేగుఁ డయినగంధ

యును. పురంజనునిపుత్త్రిలు గృహాకోశాదులననుసరించియుండఁగాఁ దాను మమకారాసక్తుఁడై సర్వమును మఱచియున్నట్లుశరీరమును. నహంకారమమకారములును, నింద్రియప్రాణాదులును, ననుసరించియుండఁగా దాను మమకారముతో స్వస్వరూపమును బరమాత్మస్వరూపమును మఱచియుండెను. రాజు సుఖాపేక్షచే యాగాదుల నొనరించినట్లు జీవుఁడు శబ్దాదివిషయముల నపేక్షించి యింద్రియవ్యాపారములనారంభించును. రాజు యాగాదులచే దేవతలను సంతృప్తులఁజేసినట్లుజీవుఁ డింద్రియాధిష్ఠాన దేవతలసంతృప్తిగోలుపును.

* శత్రువులు పురంజనునిపురమును నిర్బంధించినవిధమున కాలముజీవునికిఁ

ర్వపతియనుచరులువచ్చి పురంజనునిపురము నపహరించునప్పుడు ప్రజాగరుఁ డనువాఁడు వారి నాటంకపఱిచెను *ప్రజాగరుఁ డను పురంజనుని పురాధ్యక్షుండొక్కరుఁడే యిరువదియేడుశరంబుల వింట సంధించి నూఱువత్సరంబులు గంధర్వులతోఁ బోరాటము సలిపెను ఇట్లు ప్రజాగరుఁడు పలువురతోఁ బోరాడుటచేఁ దన

ప్రజాగరుఁడు గంధర్వులతోఁ బోరాడుట.

సామర్థ్య మంతయు నశింప నతఁడు పురజనులతోను బాంధవుల తోను గూడికొని పురరక్షణచేయుట దుర్లభమగునేమో యని మిగులఁ జింతింప నారంభించె. కాని పురంజనుఁ డందుండినను జాగరూకుండు గాక పాంచాలదేశములందుఁ దన సేవకులచే సంపాదితము లగు నవమధురపదార్థము లనుభవించుచు స్త్రీలోలుఁ

బురమునంటి దగుశరీరము నిర్బంధించును. పురాధ్యక్షుఁడు మేల్కని శత్రువుల నివారించినట్లు సర్వకాలములందు మేల్కనియుండుప్రాణము కాలవికారమును నివారించుచుండును.

*పురాధ్యక్షుఁడు సప్తవింశతిబాణములచే శత్రువులనిరోధించినట్లు ప్రాణము, పృథివి, నీరు, తేజస్సు, వాయువు, గగనము, గంధము, రసము, రూపము, స్పర్శము, శబ్దము, త్వక్కు, చక్షుస్సు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము, పాణి, పాదము, పాయువు, ఉపస్థ, వాక్కు, అపానము, వ్యానము, ఉదానము, సమానము, మనస్సు, బుద్ధి, అహంకారము, అనునిరువదియేడుబాణములను ప్రయోగించి నివారించెను. పురాధ్యక్షుఁడు సామర్థ్య మున్నంతకాలము శత్రువులతోఁ బోరాడినట్లు ప్రాణము ప్రారబ్ధావసానము గలుగునంతవఱకు కాలముతో యుద్ధము చేసెననుట. పురాధ్యక్షుఁడు తనబలము నశించినపిమ్మట పురము నెట్లు రక్షింతునని చింతించునట్లు ప్రాణము స్వసామర్థ్యము నశించినతోడనే శరీరము నెట్లు ప్రాణవంతముగాఁ జేయుదునని విచారము నొందుననుట. పురంజనుఁడు స్వసేవకులు దెచ్చియిచ్చినపదార్థములు దినిస్త్రీవశుఁడయితనపుర

డయి, యాశత్రుభయము నెఱుంగలేకపోయెను. *ఓప్రాచీనబర్హి నరేంద్రా! కాలమునకు జర యనునొకపుత్త్రిక కలదు. ఆమె ద్రిమ్మరుచుండును. ఆజరను వరించుటకు నే పురుషుఁడును నిష్టపడలేదు. సౌందర్యరహితురా లయినయాజరా కన్యక లోకమునఁ గురూపిణి యని ప్రఖ్యాతిఁ గాంచి యట్లయి నను యయాతిపుత్త్రుఁ డయినపూరురాజుచే వరింపఁబడి మిగుల సంతుష్టురాలయి, యారాజర్షి కి సింహాసనము వచ్చునట్లు చేసినది. మఱియు నాజరాజన్యక యొకప్పుడు భూలోకమున సంచరించు చు బ్రహ్మలోకమునుండి భూమి కవతరించుచు నన్నుఁ గాంచి నైష్ఠికుఁడనని తెలిసికొనియుఁ గామమోహితయై నన్ను వరించె. ఓరాజా! నే నాకన్యను వరింపక ప్రతిషేధించితిని. అందువలన నామె మిగులఁ గ్రుద్ధురాలయి "ఓమునీంద్రా! నీవు నాకోరికను నిరాకరించితివి కావున నిఁకమీఁద నీ వొకస్థానమందుఁ జిరకాల

రము శత్రుసమాక్రాంతమైనదనియుఁ దనకు భయము ప్రాప్తమయిన దని యుఁ దెలియలేనిచందమున జీవుఁ డింద్రియములు పొందించుశబ్దాదిసుఖముల ననుభవించుచు బుద్ధికి వశీకృతుఁ డయి కాలము శరీరము నావరించినదని యుఁ దనకు మృత్యుభయము సంప్రాప్తమయిన దనియు నెఱుంగకపోవు ననుట.

* ఇట నారదుఁడు జరావస్థను నొకకన్యకఁగా నిరూపించి యాకన్యక భర్తకై తిరుగుచు నొకప్పుడు పూరుని వరించి రాజ్య మిప్పించెననియు, దన్నుఁ జూచి వరించినను దా నిష్టపడలేదనియు, నైష్ఠికులను ముదుసలితన మేమియుఁ జేయలే దనియుఁ జెప్పెను. మఱియు నీ జరాకన్యాచరిత్రముచే ముదుసలితనము వచ్చినతోడనే యాధివ్యాధులు సంభవించు ననియు వెను వెంటనే మరణము వచ్చుననియుఁ దెలుపుచున్నాఁడు. అట్టిజరాకన్యక పురంజనుని వరించిన దని చెప్పఁబోవుచున్నాఁడు.

ముండక తిరుగుచుందువుకాక" యని నాకు దురంతమయినశాప
ము నొసంగెను. పిమ్మట నాకన్యక నాయుపదేశమును విని మ
నోవ్యథలకు, వ్యాధులకుఁ బ్రభునయినభయుఁ డనువానిని సమీ
పించి, "ఓవీరా! నీవు సమస్తాధివ్యాధులకును బ్రభువవు. నీయం
దుంచినభూతములసంకల్ప మెప్పుడునునశింపదు అట్టిఘనుఁడ వగు
నిన్నుఁ బ్రియునిఁగా వరించుచున్నాను. మఱియు లోకమునుండి
యు,వేదమునుండియు నీయఁదగినదై కాని ప్రతిగ్రహింపఁదగినదై
కాని యున్నవస్తువును యాచించువారి కీయనివాఁడునుఁ దాను
వరింపనివాఁడును, వ్యర్థాభిమాను లయి వర్తించువారి నిరు
పురనుగుఱించి యజ్ఞులై సత్పురుషులు మిక్కిలి దుఃఖింతు
రు. కావున నీవు నన్ను స్వీకరింతువని వచ్చినదానను. ప్రతి
గ్రహింపఁదగిననన్ను విడనాడుట యెంతమాత్రమును దగ
దు. నిన్ను విడనాడుట నాకును నెంతమాత్రమును ద
గదు. ఓమహానీయా ! నిన్ను భజించుచున్ననామీఁద దయ
యుంచుము. ఆర్తులను దయఁజూచుటకంటె నధికధర్మము పు
రుషుఁ డాచరింపవలసినది కలదా?" అని యిట్లు కాలకన్యక ప
లికినవాక్యములు విని భయుఁడు ప్రాణులకు మరణమును జేయఁ
దలంచినవాఁ డయి చిఱునవ్వు నవ్వుచు నిట్లనియె. ఓసుందరీ !
నేను జిత్తమును నిలుకడఁ జేసికొని యనేకవిధముల విచారించి
నీకు లోకరూపభర్తను నిశ్చయించితిని. లోకము నిన్ను గురూ
పిణిగాను దుష్టుగాలినిగాను దలంపక నీవు యాచింతివేని తప్పక
నిన్ను వరించును. నాకాధివ్యాధిప్రభృతు లగుపెక్కురుసైనికులు
గలరు. వారితోఁ గూడి నీవు పోయి లోకములు వశంబుగావిం
చుకొని స్వేచ్ఛగాఁ గ్రీడింపుము. మఱియు నాకు వైష్ణవజ్వరుఁ

డను నొకసోదరుఁడు కలఁడు. ఇతఁడు నిన్ను లోకభర్తతో సమకూర్చును. ఇంతియ కాక నీవు నాకు సోదరివి. నీతోడను, నా సోదరునితోడను, గూడి మహాసేనాసమేతుండనై యొరులకుఁ దెలియఁబడకుండ నే నేలోకమందుఁ జరింతును. ఇది యిరువది యారవయధ్యాయము.

---

* ఓ రాజేంద్రా! భయనాముఁ డిట్లు పలికి మరణకారులయిన సైనికులును, ప్రజ్వారకాలకన్యకలును దన్ను వెంబడించి వచ్చుచుండ నీభూతలమందు సంచరించుచుండెను. ఇట్లు సంచరిం

---

*వెనుకటియధ్యాయమున నారదుండు భయనాముఁడు మృత్యుకారులగు నాధివ్యాధిముఖ్యసైనికులతోఁగూడ భూతలమందుఁ జరించునట్లు చెప్పియిప్పుడు పురంజనుని పురమును ముట్టడించిరని చెప్పు వ్యాజమున జీవునకుఁ బురమువంటిదగు శరీరమును గాలము గ్రసించినట్లు చెప్పుచున్నాఁడు. శత్రురాజు తన సైనికులతో వచ్చి సకలవస్తుసంపూర్ణమయిన పురంబును జుట్టుముట్టినట్లు, భయనాముఁడు ప్రజ్వారకాలకన్యకాసైనికులతో వచ్చి శబ్దాదివిషయభోగములతో నిండి జీర్ణప్రాణముచే రక్షింపఁబడుచు నుండిన జీవుని పురమగు శరీరము నావరించెను. అప్పుడు జరాకన్యక శరీరము శిథిలము గావించెను. పురము శిథిలమైనప్పుడు శత్రువులు ద్వారములనుండి పురంబును విచ్చలవిడిగాఁ జొచ్చునట్లు భయనాముని భటులగు నాధివ్యాధులు నేత్రాదిద్వారములనుండి లోపలఁ బ్రవేశించి మిగులఁ బీడింపనారంభించినవి. తనపురము శత్రుస్వాధీనత మగునప్పుడు చింతించెడి రాజువలె నీ జీవుఁడు జరాదిగ్రస్తమయిన తన శరీరమునుగూర్చి మిగులఁ జింతించెను. రాజు మమాభిమానము గలిగి కుటుంబమును రక్షింపఁ బూనినట్లు శరీరాభిమానియగు జీవుండు బుద్ధీంద్రియాదిరూపమయిన కుటుంబమును రక్షింపఁ బాటుపడును. భార్యాశ్లిష్టుఁడయిన రాజు వివేకముఁ దొలఁగించుకొని శత్రుహత మగునైశ్వర్యమును నిలుపుకోలేనట్లు జీవుఁడు విషయాసక్తుఁడై బుద్ధి యనుభార్యతోఁ

చుచు భయనాముఁడు మహాపన్నగముచే రక్షింపఁబడుచు సమస్తసంపదలచే నొప్పుచు నున్నపురంజనపురంబును బలాత్కారముగా నరికట్టెను. తనసంబంధము కలిగినంతమాత్రముననే యెట్టిపురుషుల నైన నిస్సారులనుగాఁ జేయఁజాలునాజరాకన్యక పురంజనునిపురమును బలాత్కారముగా మ్రింగెను. ఇట్లు కాలకన్యకచే మ్రింగఁబడి శిథిలమైనయాపురమును సైనికులు ద్వారములనుండి ప్రవేశించి మిక్కిలి బాధించుచుండిరి. ఇట్లు శత్రుసైనికులచే నిరంతరమును బీడింపఁబడుచుండి "నీపురము నాది" యనునభిమానముతో నున్నపురంజనుఁడు తనకుటుంబమువిషయమయి మిక్కిలి తొట్రుపాటుపడుచు బహువిధము లయినతాపముల నొందసాగెను. మఱియు భార్యచేఁ గౌఁగిలింపఁబడి యున్నపురంజనుఁడు కేవలము చిత్తమును భోగములందుఁ జొనిపి కావుననే దీనుఁడై వివేకమును గోల్పోయి, భోగములను నశింపఁజేసికొని శత్రువులు బలాత్కారముగా హరించుచుండ దానికేమియుఁ బ్రతిక్రియ చేయఁజాలకపోయెను. *అప్పుడు పురంజ

గూడ సర్వమును మఱచి వివేకహీనుఁడయి యాధివ్యాధులచేఁ బొలఁగింపఁబడుచున్నశక్తిని నిలుపుకోలేకపోయెను.

* అప్పుడు జీవుఁడు తనశరీరము శిథిల మగుటయును, ప్రాణములు తిరస్కారభావముతో వర్తించుటయును, నింద్రియపరిణామరూపములును, బుణ్యపాపరూపకర్మములును, వాని ననుసరించు నింద్రియములును, నింద్రియాధిష్ఠానదేవతలును, దనపై ననురాగమును విడిచినబుద్ధియుఁ దనకు స్వాధీనులయి వర్తింపకుండుటయు, శరీరము జరాకన్యకచే మ్రింగఁబడి యుండుటయు, విఘ్నాదులచే విషయములన్నియు నశించుటయుఁ, జూచి, మిగుల విచారించుచు, శరీరాదులను శిథిలత్వావస్థనుండి తప్పింపఁదగినయుపాయ మాలోచింపలేకపోయెను. అంతటఁ దనసోదరుఁ డయినభయనా

నుఁడు తనపురము శత్రువులచే శిథిల మగుటయుఁ బుత్త్రపౌత్త్రా
దులు ప్రతికూలురయి, తన్నుఁ దిరస్కరించుటయును, భృత్యా
మంత్రులు పురరక్షణమందు విముఖు లయియుండుటయును,
దనభార్య స్నేహమును విడిచి వర్తించుచుండుటయును దానును

మునకు హితము చేయనెంచి జీవునిశరీరమును నధిష్ఠించి వైష్ణవజ్వరముమిగులఁ దపింపఁజేయును. శత్రువులు పురంజనునిపురమునుదహించినట్లు వైష్ణవజ్వరము ప్రవేశించి శరీరమును దహించెను. పురంజనుండు శత్రుదగ్ధ మయినపురమందుండి స్వపుత్త్రికళత్రామాత్యవర్గంబుతోఁ దాపము చెందినట్లు వైష్ణవజ్వరపీడిత మయినశరీరమందు జీవుఁడు బుద్ధితోడను, నింద్రియములతోడనునింద్రియపరిణామములతోను, మిగులఁ దాపమును జెందును. కాలగ్రస్త మై శత్రుదగ్ధమైనపురంబులోఁబడపురాధ్యక్షుఁడు దహింపఁబడినట్లు వైష్ణవజ్వరము చే శరీరముసంతప్తమయినతోడనే సర్వకాలములందుజాగరూకతతో వర్తించు ప్రాణము సంతప్తమగును. శత్రుదగ్ధపురమునుండి భయపడి పురంజనుండు వెడలిపోయినట్లు జీవుఁడు వైష్ణవజ్వరసంతప్తమయినశరీరమం దుండఁజాలక దానిని విడిచిపోవనిశ్చయించును. సామర్థ్యము లేనిపురంజనుఁడు శత్రువులచే నిరోధింపఁబడి రోదనము చేసినట్లు జీవుఁ డాధివ్యాధు లైనరోగములు, మార్గమును నిరోధింపఁగాఁ, బైకిఁ బోఁజాలక లోపల ఘుర్ఘురధ్వని చేయుచుండును. అంతట పురంజనుఁడు సర్వకాలములందును దన్ననుసరించుభార్యను విడిచియుండలేనట్టు జీవుఁడు సర్వకాలసర్వావస్థలందును దనకుఁ దోడ్పడు బుద్ధిని విడిచిపోవ నిష్టపడకుండెను. మఱియు జీవుఁడుపరలోకమున కేఁగునపుడు బుద్ధీంద్రియాదులు కలిసిపోవుటను తెలియుఁదగినది. ఇందులకుఁ బ్రమాణము, శ్లో॥ మనష్షష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థానికర్షతి। శరీరంయదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః। గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్॥ అనుటచే జీవునితో బుద్ధ్యాదులును గలిసిపోవుట స్పష్టమగుచున్నది.

ముదుసలివాఁ డగుటయును, దన దేశము శత్రువులచే దూషిత మయియుండుటయును గాంచి యపారచింతను బొంది తనయపాయమును దొలఁగించుకొనఁ జాలు ప్రతిక్రియ నాలోచింప లేకపోయెను. అట్లయ్యును బురంజనుండు కాలకన్యకచే నిస్సారములయినను గామముల ననుభవింపఁ దలపోయుచు, దీనుఁ డై యూర్ధ్వలోకములను సాధింప నేమియుఁ బాటుపడక పుత్త్రాదులందు స్నేహమును విడచి భార్యాదులను లాలనచేయుచు, గంధర్వులచేతను, మ్లేచ్ఛులచేతను ధ్వంసముచేయఁబడి, కాలకన్యకచే మర్దింపఁబడినపురమును విడువఁదలంచి యుండెను. ఆసమయమున శత్రురాజుసోదరుఁ డయిన ప్రజ్వారుఁడు లేచి పురంజనపురంబు నధిష్ఠించి, తనసోదరునకుఁ బ్రియముచేయ నెంచి యాపురంబునంతను దగ్ధము గావించెను. ఇట్లు ప్రజ్వారుఁడు పురమును దహించుచుండి భార్యలతోను, సేవకులతోను, మంత్రులతోను, బుత్రాదులతోను, మిక్కిలి సంతాపమును జెందెను. ఇట్లు కాలకన్య గ్రసించుటచేతను, యవనులు కోట బురుజుల నాక్రమించుకొనుటచేతను, బ్రజ్వారుఁడు పురంబును దాహముచేయుటచేతను, పురపాలకుఁ డయిన ప్రజాగరుఁడు పురముతోఁ దగ్ధుఁ డయ్యెను. అంత పురంజనుండు మిగులదుఃఖము కలవాఁడై భయకంపముల నొందుచు, నాపురంబున నుండ సమర్థుండు కాక యగ్నివేష్టిత మయినవృక్షకోటరమునుండి బయలువెడలిన పన్నగంబుచందంబున నాపురంబును విడిచిపోవ నిశ్చయించెను. ఓరాజా ! పురంజనుఁడు గంధర్వులచే శిథిలావయవుఁడై తనసామర్థ్యమును గోల్పోయినప్పుడు శత్రువులచే నిరోధింపఁబడినవాఁ డగుటచే మిగుల రోదనము చేయఁదొడఁగె.

అనంతరము పురంజనుండు దుహితలను, బుత్త్రపౌత్త్రులను, గోడండ్రను, దనభృత్యులను, ననుభవింపఁగా మిగిలినగృహాది వస్తుజాతమును స్మరించుకొనుచు,నహంకారమమకారములతో వర్తించుచు భార్యయందు సక్తమయిన మనస్సు గలవాఁడై భార్యావియోగమునకుఁ దాళఁజాలక భార్యతోఁ గూడి పోదునా? లేక భార్యను విడిచిపోదునా? యని ఇట్లు చింతింపనారం

—:పురంజనుఁడు పరలోకమున కేఁగుచు భార్యాదులనుగూర్చి చింతించుట:—

భించెను అకటా! నేను బరలోకమున కేఁగినచో నీమె బాలకులనుగుఱించి యేమనుచు దుఃఖించుచు నేరీతి వర్తింపఁగలదు? అయ్యారే! ఆసుందరి కెంత పాతివ్రత్యము కలది! నేను భుజింపకుండ నొకనాఁడైన నామె భుజించి యెఱుఁగదు. నాయందత్యంత ప్రేమముగలదయి నేను స్నానము చేయనిచో స్నానము చేయదు. నేనొకవేళఁ గ్రుద్ధుండనై యున్నయెడఁ జూచి మిగుల భయపడుచుండును. నేను నిందించుచున్నను మౌనమవలంబించియే యుండును గాని నోరెత్తి మాటాడలేదు. నే నవివేకినై యున్నపుడామె నాకు హితబోధ చేయుచుండును. ఇట్లు నన్నన్నివిధములచేతను ననువర్తించు కాంతామణి, నేను బరమున కేఁగి నప్పుడు దుఃఖపీడితయై గృహస్థధర్మముల నెందుల కవలంబించును? ఆమె పుత్త్రవతియైనను నాయెడఁబాటు నోర్వలేక తప్పక మృతి నొందును నేను సంపాదించినసమ్మట నాకుమారికలును కొమరులును, నిరాధారులయి మహాసముద్రములోఁ బగిలిన నావయందున్న పురుషులవలె నెట్లు వర్తింపఁగలరు?' ఇట్లు పురంజనుఁడు శోకానల్పుఁడయినను దీనబుద్ధితో శోకము నందుచుండఁగా నతనినిఁ బురంబునుండి వెడల్ప నెంచి భయనామకుఁ

డగుమృత్యువు వచ్చెను. అనంతరము భయనాముఁడు తనసహాచరులతోఁ గూడి యతనిని బశువునువలెను బంధించి స్వస్థానమును గూర్చి కొనిపోవుచుండ నతనిభృత్యామాత్యవర్గము మిక్కిలి దుఃఖమొందుచు యవనులచేఁ బీడితులయ్యు ననుసరించి పోవుచుండిరి. ఇట్లు యవనులచే నరికట్టఁబడి యతఁడు దేహము నుండి, దగ్ధమగుచున్న చెట్టుతొఱ్ఱను విడిచి పర్వెత్తుభుజంగము వలెఁ బోవుచున్నప్పుడు, తదనుబంధు లయినభార్యాపుత్త్రాదు లందఱును నశించిరి. పురంబుగూడ నాశనంబుచెందినది. బలవంతుఁడయినయవనుఁడు బలాత్కారముగా నప్పురము నుండి తప్పించికొని పోవుచున్నప్పుడు పురంజనుఁడు వివేకమును విడుచుటచేఁదా నపరాధయైనను దనయందుఁ బ్రేమ చూపుపరమమిత్త్రుని స్మరించుకొనలేఁ బోయెను. ఓరాజా ! ఈపురంజనుఁడు పూర్వము తాను దయలేక యాగములంఁ జంపినపశువులు తమ కతఁడు చేసిన ద్రోహమును దలఁచుకొని మిగులఁగోప మూని గొడ్డండ్లతో సమము లయినశృంగములతోఁ బొడిచి ఛేదించెను. *పిమ్మట నతఁడు హద్దు లేనిచీఁకటి గలనరకమునందు నివసించి తెలివి లేక వెక్కెడ్లు దుఃఖ మనుభవించి, స్త్రీసంపర్కముచేఁ జిత్త

---

* నారదుఁడిట్లు పురంజనుఁడు రజస్తమఃప్రచుర మయినబుద్ధికివశుఁడగుటయు దేహమందును, దేహానుబంధులందును, నహంకారమమకారములుగలిగియుండుటయు జరామరణాదు లనుభవించుటయుఁ జెప్పి దేహావసానమందుఁ దనభార్యను స్మరించుకొనుచుఁ బ్రాణమువిడిచినవాఁడు కానస్త్రీజన్మ మొందుటయు, నందులో స్వకీయపుణ్యవిశేషమువలనఁ బవిత్రకులమందుఁ బుట్టుటయును, మహాభాగవతోత్తముఁ డయినభర్తను బొంది తత్సేవచేసి భగవంతుని ప్రసాదంబును సంపాదించుకొనుటయును జెప్పుచున్నాఁడు.

ము కలంకము నొందుచు నంతకాలముఁ దనభార్యను సంస్మ రించుకొనుచు మృతినొందినవాఁడు కానఁ దరువాతిజన్మమున రాజసింహుఁ డయినవిదర్భునిగృహంబున స్త్రీయై జన్మించెను.

పురంజనుఁడు స్త్రీయై జన్మించుట

ఇట్లు జన్మించినకన్యక తండ్రిగృహమున వర్ధిల్లుచుఁ బరమభాగవతునిఁ దక్క వేఱొక్కని వరింప నని యామె శపథము చేసెను. ఆకాలమున మలయపర్వత ప్రాంతదేశమందు సుప్రసిద్ధుఁ డయినమలయధ్వజుఁ డనురాజు గలఁడు అతఁడు జ్ఞానముచే బ్రహ్మస్థానమును వశముగావించుకొనెను. అతఁడు నిశ్చయాత్మకయగుబుద్ధిగలవాఁడు. అతఁ డింద్రియజయరూప మగుయుద్ధమందు నింద్రియములను జయించెను. అతఁడావైదర్భిని బెండ్లియాడెను. ఇట్లు పెండ్లియాడి యామెయందుఁ [1] గాటుకపిట్టలవంటి నేత్రములు గలయొకకుమారికను బడసెను. [2]ఆమెకుఁ దరువాత నేడుగురుకుమారులను ద్రవిడభూమిని బాలింపఁదగినవారిని గనెను. ఓరాజా ! ఆయేడుగురుపుత్త్రులలో నొక్కొకనికిఁ బెక్కురు పుత్త్రు లుద్భవించిరి. వారిసంప్రదాయభేదములు గలవారిచేత నే

---

1. ఇందులకు మూలము "అసితేక్షణం" అనఁగా నల్లని నేత్రములు గలదని యొకయర్థము. అసిత=కృష్ణునియందు. ఈక్షణం=చూపుగలది, అని రెండవయర్థము. ఇట్లు చెప్పుటచే మలయధ్వజునకును, వైదర్భికిని కృష్ణసేవారూప మగురుచి యుద్భవించె నని తెలియఁదగినది.

2. వైదర్భీమలయధ్వజులకు నాకొమార్తెతరువాత నేడుగురుపుత్త్రులు గలిగిరి అని చెప్పుటచేఁ గృష్ణసేవారుచి యుదయించినతోడనే, శ్రవణము, కీర్తనము, విష్ణుధ్యానము, పాదసేవనము, పూజనము, వందనము, దాస్యము అనునవి గలిగిన వని తెలియఁదగినది.

మన్వంతర కాలమును, దదనంతరమును భూమి యనుభవిం
పఁబడుచున్నది. మఱియు మలయధ్వజునికుమారికను దృఢవ్రతు
రాలని తెలిసికొని *యగస్త్యుఁ డనువాఁడు పెండ్లియాడియామె
యందు దృఢవ్రతుఁడును, బుద్ధిమంతుఁడును నిధ్మవాహుఁ డను
పేరు గలవాఁడు నగుకుమారునిఁ గనెను. అనంతరము మలయ
ధ్వజుఁడు తనభూమండలమును గుమారులకుఁ బంచి యిచ్చి కృ
ష్ణునారాధింపఁ దలంపు గలిగి కులాచలమునకుఁ బోయెను. సం
సారమును రోసి పోవుచున్నభర్తను గాంచి వైదర్భి, భగవత్సే
వాహర్ష రూప మగుజ్ఞానము గలదయి సుఖముల నిచ్చుగృహము
లను, సౌఖ్యములను విడిచి, వెన్నెల చంద్రుని ననుసరించునట్లు
భర్తను ననుసరించి పోయెను. ఆకులపర్వతమందుఁ జంద్రవస
యను పేరు గలసుప్రసిద్ధనదియొడ్డున నాశ్రమము గావించుకొని
మలయధ్వజుఁడు దదీయపుణ్యజలములను స్నానపానముల నుప
యోగించి, బహిర్భాగమందును, నంతర్భాగమందును గలమల
మును దొలఁగించుకొనుచుఁ, గందమూలములచేతను, ఫలముల
చేతను, బుష్పములచేతను, తృణములచేతను, జలములచేతను,

మలయధ్వజుఁడు తపం బాచరించుట

దేహపోషణమును జేయుచుఁ దపం బొనరించుచుండెను. ఇట్లు
మలయధ్వజుఁడు సమదృష్టిగలవాఁ డయి శీతోష్ణములు, వాత
వర్షములు, క్షుత్పిపాసలు, ప్రియాప్రియములు, సుఖదుఃఖం

* ఈచెప్పుటచే నగస్త్యుఁ డనుముముక్షువు కృష్ణసేవారుచి యనుకన్యక
ను బెండ్లాడి శ్రవణోపయుక్తము లయినశమదమాదిరూపములుగలిగి యుపదే
శించినయర్థమును మననము చేయువాఁడును, నగుబ్రహ్మోపదేశాత్మకుఁడగు
మునిని గాంచె నని తెలియఁదగినది.

బులు మొదలగు ద్వంద్వములను, కర్మయోగముచేతను జ్ఞాన యోగముచేతను, బుణ్యాపుణ్యరూప మగుకర్మమును దొలం గించుకొని, యమనియమాదులచే నింద్రియములను, బ్రాణ మును, నంతఃకరణమును జయించి, తన్నుఁ బరమాత్మస్వరూ పముగలవానిఁగ ననుసంధానముచేసి వాసుదేవునందు ననురాగ రూప మగుభక్తిని నిలిపి నిశ్చలుఁడై శరీరాదులను మఱచి, స్తం భాకృతిని వహించి నూఱుదివ్యవత్సరంబులు తపం బాచరించెను. మఱియు నాతఁడు సాక్షాద్ద్రష్ట యగుపరమాత్మను జీవాత్మ యందు వ్యాపకత్వధర్మవైలక్షణ్యముచేఁ గాంచి దేహవృత్తాంత మును విద్వాంసుఁడు స్వప్నవృత్తాంతమునువలె నసత్యముని యెంచి యందుండి మఱలి కేవలపరమాత్మానుసంధానము చేసి కొని లోకగురువయినహరిచేత నుపదేశింపఁబడి యన్నివిధముల చేతను బ్రకాశించుచు నున్నస్వపరయాథాత్మ్యజ్ఞాన మనుదీప ముచే ధారకుఁ డయినపరబ్రహ్మమునందు జీవాత్మను, జీవాత్మ యందుఁ బరబ్రహ్మమును సాక్షాత్కారము చేసికొనుచుఁ బిమ్మట నుపాసనాత్మక జ్ఞానమును విడిచి విరమించెను. అనంతరము, వైదర్భి భగవదారాధనరూప మగునుత్కృష్టధర్మమందు నిష్ఠ గలిగినభర్తను బ్రేమించి పరిచర్యచేయుచుఁ బాతివ్రత్యముచే నతిశయించి, సకలభోగములరోసి నారచీరలను ధరించి,యుపవా సాదివ్రతములచే మిగులఁ గృశించి,శిరోజములను జటలుగాఁ గట్టి కొని తపంబున నించుమించుగా భర్తకెనవచ్చుచు, నంగారమై యున్న యగ్నియొద్ద వెలయునిర్ధూమజ్వాలవలెఁ బ్రకాశించెను. మఱియు వైదర్భి తనభర్త యట్లు మృతినొందినను మానస మును గట్టిచేసికొని భర్తవృత్తాంతమును దెలిసికొనక పూర్వము

వలెఁ బతిపాదములకుఁ బరిచర్య చేయుచు భర్తృపాదకమలము
లందు వెట్ట లభింపకపోవుటచే మృతినొందెనని నిశ్చయించి తన
మందనుండి వేఱయిన యాఁడులేడివలెనే, మిక్కిలి దుఃఖంబును

వైదర్భి సహగమనము చేయుట.

గాంచెను. మఱియు నావైదర్భి తనప్రియుఁడు నశించుటచే దీను
రాలయినతన్నుఁగూర్చి మిగుల విచారించుచు విహ్వలురాలై
కన్నీటిచే స్తనములను దడుపుచు నారహస్యప్రదేశమందు గొం
తెత్తి భర్తనుగూర్చి యిట్లు లేడ్వనారంభించెను. 'ఓరాజేంద్రా!
లెమ్ము. లెమ్ము. సముద్రముచేఁ జుట్టఁబడిన యీభూమిని జోరులనుం
డియు, దుష్టరాజులనుండియుఁ బరిపాలింపుము' అని యిట్లావి
జనమగునడవిలో భర్తపాదములపైఁ బడి విలపించుచుఁ గన్నీ
టిని విడుచుచుఁ, గట్టెలచే నొకచితి నేర్పఱిచి యాచితియందు
భర్తకళేబరము నుంచి దహనము చేయుచుఁ దాను సహగమ
నంబు చేయఁ దలంచి యుండఁగా సనాతనుఁడయినయీశ్వరుండు
బ్రాహ్మణవేషమును ధరించి యచ్చటికే తెంచి మధురములగు
సామవాక్యములచే నామెను లాలించుచు నిట్లనియె.
దరీ! నీ వేజాతిదానవు? నీ వెవరికి సంబంధించినదానవు? [2]అతఁ
డేజాతివాఁడు? అతనికై యేల దుఃఖించెదవు? [3]నీవు స్వస్వరూ

1 నిరుపాధికసఖుఁడయినపరమాత్మ భాగవతుఁడయిన మలయధ్వజుని
స్నేహము చేసి యుండుటచే మిక్కిలి సంతసించి యిట్లనుచున్నాఁడు.

2 అతనికి నీకు నేమియు సంబంధము లేకుండ నెందులకి ట్లేడ్చెదవు?
స్వస్వరూపమునే తెలియనిదానవు. నన్నెట్లు ఎఱుఁగుదువు?

3 నీవి కర్థాంతర మెట్లన! బ్రాహ్మణవేషధారియై పరమాత్మ యిట్లనుచు
న్నాఁడు. ఓయీ! నీవు సృష్ట్యాదియందు నీయనాదికర్మముల కనుగుణమయిన

పము మఱచితివి. సృష్ట్యాదియందు నీవు వికారమునొంది నీస్నే
హితు నెట్లు తెలిసికొనఁగలవు? ఓయీ! నను నీవు తెలిసికొనఁ
జాలకున్నావు. కావున నీవు నీస్నేహితుని మఱచినవాఁడ వగు
చున్నావు. నా కొకస్నేహితుఁ డుండెనని స్మరించుచున్నావా?
నీకు హితుండ నైన నన్ను విడిచి నీచము లయిన భోగముల నను

నాసంకల్పముచేఁ బరమాత్మ స్వారూప్యమును స్వస్వరూపమును మఱచి దేవ
మనుష్యాదివికారము నొందితివి. నీస్నేహితుఁడ నైననన్ను స్మరింపుము. నీ
కంతరాత్ముఁడ నైయున్న నన్ను విడిచి గ్రామ్యసుఖముల నపేక్షించి దేవమను
ష్యాది శరీరమును గోరుకొనుచు న న్నెడఁబాసితివి. అందుచే నీస్వపరయా
థాత్మ్యజ్ఞానము నశించినది. నీవును నేనును శరీర మనుగృహములో వర్తించు
నట్టిస్నేహితులము. అచ్చట మనమిరువురమును (అనఁగా జీవాత్మపరమాత్మ
లనుట) వికారరహితుల మయి యుంటిమి. అట్లు శరీర మనుగృహమునందు
హృదయస్థానమందు మనము పెక్కువత్సరంబులు గడపితిమి. ఇట్లుండ నీస్నే
హితుఁడను (అనఁగా నీ కంతరాత్మనై యుండి నీకు హిత మొనగూర్చువాఁ
డను) నగునన్ను విడిచి శబ్దాదివిషయములం దాసక్తి కలిగి ప్రకృతిమండల
ము నొంది యందులో నివాసస్థానమును గూర్చి వెదకుచుఁ బ్రకృతి సృజించిన
యొక్కస్థానమును (అనఁగా శరీరము ననుట) జూచితివి. ఆశరీర మనుపురము
పంచేంద్రియములకు విషయము లగువస్తువు లనుతోఁటలతోను, నేత్రములు కర్ణ
ములు నాసికారంధ్రములు మొదలగురంధ్రములనుతొమ్మిదిద్వారములతోను,
ప్రాణ మనుపురాధ్యక్షునితోడను, పృథివ్యప్తేజంబు లనుప్రాకారములతోను,
మనస్సుతోఁ గూడినయింద్రియపంచక మనెడివస్తుసమర్పకస్థలంబుతోను, బం
చభూతము లనునంగళ్లతోను, శక్తి యనెడి యధిపతితోను గూడియుండెను.
అట్టిశరీరమును బొంది బుద్ధితోఁ గూడికొని సకలవిషయసుఖము లనుభవించు
చుఁ గావున స్వాత్మజ్ఞానమును బరమాత్మజ్ఞానమును మఱచియా బుద్ధిసంబంధము
చే స్త్రీసంబంధము గలిగించుకొని తత్సంబంధముచే నీ స్త్రీజన్మమును బొందితివి.

భవింప నెంచి భోగస్థానమును గోరికొనుచు నన్ను నెడఁబాసితివి. అందుచే నీస్వపరయాథాత్మ్యజ్ఞానము నశించినది. ఓయార్యా! నీవును నేనును గలిసి పూర్వమందు మానససరోవరమున హంసలమై యుండి యెక్కుసంవత్సరముల కాలమును గడపితిమి. ఇట్లుండ నీవు గ్రామ్యసుఖములందు వేడుకపడి నీస్నేహితుఁడవైన నన్ను విడిచి యీభూమినిఁ బొందితగినవాసస్థలమును వెదకుచు స్త్రీనిర్మిత మయిన యొకపురమునుఁ జూచితివి. ఆపురమునకు నైదుద్యానవనములు కలవు. దానికిఁ దొమ్మిదిద్వారములు గలవు. దాని కొకపాలకుఁడు గలఁడు. దానికి మూఁడు ప్రాకారములు గలవు. ఆఱు దిష్టవస్తుదాయకము లగుస్థలము, నైదంగడివీధులును, నైదుగురుమంత్రులును గలరు. దానికి స్త్రీ యధిపురాలుగా నుండెను. ఆయుపవనము లైదు నయిదింద్రియంబులను నానందపఱుపఁజాలును. ఆనవద్వారములును బ్రజలరాకపోకలకుఁ దగియున్నవి ఆమూఁడుప్రాకారములును గ్రమముగా నగ్నిమయములును జలమయములును, బృథివీమయములును నై యున్నవి. పైని జెప్పిన యాఱుస్థలంబులందును నింద్రియములు గోరువస్తువులు సంప్రాప్త మగుచుండును. అచ్చటియంగళ్లు క్రియాశక్తితోఁ గూడి యుండును. అట్టిపురమును బ్రవేశించి బుద్ధి యను నాయకురాలి కధీనుండ వయి, నిన్నును నన్నును గూడ మఱచితివి. అచ్చట నీవు బుద్ధి యనుపేరు గల యాస్త్రీని భార్యనుగా వరించి విషయసుఖముల ననుభవించుచు నందువలన స్వపరయాథాత్మ్యజ్ఞానమును దొలఁగించుకొని యాస్త్రీసంబంధముచేఁ బాపీయ మయిన యాస్త్రీజన్మమును బొందితివి. * కావున నీవు విద

* ఈచెప్పుటచే స్త్రీపురుషాదిజన్మములు దేహమువలనఁ గలుగుచున్న వికాని

ర్భరాజకుమారికవు కావు. నీ కీమలయధ్వజుఁడు స్నేహితుఁడు కాఁడు. మఱియు నీవు బుద్ధి యనునామాంతరము గలపురంజనికి భర్తవు కావు నీవు పూర్వజన్మమునఁ బురుషుఁడ వని వ్యవహరింపఁబడుటకును, నీజన్మమందు స్త్రీయని వ్యవహరింపఁబడుటకును గారణము భగవన్మాయతప్ప వేఱుకారణము లేదు. నీవును నేనును మానససమందుండుహంసలము. అప్పటిస్వరూపమును జెప్పెదను వినుము. మన మిరువురమును దేహిశరీరము గలవారము. మన మిరువురము శరీరాత్మలవలె వర్తించువారము. అంతియ కాని నీవు వెఱవాఁడవు కావు. ఆలోచింప మనయిరువుర మన్యోన్య మెడఁబాటు చెందుటకుఁ గారణము పండితు లెవ్వరుఁ

యాత్మకు స్వయముగా లేవనియు దేహసంబంధముచేత నే విదర్భరాజసుతవైనట్టును నంతకుఁ బూర్వము పురంజనికి భర్తవయినట్టును దెలియవచ్చుచున్నది కాని యాదేహసంబంధము లేనిచో నీ కిట్లుగానరాదనియు, నీ కట్లు తోఁపఁజేయునది నామాయయే కాని వేఱు కాదనియును, మనమిరువురము (అనఁగా జీవాత్మపరమాత్మ లనుట) దోషాదిరహితుల మయి నీవు నాకుశరీరముగాను నేను నీకు శరీరిగాను వర్తించుచుంటిమి కాని వేఱువిధముగా వర్తింపలేదనియును మన మొకరినొకరు విడిచి వర్తించుమందు మని పండితు లెవ్వరును భావింప రనియు, జీవాత్మకుఁ బరమహితుఁ డయి వర్తించుపరమాత్మ జీవాత్మకు హితోపదేశము చేయుచుండె ననియు నెఱుంగునది. మఱియుఁ బురుషుఁ డద్దము మొదలగు పెద్దవస్తువులందును జతురాదు లగు చిన్నవస్తువులందును దన్నుఁ బెద్దవానిఁగాను జిన్నవానిఁగాను జూచి, యీరెండు ప్రతిబింబములకును నుపాధిభేదమువలన భేదము కలుగునట్లుగానే స్థూలసూక్ష్మశరీరములందుండుటచే నాయుపాధిభేదమువలన మనము నానావిధములుగా నున్నట్టుగానవచ్చుచున్నాము గాన వాస్తవమున మనమిరువురమును శరీరాత్మలుగా నున్నామనియుఁ బరమాత్మ బోధింపఁగా జీవుండు తెలివి దెచ్చుకొని వర్తించెను.

జూడరు. * ఓయీ! పురుషుండు తన్ను నొప్పయుపాధి యగు నద్దమందుఁ బెద్దవానిఁగాను స్వల్పోపాధియైనయితరుల నేత్రాదు

---

* ఇందులకు మూలము "యథాపురుషమాత్మాన మేనమాదర్శచక్షుషోః। ద్విధాభూతమవేక్షేత తథైవాంతర మాపయోః॥" అనఁగా బ్రాహ్మణత్వాది జాతులును, దీర్ఘత్వాదిగుణములును, మొదలగు తన్ను విడిచియుండనొల్లని విశేషణములుగల పురుషుఁడను పేరుగలిగి తద్విశేషణములుగలిగినదగు నొక్క వస్తువు అద్దము మొదలగు మహోపాధులందు స్థూలాకారముతోను, నేత్రములు మొదలగుచిన్నయుపాధులందుసూక్ష్మాకారముతోనుగానవచ్చుచుండును. అట్లె శరీరత్వధర్మము గలిగినజీవుఁడే శరీరముగాఁగలిగి శరీరత్వధర్మము తానొప్పనీశ్వరాత్మకమగువస్తువొక్కటియేయైననుస్థూలసూక్ష్మశరీరములందుండుటచే నుపాధిసంబంధమువలన నానాభూతమైనట్లు గానవచ్చుచున్నదని యర్థము. ఈశ్లోకమున "పురుష మవేక్షతే" అనుటవలన, ఈయర్థముస్పష్టమగుచున్నది. ఎట్లనఁ -- పురుషుండు బ్రాహ్మణత్వాదు లగుజాతివిశేషణములును దీర్ఘత్వాదిగుణవిశేషణములును గలిగియుండును. బ్రాహ్మణత్వధర్మమునకును, బ్రాహ్మణవ్యక్తికిని, దీర్ఘత్వగుణమునకును, అది కలవ్యక్తికిని, గాంతికిని, గాంతి గలవ్యక్తికిని భేదమున్నట్లుగానే, శరీరమునకును శరీరముగలయాత్మకును భేదము కలదు. కావున భగవంతునికి శరీరభూతమగుజీవునకును, జీవుఁడు శరీరముగాఁ గలిగినయీశ్వరునకును భేదము గలదని గ్రహింపవలయును. మఱియు బింబప్రతిబింబములకు గలిగినట్లు జీవేశ్వరులకుఁ గలిగినయౌపాధికభేదము స్వాభావికము కాదని గ్రహింపరాదు. "ఆదర్శచక్షుషోః" అని యుపాధులను జెప్పుటచే వానియందుఁ గానవచ్చుప్రతిబింబములకుబింబముతో (అనఁగాఁ బ్రతిబింబితవస్తువుతో భేదము లేకపోయినను నాప్రతిబింబములకు పాధిమూలమగు భేదము లేకపోలేదు. ఆలోచింపఁగా నద్దములోని ప్రతిబింబముకంటె నేత్రములోఁ బ్రతిఫలించినప్రతిబింబము భిన్నమయినది కాదా? మఱియు బింబప్రతిబింబముల కభేద మని యంగీకరించినవారు సైతము ప్రతిబింబములకు భేద మంగీకరింపక తీఱదు. ప్రతిబింబములకు భేద మంగీకరింపనిచో

లందుఁ జిన్నవానిఁగాను జూచుచుండుట గలదు. వృద్ధిహ్రాసములచే నాయాయుపాధులందుఁ గానవచ్చు ప్రతిబింబములకు భేద

నుపాధివశమున భేదము గలిగి వర్తించుప్రతిబింబములందు భేదప్రతీతి లేక పోవలసివచ్చును. ఇంతియ కాక ప్రతిబింబములకు భేదము లేదని సాధించుటకుఁ దగినహేతువులును గానరావు. ప్రతిబింబము లేకాకారముగా నుండును గాన యభేద మంగీకరింపరాదా? యనరాదు. ప్రతిబింబములకు బింబావస్థ గలుగుటచే వానిలోఁ బరస్పరము భేదము గలదు. ప్రతిబింబముల కట్టి భేదము గలుగుచున్నది! కావుననే పిండత్వము ఘటత్వము, కపాలత్వము మొదలగునవస్థలకుఁ బరస్పరభేదము తెలియవచ్చుచున్నది. అంతియ కాని, మృద్ద్రవ్యావస్థను బట్టియభేదమును గ్రహింపరాదు. ఈచెప్పుటవలన ప్రతిబింబములలోఁ బరస్పరము భేదమున్నను బింబప్రతిబింబముల కభేదము కానవచ్చుచున్నది. అట్లె యుపాధిభేదముచే జీవులకుఁ బరస్పరము భేదము గలుగుచున్నది. జీవేశ్వరుల కభేదమే కానవచ్చుచున్నది. ఇట్లుండ జీవేశ్వరులకు భేదమున్నదని యంగీకరించుట యెట్లు? అని శంకింపరాదు ఈశ్లోకమున బింబప్రతిబింబములను మాత్రమే దృష్టాంతముగాఁ జేకొనవలెను గాని బింబప్రతిబింబములకు నౌపాధికభేద మున్నదని చేకొనరాదు. అప్పుడును బింబప్రతిబింబములను దృష్టాంతముగాఁ దీసికొనక బింబప్రతిబింబములందుండుసమానధర్మము నే దృష్టాంతముగాఁ జేకొనవలెను. అంతియు కాని బింబప్రతిబింబములకువలెనే జీవేశ్వరుల కభేద మంగీకరింపరాదు. మామతమునకు విరుద్ధములు కాని ధర్మములచేతనే దృష్టాంతము సరిపోవుచుండఁగా బింబప్రతిబింబములనే దృష్టాంతముగా నేల చేకొనవలయును? ఈశ్లోకముచే జీవబ్రహ్మల కభేద మంగీకరించుట యీప్రకరణమునకు విరుద్ధముగా నుండును. తన్నుఁగూర్చియు, బ్రహ్మమునుగూర్చియు నేవిధమగుజ్ఞానము లేక పోవుటచేత దేహమే యాత్మ యని భ్రాంతియు, నాత్మస్వతంత్రుఁడను భ్రాంతియుఁ గలపురుషునికి నాభ్రమలను నివారించు నిమిత్త ముపదేశించు చున్నయీప్రకరణమందు, జీవపరమేశ్వరు లన్యోన్యము సఖులైనట్లు చెప్పఁబడుచున్నది. సఖిత్వధర్మము ఎప్పుడును పదార్థద్వయమం

మున్నదని తలపోయవచ్చును. అట్లు శరీరాత్మభావముచే నియతము లయినవిశేషణములు (అనఁగా శరీరత్వశరీరిత్వములు) గల మన మిరువుర మొక్కటియైనను స్థూలసూక్ష్మశరీరములందుఁ బ్రవేశించుటచే నుపాధిభేదమువలన నానాభూతులమైనట్లుగాన వచ్చుచున్నాము. నీవు శరీరమవు. నేను శరీరిని. ఇదియే మనయిరువురికిం గలభేదము' అని యిట్లు తనమిత్రుఁడగుహంసచే బోధితుఁడయి పురంజనుండు పూర్వజ్ఞానమును మఱలఁ బొందెను. ఓప్రాచీనబర్హీ! ఈయుపాఖ్యానము నీకుఁ బూర్తిగా వినిపించితిని. ఇది యధ్యాత్మసంబంధము గలది. ఆత్మతత్త్వము నీయుపాఖ్యానమూలమునఁ దెలిపితిని. విశ్వకారణుఁడయినభగవంతుఁడన్యాపదేశమున జెప్పిన మిగుల సంతసించు నని యట్లు చెప్పితిని. ఇది యిరువదియేడవ యధ్యాయము.

డుండును. గాని యొక్కపదార్థమం దుండునది కాదు. స్త్రీత్వపురుషత్వాది ధర్మములవలె నీసఖిత్వ ముపాధి వలనఁ గలుగుచున్నదని యుపదేశింపఁబడుచున్నదని చెప్పరాదు. సఖిత్వ మౌపాధిక మన్నచో, నాసఖిత్వముతోఁ గూడ నుపదేశించిన హంసత్వాదులుగూడ నౌపాధికము లని యంగీకరింపవలసియున్నది. మఱియు "మాయాహ్యేషామయాసృష్టా" అనుట నీశ్వరుఁడు సంసారప్రవర్తకుఁ డని కాక సంసారము కలిగించువాఁ డనియు తెలియవచ్చుచున్నది. సర్వజ్ఞుఁ డగునీశ్వరుండు వెఱ్ఱివానివలె ననర్థరూప మగుసంసారమును దనయందారోపింపఁజూచుకొనునా? కావున సఖిత్వ స్త్రీత్వపురుషత్వాదులవలె నౌపాధికము కాకపోవుటచేతను, సఖిత్వ మెప్పుడును రెండుపదార్థములం దుండవలసిన దగుటచేతను, జీవేశ్వరులను సఖులఁగా నిరూపించు నీప్రకరణమందు జీవేశ్వరుల కభేదము చెప్పుట యుక్తముగాదు. కావున పైశ్లోకముచే సమాన ధర్మములనే దృష్టాంతముగాఁ జేకొనవలయును.

అని పలికిన నారదునిపలుకులు విని ప్రాచీనబర్హి మిక్కిలి సంతసించి 'ఓనారదమునీంద్రా! తత్త్వజ్ఞానవంతుఁడ వయిననీవాక్యములు ప్రత్యేకముగా స్పష్టముగా నర్థమును దెలుపలేదు. దేహమే యాత్మ యని తలంచుకొను చున్నమావంటివా రట్టి గూఢవాక్యములను దెలిసికొనఁజాలరు. కేవలజ్ఞానవంతులు తెలిసికొనఁ దగినయాత్మతత్త్వమును బుణ్యపుణ్యాదిరూపకర్మములచే స్వపరయాథాత్మ్యజ్ఞానము లేని మే మెట్లు తెలిసికోఁగలము? కావున వెనుకటియుపాఖ్యానమును వివరించి చెప్పు' మనవుడు

నారదుఁడు ప్రాచీనబర్హికి హితోపదేశముఁ జేయుట.

నారదుం డిట్లనియె. ఓరాజేంద్రా! నీకుఁ బురంజనోపాఖ్యానము నిదివఱకుఁ జెప్పియున్నాను. పురంజనుఁ డనఁగాఁ బురుషుఁ డని (అనఁగా జీవాత్మ యని) తెలిసికొనుము. ఆతనికిఁ బురంజననామము గలుగుటకు హేతువును వినుము. పుర మనఁగా శరీరము. జీవాత్మ మనస్సుతోఁగూడ నందుఁ బ్రవేశించి తత్పురసంబంధము గలిగియుండును గానఁ బురంజనుఁ డను నామము గల్గినది. ఆశరీర మొకటిగాని రెండుగాని మూఁడుగాని నాల్గుగాని పెక్కుగాని పాదములు గలిగియుండును. ఒకప్పు డది పాదము లేక యే యుండవచ్చును. హరివిష్ణ్వాదినామములచేతను జగత్సృష్ట్యాదివ్యాపారములచేతను, సత్యజ్ఞానాదిగుణములచేతను, సామాన్యముగా జనులకుఁ దెలియరాని పరమేశ్వరుఁ డాపురంజనునకు సఖుండు గలఁడు. ఆసఖుఁ డొరులచేఁ దెలియఁబడఁడు. కావున "అవిజ్ఞాతుఁ"డను నామము గలిగినది. ఆశరీరమునకుఁ దొమ్మిదిద్వారములు కలవు. పురుషుఁడు జ్ఞానకర్మేంద్రియములకు విషయము లగుపదార్థములను బూర్ణముగా ననుభవింపఁ దలంచి

నప్పుడు నవద్వారములును రెండుకాళ్లును రెండుచేతులును గలిగినమానవశరీరమును ఎంచి దని తలపోయును. రాజా పురంజనునకుఁ బ్రమద యనెడిభార్య గలదని చెప్పియుంటిని. ఆపురంజనునిభార్య యనఁగా బుద్ధి యని గ్రహింపుము. ఆబుద్ధి యహంకారమమకారములు పుట్టించి యెక్కువమదమును గలిగించును గాన ప్రమదయని చెప్పఁబడినది. ఆబుద్ధిని బురస్కరించుకొని జీవుఁడు చక్షురాదీంద్రియములచే శబ్దాదిగుణముల ననుభవించును. పురంజనునకుఁ బదునొకండ్రు స్నేహితులు గల రని చెప్పితిని. ఆస్నేహితులు మనస్సుతోఁ గూడినయింద్రియదశకమని గ్రహింపుము. వారిలో నొక్కొక్కరు నూర్గురుస్త్రీల కధిపతులై యున్నారని చెప్పితిని. ఈనూర్గురేసిస్త్రీలను నింద్రియవృత్తు లని తెలియుము. ఆపురముఁ బరిపాలించునట్టిరా జనఁగా శరీరమును రక్షించుచున్నప్రాణ మని తెలియుము. ఆ ప్రాణమయిదువృత్తులు కలది కావున నైదుతలలు గలపాముతో సాటి దెచ్చితిని. ప్రమదయుఁ బదునొకండ్రు మహాభటులు వచ్చుచున్నట్లు చెప్పితిని వారిని బుద్ధితోఁ గూడి వర్తించుమనస్సుతోఁడివయినయింద్రియంబు లని తెలియుము. పదియింద్రియంబులు పదుగురుమహాభటు లనియు మనస్సు పదునొకండవమహాభటుండనియు నెఱుంగుము. పురంజనుఁడు పాంచాలములను బాలించుననఁగా జీవుఁడు పంచేంద్రియవిషయపదార్థముల ననుభవించునని తెలియుము. పురమునకుఁ దొమ్మిదిద్వారము లనఁగా శరీరమునకు నేత్రములును, నాసికారంధ్రములును, కర్ణబిలములును ముఖము శిశ్నము గుదము నాఁబడు తొమ్మిదిరంధ్రములు గలవని యెఱుంగుము. చక్షురాదీంద్రియరంధ్రములం

దున్నయింద్రియములతోఁ గూడ నాత్మ వైకి వెడలుచుండును. ఆద్వారంబు లెచ్చటెచ్చట నున్నవో వెనుక వర్ణించితిని. అందు నేత్రరంధ్రములును నాసికారంధ్రమును నోరును నీయైదునుశరీరమునకు ముందుభాగమునందుఁ గానవచ్చుచుండును. పురంబునకు దక్షిణద్వార మనఁగా గుడికర్ణము. ఉత్తరద్వార మనఁగా నుత్తరకర్ణము. అధోభాగమునందు రెండుద్వారంబు లని చెప్పితిని. అవి గుదశిశ్నము లని యెఱుంగుము. ఒక్కచోట నిర్మింపఁబడినఖద్యోతావిర్ముఖీద్వారము లనఁగా బురోభాగమునం దున్న నేత్రములు. జీవుఁడు వానివలన రూపమును జూచుచుండును. నలినీనాళిను లను రెండుద్వారములు పురోభాగమందు నిర్మింపఁబడినవి. అవి నాసికారంధ్రములు. జీవుఁడు నాసికారంధ్రములం దున్నఘ్రాణేంద్రియముచేతఁ బరిమళమును గైకొనుచుండును. పురోభాగమం దున్నయేడవద్వారము నోరు. జీవుఁడం దున్నరసజ్ఞ మగురసనేంద్రియముతో సమస్తరసములను గ్రహించుచుండును. ఆపురమునకుఁ బితృహూ వనియు దేవహూ వనియు రెండు ద్వారములు కలవని చెప్పితిని. పితృహూ వనఁగా దక్షిణకర్ణము. దేవహూ వనఁగా నెడమచెవి. జీవుఁడు వానివలన శబ్దాదికమును వినుచుండును. చండవేగుఁ డగుగంధర్వపతినిఁ గూర్చి చెప్పితిని. జీవుని కాయుష్కాలపరిమాణమును దెలియఁజేయు సంవత్సర మని తెలియుము. అది చక్రమువలెనే త్వరగాఁ దిరుగుచుఁ బురుషాయువును గొలుచుచుండును. గాన చండవేగ మని పలుకఁబడుచున్నది. ఆచండవేగునకు గంధర్వులును గంధర్వస్త్రీలును గల రని చెప్పితిని. చండవేగము గలసంవత్సరరూపకాలమునకు మూఁడువందలయఱువది పవళ్లును, నన్నియరాత్రులును

గలవు. గంధర్వులు పరోక్షముగా మానవులయాయువును హ రించునట్లు నివియు నాయువును హరించుటచే గంధర్వ లని చె ప్పఁబడినవి. కాలకన్యక లోకమున సంచరించుచున్నదని చెప్పి తిని. ఆకాలకన్యక యనఁగా జరావస్థ యని యెఱుంగుము. పురు షాయువును హరించుకాలమున కది మిగులఁ బ్రీతిని బుట్టించు ను గాన నది కాలమునకుఁ గన్యకగాఁ జెప్పఁబడినది. లోక మె వ్వరును దానినిఁబరిగ్రహింప కున్నయవసరంబున సకలరోగముల కును రాజయినమృత్యువు లోకక్షయముఁ జేయుటకుఁ జేరఁదీ సెను. యవనేశ్వరుఁడు పురంజనునిపురమును ముట్టడించె నని చెప్పితిని. ఆయవనేశ్వరుఁ డనఁగా మృత్యు వని తెలియుము. ఆతనిసైనికు లగుయవను లనఁగా నాధివ్యాధు లయినరోగము లని గ్రహింపుము. ఆరోగములు మిగులదుఃఖముఁ గలిగించును. గాన శత్రువులని చెప్పితిని. సుఖదుఃఖములు, రాగద్వేషములు, భయము, అభిమానము, ప్రమాదము మొదలగున వన్నియు నత నిసైనికు లని యే తెలియుము. ప్రజ్వారునిఁగూర్చి చెప్పితిని. ప్ర జ్వారుఁ డనఁగా వివిధములగురోగము లని గ్రహింపుము. ఓ రాజేంద్రా! దక్షిణపాంచాలము లనియు నుత్తరపాంచాలము లనియుఁ జెప్పితిని. త్రివర్గమును సాధించుటను దెలిపెడిప్రవృత్తి శాస్త్రము దక్షిణపాంచాల మనియుఁ ద్రివర్గఫలము నిత్యము కాదని తెలిపి యనంతస్థిర ఫల మగుబ్రహ్మోపాసనమును గూర్చి యుఁ దత్స్వరూపగుణములనుగూర్చియుఁ దెలిపెడినివృత్తిశాస్త్ర ముత్తరపాంచాల మని యెఱుంగుము. మఱియుఁ బ్రవృత్తిశాస్త్ర ములందుఁ జెప్పఁబడినకర్మములచే దాక్షిణాత్యు లగుపితృదేవత లను నారాధించి వారిసన్నిధిని బొందవచ్చును గాన యట్టిపితృ

ప్రాప్తిసాధనములను దెలుపునది గనుక నీశాస్త్రము దక్షిణపాం
చాల మని చెప్పఁబడినది. నివృత్తిశాస్త్రోక్తము లగుకర్మముల
నాచరించి బహ్మప్రాప్తిని గలిగించును గాన నివృత్తిశాస్త్రము
త్తరపాంచాల మనియుఁ జెప్పఁబడిది. జీవుఁడు శ్రోత్రేంద్రియ
మువలన వానినిఁ దెలిసికొనుచున్నాఁడు. ఆసుర యనెడిపశ్చా
ద్ద్వారమనఁగా శిశ్నము. దానివలన జీవుఁడు మైథునాదికర్మము
లనుఁ జేయుచుండును. దుర్మద మను నుఱియొక ద్వార మనఁగా
గుదస్థానము. దానివలనఁ బురంజనుఁడు వైశన మను దేశమునకు
వెడలు ననఁగా జీవుఁ డాగుదస్థానమునుండి నరకదుఃఖముల న
నుభవింపఁ బోవునని తెలియుము. పురంజనుఁ డంధు లగుపౌరు
లవలనఁ గొన్ని కార్యములు నెఱవేర్చుకొను నని చెప్పితిని. అంధు
లగుపౌరు లనఁగాఁ బాదములును, బాహులును. అవి జ్ఞానహీన
ము లయినవి గాన నంధు లని చెప్పఁబడినవి. జీవుఁ డాపాదముల
వలన నడుచుచు జేతులవలనఁ గార్యములు చేయుచున్నాఁడు.
పురంజనుఁ డంతఃపురమును బొందె ననఁగా జీవుఁడు హృదయ
మును బొందె ననుట. రా జంతఃపురమును జెంది మోహమును
బ్రసాదమును హర్షమును బొందునట్లు జీవుఁడు హృదయమును
బొంది మోహాదులను జెందుచుండును. ఎప్పుడెప్పుడు స్వప్నావ
సయందు బుద్ధివికారమును బొందునో, జాగ్రదవస్థయం దెప్పు
డెప్పు డింద్రియములు పరిణామమును జెందునో, యప్పుడప్పుడు
బుద్ధిసంబంధిగుణములను స్వీకరించి జీవుఁడు తాను వాస్తవము
గా నుపద్రష్ట యైనను, బుద్ధిసంబంధు లగుదర్శనశ్రవణాదులను
బొందుచుండును. ఓరాజా! దేహము నొకరథమునుగా వర్ణిం

చిరిని. దానివివరణమును వినుము. *దేహము రథమువంటిది. ఇంద్రియములు గుఱ్ఱములు. రథగమనము సంవత్సరవేగతుల్యమయినది. పుణ్యపాపకర్మములు చక్రములు. సత్త్వరజస్తమోగుణములు ధ్వజములు. పంచప్రాణములు బంధనస్థానములు. మనస్సు పగ్గములు. బుద్ధి సూతుఁడు. హృదయము రథికుఁడు గూర్చుండుస్థలము. శోకమోహాదులగుద్వంద్వములు కాఁడి బంధించెడిచోట్లు. ఇంద్రియార్థములు బాణములు. సప్తధాతువులును రథమునకుఁ గప్పెడి చర్మాద్యావరణములవంటివి. ఎండమావులవలెనే **సుఖాభాసము** లయినబాహ్యవిషయములనుగూర్చి పర్విడునేకాదశేంద్రియములును సేనలు. జీవుఁ డారథమును నెక్కి సంచరించుచు నాధ్యాత్మికము, ఆధిదైవికము, ఆధిభౌతికము, నాఁబడుతాపములకును, బహువిధదుఃఖములకునుఁ జిక్కి శరీరమున్నంతకాలము నజ్ఞానముచే నావృతుఁడై యుండును. మఱియు నింద్రియాదులధర్మములను నాత్మయం దారోపించి నేను సుఖిని, నేను దుఃఖిని, నే నంధుఁడను, నేఁ జెవిటివాఁడను, నని

* ఇట్లు మానవదేహమును రథముగా నిరూపించుట యెందులకనఁగా రథ మొకస్థలమునుండి మఱియొకస్థలమునకుఁ జేర్చునట్లు మనుష్యశరీరము వైష్ణవపదప్రాప్తిని గలిగింప సాధన మయినది. ఈయంశమును గఠవల్లిలోఁ జెప్పఁబడినది. 'ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవచ । బుద్ధింతు సారథిం విద్ధిమనఃప్రగ్రహమేవచ । ఇంద్రియాణి హయానాహు ర్విషయాంస్తేషు గోచరాన్ । ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహు ర్మనీషిణః। యస్త్వవిజ్ఞానవాన్భవత్యమనస్కస్సదాఽశుచిః। నసతత్పదమాప్నోతి యస్మాద్భూయో నజాయతే । విజ్ఞానసారథి ర్యస్తు మనఃప్రగ్రహవా న్నరః । సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదం। కావున నిట్టిరథము నధిరోహించి వేఁటకు వెడలినరాజువలెనె జీవుఁడు దురితకార్యములకయి ప్రయత్నించుచుండును.

యనుకొనుచు సుఖలేశములనిమిత్తము పాటుపడుచు, నహంకారమమకారములచే దేహాంతరప్రాప్తికిఁ దగినకర్మముల నాచరించుచు శరీరమందు వసించి యుండును. జీవునకే సంసారమెట్లు కలుగుచున్నదని యందువేని వినుము. హితోపదేశమును జేయువాఁడునుఁ బ్రకృతిపురుషవిలక్షణుఁడును నగుపరమాత్మను మఱచి జీవాత్మ స్వయముగా నాత్మానుభవపరుఁ డయినను బ్రకృతిగుణము లగుశబ్దాదులం దాసక్తుఁ డగునప్పుడే యతనికి సంసారము గలుగుచున్నది. మఱియు జీవుండు శబ్దాదులందు భోగ్యతాబుద్ధి గలిగి, కావుననే విషయములకుఁ జిక్కి యభిలషితపదార్థములను సంపాదించుకొనునిమిత్తము సాత్వికములును, తామసములును, రాజసములును, నగుకర్మములను జేయుచున్నాఁడు. తా నొనరించినకర్మముల ననుసరించియే మఱల జన్మాంతరములను బొందుచున్నాఁడు. జీవుఁడు సాత్వికకర్మములనాచరించి కాంతిబహుళ మయినదేహమును బొందును. రాజసకర్మముల నాచరించి దుఃఖసంపాదకము లయినదేహములను బొందును. తామసకర్మముల నాచరించి యజ్ఞానశోకములను గలిగించుదేహములను బొందును. మఱియు నవివేకియైన జీవుఁడు తా నొనరించుకర్మములకుఁ దగునట్లుగా నొకప్పుడు మనుష్యజన్మమును, నొకప్పుడు దేవజన్మమును, నొకప్పుడు పశుపక్ష్యాదిజన్మమును, అందులో నొకప్పుడు స్త్రీత్వమును నొకప్పుడు పురుషత్వమును, నొకప్పుడు నపుంసకత్వమును బొందును. ఓరాజా! యాఁకలిగొని దీనమయినకుక్క యేవిధంబుగాఁ బ్రతిగృహంబునకుఁ దిరిగితిరిగి స్వకర్మాయత్త మగునయన్నమును గాని తాడనమును గాని పొందునో, యట్లే జీవుఁడు కామములందుఁ గోర్కి కల

వాఁడయి తా నొనర్చినకర్మములకుఁ దగునట్లుగా నూర్ధ్వలోకములందును, నధోలోకములందును, నీలోకములందునుఁ దిరుగుచు స్వకర్మాయత్త మయినప్రియమునుగాని యప్రియమును గాని పొందుచుండును. ఆధ్యాత్మికాదితాపములను త్రివిధదుఃఖములం దొక దానికి మఱియొకదానిచే నాశనము గలిగినట్లుగా గుగ నుండును. కాని యీతాపత్రయనాశనము భగవదుపాసనముచే నగుంగాని వేఱొకయుపాయముచేఁ గానేరదు. ఇంతియ కాక యీదుఃఖములకు బ్రతిక్రియ చేసినను దుఃఖముగానే తోఁచును. పురుషుఁడు తలతో బరువు మోయుచుఁ దనతలకు విశ్రాంతి కలుగునిమిత్తము భారమును బుజముపై నిలుపును. ఆకాలమందుఁ దలకు నాభారము బాధ గలిగింపకపోయినను బుజమునకుఁ గలిగింకపోలేదు. అట్లె తాపత్రయమున నొకవేళఁ బ్రతీకారము చేసినను నవి స్వల్పవిశ్రాంతికరములు గాని పూర్తిగా నశింపఁ జేయలేవు. ఆలోచింప నాదుఃఖప్రతిక్రియలును దుఃఖరూపములనియే చెప్పవచ్చును. కావునఁ గేవలము కర్మరూప మగుప్రతీకారము దుఃఖములను మొదలంట నశింపఁజేయవు. ముఖ్యముగాజ్ఞానరూపము లయినకర్మములయినను దుఃఖహేతువులయిన కర్మములను బూర్తిగా నివర్తింపఁజేయలేవు. ఓపాపరహితా! స్వప్నమందుఁ గలిగిన స్వశిరశ్ఛేదాదికరూపభయము జాగరణముచే నశించినను నజ్ఞానము నశింపకపోవుటచే మగుడ నట్టి స్వప్నము కలుగవచ్చును. అట్లె యీరెండుకర్మములును బ్రతీకారము లయిన నందులకు మూల మగునవిద్య నశింపకపోవుటచే మగుడఁ గలుగుచుండు. ఆత్మయందు దేవత్వమనుష్యత్వాద్యాకారములు లేకపోయినను, స్వప్నమందు లింగశరీరమూల

మున సంచరించుమనస్సువలన సుఖదుఃఖాదులు సంభవించుచు న్నట్లు దేహాత్మభ్రాంతిమూల మయినసంసార మాత్మకు సంభ వించుచునే యుండును. ఓరాజా! పురుషార్థభూతుఁ డయినయా త్మకు దుఃఖపరంపరారూప మగుసంసారము మనస్సువలనఁ గలుగుచున్నది. మనస్సువలన నాత్మకుఁ దాదృశదుఃఖజనక మగుసంసారము గలుగకుండునట్లు మనస్సును నిర్బంధింపవలె నన్నచో భగవద్భక్తి కావలసి యుండును. చక్కనిరీతిచే వాసు దేవునియందుఁజూపఁబడుభక్తివైరాగ్యమును దత్త్వజ్ఞానమును గలిగించును. ఆభక్తి యెట్లు గలుగునని యందువేని నిత్యమును శ్రద్ధ వహించి విష్ణుకథలను వినువానికిని, బఠించువానికిని భగవ ద్విషయక మయినభక్తియోగము జనించును. మఱియు నోరా జేంద్రా! నిర్మలచిత్తులైనసజ్జనులు భక్తియుక్తులై వాసుదే వునికథలను వినుటయం దతికుతూహలము వహించి యుందురు. అట్టివారిసహవాసము చేసి వర్తించుచుండిన సంతతమును హరి కథాశ్రవణము సంభవించును. ఓమహానీయా! సజ్జను లున్న ప్రదేశమును జేరి, యామహాత్ములు చెప్పుచున్నభగవత్కథలను సుధాప్రవాహములు ప్రవహించుచుండఁగా జాలునన్నబుద్ధిని విడిచి, యెవరు సావధానులై కర్ణపుటములతోఁ దృప్తి దీఱఁ ద్రావుదురో, వారిని స్వభావసిద్ధముగా దేహమువలనఁ గలుగు క్షుత్పిపాసాదులు చుట్టుముట్టి బాధింపనేరవు. ఇట్లుండఁగా మాన వులు దేహప్రయుక్తము లయినక్షుత్పిపాసాదులచేఁ బీడితులయి హరికథాశ్రవణమం దాసక్తినిఁ జెందరు. కావున ముందుగా భాగవతులసహవాసము చేయవలెను. అందువలన హరికథా శ్రవణమును బిమ్మట భగవదుపాసనమునుఁ దరువాత వైరా

క్యము ననంతరమున భగవంతునిసాక్షాత్కారరూప మగుజ్ఞాన మును, నందువలన భక్తియు నందువలన ముక్తియుఁ గలుగును. ఓరాజా! బ్రహ్మయు, భగవంతుఁ డగునీశ్వరుఁడును, మనువును, బ్రజాపతు లయినదక్షాదులును, నియమము గలిగి వర్తించు సనకాదులును, మరీచియు, నత్రియు, నంగిరసుఁడును, బులస్త్యుఁ డును, బులహుఁడును, గ్రతువును, భృగువును, వసిష్ఠుఁడును నేనును, బ్రహ్మవాదులము. బృహస్పతి, వ్యాసుఁడు మొదలగు వారు తపస్సు, విద్య, సమాధి, మొదలగునుపాయములచే నుపా సించుచున్నను, బరమేశ్వరు నిప్పటికిని జూడఁజాలకున్నారు. ఇట్టి మహనీయులే పరమేశ్వరునిఁ జూడఁజాలనప్పుడు,అనంతములయి దురధిగమములయి వేదమందు క్తము లయినకర్మముల నాచ రించుచుఁ బశుపుత్రాదు లగునిహలోక ఫలములను గోరుకొను చు, నింద్రాదిదేవతలను భజించుసామాన్యు లాతనిఁ గనుఁగొ నలే రని వేఱ చెప్పవలయునా? ఎప్పుడు మానవుఁడు చేసిన సుకృతకర్మములకు భగవంతుఁడు సంతసించి యొకవనిని రక్షింపఁ దలంచునో, యాపురుషుఁడు దేహపోషణాదుల కుపయుక్తము లగుకర్మములందును వేదపూర్వభాగమందుఁ జెప్పఁబడిన యా గాదికర్మములందును మనస్సు దూర్పక భగవంతునియందుఁ జొప్పించును. ఓరాజా! భగవదనుగ్రహమే ముక్తికిఁ గారణ మగుటచే నీ వజ్ఞానమువలన స్వర్గాదిఫలములను గలిగించుకర్మ ములందుఁ బురుషార్థసాధనమతి నుంపకుము. అవెప్పుడును బురుషార్థములు కావు. అవి కేవలమును స్వల్పఫలదాయకము లును, నధికాయాసము గలిగించునవియు నై యున్నవి. రజస్త మోగుణబుద్ధు లయినకొందఱు జనార్దను నారాధనరూప మగు

వేదపూర్వభాగమును కేవలకర్మతాత్పర్యకముగాఁ జెప్పుచున్నారు. వేదతాత్పర్యమును దెలియనివారు స్వస్వరూపమునైనను దెలిసికోలేనియజ్ఞాను లని నశ్యుము. కావున నీ విఁకఁ గర్మముల నాచరింపక తూర్పునకుఁ గొన లుండునట్లు దర్భలను భూమిపై బఱచి, బహుపశువులను జంపుటవలన నేనే గొప్పయజ్వ నను నభిమానము గలిగి కావున నే ధూర్తుండవై పరమపురుషార్థమైన మోక్షమును సాధించుకర్మము దెలిసికొనఁజాల కుంటివి. ఓరాజా! ఏకర్మము భగవంతునికి సంతసము గలిగించునో, యది యే ప్రశస్తమైనది. తక్కినది నింద్యమైనది. ఏవిజ్ఞానమువలన మనస్సు హరియందుఁ జేరునో యదియే మిక్కిలి ప్రశస్తమైనది. ఆశ్రీహరి నిఖిలదోషములను దొలఁగించువాఁడు. సమస్తకల్యాణగుణములుగలవాఁడు. జగమున కుపాదానకారణము. మఱియు నతఁడు సకలజంతువులకును నంతరాత్మయైయుండును. ఆవిష్ణుపాదమూలమును జేరినవారికి క్షేమము గలుగును. అట్టివారికి భగవంతుఁ డుప్రియతముఁడై యుండు. అట్టివారికి నణుమాత్రమును భయము గలుగదు. కావున శ్రీహరిపాదమూలమును జేరఁ బ్రయత్నింపుము. నేను నీ కిప్పుడు తత్త్వమును హితమును దెలిపితిని. ఈతత్త్వహితములను దెలిసినవాఁడే విద్వాంసుఁడు. ఆవిద్వాంసుఁడే గురువు. అతఁడే హరి. ఓపురుషవరా! నీ వడిగినప్రశ్నమున కుత్తర మొసంగియుంటిని. ఇంకువిషయమై నా చెప్పినరహస్యమును జక్కఁగా వినుము. ఓరాజా! స్వల్పముగాఁ బుష్పవనములందు స్త్రీమృగముతోఁ గూడి వర్తించుచు దానియందు మిగులనాసక్తి గలిగి తుమ్మెదఝంకారములను వినుచుఁ దన ప్రాణములను హరింప నున్నవృకములను గుఱుతింపక యుం

డఁగా వెనుకనుండి వ్యాధునిచేఁ గొట్టుపడినమృగమునువలె నిన్నుఁ జూచుకొనుము. ఇందలియర్థమును స్పష్టముగాఁ జెప్పెదను విను. రాజా! గృహస్థాశ్రమము పుష్పసమానధర్మములు గలస్త్రీలకు శరణమైనది. ఆయాశ్రమమందు పుష్పమకరందలేశమువలెనే స్వల్పమయినకామసుఖమును గలదు. ఆ స్వల్పసుఖము నుపస్థేంద్రియముచే ననుభవించుమిథునకర్మమందాసక్తి గలిగి, తుమ్మెదలఝుంకారములవంటిస్త్రీలమృదులాలాపములను వినుచు, నెదుట వృకములవలెనే భీకరములయి ప్రాణము లపహరించునహోరాత్రములను లెక్కింపక గృహమందుఁ జరించుచుండఁగా వెనుకనుండి వ్యాధునివంటియముఁడు వచ్చి మృత్యుపాశముచే గ్రహింపఁగా నప్పుడు నీవు వ్యాధునిచేఁ గొట్టుపడినమృగముగా నిన్ను నీవు తలంచుకొందువు. నే నిప్పుడు చెప్పినయర్థమును గ్రహించి నీహృదయకుహరమందు మనస్సు నిర్బంధింపుము. యాగాదికర్మములందు రుచి కలిగించునర్థవాదాత్మకము లయినవేదములనుండి మనంబును మరలింపుము. ఈగృహస్థాశ్రమమును విడువుము. అందతికాముకుల చరిత్రములు వినవచ్చుచుండుటచేనవి మిగులఁ జేటుగలిగించునవి. కాన వాని విడుచుట మంచిది. జీవుని సర్వవిధములచేతనురక్షించుభగవంతుని శరణువేఁడుము." అనియుపదేశించిననారదునిఁ గాంచి ప్రాచీనబర్హి యిట్లనియె. "ఓమునీంద్రా! జ్ఞానాదిసంపన్నుఁడ వయిననీవు చెప్పినవాక్యములు వినఁదగినవి. వానిని జక్కఁగా వింటిని. వానిని జక్కఁగా విమర్శించితిని. నీ వుపదేశించినయీరహస్యమును నాకుఁ గర్మములఁగూర్చి యుపదేశించునాయుపాధ్యాయు లెఱుఁగరు. ఎఱిఁగియున్నచో నేల చెప్పరు? అ

ధ్యాత్మతత్త్వమువిషయమయి నీవుచేసినబోధచే సంశయములు తొలంగినవి. ఒక్కసంశయ మున్నది. దానిని ఛేదింపనింద్రియ వృత్తులు చాలవు. మునీంద్రులునుఁ దెలియఁజాల రని తలఁచెద. ఆసంశయ మనుమడిని విప్పెము. 'పురుషుఁ డేదేహముచే నీలోకమునఁ బుణ్యాపుణ్యరూపము లగుకర్మములను జేయుచున్నాఁడో, యా దేహము నీలోకములోనే విడిచి స్వకర్మముచే సంప్రాప్తమయినమఱియొక దేహమును బొంది కర్మముచే సంప్రాప్తములయినసుఖదుఃఖములను మాటిమాటి కనుభవించును' అని భవాదృశు లయినవేదవాదులు చెప్పినట్లు పురాణాదులం దచ్చటచ్చట వీటిని. సుఖదుఃఖహేతువు లని బ్రహ్మవాదులచేఁ జెప్పఁబడు చున్నకర్మములు జనులచేఁ జేయఁబడుచు,నవి యుత్తరక్షణమందే యదృశ్య మగుచున్నవి. ప్రాక్తన దేహముచేఁ జేయఁబడిన కర్మముల కీ దేహమం దెట్లు ప్రకాశము లేదో; యట్లె యీ దేహముచే నొనర్పఁబడినకర్మములకు త్తర దేహమునందుఁ బ్రకాశము లేదు. ఇంతియ కాక పూర్వ దేహముచేఁ జేయఁబడినకర్మములును, దన్నిమిత్త మగుసత్త్వాదిగుణములు గలమనస్సును, వానితోఁ గూడినశరీరమును నీజన్మమందు లభింపవు. కావునఁ గర్మగుణమనో దేహములు పూర్వమున లేవు. అవి యిప్పుడు సుఖాదులను గలిగింపఁజాలవు. మఱియునీ దేహముచేఁ జేయఁబడినకర్మములు మనోదేహములును నుత్తరజన్మమునందు సుఖదుఃఖాది హేతువులు కావు. సుఖదుఃఖాదులు నిర్నిమిత్తముగానే కలుగుచున్నట్లు తోఁచుచున్నవి. ఇందులకు నీయభిప్రాయంబును దెలుపుము'' నావుడు నారదుం డి ట్లనియె. 'ఓరాజా ! ఉత్తరోత్తరజన్మ

నారదుఁడు ప్రాచీనబర్హికిఁ బ్రత్యుత్తరంబు లిచ్చుట.

ములందు సుఖదుఃఖములు గలిగించుకర్మముల కాశ్రయభూత
మై దేహ మిచ్చటనే నశించుటచే నందువలన సుఖదుఃఖములు
గలుగుట యసంభవ మనియు, శీఘ్రకాలములోనే నశించుకర్మ
ము త్తరజన్మములందుఁ గలిగింపనేరదనియుఁ గులాలునిదండ
చక్రాదివ్యాపారము లిప్పుడు నశింపఁగా నవి యుత్తరకాలమం
దుదయించెడిఘటమునకు హేతువు లనుట యనుభవవిరుద్ధ మ
నియుఁ జెప్పితివి. కాని యది యుక్తము కాదు. ఏమనస్సుచేఁ
బురుషుఁడు కర్మమును జేయుచున్నాఁడో, పుణ్యాపాపకర్మము
లకు హేతుభూతమైనయామనస్సుచే స్వకర్మానుగుణ మయిన
సుఖదుఃఖాదిఫలములను బరలోకమున ననుభవించుచున్నాఁడు.
స్థూలశరీరము నశించినను గర్మములకుఁ గారణ మగుమనస్సుం
డుటచే నుత్తరజన్మములం దది జీవునకు సుఖదుఃఖంబులు గలి
గించును. దానికి దృష్టాంతమును జెప్పెద వినుము. శరీరము ని
ద్రావస్థయందుఁ బండుకొనియుండఁగా జీవించియున్నను దాని
యం దభిమానమును విడిచి పురుషుఁడు మనస్సునందు దైవప్రా
ప్త మగుకర్మఫలమును బండుకొనియున్న దేహసదృశ మయిన
మనుష్యదేహముచేతనుగాని, దేవాదిశరీరముచేతనుగాని,స్వప్న
మం దనుభవించుచున్నాఁడు. స్థూలదేహ మొకచోటఁ బడియు
న్నను బురుషునికి సుఖదుఃఖాదు లెట్లు కలుగుచున్నవో, యట్లె
మనస్సు పురుషు ననువర్తించివచ్చుటచే లోకాంతరమందు సుఖ
దుఃఖాదులనుగలిగింపవచ్చును.మఱియునీవుకర్మను చేసినయు
రతుణమునం దేనశించుచుండనది కాలాంతరనుందు సంభవించు
ఫలములకు హేతు వెట్లగునని యడిగితివి.అందులకు సమాధాన

మువినును పురుషుఁడు దేహాత్మాభిమానము గలిగి యాకర్మములు నానిమిత్తమని పలుకుచు మనస్సుచేఁ జేసినకర్మ మేది కలదో, యది భగవంతునినిగ్రహానుగ్రహరూప మగుశక్తి కలదయి పునర్జన్మంబును గలిగించుచుండును. పూర్వజన్మమందలి కర్మము మనస్సు నిప్పు డున్నదనుటకుఁ బ్రమాణమును జెప్పెదను వినుము. జ్ఞానేంద్రియపంచకముచేతను, కర్మేంద్రియపంచకముచేతను మన స్సున్నదని నిశ్చయింపవచ్చును. ఎట్లనిన సర్వేంద్రియములును నింద్రియములకు విషయము లయినపదార్థములు నున్నప్పటికిని సర్వేంద్రియజ్ఞానములు నొక్కుమ్మాడి కలుగకున్నవి. *అట్లగుటకు మనస్సంబంధ ముండుటయు లేకపోవుటయు నే కారణమని గ్రహింపవలయును. అట్లె చిత్తవృత్తులచేఁ బూర్వదేహాశ్రిత మగుకర్మ మున్నట్లు చెప్పవచ్చును. ఏవస్తువున కేరూపమో యీజన్మమందుఁ బురుషుఁడు దానిని నొకప్పుడైనను జూడకపోయినను వినకపోయినను, నింద్రియములచేతఁగాని ప్రమాణాంతరములచేతనుగాని యనుభవింపకపోయినను, నొకానొకవస్తువు స్వప్నాదులందుఁ గానవచ్చుచున్నది. ఇంతియకాక యనుభూతముకానిది స్వప్నమునఁ గానరాదని పెద్దలు చెప్పుదురు. కావున మన స్సింతకుఁ బూర్వము పొందినజన్మములలో నెప్పుడో యనుభవించియుండు నని చెప్పవలసియున్నది. ఓరాజా ఈజన్మమం దనుభవింపనివస్తువు స్వప్నమందుఁ గాంచినచో నా

---

*ఇందులకు గౌతముఁడు" సూ॥ యుగపద్జ్ఞానానుత్పత్తిర్మనసో లింగం" అని చెప్పియున్నాఁడు. అనగా మనస్సునకు లక్షణమే మనఁగా సర్వేంద్రియములవలనను నొక్కుమ్మాడిజ్ఞానము కలుగకపోవుటయే మనస్సున్న దనుటలోఁ బ్రమాణము.

పురుషుఁడు, తొలిబాములం దావస్తువు ననుభవించియుండెనని నిశ్చయింపుము. అనుభూతము కానివస్తువు మనస్సునం జెప్పుడును స్ఫురింపదు. కావున మనస్సు మనుష్యుని వయినపూర్వరూపములను భవిష్యద్రూపములను వర్తమానరూపములను దోఁపించును. మఱియు నీజన్మమం దొకప్పుడయినను బురుషుడు చూడనిదియు, విననిదియు నగువస్తువు మనోరథగోచర మగుచుండును. "నానివాసదేశ మిట్టిది" "కాలమిటువంటిది" "నేనిట్లు చేయుదును" అని పురుషుఁ డొకప్పుడు నూహింపనియర్థవిశేషమునుగుఱించి కాలమువలనను, దేశమువలనను, క్రియవలలనను, నే యే ప్రకారముగా బుద్ధిస్థము లగునో యాయా ప్రకారముగా నూహింపవలయును. "ఓయీ! పూర్వజన్మము, కర్మము, సిద్ధించుఁగాక, అందువలనఁ గలుగు లాభమేమి? అందు వేని వినుము. ఈజన్మమందు మనోరథవిషయములగుపదార్థము లన్నియుఁ బూర్వజన్మమందుఁ గ్రమానుసారముగా నింద్రియగోచరము లగుచుండును. మనస్సున్నప్పుడే యట్టిది కలుగుచుండును. మనస్సు లేనిచో సర్వేంద్రియసంబంధము గలిగియుండుటచే సర్వేంద్రియజ్ఞానము నొకపర్యాయమె కలుగవలెను. అట్లు కలుగకుండుటకే మనస్సంబంధ ముండినఁ గాని యింద్రియజ్ఞానము గలుగదని చెప్పఁబడినది.*పూర్వానుభూతము

---

* ఓయీ! ఈజన్మమందుఁగాని జన్మాంతరమందుఁగాని యనుభూతమయినదేకాని మనోవిషయము కాదని యంటివి. అట్లయినచో ముముక్షువునకు ముక్త్యానందము మనోరథవిషయము కావచ్చును. అట్లయినచో నది పూర్వమెప్పుడో యనుభూతమైయే యుండవచ్చును. ఇందుల కంగీకరింతువేని "నచపునరావర్తతే" అను శ్రుతిప్రమాణమువలన వానికిఁ బునర్జన్మము సంభవింపగూడఁ

లయినపదార్థములు వాసనోన్మేషమువలన బుద్ధిస్థము లగుచుండును. అది లేనప్పుడు బుద్ధిస్థములు కావు. అందఱును మనస్సు గలవారలే యై యుందురు. కాన సర్వపదార్థములును వాసనానుసారముగా మనస్సునం దుండుటచే ననుభూతము కానివస్తువై నప్పుడును నెవ్వరికినిఁ గానరాదు. సత్వగుణము గలమనస్సు భగవంతుని భజింప దొరకొన్నచో నప్పు డజ్ఞానము, చంద్రోదయానంతరమందుఁ గానవచ్చు చీఁకటివలెఁ గానవచ్చును. వెన్నెలయుఁ జీఁకటియు మిళితమై యున్నట్లు జ్ఞానాజ్ఞానములు మిళితములై యుండును. భగవద్భజనప్రారంభమం దున్నవానికి బ్రహ్మస్వరూపానందాదులు పరోక్షముగానే మనోవిషయం బగుచుండును గాని ప్రత్యక్షముగాఁ గలుగ నేరవు. అట్లుండ సంసారులమాట వేఱ చెప్పనేల? జీవుఁడు శబ్దాదిగుణముల చేతను, సత్వాదిగుణముల చేతను, నావృతుఁడై, యెంత కాల ముండునో

దు. అందు వేని సమాధానమునుఁ జెప్పెదను విను. ప్రకృతిపరిణామాత్మకము లగు దేహములచే ననుభవింపఁదగినవయి యున్నపుడే యనుభూతార్థము మనోరథవిషయము కా దని యభిప్రాయము. ముక్తానందము ప్రాకృతదేహముచే ననుభవింపఁదగినది కాదు. కాన దోషము లేదు. పోనిమ్ము. ముక్తానందము మనోరథవిషయ మగుఁ గాక, అట్లయినను "సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా" అనువాక్యమువలనఁ దెలియవచ్చు నిరతిశయానందమగుటచే ముక్తానందము పరోక్షముగా మనోరథవిషయమగును గాని ప్రత్యక్షముగాఁ గాదు. అనుభవము శబ్దజన్య మగు ప్రమాణమునకు విషయ మగుటచేఁ బరోక్షమే యగును. పరోక్ష మగు ముక్తానందమే మనోరథవిషయ మగుచున్నది. కాన పూర్వానుభవముగూడ నట్టిదియే కల్పింపఁబడును. ముక్తానందము ప్రత్యక్షముగా ననుభవించునప్పుడే పునర్జన్మములందుఁ గాని పరోక్షముగా ననుభవించినప్పుడు పునర్జన్మము సంభవింపవచ్చును. కాన శ్రుతిసూత్రవిరోధము లేదు.

యంతకాలమును, నతనికి స్వరూపమును గప్పిపుచ్చునహంమమాభిమానములు నివర్తింపవు. మఱియు నిద్రయందును,మూర్ఛయందును, నతిశయితదుఃఖమందును, జ్వరాదులవలనఁ గలుగు మరణమునందును, జీవునకు మిక్కిలి జ్ఞానము సంకోచము నొందుటవలన"అహం"అను జ్ఞానము స్ఫురింపదు. దేహము మఱచుటవలన దేహమం దహంబుద్ధి లేదు. ఓయీ ! పైనిజెప్పిన యవస్థలయందు జ్ఞానకర్మేంద్రియంబులును మనస్సునుండఁగా జ్ఞానమేల కలుగకపోవలెనందువేని వినుము. యౌవనవంతునికేకాదశవిధము లగునింద్రియములనుండి జ్ఞానము గలిగినట్లు గర్భమందుఁగాని,యతిబాల్యమందుఁగాని, యున్నవానికిఁగలుగదు అమవసనాఁడు చంద్రుఁడున్నను గళలు పుష్కలముగా లేక పోవుటవలనఁ గాంతి కలుగనివిధమున గర్భస్థునికిని బాలునికిని నాయాయింద్రియము లున్నను శక్తిసంపన్నములు కానిహేతువుచే జ్ఞానము గలుగదు. ఓయీ! గర్భాదులం దింద్రియములున్నను వ్యాపారములు కలుగవని చెప్పితివి. అట్టివ్యాపారము లేనిచో సంసారమే సంభవింపదని ప్రశ్నింపఁదగదు.శబ్దాదివిషయములను భూతములు కాకపోయినను, నావిషయములను ధ్యానమునకుఁ దగినసంస్కారము కలవానికిఁ గలయందుఁ గాంచినపదార్థములు మేల్కనియున్నపుడు లేకపోయినను స్వప్నజ్ఞానముచే సూచితము లగుసుఖదుఃఖాదులు నివర్తింపక కలుగుచున్నట్టుగానే సంసారముఁ గలుగును.కాని నివర్తింపదు. ఓరాజేంద్రా!నీవడిగిన ప్రశ్నములకుత్తరంబు నిచ్చితిని. దేహాత్మలయాకారమును వివరించెద వినుము. పంచభూతములును, బంచప్రాణములతోఁ గూడిన యేకాదశేంద్రియంబులును, సత్వాదిగుణములును గలి

గియున్నది దేహ మనఁబడుచున్నది. చేతనాయుక్తమై "అహం అహం" అను జ్ఞానము జీవుఁ డని చెప్పఁబడుచున్నాఁడు. ఈ చెప్పఁబడినలింగశరీరమును గూడి పురుషుఁ డనేక దేహములను స్వీకరించుచున్నాఁడు; విడుచుచున్నాఁడు. ఆ దేహములను బొందునప్పుడును విడుచునప్పుడును ఈ లింగశరీరముచేతనే పురుషుఁడు హర్షమును, శోకమును, భయమును, సుఖదుఃఖములను, బొందుచున్నాఁడు. మఱియు జీవుఁడు, తానాశ్రయించినతృణమును విడిచి మఱియొకతృణమునకుఁ బోనిష్టపడక దానినే దృఢముగా గౌఁగిలించుకొన్న గొంగళిపురుగువలె మరణించుకాలమున శరీరమును విడువక గట్టిగాఁబట్టుకొని యుండును. తనకు దేహాంతరము లభించునంతవఱకును విడువడు. ఓరాజా! ఇంద్రియములచేఁ బూర్వ మనుభూతము లగువిషయములను మనస్సనుధ్యానము సేయుచుఁ బురుషుఁడు కర్మములను మాటిమాటికి నాచరించుచున్నాఁడు. కావున భూతములకు జన్మంబులు కలిగించునది మనస్సే సుమీ? కర్మము లనుసరించి వచ్చుటచే నహంకారమమకారరూప మగునవిద్యవలన నాత్మకు బంధముకలుగుచున్నది. ఆ బంధమును దొలఁగించుకొనుటకుత్రికరణశుద్ధిగా భగవంతుని సేవింపుము. భగవంతునివలననీవిశ్వమునకు సృష్టిస్థితిలయములు కలుగుచున్నవి: కానఁ జిదచిదాత్మక మగునీజగ మంతయు బ్రహ్మాత్మక మని భావించి భజింపుము. ఓవిదురా! భగవద్భక్తులలో ముఖ్యుఁ డయిననారదుఁ డిట్లు ప్రాచీనబర్హికి జీవపరమాత్మస్వరూపమునుఁ దెలిపి యతని వీడుకొని బ్రహ్మలోకమున కేఁగెను. అంతఁ బ్రాచీనబర్హి ప్రజారక్షణాదికమందుఁ బుత్త్రుల నియోగించి తపంబుసేయుటకుఁ గపిలాశ్రమంబున కేఁగెను.

ఆప్రాచీనబర్హి కపిలాశ్రమమం దింద్రియములను వశముగా వించుకొని వివేకవంతుఁడై భగవంతునిపాదపద్మములను ధ్యానించుచు, భగవద్భక్తిచే భగవత్సాధర్మ్యమును జెందెను. దేవర్షియైననారదునిచే నుపదేశింపఁబడిన యాత్మతత్త్వమును వినువాఁడును, వినిపించువాఁడును, సంసారహేతు వయినమనస్సునుండి విముక్తుఁ డగును. మఱియు వాసుదేవుని కీర్తితోఁ గూడినదయి కావుననే లోకమును బవిత్రముగాఁ జేయునదై, నారదునిముఖమువలన వెలువడినదై మనశ్శుద్ధిని గలిగించునదై సర్వోత్కృష్టఫలము నిచ్చునదై యున్నయాత్మతత్త్వమును జదువువాఁడు సంసారమునఁ బడ నేరఁడు. ఓవిదురా! అత్యద్భుతమును, బరోక్షవాదమును గలిగినదియు నగునధ్యాత్మతత్త్వమును నీకుఁ జెప్పితిని. మఱియు జీవునికి గృహస్థాశ్రమము వలనఁ గలిగినసంసారమును జెప్పితిని. పరలోకమువిషయమై కలిగినసంశయమునుఁ దొలఁగించితిని'' ఇది యిరువదితొమ్మిదవ యధ్యాయము.

అని పల్కిన మైత్రేయునకు విదురుం డిట్లనియె. 'ఓమునీంద్రా! ప్రాచీనబర్హి కుమారులు రుద్రుఁ డుపదేశించిన స్తోత్రముచే హరిని సంతోషింపఁజేసి యేమిఫలమును జెందిరి? ఆలోచింప స్వేచ్ఛగా రుద్రుని దర్శించి యతనిచేత ననుగృహీతులై ప్రచేతసులు నిశ్చయముగా మోక్షమును బొందకపోరు. అంతకుఁ బూర్వము వారిలోకమునఁగాని పరలోకమునఁగాని యేమిఫలమును బొందిరి?' అని యడిగినవిదురునకు మైత్రేయుం డిట్లనియె. 'ఓవిదురా! ప్రచేతసులు తండ్రియనుమతిని బొంది సము

ద్రజలమధ్యమునఁ దపం బొనరించి నిరంజనుఁ డయినపరమపురుషుని సంతసింపఁ జేసిరి. వారిట్లు పదివేలసంవత్సరములు తపంబు చేయఁగా నంతమందుఁ బరమపురుషుఁడు వారితపఃక్లేశమును గాంతిచే నివారించుచు శుద్ధసత్త్వమయ మయినశరీరమును దాల్చి గరుడునిస్కంధమున మేరుశిఖరమున నున్ననల్లనిమేఘమున కెనవచ్చుచుఁ, బచ్చని పట్టువస్త్రమును ధరించి, కౌస్తుభరత్నము గళమందుఁ బ్రకాశించుచుండఁగా దిక్కులను బ్రకాశింపఁ జేయుచుఁ దళతళలాడు కనకమయభూషణంబులచేఁ గపోలవదనములు మెఱయ, శిరంబునఁ గిరీటము ధగధగలాడుచుండ, శంఖచక్రాదు లగు నెనిమిదియాయుధములను ధరించి తనయనుచరులతోను మునులతోను గూడికొని, సురేంద్రాదులచే సేవింపఁబడుచు, గరుడులచేతను గిన్నరులచేతను గీర్తింపఁబడుచుఁ బ్రత్యక్ష మాయెను ఇట్లు పరమపురుషుండు ప్రత్యక్షమయి, బలిసినయెనిమిదిబాహువులమధ్యమందును నున్నలక్ష్మితో స్పర్ధచేయుశోభ గలవనమాలతోఁ బరివృతుఁడై సదయుఁ డయి ప్రపన్ను లయినప్రచేతసులను గూర్చి మేఘనాదగంభీరము లయిన భాషణంబుల ని ట్లనియె. 'ఓరాజనందనులారా ! మీకు భద్ర మగుఁగాక. మీరు స్నేహముచేఁ దుల్యధర్ము లయియున్నారు. మీమిత్రభావముచే నేసంతుష్టుఁడ నైతిని. మీకుఁ గావలసినవరమును వేఁడుఁడు. ఇచ్చెదను. సాయంప్రాతఃకాలములందు శయ్యయందు మిమ్మును స్మరించువాఁడు తనసోదరులందుఁ దనయాత్మయందువలెనే ప్రీతి నుంచును. మఱియు భూతములను దయతోఁ జూచును. రుద్రుఁ డుపదేశించినస్తోత్రముచే సమాహితచిత్తులై నన్ను స్తోత్రముచేయువారి కభీష్టవరములను మంచి

ప్రజను నొసంగెదను. మీ కిష్టవరముల నిచ్చెద నని వేఱ చెప్ప నేల? మీరందఱును సంతుష్టులై జనకాజ్ఞను దలఁదాల్చి యున్నారు. అందువలనఁ గమనీయ మయినమీకీర్తి లోకములందు వ్యాపించును. మీకు గుణప్రసిద్ధుఁ డగువిశ్రుతుఁ డనుకుమారుఁ డుదయించును. అతనిసంతానముచే ముల్లోకంబులును నిండును. పూర్వము కండుఁడు తపం బొనరింపఁగా విఘ్నము చేయుటకుఁ బ్రేరితురాలగుప్రమ్లోచతో భోగించెను. అంత నామె కొకకన్యక కలుగఁగా నామె స్వర్గమునకుఁ బోవుచు నాకన్యను వృక్షములందు విడువఁగా వృక్షము లాపిల్లను దమకుమారికగా భావించుకొనెను. ఆపిల్లది యొకప్పు డాఁకలిచే నేడ్చుచుండఁగా,వనస్పతుల కధిపతి యగుసోముఁడు వచ్చి యమృతమును స్రవించుచున్న తనచూపుడువ్రేలి నామెనోటిలో నుంచెను. ఆపిల్లది యమృతమును పానముచేయుటచేతను, నచ్చరగర్భంబునఁ బుట్టినదగుటచేతను,మిక్కిలిసౌందర్యవంతురాలయ్యెను. మీరు మీతండ్రిచేఁబుత్త్రులఁ గనుట కాజ్ఞప్తులయితిరి. కావున మీ రందులకయి యుత్కంఠించుచు భర్తనుగోరుచున్న యాకన్యను బెండ్లియాడుఁడు. ఆలస్యము చేయకుఁడు "మాకందఱికి నొక్కభార్యయగుట ధర్మవిరుద్ధ" మని తలంపకుఁడు. మీ రందఱును బృథగ్భావము లేక యొక్కనివలెఁ జరించుచున్నారు. శేషబుద్ధి లేనియామె మిమ్ము భర్తలఁగాఁ గొని మీయందుఁ జిత్తముంచి భార్యయై పరిచర్యచేయును. మీధర్మశీలముచేతను నావాక్యముచేతను ధర్మవిరోధము సంభవింపదు. మీ రామెతోఁ గూడి యమితమైనయింద్రియశక్తి గలిగి వేయిదివ్యవత్సరంబులకాలంబును నీలోకసుఖముల ననుభవింపుఁడు. అనంతరము మీ రవ్యభిచారిణి

యగుభక్తి గలవారయి కామాదిదోషములను దహించి సంసారమును వదలి నాలోకమును బొందుదురు. భోగాసక్తుల మయిన మాకు నీభక్తి లంభించు టెట్లని సంశయింపకుఁడు. మీరుగృహస్థాశ్రమమం దున్నను ఫలాపేక్ష లేకుండఁగర్మము లాచరించుటచేతను, నాకథలను వినుచుఁ గాలమును బుచ్చువా రగుటచేతను, గృహస్థాశ్రమము మీకు బంధకము గానేరదు. మత్కథలను వినువారికి సంసారబంధ మేల యుండదన్నచోఁ జెప్పెదను వినుఁడు. సర్వజ్ఞుఁడ నగునేను మత్కథాశ్రవణము చేసినవారి హృదయము నూతనగృహమునువలెను బ్రవేశింతును. మఱియు నన్నుఁ బొందువారికి శోకమోహాదులు గలుగవు. అట్లు మత్కథాశ్రవణము చేయువారికి బ్రహ్మసాక్షాత్కారముతప్పక కలుగును. అని యిట్లు పలుకుచుఁ బురుషార్థముల కాధారుఁడయినజనార్దనునికి మ్రొక్కి బద్ధాంజలు లయి, ప్రచేతసులు శ్రీహరిసందర్శనమువలనఁ గామక్రోధాదులను విడిచి యిట్లు నుతించిరి. దేవా! ఆధ్యాత్మికాదితాపత్రయమును నశింపఁ జేయు

ప్రచేతసులు నారాయణుని నుతించుట.

వాఁడవై, నుదారగుణములచేతనుఁ బవిత్రనామములచేతను, నిరూపింపఁబడునీకు వందనంబులు. వాఙ్మానసంబులకుఁ గనబడక సర్వేంద్రియములకును గోచరుండవు గాకయున్ననీకు నమస్కారములు. నీవు కర్మోపాధులు లేనివాఁడవు. ఊర్మిషట్కము లేనివాడవు. దేవా! స్వస్వరూపజ్ఞానము లేకపోయినను భగవత్ప్రసాదమువలన దేహాత్మజ్ఞానసంపన్ను లయినజీవులకు నీవు నిరతిశయ ప్రియుండవు. జగముయొక్క సృష్టిస్థితిలయములను జేయ నెంచి స్వసంకల్పముచే లయోత్పత్తులనిమిత్తము శివబ్రహ్మస్వరూపుఁడ

వయి పాలనకొఱకు స్వేచ్ఛచే నప్రాకృతదివ్యమంగళవిగ్రహము దాల్చినవాఁడవు. అట్టినీకు నమస్కారములు. ఓపరమేశ్వరా! నీవు సంసారబంధమును హరించువాఁడవు. నీవు నిష్కల్మషమగుబుద్ధికి గోచర మగువాఁడవు. నీవుసర్వభూతములందును వసించువాఁడవు నీవు భక్తులకుఁ బ్రభువ వయి యానందము కలిగించువాఁడవు. అట్టినీకు వందనంబులు. ప్రపంచకమున కుత్పత్తిస్థాన మగుపద్మమును నాభియందుఁ దాల్చినవాఁడవు. పద్మములచేఁగూర్పఁబడి నమాలచేఁ బ్రకాశించువాఁడవు. నీవు కమలములవలె మృదులము లగుపాదములు కలవాఁడవు. పద్మములవంటినేత్రములు గలయోకృష్ణా! నీకు నమస్కారములు. ఓపరమేశ్వరా! నీవు పద్మకింజల్కములవలెఁ బచ్చనైనవస్త్రమును ధరించినవాఁడవు. నీవు సమస్తభూతములందును వసించినవాఁడవు. అట్టినీకు నమస్కారములు చేయుచున్నాము. ఓజగన్నాథా! తాపత్రయాతురుల మయినమాకు సమస్తదుఃఖంబులను నశింపఁజేయునీస్వరూపమును జూపితివి. ఇంతకంటె నితరమయినపెద్దదయ యేది కలదు. ఓక్షేమంకరా! "వీరు నావారు" అని బుద్ధిచే నుచితకాలమందు మమ్మును స్మరించుట యేది కలదో, యదియే దీనవత్సలు లయినప్రభువులకుఁ బ్రథమకర్తవ్యము. ఓదేవా! భవదీయస్మరణముచే సమస్తపాపములును నశించుచున్నవి. ఓమహాత్మా! మాహృదయములం దంతరాత్మ వై యున్ననీవు మాకోర్కెల నేల తెలిసికొనఁజాలవు? మోక్షసాధనముల నుపదేశించు నీవు మాకుఁ బ్రసన్నుండ వగుటయే మా కిష్టవరం బని తలంచుచున్నాము. అయినను బ్రకృతిపురుషవిలక్షణుఁడ వయిననిన్ను నొకవరము నడుగుచున్నాము. ఓనాథా! నీవిభూతులకుఁ బారము

లేదు. కావుననే నీ వసంతుండ వని పిలువఁబడుచున్నావు. మందారపుష్పములమకరందము లభించుచుండఁగానన్యమధురసమును ద్రావనొల్లనితుమ్మెదవలె మేము నిరతిశయసుఖదాయక మగునీచరణమూలమునుఁ బొంది యితర మగుదానిని గోర నిష్టపడము. అంతకంటెఁ గోరఁదగిన దేది కలదు? నీమాయచే మోహితుల మై సంసారమందుఁ దిరుగుచున్నంతకాలమునుభగవద్భక్తులస్నేహము కలుగునట్లు చేయుము. ఇదియే మాకోరెడివరము. ఓయీ! రాజ్యభోగములను గోరక యీవర మేల కోరితిమని యందు రేని వినుము. నీభక్తులస్నేహలేశముతో స్వర్గాదిసుఖములయినను సరిపో వని తలంతుము. అట్లుండ మరణశీలము లగు రాజ్యభోగాదులతోఁ బని యేమి? భక్తులు పాతకములను దొలంగించు నీకథలను దఱుచుగఁ జెప్పుచుందురు. వానిని వినువారికి భోజనేచ్ఛ యుండదు. భూతములందు వైర ముండదు. ఏవిధ మయినభయమును గలుగ నేరదు. ఆసత్కథలందు ముక్తసంగులచే మాటిమాటికిని సన్న్యాసులకు నారాయణుఁడే గతి యని చెప్పఁబడును. మఱియు గంగాదినదులనుఁ బవిత్రముచేయఁ దలంచి కాలినడకను సంచరించుచున్న నీభక్తులసమాగమము సంసారభీతుఁ డగుపురుషున కెందులకు రుచింపదు? తాదృశభక్తసహవాసఫలము మా కనుభూత మైనది. సంసారమృత్యువును దొలఁగించువాఁడును, నీకుఁ బ్రియతముఁడును నగురుద్రునిక్షణమాత్రసమాగమముచేతనే సంసారనివారకుఁడ వగునిన్ను శరణుపొందఁగలిగితిమి. ఓదేవా! మేము సంతతము పరిచర్యచేయుటచే బ్రాహ్మణులు, వృద్ధులు, గురువులు, మాకుఁ బ్రసన్నులైరి. అట్టి వారికందఱకు మే మెల్లప్పుడును నమస్కరించుచుందుము.

మిత్రాదు లందఱును మే మసూయ లేక వర్తించుటచేఁ బ్రసన్నులయిరి. అన్నము లేనివారి కన్నదానాదులు చేయుటవలన వారునుఁ బ్రసన్నులయిరి. మఱియు మేము చాలఁగాలముజలమధ్యంబునఁ దపంబు గావించితిమి. ఈసమస్తమును బరమపురుషుఁడ వగునీసంతోషముకొఱకు గాక. ఓపరమేశ్వరా! మనువు, బ్రహ్మ, జ్ఞానాదిసంపన్నుఁ డగునీశ్వరుఁడు, మఱియుఁ దక్కినమునులును, కర్మయోగజ్ఞానయోగములచేఁ జిత్తమును శుద్ధముగాఁ జేసికొని నీమహిమను బూర్తిగాఁ దెలియలేకపోయినను స్వశక్తికొలఁదిని నుతించునట్లుగా నే మేమును మాశక్త్యనుసారముగా నుతించితిమి. సకలభూతములందును సమదృష్టి గలిగి పాపాదిరహితుఁడ వయి, పరమపురుషుఁడ వయి, శుద్ధసత్త్వమూర్తి వగునీకు నమస్కారములు." అని యిట్లు ప్రచేతసులు చేసినస్తోత్రమునకు సంతసించి పరమపురుషుండు వారు కోరినవరములనొసంగి,స్వసౌందర్యాదుల ననుభవించినవా రగుటచే నేత్రములు తృప్తి పొందకపోవుటంబట్టి ప్రచేతసు లాతనిగమనమున కిష్టపడకయున్నను మానక, స్వలోకమున కేఁగె. అంతటఁ బ్రచేతసులు సముద్రజలమును వెడలి ప్రాచీనబర్హి ముక్తుఁ డగుటచే కృష్యాదులు లేక స్వర్గము నావరించునట్లు పెరిఁగినవృక్షములచే నావృత మగుభూమిని గాంచి మిగులఁ గోపము గలవారైరి. ఇట్లు గోపించి వారు ప్రళయకాలమందు నాశనముచేయ వెడలిన యగ్నివాయువులవంటి యగ్నివాయువులను భూతలమందు వృక్షములు లేకుండఁ జేయుటకు స్వముఖములనుండి విడిచిరి. ప్రచేతసు లిట్లు చెట్లను భస్మముచేయుచుండఁగా బ్రహ్మ చూచి, వారిని సమీపించి యుక్తులచే వారికోపమును శమింపఁజేసెను.

ఇట్లు వారు శాంతినిఁ బొందియుండఁగా వృక్షాభిమానిదేవతలు మిగుల భయపడి బ్రహ్మోపదేశమువలనఁ దమకన్యకను వారికొసంగిరి. అంతటఁ బ్రచేతసులు మారిష యనునామము గల యాకన్యను బెండ్లాడి యామెయందు నీశ్వరతిరస్కారమువలన జన్మమునొంద నున్న బ్రహ్మకుమారుని కుమారునిఁగాఁ బడసిరి. ఆబ్రహ్మకుమారుఁ డెవఁడని యందువేని వినుము. చాక్షుషమన్వంతరకాలమునఁ గాలముచే సమస్తముపసంహృతము కాఁగా దైవముచేఁ జోదితుఁ డయిప్రజలను సృజించినదక్షుఁడే యని యెఱుంగుము. ఆపిల్లవాఁడు స్వకీయకాంతులచే సకలతేజస్వుల తేజస్సులను నాచ్ఛాదించెను. పరతేజస్సుల నాచ్ఛాదింపఁ దగిన సామర్థ్యము కలవాఁ డగుటచే వానిని దక్షుఁడని పిలువసాగిరి. బ్రహ్మ యతనిఁ బ్రజలను సృజించుటకును, రక్షించుటకును నియమించెను. అంతట నాదక్షుఁడు మరీచ్యాదిప్రజాపతులను నావ్యాపారమందునియమించెను. ఇది యిరువదితొమ్మిదవయధ్యాయము.

ఓవిదురా! ప్రచేతసులు వేయిదివ్యవత్సరములకాలము గతించినపిమ్మటఁ బూర్వము వాసుదేవుండు పలికినవాక్యమును స్మరించుకొని భార్యాపోషణాదికమును గుమారున కప్పగించి గృహస్థాశ్రమమును విడిచిరి. వార లిల్లువిడిచి పూర్వము జాజలి యనుఋషి సిద్ధిపొందిన పశ్చిమసముద్రతీరంబును జేరి సర్వాత్మకుఁ డగుబ్రహ్మము నుపాసించిరి. మఱియు వారు ప్రాణవాయువును మనస్సును వాక్కును నియమించి చిరకాల మొకచోఁగూర్చుండ సమర్థులయి మూలాధారము మొదలుగాఁ గలకాయమును ది

న్నగా నిగిడించి బ్రహ్మమందుఁ దమయాత్మను సమర్పించి యున్న సమయమున సురాసురులచే సన్నుతుఁ డగునారదుండు చూడ నేతెంచెను. అట్లు వచ్చుచున్ననారదునిఁగాంచి ప్రచేతసులు లేచి

నారదుండు ప్రచేతసులయొద్దకు వచ్చుట.

నమస్కరించి యతనిఁ గీర్తించి యథావిధిగాఁ బూజించి మెత్తని యాసనమునఁ గూర్చుండ నియమించి యిట్లనియె. 'ఓనారదా! నీకుఁ గుశలమా? దైవవశమువలన నిన్నుఁ జూడఁగంటిమి. సూర్యగమనము సమీహితము లగుసాధనములను జేయుచు లోకరక్షణము చేయుచున్నట్లు నీగమనము ముక్తిసాధనముల నుపదేశించి లోకరక్షణము చేయుచున్నది. ఓనారదా! గృహస్థాశ్రమమం దుండుటచేఁ బూర్వము రుద్రుఁడును వాసుదేవుఁడును జెప్పినతత్త్వమును మఱచితిమి. శీఘ్రకాలములోనే యీసంసారసాగరమును దరింపఁజేసెడి యాబ్రహ్మజ్ఞానముఁ బ్రకాశింపఁజేయుమా!' అని యిట్లు ప్రచేతసులచే నియమితుఁ డయి భగవ

నారదుఁడు ప్రచేతసులకుఁ దత్త్వ ముపదేశించుట.

దర్పితచిత్తుఁ డయిననారదుండు మననశీలు రయినప్రచేతసుల కిట్లనియె. 'ఓప్రచేతసులారా! మానవులజన్మము, ఆజన్మమందు చేయుకర్మములు, ఆయుఃవు, మనస్సు, వాక్కులు, మొదలగు వానిచే నీశ్వరుఁ డారాధింపఁబడినప్పుడే జన్మకర్మాదులు సార్థకము లగుచున్నవి. ఆభగవంతుని సంతసింపఁజేయలేనిచో, శుక్లజన్మము, ఉపనయన సంస్కారమువలనఁ గలిగినజన్మము, యాగదీక్షచేఁ గలిగినజన్మము, నాఁబడు నీమూఁడుజన్మములతో నేమి ప్రయోజనము? భగవంతుని సంతసింపఁ జేయలేని మానవుని దీర్ఘాయుర్దాయ మేల? వేదోక్తము లయినకర్మము లేల? కుల

మేల? వాగ్విలాస మేల? చిత్తవృత్తులేల? శ్రేయస్సాధనము లగు నన్యవ్రతములేల? నిపుణమయినబుద్ధి యేల ? ప్రాణాయామాది యోగములేల? దేహాదివ్యతిరిక్త మగు నాత్మజ్ఞాన మేల? ఇంద్రియపాటవ మేల? సన్న్యాసమేల? అధ్యయనమేల? హరి యందు నకును నిరతిశయప్రీతివిషయుండగుటచేతను, స్వాత్మపర్యంతము గలపురుషార్థమును నిచ్చువాఁ డగుటచేతను, నతఁడే సకలశ్రేయస్సులకు నవధి. ఓరాజనందనులారా! వృక్షమూలము దడిపినచో నానావిధములుగా నున్నశాఖోపశాఖలు తృప్తిపొందునట్లును, భోజనము చేయుటవలన సర్వేంద్రియములు తృప్తిచెందునట్లును, సకలదేవతలకు మూలమగు పరమేశ్వరు నారాధించితృప్తిపొందించిన సకలదేవతలనుదృప్తిపొందించినవారమే. వర్షాకాలమందు సూర్యునివలన జల ముద్భవించి మగుడ గ్రీష్మమందు సూర్యునిఁ బ్రవేశించుచున్నవి. స్థావరజంగమాదులు భూమియం దుద్భవించి భూమియందే లీన మగుచున్నవి. అట్లె సత్త్వాదిగుణపరిణామమువలనఁ గలుగుప్రపంచము కారణభూతుఁడగుహరివలనఁ గలిగి మగుడ నతనియందే లీనమగుచున్నది. సూర్యునికాంతివలెనే పరమాత్మకు వాసస్థాన మగునీజగంబుపరమాత్మకు శరీరతుల్య మైనది. సూర్యునికిని నతనికాంతికిని నెట్టిసంబంధ మున్నదో, పరమాత్మకును జగంబునకు నట్టిసంబంధమున్నది. భగవంతునియీ జగచ్ఛరీరము సృష్టిదశయందు స్థూలముగాఁ బ్రకాశించును. సంహారదశయందు సూక్ష్మముగఁ బ్రకాశించును. ద్రవ్యము నిత్యము గావున దాని కెప్పుడును నాశనము లేదని తలపోయుఁడు. ఇంద్రియము జాగ్రదవస్థయందుఁ బనిచేసి దేవమనుష్యాదిదేహాత్మభ్రమము లేని నిద్రావస్థయందు

నివృత్తవ్యాపారము లయినట్లు జగం బొకమాఱు వ్యాపారవంతమై యొకపరి నిర్వ్యాపారమై యుండును. ఓరాజులారా! ఆకాశమం దొకప్పుడు మేఘములు, చీఁకటి యొకప్పుడును, గాంతియొకప్పుడును, వర్తించుచు, నొక్కొక్కప్పు డట్లు చేయమానును. అట్లు ప్రవాహరూపము లగురజస్తమస్సత్త్వగుణరూపము లగుశక్తులు కార్యోపయోగు లయి పరబ్రహ్మమం దొకప్పుడు ప్రకాశించి యొకప్పుడు మానును. కావున స్థూలత్వసూక్ష్మత్వములయిన నుబరమాత్మ నాశ్రయించిన ప్రకృతిపురుషాత్మక ద్రవ్యము నిత్యమై పరమాత్మకు శరీరభూత మగుటచే, సకలదేవాలలకు నాత్మయై కాలశరీరకుఁ డయి, ప్రకృతిపురుషశరీరకుఁ డయి, స్వతేజస్సుచేఁ ద్రిగుణప్రవాహము నెండించుచు బ్రహ్మాదులకుఁ గూడఁ బ్రభు వయినయీశ్వరుని భజింపుఁడు. మఱియు నతఁడు సుఖదుఃఖాదివికల్పము లేనివాఁడు. అతఁడు సజాతీయ మయిన మఱియొకవస్తువు లేమిచే నిస్సముఁ డయి నిరవధికుఁడై యున్నాఁడు. అతఁడు దేవమనుష్యాదిభేదబుద్ధి నశించినతోడనే ప్రత్యక్షమగువాఁడు. అతని కెప్పుడును జడస్వరూపము లేదు. అతఁ డెప్పుడును నిత్యానందుఁ డయి వఱలుచుండును. అతని కాద్యంతములు లేవు. కావున మీరు పూర్వోక్తజ్ఞానముచే నాపరమేశ్వరుని భజింపుఁడు. మఱియు సర్వభూతదయచేతను దైవవశమువలనఁ బ్రాప్తము లగునన్నాదులచేతను, అంతరింద్రియములను బాహ్యేంద్రియములను నిరోధించుటచేతను, నారాధించినచో భగవంతుఁడు తుష్టిఁ జెందును. సకలకామములను విడిచి యమల మగుచిత్తము గలిగి వర్తించువారిమనంబులందు సంతతము వర్ధిల్లుభక్తిచేత సమీపముగాఁ గొనిరాఁబడిన భగవంతుఁడు

తన్ను నాశ్రితులకు వశము గావించుచు వారిహృదయముల నుండి యెప్పుడును వెడలి చనఁడు. అధనులకును, నాత్మధనుల కును, భగవంతుఁడే ధనముగాఁగల వారికిని బ్రియుఁ డయినశ్రీ హరి విద్యాదులవలనఁ గలిగినగర్వముచే నంధులై భగవద్భక్తు లను దిరస్కరించెడుకుత్సితపురుషులపూజను గ్రహింపఁడు. భగ వంతుఁడు తన్ను ననుసరించి వచ్చులక్ష్మిని, నాలక్ష్మీకటాక్షలేశము ను గోరునింద్రాదులను విడిచి భక్తులందుఁ బ్రేమ గలిగి వారి ననుసరించి వర్తించు చుండును. భక్తులం దట్టివాత్సల్యముగలిగి పరిపూర్ణ మగుసకలకామములు గలవాఁడయి యున్నభగవం తుని భజింప రసజ్ఞుఁ డగుమనుజుఁడు మానునా?' అని యిట్లు నారదుండు ప్రచేతసులకాత్మతత్త్వము నుపదేశించి యన్యము లగుభగవత్కథలను జెప్పి బ్రహ్మలోకమున కేఁగెను. అంతఁ బ్ర చేతసులు నారదునిముఖమువలన గళితమై సకలదోషహార మై యున్నభగవత్కీర్తిని విని భగవంతునిచరణములను సేవించుచు వైకుంఠముం బొందిరి. ఓవిదురా ! నీ వడిగిననారదప్రచేతసుల సంవాదమును దెలిపితిని.' అని మైత్రేయుండు విదురునకుఁ జెప్పెనని చెప్పి శ్రీశుకుండు రాజున కిట్లనియె. 'ఓరాజా ! నీ వడిగినయుత్తానపాదునివంశమును బ్రియవ్రతునివంశమును వర్ణించితిని. దానినిఁ జక్కఁగవింటివి కదా! ఓయీ ! ప్రియవ్ర తుఁడు మొదట విరక్తుఁడై వనమున కేఁగి నారదునివలనన ధ్యా త్మతత్త్వమును బొంది,మగిడి వచ్చి భూమిని బాలించి, తనయై శ్వర్యమును విభజించి కుమారుల కిచ్చి భగవత్పదమును జెందె ను. ఓరాజా ! ఇట్లు మైత్రేయుండు వినిపింపఁగా భగవంతునిగు ణావాదమును, గాథలను విని విదురుండు వృద్ధిఁజెందిన స్నేహ

భావముచేఁ గన్నులనుండి బాష్పముల విడుచుచు, మైత్రేయుని చరణములకును భగవంతునిచరణములకును నమస్కరించి యిట్లనియె. "ఓమైత్రేయా! దయాళుఁడ వయిననీవలన నేను సంసారసాగరమును దాఁటితిని. సంసారమందువర్తించువారి కగమ్యుఁడయిననారాయణుండు దర్శితుఁ డయ్యెను." అని పలుకుచు విదురుండు జ్ఞానముచే నిండినమానసము గలవాఁడయితనజ్ఞాతులను జూచుతలంపుతో హస్తినాపురమున కేఁగెను. ఓపరీక్షిన్నరేంద్రా! భగవదర్పితచిత్తు లైనవిదురమైత్రేయులు చెప్పుకొనిన స్వాయంభువమన్వాదులచరిత్రమును వినిన నాయుర్దాయమును, ధనమును, గీర్తినిఁబొంది తుదకు ముక్తిని గాంచును. ఇదిముప్పదవ యధ్యాయము.

ఇది ఆంధ్రవచనభాగవతమునఁ జతుర్థస్కంధము.

శ్రీకృష్ణార్పణ మస్తు.

శుభమస్తు.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్రభాగవతము

పంచమస్కంధము.

పరీక్షిన్నరేంద్రుండు శుకమహామునిం గాంచి "ఓమునిచంద్రమా! *ప్రియవ్రతుండు నారదునివలన నాత్మజ్ఞానము నొందియు మగుడ రాజ్యపాలనం బొనర్చె నని చెప్పితివి. ఆప్రియవ్రతుండు భగవద్ధర్మములం దాసక్తిగలవాఁడు. ప్రకృతికంటె వేఱయిన యాత్మేశ్వరుల తత్త్వమం దనుభవము కలవాఁడు. అట్టి

---

* పూర్వస్కంధమున రాజు శుకుని స్వాయంభువమనువువంశమును జెప్పుమనియడుగఁగా నాముని యతని వంశమును బ్రారంభించి యతని కూఁతుల వంశమును నతని పుత్రులయిన యుత్తానపాదుఁడు ప్రియవ్రతుఁడనువారిలోఁ బెద్దవాఁ డయిన యుత్తానపాదుని వంశమును జతుర్థస్కంధము కడపటివఱకుఁ జెప్పెను. రాజంతకుఁ దాను వినఁగోరినది యంతయు నించుమించుగా విని యైనను దను తలంపునఁ బ్రియవ్రతుని చరిత్రమును విశేషించి యడుగఁడయ్యెను. ఇట్లుండఁగా శుకుఁ డా స్కంధము కడపట 'యో నారదాదాత్మవిద్యామధిగమ్య పునర్మహీం । భుక్త్వా' అని ప్రియవ్రతుఁ డాత్మవిద్య నారదునివలన నధిగమించియు మరల భోగము ననుభవించినాఁడని చెప్పఁగా నాత్మవిద్య నధిగమించినవానికి మరల విషయభోగము ఘటించుట యెట్లని రాజడుగుచున్నాఁడని పూర్వోత్తరకథాసంగతిని యిటఁ దెలియునది.

వాఁడు దారపుత్త్రాదులచే నిండి దుఃఖోపాదక మైయున్నగృహస్థాశ్రమ మవలంబింప నెట్లంగీకరించెను? అందువలనఁ గర్మబంధమును, దానివలన జ్ఞానసంకోచమును గలుగక మానునా? కావున, ముముక్షువునకుఁ గర్మబంధంబును, వసంకుచితజ్ఞానము కలవానికి జ్ఞానసంకోచమును గలిగించు గృహాసక్తి† యాత్మారాముల కెంతమాత్త్రంబును దగదు. ఓద్విజశ్రేష్ఠా! దేహమందును, దారపుత్త్రాదులందును, గేహమందును నభినివేశము విడిచి యాత్మారాము లయినభగవద్భక్తులకు మగుడ గృహస్థాశ్రమమునం దభినివేశము గలుగుట తగ దని నిశ్చయముగాఁ జెప్పవచ్చును గదా! తాత్కాలికసుఖ మున్నది కావున నభినివేశముండరాదా యని సంశయింపఁ బనిలేదు. భగవత్పాదసేవ నిరతిశయానందంబును గల్గించును. తాపత్త్రయంబును నివారించును. తాదృశభజనానుభవముచే నిత్యసుఖ మనుభవించు మహాత్ములకు నల్పసుఖహేతు వయినసంసారమం దభినివేశము గలుగుట యనుచితము. పురాతనకర్మబంధవశమువలన గృహాసక్తి గలుగుఁగాక. అట్లయినను భగవద్భక్తియు, నందువలని ముక్తియు నేల కలు

---

† ఆత్మారాముఁ డనఁగా ఆత్మయే ఆరామముగా అనఁగా నారామమువలెఁ గ్రీడాస్థానముగాఁ గలవాఁడని యర్థము ఆత్మస్వరూపమందే క్రీడించువాఁడనుట. ఆత్మస్వరూపమే రమించుటకు స్థానమగుట యెట్లన్ననో నది వికారయుక్తమై దుఃఖాదిమిశ్ర మైనప్రకృతికంటె వేఱయినది. మఱిబ్రహ్మమునకుఁ దానుశరీరమగుటచే బ్రహ్మమే తనకు నాత్మగాఁ గలది. ఇట్లు ప్రకృతికంటె వేఱయి: బ్రహ్మాత్మకమయిన యాత్మస్వరూపము అసంకుచితజ్ఞానాకారమును ఆనందైకతానమగుటచే దానియందే రతి గలవాఁడు తక్కినగృహాదులందు రతి నొందఁ డని భావము.

గఁ గూడదని శంకింపఁ దగదు. దారసుతాదు లగునను బంధము లందు సక్తచిత్తుఁడైనవానికిఁ బరమేశ్వరునియందు భక్తియు, నవిచ్ఛిన్నమైనముక్తియు, సంభవించుట యసంభవము. అట్టిది ప్రియవ్రతున కెట్లు సంభవించినదో యని గొప్పసంశయము బాధించుచున్నది" యని యడిగిన నరేంద్రునకు మునీంద్రుం

ప్రియవ్రతోపాఖ్యానము.

డిట్లనియె. "ఓ రాజా! సత్యము వచించితివి. కాని యందొక్క విశేష మున్నది. స్వాయంభువాదుల ప్రార్థనముచేఁ బ్రియవ్రతుఁడు గృహస్థాశ్రము నవలంబించెను గాని యతని కందభినివేశము లేదు. జ్ఞానులకు గృహాదులం దభినివేశము గలుగదని చెప్పిన నీవచనము సముచితమైనది. కాని యాత్మారాముఁడు గృహాసక్తుఁడైనచో భక్తి నశించు నని చెప్పినది యుక్తము కాదు. దానికిఁ గారణము చెప్పెదను వినుము. బ్రహ్మాదులచే నుతింపఁబడు భగవంతుని పాదపద్మమునందలి మకరందమును దనివిదీఱఁ గ్రోలుటచే మదించినచిత్తము గలవా రంతరాయములచే నతికష్టమున నుపహతు లయ్యును బూర్వవాసనచే మోక్షమార్గభూతమగుభక్తిని విడువరు. కావున గృహాసక్తి గలిగినంతమాత్రమున భక్తి కుపసంహారము గలుగుననుట యయుక్తము. మఱియుఁ బ్రియవ్రతుఁడు సర్వోత్కృష్టము లగు భాగవతధర్మములం దాసక్తి గలిగి, నారదుని భజించుటచే హితపురుషార్థముల నొంది తత్త్వజ్ఞానముచే నొప్పుచు "జీవేశ్వరులతత్త్వమును దెలుపు జ్ఞానమం దాసక్తుఁడ నయ్యెద"నని సంకల్పించుకొని యవిచ్ఛిన్నమగుధ్యానముచే భగవంతుఁ డగువాసుదేవునియందే సమస్త కర్తృత్వాదులను, సకలక్రియావ్యాపారములను బొందుపఱి

చుచు, నీతిశాస్త్రజ్ఞుల సాయముచే భూపాలనము చేయు మని తండ్రి యగుస్వాయంభువమనువుచేఁ బ్రార్థితుఁ డయ్యును రాజ్యపాలనముఁ జేకొన్నచోఁ దనకుఁ బ్రకృతిపరిణామరూపము లగు దేహాదులనుండియుఁ దత్ప్రయుక్తములగు రాగాదులనుండియు జ్ఞానసంకోచము కలుగక మానదని యెంతమాత్ర మందుల కంగీకరింపలేదు. జనకునిచేఁ బ్రార్థితుఁడయ్యుఁ బ్రియవ్రతుఁడు రాజ్యపాలనమును దిరస్కరించి యుండఁగా దేవతలలోఁ బ్రథముఁడును ధర్మభూత మగుజ్ఞానముచే సమస్తమును వ్యాపించి సమస్తలోకాభిప్రాయములను దెలిసికొనుచున్న వాఁడును, నగు బ్రహ్మమూర్తిమంతము లైనవేదములవలె వెలయు మరీచ్యాదులచేఁ బరివృతుఁడై సత్యలోకమునుండి భూలోకమున కవతరించెను.

బ్రహ్మ మునిగణములతోఁ బ్రియవ్రతునిపాలి కేఁగుట.

కమలాసనుం డట్లు దిగుచున్నప్పుడు గగనతలమందుఁ జంద్రునివలె బ్రకాశించుచు, బ్రతిక్షణమును దేవేంద్రాదులవలనఁ బూజలు గైకొనుచు సంఘములుగా నున్నసిద్ధులచేతను, గంధర్వులచేతను, సాధ్యులచేతను, గిన్నరకింపురుషాదులచేతను, నుతింపఁబడుచు స్వీయకాంతులచే గంధమాదనపర్వతప్రాంతములను బ్రకాశింపఁజేయుచుఁ బ్రియవ్రతునిసమీపమునకు వచ్చెను. అంతటఁ బ్రియవ్రతునకుఁ దత్త్వోపదేశముచేయ వచ్చియున్ననారదుండు హంసవాహనారూఢుండై మునిగణపరివృతుఁడై వచ్చుచున్నచతుర్ముఖునిఁ జూచి స్వాయంభువప్రియవ్రతులతోఁ గూడ లేచి యెదురుసని పూజించి దోసిలిపట్టి నుతించెను. ఓరాజేంద్రా! ఆకమలాసనుఁడు నారదుఁ డొనరించినపూజకును, స్తోత్రమునకును, గుశలప్రశ్నమునకును మిగుల సంతసించి ప్రియవ్రతునిఁగని

కరవుఁజూపులతోఁ జూచుచు, నిట్లనియె. ఓప్రియవ్రతా! సత్యమగువచనమును దెలుపుచున్నాను. సావకాశచిత్తుండవై వినుము. మేమును, నీవును, నీనారదుండును, మరీచ్యాదులును, ఔక్కేల? యందఱును భగవంతునిశాసనమును మన్నించి యొనరించుట విహితకృత్యము. అతనియనుమతి నుల్లంఘింపఁ దగదు. అట్లు చేసిన నతనియాగ్రహమునకుఁ బాత్రుల మగుదుము. కావున నీ విప్పు డతీంద్రియుఁడై యపరిచ్ఛిన్నుఁడై దేదీప్యమానుండై, యున్న భగవంతునిశాసనమును దిరస్కరించి తదీయాగ్రహంబునకుఁ బాత్రుండ వగుట తగదు. ఇంతియకాక తపంబుచేతఁగాని, శాస్త్రీయజ్ఞానము చేతఁగాని, యణిమాదియోగబలము చేతఁగాని విచారసమర్థ మయినబుద్ధిచేతఁగాని, ధనములచేతఁగాని యాగాదులచేతఁగాని, యంతకంటె నుత్తమమయిన యేసాధనముచేతఁ గాని దేహధారి యాపరమేశ్వరునిశాసనమును మఱియొకవిధముగామార్చుటకైనను సమర్థుండు కాఁడు. ఓప్రియవ్రతా! సమస్తప్రాణిసమూహమును, నుత్తరోత్తరజన్మములందు జన్మనాశములకు నిమిత్తము లగుకర్మములను జేయుటకొఱకును, బ్రియవస్తువులు నశించుటవలనఁ గల్గుదుఃఖముకొఱకును, దేహాత్మభ్రమకొఱకును, స్వతంత్రాత్మభ్రమకొఱకును, భయముకొఱకును, సుఖదుఃఖాబుఃకొఱకును, బ్రాకృతనేత్రములకగోచరుఁ డయినభగవంతునిసంకల్పాయత్త మైన దేహసంబంధమును ధరించుచున్నది. కావున నతని శాసనము మీఱ సామర్థ్య మెవ్వరికిని లేదు. ఓయీ! మానవుఁడు నాసికారంధ్రములం దమర్పఁబడిన బంధనరజ్జువుచే బలీవర్దాదులను సులభముగా వశము గావించుకొనుటఁ జూచుచున్నాము. అట్లె భగ

వంతుఁడు సత్వాదిగుణములు, సాత్వికాదిభేదముచే భిన్నము లయిన వర్ణాశ్రమోచితకర్మములు, నాఁబడు త్రాళ్లచే మనల నందఱను బంధించి వేదాత్మక మైనత్రాటియందుఁ గూర్చుచున్నాఁడు. కావుననే మన మతనికి స్వాధీనులమై సర్వదా పూజల నొనర్చుచున్నాము. ఓయీ! ఒకపురుషునిచే నడపింపఁబడుచు గ్రుడ్డివాఁ డొకప్పుడు నీడను, వేఱొకప్పు డెండను బొందుచున్నారు. అట్లు సర్వేశ్వరుఁ డిచ్చుచున్న వర్ణాశ్రమోచితకర్మములను, దేవమనుష్యాది శరీరములను, గర్మానురూపము లగుసుఖదుఃఖంబులను, సమస్తమును మన మనుభవింపక తీఱదు. కావున మన మిష్టమునుగాని యనిష్టమునుగాని సాధించుకొన సమర్థులము కాము. ఓయీ! దేహాత్మాభిమానము గలవా రగుటచే సంసారులకుఁ బ్రవృత్తిధర్మములఁ జేయుట యుచితమే. కాని నే నాత్మవిద్య నభ్యసించి ముముక్షువు నై యుండఁ బ్రవృత్తిధర్మాచరణము తగునా? యని శంకింపకుము. ముముక్షువైనను నజ్ఞానదశయందువలెనే జ్ఞానదశయందుసైతము ప్రారబ్ధం బగు కర్మ మనుభవించుచు, నట్లయ్యు దేహాత్మాభిమానరహితుఁడై ముక్తుఁ డగుపర్యంతమును దేహమును ధరింపవలెను. అజ్ఞానికింబోలె జ్ఞానికిని దేహధారణకర్మానుభవము లున్నను వారికి గొప్ప భేదము గలదు. అందు జ్ఞాని ప్రారబ్ధకర్మ మనుభవించుటకు మాత్రమే దేహమును ధరించి కర్మానుభవము చేయుచుండును. గాని యజ్ఞానివలె దేహాంతరారంభముకొఱకు నిమిత్తములగు కర్మముల నాచరింపఁడు. కావున నీవు ముముక్షువవైనను బ్రారబ్ధానుభవముకొఱకు దేహమును ధరింపకతీఱదు. అట్లు ధరించినను వన్యములచే దేహధారణముఁ గావించుచు వనమందుండుటయుక్త

ము కానిసంసార హేతువయినగృహంబునందుండుటముముక్షువు నకుఁ దగదని కొందఱు తలంతురు. కాని వనమందున్నను జితేం ద్రియుండు కాక దేహేంద్రియాదులకు వశుండయిన చో మనంబు తోఁగూడి జ్ఞానేంద్రియపంచకము జ్ఞానమునకు విరోధము గల్గిం చి సంసారముసఁ బడవేయును. జితేంద్రియుఁడై కావుననే యాత్మా నుభవము కల్గి వర్తించుపురుషుఁడు గృహాశ్రమగతుఁ డయినను సంసారభయము లేదు. కావున నింద్రియపరవశత్వమే సంసారభ యహేతువు కాని మఱియొకటిలేదు. అట్టియింద్రియజయము విజనమగు వనమందె సంపాదింపఁగలము. కాని యింద్రియాకర్ష కము లయినవస్తువులతో నిండియుండు గృహంబుననుండి సంపా దింపలేమని సంశయింపఁబనిలేదు. లోకమున రాజు దుర్గమునా శ్రయించియే బలిష్ఠు లగుశత్రువులను జయించుచున్నాఁడు. శత్రువులబలము తఱిఁగినపిమ్మట దుర్గమందుండి కాని దుర్గబహి ర్దేశమందుండి కాని యథేష్టముగా సామాన్యులను జయించు చున్నాఁడు. అట్లె విద్వాంసుఁడు ముందుగా గృహమందుండియే బలిష్ఠము లగునింద్రియంబుల జయింప సమకట్టవలెను. ఆయింద్రి యముల బలము తఱిఁగినప్పు డెచ్చటనుండి యైనఁ బూర్ణముగాఁ జయింపవచ్చును. కావున రాజునకు శత్రువుల జయింప దుర్గ మెంత సాయపడుచున్నదో ముముక్షువున కింద్రియాదుల జయిం ప గృహ మంత తోడ్పడుచున్నది. ముముక్షువునకు గృహాశ్రమ మొక నిర్బంధము కాదని యెఱుంగుము. ఓయీ! పరమేశ్వరుని పాదారవిందరూప మైనదుర్గము నాశ్రయించి యింద్రియముల జయింతును గాని యతిహేయము లగుగృహాదుల నాశ్రయించు టకంగీకరింప నని పల్కనఁ బల్కవచ్చును. అది సత్యమే. పద్మకోశ

మధ్యమం దుండినతుమ్మెదను వాతాదిబాధలవలె భగవంతుని పాదారవిందముల నాశ్రయించిన నిన్నింద్రియంబులు బాధింప లేవు. అయినను బరమపురుషుఁడు నిర్దేశించిన భోగముల నీలోకముఁ దనుభవింపుము. పిమ్మట సమస్తసంగములను విడిచి భగవద్భక్తిచే గుణాష్టకస్వభావమును బొందుము పరమపురుషునియాజ్ఞ నతిక్రమించుట తగ" దని యిట్లు బ్రహ్మ పలుకఁగా విని భాగవతోత్తముఁ డగు ప్రియవ్రతుఁడు చతుర్ముఖునిశాసనము తనకు సుకరముగా నుండుటచేతను, దాని నతిక్రమించుటతన కనర్హ మగుటచేతను 'వల్లె'యని బహుమానపూర్వకముగా మన్నించెను. అనంతరము భగవంతుఁ డగుబ్రహ్మయు స్వాయంభువుండు యథావిధిగా నొసంగెడి పూజలను స్వీకరించి ప్రియవ్రతనారదులు సప్రేమముగాఁ జూచుచుండ వాక్కునకును, మనంబునకు గోచరము కాక చిరకాలస్థాయి యైనతనలోకమున కేఁగెను. అంత స్వాయంభువమనువు ప్రియవ్రతుని రాజ్యపాలకునిఁగాఁ జేయువలెనన్న మనోరథము బ్రహ్మదయవలన ఫలించినందుల కానందించి నారదమహర్షి యనుమతిని బడసి ప్రియవ్రతుని ధర్మమర్యాదలు చెడకుండ భూమండలమును బాలింప నాజ్ఞాపించి దుస్తరములైనశబ్దాదివిషయము లనెడివిషయజలము గలతటాకమువలె నున్నగృహమం దుండియు, నానాభోగంబులం దుండియు, మనంబును మరలించుకొనెను. ప్రియవ్రతుండు స్వేచ్ఛచే భగవదారాధనరూప మగుకర్మముల నొనర్చుచు, సకలజగంబుల బంధనంబుల నిర్వర్తించుటచే నుత్కృష్ట మైనప్రభావము గల భగవంతునిపాదపద్మములను సర్వదా ధ్యానించుటచే, రాగద్వేషాదులను విడిచి, నిర్మలాంతఃకరణుఁ డై బ్రహ్మాదులయానతి ననుమతిం

చుటవలన వర్ధిల్లినగౌరవమునఁ దనరారుచు భూమండలమును బరిపాలించెను. అనంతరము ప్రియవ్రతుండు విశ్వకర్ముఁ డను ప్రజాపతి కుమారికను బర్హిష్మతిని వరించి, యామెయందు, సత్స్వభావముచేతను, శౌర్యాదిగుణములచేతను, వ్యాపారముచేతను, సౌందర్యముచేతను, బరులఁ దిరస్కరించుసామర్థ్యముచేతను, దనకు సమానులైనపుత్త్రులను బదుగురను బడసెను. కడపట "ఊర్జస్వతి" యనునొకకుమారికను గనెను. ఆపదుగురు పుత్త్రులును "ఆగ్నీధ్రుఁడు, ఇధ్మజిహ్వుఁడు, యజ్ఞబాహుఁడు, మహావీరుఁడు, హిరణ్యరేతుఁడు, అకృతిపృష్ఠుఁడు, సవనుఁడు, మేధాతిథి, వీతిహోత్రుఁడు, కవి యనెడినామములచే నొప్పిరి. వారిలోఁ గవియు, మహావీరుండును, సవనుండును, జితేంద్రియులై చిన్నతనంబునుండియు నాధ్యాత్మికవిద్యయందుఁ బరిశ్రమముచేసి నివృత్తధర్మపరాయణులై పరమహంసాశ్రమమును భజించిరి. అనంతర మాముప్వురును, బరమహంసాశ్రమమం దుండియే యింద్రియములను జయించి విజ్ఞానసంపన్నులై, సమస్తజీవరాసులకును నివాసభూతమైనశరీరముగలవాఁడును, సంసారభీతులను రక్షించుచున్నవాఁడును, నగువాసుదేవునిపాదపద్మములను సంతతము ధ్యానించుటవలన లభ్యమైనపరమభక్తియోగముచే రాగద్వేషాదులను దొలఁగించుకొని నిర్మలచిత్తులై, సమస్తభూతముల కాత్మభూతుఁడై, జీవశరీరకుఁడై తమతమహృదయములందు సాక్షాత్కరించిన పరమపురుషునితో జగద్వ్యాపారముతక్కఁ దక్కినసమస్తధర్మములచేతను సామ్యమొందిరి. తక్కినయేడ్వురును జనకున కధీనులై యుండిరి. మఱియుఁ బ్రియవ్రతుఁడు మఱియొకభార్యయందు "ఉత్తముఁ

డు, తామసుఁడు, రైవతుఁడు" నాఁబడుముగ్వురుపుత్రులను బడసెను. ఆముగ్వురును మన్వంతరాధిపతు లైరి. ఇట్లు పుత్రులందఱును దనవలెనే సద్గుణాకరులై యుండఁగాఁ బ్రియవ్రతుండు నిరర్గళ మైనపురుషకారము గలబలముచేఁ బూర్ణము లైనబాహువులచే భీకరచాపము నెక్కిడి యుద్ధములేకుండ ధనుష్టంకారముచేతనే ధర్మవిరోధు లగుశత్రువులను లోఁబఱుచుకొనుచుఁ, దనభార్యయగు బర్హిష్మతి హర్షముచేతను, నభ్యుత్థానాది లీలలచేతను, స్త్రీలకు సహజ మైనశృంగారాదిభావములచేతను, సిగ్గుచే సంకుచితములయినకడకంటిచూపులచేతను, మందహాసముచేతను, మృదుతరము లైనపరిహాసవాక్యములచేతను, నిరంతరమును దన్ను సుఖవంతునిఁగాఁ జేసి వివేకమును దొలంగించుచుండఁగాఁ దన్నుఁ దా నెఱుంగనివానివలె వర్తించుచుఁ బదునొకండుకోట్లవత్సరంబులు భూమిని బాలించెను. భగవంతుఁ డైనసూర్యుఁడు మేరుపర్వతమునకుఁ బ్రదక్షిణముసేయుచు భూమండలములో సాఁబాలు ప్రకాశింపఁ జేయుచుఁ దక్కినసాఁబాలునుఛాయచే నాచ్ఛాదించుచున్నాఁడు. కావుననే రాత్రి యనియు, బవలనియు విభాగము గల్గుచున్నది. సూర్యునిచేఁ బ్రకాశితము కాని భాగముగూడఁ బ్రకాశితముగునట్లు చేసెదననిసంకల్పించుకొని ప్రియవ్రతుఁడు భగవదుపాసనముచేఁ బురుషప్రభావమును వరించుకొని సూర్యరథముతో సమాన మై తేజోమయ మైన రథము నధిష్ఠించి రెండవసూర్యునివలె నొప్పుచు, సూర్యుఁడు మేరువున కుత్తరమున నున్నప్పుడు తాను దక్షిణమున వెలయుచు, నతఁడు దక్షిణమున నున్నప్పుడు తా నుత్తరమునఁ బ్రకాశించుచు నిట్లేడుపర్యాయములు సూర్యుని ననుసరించి మేరువునకుఁ

ప్రదక్షిణము చేసెను. ఓరాజా! ఆప్రియవ్రతునిరథనేమివలనఁ గల్గిన గర్తములే సప్తసముద్రంబు లయ్యె. ఆసప్తసముద్రముల చేతను భూమండల మేడుభాగములుగావిభజింపఁబడెను. ఆభాగములే క్రమముగా జంబూద్వీపమనియుఁ బ్లక్షద్వీపమనియు, శాల్మలిద్వీపమనియుఁ గుశద్వీపమనియుఁ గ్రౌంచద్వీపమనియు, శాకద్వీపమనియుఁ బుష్కరద్వీపమనియుఁ బిలువఁబడుచున్నవి. ఆద్వీపములు పూర్వపువానికంటెఁ దరువాతివి యథాసంఖ్యముగా రెండింతల పరిమాణముఁ గలిగి వర్తించుచున్నవి. ఆయేడు జలభాగములును గ్రమముగా క్షారోద మనియుఁ నిక్షురసోద మనియు, సురోద మనియు, ఘృతోద మనియు, క్షీరోద మనియు, దధిమండోద మనియు, శుద్ధోద మనియు, నామములు గల్గి వర్తించుచున్నవి. అవి సప్తద్వీపములకును బరిఖలై యొప్పుచున్నవి. అందు జంబూద్వీపము లక్షయోజనములపరిమాణము గలది. కాన తత్పరిఖాభూతమైనలవణసముద్రము కూడ లక్షయోజనములపరిమితి గలదై యున్నది. ప్లక్షద్వీపము రెండు యోజనములపరిమితి గలదగుటచే దానిఁజుట్టియున్న యిక్షుసముద్రంబును రెండులక్షలయోజనములపరిమాణము గలదై యున్నది. ఇట్లు ద్వీపపరిమాణమునుఁ బట్టి వానినిఁజుట్టి యున్నసముద్రములును బరిమాణవిశేషముచే నొప్పుచున్నవి. అందుఁ బ్రియవ్రతుండు జంబూద్వీపాదు లేడింటియందును దనకుమారు లగు నాగ్నీధ్రుని, నిధ్మజిహ్వుని, యజ్ఞబాహుని, హిరణ్యరేతుని, ఘృతపృష్ఠుని, మేధాతిథిని, వీతిహోత్రునిఁ గ్రమమున నభిషేకించి యధిపతులనుగా నొనర్చెను. ఆప్రియవ్రతుఁడు, తనకుమారిక నూర్జస్వతిని శుక్రునకు నొసంగ నతని కామెయందు దేవ

యూని యనుకన్యక యుదయించెను. ఓరాజా! ప్రియవ్రతుని కిట్టి ప్రభావములు గలుగుట యసంభవ మని తలంపకుము. ప్రియవ్రతుని కివియే కాక మఱికొన్ని ప్రభావములు గూడఁ గలవు. ముజ్జగముల నాక్రమింప సమర్థము లయినపరమపురుషునిపాదములను సేవించి, తదీయపరాగముచే షడూర్ములను నశింపఁజేసి కొన్న మహానుభావులకు శక్తిలోపం బెట్లు గలుగును? లోకాక్రమణరూపవ్యాపారమున నసాధారణసామర్థ్యముగలభగవంతునిపాదారవిందముల సేవించినవాని కసాధారణసామర్థ్య మలవడుట కేమి కొఱంత? అంత్యకాలమున నొక్కమాఱు నారాయణస్మరణ చేసినవాఁడు తత్క్షణమందే దుస్తరమైనసంసారమును ద్యజించి ముక్తుఁ డగుచున్నాఁడు. అట్టుండ నసాధారణసామర్థ్యము గల భగవంతునిపాదములు సేవించువాని కసాధారణసామర్థ్యమేల కలుగదు. ఇట్లపారములైన బలపరాక్రమములు గల ప్రియవ్రతుఁ డొకప్పుడు నారదమహర్షి చరణపంకజములను సేవించుచు, దానివలనఁ దానవలంబించిన ప్రవృత్తిమార్గపుసంబంధముచేఁ దన్ను సుఖహీనునిఁగా భావించుకొని యిట్లు విచారింపఁ జొచ్చె. 'అక్కటా! నేను మిక్కిలియనుచితకార్యము నాచరించితిని. మొదట నేను నివృత్తిధర్మపరుండ నయ్యు, నిప్పుడు దుర్జయములైనయింద్రియములకు వశుండనై తృణావృతకూపములవలె నున్న ప్రకృతిపరిణామరూపములైనహేయసుఖములందు మునిఁగితిని. అకటకటా! ఈవిషయానుభవము చాలును. నాభార్యయైన బర్హిష్మతికి నేను గ్రీడామృగమునై తిని. అయ్యయో! ఎంతపని చేసితిని. తెలివి మాలిననన్నుఁ గాల్పనా? అని యిట్లుపరిపరివిధంబులఁ దన్ను నిందించుకొనెను. అనంతరము

నివృత్తిధర్మములచే భగవంతు నారాధించి తత్ప్రసాదమునుసంపాదించికొని దానివలన స్వస్వరూపమును ధ్యానించుచుఁ దాపత్రయరహితుఁ డగుటవలన మిక్కిలిసుఖ మనుభవించుచుఁ దన్ననుసరించుచున్నపుత్త్రులకు సప్తద్వీపపరిమితి గలభూమండలమును యథాక్రమముగా విభజించి యిచ్చి, సకలభోగంబులను సమకూర్చిన భార్యను శవమునుగా భావించుచు, గొప్పసంపదలను దృణప్రాయముగాఁ జూచి వేఱొకనియుపదేశము లేకుండఁగనే వైరాగ్యమును, నిర్వేదమునుం బొంది, హృదయమందు సర్వదా హరిలీలలను బరిశీలించుచున్న నారదునియుపదేశమార్గమును మగుడఁ బొంది గంధమాదనపర్వతమందు సిద్ధిని బొందెను. ఓరాజా! ఆప్రియవ్రతునిమహిమను దెలుపువచనంబులు కొన్ని గలవు. వివరించెద నాలింపుము. ప్రియవ్రతుఁడు తన యసామాన్యప్రభావముచే రాత్రిని సైతము పగటినిఁగాఁ జేసి రథనేమివలనఁ బడినగర్తములచే సప్తసముద్రములను నిర్మించెను. ఆమహానుభావుండు నదులచేతను, గిరులచేతను, వనములచేతను, సాంకర్యము గలుగకుండఁ బ్రతిద్వీపమందును భూమిని విభాగించి యెల్లలనేర్పఱిచెను. మఱియు నతఁడు విష్ణుభక్తులందాదరముగలవాఁడై, ముల్లోకములందును సంభవించు సౌఖ్యమును, నణిమాదులగుసిద్ధులను, మాహాత్మ్యమును, నరకసదృశమునుగాఁ గావించి విడిచిపుచ్చెను. ఈదృశము లగుమహాకార్యములను భగవంతుఁడు తక్క నెవఁడు చేయఁగలఁడు?

ఇది ప్రథమాధ్యాయము.

ఇట్లు తనతండ్రి సిద్ధినొందినతరువాత నాగ్నీధ్రుఁడు తనజనకునిశాసనముచొప్పున వర్తించుచు ధర్మాచరణమం దాసక్తుఁడై జంబూద్వీపనివాసు లగుప్రజలనందఱను గన్నబిడ్డలవలెఁ గాంచుచు నాపదలు పొరయకుండ జాగరూకుఁడై రక్షించెను. అనంతర మాగ్నీధ్రుఁడు తనకున్నతిలోకములు గల్గించుసంతానమునభిలషించి దేవతాస్త్రీలకుఁగ్రీడాపర్వతమయిన సుందరమునందుఁ బూజాసాధనములనుసంపాదించికొని స్థిరచిత్తుఁడై తపంబుసేయ, బ్రహ్మయుతనియారాధనమున కానందించి తనసభయందుగానముచేయుచున్న పూర్వచిత్తియనునచ్చరను బిలిచి సంతానార్థ మాగ్నీధ్రునిచెంతకుఁ బుత్తెంచెను. ఆపూర్వచిత్తియు బ్రహ్మయనుమతిచొప్పున నాగ్నీధ్రునిసమీపమునకు వచ్చుచు నతనియాశ్రమారామమును బ్రవేశించెను. ఆయుద్యానవనము మిక్కిలి సుందరముగానుండెను. అందు తరునికరములు మిక్కిలి సాంద్రముగా నుండెను. ఆతరువులశాఖలందు సువర్ణకాంతి గలపూలలత లల్లికబిల్లికగాఁ బ్రాఁకి ప్రకాశించు చుండెను. వానియందు మయూరాదిస్థలపక్షులమిథునములు కూర్చుండి యతిమధురముగా ధ్వను లొనర్చుచుండెను. ఆధ్వనులను విని సమీపస్థమగు తటాకమం దున్న నీటికోళ్లు, కన్నెలేడిపిట్టలు, కొంగలు, రాజహంసలు మొదలగుపక్షులు మనోహరముగా నినాదములు చేయుచుండెను. ఆనాదములచే నాతటాకము ప్రతిధ్వనించుచు నిర్మలోదకమున కాకరమై యుండెను. పూర్వచిత్తి మెల్లమెల్లగా నాతటాకముచెంతకు వచ్చి సంచరించుచుండెను. అచ్చటనే తపంబొనరించు చున్న యాగ్నీధ్రుఁడు మిక్కిలి సుందరమైన గమనవిలాసములు గల యాపూర్వచిత్తి నడుచుచున్న

ప్పుడు గలుగు మధురములగు నూపురధ్వనుల నాకర్ణించి సమాధిచేత మూసినకన్నులను గొంచెము విప్పి వీక్షించెను. ఆసమయం

ఆగ్నీధ్రుఁడు పూర్వచిత్తిని జూచి మోహించుట.

బున నాసుందరి మధుకరివలెనే ప్రతిపుష్పము నాఘ్రాణించుచుండెను. ఆమె నరదేవప్రభృతులచిత్తంబునకును నయనంబులకును బరమాహ్లాదమును గల్గించుసుందరగమనముల చేతను విహారముల చేతను, వినయముల చేతను, నవలోకనముల చేతను, మధురస్వరముల చేతను, సుందరావయవముల చేతనుఁ బ్రతివానికిని మదనవికారమును గల్గించుచుండెను. ఆలలనసుధారసస్రావమువంటి మధురభాషణములను మందహాసపూర్వకముగాఁ బలుకుచుండ వెడలిననిశ్వాసవాయువు లందలిసుగంధములచేఁ దుమ్మెదలు మదాంధములై తన్ను పరోధించుటచే భయంబునఁ బర్విడుచుండ స్తనములును గేశపాశమును రశనయును గొంచెము చలించుచుఁ జూపఱకు మోహము నుత్పాదించుచుండె. ఇట్లు సుందరవిలాసములతో విహరించునాసుందరినిఁ జూచి యారాజకుమారుఁడు మదనవశుండై సంచలితహృదయుండై స్త్రీల నెఱుంగనివానివలె నామెంజూచి యిట్లనియె. *మునివరా! నీ వేజాతిని జెందియున్నావు? ఈశైలమం దేమియొనరింపఁదలంచుచున్నావు? నీవు భగవంతునిపరదేవతారూప మైనమాయ వగుట నిక్కంబు. నీవు భ్రూలతల నడి నెండువిండ్లను దాల్చియున్నావు. వానినిధరించుట నీస్నేహితుఁడనగునాకార్యము నెఱవేర్చుటకా? లేక స్వీయకార్యము నెఱవేర్చుటకా? ఆవిండ్లచే నీకేమిప్రయో

* ఆరాజకుమారుఁడు పూర్వచిత్తి యనునప్సరను నొకమహామునిగాఁ దలంచి 'మునివరా' ఇత్యాదిపదములచే సంబోధించుచున్నాఁడు.

జన మున్నది? ఆలోచింప నింద్రియాధీనులమై మృగతుల్యులమై చరించుమావంటివారిని జయింప నీచాపద్వయంబు నవలంబించి వర్తించుచుంటివా? ఏమి? కమలసదృశము లైననీనేత్రములు బాణములవలె నొప్పుచున్నవి. అవి ఱెప్పలనెడికంకపత్రములు గలవి. అవి విలాసములచే సుందరము లైనవి. అవి పుంఖములు లేక పోయినను మనోహరము లై యున్నవి. వానికడకంటిచూపు లనెడియగ్రములు మిక్కిలి తీవ్రము లై యున్నవి. నీ వీవనమందు సంచరించుచు, నాబాణముల నెవ్వరిపైఁ బ్రయోగింతువో తెలియలే కున్నాను. నీపరాక్రమము మావంటిమందబుద్ధుల క్షేమమునకై యగుఁగాక యని ప్రార్థించుచున్నాను. నీశరీరపరిమళమందు లోలుభము లై మధుకరములు సర్వదా నిన్ను వెంబడించుచు ఝుంకృతు లొనర్చుచు, సామగానము నేర్చుకొనుచున్న శిష్యులవలెఁ దనరారుచున్నవి. నీకు శిష్యభూతము లగు తుమ్మెదగుంపులు నీకేశపాశమునుండి రాలుచున్న పుష్పసమూహములను ఋషిగణములు వేదశాఖలనుంబోలె నాశ్రయించి భజించుచున్నవి. ఓమునీశ్వరా! నీపాదపంజరము లందున్ననూపురము లనెడితిత్తిరిపక్షుల యవ్యక్తము లగుమధురనినాదములు విందుముగాక. * ఓమునిపుంగవా! నీనితంబబింబములందు కదంబకుసుమముల వంటికాంతి యెట్లు లబ్ధమయ్యెను? ఆ † కాంతియందు వెలయు వలయాకారాగ్ని రేఖ యెట్లు లభించినది? నీ‡వల్కలము కాన

* ఆమె ధరించినవస్త్రమునుఁ జూచి యిట్లడుగుచున్నాఁడు.

† ఆమెమొలయం దున్న మేఖలను జూచి కొఱవిని ద్రిప్పునప్పుడు గలుగు వలయాకారరేఖనుగా భావించుచున్నాఁడు.

‡ వల్కలమును గాంతినిగా భావించి వల్కలము లేదని భ్రమించెను.

రాదేమి? ఓవిప్రవర్యా! *సుందరము లైననీశృంగంబులు మిక్కిలి మనోహరముగా నున్నవి. నీనడుము మిక్కిలి కృశించి యున్నప్పటికిని నాశృంగద్వయమును వహించుచున్నది. అది మిక్కిలి కష్టమైనపని నానేత్రము లాశృంగములందు లగ్నంబులై మగిడి రాలే కున్నవి. నీశృంగములం దున్నయెఱ్ఱనిబురద మిక్కిలి పరిమళించుచు నాయాశ్రమము నెల్లను బరిమళింపఁజేయుచున్నది. ఓమిత్రవర్యా! నీలోకమును నాకొకపరి చూపుము. మీలోకములోనివా రందఱును మావంటివారి మానసమును హరించెడియెట్టియపూర్వశృంగములను వక్షముచే వహించియున్నారు కాఁబోలును! ముఖమందును, నీవలెనే, మధురాలాపములను, మనోహరవిలాసములను, నధరామృతమును వహించి యున్నారు కాఁబోలును! ఓ మిత్రమా! మీలోకమందు దేహపోషణముకై యెట్టియాహారమును దిందురు? భక్షణాదికము కాక మీకు వేఱొకజీవనోపాయము గలదని తలంచెదను. అది యేదియో చెప్పుము. విష్ణువునకుంబోలె నీకర్ణములందు మకరకుండలము లుండుటచే నీవు విష్ణువునంశమ వని భావింతు. మఱియుఁ జంచలము లగుమీనములవంటి నేత్రములుండుటచేతను, హంసపంక్తివలెఁ దెల్లనిదంతపంక్తి గలదగుటచేతను, దుమ్మెద చాలువంటి కేశపాశము గలదగుటచేతను, నీవదనము కమలాకరమువలెఁ బొల్చుచున్నది. నీకరతలముచే నాహతమగుచున్న కందుకము దిక్కులందుఁ ద్రుళ్లిపడుచు నానేత్రములను జంచలములనుగాఁ జేయుచున్నవి. ఆసమయంబునఁ బ్రిదిలిన కేశపాశమును బంధింపవైతివి. ధూర్తుఁడైన

* స్తనములను, అంద లికుంకుమమును జూచి యనుచున్నాఁడు.

వాయువు లాలనుఁడై నీనీవీబంధంబును వదలించుచున్నను స్మరింపకుంటివి. ఓ తాపసోత్తమా! తాపసుల తపంబునకు విఘ్నము గల్గించునీయీరూపము నేతపంబు చేసి సంపాదించితివి ? ఓమిత్రమా ! నాతోఁగూడ నిచ్చటఁ దపంబొనరింపుము. విశ్వస్రష్టయైనయీబ్రహ్మ నాయందు దయగల్గి నిన్ను నానిమిత్తము పంపెనని తలంచెదను. ఓవిప్రవర్యా ! నామనంబును జూపులును, నీయందు లగ్నంబులై మగిడిరాలేకున్నవి. కావున దైవవశము వలన సంప్రాప్తుండ వైననిన్ను విడనాడఁజాలను. ఓచారుశృంగీ! నీచిత్తమును మాయధీనము చేయవలసినది. నీస్నేహితులందఱును నాకనుకూలురయి వర్తింతురుగాక.'' అని యిట్లాగ్నీధ్రుండాయువతిని జూచి మోహితచిత్తుఁడై స్త్రీలను స్వాధీనలను గాఁజేయఁ దగినంత నేర్పు విశదమగునట్లుగా నామె ననునయించుచు ననుకూలను జేసికొనెను. ఆపూర్వచిత్తియు నాయాగ్నీధ్రుని బుద్ధిని, రూపమును, సత్ప్రవర్తనమును, విద్యను వయస్సంపదను, నౌదార్యమును జూచి తదాయత్తచిత్తయై యతనితోఁగూడి భూలోకస్వర్గములవలె నున్న నవఖండములందును లక్ష సంవత్సరములకాలము సమస్తసుఖంబు లనుభవించెను. ఆయాగ్నీధ్రుఁడామెతో సమస్తసుఖంబు లనుభవించుచు, నామెయందు, నాభి, కింపురుషుఁడు, హరివర్షుఁడు, ఇలావృతుఁడు, రమ్యకుఁడు, హిరణ్మయుఁడు, కురువు, భద్రాశ్వుఁడు, కేతుమాలుఁడు, నాఁబడుపుత్త్రులఁ దొమ్మండ్రుగురం గనియె. అనంతర మాపూర్వచిత్తి యొక్కొకవత్సరంబున నొక్కొకకుమారునిఁ గని యాపుత్త్రులఁ బతిగృహమునందు విడిచి మగుడబ్రహ్మను సేవింప సత్యలోకమున కేఁగెను. నాభిమొదలగుకుమారులు పుట్టువుచేత నే దృ

ఢాంగులై బలశాలులై, తమతమనామములతో వెలయుచుఁ ద
మజనకునిచే విభక్తములై యీఁబడినజంబూద్వీపవర్షములను
బరిపాలించిరి. ఆయాగ్నీధ్రుఁడు భోగములందుఁ దనివి సనమిచే
నాపూర్వచిత్తినే సంతతమును, ధ్యానించుచు, నామెసంగతినే
కోరుచు వేదోక్తము లగుసాధనములచేఁ బెక్కుకర్మము లాచ
రించి పితృదేవతలకు మోదము గల్గించునాలోకమును జెందెను.
అట్లు తండ్రియైనయాగ్నీధ్రుఁడు లోకాంతరగతుండైనతరువాత
నాసోదరులు తొమ్మండ్రుగురును, మేరుకుమారికలైన, మేరుదేవినిఁ
బ్రతిరూపను నుగ్రదంష్ట్రిని, లతను, రమ్యను, శ్యామను, నారి
ని, భద్రను, దేవవీతిని, గ్రమముగాఁ బెండ్లియాడిరి. ఇది రెండవ
యధ్యాయము.

పిమ్మట నాభి సంతానార్థియై సంతానము లేని మేరుదేవితోఁ
గూడికొని సమాహితచిత్తుఁడై యాగారాధ్యుఁ డయినపరమ
పురుషుని యోగములచేఁ బూజించెను. అతఁడట్లు శ్రద్ధాళువై
నిర్మలాంతఃకరణముతో విష్ణువు నారాధించుచున్నసమయ
మున నాభగవంతుఁ డతనియం దతివత్సలుఁడై యగ్నిష్టోమమున
కంగభూతము లగుప్రవర్గ్యము లనుపేరు కలయాగములు ప్రవ
ర్తించుచుండఁగా, హోమద్రవ్యము, సమదేశము వసంతరూప
మగు కాలము, మంత్రములు, ఋత్విక్కులు, దక్షిణ, యనుష్ఠా
నప్రకారము, నాఁబడునీయేడుపాయములచేతనైనను దుర్లభుఁ
డయ్యునుఁ దనభక్తుఁడైననాభియభిప్రేతార్థము నెఱవేర్పఁ బూర్ణ
ముగా సంకల్పించుకొన్నవాఁ డగుటచే సుందరావయవములు
గల్గి, మనోహరమై, మనంబునకును, నయనంబులకును నానం

దము గల్గించునదై కర్మాధీనము కాక యున్న తనదివ్యమంగళవి గ్రహముతోఁ, సాక్షాత్కరించెను. ఆపరమపురుషుఁడు ప్రకాశ

—•••◆నారాయణుండు నాభికిఁ బ్రత్యక్ష మగుట.◆•••—

బహుళుఁడై నాలుగుభుజములతో నొప్పారుచుండెను. అతనిశరీరము పచ్చనిపట్టువస్త్రముచే నావృతమై యుండెను. అతనియురమున శ్రీవత్స మనెడిలాంఛనము కౌస్తుభ మణియు వెలయుచుండె. అతనికరతలంబులందు శంఖము, చక్రము, గద, పద్మము, ప్రకాశించుచుండె. ఆమహనీయునియవయవములు నవరత్నమయము లయిన కిరీటము మకరకుండలములు, కడియములు, మొలత్రాడు, హారములు, బాహుపురులు; నూపురములు, మొదలగునలంకారములచే రంగారుచుండెను. అట్టిభగవంతునిఁ జూచి నాభియు, ఋత్విక్కులును, సభ్యులును, వెన్నిధిఁగన్న పేదవాండ్ర చందంబున నానందించి యథావిధిగాఁ బూజించి, నమస్కరించి యవనతశిరస్కులై సమీపమున నిలువఁబడి యిట్లు నుతించిరి. 'ఓపరమపురుషా! నీవు పూర్ణుఁడవైనను నీభృత్యుల మగు మే మిచ్చినపూజలను స్వయముగానే స్వీకరింపఁదగుదువు. మాయొనర్చుపూజలను గ్రహించినంతమాత్రమునఁ బరిపూర్ణుఁడ వగు నీ కొక కొఱంత కలుగదు. నీస్వరూపమును, స్వభావము ననంతము లగుటచే మేము పూర్తిగా నుతింప నెట్లు సమర్థుల మగుదుము? కావున మేము "ఓ దేవదేవా! నీకు నమస్కారము" అనుటమాత్రమే చేయఁగలుగుదుము. అంతకు మించిన శక్తి మాకు లేదు. ఓపరమేశ్వరా! సత్త్వాదిగుణముల వ్యతికరమువలనఁగల్గిన శబ్దాదివిషయములం దత్యాసక్తి గలిగి, కావుననే కర్మపరవశుఁడై దేవమనుష్యాదినామములచేతను, రూప

ము చేతను నుపలక్షితుఁ డగుపురుషుఁ డేవండును బ్రకృతిపురుష
లకంటె విలక్షణుఁడ వయిననీస్వరూపస్వభావములను నిరూపింప
సమర్థుండు కాఁడు. కావున నెట్టిమహనీయుఁడయినను, సమస్త
జీవులపాపముల హరింపసమర్థము లయి శివతమములై, యున్న
నీగుణగణములలో గుణలవమునుమాత్రమే వర్ణింపఁగలఁడని చె
ప్పక తీఱదు. నీవట్లు స్వరూపస్వభావములచే ననంతుఁడ వయ్యు
ను, బరిపూర్ణుఁడ వయ్యును, నీసేవకులు గద్గదస్వరముతో నుతిం
చి; భక్తియుక్తులై యిచ్చుచున్న నిర్మలజలమును, ద్రవ్యాదు
లను, నవపల్లవములనుఁ దులసీదళములను, దూర్వాంకురంబు
లను, సత్యాదరముతోఁ గైకొని మిక్కిలిసంతోషించుచున్నావు
గదా? అనేకవస్తుసంభారంబులు గల్గిన యీమాయొనరించుయా
గమునకు నీసంతుష్టితక్క వేఱొక్కప్రయోజనంబు గానరాదు.
ఓపరమేశ్వరా ! నీవు సర్వకాలములందును స్వతస్సిద్ధముగానే
కలుగుచున్నసమస్తపురుషార్థములే స్వరూపముగాఁగలవాఁడవు.
అట్టినీవలనఁ బురుషార్థములను గోరుచు మేము చేసిన యీయా
రాధనము నీకనర్హమైనను నీకు సంతుష్టిఁ గల్గించి, తన్మూలమున
మాకే యుపయోగించుచున్నది. ఓపరమపురుషా!నీ వపారకరు
ణారసమున నొప్పారుచు నారాధనసమయమందే యపహతపా
ప్మత్వరూప మగుమోక్షమును, మాయపేక్షితఫలంబును, గ
ల్పించుచుఁ బరిపూర్ణుఁడవైనను నపరిపూర్ణునివలెఁగానవచ్చుచు
మాయిచ్చుపూజల నందుకొనుచు, నుత్కృష్టపురుషార్థ మొఱుం
గనిమావంటియజ్ఞులకు యథానుగుణముగాఁగనఁబడుచున్నావు.
ఓపూజనీయా! నీ వీరాజర్షియభిమతముల నెఱవేర్ప నావిర్భవిం
చినవాఁడ వయిన నీతనియాగమందు భగవంతుఁడ వయిన నీవు

నిజభక్తులమగు మావంటివారికి గోచరుఁడవగుట యావరముల కంటె గొప్పదని భావించెదము. ఓమహాత్మా! వైరాగ్యాతిశయ మనెడియగ్నిచే,సమస్తపాపములను దహించెడియాత్మారాములును, భగవదారాధనరూపధర్మము నాచరించెడిమునులును నిరంతరమును నీగుణగణములను బరిశీలించి తాదృశగుణముల నభినందించుటయే నిరతిశయ మగు పురుషార్థ మని భావించుచుండఁగా నీసందర్శన మట్టిపురుషార్థ మనుటకు సందియ మున్నదా? ఓయీశ్వరా ! చాంచల్యము వచ్చినప్పుడును, తుమ్మినప్పుడును, పతనకాలమందును, నాపులింతయందును, మఱికొన్నిదురవస్థలయందును, జ్వరదశయందును, మరణకాలమందును, బరవశుల మగుమాకు సకలపాపనిరాసకములును, కల్యాణగుణద్యోతకములును, నగు నీనామములు నీపాదారవిందస్మరణమునకుఁ దోడుపడుఁగాక. ఓవరదా! దరిద్రుఁడు పొల్లుధాన్యమును గోరుచుఁ గుబేరుని యాచింపఁదలంచిన ట్లీరాజర్షి చంద్రుండు, సంతానమునుఁ బురుషార్థముగా నెంచుకొనుచు, స్వర్గసుఖమునుగాను, మోక్షసుఖమును గాని యిచ్చుటకుఁ దగిన సామర్థ్యము గలనిన్ను నీవంటిసంతానమును బ్రార్థింప నున్నాఁడు. లోకమం దిట్టియవివేకు లుందురా? ఈసంసారమందు మహాత్ముల సేవఁ జేయుపురుషుం డొక్కరుండు దక్కఁ దక్కినవాఁ డేవాఁడైనను, గర్వవశ్యులకు లొంగనిదియు, సత్పథమును గప్పిపుచ్చునదియు, నగు మాయచేఁ దిరోహితుఁడై, విషపాతమువంటి విషయములందు నత్యనురక్తుఁడై యిట్టికోర్కుల నపేక్షింపక యుండఁగలఁడా! ఉదారవ్యాపారముల నొనర్చునోదేవదేవా!ఓసర్వాత్మా! అల్పప్రయోజనమును బురుషార్థముగా నెంచికొని యజ్ఞుల మగు మేమునిన్ను

స్వల్పకార్యమునిమిత్తమిచ్చుటకై రప్పించితిమి. లోకములో సర్వోత్కృష్టవరముల నొసంగెడి నిన్నీస్వల్పకార్యంబునకుఁ బిల్చుట నీ కవమానకరము కాకమానదు. అయినను నీవంటిపుత్త్రునిఁ గోరుచుండుటచే నది పెద్దయవమానకరము కాదు. కాన దయయుంచి మాయపరాధంబును సహింపుము.” అని యిట్లు స్తోత్రము చేయుచు ఋత్విక్కులు భగవంతునకు నమస్కరించిరి. నాభియును బరమభక్తితో నమస్కరించెను. అప్పుడు భగవంతుఁడు దయార్ద్రహృదయుఁడై యిట్లనియె.‘ ఓఋషులారా! మీరితనినిమిత్తము నాతో సదృశుఁడగుకుమారు నొసంగఁ గోరికొంటిరి. ప్రకృతిపురుషులకు విలక్షణుండనై నాతోసమానవస్తువు గాని నాకంటె నధిక మగువస్తువు గాని లేదు. ఇట్లుండ నాతో సమానుఁ డయినకుమారుని గోరినవరము మిక్కిలి దుర్లభమయినది. సత్యవాక్కు లయినమీ రట్టివర మడుగుట మిక్కిలియబ్బురము గొలుపుచున్నది. అయినను దపోవిద్యలచే దేదీప్యమాను లయిన బ్రాహ్మణులు నాముఖమే. నాకు ముఖమై వర్తించు బ్రాహ్మణుల వచన మెప్పుడును వ్యర్థము కాఁగూడదు. కావున నేనే నాయంశముచే నాభిభార్య యగుమేరుదేవియం దవతరించెదను. ఈవచనము మేరుదేవి వినుచుండఁగాఁదత్పతి యగునాభితోను ఋత్విక్కులతోను జెప్పి యంతర్ధానము చెందెను. ఓపరీక్షిద్రాజా! యజ్ఞమందు భగవంతుఁ డిట్లనుగ్రహించి నాభి కిచ్చిన వరంబును నెఱవేర్పఁ దలంచి, సత్త్వప్రధాన మగుతను వవలంబించి దిగంబరులును, జ్ఞానవంతులును, బ్రహ్మచారులును నగువారికి సమస్తధర్మంబులను జూపనెంచి మేరుదేవియందంశముచే నవతరించెను.

ఇది మూఁడవయధ్యాయము.

అట్లవతరించి యుత్పత్తిచేతనే భగవల్లక్షణంబులను విశదీకరించుచున్నయాప్రభావము సర్వసమత్వముచేతను, బాహ్యేంద్రియనిగ్రహముచేతను, వైరాగ్యముచేతను, సర్వభూతనియంతృత్వముచేతను, మహాసంపదలచేతను, బ్రతిదినము వర్ధిల్లుచుండఁగాఁ జూచి మంత్రులును, బ్రజలును, బ్రాహ్మణులును, నాబాలుని భూపాలనమందు నియమింపఁ దలంచుకొనిరి. అనంతరము నాభి తన కుదయించిన పుత్త్రునకు సత్త్వప్రధాన మగుదేహంబును, విపుల మగుగుణప్రఖ్యాతియు, నింద్రియబలంబును, దేహబలంబును, సంపదయు, కీర్తియును, శత్రుతిరస్కారసమర్థ మగువీర్యంబును, శౌర్యంబును లభించుటచే నతనికి ఋషభుఁ డనెడి నామధేయ మొంచెను. ఆఋషభునిప్రభావముదురూహ్యమైనది. అతని రాజ్యముపైఁ గోపము వహించి దేవేంద్రుఁడు వర్షముఁగురియింపకుండఁగా నది చూచి భగవంతుఁ డగుఋషభ దేవుఁడు తనవిచిత్రశక్తిచేతను వర్షముఁగురియించి యింద్రునిగర్వపరిహారము గావించి తనరాజ్యమున కజనాభ మనునామము గల్గించెను. అధిక ప్రభావసంయుతుఁడును, స్వేచ్ఛచే మనుష్యాకారమును ధరించి, షాడ్గుణ్యపూర్ణుఁ డయ్యుఁ దనకుఁ గుమారుఁడై యానందము గొలుపువాఁడు నగునాబాలునిఁ జూచి నాభి తాదృశపుత్త్రునిఁ బడసినందు కమందానందము నొంది, దానివలన వివశుండై భగవన్మాయచేఁ దనపుత్త్రుఁ డనునమ్మకముతోఁ, మధురములును, గద్గదములును నగువాక్కులను బలికి కుమారుని లాలనచేయుచు, మిక్కిలిసుఖ మనుభవించెను. అనంతరము నాభి, పౌరులును, నమాత్యాదులును, దేశవాసులును దనకుమారు నధికానురాగముతోఁ జూచుచుంటఁ గని మిక్కిలి సంతసించి వర్ణాశ్రమమర్యాదలను

రక్షింప నియోగించి, రాజ్యాభిషేకము చేసి బ్రాహ్మణులతోడలవై నాభాలకు నుంచి మేరుదేవీసహితుఁడై విశాల మగుబదరికావనంబున కేఁగి పరులకు భయంకరము కాక యంతరాయములను బొందక యుండుసమాధిచేతను, సాంగమగుభక్తియోగముచేతను, నరనారాయణస్వరూపుఁడైనవాసుదేవు నారాధించి ప్రారబ్ధావసానమున గుణాష్టకరూప మగుముక్తినిఁ జెందెను. ఓపరీక్షిద్రాజా! ఆనాభినిఁగూర్చి కొందఱార్యు లిట్లు చెప్పుచున్నారు. ఆనాభిపరిశుద్ధకర్మమునకు భగవంతుఁడు సంతసించి కుమారుండై యుదయించెను. అట్టినాభిప్రసిద్ధకర్మముల నెవఁడాచరింపఁగలఁడు? ఆనాభి నిజార్జితధనంబులచేఁ బూజితులైన బ్రాహ్మణులమంత్రబలమునఁ దనయాగమందు భగవంతుని సాక్షాత్కరించుకొనఁగల్గె. అయారే! ఆనాభికంటె నన్యుం డగు బ్రహ్మణ్యుం డెవండుగలఁడు? అనంతరము ఋషభుండు తనభూఖండము స్వర్గాపవర్గముల సాధించుకర్మములకుఁ బాత్రమైనదని తలంచుచు, లోకవిడంబనార్థము గురుకులవాసము చేసి వారియనుమతిచొప్పున గృహాశ్రమధర్మములను శాసింపనూనుకొని, విహితములై, శ్రౌతస్మార్తరూపములైనప్రవృత్తినిమిత్తకర్మములను, నివృత్తిలక్షణకర్మములను శ్రద్ధతో నాచరించుచు నింద్రుఁడొసంగినజయంతి యనుకన్యకను బరిణయమాడి యామెయందు నూర్వురఁ బుత్రులను బడసెను. ఆనూర్వురలోను జ్యేష్ఠపుత్రుఁడగుభరతుండు గుణగణములచేఁ బ్రఖ్యాతి గాంచెను. ఆభరతునివలననే యీయజనాభమునకు భరతవర్షమను నామము కలిగినది. ఆనూర్వురలో నొక్కొక్క పుత్రదశకమున కొక్కొక్కఁడు ప్రధానుఁ డయ్యె. భరతుఁడు మొదటిదశకము

నకు బ్రధానుఁ డయ్యె. తక్కిన తొమ్మిదిదశకములకుఁ గ్రమముగాఁ గుశావర్తుఁడు, ఇలావర్తుఁడు, బ్రహ్మావర్తుఁడు, ఆర్యావర్తుఁడు, మలయకేతువు, భద్రసేనుఁడు, ఇంద్రస్పృక్కు, విదర్భుఁడు, కీకటుఁడు, ననువారలు ప్రధానులు. ఆపుత్రశతకములోఁ గవియు, హరియు, నంతరిక్షుఁడును, బ్రబుద్ధుఁడును, బిప్పలాయనుఁడును, నావిర్హోత్రుఁడును, ద్రమిళుఁడును, జమసుఁడును, కరభాజనుఁడను ననుతొమ్మండ్రుగురును, భాగవతధర్మములను బ్రకటించెడిమహాభాగవతులైరి. అమహాత్ములచరిత్రము భగవన్మహిమచే వర్ధితమై, చిత్తశాంతికి హేతువై యున్నది. ఆదానిని ముందు వచ్చెడివసుదేవనారదసంవాదమునందుఁ దెలిపెదను. తక్కిన యెనుబదియొక్కరును, జనకాజ్ఞను మన్నించి గృహస్థాశ్రమ మవలంబించి సకలసంపదలతోఁ దులదూగుచు సాంగము లగువేదములను నధ్యయనంబు చేసి యాగముల నొనరించుచు సదాచారముచే బ్రాహ్మణులైరి. అనంతరము ఋషభుఁ డనుపేరు గలభగవంతుఁడు స్వతంత్రుఁడై, కర్మవశ్యుండు కాక కర్మవశమువలన సంభవించుసుఖదుఃఖాదిపరంపరను దొలంగించుకొని కేవలానందస్వరూపుఁడై యుండెను. తా నీశ్వరుఁ డయ్యునుఁ బ్రాకృతపురుషునివలెఁ గర్మము లాచరించుచు గాలవశమున నశించుచున్నధర్మముల నాచరణముచే మగుడ స్థాపించుచు నుండెను. అతఁడు సర్వభూతములందును సమత్వము గలిగి, రాగాదులచేఁ గలుషితచిత్తుండు కాక భూతమైత్రితో వర్ధిల్లుచుఁ బరదుఃఖంబులను సైఁపలేనంతజాలిగుండెగలవాఁడై, లోకమును గృహస్థాశ్రమమందు నియమించుచుండెను. శ్రేష్ఠుఁడైనయమ్మహాత్ముని ననుసరించి సమస్తలోకులును

వర్తించిరి. మఱియు నాఋషభుఁడు సమస్తధర్మంబులును గల్గిన వేదరహస్యములను జక్కఁగా నెఱిఁగియున్నను, బ్రాహ్మణోత్తముల నడిగి వారు చూపుమార్గమున గుణముగా సామాద్యుపాయముల నవలంబించి ప్రజలను ధర్మయుక్తముగా శాసించుచుండెను. పుత్త్రవంతుఁడైన యాఋషభుఁడు వసంతకాలములందు సమభూములందు, సకలద్రవ్యములతో నొప్పునట్లు ఋత్విక్కులతోఁ గూడికొని యథావిధిగా నూఱుయాగముల నాచరించెను. భగవంతుఁ డగుఋషభునిచేఁ బాలిత మగుభారతవర్షమందుఁ బ్రతిపురుషుఁడు రాజభక్తిసి దక్క వేఱొక్కపురుషార్థమును బరులవలనఁ గోరికొనలేదు. ఆఋషభుఁ డొకానొకప్పుడు భూమియందుఁ జరించుచు, బ్రహ్మావర్తమును బొంది బ్రహ్మసభయందుఁ బ్రజ లందఱును వినుచుండఁగా వినయముచేతను, స్నేహముచేతను,సుఖముచేతను వశీకృతులై సావకాశచిత్తులై యున్నకుమారుల కిట్లు బోధించెను. ఇది నాల్గవయధ్యాయము.

ఓపుత్త్రకులారా! మానవలోకమందు సమస్తదేహధారులలోను నీమనుష్యదేహము మిక్కిలి కష్టములచే సంపాదితములగుశబ్దాదికామముల ననుభవింపఁదగదు. తాదృశకామభోగములు పురీషాదులను భక్షించుసూకరాదులకుఁ గూడ ననుభవార్హము లగుచున్నవి. మానవదేహము కేవలము కామాదుల ననుభవించుటకే యైనచోఁ దక్కినపశ్వాదులదేహమునకునుదీని కిని నేమితారతమ్యము కలదు? కావున దేనివలన మునీశ్వరులు సంసారమును దరించుచున్నారో, దేనివలన నపార మగుబ్రహ్మ

సుఖము కలుగుచున్నదో, విష్ణుదేవతారాధనరూప మగునట్టి తపంబు సేయుట మానవుల కుచితము. బంధమునకు భోగమే హేతువు. తాదృశభోగమునకు స్త్రీలు మూలకారణములు. అట్లే మోక్షమునకు భగవదుపాసనము హేతువు. ఆయుపాసనమునకు మహాత్ములసేవ ప్రధానభూత మైనది. వారు లోకంబునఁ గొక్కరు గలరు. ఆమహాత్ములు సమస్తము బ్రహ్మాత్మక మైనదని తలంచెడివారగుటచే సుఖదుఃఖంబులు ప్రాప్తించునప్పుడు వికారము నొందనిచిత్తములు గలవారు. వారు బాహ్యేంద్రియములను నంతఃకరణంబును జయించియున్నారు. వారు సహనబుద్ధిచే నొప్పుచు, సర్వభూతములందును హితమును గోరుచుఁ బరోపకారపరాయణు లై యున్నారు. వారు దారసుతాదులతోను, మిత్రులతోను, ధనములతోను నిండి దేహధారణవార్తయే ప్రధానముగాఁ జూచుకొనుజనుల కునికిపట్టై, ప్రేమయేప్రయోజన మని యూహించువారలకుఁ దావై యున్నగృహములందెంతమాత్రంబును ప్రీతియుక్తులై యుండరు. వారు లోకమందు దేహపోషణముకంటె నధికస్పృహ లేనివారు. అట్టి మహాత్ముల సేవ తప్పకుండ భగవదుపాసనాసక్తులం గావించి ముక్తిఁగలిగించును. లోకమునఁ బామరుఁడు దేహమే యాత్మ యనుకొని తద్వశుఁడై దీనుఁడై, యింద్రియప్రీతికై యేకర్మమును జేయుచున్నాఁడో యది యుక్తమైనది కాదు. ఆకర్మములవలననే యనిత్య మగునీశరీరము గల్గినది. కావున నస్థిరశరీరములకుఁ గారణ మగునింద్రియప్రీతకర్మము లొనరించుట యుచితమా? ఓపుత్రకులారా! ప్రకృతివిలక్షణ మైనయాత్మతత్త్వము తెలియనంత

కాలము నాత్మస్వరూపమునకుఁ దిరోధానము కలుగుచుండును. అది కలిగినతోడనే యింద్రియప్రీతికొఱకుఁ గ్రియాకలాప మొనరింపఁబడును. అట్లు కర్మకలాపమొనరించుటవలన మనస్సు జ్ఞానాసక్తము కాక కేవలమును గర్మాసక్త మగును. కర్మాసక్త మగుమనంబుచేతనే జీవునకు మఱుఁడ శరీరసంబంధము కలుగుచున్నది. కర్మవాసనామూల మగునవిద్యతో నాత్మసంసృష్టినిఁబొందుటచే మనంబు పురుషునిఁ గర్మాసక్తునిఁగాఁ జేయుచున్నది. కావున వాసుదేవుఁడ నగునాయందు భక్తి యుత్పన్నము కానంతకాలము పురుషుఁడు దేహసంబంధము గలవాఁ డగుచున్నాఁడు. స్వాత్మపరమాత్మయాథాత్మ్యమందు, జాగరూకుఁడై శబ్దాదివిషయములం దింద్రియప్రవృత్తి దేహసంబంధమువలనఁ గలుగుచున్నదికాని యాత్మకు స్వాభావికమైనదికాదని వివేచనచేయుచు నెప్పుడు తెలిసికొనఁడో, యప్పుడే పురుషుఁడు స్వాత్మపరమాత్మతత్త్వమును మఱచి, జ్ఞానవిహీనుఁడై మైథునసుఖమే ప్రాధాన్యముగఁ గలగృహస్థాశ్రమమును బొంది యందుఁ దాపములను బొందుచున్నాఁడు. కావున నానుతులారా! అనాది యైనకర్మవాసనవలన నహంకారమమకారరూప మగునవిద్యయు, దానివలన దేహసంబంధంబును, దానివలన మఱుఁడఁ గర్మవాసనయు, దానివలనఁ దాపములును, నట్లు తాపానుభవమువలనఁ గర్మవినాశ మైనప్పటికిని నాకర్మవాసన నివృత్తికాదు. కాన వెండియు నవిద్యాసంబంధమును, దానివలన దేహసంబంధమును, నందువలనఁ దాపానుభవమును నిట్లనర్థపరంపర చక్రమువలెఁ బరిభ్రమించుచుండును. ఈయవిద్యాదులకుఁ గారణ మైనకర్మవాసన యెట్లు సంభవించుచున్న దని యందువేని చెప్పెద వినుఁడు.

పురుషుఁడు స్త్రీతో మిథునభావము నొందియుండును. ఆమిథునీ భావమును బ్రత్యేకముగా నా స్త్రీపురుషులహృదయగ్రంథినిగాఁ జెప్పుదురు. ముడివలెనే మనోగత మగుకర్మవాసన యభేద్య మైనది. కావుననే వానికి హృదయగ్రంథి యనుపేరు తగియున్నది. ఏహృదయగ్రంథివలన గృహము, కళత్రము, పుత్త్రులు, మిత్రులు, ధనములు, మొదలగువిషయములచే జనులకు నహంకారమమకారరూప మగుగొప్పమోహ ముదయించుచున్నదో, యాహృదయగ్రంథినే కర్మవాసనకుఁ గారణ మని చెప్పుదురు. సుతులారా! దృఢమై కర్మానుసరణముగా సంబంధము గలహృదయగ్రంథి యెప్పుడు విడివడునో యప్పుడు జనుఁ డీసంసారము వలన ముక్తుండై పుణ్యాపాపములను దొలంగించుకొని పరమపురుషునిఁ బొందుచున్నాఁడు. ఆహృదయగ్రంథి శిథిల మగుటకు సాధనంబులఁ జెప్పెదను; వినుఁడు. అవిద్యాదిదోషములు లేక హితోపదేష్టయై యున్ననాయందలిభక్తియు, నాసేవయందలి యాసక్తియు, శబ్దాదులం దాశ వదలుటయు, శీతోష్ణాదులను సహించుటయు, నిహపరలోకములందు జంతువులకు సంభవించు దుఃఖంబులను దెలిసికొనుటయు, జ్ఞానేచ్ఛయుఁ, దపంబును, వృథాకాంతను విడుచుటయు, భగవదారాధనరూపము లగు వర్ణాశ్రమోచితకర్మంబులును, భగవత్కథయు, భగవద్భక్తుల స్నేహంబును, భగవద్గుణకీర్తనమును, నిర్వైరంబును, సర్వసమత్వంబును, నుపశమంబును, దేహగేహము లాత్మీయము లను బుద్ధిని వదలుటయుఁ, బ్రకృతివిలక్షణ మగునాత్మతత్త్వమం దనుభవము గలిగియుండుటయుఁ, బరిశుద్ధమగునాహారమును దినుచుండుటయుఁ, బ్రాణంబును నింద్రియంబులను మనంబును జ

యించుటయు, సదుపాయములందలి శ్రద్ధయు, బ్రహ్మచర్యంబును, జేయఁదగినవాని విసర్జింప కుండుటయు, మౌనంబును, సర్వము బ్రహ్మాత్మక మని తెలిసికొనుజ్ఞానంబును, శాస్త్రంబున నుద్దీపితం బగుయోగమును, నీచెప్పినవి సాధనంబులు. పురుషుఁడు ధైర్య ప్రయత్నములు గలిగి వెనుకఁజెప్పఁబడినసాధనకలాపముచే హృదయగ్రంథిని విప్పుకోనఁగలఁడు. పైని వర్ణింపబడినసాధనకలాపముచే వర్ధిల్లినభగవద్భక్తిచేతనే హృదయగ్రంథి విడివడి దాని వలన దేహసంబంధము తొలంగవలయును గాని వేఱొకదాని వలనఁ గాదు. ఓసుతులారా! అవిద్యవలనఁ గలుగుచున్నకర్మ వాసనారూప మైనహృదయగ్రంథిబంధమును, నే వెనుక నుపదేశించినప్రకారము చేయఁబడినయోగముచేఁ బూర్తిగాఁ దొలంగించుకొని యనంతర మాయోగమునుండి విరమింపవలెను. మఱియు నాపురుషుఁడు నాసారూప్యమును గోరుచు నాయనుగ్రహము నే పురుషార్థమునుగాఁ దలంచుచుఁ దండ్రి కుమారునివలెను, గురువు శిష్యులనువలెను, రాజు ప్రజలనువలెను, ప్రేమయుక్తుఁడై యుక్తయోగము నెఱుంగనివారి నిక్రమమున ననుశాసింపవలయును. అనాది యగుపుణ్యాపుణ్యరూపకర్మములచే మూఢులగువారిని గర్మములందు నియోగింపవలయును. జనులు శ్రేయ స్సెట్టిదియో, తత్సాధనంబు లెట్టివియో తెలిసికొనలేక యతిశయించినకోర్కులు కలవారై సంతతమును శబ్దాదివిషయములనే కోరుచుందురు. కావున వారు శబ్దాదివిషయముల సుఖలేశములఁ గల్గించుకర్మములవలనఁ బరస్పరవైరము వహించి తన్మూలమునఁ బారము లేనిదుఃఖంబు నొందియు శ్రేయంబును దెలిసికొనఁజాలరు. ఓకుమారులారా! ఇట్లజ్ఞానసముద్రమున

మునింగి కర్మమార్గమున వర్తించుచు, శ్రేయస్సెట్టిదియో యెఱుంగక వర్తించుచున్నవానిం జూచి శ్రేయస్సును దత్సాధనములను దెలిసికొన్నవాఁడై, కావుననే హేయ మెద్దియో యుపాదేయ మెద్దియో చక్కఁగ నెఱింగినవాఁడై మిత్త్రుఁడై యున్న యేపురుషుఁ డైనను మగుడ వానిఁ గర్మమార్గమందుఁ బ్రవర్తింపఁజేయునా? మంచివారు దారిఁ దప్పిపోవుచున్న గ్రుడ్డివానిని యథార్థమార్గమందుఁ బ్రవేశింపఁ జేయఁ జూచుచుందురు కాని చెడుమార్గమందుఁ బ్రవేశపెట్టఁదలంతురా? మఱియు యోగోపదేశము చేసి సంసారబద్ధుఁడగువానిని సంసారమునుండి యెవఁడు విడిపింపఁడో వాఁడు సంసారబద్ధునికి హితముపదేశించువాఁ డైనను గురువు కాఁడు. వాఁడు తనవాఁడునుఁ గాఁడు. వాఁడు తండ్రియును గాఁడు. అట్లు చేయనిది తల్లియును గాదు. అది దైవమును గాదు. వాఁ డధిపతియును గాఁడు. ఈనాశరీరము సత్త్వగుణప్రచుర మైనది. కావునఁ దక్కిన రజస్తమఃప్రచురము లైనశరీరములవలెఁ గాక నా యీశరీర మూహింపఁ దరముకానిది. మఱియు సత్త్వగుణము నాహృదయ మని యెఱుంగుఁడు. అది ప్రవృత్తిధర్మములను బ్రకాశింపనీయక భాగవతధర్మములనుమాత్రమే ప్రకాశింపఁజేయుచుండును. తాదృశసత్త్వగుణప్రచుర మగుశరీరము గలవాఁడ నగుటచేతనే పెద్దలు నన్ను శ్రేష్ఠునిఁగాఁ జెప్పుచుందురు. ఓతనయులారా! సత్త్వగుణప్రచుర మగుశరీరము గలనావలనఁ బుట్టినవా రగుటచే మీ రందఱును సత్త్వగుణప్రచుర మగుశరీరము గలవారలే! కావున మీకు సోదరుఁడును, మీకుఁ బూజనీయుఁడును నగునీభరతుని నిష్కపటభావముచే సేవింపుఁడు. "నీకుమారుల మగుటచే నిన్నే సేవింతుము. రా

జపుత్త్రులకును కాన ప్రజలం బరిపాలించెద" మని యందు రేని వినుండు. నన్ను సేవించుటయును బ్రజాపాలనంబును, భరతుని సేవించుటవలననే గతార్థము లగును. ఇంతియకాక భాగవతుల నుకూడ సేవించుచుండుండు. భగవద్భక్తులు లోకమునం గల యందఱికంటెను శ్రేష్ఠు లని చెప్పవచ్చును. లతాదిస్థావరముల కంటె జంగమముల శ్రేష్ఠములు. వానిలో జ్ఞానసహితములగు పశ్వాదులు కీటాదులకంటె నుత్తమములు. వానికంటె మను ష్యు లుత్తములు. వారికంటెను బ్రమథులు, వారికంటె గంధ ర్వులు, వారికంటె సిద్ధులును, వారికంటెం గిన్నరాదులును వారికంటె ననుకులును, వారికంటె నింద్రాదిదేవతలును, వారి కంటె దక్షాదులును శ్రేష్ఠులు. వారికంటె రుద్రుండు శ్రేష్ఠుండు. అతనికంటె బ్రహ్మ శ్రేష్ఠుడు. అతనికంటె నేను శ్రేష్ఠుండను. నా కంటెను బ్రాహ్మణులు శ్రేష్ఠులు. అనిబుషభు డుంకుమారుల తోం జెప్పి యచ్చట నున్నవిపులం గాంచి "ఓబ్రాహ్మణులారా! లోకమున విప్రులతో సమమైనవారినిం జూడను. సమానులనే చూడలేనప్పు డధికులను జూచుట యెట్లు? బ్రాహ్మణముఖమం దు శ్రద్ధతో వేల్వంబడినయన్నాదులను స్వేచ్ఛచే భుజియించిన ట్లగ్నియందు వేల్వంబడినదానిం జనజాలను. మఱియుం జిరంత నము లైనవేదములు నాశరీరము. వేదాఖ్య మైననాశరీర మీా లోకమ్మున బ్రాహ్మణులచే ధరింపంబడుచున్నది. ఆబ్రాహ్మణులందు నిరతిశయపవిత్ర మగుసత్వగుణము ప్రతిష్ఠింపంబడినది. వారి యందు నంతరింద్రియనిగ్రహంబును బాహ్యేంద్రియనిగ్రహంబు ను, సత్యభాషిత్వంబును, భూతానుగ్రహంబును, కృచ్ఛ్రాదితపం బును, శీతోష్ణాదులను సహింప గలశక్తియుం, బరమాత్మత

త్త్వానుభవంబును బ్రతిష్ఠితము లైనవి. బ్రహ్మాదిదేవతలనుండి కాని, స్వర్గంబునకును నపవర్గంబునకు నధిపతి నగునావలననుండి కాని, యెవ్వరు పొందదగినవస్తువు లేనివారో, యట్టిబ్రాహ్మణులు నాయం దత్యంతభక్తి గలిగియున్నారు. వారి కైహికపురుషార్థంబులతో నేమి పని? ఓ తనయులారా! చరాచరములతోఁ గూడినప్రపంచ మంతయును నాకు శరీర మగుటచేఁ బ్రకృతికిని, జీవునకును, బరమేశ్వరునకును, భేదమును గనుగొన్న మీరు ప్రతిక్షణంబును భూతముల సమాదరించుచుండవలెను. అదియే నాకు ముఖ్యమైనయారాధనము. మనంబును, వాక్కును, నేత్రంబులును, దక్కనయింద్రియంబులును జేయుపనులకు ముఖ్యఫలము నాయారాధనమే. నాయారాధనము చేయకుండ నేపురుషుఁడైనను గాలపాశరూప మగుమోహమునుండి విముక్తుండు కానేరఁడు." ఓ రాజా! ఋషభుం డిట్లు లోకమును జక్కగా ననుశాసించుటకుఁ దగినజ్ఞానమును దనకుమారులకుఁ గలిగించి మహానుభావుఁడై, సర్వభూతములందు సమమగు హృదయంబు గలవాఁడై, యింద్రియనిగ్రహసమర్థులై, నివృత్తిప్రవృత్తి ధర్మములనుండి మఱలి మహర్షులై యున్నవారికి భక్తిని, జ్ఞానంబును, వైరాగ్యంబును, నుపదేశించుచుఁ, దననూర్వురుకుమారులలో జ్యేష్ఠుఁడును, బరమభాగవతోత్తముండును, భక్తజనులందుఁ బ్రేమ గలవాఁడును, నగుభరతుని భూపరిపాలనమందు నియోగించి పట్టాభిషేకముఁ జేసి, వస్త్రాభరణాదులనుఁ దక్కిన దేహానుబంధములను వదలి, దిగంబరుఁడై విడి వ్రేలాడుచున్న కేశపాశము గలిగి, యాత్మయం దాహవనీయాదు లగునగ్నుల నారోపణము చేసికొని సన్న్యాస మవలంబించి బ్రహ్మావర్తము

నుండి కదలిపోయెను. మార్గమధ్యమందు జనులు తన్ను మాటలాడించుచున్నను బలుకక, జడునివలెను. గ్రుడ్డివానివగిదిని, జెవిటి

ఋషభుండు సన్న్యసించి నడవులకేగుట

వానివలెను, మూఁగవానివలెను బిశాచగ్రస్తునిచందంబునను, నున్మత్తునిరీతిని వర్తించుచు, నవధూతవేషమున నొప్పుచు, మౌనవ్రత మవలంబించి మాట్లాడుట విడిచిపుచ్చెను. మఱియు నాఋషభుండు పోవుచున్నప్పుడు ప్రతిమార్గమందును, నగరంబులును, గ్రామములును, నాకరములును, గృషీవలాదులు నివసించుపల్లెలును, గిరాతాదులపల్లెలును, బుష్పవాటికలును, సేనానివాసస్థలంబులును, గోశాలలును, గొల్లపల్లెలును, యాత్రార్థ మరుగుచున్న జనసంఘంబులును, బర్వతంబులును, వనంబులును, మున్యాశ్రమంబులును, దాఁకసించుచుండెను. అయిన నతఁడు వానిం బడి పోవునప్పు డాతనివికృతవేషముం జూచి తుంటరిబాలకులు భయపఱచుచున్నను, గొట్టుచున్నను, మీఁద మూత్రమును విడిచి యుమియుచున్నను, ఱాలు రువ్వుచున్నను, మలమును విసర్జించుచున్నను, ధూళిఁ జల్లుచున్నను, దుర్గంధవాయువులను వదలుచున్నను, నోటికి వచ్చినట్లెల్ల వదరుచున్నను, మదపుటేనుఁగును మూఁగుచున్నయీఁగలవలె సరకుగొనక పరిభ్రమించుచుండెను. ఇంతియ కాక యాతఁడు ప్రకృతిపరిణామరూప మై, దేహమే యాత్మ యనుభ్రాంతి గలవారి కాత్మతత్త్వ మనుటలో విషయ మగు శరీరమందు దదనుబంధులందును, స్వాత్మపరమాత్మతత్త్వమువలనఁ గల్గిన స్వస్వరూపజ్ఞానము గలవాఁ డగుటచే నహంకార మమకారంబులను విసర్జించి బ్రహ్మసాక్షాత్కారమువలన నంతటను సమబుద్ధి గలిగి,

యసహాయుఁడై క్రుమ్మరుచుండెను. ఓ పరీక్షిన్నరేంద్రా! ఆఋషభుని చేతులును, పాదములును,విశాల మగు వక్షఃస్థలంబును, దీర్ఘము లయిన బాహువులును, బలిసినభుజశిరస్సులును, గళంబును, వదనంబును, దక్కుఁగలయవయవంబులును, మిక్కిలిసుకుమారములై, సౌష్ఠవము కలవై యుండెను. కావుననే యతఁడు స్వభావము చేతనే మిక్కిలి సుందరుండై యుండెను. అతనిముఖము సర్వకాలములందును స్వభావసిద్ధ మగు మందహాసముచే సుందరమై యుండెను. అతనికనీనికలు తాపహారకములై మనోహారములై యుండెను. అతని నేత్రము లరుణకాంతి కల్గి యభినవపద్మములను బురుడించుచుండె. అతనికపోలాదులు శోభాస్పదములై యుండెను. అతండు చిఱునవ్వు గలవదనచంద్రుని విలాసములచేఁ బురస్త్రీలకు డెందములందు మోహము నుదయింపఁజేయుచుండెను. అతని కేశకలాపము వక్రమై,పచ్చసరంగు గలదై జటలు గట్టి జానువులఱకు వ్రేలాడుచుండెను. అవధూతవేషము గలదగుటచే మలిన మైనతనశరీరము చేత నాతఁడు చూపఱకుఁ బిశాచగ్రస్తునివలెఁ గానవచ్చుచుండెను. భగవంతుఁడగునాఋషభుండు జనులు యోగమునకుఁ బ్రత్యూహవినోధు లైనట్టును, వారికిఁ బ్రతీకార మొనర్చుట నింద్యకార్య మయినట్టును, దెలిసికొనినప్పుడు దేశాటనమును విడిచి యొక్కచో నుండియే ప్రారబ్ధము ననుభవింప నిశ్చయించికొని, శయనించియె తినుచుఁ గొఱుకుచుఁ నమలుచు మూత్రమును బురీషంబును విడుచుచు,నామూత్రపురీషములందె మునుఁగుటచేఁ దన్మిశ్రిత మైనదేహము కలవాఁడై యుండెను. అట్లతని దేహము మూత్రపురీషములలోఁ బడియున్న దుర్వాసన కలదై దగ్గఱు

వారికి రోఁత పుట్టింపలేదు. యోగప్రభావమువలన నతనిపురీషము మిక్కిలి పరిమళము కలదై దశయోజనంబులపర్యంతం బును వ్యాపించుచుండెను. ఇట్లతఁడు గోమృగాదులవృత్తి నవలంబించి నడుచుచు, నిలుచుచు, నుపవిష్టుం డగుచు శయనించుచునే త్రాగుచుండెను. మూత్రపురీషాదులను విడుచుచుండెను. యోగీశ్వరు లిట్లాచరింపవలయు నని లోకమునకుఁ దెలుపు నిమిత్తము నానావిధము లగుయోగవ్రతముల నాచరించుచు, మోక్షాధిపతియును, భగవంతుఁడును, నగు నాఋషభుండు, తెంపు లేనిపరమానందము ననుభవించుచు నబ్రహ్మాత్మక మగు స్వతంత్రవస్తుభేదము లేదనెడిజ్ఞానము కొంచెమైనను లేనివాఁ డగుటచేఁ దనయందును నిఖిలభూతంబులకును శరీరభూతుఁడగు వాసుదేవునియందును,రవంతైనను భేదంబు గానక యందువలన సమస్తార్థసిద్ధులను బొంది, కావుననే యాకాశగమనము, మనోజవము, దిరోధానము. పరకాయప్రవేశము, దూరస్థము లగు వస్తువుల గ్రహించుటయు, దూరస్థము లగుశబ్దములను వినుటయు, మొదలగు యోగసిద్ధిఫలములు గలవాఁడై వర్తించియు మనస్సంతుష్టినిఁ జెందలేదు. ఇది యైదవయధ్యాయము.

అని చెప్పుచున్నశుకయోగిపలుకులు విని రాజిట్లనియె. ఓమునీంద్రా! ఆత్మారాము లగుయోగులు యోగాగ్నిచే సమస్త కర్మబీజంబులను దొలంగించుకొందురు.కర్మబీజములు పూర్తిగ నశించుటచే వారొకవేళ యోగసిద్ధుల నవలంబించి వర్తించినను సంసారము లభింపదు. కర్మవాసనలు లేనప్పుడు కష్టము లనుభ

వించు టెట్లు? ఇట్లుండ నావృషభుండు యోగసిద్ధిఫలము లగు నాకాశగమనాదులవలన నేల సంతుష్టినిఁ జెందలేదు? అందులకుఁ గారణము వచింపుము" నావుడు శుకయోగీంద్రుం డి ట్లనియె.
ఓరాజేంద్రా! నీ వడిగినప్రశ్నము యుక్తముగా నున్నది. లోకములోఁ గిరాతుఁడు మృగము తనకు వశ మగునంత పర్యంతమును, మృగమున కధీనుఁ డైన ట్లుండి, వంచించి వానినిఁ జంపుచున్నాఁడు. అట్లె మనస్సును మొదట వశ మైనట్లు గానవచ్చుచున్నను, జితమనస్కు లైన నొకవేళ భోగాసక్తిచే మనంబునకుఁ బరవశు లైనచో, నది వారిని స్వాధీనులనుగాఁ జేసికొని సంసారమును గల్గింపక మానదు. ఆహేతువుచే నాత్మార్థు లతిచంచలం బగుమనంబు నెంతమాత్రమును నమ్మఁజాలరు. కావున ఋషభుండు యోగప్రభావమువలనఁ గలిగినసిద్ధులకు సంతసింపలేదు.
ఈయర్థమునే కొందఱుమహాత్ములు "మనస్సును విశ్వసించి ప్రవర్తించినచోఁ జిరకాలముకష్టపడి సంపాదించుకొన్న జ్ఞానమయం బగుతపంబు నశించును. గావునఁ జంచలమనంబునం దెట్టిజితేంద్రియుఁ డైనను, మనంబు వశ మైన దనుబుద్ధి నుంచుకొనరాదు" అని నిర్వచించి యున్నారు. ఓరాజా! మనంబునందు విశ్వాసముంచినయోగి వెంటనే కామమునకు యోగమూల మగునైశ్వర్యమును బుద్ధిహీనతచే సమకూర్చుచుండును. అట్లు కామమున కవకాశము చిక్కినవెంటనే కామము ననుసరించియే క్రోధాదిశత్రువు లుదయ మందును. కృతవిశ్వాసము గలయోగిమనం బా క్రోధాదులకుఁ గూడఁ దగిన యవకాశ మిచ్చి జారకాంత జారపతి కవకాశ మిచ్చి, తన్ను విశ్వసించియున్నను భర్తను జంపినచందంబున నాయోగిని సంసారమందుఁ బడవైచి మృత

తుల్యునిఁ జేయును. కామము, క్రోధము, మదము, లోభము, శోకము, భయము మొదలగునవి యంతశ్శత్రువులు. వాని కవకాశ మీరాదు. యోగమూలము లగునైశ్వర్యముల ననుభవింపవలెనన్న యాసక్తివలననే కర్మబంధము సంభవించుచుండును. కర్మబంధంబును గల్గించునాయైశ్వర్యమును గామాదిమూలముగా నజ్ఞుఁడు స్వీకరింపవలెను, గాని పండితుఁ డెవండైన నంగీకరించునా? అందువలన ఋషభుం డాయోగైశ్వర్యము నంగీకరింపలేదు. సమస్తలోకంబులకును నలంకారభూతుఁ డగునాఋషభుండు విలక్షణములచే జడునివలెఁగానవచ్చుచు,నవధూతలక్షణములచేఁ దనయం దున్నభగవత్ప్రభావమును గప్పి పుచ్చుచు, యోగీశ్వరులకు దేహత్యాగక్రమమును నేర్పుచు, దనశరీరమును విసర్జింపఁ దలంపు గలవాఁడై, యజ్ఞానతిరోహితుఁ డగుప్రత్యగాత్మను బరమాత్మకు శరీరభూత మయియున్నట్లు సాక్షాత్కరించుకొని ప్రారబ్ధము నశించుటచే దేహమును విడిచిపుచ్చెను. ఓరాజా! ఆఋషభుఁ డెచ్చట నేవిధంబున దేహమును విసర్జించెనో చెప్పెదను వినుము. ఆఋషభుఁ డిట్లు శరీరాభిమానమును విడిచినను యోగమాయావాసనవలన దేహాభిమాన మున్నట్లు తోఁపింపఁజేయుచు,నీభూమండలంబున సంచార మొనరింపఁ దలంచికొని, యొకప్పుడు కొంకణము, వంకపటము, కుటకము, నాఁబడు దక్షిణకర్ణాటదేశమునకు స్వేచ్ఛచేఁ బోయి, కుటకాచలమునకు సమీపముననున్న యుపవనములందు నివసించి నోటిలో నొకఱాయి యుంచుకొని, కేశకలాపము విడి జీరాడుచుండఁగా, దిగంబరుఁడై సంచరించుచుండ, సమీరకంపితము లగుబొంగు పొదుళ్లవలన నుదయించినదావాగ్ని యావనంబును ఋషభుని

దేహముతోఁ గూడ దహించెను. చతురాశ్రమాతీత మగు నాఋషభుని చరిత్రము విని కోరక వంకపట దేశముల కధిపతి యగు నర్హతుఁ డను రాజు ఋషభుండాచరించిన వ్రతములు శాస్త్ర విహితము లని తలంచుచు, వైదికధర్మముల నతిక్రమింప నిశ్చయించి, యన్ని విధముల చేతను భయరహిత మగు స్వధర్మమును విసర్జించి తాను స్వయముగ ఋషభుఁ డాచరించిన యాచారములను నాచరించి లోకుల కుపదేశింపఁగలఁడు. 'అతని ప్రేరణముచే జనంబు లట్లు ప్రవర్తింతురా?' అనుసందేహము వలదు. కలియుగమునం దధర్మము వృద్ధిపొందును గాన జనంబులు నిజ పాపకర్మమూలక మగు నజ్ఞానముచే యుక్తములు కాని పాషండ వ్రతముల నాచరింపక మానరు ఓరాజా! మునుమున్న నికృష్టులైన మానవులు దైవమాయచే మోహితులైరి. ఆమీఁద నార్హతుని బోధమువలన మఱింత మోహితులై తమతమ వర్ణాశ్రమముల కనుకూల మగు ధర్మవిధివలనఁ బ్రాప్త మయిన నియమమును, శౌచమును సంధ్యోపాసనాదులను,విడనాడి, దేవహేళనాదిరూపము లగు కుత్సితవ్రతముల నాచరించుచు, నధర్మప్రచుర మైన కలివలన సమస్తవివేకంబును నశించుటచే స్నానాదుల నాచరింపక, యాచమనం బొనరింపక, శౌచవంతులై యుండక, క్షౌరాదికముఁ జేయింపక వేదములనుఁ బరమపురుషుని భక్తజనులను మిక్కిలి నిందించుచుఁ బ్రవర్తింతురు. వేదోక్తము కాకపోవుటచే నిర్మూలమైన యార్హతస్మృతిచే బోధితము లగు నుపధర్మములందు నమ్మకము గల్గి వర్తించుచున్నవారు తుదను నంధతమస మను నరకకూపమునకుఁ బోదురు. ఓయీ! భగవదవతార మగు ఋషభుం డిట్లొనరింప వలసినయవసర మేమి?

లోకము నిట్లు మోహింపఁజేయుట తగునా?" యని యందువేని చెప్పెదను వినుము. ఓరాజా! రజఃప్రచురులైనవారికి యోగచర్యావిశేష మగు మోక్షమార్గమును బోధించుటకే యీయవతారము స్వీకరించెను. అందుచే నతఁడట్లొనరించెను. ఆతని గుణప్రభావమును దెలుపుకొన్నిశ్లోకంబులు గలవు వానియర్థము నీకు వినిపించెదను; సావకాశచిత్తుండవై వినుము. "అయారే! భూమి సప్తసముద్రములతోఁ గూడియున్నది. అది యేడుద్వీపములుగా విభక్తమైనది. ఆద్వీపము లన్నింటిలోను,జంబూద్వీపము త్తమ మయినది. దానియందున్ననవవర్షములలోను, భారతవర్షము పుణ్యప్రద మైనది సంతత మందలిజనులు వానుదేవుని యవతార మగుఋషభుని మంగళదాయకము లగుయుక్తకర్మములను గానముచేయుచుండ నాభారతవర్ష మేల పుణ్యప్రదము కాదు? దేనియందుఁ బురాణపురుషుఁ డగునారాయణుఁడు ఋషభుం డవతరించెనో, యాప్రియవ్రతవంశము లోకమున విమలకీర్తిసంపన్నమై యొప్పుచున్నది. ఆఋషభుఁ డాదిపురుషుఁడే. అతఁడు మోక్షహేతుకము లగుధర్మముల నడపెను. అతఁడు యోగప్రభావజన్యము లగునాకాశగమనాదిశక్తులు తమంతఁ దామే సేవింపవచ్చుచున్నను, నవి యనిత్యములని తిరస్కరించె. అట్టి శక్తుల నత్యాదరముతో నపేక్షించుయోగు లాఋషభుని నియమమును మనంబుచేతనైన ననుసరింప సమర్థు లెట్లు లగుదురు?" అని యివ్విధంబున లోకులందఱును నాఋషభునిఁ గొనియాడు చుండుదురు. ఓనరేంద్రా! సమస్తవేదములకును, లోకములకును, దేవతలకును, బ్రాహ్మణులకును, గోవులకును, గురువయినఋషభునిచరిత్రము పవిత్రమైనది. ఇది సమస్తదుశ్చరి

త్రంబులను నశింపఁజేయును. ఇది యుత్కృష్టమంగళములకుఁ బ్రధానస్థానము. క్రమముగా వర్ధిల్లెడుశ్రద్ధచే సంతతమేపురుషుఁడీ చరితమును వినుచున్నాఁడో యెవండు దీనిని వినిపించుచున్నాఁడో, యాయిరువురికిని భగవంతుఁడగువాసుదేవునియందవ్యభిచరితము గానిభక్తి యుద్భవించుచున్నది. ఆభక్తివలన సమస్తమును సాధింపఁబడుచున్నది.ఆభగవద్భక్తి పరమాత్మానుభవ మనెడిసుధారసమునకు నిలయ మైనది. విద్వాంసు లాభక్తిసుధాపయోనిధియందు సంసారతాపమువలనఁ దపింపఁబడిన యాత్మలను సంతతమును దడిపి యాతాపములఁ దొలంగించి కొని తజ్జనిత మగునిరతిశయానందము నంది, పరమపురుషార్థరూప మగుమోక్షఫలమును సైతమును మిక్కిలి యాదరింపరు. వారు భక్తివలననే సమస్తపురుషార్థములను బొందుచున్నారు. ఓరాజా! తాదృశభక్తిని మించినవస్తువు వేఱొకటి లోకమందు లేదు సుమీ ? ఇట్లు భక్తివలన సర్వార్థములును లభించుచున్నవి. కాని యాభక్తిమాత్రము సులభసాధ్యము గాదు. ఓ రాజా! నీతాత లగుపాండవులకును,యాదవులకును, శ్రీకృష్ణుఁడు దైవమై, ప్రియుఁడై, పాలకుఁడై, హితోపదేష్ట యై వర్తించుచుండెనుగదా? వెక్కెల? పాండవులకుఁ గింకరుఁడై దూత్యాది కార్యంబులు సైతమత్యాదరంబున నొనర్చెఁగదా! అట్లు శ్రీకృష్ణుఁడు వశంవదుఁడై నట్లు వర్తించినను, బాండవాదులకును నిత్యము సేవించుతక్కినవారికిని ముక్తియోగమునొసంగెనుగాని భక్తియోగము నొసంగలేదు. దీనివలన ముక్తికంటెను భక్తియోగము దుర్లభ మైనట్లు స్పష్ట మగుచున్నదికదా ! సర్వకాలములం దనుభూత మగుస్వస్వరూపము లభించుటచే నితరపురు

ష్ఠములం దాశ లేనివాఁడై పాపకర్మాచరణముచే శ్రేయస్సునందు, బ్రవేశింపనిబుద్ధి గలదీనులను గనికరించి సంసారభయనివర్తక మగుస్వరూపజ్ఞాన ముపదేశించినవాఁ డెవండో యట్టి ఋషభునకు నమస్కారములు. ఇది యాఱవయధ్యాయము.

"ఓరాజా ! పరమపవిత్ర మగుఋషభచరిత్రమును సాంతముగాఁ జెప్పితిని. ఇఁక నతనిపుత్రుం డగుభరతునివృత్తాంతమును జెప్పెదను వినుము. ఆభరతుఁడు భాగవతోత్తముఁడు. భగవంతుఁ డగుఋషభునిచే నతఁ డవనీతలపరిపాలనార్థము నియుక్తుఁ డై, జనకాజ్ఞను దలధరించి భూతలమును బాలించుచు విశ్వరూపునికుమారిక యగుపంచజనిని బెండ్లియాడెను. అనం

భరతోపాఖ్యానము.

తర మాభరతుఁ డామెయందు దామసాహంకారము శబ్దస్పర్శాదులనుంబోలె సర్వవిధంబులచేతను, దనకుఁ దుల్యు లయి సౌందర్యవంతు లైనయైదుగురఁ బుత్త్రులను బడసెను. వారు,సుమతి, రాష్ట్రభృతుఁడు,సుదర్శనుఁడు, ఆవరణుఁడు,ధూమ్రకేతువను నామములు గలవారు. ఓరాజా! భరతుఁ డీవర్షమును బాలించుటచేత నే చుమీ దీనికి భారతవర్ష మనుపేరు లభించినది! సమస్తవిషయములను దెలిసినయాభరతుండు తాను దనధర్మమును నువర్తించుచుఁ బ్రజలను దత్తద్వర్ణోచితధర్మములందు నియోగించుచుఁ దండ్రివలెను, దాత యగునాభివలెను,బ్రజానురంజకముగాఁ బుడమిఁ బరిపాలించెను. అనంతర మతఁడు దేవపూజారూపము లగుయజ్ఞములను, దేవతలకు ద్రవ్యత్యాగరూపము

లగుక్రతువులను బెక్కింటి నొనర్చి పరమపురుషు నారాధించెను. మఱియు నతఁడు ప్రకృతు లనఁబడునాగ్నేయేష్టులను వికృతులు నాఁబడుసౌర్యేష్టులను,శ్రద్ధాళువై యొనరించి, భగవదనుగ్రహమును సంపాదించెను. ఆభరతుఁడు, లోపింపనియజ్ఞసాధనములును, క్రియాకలాపములును, గలిగి నానావిధములుగాఁ బ్రవృత్తము లగుయాగాదులందుఁ జాతుర్హోత్ర మనఁబడుకర్మకలాపము తత్తదనుగుణముగాఁ బ్రవర్తించునట్లు చేసి యాగాదిసాధ్య మగుఫలమును యజ్ఞపురుషుఁ డగుపరమపురుషునకు సమర్పించి,యాయామంత్రము లాయాదేవతలనామములచే నొప్పుచున్నను నవి యన్నియు నాయింద్రాదుల కంతరాత్మ యగువాసుదేవునియందే పర్యవసన్నము లగుటచే నాయామంత్రములు వాసుదేవమంత్రములుగాను, భావించుచుఁ దనచాతుర్యముచే సమస్తకర్మవాసనలను దొలంగించుకొని, యధ్వర్యులు హోమద్రవ్యములఁ గొని యింద్రాదుల నుద్దేశించి వేల్చుచుండ నాయింద్రాదులను బరమపురుషుని యవయవములుగా ధ్యానించుచుండెను.ఇట్లు భరతుఁడు భగవదారాధనరూప మగు కర్మకలాపము నొనరించుచు, నందువలన నిర్మలాంతఃకరణుఁ డయ్యెను.అంత నాభరతునకు హృదయాంతర్వర్తి యగుజీవుఁడు శరీరముగాఁ గలవాఁడును, భగవంతుఁడును, సర్వమున కంతరాత్ముఁడై వెలయుచున్నవాఁడును, మహాపురుషాకారము గలవాఁడును, శ్రీవత్సము, కౌస్తుభము, వనమాల, శంఖము, చక్రము, మొదలగువానిచేఁ బ్రకాశితుండును, నగుపరబ్రహ్మమును దననిర్మలహృదయమందుఁ బ్రకాశించుచుండ నతనియందు సునిశ్చలమై, దినదినాభివృద్ధి గలుగుభక్తి యుదయించెను. ఇట్లు భర

తుండు పదివేలసంవత్సరములపర్యంతమును సత్కర్మము లాచరించి, తాను రాజ్యభోగాదు లనుభవింపవలసినసమయ మతిక్రమించె నని నిశ్చయించి వంశపారంపర్యముగ లభించి తనచే ననుభూత మగుధనంబును బుత్త్రులకు యథాక్రమముగఁ బంచి యిచ్చి, సకలసంపదలకును మూలభూత మగుతనమందిరంబును విడిచి పులహమహర్షి కాశ్రమ మగుసాలగ్రామక్షేత్రంబున కరిగెను. ఓరాజా! ఆపులహాశ్రమము మిక్కిలి పవిత్రమైనది. అందు నివసించి యున్నభక్తజనుల కిప్పుడును భగవంతుఁ డగువాసుదేవుండు స్వేచ్ఛారూపమును ధరించి ప్రత్యక్ష మగుచుండును. అందుఁ జక్రనది యనుతరంగిణి ప్రవహించి సమస్తప్రదేశములను బవిత్రీకరించుచున్నది. భరతుఁ డాయాశ్రమమును బొంది యసహాయుఁడై, వివిధము లగుకుసుమములచేతను, చిగుళ్లచేతను, తులసీదళములచేతను, జలముచేతను, కందమూలాదినైవేద్యములచేతను, భగవదారాధన మొనర్చుచు, విశుద్ధ మగునాహారమునుఁ గొనుచు, విషయాభిలాషనుండి మరలి, యింద్రియనిగ్రహము గలిగి, ప్రీతిరూప మగుభగవద్భక్తిని బొందెను. ఇట్లు క్రమంబుగా నభివర్ధిల్లిన పరమపురుషపరిచర్యచే నాభరతునకు నిరతిశయకీర్తి యగుభగవంతునియందు మిక్కిలి యనురాగ ముద్భవిల్లెను. ఆయనురాగాతిశయముచే నతనిహృదయము ద్రవింపఁజొచ్చెను. ఆనందాతిశయముచే నతనిదేహమందుఁబులకాంకురంబులుప్పతిల్లెను. ఉత్కంఠాతిశయమువలనఁ గల్గినయానందబాష్పములచే నేత్రంబులు నిరుద్ధంబు లయ్యె. ఇట్లా భరతుఁడు నిరతిశయప్రీతివిషయుఁ డగుభగవంతునియరుణము లగుచరణారవిందములనవరతమును ధ్యానించుటచేవర్ధిల్లినభక్తియో

గానంద మనెడి లోఁతగుహ్రదమం దతనిబుద్ధి నిమగ్నమైయుండు టచే నతఁడు తా నొనరించుచున్న భగవత్పూజను మనంబులో స్మరించుకొనలేదు. ఆభరతుఁ డట్లు భగవద్వ్రతములను జేయుచు లేడిచర్మమునే వస్త్రముగా ధరించి, ప్రతిదినంబును త్రికాలము లందును స్నానంబు లాడుటచే నార్ద్రములై, గోరోచనవర్ణమున నొప్పుకుటిలము లగు కేశకలాపముచేఁ బ్రకాశించుచు సూర్యుఁ డుదయించుచుఁ దానును లేచి సూర్యాంతరాత యగుభగవం తునిఁ దెలుపు ఋక్కులందుఁ జెప్పఁబడినట్లు ధ్యానము చేయుచు, "ఎవఁడు సంకల్పరూప మగుజ్ఞానముచేఁ జిదచిదాత్మక మగు ప్రపంచములు సృజించెనో, యెవఁడు స్వశరీరకుఁడై నజీవునిమూల మున నాప్రపంచమునందుఁ బ్రవేశించి, శబ్దాదివిషయములను గో రుచుఁ గర్మఫలంబుల ననుభవించుచున్నజీవునకు ద్రష్టయై యు న్నాఁడో, యెవఁడులోకప్రసవమునకుఁగారణభూతుఁడో, వాఁడా పరమేశ్వరసంబంధియును, బ్రకృతిమండలము నతిక్రమించినదియు నగు తేజోమయరూపమును బొందుచున్నాఁడు" అని యిట్లు పలి కెను. ఇది యేడవయధ్యాయము.

ఓ వసుంధరాధిపా! ఆభరతుఁ డొకనాఁడు చక్రనదియందుఁ స్నానంబు లాడి నిత్యనైమిత్తికకర్మము లాచరించి, ప్రణవములు జపించుచు నానదీతీరమున మూఁడునిమిషముల కాలము కూర్చుం డెను. ఆసమయంబున నొకయాఁడులేడి దగ నొని యన్నదీజ లంబులఁ ద్రావఁ దలంచి తత్సమీపంబున కసహాయ మై వచ్చి జలము త్రావుచుండఁగా నచ్చటికి మిక్కిలి దాపున భయంకర

మగుసింహనాదము వినవచ్చె. అంత నానినాదమును విని స్వభా
వముచేతనే భయశీలయై, చంచలదృష్టి గల యాయాఁడులేడి
సింహముభయంకరధ్వని వినుటవలన నత్యంతవ్యాకులహృదయ
యై తొంటికంటెఁ జలించుచున్న నేత్రములు గలదయి దప్పితీర్చు
కొనకయే, యానదిని దాఁటి పోవుచుండెను. ఆసమయంబున
బూర్ణగర్భముతో నున్న యాలేడిగర్భము, స్వస్థానమునుండి
కదలి ప్రవాహమునందుఁ బడెను. గర్భపాతముచేతను, నదీతర
ణముచేతను, భయముచేతను, బీడిత యగునాలేడి పర్వడి యొక
కొండగుహను జేరి యాయాసమునఁ గ్రిందఁబడి మృతి నొందెను.
భరతుఁ డట్లు ప్రవాహమునఁ బడి కొనిపోఁబడుచున్న యాలేడిపి
ల్లను జూచి తల్లి మృతినొందె ననియు, దండ్రి మొదలగుబంధు
వులచే విడువఁబడిన దనియు, దానియందు దయవహించి హస్త
ముచే దానిఁ బట్టికొని, తనయాశ్రమమును బొందించెను. అనం
తర మాభరతుఁ డాలేడిపిల్లయందుఁ దన దనెడియభిమానముం
చి ప్రతిదినమ్మును దాని కాహారాదు లొసంగి పోషించుచు,
వ్యాఘ్రాదులనుండి రక్షించుచు మేనిదురదను దొలంగించి సంత
సింపఁ జేయుచు, చుంబనాదులచే దాని లాలించుచు, వర్తించు
చుండెను. ఇట్లతఁడు సంతతంబును దానిఁ బెంప నాసక్తుఁడై
యుండుటం జేసి భగవత్పరిచర్యాదులును, దనశౌచాచారాదు
లును, నహింసాదులును. వెక్కేల? సమస్తధర్మములును బ్రతి
దిన మొక్కొక్కటిచొప్పునఁ గొన్నిదినము లరుగునప్పటికి ధర్మ
ములన్నియు నశించెను. ఆభరతుఁ డాలేడిపిల్లను జూచినప్పుడు,
తనమనంబున "అక్కటా! పాపము. ఈలేడిపిల్ల కాలచక్రవేగ
మువలన జాఱి నేలఁబడినది. తనమందను విడిచిన దగుటచే మి

క్కలిదైన్యము పొందియున్నది. ఇది నన్నుఁ శరణుఁ జొచ్చినది. ఇది, నన్నే తండ్రినిగాను, దల్లినిగాను,బంధువులనుగాను దలంచుకొనుచున్నది. ఇది తనసంఘమును నమ్మక నన్నే నమ్ముచున్నది. ఇది నన్నే రక్షకునిఁగాఁ దలంచికొను చున్నది నాకంటె వేఱొకరక్షకుని నెఱుఁగదు. ఇట్లన్నివిధములచేతను నన్నే శరణ మని భావించుచున్నయీ లేడిపిల్లను బోషించుటయును, రక్షించుటయును, సంతసింపఁ జేయుటయును, లాలించుటయును, నా కవశ్యాచరణీయములు. ఇందువలన నాకార్యములు నశించుచున్న వని కోపము వహింపక దీనిఁ బోషించుట నాకు విహితము. ఇంతియ కాక శరణాగతులను దిరస్కరించుట పండితులకుఁ దగదు. మఱియు నది పాపజనకము కాక మానదు. లోకములోఁ బరోపకారశీలురును, శాంతస్వభావులును నగుపండితులు దీనులందు దయ యుంచి,శరణాగతరక్షణమువిషయమై యెంతగొప్పవైనను స్వప్రయోజనంబులను విడువకమానరు'' అని యిట్లు తలంచుకొనుచు, దానియం దత్యాదరము కలవాఁ డాయెను. అదిమొద లతఁడు ప్రతిదినంబును, దానితో నొకచో నుపవేశించుచుండెను. దానితోఁగూడ విహరించుచుండెను; దానితోఁగూడఁ గందమూలాదులను దినుచుండెను. ఇట్లాభరతుఁడు లేడిపిల్లయం దధికస్నేహము కలవాఁడా యెను. ఓరాజా! భరతుఁడా లేడిపిల్లయం దధికస్నేహము గలవాఁడగుటచే,నొక్కొక్కప్పుడు తాను, దర్భలను, బుష్పములను, జలమును సంపాదించుకొనఁ బోవలసినప్పుడు వృకాదులవలన నపాయము సంభవించునేమో యని శంకించుచు నామృగకిశోరముతోడనే వనమందుఁ బ్రతిమార్గమందును, దనవెనువెంటఁ ద్రిప్పుకొనుచుఁ బోవునప్పు

డా లేడిపిల్ల, సౌకుమార్యముచేఁగాని మూఢత్వముచేతఁగాని త
నతో రాక వెనుకఁబడినచో, నాభరతుఁడు ముందున కరుగ
సమర్థుఁడు కాకుండెను. అది యెప్పటికిని రానప్పుడు దానిఁ దన
స్కంధమున నిడికొని యింటికి వచ్చుచుండెను. మఱియు నతఁ
డత్యాదరమునఁ గూర్చున్నప్పుడు తొడపై నిడికొనియు, శయ
నించినప్పుడు ఱొమ్మునందు శయినింపఁజేసికొనియు లాలనచేసి య
ధికముదము నందెను. ఇంతియ కాక యాభరతుఁడు నిత్యనై
మిత్తికాదిక్రియలు నెఱవేర్చుకొనునప్పుడు నెడనెడ లేచి యా
మృగశిశుకమును జూచి మనంబున మిక్కిలి సంతసించి, దాని
నుద్దేశించి "ఓమృగకిశోరమా! సర్వకాలములందును సర్వదేశ
ములందును, నీకు శుభ మగుఁగాక" అని యాశీర్వచనము లి
చ్చుచుండును. అట్టిసమయములం దామృగశిశువు కానరానిచో
నతఁడు మిక్కిలి భయపడుచు, ధనము గోల్పోయినవానిచందం
బున దీనుండై దుఃఖించుచు నా లేడిపిల్లయెడఁ గాటునలన డెం
దంబున నమందసంతాపము ననుభవించుచు నధిక మగుమోహ
మును జెంది యిట్లు పరిదేవించుచుండును. "అకటకటా! పాప
ము! ఈమృగశిశువు మిక్కిలి దయనీయ మైనది. నేను వంచకుఁ
డగుకిరాతునిరీతిని గఠినచేతస్కుఁడనై నిర్భాగ్యుఁడనై దుష్టుఁ
డనై వర్తించితిని. నేను దానిరక్షణాదికము నాలోచింపకుండ
నుండినకూరుఁడను. నాయం దధికవిశ్వాసము గలయామృగ
శాబకము స్వబుద్ధిచేతనైనను, సజ్జనునిచందంబున మగుడ నా
యాశ్రమంబునకు వచ్చునా? మృగశిశువు దైవముచే రక్షింపఁ
బడుటచే వృకాదులవలన నపాయము లందక నాయాశ్రమసమీ
పమునందు క్షేమముతో లేఁతపచ్చికను దినుచుండఁగాఁ జూడఁ

గలుగుదునా? అయ్యయ్యో! ఎంతకష్టము! వృకములు గాని య
డవికుక్కలు గాని వరాహాదులు గాని వ్యాఘ్రాదిక్రూరజంతువు
లు గాని నామృగశిశువును భక్షించి యుండవుగదా? అకటా!
సకలలోకక్షేమముకై యుదయించిన వేదస్వరూపుఁ డగుసూర్యభ
గవానుఁ డస్తమించుచున్నాఁడే? నాకు నిక్షేపమువంటియామృ
గశిశు విప్పటికిని రాలేదేమి? ఆమృగకిశోర మనెడిరాకుమారుఁ
డు నానావిధములును, మనోహరములును నై చూడఁదగిన మృ
గవినోదములచేతను, నుపచారములచేతను నాదుఃఖంబు తొ
లంగునట్లు సమీపమునకు వచ్చి నాకు సుఖము కల్గించునా? తన
తోఁగూడ నే నాడుకొనుచున్నప్పుడు పరిహాసమునకై మిథ్యాస
మాధి నవలంబించి కన్నులు నిమీలించి యుండఁగాఁ బ్రణయకో
పమును వహించి యామృగశిశువు భయపడుచు జలబిందువలె
మృదువయిన శృంగాగ్రముచే నన్ను మాటిమాటికి నిర్బాధక
ముగా రాయుచుండునే. అట్టిమృగశిశువు మగుడ నాకుఁ గన్పిం
చునా? నేను హోమద్రవ్యాదులను దర్భలం దుంపఁగా నది వ
చ్చి చాపలమున నపవిత్రము గాఁ జేయుచుండునే. అప్పుడు నేను
కోపింపఁగాఁ దా నాటలాడక చరణాదీంద్రియములను గదల్పక
ఋషికుమారునివలె వర్తించుచుండునే. అట్టినాగారాబుమృగ
శిశు వేల రాలేదో? యనివిలపించుచుఁ బర్ణశాల వెలుపడి పైకి
వచ్చి యామృగశాబకపాదన్యాసములచే నంకిత మగుభూతలం
బును గాంచి యిట్లనుకొనును. 'అయ్యారే! తపస్విని యగునీభూ
మి యెట్టితప మాచరించెనో కదా? ధనము గోల్పోయినవానికి
ధనమార్గములను జూపుచున్నట్లుగా, సూక్ష్మములును, సుందరము
లును, మంగళప్రదములును, కఠినములును, నగునామృగశాబక

ముడెక్కలచేఁ జిహ్నిత మగునీభూమి, దానిజాడలను నాకు నివేదించుచు, నా కధికసంతస మొనగూర్చుచు, దానిపాదచిహ్నముల నలంకారములవలెఁ దాల్చుచు, *స్వర్గాపవర్గములఁ గోరుబ్రాహ్మణులకు యజ్ఞప్రదేశమును సమకూర్చుచున్నది. మృగపాదచిహ్నాత మగునీభూమి యెంతయుపకారము చేయుచున్నది!' అని యిట్లు భరతుండు వచించి, యుదయించినచంద్రునిఁ గాంచి, "ఓహో! తల్లి లేనిలేడిపిల్ల సింహాదిక్రూరజంతువులభయముచే నాయాశ్రమమును విడిచి పోవుచుండఁగా దీనవత్సలుఁ డయినచంద్రుఁడు దానిఁ జేరఁదీసి దయతో రక్షించుచున్నాఁడు కాఁబోలు!" నని వచించుచుండును. మఱియు నతఁడు చంద్రకాంతిస్పర్శ మనుభవించి "ఆమృగశాబకవియోగ మనెడిదావానలము ప్రబలి నాహృదయసరసిజము వాడించుచున్నను నెట్లో సహించి మృగశిశువును వెదకెడినా కధికాయాసము జనించుచుండఁగా నీచంద్రుఁడు, శీతలములును ననురాగవర్ధకములును, వదనసలిలమువంటిదగు తనసుధామయకిరణములచే దానిఁ దొలంగించి నా కుపకార మొనర్చుచున్నాఁడు" అని మాటిమాటికిఁ బలుకుచుండును. ఓరాజేంద్రా! ఆభరతుఁ డిట్లు పలువిధము లగుమనోరథములచే నాకులచిత్తుఁడై యామృగశాబక మనెడిప్రారబ్ధకర్మము విఘ్నము కల్గించుటచే, జ్ఞానయోగారంభమునుండియు, వర్ణాశ్రమోచితమగుకర్మయోగరూపతపంబునుండియు, భగవదారాధనరూపమగుభక్తియోగమునుండియుఁ బరిభ్రష్టుండయ్యెను.

---

* ఇందులకుఁ బ్రమాణము. 'శ్లో. యస్మిన్దేశే కృష్ణమృగ స్తస్మి న్ధర్మా నిబోధత.' అని చెప్పఁబడుటచేఁ గృష్ణమృగ మున్నభూమి మిక్కిలి పవిత్రమైన దనియు, యాగార్హమయిన దనియుఁ దలంపవలయును.

ఓ రాజేంద్రా! ప్రారబ్ధకర్మము భరతుని నెట్టిస్థితికిఁ దెచ్చినదో చూచితివా? అందులకుఁ బ్రారబ్ధమే కారణము. కానిచో భరతునికి జాత్యంతరమైన లేడిపిల్లయం దంతయాసక్తి గల్గునా? అతఁడు మొదట మోక్షమునకు విరోధు లని విడువఁ దరముకానికుమారులనే విడిచిపెట్టెను. ఇట్లు స్వగర్భవాసజాతు లగువారిని విడువఁగల్గినను, నితరజాతి దగు మృగశాబకమును విడువలేకపోయెను. ఇందులకుఁ బ్రారబ్ధము కాక మఱేది కారణమై యుండును? ఈ యంతరాయమువలన యోగారంభము పూర్ణముగా నశించినను దెలిసికోలేక, యామృగశిశుపోషణాదికము నవరత మొనర్చుచుఁ దన్ను మఱచిపోయి ప్రమత్తుఁడై యాభరతుఁడు వర్తించుచుండఁగాఁ, దీవ్రవేగము కలిగి దురతిక్రమమై మూషికబిలమును సర్పరాజముంబోలె మృత్యువు సమీపించివచ్చెను. ఆమరణసమయమునను నాభరతుండు తనపార్శ్వమందు వర్తించుచున్న మృగము నాత్మజునిఁగా భావించి తనపై నెడియభిమానముంచి దానియందే మనంబును సక్తముగావించి మృగముతోఁ గూడ దేహవిసర్జనముఁ జేసి పూర్వజన్మానుస్మృతి నశింపకపోవుటచేఁ బ్రాకృతజనునివలె మృగశరీరమును బొందెను * అంత్యకాలమందు మృగమును స్మరించుచు దేహమును విసర్జించుటచే మృగశరీరమునే పొందెను. ఓరాజా! అతఁ డట్లు మృగత్వమును బొందినను బూర్వజన్మమం దొనర్చినభగవదారాధనప్రభావముచేఁ దనకు మృగత్వము వచ్చుటకు మృగాసక్తతయే కారణమని భావించి మనంబున మిక్కిలి పరితాప మొందసాగె. "అక్కటా!

---

* ఇందులకుఁ బ్రమాణము- శ్లో. యంయంవాపి స్మరన్భావం త్యజత్యంతే కళేబరం । తత్తదవేతి కౌంతేయ సదా తద్భావభావితః॥ అని భగవద్గీత.

జ్ఞానవంతులమార్గమునుండి నేనుఁ బరిభ్రష్టుండ నైతిని. ఎంత
కష్టము! ఎంతకష్టము! ఆహా! నేనుఁ బూర్వము సమస్తసంగము
లను విడిచి విజన మగుపుణ్యారణ్యమే శరణ మని తలంచుకొని
జితేంద్రియుండ నై భగవంతునికథలను వినుచు,నతని మననము
చేయుచు, నుతించుచు, స్మరించుకొనుచు, నారాధించుచు, సర్వ
కాలములందును సమస్తభూతముల కంతరాత్మ యగువాసుదేవ
భగవానునియందుఁ బొందుపఱిచి, ఏమనంబును విషయముల
నుండి మఱలించితినో, యామనం బిప్పుడు మృగాసక్త మగుట
చే యోగభ్రష్ట మైనది." అని యిట్లు భరతుండు మిక్కిలి ప
శ్చాత్తాపము నొంది, తనతల్లి యగుమృగిని విడిచి కాలంజర
మనుపర్వతమునుండి శాంతిప్రధాను లగుమునులకుఁ బ్రియమై
భగవత్ప్రాప్తికి స్థానమై సాలగ్రామ మనుపేరు గలపులహాశ్ర
మమునకుఁ బోయెను. అనంతర మచ్చటఁ దా నేకాకి యై మృగ
దేహావసానకాలమును బ్రతీక్షించుచు, సంగమునకు మిక్కిలి
భయపడుచు, నెండినయాకులను మాత్రమే భక్షించి కాలమును
బుచ్చుచుఁ దనకు మృగత్వము లభింప హేతు వగుప్రారబ్ధము
నశింప నెదురుసూచుచు, నదీజలమందుఁ బ్రవేశించి సగమువఱ
కు మునిఁగి, మృగశరీరమును విడిచిపెట్టెను. ఇది యెనిమిదవ
యధ్యాయము.

ఓరాజా! ఆంగిరసగోత్రమందుఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁ డగు
నొకద్విజవరుండు కలఁడు. అతఁడు శమదమాదిగుణములు కల
వాఁడు. అంతఁ డింద్రియనిగ్రహముచేతను, బహిరింద్రియనిగ్ర
హముచేతను, ననశనాదిరూప మగుతపంబుచేతను, వేదాధ్యయ

నముచేతను, దానముచేతను, శీతోష్ణాదు లగుద్వంద్వముల సహించుటచేతను, సంతోషముచేతను, వినయముచేతను, శాస్త్రజన్య మగుజ్ఞానముచేతను, నసూయారాహిత్యముచేతను, జ్ఞానయోగముచేతను, బ్రహ్మానందానుభవరూప మగుభక్తియోగముచేతను, మిక్కిలి ప్రఖ్యాతి వహించెను. ఆముని కిరువురు భార్యలు కలరు. వారిలోఁ బెద్దభార్యయందతనికిఁ దనతో సమానమై, వేదార్థశ్రవణము, సత్స్వభావము, సౌందర్యము, గొప్పతనము, మొదలగుగుణములు గలతొమ్మండ్రుపుత్త్రులు పుట్టిరి. ఆ విప్రునికి రెండవభార్యయం దిరువురు కవలపిల్లలు పుట్టిరి. ఆమిథునములో మగశిశువు, పరమభాగవతోత్తముఁడగుభరతుఁడే. అతఁడు మొదట రాజర్షి యై, భక్తాగ్రగణ్యుఁడై ప్రారబ్ధకర్మవశమువలన మృగరూపమునొంది తత్కర్మమవసానమునొందినవెంటనే మృగశరీరమును విడిచి విప్రుఁడై యాంగిరసునకుదయించెను. అతని కిదియే కడపటిజన్మము. భరతుఁ డట్లు విప్రజన్మము నొందియు, భగవదనుగ్రహమువలనఁ బూర్వజన్మజ్ఞానము గలవాఁ డగుటచే, సోదరాదిసంబంధంబువలనఁ దనకుఁ దొంటివలెనే యనర్థము సంభవించునేమో యనిభయపడుచుఁ గర్మబంధవిధ్వంసకము లగు, భగవత్కథాశ్రవణము, స్మరణము, తద్గుణకథనము మొదలగు సత్కర్మములను మాత్రమే యొనర్చుచు, భగవంతునిపాదపద్మములు మనంబున నిలిపి ధ్యానించుచు, లోకమునకు వెఱ్ఱివానివలెను గానవచ్చుచుండెను. ఆవిప్రుఁడు వెఱ్ఱివానివలెఁ గానవచ్చుచున్నను నా విప్రునికిఁ బుత్త్రప్రేమచే నతనియం దాదరము గలిగి, తండ్రియుపదేశమువలననే పుత్త్రుండు శిష్టుండు గావలయు నని తలం

చి, స్నాతకమువఱకుఁ గలకర్మంబుల నన్నింటిని యథావిధిగా నొనర్చి, యుపనీతునకు విహితములు కాకపోయినను, శౌచాచమనాదికర్మనియమములను నేర్పెను. మఱియు నాబ్రాహ్మణుఁడు పితృసన్నిధియె యధ్యయనమునకుఁ దగిన దని తనకుమారునికి వేదము చెప్ప నిశ్చయించి, భూర్భువరాదు లగువ్యాహృతులతోఁ గూడి, యోంకారము మొదటఁ గలదియుఁ ద్రిపదయు నగు గాయత్రిని వసంతగ్రీష్మర్తువులు నాలుగుమాసములు చెప్పియు, నతనికి వచ్చునట్లు చేయలేకపోయెను. ఇట్లావిప్రుఁడు తనపుత్త్రునియం దధికానురాగ ముంచి, బ్రహ్మచర్యావలంబికి వలసిన శౌచాచమనాదులును, నధ్యయనము, గురుశుశ్రూషయు,నగ్నిహోత్రవిధియు మొదలగుసత్కర్మము లన్నియుఁ, దనపుత్త్రున కలవఱుపఁ దలంచి, దురభిమానవంతుఁడై పుత్త్రునకు నేర్పియు, మనోరథసిద్ధి నొందలేక, వర్తించుచునంతలో నప్రమత్త మగు మృత్యువుచే గ్రస్తుండయి గృహమునందె మృతి నొందెను. ఆ బ్రాహ్మణుండు కాలధర్మము నొందుటం జూచి యతనిరెండవ భార్య తనకవలఁపిల్లలను, సవతి కధీనులను గావించి సహగమనంబొనర్చి పతిలోకమున కేఁగెను. తల్లిదండ్రులు పరలోకమున కేఁగినతరువాత కేవలము కర్మావబోధక మగువేదత్రయమునందే స్థిరబుద్ధు లగునతనిపుత్త్రులు నతనిప్రభావము నెఱుంగనివారై యతఁడు జడుం డని తలంచి తండ్రివలె యుక్తకర్మాదులను నేర్ప మానుకొనిరి. ద్విపాత్పశువు లనఁబడునాయూరిజను లాజడ విప్రునిఁ జూచి 'యున్మత్తా!' యనియు, 'జడుఁడా!' యనియు, 'ఓ చెవిటివాఁడా!' యనియుఁ బిలుచుచుండ విని యతఁ డందులకుఁ దగినవిధంబునఁ బ్రవర్తించుచుండెను. మఱియు నతఁడు, నిత్య

మై, పుణ్యపాపాదినిమిత్తరహితమై, సిద్ధమై, దోషాదిరహితమై యున్నజ్ఞానానందమే స్వరూపముగాఁ గలవాఁ డగుటచేతను, శీతోష్ణాది ద్వంద్వములవలనఁ గల్గుసుఖదుఃఖాదులచేఁ బ్రయుక్తమగు దేహాత్మాభిమానము లేనివాఁ డగుటచేతను, నెట్టిపనులవలనఁగాని, సంప్రాప్తమయినయన్నాదికము స్వల్పమైనను, నధికమయినను, గుత్సితమయినను, నింద్రియప్రీతికై కాక. కేవలము ప్రారబ్ధక్షయమునకు హేతువగు దేహమును ధరించుటకు మాత్రమే భక్షించుచుండెను. ఇంతేకాక యావిప్రుండు శీతమునందును, నాతపమందును, వర్షములందును, మహోక్షమువలె శరీరమును వసనాదులచే నావరించుకొనక ప్రవర్తించుచుఁ బరిపుష్టిఁజెంది కఠినములైయున్న సర్వావయవములతో నొప్పుచు, నేలపై శయనించుటచేతను, నభ్యంగనాదులు లేక పోవుటచేతను, దట్టమగుమాలిన్యముచే బ్రహ్మతేజస్సు తిరోహితముకాఁగా, బాహ్యమలముచేఁ బ్రకాశింపని మహారత్నమున కెనవచ్చుచుఁ, గుత్సితవస్త్రము నొకదానిని మొలయందుఁ దాల్చి మిక్కిలి మలినమయినజన్నిదముచేత ద్విజన్ముఁ డని గుఱితింపఁబడుచు, యోగీశ్వరప్రవర్తనము తెలియంగనియవివేకులచే నిందింపఁబడుచు, గాలము పుచ్చుచుండెను. అతఁడు కూలివలన నాహారాదికమును గోరుచున్నవాఁ డగుటచే సమస్తకార్యములను జేయుచుండెను. ఒకప్పుడు తనసోదరుల ధాన్యక్షేత్రములను జక్కఁజేయఁ బ్రేరితుఁడై పోయి యక్కార్య మొనర్చుచుండెను. కాని యిచ్చట బురద తీయుటవలన క్షేత్రము సమమగునని కాని, యిట బురద తీసిన విషమమగు నని కాని, యెఱుంగఁడు. ఇట్లు ప్రతిదినమును శ్రమపడుచుఁ దనసోదరులు పెట్టిన

స్వల్పాహారమును దినుచుండెను. అంతలో దేహధారణ చేయఁ జాలనప్పుడు నూఁకలను, దెలికపిండిని, నూకను,నులవలను,మినుములను, వంటపాత్రలం దంటి యుండియున్న యన్నమును సుధారసతుల్యముగ నెంచికొని తినుచుండెను. ఓపరీక్షిన్నరేంద్రా! ఆభరతునియద్భుతచరిత్ర మొకటి కలదు. చెప్పెద. సావధానచిత్తుండవయి వినుము. ఆకాలమున నొకచోరనాయకుఁడు కలఁడు. వాఁ డనపత్యుఁడై తనకు సంతానము గల్గినచో భద్రకాళికి నరబలి యిచ్చెద నని సంకల్పించుకొనెను. అంతఁ గొంత కాలమునకు వానికిఁ బుత్త్రుఁడు గలిగెను. అప్పుడు వాఁడు తన యనుచరులను బిలిచి "దైవవశమువలన లభించినయొకపురుషునిఁ గొనిరం" డని యాజ్ఞాపించెను. అతని యనుచరులును బురుషపశువునిమిత్త మంతటను బరిభ్రమించుచుఁ గటికిచీఁకట్లకు నిలయమగురాత్రియందుఁ గానలేక మగిడి వచ్చుచు, వీరాసనస్థితుఁడై మృగవరాహాదులనుండి సస్యములను రక్షించుచున్న యాభరతునిఁ గాంచి, సద్గుణలక్షణములు గలవానినిగాఁ దెలిసికొని, తమపతికి బలి యిచ్చుటకుఁ దగినవాఁడు లభించినందుల కానందించి వికసితవదనులై వాని దృఢముగా బంధించి భద్రకాళీమందిరంబును బొందించిరి. అనంతర మాచోరులు,

{వృషలునిసేవకులు భరతునిఁ గాళీమందిరమునకుఁ బలియిచ్చుటకై గొనివచ్చుట.}

విశసనవిధిచేత స్నానము చేయించి, యొకక్రొత్తవస్త్రముచే వాని నాచ్ఛాదించి, భూషణాదులచే నలంకరించి, భుజింపఁ జేసి ధూపాదు లొసంగి, చందన మలంది, పూలదండలచే మెడను దిలకించి, బలివేళఁ జేయువలసినస్తోత్రంబు లొనర్చి, మృదంగాదు

లను మ్రోయించి, యాపురుషుని భద్రకాళియెదుటఁ గూర్చుం డఁబెట్టిరి. అనంతరము వృషలరాజు పురోహితుఁ డగుచోరుఁ డా తని రక్తముచేతను, మద్యముచేతను, భద్రకాళిని బూజింపఁ దలంచి, భద్రకాళీమంత్రములచే నభిమంత్రితంబును నతిభయం కరంబును నగుఖడ్గంబును గైకొని వానిఁ జంప నుంకించుచుం డెను. అంతట రజస్తమోగుణప్రచురులును, ధనమదముచే మర్యాదల నతిక్రమించినవారును, నగునాచోరులు, భగవత్క థలతోఁ గూడినబ్రాహ్మణకులమును దుచ్ఛమునుగా భావించి దుష్టమార్గమందు వర్తించుచుఁ, బరమాత్మసామ్యమును బొంది బ్రహ్మర్షి యగునాంగిరసుకుమారుఁడై, యెవ్వరితోను ద్వేషిం పక, సర్వభూతహితుఁడై యున్నయాభరతుని సంహారమును దారుణకర్మముగా నెంచి యాభద్రకాళి దుస్సహ మగుబ్రహ్మ తేజంబుచేఁ దిరస్కృతురాలై తనశరీరము క్రమక్రమముగా మంటలెక్కుటచే నట నుండఁజాలక శీఘ్రముగాఁ బ్రతిమనుండి వెడలివచ్చెను. ఆకాళి యంతటితో నూరకుండక యొడలిమంటకుఁ దోడు మహారోషాగ్ని యావేశించి సంతాపముఁ గల్గించుటచే సహింపలేక భయంకరముగా బొమముడి వెట్టి కుటిలము లగు దంష్ట్రలచేతను, నెఱ్ఱనినేత్రములచేతను, భీకరవదనము కలదై, యీప్రపంచము నంతను సంహరింప నుద్యుక్తయైనట్లు మహాట్ట హాసమునుఁగావించి యచ్చటనుండి లంఘించి పాపిష్ఠులును, గర్వి ష్ఠులును నగునాఖలులశిరంబుల నాకత్తిచేతనే ఖండించి, తదీయ కంఠములనుండి స్రవించురక్తమును గాఢముగాఁ ద్రావి, రక్త పానజనితమదముచేఁ బరవశయై తనగణములతోఁగూడ నుచ్చై స్స్వనముతో నాడుచుఁ బాడుచు వారిశిరఃకందుకములతోఁ

గ్రీడలాడెను. ఓయీ! భద్రకాళీసమారాధనము విపరీతముగా ఫలించిన దేమి? యని సందేహింపకుము. మహాత్ములవిషయమై చేయుహింసారూప మగునపరాధము సర్వవిధములచేఁ దనయందే పరిణమించును. కావున మహాత్ముఁ డగుభరతునికిఁ జేయఁ దలంచిన మహాపదను నావృషలులే యనుభవించిరి. ఆవృషలులు తన్నుఁ జంపఁ గొనిపోవుచున్నప్పుడు భరతుఁ డూరకుండుట యద్భుత మని యూహింతు వేమో; యది యంత యద్భుతము కాదు. ఓనరేంద్రా! భాగవతు లగుపరమహంసులు దేహాదులందాత్మభావమును విడిచి మిక్కిలిదృఢ మగుదేహాత్మాభిమానగ్రంథిని విప్పికొన్నవారు. వారు సర్వభూతములందును స్నేహము గల్గియుందురు. కావుననే వా రెవ్వరియందును వైరము లేనివారయి యుందురు. ప్రత్యక్షముగా భగవంతునికాలచక్రముచేతను నానాభావములచేతను, సంరక్షింపఁబడుచుందురు. భగవంతుని పాదమూలము లాశ్రయించినవారి కెందునుండియు భయ ముండదు. అట్టి మహాత్ములు తమశిరంబును ఛేదింప నున్నవారిపైని గాని క్రోధము వహింపరు; మరణమునకు భయపడరు. అట్లె పరమభాగవతోత్తముఁ డగుభరతునకుఁ దన్నుఁ బంధించి కొని పోవువారిపైఁ గ్రోధము గాని, మరణ మగుటవలనఁ దొందరపాటు గాని కలుగలేదు. ఇది తొమ్మిదవయధ్యాయము.

ఓరాజేంద్రా! భరతునితరువాతివృత్తాంతము వినుము. ఆ కాలమున సింధుసౌవీరదేశములకు రహూగణుఁ డనునొకరాజు గలఁడు. అతఁడు తత్త్వజ్ఞానంబు దెలిసికొనుతలంపుతో గపిలమహామునిచెంత కరుగ నిశ్చయించుకొని శిబికారూఢుఁ

డై పోవుచు నిక్షుమతీతీరమున విడిసెను. తరువాత నారాజు గమనత్వరతోఁ గూడికొని శిబికావాహకుల వేగముగాఁ గొనిరమ్మని వాహకాధిపతి కాజ్ఞాపింప, వాఁడు చని వారిని వెదకుచు, బలిసినశరీరము గల్గి, యౌవనవంతుఁడై దృఢతరగాత్రుఁడై మహోక్షమువలె భారవహనసమర్థుఁడై యున్నయాభరతునిఁ జూచి “యితఁడు శిబికను వహింప మిక్కిలి సమర్థుఁ”డని నిశ్చయించి బలాత్కరించి కొనిపోయెను. అందులకు భరతుఁ డర్హుఁడు కాకపోయినను నమ్మహానుభావుఁడు శిబికను మోవ సాగెను. అట్లతఁడు తక్కినవారితో నాశిబికను వహించి శరపాతముదూరము నడిచెను. కాని యతని కభ్యాసము లేకపోవుటచే వక్రముగా నడుచుచుండె. అందువలనఁ దక్కినవాహకులగమనము గూడఁ గుటిలమై యుండ నది రహూగణుఁడు కనిపెట్టి యావాహకులం గాంచి “ఓరీ వాహకులారా ! ఎంత చక్కఁగా నడుచుచున్నారు ! పల్లకిని విషమముగా మోయుచున్నారేమి?’ అని సోపాలంభముగాఁ బలికెను. అనంతర మావాహకులు సాక్షేపము లగుప్రభువువచనంబులు విని, తమ్ము దండించునేమో యని శంకించుచుఁ దమప్రభువునుఁ గాంచి “ఓ మహాప్రభూ ! మే మెంతమాత్రమును బ్రమత్తులమై యుండ లేదు. తమసెలవుచొప్పునఁ జక్కఁగానే మోయుచున్నారము. కాని మాలో నీపురుషుఁ డిప్పుడే నియుక్తుఁడైనను, మాయంత శీఘ్రముగా నడువలేకున్నాఁడు. అందువలన మాగమనము గూడఁ గుటిల మగుచున్నది. మే మిఁక నితనితోఁ గూడి మోయఁజాలము” అని సవినయముగా విషమగతిహేతువును విన్నవించికొనిరి. దీను లగునావాహకులవాక్యంబులు విని, వాహకు

లలో నొక్కఁడు విషమముగా నడిచినఁ దక్కినవారుగూడ నట్లే నడువవలసియుండు నని నిశ్చయించుకొని, యింతకుఁ బూర్వము వృద్ధుల నుపాసించువాఁడై నను స్వభావముచేఁ బరవశుఁడై మనంబునఁ గొంచెము కోపము వహించి, నిగూఢబ్రహ్మతేజస్కుఁడై నివురుగప్పిననిప్పువలె నున్న యాభరతునికిట్లనియె. 'ఓసోదరుఁడా! నీవు చాలదూరము నడిచివచ్చుటచేతను శిబికను వహించుటచేతను, మిక్కిలి పరిశ్రాంతుఁడ వయితివి. అక్కటా! ఎంతకష్టము! పాపము నీ వొక్కఁడవే దీర్ఘప్రయాణము చేయలేదు. అందులో నీవు ముదుసలివాఁడ వగుటచే దుర్బలుఁడ వయితివి. తక్కిన వారందఱును దీర్ఘప్రయాణము చేయలేదు. వారందఱు సుఖముగా నున్నారుకాఁబోలు? అందుచే నీవు వారితో సమముగా నడవలేకయు నున్నావు." అని యిట్లా రాజు సాక్షేపముగాఁ బలికెను. అయినను నహంకారమమకారరూపమగునవిద్యచేఁ బఱిగను లగు పంచభూతములును, శబ్దాదిగుణములును వాగాదిక్రియలును దదింద్రియములును నంతఃకరణమును గలిగి సంతతమును వికారము చెందుచు నవయువసంస్థానవిశేష మయినతనచరమకళేబరమందును, దదనుబంధులయందును "నేను నాది" యనెడిమిథ్యాజ్ఞానము లేనివాఁ డగుటచే నాభరతుఁ డతనివాక్యములకును మనంబున నుంతేనియు నలుగక మాటలాడక తొంటియట్ల పల్లకిని మోచుచునడుచుచుండెను. కాని యప్పుడును బల్లకి విషమముగానే మోయఁబడుచుండెను. అందువలన రహూగణుఁడు ప్రకుపితచిత్తుండై, "ఓరీ! నీవు జీవచ్ఛవంబువలెఁ గానవచ్చుచున్నావు. నన్ను నల్పునిఁగా భావించుచున్నావు. అధిపతి నగునాశాసనము నతిక్రమించుచు

న్నావు. ప్రమత్తుఁడ వగునిన్ను దండింపక మానను. యముఁడు ప్రజలగర్వమును మాయించుచున్నట్లు నేనును దండనముచే నిన్ను సాధువునుగాఁ జేసెదను.'' అని యిట్లసంబద్ధవచనంబులు పలుకుచుండెను. అప్పుడు సర్వభూతహితుఁడును, బ్రహ్మసామ్య మొందుచున్నవాఁడును, జగదుత్పత్తిస్థితిలయములనుఁ దెలిసినవాఁడును నగుభరతుఁడు పోయినయాశ్చర్యము గలవాఁడై నను. నాశ్చర్యపడుచున్నట్లు గానవచ్చుచు, నబద్ధవచనంబులు పలుకుచు, "నేను నరదేవుఁడ" నని యభిమానమున నొప్పుచుఁ దమోగుణ మిళిత మగురజోగుణము ప్రధానముగాఁ గలవాఁడగుటచేఁ దన్నేల మగుక్రోధముచేతను, మదముచేతను, వివశుఁ డయి, భగవద్భక్తులను దిరస్కరించుచుఁ, దన్నుఁ బండితునిఁగాఁ దలంచుచు, యోగీశ్వరులప్రవర్తనమును జక్కఁగ నెఱుంగనియారహూగణునిఁ గాంచి యిట్లు పలికెను. 'ఓరాజా!

— *జడభరతుఁడు రహూగణునకు బ్రత్యుత్తరంబు లిచ్చుట.* —

నీవు వక్రోక్తులచే "దీర్ఘప్రయాణము చేయుటచే నలసితివి కాఁబోలు'' నని నన్ను మందలించితివి. నీవు పల్కినయావచనము లోకదృష్టిచే సత్యమైనను బారమార్థికదృష్టితోఁ జూడ నసత్యము కాకమానదు. ఆలోచింప నేను నిన్ను మోయలేదు. కాన వహించుటవలనఁ గల్గుబరువు గాని, తత్కృత మగుశ్రమము గాని నా కెంతమాత్రమును లేదు. 'దీర్ఘప్రయాణము చేయుట వలన నలసితివా?' యని యడిగితివి. నడుచువానికి గంతవ్యమగు భూమి యున్నచో నీ వన్నట్లనుకొనవచ్చును. కాని సాక్షాద్గమనము నాయందు లేనప్పు డది యెట్లు సరిపడును? 'నీవు మిక్కిలి బలిసియున్నా" వని పలికితివి. ఆబలువు పంచభూతాత్మక మగు

దేహమం దున్నది కాని నాయందు లేదు. ఆత్మయాథాత్మ్య మును దెలిసినవా రట్లు తలంపరు. ఓరాజా ! స్థూలత్వము, కృశత్వము, శరీరభవము లగురోగములు, మనోవ్యాధులును, నాఁకలియును, దప్పియును, భయంబును, కలహంబును, గామం బును, వంచనమును, విషయాసక్తియును, గోపంబును, నాత్మకా నిదేహమునం దాత్మయనుబుద్ధిని గల్గించునహంకారమును, మోహంబును మొదలగుబాహ్యాంతరవికారములు శరీరసంబంధముచే నాకుఁ గల్గుచున్నవి కాని వాస్తవముగా నాకు లేవు. ఇంతే కాక నీవు నన్నుఁ గాంచి "జీవన్మృతుండ" వని పలికితివి. జీవత్వ మన శ్వాసవాయువులు గల్గుటయే కాని వేఱుగాదు. మృతత్వ మనఁ బూర్వావస్థను విడుచుటయే కదా! ఓరాజా! ఈరెండును నుత్పత్తివినాశములవలె వికృత మగుదేహమునకుఁ గన్పించుచు న్నవికాని యాత్మకుఁ గాదు. "భర్త నగునాశాసనమును మీఱుచున్నా" వని యంటివి కదా! ఆలోచింపఁ బ్రభుత్వ మెవ్వనియందు నియతమై యుండునో, వాఁడు శాసించినది మోయుట యుక్తమే. కాని యది పరమేశ్వరునకు మాత్రమే కలదు. కాన యతఁ డాజ్ఞాపించినది జీవులు చేయకతీఱదు. అట్టి నియతప్రభుత్వము నీయందు లేదు. కాలవశమున నీవు రాజ్య పదభ్రష్టుండ వయినచో నీప్రభుత్వము తొలంగును. కావున నీకు శాసింప నర్హత లేదు. నీ కాయర్హత లేకున్నను నున్న దని యనుకొనుచున్నావు. కాని యది భ్రాంతిమూలక మని నామ తము. ఓనరేంద్రా ! "నీవు భృత్యుఁడవు. నే నధిపతిని" అనెడి వైషమ్యబుద్ధికి నుంతేనియు నవకాశము లేదు. వ్యవహారము మాత్రమే కాని స్పష్టముగా నున్నట్లు గానరాదు. ఇట్లుండఁగా

నెవ్వఁ డీశ్వరుండు? ఎవ్వఁడు భృత్యుఁడు? కాన నీ వీశ్వరుండవును గావు. నేను భృత్యుండను గాను. మా ప్రవర్తనము నీ కనిష్టమైనచో మే మేమి చేయుదుము? కార్యస్థితిని వే ఱొకవిధముగాఁ జేయుట యెవ్వనికిని నలవి కాదు. మఱియుఁ "ప్రమత్తుఁడ వగునీకుఁ దగినచికిత్సను జేసెద" నని పలికితివి. కాని బ్రహ్మోపాసనమును జేయుచు, నున్మత్తునివలెను, మూఁగవానివలెను, గ్రుడ్డివానివలెను, జడునివలెను బ్రవర్తింపవలె నని కోరుచున్ననాకు నీచేయుదండన మేమిపనిని చేయును? తర్జనతాడనాదులను గోరుచుండిననాకు నీవు చేసినతర్జనతాడనాదిక మనిష్టము కాదు. అట్లు గాక నేను బ్రహ్మనిష్ఠుండను గాన ప్రమత్తుఁడ నగుసంసారినై చేష్టలు దక్కి యున్నవాఁడ ననియె యనుకొనుము. అట్లయినఁ బూర్వమందే సంసారవ్యసనవీక్షితుఁడ నైననాకు నీవు చేసినదండనాదికము పిష్టపేషణమువలె వ్యర్థమే." అని యిట్లు భరతుండు రా జాడినవాక్యములకుఁ దగినట్లు ప్రత్యుత్తర మిచ్చి శాంతస్వభావమున నొప్పుచు, దేహాంతరమును సంపాదించుపుణ్యపాపకర్మములనుండి నివృత్తుండై పుణ్యాపుణ్యరూప మగుప్రారబ్ధకర్మమును ననుభవముచే నశింపఁ జేసికొనుచు బూర్వమువలె రాజశిబికను వహించెను ఓపాండువంశపావనా! సింధుసౌవీర దేశాధిపతియుఁ దత్త్వజిజ్ఞాసయం దధికారము గల్గియున్నవాఁడును నగురహూగణుఁడు, బహువిధములగునధ్యాత్మశాస్త్రములచే సమ్మతమై, యజ్ఞానవిమోచకమయియున్న యాభరతునివచనమును విని మిక్కిలి విస్మయము చెందుచుఁ, బల్లకినుండి దిగి, యావిప్రునిపాదపద్మములపయిఁ బడి నమస్కరించి తన్ను క్షమింప వేఁడుకొనుచు నిట్లనియె. "ఓ మహానీయా!

బ్రహ్మవర్చస్సును గప్పిపుచ్చి బ్రాహ్మణులలో సంచరించుచున్న నీ వెవండవు? నీవు బ్రాహ్మణుఁడ వయినట్టు నీవు దాల్చినయజ్ఞ సూత్రమే చెప్పుచున్నది. సర్వజనులచేతనుఁ బరిభవింపఁబడువేష ము గలవాఁ డగుటచే నీ వవధూత వగుట నిక్కము. నీ వెవనికుమారుఁడవు? ఎవనిశిష్యుఁడవు? నీ వెచ్చటివాఁడవు? నీ విచ్చటికి వచ్చినకతం బెద్ది? ఆలోచింప నాకు క్షేమముగల్గింప వచ్చినచో, నీవు కపిలమహామునివా యేమి? ఓయార్యా! ఇంద్రుని వజ్రాయుధమునకు జంకను. శంకరునిత్రిశూలమునకును భయపడను. యమునిదండమునకుఁ గూడ భీతి నొందను. అగ్ని యస్త్రమునకుఁ గాని, సూర్యునిశస్త్రమునకుఁ గాని, వాయువు నాయుధమునకుఁ గాని, కుబేరునియాయుధమునకుఁ గాని, భయ మొందను. కాని బ్రహ్మకులావమానమునకు భయపడుచున్నాను. కావున నిదివఱకు నే నెఱుఁగక జేసినయవమానమును క్షమిం పుము. దయ యుంచి నావచనంబులకుఁ బ్రత్యుత్తర మిమ్ము. నీవు సంగములను వదలి, విజ్ఞానరూప మగునీప్రభావమును గప్పిపుచ్చి యితరులకు దురవగాహ మగునభిప్రాయము గల్గి, జడునివలెఁ జరించుచున్నావు. నీవాక్యములు యోగశాస్త్రసందర్భితము లై యున్నవి. ఓసాధువరా! నీవచనములయభిప్రాయంబు సూక్ష్మ బుద్ధిచేతనైనను దెలిసికొలేకున్నాను. ఓమహాత్మా! బ్రహ్మతత్త్వ విదులలో నగ్రేసరుఁడును, హితోపదేష్టయును, నిత్యమును, న పరిచ్ఛిన్నమును నగుజ్ఞానకళచేత నవతరించినవాఁడును, యోగీశ్వ రుఁడును, నగుకపిలమహామునిని సమీపించి సంసారమందు రక్ష క మగున దెద్దియో యడిగి తెలిసికొన నూహించి పోవుచున్నాను. నీవు గూఢవేషముఁ దాల్చి ప్రపంచసందర్శనార్థము సంచరించు

చున్నకపిలమహామునివా యేమి? సంసారాసక్తుఁడ నై జ్ఞానర హితుండ నై యున్ననావంటివాఁడు యోగీశ్వరు లగుమీవంటి మహానుభావులరీతుల నెట్లుగాఁ దెలిసికొనఁగలఁడు? ఓవిప్రవర్యా! దేహాతిరిక్తుఁడ వైనను, దేహసంబంధము గలనాకు యుద్ధకర్మ ము లాచరించినప్పుడు శ్రమ గలుగుచుండెను. అందుచే భార వాహకుఁడ వగునీకును శ్రమము గలుగు నని తలంచుకొని యిట్లు పలికితిని. ఇది లోకవ్యవహారమూలకము గాని వాస్తవము కాదు. ఇంతియ కాక యసత్యాదులగు దేహాదులవలనఁ గలుగు శ్రమయు నసత్యమే! కాన తత్ప్రయుక్త మగు శ్రమయు నసత్యమే యని యేల యనరాదు? అందువేని చెప్పెదను. భ్రాంతివిషయ మగు ఘటాదు లుదకము గొనివచ్చుటఁ జూడలేదు. కాని విద్యమాన మగుఘట మట్లుచేయుటను జూచుచున్నాము. అందువలన నర్థ క్రియాకారి యగుటవలన ఘటాదులు సత్యము లనవచ్చును. అట్లె దేహాదు లర్థక్రియాకారు లగుటవలన సత్యములు. తత్సం బంధమువలనఁ గలుగుశ్రమయును సత్యమే; కాన యీలోకవ్యవ హార మనుభవసిద్ధమై ఆత్మకు స్వతస్సిద్ధ మగుదుఃఖాదులు లేక పోయినను, దేహసంబంధమువలన నది సంభవింపక మానదు. తప్తపాత్రగత మగునగ్నితాపము తన్మధ్యమం దున్నశీతలోద కమును దహింపఁజేసి దానియందుండుతండులముల నుడికించుచు న్నది. అట్లె నిదాఘతప్త మగుశరీరమువలన నింద్రియాదులు ను, వానివలనఁ బ్రాణంబులును, వానివలన మనంబును, నందువ లన నాత్మయుఁ దప్తము కావచ్చును. కావున, విడువఁ దరము కాని దేహేంద్రియప్రాణాంతఃకరణసంబంధ ముండుటవలనఁ బు రుషునికి సుఖదుఃఖాదులను గలిగించుసంసారము లభింపక మా

నదు. ఓయీ! పూర్వమే తాపత్రయార్తు లగువారికి దండనము గల్గించిన నది వ్యర్థ మగునని భావింపరాదు. కర్మవశమున నధిపతి నై దుర్మార్గవర్తు లగుజనులను శాసించుటయు, సన్మార్గవర్తులను బరిపాలించుటయు నాకు విహితము. ఎవండైనను జేయు దండనమునకు భయపడి స్వవర్ణాశ్రమధర్మములచే భగవంతు నారాధించుచుఁ దన్మూలమునఁ బాపరాశిని దొలగించుకొననిచో, నప్పుడు నాచేయుదండనము నీ వన్నట్లు పిష్టపేషము కాక సఫలమే యగుచున్నది. అయిన నది నీవంటిమహానుభావునకుఁ దగనిది. కావున నోయార్తబంధూ! ఓవిప్రవర్యా! నేను నరదేవుఁ డనునభిమానముచే సజ్జనతముఁడ వగునిన్నుఁ దిరస్కరించి ఘోరపాప మార్జించుకొంటిని. సజ్జనాపమానరూప మగునాపాపము తొలంగునట్లు మైత్రీయుక్తము లగుచూపుల నాపైని బఱపుము. ఆలోచింప నీవు విశ్వహితుఁడైనపరమేశ్వరునకు సఖుండవు. నీవు సమస్తమును బ్రహ్మస్వరూపమునుగాఁ జూచుచున్నావు. నీకు దేహాత్మాభిమానము గాని, బ్రహ్మముకంటె నతిరిక్త మగుస్వతంత్రవస్తువు కల దనెడియభిమానము గాని లేదు. అట్టి నీకు నాచేసినయవమానమువలని వికారము లేకపోవచ్చును. అయినను మహాత్ములఁ దిరస్కరించుటవలన, మావంటిజంతువు శంకరునివలె నతిసమర్థుఁ డయినను, స్థావరత్వమును బొందక మానఁడు' ఇది పదవయధ్యాయము.

అని యిట్లు ప్రార్థించుచున్నరాజుం గాంచి బ్రాహ్మణుం డిట్లనియె. 'ఓరాజా! ప్రకృతికంటె వివిక్త మగుపరమాత్మతత్త్వజ్ఞాన మెట్టిదియో యెఱుంగనినీవు, తాదృశజ్ఞానవంతులు చేయవలసిన

వాదములను జేయుచున్నావు. తత్త్వత్రయమును దెలిసినపండితులు, దేహాత్మాభిమానముచేతను, స్వతంత్రాభిమానముచేతను గలుగుచున్న స్థాల్యయాపనాదిధర్మములును, దేహులకుఁబరస్పరంబును నిరూపిత మగుస్వస్వామిభావసంబంధమును దక్షిణవియును, బరమార్థము లని గ్రహింపరని చెప్పవలసియుండఁగా నీ వట్టిధర్మములు పరమార్థము లని తలంచుచున్నావు. కావున నీవు జ్ఞానవంతులలో శ్రేష్ఠుండవు కావు. నీ వాత్మాభిమానాదులను విడువనిచో నీ కా పరమార్థము తెలియదు. తత్త్వత్రయస్వరూపమును బ్రతిపాదించెడివేదాంతశాస్త్రము పరిశీలింపక యాయభిమానాదులు తొలఁగవు. ఓరాజా! విస్తృతములును, గృహమేధు లాచరింపఁదగినవియు నగుయజ్ఞాదికర్మముల నిరూపించువేదపూర్వభాగములు తత్త్వత్రయబోధను జేయఁజాలవు. కాన వానివలన నభిమానాదులఁ దొలఁగించుతత్త్వజ్ఞానము గలుగదు. అవి కర్మములం దభిరుచిని గల్గించునే కాని జ్ఞానాభిరుచిని గల్గింపనేరవు. అట్టిజ్ఞానము గల్గించునవి యుపనిషద్వాక్యము లని యెఱుంగుము. ఇంతియ కాక, గృహమేధులు సంపాదించునైహికాముష్మికసుఖములు స్వప్నసుఖంబులవలెనే స్వల్పంబులును నశ్వరంబులు నై యుండును. అట్టి గృహస్థసుఖములు హేయము లని పరిగణింపనివానికి వేదాంతవాక్యము లైనను దత్త్వజ్ఞానము గలిగింపనేరవు. ఓరాజా! తత్త్వత్రయజ్ఞానమునకొక్కవేదాంతశాస్త్రశ్రవణమే కాక సంసారసుఖవిరక్తిగూడఁ గారణ మని తెలియుము. సంసారసుఖవిరక్తి సామాన్యముగా లభింపదు. పురుషునిమనంబు రజోగుణముచేఁ గాని, సత్త్వగుణముచేఁ గాని, తమోగుణముచేఁ గాని యుద్రిక్త మైనప్పు

డది జ్ఞానేంద్రియవ్యాపారములచేతను, కర్మేంద్రియవ్యాపారములచేతను, బుణ్యాపాపకర్మము లాచరించి తన్మూలమున నుత్కృష్ట శరీరమును గాని యపకృష్టశరీరమును గాని సంపాదించుచున్నది. ఆమనం బిట్లు వర్తించుచున్నంతకాలము నీపురుషుఁడు స్వయముగా వికారములు లేనివాఁడైనను, వాసనాధీన మగుస్వరూపముతోను, నంతఃకరణముతోను, వర్తించుచు వాసనావశమువలన విషయాసక్తుఁడై, సత్త్వాదిగుణముల కనురూపముగాఁ మెలఁగుచు, వికారములను బొందుచుఁ బంచభూతాదు లగుపదాఱుపదార్థములకును ధారకుఁడై, నామములతోఁ గూడ దేవమనుష్యాది రూపభేదముఁ గనుచు, నా దేవాదిశరీరములచే నంతర్గతము లగు రాగద్వేషాదులును, బాహ్యంబు లగుగమనాదులును నగుకర్మములను బుణ్యాపుణ్యములను జేయుచున్నాఁడు. ఓ రాజా! పురుషుఁ డిట్లు సంసారచక్రమందు వర్తించుచు, నాసంసారచక్రమందుఁ బర్వతకూటమువలె నిశ్చలుండై ప్రకృతిపరిణామరూప మగు నంతఃకరణము గలిగి, తనకు ధారకుఁడగుపరమాత్మకుఁ దాను శరీరభూతుఁడై వర్తించుచుండియు దాని నెఱుంగఁజాలక దైవవశమువలనఁ బ్రాప్తము లగుసుఖదుఃఖములను, దద్వ్యతిరిక్త మగుమూర్ఛావారమోహామునుబొందుచున్నాఁడు. మఱియు, "నేను దేవుఁడను" నేను మనుష్యుఁడను" "నేను స్థూలుఁడను" "నేను కృశుఁడను" అను బాహ్యాకారవిషయ మగు స్థూలవ్యవహారంబును "నేను సుఖిని" "నేను దుఃఖిని" "నే నిచ్ఛగించుచున్నాను" "నేను ద్వేషించుచున్నాను" అనెడి యాంతరంగికమగు సూక్ష్మవ్యవహారమును, దేహాత్మాభిమానము వలన, స్వస్వరూపముచే సర్వదా ప్రకాశించుజీవునివిషయమై ప

రఁగుచున్నదికాని స్వభావవిరుద్ధముగ లేదని తెలియుము. ఓమను
జాధిపా! పురుషుఁడు సంసారబద్ధుఁడగుటకును,ముక్తుఁడగుటకును
మనంబె కారణము. మనంబు గుణానురక్తమగునప్పుడుసంసార
మును గల్గించుచు,గుణానురక్తముకానప్పుడు మోక్షమును గల్గిం
చుచు నున్నది. కావున సంసారమోక్షములకును దేవమనుష్యాది
భేదములు గలుగుటకును మనంబే ముఖ్యకారణంబని యెఱుంగు
ము.దీపము ఘృతసిక్తమగువత్తియందు వ్యాపించుచుఁబొగతోఁ
గూడినజ్వాలగా మాఱుచున్నది. ఆదీపమే తాదృశవర్తిగతము
కానప్పుడు ధూమరహిత మగుస్వస్వరూపముతోనే వర్తించు
చున్నది. అట్లె మనంబు త్రిగుణానురక్తమై యున్నప్పుడు తద్గు
ణానుసారు లగుపుణ్యాపుణ్యరూపకర్మములచే రాగద్వేషాదివృ
త్తులు గలదగుచున్నది. ఆగుణత్రయముచేఁ గలుషితము కాన
ప్పుడు స్వస్వభావరూప మగుసత్త్వగుణము కలదగుచున్నది.ఆమ
నంబునకుఁ బదునొకండువృత్తులు కలవు. అందుఁ గర్మేంద్రియం
బుల వ్యాపారములకు విషయము లైక్రియాకారము లైనవి
యైదు. అట్లే జ్ఞానేంద్రియంబుల వ్యాపారములకు విషయములై
జ్ఞానాకారము లైనవి యైదు. ఇవి గలసి పదియైనవి. పదు
నొకండవది యహంకారమమకారరూప మగునభిమానమే. ఓ
రాజా! ఆపదునొకండువృత్తులలోజ్ఞానాకారము లగునైదింటికిని,
గంధము, రసము, రూపము, స్పర్శము, శబ్దము, నాఁబడుతన్మా
త్రలు విషయములు. క్రియారూపము లగువానికి విసర్గాదు
లగుకర్మములు విషయములు. అహంకారమమకారరూప మగు
నభిమానమునకు శరీరము విషయము.ఆవిషయక్రమమును వివ
రించి చెప్పెదను వినుము. ఘ్రాణేంద్రియవృత్తికి గంధంబును,

చక్షురింద్రియవృత్తికి రూపంబును, త్వగింద్రియవృత్తికి స్పర్శమును, రసనేంద్రియవృత్తికి రసంబును, శ్రోత్రేంద్రియవృత్తికి శబ్దంబును, విషయభూతంబు లగుచున్నవి. *అట్లె పాయువృత్తికిఁ బురీషోత్సర్జనమును, నుపస్థేంద్రియవృత్తికి సంభోగంబును, పాదేంద్రియవృత్తికి గమనంబును, వాగింద్రియవృత్తికి భాషణాదులును, పాణీంద్రియవృత్తికి దానాదులును, విషయభూతము లగుచున్నవి. "ఇది నాహస్తము" "ఇది నాశరీరము" అని మమాభిమానముచే స్వీకృత మగునది తదభిమానమునకు విషయ మగుచున్నది. దానిఁ బదునొకండవ దానిఁగాఁ జెప్పుచు, నాత్మ కానిపదార్థము నాత్మబుద్ధిని గల్గించు నహంకారమును బండ్రెండవవృత్తిగాఁ జేర్చుచున్నారు. దానికిని శరీరము విషయ మగుచున్నది. ఓ రాజా! పృథివ్యాదిభూతపంచకముచేతను, వానియసాధారణగుణము లగుగంధాదితన్మాత్రలచేతను, వాసనచేతను, పుణ్యాపాపరూపకర్మములచేతను, గాలముచేతను, మనస్సునకు వికారము లయిన పదునొకండువృత్తులును, మొదట నూఱులకొలది యై, పిమ్మట వేలకొలది యై, తరువాతఁ గోట్ల

---

* ఓరాజా! గంధాదులయొక్కయుఁ; దద్విషయము లగుజ్ఞానములయొక్కయు వృత్తులకు భేదము గలదు గాన యట విషయవిషయిభావ ముపపన్న మగుచున్నది. కాని విసర్గాదులే కర్మేంద్రియములకు వృత్తులై యుండఁగా నవియే మగుడ వానికి విషయము లగుట సముచితము కాదని శంకింపఁ బని లేదు. విసర్గాదులు క్రియాస్వరూపములు. సామాన్యముగాఁ గ్రియలు వ్యాపారాంశముచేతను, ఫలాంశముచేతను, రెండువిధములై యుండును. కాన వ్యాపారాంశములను వృత్తులఁగాను, ఫలాంశములను విషయములఁగాను విభజించుకొని విషయవిషయిభావము కుదుర్చుకొనవలెను.

కొలఁదియై యొప్పుచున్నవి. ఈవికారము లన్నియును, జీవాధి
ష్ఠిత మగుమనస్సునకే చెందియుండును. కాని కేవలము మన
స్సుకుఁ జెందవు. ఆజీవాధిష్ఠితమనంబునకైనను గర్మమువలనఁ
జెందుచున్నవి కాని స్వతస్సిద్ధంబుగా సంభవింపలేదు. పుణ్యా
పాపరూపకర్మము లాచరించి తత్ఫల మనుభవించుజీవునకును,
జీవాధిష్ఠిత మగుమనస్సునకును బ్రకృతిమూలము లగునీప్రవృత్తు
లన్నియును గలవు. అవి యన్నియుఁ బ్రవాహమువలన నిత్య
ములై, సుషుప్తియం దొకప్పుడు తిరోహితము లగుచుండును.
వృత్త్యాయుత్తము లగుసుఖదుఃఖాదులు లేనివాఁడై పరమాత్మ
యాప్రవృత్తులను వీక్షించుచుండును. ఓమానవేంద్రా ! కర్మము
లాచరించి తత్ఫలము ననుభవించుచున్నజీవునకు సాక్షిభూతుం
డై యుండియుఁ దత్కర్మభోగము లేక స్వయంప్రకాశుఁ డగు
పరమాత్మ ప్రకృతిపురుషులకు సంభవింపనిధర్మములతో నొప్పు
చున్నాఁడు. ఆపరమాత్మ ప్రకృతిపురుషులలోఁ బ్రవేశించి నియం
తయై ధారకుఁడై యున్నాఁడు. అతఁడు జగదాదియందుఁ గా
రణభూతుఁ డైనవాఁడు. అతఁడు స్వయంప్రకాశుఁడు. అతఁడు
స్వరూపమువలనఁగాని స్వభావమువలనఁ గాని జననాదివికార
ములు లేనివాఁడు. అతఁడు బ్రహ్మాదులకుఁ గూడ నీశ్వరుఁడు.
అతఁడు జీవసమూహమునకుఁ బ్రాపకుఁడై యాధారుఁడై వెల
యుచున్నాఁడు. అతఁడు సృష్ట్యాదిలీలలచే నొప్పుచున్నాఁడు.
అతఁడు సమస్తభూతములకు నాధారభూతుఁ డై యున్నాఁడు.
ఆపరమాత్మ తనమాయచే జీవునియందుఁ దిరోహితుఁ డగు
చుండును. కానఁ బ్రకృతికి వశంవదు లగువారికిఁ గానరాఁడు.
ప్రకృతిపరవశు లగుపురుషులకుఁ గానరాకపోవుటచే నతఁడు సర్వ

వ్యాపి కాఁడని భావింపరాదు. వాయు వదృశ్యుఁ డయ్యు, స్వ స్వరూపముచేఁ జరాచరభూతములలోపలఁ బ్రవేశించి ప్రేరణ చేయుచున్నట్టుగానే భగవంతుఁ డగుపరమాత్మయును, చేతనా చేతనరూప మగుజగంబున నియామకుఁడై ప్రవేశించియు, సామాన్యులకుఁ గానరాక వర్తించుచుండును. ఓనరేంద్రా! దేహి జ్ఞానోదయమును వహించి యహంకారమమకారరూప మగు నభిమానమును నిరసించి దేహగేహాదులందు సంగము వదలి, మనంబును నింద్రియంబులను జయించి పరమాత్మతత్త్వమును దెలిసికొననియంతకాలంబును సంసారమందుఁ బడి పరిభ్రమించు చున్నాఁడు. అట్లయిన దేహికిఁ బరమాత్మతత్త్వ మెప్పుడు దెలియునో చెప్పెదను వినుము. సంసారతాపములకు క్షేత్రమై, జీవునిసంసారముక్తులకుఁ గారణమై, యున్నమన స్సెప్పుడు శోకమును, మోహమును, రోగమును, లోభమును, వైరానుబంధంబును, మమకారమును విడిచిపెట్టునో, యప్పుడే పరమాత్మతత్త్వమును దెలిసికొనుచున్నాఁడు. కావున నీయంతఃకరణము సహజశత్రువని యెఱుంగుము. ఉపేక్షిత మగుటచే నది మిగుల వర్ధిల్లి, కావున నే నదియెక్కుడుబలము గలిగి వర్తించుచు నప్రియమును గల్గించును. అది యాత్మాపహారము చేయఁగలంతశక్తి గలది. నీ వప్రమత్తుండ వయి హరిచరణోపాసన మనెడియస్త్రమును జేపట్టి యాయంతఃకరణమును జయింపుము. అప్పుడు నీ కాత్మతత్త్వ మలవడును. ఇది పదునొకండవయధ్యాయము.

రహూగణుఁడు భరతునిఁ గొన్ని ప్రశ్నంబు లడుగుట.

అని పల్కినభరతునివచనంబులు విని రహూగణుండు సంత

సించుచు ని ట్లనియె. "ఓమహానుభావా! కృతాపరాధుండ నైన ను నాయందు విరోధము లేక మావంటిలోకులను రక్షించునిమిత్తము దేహమును ధరించి యున్ననీకు నమస్కారము. సమస్త జనులచేతను బరిభూత మగుతుచ్ఛబ్రాహ్మణవేషముచే నిగూఢుండ వై, నిత్యమును బరమాత్మానుభవము గలనీపాదంబుల కభివందనంబుల నొనర్చుచున్నాను. ఓవిప్రోత్తమా! జ్వరపీడితునకు మంచియౌషధంబువిధంబునను, గ్రీష్మ తాపముచే సంతప్తుండగువానికి శీతలోదకంబుచందంబునను, గుత్సిత మగుదేహాత్మాభిమాన మనెడిమహాసర్పముచే దష్టుండ నై వివేకహీనుండ నై యున్ననాకు నీవచనంబు లమృతతుల్యంబు లయ్యె. కావున నాసంశయంబులు తొలంగునిమిత్తము నిన్నుం గొన్నిప్రశ్నంబు లడుగందలంచితిని. వానిం దర్వాత నడిగెదను. కాని యధ్యాత్మతత్త్వముచేం గ్రథిత మగుటవలన నీ విప్పుడు చెప్పిన వచనములు దుర్బోధము లైనవి; వానినే సులభముగాం దెలియునట్లు వివరించి మున్ముందు చెప్పుము. అందులకై నాచేతంబు కుతూహలపడుచున్నది. ఓయోగీశ్వరా! లోకమునం గ్రియాకలాప మొనర్చునప్పుడు, చెమ్మట, యాయాసము మొదలగునవి గల్గుట ప్రత్యక్షముగాం జూచుచున్నాము. 'నీవు శ్రమ చెందితివి' 'నేను శ్రమ చెందితిని' అనువ్యవహారముచేం గూడ నీయర్థము దృఢమూల మగుచున్నది. ఇట్లుండ శ్రమాదు లాత్మకు లేవని నీవు వచించితివి. ఆనీవాక్యమందలి తత్త్వమును సుఖముగాం దెలిసికొనవలెనని నామనంబు క్లేశ మొందుచున్నది." అని యిట్లడుగుచున్న రాజునకు భరతుం డిట్లనియె. ఓరాజేంద్రా! పృథివీవికార మగు శరీరము గలజీవుండే యొకానొకకర్మవిశేషమువలన [illegible]మి

యందు సంచరించు చున్నయీవాహకజనమై యున్నది. ఇట్లు చరింపనిది పాషాణాదిరూపముగానుండి యచరము లని పిలువఁబడుచున్నవి. కర్మవిశేషమువలననే జీవునిశరీరమునకుఁ జరాచరత్వము సంభవించుచున్నది. ఆపృథివీవికారమునకు మొదటఁ బాదములు వానిపైఁ జీలమండలు, వానికి మీఁదుగాఁ బిక్కలును, వానిపై మోఁకాళ్లును, దరువాత నూరువులును, బిమ్మట నడుమును, వక్షఃస్థలంబును, మెడయును, భుజశిరస్సులును, దానియందు దారుమయ మగుశిబికయును, దానిపై సౌవీరరాజను నీశరీరమును గ్రమముగా నున్నా రని వ్యవహార మున్నది. అందుఁ బాదము మొదలు భుజశిరస్సువఱకుఁ గలమాంసపిండములకుఁ బాదాదులనెడివ్యవహారము వచ్చినట్లె శిబికయందున్న యీమాంసపిండమునకుఁ గూడ సౌవీరరాజని వ్యవహారము వచ్చుచున్నది. ఏమాంసపిండమునందు సౌవీరరాజని వ్యవహార మున్నదో, దానికిని నీకును స్వరూపముచేతను, స్వభావముచేతను, మిక్కిలి భేద మున్నప్పటికిని, భేదము లే దని దేహాత్మాభిమాన మూఁనుకొని "నేను సింధుదేశములకు రాజ" నని చెడుమదంబున నంధుఁడవయి యాత్మయందు రాజత్వబుద్ధి నారోపించుచున్నావు. ఇంతే కాక వాహనము మోయుటవలనఁ గల్గుదుఃఖంబుచేతనే, దీనులై, దయనీయులై యున్న యీవాహకజనమును, బలాత్కారముచే వెట్టిపనులం జేయించుకొనుచు, దయారహితుఁడవయి వర్తించుచున్నావు. నీవాత్మయందు రాజత్వబుద్ధి నారోపించుకొంటివి. కనుకనే నిగ్రహాదికర్తృత్వముగూడ నాత్మనిష్ఠ మగునట్లు తలంచుచుంటివి. రాజత్వ మారోపింపనిచో నీకర్తృత్వబుద్ధి కలుగనే కలుగదు. అ

ట్లాత్మయందుఁ గర్తృత్వారోపణాదికము కేవలము భ్రాంతి మూలకము. మఱియు నీవు "సమస్తజనులను రక్షించుచున్నా" నని గర్వించుచున్నవాఁడ వగుటచేతను, దేహాత్మభ్రాంతిచే సుద్రిక్తుఁడవగుటచేతను, దేహాత్మవివేకము గలపండితసభలోఁ బ్రకాశింపకున్నావు. కానవచ్చు దేహజాత మంతయును నశ్వరమే. చరాచరాత్మక మగు దేహజాతము బ్రహ్మాండంబున నుద్భవించి నశించుచున్నది. కావున నీదేహజాత మంతయు నస్థిర మైనది. అస్థిర మగు దేహాదులను స్థిరంబు లనుకొనుటయును, భ్రాంతి మూలకమే. అట్లస్థిరము లగుటవలన నబాధిత మగువ్యవహారముచే నూహింపఁదగిన దయి. యాత్మారోపిత మగురాజత్వాదివ్యవహారమునకును, స్థాల్యాదివ్యవహారమునకును మూల మైనది. దేహాత్మభ్రాంతికంటె నితర మైనది లేదు. దేహాదిజాతమునకు లయస్థాన మగుక్షితిమండలము నిత్య మనుకొందువేమో. అదియు దేహాదులవలె ననిత్యమే. మనంబున కధిష్ఠాత యగు నీశ్వరునిసంకల్పరూప మగు ప్రకృతి పరమాణుసమూహముచే భూమండలమును గల్పించుచుండఁగాఁ గార్యమగునదియు నిత్యము కాకమానునా ? ఓరాజేంద్రా ! కృశించినదియు, స్థూల మైనదియుఁ, జిన్నదియుఁ బెద్దదియు, నిర్జీవ మైనదియు, జీవసహిత మైనదియు, నగునీచరాచరప్రపంచ మంతయు, నాత్మకంటె భిన్న మయినది శరీరజాత మంతయుఁ బంచభూతములచేతను, వానిపరిణామస్వభావముచేతను, నంతఃకరణముచేతను, సత్త్వాదిగుణక్షోభక మగు కాలముచేతను, గల్పింపఁబడుచున్నది. కాని యాత్మసంబంధము దీనికి నుంతేనియును లేదు. కావున దేహాదులాత్మకంటె వేఱయిన వని సూక్ష్మబుద్ధిచేఁ దెలిసికొనుము. దేహా

ములకంటెను భిన్న మగునాత్మస్వరూపమును జెప్పెదను వినుము.

—భరతుఁడు రహూగణునకాత్మస్వరూపమును జెప్పుట.—

ఆత్మ జ్ఞానస్వరూప మయినది. అది వాస్తవముగాఁ గర్మసంబంధము లేనిది. అది పురుషార్థభూత మైనది. అది యంతటను జ్ఞానముచే నేకాకారమై యున్నది. దానికి బాహ్య మనియు నాంతర మనియుఁ బ్రదేశభేదము లేదు. అది గుణములచే సర్వవ్యాపకమై, సత్యమై యొప్పుచున్నది. అది దీపాదులవలెఁ గాక తననిమిత్తమే ప్రకాశించుచున్నది. దాని కళనాదులగుషడూర్ములును లేవు. అది భగవచ్ఛబ్దముచేఁ జెప్పఁబడుచున్నది. ఆత్మతత్త్వమును దెలిసినపండితు లందఱును, దాని వాసుదేవాత్మకముగాఁ జెప్పుచున్నారు. ఓరహూగణా! ఆత్మజ్ఞానము కృచ్ఛ్రచాంద్రాయణాదితపంబులచేతను, నుపవాసాదులచేతను, వైదికకర్మములచేతను, నిక్షేపముల దానముచేయుటచేతను, గృహస్థధర్మములచేతను, వేదాభ్యాసముచేతను, జలోపాసనముచేతను, నగ్న్యుపాసనముచేతను,సూర్యోపాసనముచేతను, నెంతమాత్రమును లభింపదు. కాని యది కేవలము భగవద్భక్తుల పాదపరాగసేవచేత లభించును. మహాత్ములు గాన భగవద్భక్తులు సంతతమును గ్రామ్యకథలను జెప్పకొనక యుత్తమశ్లోకుఁడయిన వాసుదేవునిగుణముల వర్ణించుకొనుచుఁ గాలముఁ బుచ్చుకొందురు. కావున నమ్మహాత్ములసేవ చేయుచు సర్వకాలములందును వారు నుడువుచుండుసత్కథలను వినుటవలన ముముక్షువు మనంబు వాసుదేవునియందుఁ బ్రవేశించును. గృహమేధిసౌఖ్యములందు విరక్తుఁడవయి మహాత్ములసేవ చేయుదువేని నీ కాత్మజ్ఞానము గల్గు. ఓరాజా! నేను బూర్వజన్మమందు భరతుం

డనెడిరాజనై ప్రసిద్ధిఁ జెందితిని. అప్పుడు నేనైహికసుఖములందును, స్వర్గాదులందును నపేక్ష విడిచి భగవదారాధనమును సల్పుచు నొకానొకమృగమునందుఁ బుత్రప్రేమ నుంచి భగవదారాధనము విడిచి సర్వకాలములందును దాని వర్ధింపసాగితిని. ఆజన్మమును విడిచి మృగసంబంధముచే రెండవజన్మమందు మృగమనై పుట్టితిని. ఓవీరా! వాసుదేవార్చనప్రభావము నేవర్ణింపలేను. భగవదర్చనప్రభావమువలన జనిత మగుస్మృతి నన్నామృగజన్మమందు సైతమును వదలలేదు. పిమ్మట నే నామృగశరీరమును విడిచి బ్రాహ్మణుఁడనై పుట్టితిని. ఇప్పుడు నేను జనసంపర్కాదులకు భయపడుచు, నిస్సంగాభిలాషినై గృహాదులందుఁ బ్రవేశింపక యేకాకినై సంచరించుచుందును. ఓరాజేంద్రా! సంగ మెప్పుడును జీవుని బద్ధునిఁగాఁ జేయుచుండును. కాన జ్ఞానులన్నేహము చేసి యందువలనఁ గలుగుజ్ఞాన మనెడినిశాతకరవాలమును బూని దేహమందును, దదనుబంధులందును గలసంగ మనువృక్షమును ఛేదించి భగవంతునిచేష్టితంబులను జెప్పుటచేతను వినుటచేతను, భగవద్భక్తిని బొంది సంసారాటవియందుఁ జరించువాని కవధి యైనభగవంతునిఁ జెందును.'' ఇది పండ్రెండవయధ్యాయము.

అని చెప్పి వెండియు బ్రాహ్మణుం డిట్లనియె. "ఓరాజేంద్రా! జీవసమూహము మాయచే దురతిక్రమ మగుకర్మమార్గమందుఁ బ్రవేశింపఁజేయఁబడి సత్వరజస్తమోగుణములచే విభక్తములగుశుభాశుభకర్మములందుదృష్టిగల్గి, పురుషార్థత్రయమునందు నాసక్తమై, కర్మముల సంపాదించుకొని, వర్తకుఁడు ధనమును

గొంత తీసికొని ధనార్జనమునకై యడవి కేఁగినట్లు, తనయొనర్చిన కర్మకలాపమును గొని కర్మఫలజనితము లగుజన్మముల సంపాదింప సంసారాటవిం ద్రిమ్మరుచున్నది. అంతియు కాని సుఖంబు చెందలేదు. వనమందు సంచరించువర్తకునిఁ గొట్టి తద్ధనమును జోరు లపహరించినట్లు, సంసారాటవియందుఁ జరించుజీవసమూహమును బాధించి యింద్రియములు భగవదారాధనరూప మగు ధనము నపహరించును. ఘోరాటవినుండు సృగాలాదు లగు క్రూరజంతువులు మేఁకను హింసించినట్లు దారపుత్త్రాదులు "నీవు నాభర్తవు" "నీవు మాతండ్రివి" అని సమీపించి ప్రమత్తునిఁగాఁ జేసి హింసించుచుందురు. మఱియు, లతలచేతను, దృణగుల్మాదులచేతను దుర్గమ మగునరణ్యమునఁ బ్రవేశించి జనుఁడచ్చట భయంకరము లగునీఁగలచేతను, దోమలచేతను, బరివృతుఁడై పర్వ్వర్తినట్లు, జీవుఁ డనంతము లగుకర్మబీజములవలన నుత్పన్నము లగుఫలవృక్షములకు క్షేత్రమువంటిగృహస్థాశ్రమమమందు వర్తించుచుఁ గారణాంతరములవలన రాజభటాదులచే దలుమఁబడుచుండును. జీవుఁ డట్లు వర్తించుచు గంధర్వపురము వలె నస్థిర మగుమనుష్యశరీరమును జూచి, నిత్య మని భావించుచుండును. మఱియు వాఁ డొక్కొక్కప్పుడు దుర్జను లగునితరుల సువర్ణాదికమును జూచి తన కుపకారము గల్గించునని తలంచి స్వీకరించి యాదుర్జనులచే నుపహతుఁ డగుచుండు. జీవుఁడు ధనమం దాత్మబుద్ధి గల్గి వర్తించుచు, దప్పి గొన్నవాఁడు మృగతృష్ణలోనుండి జలమును సంపాదింప నడవియందుఁ బర్వెడునట్లు ధనార్జనమునకై సంసారమందుఁ గ్రుమ్మరుచుండు. ఓరాజా! నరుఁడడవియందుఁ జరించునప్పుడు వాయువువలనఁ బ్రబలినపరాగము

దిక్కులను గప్పి యంధకారబంధురముగాఁ జేసి గ్రుడ్డివానిఁగాఁ జేయుటచేఁ దనమార్గమును గానలేఁడు. అట్లే జీవుఁడును గృహస్థాశ్రమమందుఁ జరించుచు భార్యయందలియనురాగాతిశయముచేఁ గనులు గానక రజోగుణముచే నపహృత మగుజ్ఞానము గలవాఁడై, ధర్మమర్యాదలను దెలియఁజాలకుండు. అడవియందు వర్తించునరుండు కనఁబడకుండఁ జెవులుచిల్లులువడునట్లు చేయుఝిల్లీనాదంబులకును, గుడ్లగూబల కఠోరధ్వనులకును, మనంబున బాధజెందుచు, దప్పిగొని యెండమావులందలిజలంబును గైకొనఁ బర్విడుచుండును. ఆఁకలి గొని విషవృక్షముల నాశ్రయించుచుండును. అట్లే జీవుఁడు సంసారమందుఁ గ్రుమ్మఱుచు, ఝిల్లీరవంబులవలెఁ గర్ణశూలము లగుశత్రువు లాడువాక్యములకును, గూబలధ్వనులవలె నప్రియము లగురాజభటుల దుస్సహవాక్యములకును, మనంబునఁ బీడ నొందుచు, క్షుత్పరిపీడితుఁడయి మృగతృష్ణాజలమువలె సుఖాభాసము గల్గించుధనాదులను సంగ్రహింప నెంచి, విషవృక్షసమానులును, బరోపకారరహితులునునగు పాపిష్ఠుల నాశ్రయించుచుండు హేయములగుసుఖముల ననుసరించుచుండును. అరణ్యగామి యగునరుఁడు తోయంబు లేనినదులకైఁ బోవుచు నచ్చట జలాదులను బొందలేక తిననన్నము లేక యట్టిటు మట్టాడుచు, నొకచోఁ దావాగ్నిఁ బొంది దానివలనఁ దాప మందుచు, శోకాతురుఁడై మిక్కిలి నిర్వేదము చెందునట్లు, జీవుండును, నిష్ఫలము లగుపాషండశాస్త్రములఁ జేరుచు, నన్నాదులు లేక దాయాదుల నాశ్రయించుచు, నొకప్పుడు దావాగ్నితుల్యమును, నభిమతవస్తుశూన్యమగుటచే దుఃఖదంబు నగుగృహంబును జెంది దుఃఖాతురుండై

యక్షులవంటి రాజులు తనప్రాణతుల్యమగు ధనం బపహరింపఁగా నేమియుఁ జేయలేక నిర్వేదము నొందుచుండు. ఓరాజా! అట్లు జీవుండు ధనంబును రాజభటాదులపాలు గావించుకొని దుఃఖితచిత్తుండై యొకప్పుడు దుఃఖాతిశయంబున మూర్ఛిల్లును. ఒకప్పుడు గంధర్వపురమువలె నస్థిరమగు బంధువర్గమును సమీపించి సుఖవంతుఁడనైతి నని ముహూర్తకాలము మోదమందుచుండును. పాంథుఁడు పర్వతాదుల నధిరోహింపఁ దలంచి ముండ్లచేతను, పాషాణంబులచేతను జిలుఁగులచేతను బాధితము లగుపాదంబులు గల్గి, ముందుకు దాని నెక్కలేక విచారముచే విమనస్కుఁ డగుచున్నట్లు జీవుండు పర్వతమువలె దురారోహము లగుయజ్ఞాదికర్మకలాపము నాచరింప నెంచి కంటకపాషాణతుల్యము లగువిఘ్నములచే నుపహతుఁడై యమ్మహాకార్యముల నాచరింపఁజాలక దుఃఖితమనస్కుఁ డయి, ప్రతిక్షణమందును జఠరాగ్నిసంతప్తుఁడై భార్యాదులను మిక్కిలి కోపించుచుండును. ఈదేహియొకప్పుడు కొండచిలువవంటి నిద్రచే గ్రస్తుండై యేమియు నెఱుంగఁజాలఁడు. వీఁడు సర్పతుల్యులగు దుర్జనులచేఁ బీడితుఁడై శవమువలెఁ బడియుండును. వీఁడు వివేకమును బూర్తిగా విడిచి దుఃఖంబనెడి చీఁకటినూతియందుఁ బడుచుండును. ఒకానొకప్పుడు జీవుఁడు స్వల్పసుఖజనకములగు పరదారధనాదుల నపేక్షించి తదధిపతులచేఁ బీడితుఁడై యవమానింపఁబడు. ఒకవేళ నతికష్టంబునఁ బరదారాదులను బొందఁగల్గినను వా రతని వంచించి యాస్వల్పసుఖంబులను నపహరింతురు. ఒకప్పుడు దేహి శీతాదిబాధలకుఁ దాళఁజాలక వానిఁ దొలంగింపఁజాలు వస్త్రంబులను, గృహంబులను సంపాదింపఁ

దలంచియు సంపాదింపఁజాలక, తద్బాధలకు దుఃఖమందుచుండు. మఱొక్కప్పుడు తనస్వల్పధనము నభివర్ధింప నెంచి వీఁడు క్రయ విక్రయాదిరూప మగు వ్యవహారమును జేయుచు, ధనవాంఛచే నెవ్వరితోను విద్వేష మొందుచుండును. మఱియు సంసారమార్గ మందు వర్తించుచు దేహి ధనంబును బోఁగొట్టుకొని, తద్దుఃఖా తిశయముచే శయనింపక కూర్చుండక గృహమందు నిలువక విహరింపక మగుడ ధనంబును సంపాదింప నెంచి పరులవలనఁ బొం దఁజాలనప్పుడు పరులనుండి యపహరింపఁ బాటువడి యవమా నమును బొందుచుండు. దేహి యిట్లు ధనవ్యత్యాసముచేఁ బలువు రతో వైరమును సంపాదించుకొని వివాదములను జేయుచు దుర త్యయమగు సంసారమార్గమందు భయంకరము లగుశ్రమలచే తను, ధనబాధలచేతను, ద్వేషాదులచేతను విపన్నుండై మృత ప్రాయుఁ డగుచుండు. ఆసంసారమార్గమునందు వర్తించుచు దేహి మృతినొందినపిత్రాదులను గుఱించి విలపించుచుఁ దన కుదయిం చిన పుత్త్రాదులను గుఱించి సంతసించు మార్గము నెప్పటికిని విడువఁజాలఁడు. ఓరాజా! ఆసంసారమార్గమును దాఁటింపఁ జేయుసాధన మెద్దియును నిందు లేదు సుమీ! ఈమార్గమును సామాన్యులా దాఁటలేరు. భూనిమిత్తకమగు ద్వేషమునువహించి బలంబున దిగ్గజంబుల ధిక్కరించెడిశూరులు పరస్పరంబును బో రాడి యుద్ధభూమియందుఁ బ్రాణములను విడుచుచున్నారు. కాని వారైనను భూతదయగల్గి ద్వేషము విడిచినయోగీంద్రుఁడు పొం దెడు వైకుంఠమును బొందఁజాలరు. ఓరాజా! దేహి, లతా తుల్యములగు కామినీ భుజముల నూఁతఁగా గొని, యావనితా లత నాశ్రయించి, మధురవచనంబులను బలుకుచున్న బాలకులం

దధిక మోహము గల్గి, సంసారమందు వర్తించుచుండు. మఱి యు భగవత్సంబంధి యగు కాలచక్రమువలనఁ గల్గు జననజరా మరణాదులకు భయమందుచు, దత్పరిహార మొనరింప బకముల తోను గృధ్రములతోను సమానులగు పాషండదైవతములందు భక్తియుక్తుం డగుచున్నాఁడు అట్లు వర్తించుచు నా దేవతల సేవించుటవలన ఫలంబు లేదని తెలిసికొని పిమ్మట నిర్మలమగు బ్రాహ్మణవంశంబున నుద్భవించి, యా బ్రాహ్మణులకు విహితము లగు నుపనయనాద్యాచారములను దుష్కర్మవాసనచే నప్రియ ము లని భావించుచు సదాచారభ్రష్టులయి వానరతుల్యులగు శూద్రప్రాయులతో స్నేహముచేసి వారిస్త్రీలను వివాహ మాడి రహస్యమందు వారితో సంభాషించుచుఁ బరస్పరము భావలోకన మొనర్చుటచే నింద్రియసుఖం బొంది, మరణకాలమును మఱచి ద్రుమతుల్యము లగుగృహంబులందుఁ గ్రీడించుచు, నధిక మగు మైథునేచ్ఛ గలవాఁడగుటచే మిక్కిలి దీనుఁడై పుత్రులందును భార్యలయందును వాత్సల్యంబున వర్తించుచు, సంసారబంధనం బునఁ దగులువడి దానిఁ దప్పించుకొన నశక్తుండై యుండును. మఱియు నొకానొకప్పుడు మృత్యుభయంబువలన, గిరికందరము వలె భయంకరమగు రోగాదిదుఃఖములం బడిలతవంటికర్మవాసన నవలంబించి వర్తించును. అనంతర మా దుఃఖంబు నతిప్రయాస ముచేఁదప్పించుకొని దేహి వర్ణాశ్రమాచారనిష్ఠులగు జనముతోఁ గలసి మసలుచుఁ బూర్వమువలెఁ బ్రవృత్తిమార్గ మభిలషించు చున్నాఁడు. ఓయరిందమా! పెక్కులేల? భగవన్మాయవలన సంసా రమార్గమందు వర్తించుచు దేహి యిప్పటికిని పారమును జూడ లేదు. ఓరఘూగణా! ఆకారణమువలన నీవును భూతములను

దండింపక వానితో మైత్రి చేసి విషయాసక్తుండవు కాక, ప్రకృతి సంబంధ మనెడివృక్షంబును ఖండింప భగవదారాధనరూప మగుకత్తిని గొని సంసారమార్గమునకుఁ బార మగు హరిపదమును బొంది సుఖమొందుము." అని యిట్లుపదేశించినభరతునివాక్యంబు విని రహూగణుం డిట్లనియె ఓయోగేశ్వరా! ఓధీరా! సమస్తజన్మములందును మానవజన్మ మెంత శోభన మైనది! భగవంతుని యశోగుణములను వర్ణించుటవలన నిర్మలమగు చిత్తములు గల మీవంటి మహాత్ముల స్నేహమును సంపాదింపఁ గల జన్మంబు లే జన్మంబులు కాని తక్కినవానితో నేమి ప్రయోజనము? భగవద్భక్త సంగముఁ బడయఁజాలనిచో దేవాది జన్మంబులును వ్యర్థంబులే. ఓమహాత్మా! ముహూర్త కాలమాత్రమే సంభవించిననీసమాగమమువలన దురూహమగు మూలము గలయవివేకము నశించినది. దీనిఁ జక్కఁగా నాలోచింప, నిరంతరమును మీవంటి మహాత్ములపాదపద్మముల నుపాసించి తత్పరాగముచే సమస్తపాపములును దొలంగించుకొన్న వానికి వాసుదేవునియందు నిర్మలభక్తి గలుగుట కెంత మాత్రమును సందేహము లేదు ఇది యోగయాదృచ్ఛికమును గాదు. లోకంబున జ్ఞాను లేరూపంబునఁ జరించుచుందురో తెలిసికొనుట కష్టము. కావున నందఱకును వందనంబు లాచరించెదను. మహాత్ములకు నమస్కారము. బాలుర కెల్లరకును వందనంబులు. నీవంటి యౌవనవంతుల కెల్లను నమస్కారములు. తమమాహాత్మ్యము గప్పిపుచ్చి మెలఁగువటువుల కందఱకు నభివందనంబులు. అవధూతవేషమున భూమియందుఁ జరించుబ్రాహ్మణులకు నమస్కారములు. ఆమహాత్ములవలన మావంటిరాజులకు మంగళంబులు

ప్రాపించుఁగాక" యనెను. ఓపరీక్షిన్నరేంద్రా! అపరిచ్ఛిన్నమగు ప్రభావము గల్గి యాబ్రాహ్మణుఁడు తనకు రహూగణుఁడవమాన మొనర్చినప్పటికిని నతనికిఁ బరమకారుణికస్వాంతంబున నాత్మతత్త్వం బుపదేశించి బద్ధస్నేహుండగు నతనిచే నమస్కృతుండై యింద్రియంబులను నూర్ములనునంతఃకరణమునుజయించినవాఁడగుటచే నిండిన మహార్ణవంబువడువున నిశ్చలుండై భూమండలంబున విహరింపఁజొచ్చెను. సౌవీరపతి యగురహూగణుండును నాజడభరతునివలన నధ్యాత్మతత్త్వంబును జక్కఁగాఁ దెలిసికొని యప్పుడే యవిద్యారోపిత మగు దేహాత్మాభిమానమును విసర్జించెను. ఓరాజేంద్రా! భగవద్భక్తులయుఁ దదాశ్రితులయుఁ, బ్రభావ మీరీతిగానే యుండును" అని వచించిన శుకుం గాంచి, పరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. "ఓమహాభాగవతా! సమస్తమును దెలిసిన నీవు జీవలోకమునకు సంప్రాప్త మగు సంసారమార్గమును జక్కఁగా బోధించితివి. కాని యింద్రియంబుల దొంగలుగాను, దారసుతాదులను సృగాలాదులుగను, గల్పించి పరోక్షముగా వర్ణించితివి. అది యధికవివేకవంతులకు సులభముగాఁ దెలియుటకు సందియము లేదు. అదినావంటియవ్యుత్పన్నవివేకునకుఁ జక్కఁగా దెలియదు. కాన నీవు నాయందు దయ యుంచి యతికష్టంబునఁ దెలియఁదగినయీనీపరోక్షవచనములను బ్రకృతోపయుక్తము లగుశబ్దంబులను బ్రయోగించి తదీయార్థము మావంటివారికి వగత మగునట్లు వివరింపుము" అనిన విని శుకుం డిట్లనియె. ఇది పదుమూఁడవయధ్యాయము.

ఓరాజా! సత్త్వరజస్తమోగుణంబులచేఁ గర్మంబులు నా

త్త్వికములనియు, రాజసములనియుఁ, దామసములనియుఁ ద్రివిధంబులయ్యె. అందు సుఖసాధనములు సాత్త్వికములు. దుఃఖసాధనంబులు రాజసకర్మములు. ప్రమాదాలస్యాదులను సాధించునవి రజస్తమోమూలకములు ఆయాకర్మములవలన దేహాత్మాభిమానులకు, దేవమనుష్యాసురాది దేహపరంపర గలుగుచున్నది. ఆదేహపరంపరకు సంయోగము. వియోగము బాల్యయౌవనాద్యవస్థలును సంభవించుచుండును. ఇదియే సంసారము. ఇదియనాదిగా వచ్చుచున్నది. తాదృశసంసారమనుభవించుటకు ద్వారభూతమగు నింద్రియవర్గము గలదు. ఆసంసారమార్గము ఘోరంబగు నరణ్యమువలె దుర్గమమయినది. ఈకానవచ్చుజీవలోకమంతయును భగవంతుండగు విష్ణువునకు వశవర్తినియగు మాయచే దుర్గమమగు సంసారమార్గమందుఁ ద్రోయఁబడి ధనసంపాదనాసక్తిగల వర్తకసమూహమువలె స్వదేహనిష్పాదితములగు పూర్వోక్తకర్మముల సంపాదించి ఫలకాలంబున వాని ననుభవించుచు, విఫలంబులును, బహువిఘ్నంబులచే నుపహతములు నగుచేష్టల నొనర్చుచు, శ్మశానమువలె నమంగళరూపమగు సంసారగహనమందుఁ దిరుగుచు, సమస్తతాపంబులనుదొలంగించునదియు వాసుదేవుని చరణారవిందములకు మధుకరతుల్యులగు భక్తులచే ననుసరింపఁబడుచున్నదియు నగుభక్తిమార్గమునుబొందలేదు సంసారాటవియందింద్రియంబులనిపించుకొనుచున్నను, గర్మముచే నవి దొంగలని తెలిసికొనుము. వర్తకాదులు ధర్మోపయోగార్హమగుధనమునతికష్టముచే నార్జించుకొనుచుండఁ జోరులపహరించుచుందురు. అట్లె యింద్రియంబులు సాంసారికసుఖభోగముచేఁ గుబుద్ధియును నజి

తేంద్రియుండును నగుపురుషుం డతికష్టముచే సంపాదించిన పరలోకహితకర మగు భగవదారాధనరూప మయిన ధర్మమును, దర్శనము చేతను, స్పర్శనము చేతను, శ్రవణము చేతను, నాస్వాదనము చేతను, నాఘ్రాణము చేతను, నంతఃకరణవృత్తు లగుసంకల్పవ్యవసాయములచేతను నపహరించుచున్నవి. మఱియుఁ బేరుచే దారపుత్త్రాదు లని వ్యవహరింపఁబడుచున్నారు; కాని వారు కేవలము క్రియచే సృగాలాదులను మింతురని నమ్ముము. తోఁడేళ్లు నక్కలు మొదలగునవి రక్షింపఁబడు చున్న మేఁకపిల్లను బలాత్కారమున నపహరించును. అట్లె దారపుత్త్రాదులును, నతిలుబ్ధుఁడైన గృహాశ్రమావలంబి యాత్మాపహారమున కిష్టపడకున్నను వాఁడు చూచుచుండఁగనే యాత్మాపహారమును జేయుచుందురు. ఇంతే కాక గృహస్థాశ్రమము సస్యక్షేత్రమువంటిది సస్యక్షేత్రమున నున్న వృక్షాదులను ఛేదించి దహించి దున్నుచున్నను, నందలి బీజంబులును మూలంబులును బూర్తిగా నశింపక బీజావాపనకాలమం దది లతలచేతను, బొదలచేతను, దృణంబులచేతను, దుర్గమం బగుచున్నది. అట్లె గృహాశ్రమరూపమగుకర్మక్షేత్రమునందుఁగూడఁ గర్మబీజంబులు పూర్తిగా నశింపక యుచితకాలమందుఁ బ్రబలి విజృంభించుచున్నవి. గృహము కామములకుఁ బెట్టెవంటిది. కర్పూరభాజనమునందలికర్పూరముపూర్తిగా నశించినను దద్వాసనలు మిగిలియున్నట్లు గృహమందలి కర్మము నశించినను దద్వాసనలు మిగిలియుండకమానవు. కర్మక్షేత్రమగు నిట్టిగృహాశ్రమమందు, దేహి ప్రవర్తించుచుండును. క్షేత్రమందలిధాన్యాదికము మిడుతలును, బక్షులును, దస్కరులును, మూషికములును నపహరించినట్లు గృహాశ్రమక్షేత్రమందువర్తించు

చున్నవాఁడు బహిఃప్రాణంబుగా నెంచుకొనుచున్న ధనాదులను మశకతుల్యులగు నీచపురుషు లపహరించుచుందురు. ఒకానొకప్పుడు దేహి సంసారమార్గమందుఁ బరిభ్రమించుచు, నహంకారమమకారములచేతను, విషయాభిలాషచేతనుఁ బుణ్యాపుణ్యరూపకర్మవాసనలచేతను, గలుషిత మగుమనంబుచే గంధర్వపురంబువలె ననిత్యము లగు స్వశరీరమును, బుత్త్రాదులశరీరములను నిత్యము లని భావించుచుఁ బానమందును భోజనమందును, మైథునాదులందును వ్యసనములందును, నధికాసక్తి గలిగి మృగతృష్ణవలె సుఖాభాసకములగు విషయములనుఁగూర్చి యనుసరించుచు నొకానొకప్పుడు రజోగుణకలుషితమగుమనంబుగలవాఁడై సకలదోషంబుల కునికిపట్టయి యగ్నిపురీషమై యున్నసువర్ణమును నగ్నిని గోరుచున్నవాఁడు కొఱవిదయ్యమునువలెఁ జేపట్టుచున్నాఁడు. ఆ దేహి యొకప్పుడు నివాసంబులను, క్షేత్రములను, ద్రవిణంబును, దక్కిన తన్ననుసరించి బ్రతుకువానియందును మిక్కిలి యభినివేశము గల్గి సంసారాటవియం దట్టిట్టు గ్రుమ్మరుచున్నాఁడు. మఱియు నొకప్పుడు పెనుగాలిచే నుత్థితమగు పరాగంబుచే నావృతనేత్రుఁ డయినప్పుడు దిక్కులం గాంచక వర్తించునట్లు దేహి సుడిగాలికిఁ దుల యగులలనరజోగుణాతిశయముచే నజ్ఞత్వమును గల్గించుచుఁ దనతోడవై కూర్చుండి యాకాలంబున రాత్రివలె నప్రకాశకమగు ననురాగముచే జ్ఞానంబు నావరింపఁ దదనురాగచ్ఛన్నబుద్ధియై ధరాపరాగముచే గ్రుడ్డివాఁడగు మానవునివలె వర్తించుచు, ధర్మమర్యాదల నతిక్రమించినందులకు సాక్షిభూతులగు దేవతల నెఱుంగఁడు. వేఱొకప్పుడు పురుషుఁడు శబ్దాదివిషయములు పురుషార్థశూన్యంబు లనియొక

మాఱు దెలిసికొనియున్నను దాను దేహచింతచే నాత్మవిషయ
కమగు స్మృతిని గోల్పోయి మృగతృష్ణాజలమున కెనవచ్చుచు
నపురుషార్థము లయినను బురుషార్థములుగాఁ గానవచ్చుశబ్దాది
విషయముల ననుసరించి పర్విడుచుండును. మఱియొకప్పుడు మి
క్కిలి పరుషములయిన గుడ్లగూబలయు, ఝిల్లీకీటకములయు
నినాదములవలెఁ బరుషములై పరోక్షంబున సంభ్రమంబుగల్గించు
శత్రుజనులయు రాజభటాదులయు నవమానవచనంబులు కర్ణ
శూలంబులై, కర్ణమూలంబులను హృదయంబును బీడించుచు
నుండ దీనుండై వర్తించును. ఇంకొకప్పుడు పురుషుఁడు సుకృత
హీనుండై విషతిందుకాది వృక్షములకును గాకిపొండ మొదలగు
విషలతలకును, విషకూపంబులకును, నెనవచ్చుచుఁ దమధనము
లచే దుష్టము లగునిహలోకసుఖంబులు గాని, యదృష్టంబు లగు
కీర్త్యాదులుగాని సంపాదింపలేక జీవచ్ఛవంబులవలె వర్తించుధ
నవంతులసమీపమునకు ధనాభిలాషియై జీవన్మృతుండై పోవుచు
న్నాఁడు. వేఱొకప్పుడు వేదములను, దేవతలను, బ్రాహ్మణులను
నిందించుదురాత్ములప్రసంగంబులచే వంచితుండై నిర్జలమగు
నదీగర్తములోఁ బడినవాఁడు జలము పొందకపోవుటయే కాక
శిరంబు పగిలి తదీయమగు బాధలను బొందుచున్నట్లు లిహలో
కమున సుఖప్రాప్తి పొందకపోవుటయే కాక పరలోకమందు దుః
ఖప్రాప్తిని గూడ కల్గించు పాషండకులమం దుదయించును.
మఱియు జీవుఁ డెప్పుడు పరులఁ బీడించియు నాహారాదులను సం
పాదింపలేఁడో, యప్పుడు కుశాదితృణములు మాత్రమే గల్గుపిత్రు
పుత్త్రాదులను భక్షించుచుండును. వేఱొకప్పుడు వాఁడు భోగ్య
పదార్థరహితమై, దుఃఖపరంపరకు నిలయమునయి, కావుననే దా

వాగ్నితుల్యమై, యున్నగృహంబును బొంది, యిష్టవస్తువులు లభింపకపోవుటచేతను, ననిష్టంబుల నివర్తించుకొనలేకపోవుటచేతను, జనించు దుఃఖాగ్నిచే మిక్కిలి సంతప్తుండై "అక్కటా! నేను సుకృత మాచరింపక మందభాగ్యుండ నైతి"నని పశ్చాత్తాపంబు నొందును; మఱియు నొకప్పుడు కాలంబుచేఁ బ్రతికూలమయిన రాజకులము రాక్షససదృశమై, ప్రియాతమధనరూపమగు ప్రాణముల నపహరింప జీవలక్షణము లగుహార్దాదులను విడిచి శవంబుపలె నుండును. వాఁ డింకొకప్పుడు సంకల్పవికల్పరూప మగుమనోరథము ననుసరించ వచ్చినపితృపుత్త్రాదులు కాలాంతరమం దుండనివా రగుటచేతను, బురుషాంతరులచే ననుభవింపఁబడనివా రగుటచేతను స్వప్నదృష్టపదార్థములవలె ననిత్యులైనను, నిత్యు లని తలంచుచు, స్వప్నసుఖముంబోలె బితృపుత్త్రాదిసుఖంబును క్షణమాత్ర మనుభవించును. మఱియు గృహస్థులగు వారికిఁ గర్మవిధులుపర్వతమంతయుప్పగానున్నవి. దేవా! యధిక ధనముచేతను, శరీరాయాసముచేతను, సాధ్యములయినయజ్ఞాదికర్మకలాపములకుప్పను యథావిధిగా నాచరించనసమాప్తి చేయఁ దలంచి యారంభించి మధ్యకాలమున లోకసంబంధంబులగు దుఃఖంబులచేతను, దదితరవిఘ్నములచేతను బీడితచిత్తుఁడై, పర్వత మధిరోహింపఁ దలఁచి పోయి మధ్యమార్గమునఁ గంటకపాషాణాదులచే దుర్గమమగు క్షేత్రమునం బడినపురుషునివలె మిక్కిలి ఖేదంబును బొందును. ఒకప్పుడు వాఁడు దుస్సహమగు శరీరములోనున్న జఠరాగ్నిచే సత్వహీనుఁడై కృశించి తనభార్యపై మిక్కిలి కోపము వహించును. అట్లు కోపించి వాఁడు కొండచిలువవంటి నిద్రచే గ్రస్తుండై తన్నును నితరులను బ్ర

కాశింపఁజేయుని యజ్ఞానంబున మునింగి యరణ్యమువలెనే జ
శూన్యమగు బ్రదేశమున శయనించి బ్రాహ్మణత్వాదుల బాహ్య
కారము నేమియు నెఱుంగక దూరముగాఁ బరిహరింపఁబడినశ
మువలె నుండును. వాఁడు మఱొక్కప్పుడు క్రూరసర్పములవంటి
దుర్జనులచే విఱువఁబడిన కోఱపన్ను వంటిగర్వము గలవాఁడై
ద్రాదుల కవకాశ మిచ్చి,యాయవమానంబునకుఁ జిత్తంబు సం
తంబును దుఃఖించుచుంటఁ జేసి విజ్ఞానంబును గోల్పోయి
చీకఁటికూపమువంటి మహాదుఃఖమందు గ్రుడ్డివానివలెఁ, బడ
చుండును. మఱొకప్పుడు వాఁడు సుఖలేశము లగువిషయోపభో
గములను వెదకుచుఁ దత్సాధనము లగుపరదారపరధనముల స్వీ
కరింపఁ బ్రారంభించి పరులచేఁగాని తత్ప్రభువులచేఁ గాని మ
తుఁడై నరకప్రాయ మగుకారాగృహమందు బద్ధుం డగును.
రాజా! జీవున కట్టిదురవస్థలు సంప్రాప్త మగుటవలన నిహలోక
బున నైనను బరలోకమున నైనను బ్రవృత్తిమార్గమందుఁ
ర్మమే సంసారమునకు జన్మక్షేత్రం బని నుడువుచున్నారు. ఓర
జా! కారాగృహబద్ధుఁ డయినవాఁ డతికష్టముచే నాబంధంబ
ను దొలంగించుకొని యాధనాదికము ననుభవించుచుండ వేఱొ
కఁడు వచ్చి హరించును. వానివలన మఱియొకఁ డపహరించును
ఇట్లాధనాదికము హద్దు లేకుండ నపహృతమగుచుండును గా
తనచే ననుభవింపఁబడదు. వేఱొకప్పుడు వాఁడు శీతంబునకున
వాతంబునకును, నాతపంబునకును, నాధిదైవికంబులును, నా
భౌతికంబులు నాఁబడు మిగిలినతాపంబులకును, దగిన ప్రతీకా
రంబుల నొనర్పసమర్థుండు కాక యెడతెగనిదుఃఖంబునకుగు
రై వర్తించును. మఱియొకప్పుడు వాఁడు తనయొద్ద నున్న స

ల్పధనంబును వర్ధింపనెంచి వ్యవహారము చేయుచు, నితరులయొద్ద నుండి కొంత ద్రవ్యమును స్వీకరించుచు, ధనలోభముచే జనవిద్వేషమును బొందుచుండును. ఒకప్పుడు వాఁడు తనధనంబును సర్వంబును గోల్పోయి కావుననే తల్పములు నాసనములు మొదలగు భోగ్యపదార్థంబులు లేమిఁ దనమనోరథంబులు వ్యర్థంబు లగుటచే విచారించుచుఁ దత్సంపాదనముకై యన్యధనంబును స్వీకరింప నుద్యుక్తుండయి యందువలన నవమానాదులను బొందుచుండును. ఇట్లు ధనవ్యత్యాసముచే వైరానుబంధంబులను వర్ధించుకొనియు సాజాత్యాభిమానమగు ప్రాగ్వాసనచే నావైరవిషయములనే వివాహాదిక్రియచే సంబంధంబును గూర్చుకొనుచుండు. ఇట్లు నానావిధంబు లగు క్లేశములచేతను వక్ష్యమాణంబులగు రాగద్వేషాదులచేతను, విస్తృత మగుసంసారమార్గమందు నాపదలను బొంది మృతు లయినపిత్రాదులను విడిచి పుట్టినపుత్రాదులందు ననురాగ ముంచి మగుడ నదేసి విపత్తి సంప్రాప్తమైనచో మనంబున దుఃఖించుచు, మోహమునొందుచు దీనాలాపంబులు పలుకుచుఁ గన్నీరు కాల్వలుగట్ట నేడ్చుచు,మగుడఁ దనకుఁ బుత్రాదు లుద్భవించినచో నెక్కుడుగా సంతసించుచు, రాఁబోవు దుఃఖంబులకు భీతిల్లుచు, నొకప్పుడు తనపుత్రాదుల గుణచేష్టలను వర్ణించుకొనుచు,ఖేదమోదంబులచే మోహమందుచు,సాధుకృత్యవర్జితుఁడై యిప్పటికిని జీవలోక మానసంసారమార్గము పారంబును బొందలేకుండెను. తాదృశసంసారమార్గము పారంబును జేర్చునది యాధ్యాత్మికయోగము చేతను,గర్తయోగముచేతను ననుగృహీతమగు భక్తియోగము తక్క వేఱొక్కటి లేదు. మఱియు నిరతిశయానందరూప మగుపరమాత్మను బొం

దుటకుపాయభూత మయినయోగానుశాసనమును, శాంతస్వభా
వులై ప్రాణంబును జయించి మననశీలురై సర్వభూతహితులైన
మహాత్ములాచరింపఁ గలుగుదురు కాని దానిని దిగ్గజంబుల
జయింపఁగల్గియు మనంబును జయింపఁజాలని రాజర్షు లెంతమా
త్రమును బొందలేరు. ఇంతేకాక వా "రీభూమి నాది" యని
మమతాభిమాన ముంచికొని పరస్పరమును వైరానుబంధము గల్గి
యుద్ధము చేయుచు నాభూమిని విడిచి మృతినొందుదురు. ఓరాజా
సంసారమార్గమందు వర్తించువారికి సుఖదుఃఖంబులును, రాగ
ద్వేషంబులును, భయాభిమానంబులును, మోదఖేదంబులును,
శోకమోహంబులును, మాత్సర్యంబును, నీర్ష్యావమానములును
క్షుత్పిపాసలును, నాధివ్యాధులును, జన్మంబును, జరామరణా
దులును, దప్పక సంభవించుచుండు. మఱియు భగవన్మాయా
రూప యగు ప్రమద స్వయముగాఁ గౌఁగిలించుకొని యాపురు
షుల వివేకాత్మక మగుజ్ఞానంబును నశింపఁజేయును. అందు
వలన వారలా స్త్రీలకు క్రీడాభవనంబులు నిర్మింప నారంభించి
తత్స్వార్థవిషయులై యాకులహృదయులై యావిహారగృహమం
దు వర్తించుపుత్త్రులను బుత్త్రికలను, గళత్రములను, గనుఁగొ
నుచు, వారి మృదుమధురభాషణములును, వీక్షణంబులును,
జేష్టలను, హృదయంబు నపహరించుచుండ నేమియుఁ జేయ
లేక యింద్రియంబుల జయింప నసమర్థుండు కావున తనయా
త్మను దుఃఖనరకంబునఁ ద్రోయుచున్నాఁడు. ఓరాజా! పరమా
ణువు మొదలు ద్విపరార్థపర్యంతంబును గలుగు కాలమే స్వరూ
పముగాఁ గల్గి మిక్కిలి శీఘ్రముగాఁ బరిభ్రమించుచు బ్రహ్మ
మొదలు తృణమువఱకుఁ గలజీవుల యాయుర్దాయముల నపహ

టికాదిరూపముగా లెక్కించుచుఁ బ్రమత్తు లగువారి యాయువు నపహరించుచున్న భగవంతుం డగువిష్ణుని కాలచక్రమువలన మరణము సంభవించునేమో యని భయమందుచు నాచావును దప్పించికొని యమరత్వము వడయ నెంచి, యాకాలచక్రమాయుధంబుగఁ జేసికొనివర్తించు వాసుదేవునిఁ దిరస్కరించి, రాఁబులుగులవంటివారును, గృధ్రములవంటివారును, గొంగలవంటివారును, నార్యజనులు చెప్పిన సిద్ధాంతంబులనుండి బహిష్కృతులును నగుపాషండదేవతలను పాషండదేవతాసంకేతంబులచే నభిముఖముగాఁ జేసికొని యారాధించుచుందురు. వా రెప్పుడా పాషండదేవతలవలన ఫలంబును బొందలేక వారిచే వంచితులగునట్లు తెలిసికొందురో యప్పుడే వారు బ్రహ్మకులమున నుద్భవించి యజ్ఞపురుషుఁ డగు వాసుదేవునారాధనరూపములును బ్రాహ్మణులకు విహితంబులును నగు నుపనయనాదు లయిన శ్రౌతస్మార్తకర్మంబులను నొనరింప నిష్టపడక, పిమ్మట శూద్రకులంబును బొందుదురు. అచ్చట నట్టివాఁడు, నిగమోక్తములగు నాచారములవలనఁ దనకుఁ శుద్ధిలేకపోవుటచే శూద్రస్త్రీని బెండ్లియాడి దానియందు సంతానమును గని తత్కుటుంబభరణమునకుఁ బాటుపడుచు వానరజాతివలె గ్రామ్యసుఖంబు లొందుచుండును. ఆశూద్రకులమందుఁ బ్రతిబంధంబు లేకపోవుటచే యుక్తములగు దేశకాలములఁ బ్రతీక్షింపకుండఁ గ్రీడించుచు మిక్కిలి విషయాతురమైన బుద్ధితో వర్తించుచుఁ బరస్పరముఖావలోకనాదులగు గ్రామ్యకర్మములచేఁ గాలావధిని మఱచి వర్తించును. మఱియు వాఁడు, వానరము దారసుతాదులతో వృక్షమందుఁ గ్రీడించునట్లు దారసుతాదివత్సలుండై వృక్షమువలెఁ గేవల

మైహికసుఖంబులను గల్గించు గృహంబున విహరించుచుసంసార బంధనముచే వివశుండగు. దేహి యిట్లు సంసారమార్గమందు సుఖదుఃఖంబుల ననుభవించుచు, మృత్యు వనెడి గజమువలనం గల్గుభయముచేం గొండగుహా కైన యగురోగాద్యాపదలందుం బడి తన జీవనమునకు హేతుభూత మగుకర్మరూప మయిన లత నూంతగాంగొని యాయాపదనుండి యతికష్టముచే విముక్తుండయి యిట్లనవరతంబును,సంసారమార్గంబునం జరించుచు నరశరీరము దాల్చినజీవసమూహమును బొందుచుండును. ఇట్లు మీందనున్న లోకాంతరములందు వర్తించువారు గూడ నీసంసారమార్గమందుం బరిభ్రమించుచున్నా రని నీవు తలంపుము. ఓరాజేంద్రా! గరుత్మంతునిగమనమహిమ నీఁగ లెఱుంగంజాలనట్లు మహానుభావుం డగుఋషభపుత్రునిమార్గంబును మనంబుచేతనైన ననుసరింప నేనృపాలుండునునర్హుండుకాండు. ఓరాజా! ఋషభపుత్రుం డగునాభరతుండును భగవదర్పితచిత్తుండు కావున, విడువం దరము కానిపోయినను, మనోహరు లగుపుత్రులను, హితులను, రాజ్యంబును, ధనంబును, గళత్రములను, యౌవనవంతుండై యుండియే మలమునుంబోలె విసర్జించెను. ఓనరేంద్రా! యాభరతుండు వానిని కేవలము విసర్జించుటయే కాదు. వానియందతనికి సుంతేనియు నభిలాషమే లేదు. ఆలోచింప భారతవర్షరూప మగుభూమండలంబును, బుత్రులను, ధనములను, స్త్రీలను, దేవేంద్రాదులకు సైతమును బ్రార్థనీయము లై, యతనిదయ నభిలషించుచు స్వయముగా వరించిన సంపదలను, మనంబుననైన సుంతేనియు నభిలషింపలేదు. ఇది యద్భుతము కాదు. సర్వకాలములందును వాసుదేవునిపాదారవిందములను డెందం

బునఁ గొల్చుమహాత్ములు భగవత్సేవకంటె మోక్షము సైతము స్వల్ప మని తలంచు చుందురు. అట్టివారికి చంచలసంపదలందు వైరాగ్యము గలుగుట యుక్తమే కదా? ఓరాజేంద్రా! తనకు సంప్రాప్త మైనమృగశరీరంబును విడువ నెంచి యాభరతుండు వాసుదేవు నుద్దేశించి, 'ఓదేవా! యాగభోక్తవై, యాగప్రభువవై, యాయా యవతారంబులచే వర్ణాశ్రమధర్మంబులను సంరక్షించుచు ధర్మానువర్తు లగువారని రక్షించుటలో నేర్పు వహించి, యధ్యాత్మయోగమే శిరంబుగాఁగ వర్తించుచు, భక్తియోగగమ్యుండవై, ప్రకృతికి నియంతవై, చిదనిత్యులు శరీరముగాఁ గలిగి యాశ్రితులసంసారబంధంబును హరించునీపాదంబుల కభివందనంబు''లని పలికి ముక్తుం డయ్యె. ఓనరేంద్రా! భగవద్భక్తులచే నుతింపఁబడు నిర్మలగుణంబులకును, భూతహితాచరణము మొదలగు సత్కర్మంబులకును నిలయ మైనయీభరతునిచరిత్రము యశస్కరం బనియును. మంగళావహ మైనదనియు, నాయుర్దాయము గల్గించుననియు, ధనప్రాపకమనియు స్వర్గసాధనమనియు, ముక్తిసాధనమనియు, నుతింపఁబడుచున్నది. ఎవ్వఁ డీ చరిత్రంబును వినునో, చెప్పునో, యనుమోదించునో, యాపురుషుఁడు స్వయముగనే సమస్తవాంఛితంబులును పొందుచున్నాఁడు. పరులను గోరవలసినది యొక్కటియును లేదు. ఇది పదునాల్గవయధ్యాయము.

శుకుఁడు భరతసంతతిని దెలుపుట.

ఓరాజేంద్రా! భరతునిసచ్చరిత్రంబును వర్ణించితిని. ఇఁక నతనిసంతతిని వర్ణింతును వినుము. ఆభరతునకు సుమతి యను

నాత్మజుండు కలఁడు. ఆసుమతి ఋషభుం డాచరించిన యోగ చర్య నవలంబించి వర్త్తించుచుండఁ గొందఱు పాషండులు పాపీయ మగుస్వబుద్ధిచే నతఁడు బౌద్ధదేవత యని కల్పింతురు. కాని యతఁ డట్టివాఁడు కాఁడు. ఆసుమతికి గృధ్రసేన యందు దేవతాజిత్తను బాలుఁడు కలిగె. ఆ దేవతాజిత్తున కాసురి యను భార్యయందు దేవద్యుమ్నుం డనుతనయుం డుద్భవించె. ఆ దేవద్యుమ్నునకు ధేనుమతి యనుభార్యయందుఁ బరమేష్ఠి యను నాత్మజుం డుదయించె. అతనికి సువర్చల యనుభార్యయందుఁ బ్రతీహుఁడు పుట్టెను. ఆప్రతీహుఁడు పెక్కండ్ర కధ్యాత్మవిద్య నుపదేశించి యాయుపదేశంబువలననే నిర్మలాంతఃకరణుం డై పరమపురుషు నుపాసించెను. ఆప్రతీహునకుఁ బ్రతిహర్త్త యనియు, ప్రస్తోత యనియు, నుద్గాత యనియు ముప్వురు పుత్త్రులు గలిగిరి. వారు ముప్వురును, యాగాదిక్రియలందు మిక్కిలి నిపుణులు. వారిలోఁ బ్రతిహర్త్త స్తుతి యనుభార్యవలన "అజుఁడు, భూమ" యను నిద్దఱఁ దనయులం బడసె. అజానుజుఁ డగు భూమ, ఋషికుల్యయనుభార్యవలన నుద్గీథ యనుపుత్త్రుఁ గాంచె. ఆయుద్గీథకు దేవకుల్య యను భార్యయందుఁ బ్రస్తరుఁ డుదయించె. ఆప్రస్తరునకు వియుత్సయందు విభు వనుసుతుం డుద్భవించె. ఆవిభునకు భారతియందుఁ బృథుషేణుఁడును, నతని కాకూతి యను పత్నియందు నక్తుం డనువాఁడును గలిగిరి. ఆనక్తుండు కృతి యను భార్యవలన గయుం డనువానినిఁ బడసె.

గయోపాఖ్యానము.

ఓరాజేంద్రా! రాజర్షులలో గయుం డుదారకీర్తి యని ప్రఖ్యాతి వహించె నతఁడు లోకంబును రక్షింపఁదలంపుచే శుద్ధసత్త్వమూర్తి

నవలంబించిన విష్ణువునంశసంభూతుండనియుఁ బ్రశస్తమనస్కుం డనియుఁ బ్రఖ్యాతి వహించెను. మఱియు ధర్మాది గుణములచే మహాపురుషుఁ డయ్యెను. అమ్మహాత్ముఁడు తనకులధర్మం బని ప్రజలను భయమువలన రక్షించుచు నాహారాదు లిడి పోషించుటయు నిష్టవరంబుల నిచ్చి సంతసింపఁ జేయుచుఁ గుమార బుద్ధితో శ్లాఘించుచుండెను. అట్లె తన కాశ్రమధర్మమని పంచ మహాయజ్ఞంబుల నొనర్చుచుఁ దత్ఫలంబు లన్నివిధంబులచేతను బ్రహ్మాది దేవతలకంటె నధికుండును మహాపురుషుండును నగు పరబ్రహ్మమందు ముఖ్యమైనపురుషార్థంబని సమకూర్చుచు నుండెను. ఆగయుండు కులధర్మమగు ప్రజాపాలనాదులచేతను, బ్రహ్మవిదుల పాదపద్మంబుల సేవించుటవలనఁ బ్రాప్తమగు భగవద్భక్తియోగముచేతను మాటిమాటికిని నంతఃకరణంబును నిర్మలముగాఁ జేసికొని దేహాత్మభ్రాంతిని వదలి తనయాత్మయం దంతరాత్మగా నుండి ప్రత్యక్షమగు పరమాత్మతత్త్వం బెఱింగి దేహాత్మభ్రాంతిని స్వతంత్రాత్మభ్రాంతిని విడిచి భూమండలంబును జక్కఁగాఁ బరిపాలించెను. పాండవేయా! పూర్వకాలవృత్తాంతంబులు తెలిసిన మహాత్ము లాగయుని మాహాత్మ్యము గాథలను గొన్నింటిని జెప్పిరి. వానినిఁ జెప్పెద నవధరింపుము. అతఁ డొనరించినకర్మములవంటి కర్మములచే నేపురుషుం డాగయుని ననుసరింపఁగలఁడు ? ఆ గయుఁడు శ్రుతివిహితంబులగు యజ్ఞాదుల నొనర్చినవాఁడు. అతఁ డెక్కువ తెలిసినవాఁడు. అతఁడు వర్ణాశ్రమధర్మంబులను రక్షించినవాఁడు. అతఁడు సమస్తసంపదలను పొందెను. అతఁడు సత్పురుషుల కధిపతి యయ్యు వారిని సేవించువాఁడు. ఇట్టిమహాగుణంబులు

గలవాఁడు భగవదంశసంభూతుం డగుగయుండు దక్క వేఱొక్కరుఁ డెవఁడు గలఁడు? సత్యము లగునాశీర్వచనంబులు గల శ్రద్ధా మైత్రీ దయాదు లగు దక్షకన్యకలు తమ తేజంబులచే నేవాని శ్రేష్ఠునిఁగ నొనర్చిరో, భూదేవి యెవనిగుణములందు వాత్సల్యము గల్గి స్రవించుచున్నపాదుగు గలదై నిష్కాముఁడైన యెవనిప్రజల కోర్కులను నెఱవేర్చుచుండెనో, యాగయుని నెవఁ డనుకరింపఁగలఁడు? ఓరాజేంద్రా! వేదంబులును వేదోక్తకర్మంబులును నిష్కాముం డైనయాగయునికోర్కుల నిచ్చుచుండెను. యుద్ధమందుఁ దిరస్కృతు లై రాజు లందఱు నతనికి బలులఁ దెచ్చి యిచ్చుచుండిరి. ధర్మపరిపాలనంబు చేతను,దక్షిణాదులచేతను బూజితు లయినబ్రాహ్మణులు లోకాంతరమువిషయమై తా మొనర్చిన ధర్మఫలంబులలో నాఱవపా లాగయునకు నొసంగుచుండిరి. అమ్మహాత్ముఁ డింద్రునకు మదంబు గల్గించునంతటి సోమపానంబులు గలయాగంబుల నొనర్చెను. ఆగయుఁ డంతరాయంబులఁ బొరయనిభక్తియోగంబుచే సమర్పించిన యాగాదిఫలమ్మును యాగశరీరకుఁ డయినపరమాత్మ స్వీయముగాఁ బ్రీతితో స్వీకరించెను. విశ్వంబునకుఁ బ్రాణభూతుం డగు నాభగవంతుండు ప్రీతుం డగుటచేఁ జతుర్ముఖుండు మొదలు తృణమునవఱకుఁ గల దేవమనుష్యతిర్యగాదులకు సంప్రీతి గల్గుట నాబ్రహ్మాదు లందఱును నాగయునియం దెక్కుడుప్రేమ గలవారైరి. ఇట్టియుదార చరిత్రము గలగయుని ననుకరింప లోకంబున నెవండు సమర్థుండు? ఆగయునకు జయంతి యనుకళత్రమందుఁ జిత్రరథుండును, స్వాతివరుండును, ధనుండును, ననుమువ్వురు పుత్త్రు లుదయ మందిరి. వారిలోఁ జిత్రరథున కూర్ణయందు

సమ్రాట్టనెడి తనయుం డుద్భవించెను. ఆసమ్రాట్టునకు నుత్కలయందు మరీచి జన్మించెను. మరీచికి బిందుమతియందు బిందుమంతుం డుదయించెను. బిందుమంతునకు సుషేణయందు మధు వుదయించెను. మధువునకు సుమనస్సునందు వీరవ్రతుం డుద్భవించెను. ఆవీరవ్రతునకుఁ బ్రబోధయందు మధు వనియుఁ బ్రమధు వనియు నిరువురు తనయులు జన్మించిరి. వారిలో మధునకు సత్యయందు భౌమనుండు గల్గెను. ఆభౌమనునకు దూషణయందుఁ ద్వష్ట యనుకుమారుండు జనించెను. ఆత్వష్టకు విరోచనయందు విరజుఁడు సంభూతుండయ్యె. ఆవిరజునకు విషూచియందు శత్రుజిత్తు మొదలగు నూర్వురుతనయులును, నొకకన్యకయును గల్గిరి. ఓరాజా! కడపటివా రయినశత్రుజిదాదులకు జనకుండగువిరజుండు, విష్ణువు దేవగణంబులనుంబోలెఁ బ్రియవ్రతవంశంబును వంశకీర్తిచే నలంకరించెను.” ఇది పదియేనవయధ్యాయము.

అని నుడువుచున్న శుకుంగాంచి రాజేంద్రుం డిట్లనియె, ఓమునీంద్రా! సూర్యునికిరణము లెంతవఱకుఁ బ్రసరించునో, యెంతవఱకుఁ జంద్రుండు శుక్లపక్ష కృష్ణపక్షములందు నక్షత్రగణంబులతోఁగూడ సంచరించునో, యంతవఱకుఁగలభూమండలము వైశాల్యాదులను గుఱించియు, దీనియందున్న జంబూద్వీపాదులను గుఱించియు నీవు సంగ్రహంబుగా వచించితివి. కాని విశేషించి చెప్పలేదు. ఇప్పుఁడా భూమండలమానంబును, దదవాంతరభేదములను, నామములను, విస్తారముగా వినఁగుతూహలంబున నున్నాఁడ. భూమండలముల వైశాల్యాదులను వినుటవలన నేమిలాభమని యందువేమో? అందు లాభము లేక

పోలేదు. ఈభూమండలమంతయు సత్త్వాదిగుణపరిణామ మగు భగవంతుం డగు పరమాత్మ స్థూలరూపము. భగవంతుని స్థూల శరీరమందు మనం బావేశించియున్నచోఁ బిమ్మట సత్త్వాదిగుణ రహితమై, యంగుష్ఠప్రమాణము గలదై స్వయంప్రకాశమై, వాసుదేవాది శబ్దంబులచే బోధిత మగు పరమాత్మనియం దావేశించి స్థిరంబుగా నుండుటకు సమర్థ మగును. కావున గురూత్తమా ! యీభూమండలము మానలక్షణాదుల నడుగుచున్నాను" అని యడిగిన నరేంద్రునకు మునీంద్రుం డిట్లనియె. 'ఓమహా

శుకుండు రాజునకు భూపరిమాణాదులనుఁ జెప్పుట.

రాజా ! అనంత మయినబ్రహ్మాండము భగవంతునిమాయాగుణము లగుసత్త్వాదుల పరిణామమే. అది భగవంతునివిభూతి. భగవద్విభూతి కంతర్గతము లగు లోకములనామములను రూపంబులను, నన్నింటిని బూర్తిగా, మనంబున నూహించుటకుఁగాని వాకొనుటకుఁగాని దేవతలకుఁ గలంత యాయుర్దాయంబుగల పురుషుండైనను సమర్థుండుకాఁడు. కావున భూగోళమం దుండు ముఖ్యము లయినయవాంతరభేదంబులను, నామములను, మానములను, లక్షణంబులను వివరించెదను. ఓరాజా! ప్రసిద్ధ మగునీ జంబూద్వీపము భూవలయ మనుపద్మంబునకుఁ గోశంబులవలెఁ దనర్చుద్వీపాదుల కంతర్వర్తి యై యంతఃకోశంబువలెఁ దనర్చుచున్నది. ఈద్వీపము లక్షయోజనంబుల వైశాల్యముగల్గి తామరపాకువలె సమవర్తుల మై యున్నది. ఇందు, దొమ్మిదివర్షంబులు గలవు.అందొక్కొక్కటితొమ్మిదివేలయోజనంబులపరిమాణంబు గలది. అఖండముగా నుండు జంబూద్వీపము నీలము, శ్వేతము శృంగవంతము, నిషధము హేమకూటము హిమాలయము,

మాల్యవంతము, గంధమాదనము, నాఁబడు నెనిమిది పర్వతంబులచే నసంకీర్ణముగా విభజింపఁ బడినది. ఆతొమ్మిదివర్షంబులలోను, నిలావృతము మధ్యప్రదేశంబున నున్నది. ఆయిలావృతమునకు మధ్యమందుఁ గులగిరుల కధిపతి యగు బంగారుకొండ గలదు. అది యౌన్నత్యమునందు లక్షయోజనముల ప్రమాణము కలది. అది భూమండల మనెడికమల మునకుఁ గర్ణికవలెఁ దనర్చుచున్నది. దానియూర్ధ్వభాగము ముప్పదిరెండువేల యోజనములవైశాల్యము కలది. ఆపర్వతరాజము మూలమందుఁ బదాఱువేల యోజనములపరిమితి గలిగి భూమండలంబున కంతర్భాగంబును బ్రవేశించియున్నది. ఇలావృతవర్షంబున కుత్తరోత్తరంబునఁ గ్రమముగా నీలము, శ్వేతము, శృంగవంతము నాఁబడుపర్వతములు మూఁడును, రమ్యకము, హిరణ్మయము కురువునాఁబడు వర్షములమూఁడింటికిని సీమాపర్వతములై యున్నవి. అవి తూర్పునకు దీర్ఘముగా వ్యాపించి యున్నవి. ఆపర్వతములు పూర్వపశ్చిమములందు లవణసముద్రము నంటి వర్తిల్లుచున్నవి. అవి రెండువేలయోజనముల విస్తీర్ణతచే నొప్పుచున్నవి. వానిలోఁ దొలుతొలుతదానికంటె నుత్తరంబున నుండుపర్వతము దైర్ఘ్యంబునఁ బదునొకొండవవంతుచేఁ దఱిగి (అనఁగా నీలముకంటె శ్వేతమును, శ్వేతముకంటె శృంగవంతమును బదునొకండవవంతుచేఁ బొట్టివై) యున్నవి. అట్లె యిలావృతమునకు దక్షిణమున నిషధము, హేమకూటము, హిమాలయము నాఁబడు పర్వతములు తూర్పునకు దీర్ఘముగా వ్యాపించి నీలాదులతో సమానము లగుపరిమాణములు గల్గి నీలాదులవలెఁ బదివేల యోజనంబులపొడవున వర్తిల్లుచుఁ గ్రమముగా హరివర్షము

నకును, గింపురుషవర్షమునకును, భారతవర్షమునకును, సీమాపర్వతము లగుచున్నవి. అట్లె యిలావృతమునకుఁ దూర్పునను గంధమాదనమును, పడమట మాల్యవంతమును, నీలనిషధపర్వతములపర్యంతమును వ్యాపించి రెండువేలయోజనములప్రమాణము గలవై భద్రాశ్వమునకును, గేతుమాలమునకును మర్యాదాపర్వతము లగుచున్నవి. మఱియు మేరువునకు నలుదెసలను, మందరము, మేరుమందరము,సుపార్శ్వము,కుముదము నాఁబడు నాలుగుపర్వతము లయుత యోజనపరిణామము లయి ప్రతిబంధకములయి వఱలును. అందు మేరువునకుఁ దూర్పున మందరమును, దక్షిణమున మేరుమందిరమును, బడమట సుపార్శ్వమును నుత్తరమునఁ గుముదంబును వరుసగా వెలయుచుండును. ఆనాలుగు గిరులందును గ్రమముగా మామిడిచెట్టును, నేరెడుచెట్టును, గదంబవృక్షంబును, వటతరువును, బదునొకొండువేల యోజనముల యౌన్నత్యము గల్గి విలసిల్లు. ఆతరురాజముల శాఖాసమూహములు నూఱుయోజనములవఱకువిస్తరించియున్నవి. మఱియు నాగిరులందుఁ గ్రమముగా క్షీరములతోను మధువుతోను, జెఱకురసముతోను, నిర్మలజలముతోను, నొప్పుచునాల్గు హ్రదంబులు కలవు. ఓరాజా! స్నానపానాదులచే నాహ్రదములను సేవించు గంధర్వగణములు స్వభావసిద్ధము లగు నణిమాదు లగునష్టైశ్వర్యములనుగాంచిపరఁగుచున్నారు.ఆగిరులందు నాలుగుదేవోద్యానములు గలవు. అవి క్రమముగా నందనమనియుఁ, జైత్రరథ మనియు, వైభ్రాజమనియు, విశ్వతోభద్రమనియుఁ జెప్పఁబడును. అందు దేవతాలలామలు సురవరసహిత లై గంధర్వులు సంతతము తమమహిమను గానము

చేయుచుండ సంతసంబున విహరించుచుందురు. మందరశిఖరము నకుఁ గ్రిందుగా నున్నదై, పదునొకండువందల యోజనముల యౌన్నత్యమున నొప్పుచు నున్న దేవచూతము, మందరశిఖరము లంతేసి యమృతతుల్య ఫలములను ఫలించుచున్నది. ఆఫలములు బాగుగాఁ బరిపక్వములై క్రిందఁ బడి శిథిలములు కాఁగా వానివలనఁ బ్రవహించురసము మధురమై సుగంధము కలదై, యితరసుగంధములచేఁ బరిమళితమై మిక్కిలి యరుణకాంతుల నొప్పుచు "అరుణోద" యను నదీరూపము నొంది మందరశిఖరమునుండి క్రిందికిఁ బ్రవహించి యిలావృతవర్షము పూర్వభాగము నంతను దడుపుచున్నది. పార్వతీదేవియనుచరస్త్రీ లాయరుణానదీరసమునుఁ బానము చేయుచుందురు. ఆలలనాలలామల యావయవములను స్పృశించి వచ్చువాయువే సకలదిశలయందును బదియోజనములదూరము దాఁక సువాసనను బ్రసరించునని చెప్పవలసియున్నప్పుడా స్త్రీల శరీరము లెంతపరిమళవంతములై యుండునో వేఱె చెప్పవలయునా? మేరుమందరశిఖరంబున జంబూవృక్షము కలదని చెప్పితిని. దానిఫలములుగజశరీరములంతప్రమాణము గలవై సూక్ష్మబీజము లయి యుండును. ఆ ఫలములూర్ధ్వమునుండి క్రిందఁ బడి శిథిలములై రసప్రవాహమును బ్రవహింపఁ జేయుచున్నవి. ఆప్రవాహమే జంబూనదియని పేరొందియిలావృతవర్షముదక్షిణభాగమును, దన్నును దడుపుచున్నది. ఆనది యట్లు ప్రవహించుచున్నప్పు డుభయతీరంబులందును గలమన్ను తద్రసముతో సంయుక్తమై వాయ్వగ్నిసంయోగమువలన విపాకము నొంది సువర్ణ మగుచున్నది. జంబూనదివలనఁ గలిగినది గనుక నే దానికి

జాంబూనదమనెడి నామము లభించినది. ఆసువర్ణమును దేవతలు తమ యువతీలలామలతోఁగూడ గిరీటములు కడియములు మొలత్రాళ్లు మొదలగు నాభరణంబులఁగా నిర్మించికొని సతతంబును ధరించుచున్నారు. సుపార్శ్వపర్వతమున గొప్పకదంబవృక్షము గలదని చెప్పితిని. ఆవృక్షరాజముకోటరంబులనుండి యైదుసందిళ్లంత స్థూలములగు నైదుమధుధారలు సుపార్శ్వశిఖరమునుండి క్రిందికిఁ బాఱుచు నిలావృతముపశ్చిమభాగమును, నాపర్వతప్రాంతమును బరిమళింపఁజేయుచున్నవి. ఆమధుధారలను బానముచేసినవారి ముఖపరిమళముచేఁ బరిమళితమగువాయువు నూఱుయోజనంబులదాఁక నెత్తావులను బ్రసరింపఁజేయుచున్నది. అట్లె కుముదపర్వతమందున్న వటవృక్షము శతవలిశ మనెడినామమున నొప్పుచున్నది. దానిస్కంధములనుండి కొన్నినదములు ప్రవహించుచున్నవి. అవి, పాలు మొదలగు పానీయములును భక్ష్యములు,వసనములు భోగస్థానములును శయ్యాదులు విభూషణములు మొదలగుకోర్కులను నెఱవేర్పఁజాలినవి. అవి కుముదపర్వతశిఖరమునుండి క్రిందికిఁ బ్రవహించుచు, నిలావృతము నుత్తరభాగంబున నున్నలోకులను సంతసింపఁజేయుచున్నవి. ఆనదములను స్నానపానాదులచే సేవించువారికి యావజ్జీవమును సుఖముతప్ప, నొకప్పుడయినను శరీరము ముడుతలు పడుట, తల నరయుట. శ్రమము రోగము చెమటదుర్వాసన ముదుసలితనము మరణము నపమృత్యువు శీతోష్ణములవలనఁ గలుగునైవర్ణ్యము, రాగద్వేష భయాభిమానాదులును సంభవింపనేరవు. భూమండల మనెడి కమలమునకుఁ గర్ణికవలెఁ దనర్చు మేరువునకుఁ జుట్టును గురంగము కురరము

కుంభము వైకంకతము త్రికూటము శిశిరము పతంగము రుచకము నిషధము సితివాసము కపిలము శంఖము వైదూర్యము చారువిహంగము ఋషభము నాగము కాలాంజనము నారదము మొదలగు పర్వతములు కేసరములవలెఁ దనర్చుచున్నవి. మఱియు జఠర దేవకూటపర్వతములు మేరువునకుఁ దూర్పున వేయియోజనముల దూరమునఁ బ్రవర్తిల్లుచుఁ బదునెనిమిదివేలయోజనముల దైర్ఘ్యము గలిగి రెండేసివేలయోజనముల యున్నతత్వమును, వైశాల్యమును గలవై యుత్తరమునకు విస్తరించుచు నొప్పుచున్నవి. దైర్ఘ్యమునందును, నౌన్నత్యమునందును, వైశాల్యమునందును సమానము లగు పవన పారియాత్ర పర్వతములు మేరువునకుఁ బశ్చిమభాగంబునను దక్షిణంబునఁ గ్రమముగాఁ దూర్పునకు విస్తరించుచున్న కైలాసకరవీర పర్వతములును నుత్తరంబునఁ ద్రిశృంగమకర పర్వతములును గలవు. ఈ యెనిమిది పర్వతములచేతను బరివృతమైన మేరుపర్వతము దర్భలచేఁ బరివృతమగు నగ్నిహోత్రునిచందమునఁ బ్రకాశించుచున్నది ఆమేరువు మూర్ధంబున మధ్యభాగమునందుఁ బదివేలయోజనములవైశాల్యము గల్గిసమచతురశ్రమై, శాతకాంభి యనుపేర నొప్పుచున్న చతుర్ముఖుని పురంబు నిర్మితమై యున్నది. దానికిఁ జుట్టును, నష్టదిక్కులందును నష్టదిక్పాలు రగు నింద్రాదులచేఁ బాలితము లగు నెనిమిది పురంబులు గలవు. అవి ప్రత్యేకము రెండువేలయేడువందల యోజనములవైశాల్యమున నొప్పుచుఁ, గ్రమముగా నమరావతి, తేజోవతి, సంయమని, కృష్ణాంగన, శ్రద్ధావతి, గంధవతి, మహోదయ, యశోవతి యనునామంబుల వెలయుచున్నవి.

ఇది పదాఱవ యధ్యాయము.

ఓరాజా! యోగస్వరూపుఁ డగువిష్ణుమూర్తి వామనరూపమున నవతరించి ముల్లోకములను బాదముచేఁ గొల్చుచుండెను. అప్పు డుపరిభాగంబున బ్రహ్మాండకటాహమంత రంధ్రము గల యతని వామపాదాంగుష్ఠద్వారమున బాహ్యజలము లన్నియు లోనికిఁ బ్రవేశించినవి. ఆజలధారలు త్రివిక్రముని పాదతూళనముచేఁ గల్గిన కుంకుమ మనెడి కింజల్కములచేఁ దనరారుచు, స్వభావముచేతనే సకలదురితముల నిరసింప సమర్థములై సమస్తలోకములపాపముల నెల్ల నాచమనము చేసినంతనే తొలంగునట్లుచేయుచు, భగవత్పది యనునామమునఁ బిలువఁబడుచువిష్ణుపద మనునామము గలయాకసంబునఁ జిరకాలంబునకు నదీరూపముగా నవతరించెను. ఆయూర్ధ్వంబుననే ధ్రువమండల మొప్పుచున్నది. దృఢసంకల్పుఁడును, భక్తశ్రేష్ఠుండును, నగుధ్రువుండు, దినదినమును వర్ధిల్లెడి భక్తియోగమునఁ బ్రేమాతిశయముకలవాఁడై, దానిచే సంతరంగము ద్రవించుచుండ, నేత్రము లుత్కంఠతచే వివశములై యర్ధనిమీలితములై బాష్పజలమును వెల్లిగొలుపుచుండ, నందువలన నొడలినిండఁ బులకాంకురంబు లెగయుచుండ నాభగవత్పదీజలప్రయును మాకులదేవత పాదోదక మని యత్యాదరంబున శిరంబునఁ దాల్చుచున్నాఁడు. మఱియు సప్తర్షులు తత్ప్రభావము నెఱింగినవారై, సర్వాంతరాత్ముఁ డగు వాసుదేవునిగూర్చి యవిచ్ఛిన్నమైన భక్తియోగము దమకు లభించుటనే ధర్మార్థకామాది పురుషార్థములను, కైవల్యమును నిరసించినవారై తమకు సంప్రాప్త మగుచున్న ముక్తినిగూర్చి ముముక్షువులవలె, నీ గంగానదియే మాతపంబునకు ముఖ్యఫలం బనితలంచుచు సగౌరవముగా జటాకిరీటములందు వహించు

చున్నారు. ఇట్లు ధ్రువునిచేతను, సప్తర్షులచేతను బహూకృతయై గంగ యనేకసహస్రకోటులసంఖ్యను మీఱిన విమానములచే సంకుల మయిన యాకాశమార్గమువలన నవతరించుచు, నిందు మండలము నావరించి దిగి దిగి మేరుమూర్ధమున నున్నబ్రహ్మ

గంగానదికి వేఱువేఱు నామంబులు గల్గుట.

పురంబు ప్రవేశించె ఆపురంబున గంగానది నాలుగుపాయలుగ విభక్తంబై సీతయనియు.నలకనందయనియుఁ, జక్షువనియు, భద్ర యనియు, న్యవహరింపఁబడుచు, నాల్గుదిక్కులకుఁబ్రవహించుచు సముద్రములకుఁ బ్రవహించుచున్నవి.అందు సీతానదిబ్రహ్మపుర మునుండి బయలువెడలి మేరువునకుఁ గేసరములవలెఁ దనర్చు చున్న పర్వతశిఖరాగ్రములందు ముందుగాఁబడి పిమ్మట నట నుండి క్రిందికిఁ బ్రవహించుచు, గంధమాదనశిఖరమునఁ బడి భద్రాశ్వవర్షము మధ్యముననుండి తూర్పుగాఁబ్రవహించి, లవణ సముద్రమును గలయుచున్నది. అట్లె చక్షుర్నది మాల్యవన్న గాగ్రంబునంబడి క్రిందికి దిగి యప్రతిహత మగువేగమునఁ గేతు మాలవర్షంబున వ్యాపించి పశ్చిమాభిముఖంబుగాఁ బాఱి పశ్చి మ సముద్రంబునఁ గలియుచున్నది. అట్లె భద్రానదియు మేరు శిఖరంబు నుండి స్రవించుచు, నొకగిరిశిఖరమునుండి మఱియొక గిరిశిఖరమ[illegible]ూర్ధ్వముగా నెగయుచుఁ గ్రమముగా నీలశ్వేత పర్వతశిఖరం[illegible]స్పృశింపకయే శృంగవచ్ఛిఖరంబునఁ బడి యు చ్చటినుండి క్రింది[illegible] కురువర్షమునంతట వ్యాపించిప్రవహించి యుత్తరసముద్రంబునఁ గలియుచున్నది. అట్లె [illegible]లకనందయు మేరువం దున్నబ్రహ్మపురమునుండి దక్షిణమునకు దిగి [illegible]ధ్యమున నున్నపర్వతశిఖరంబుల స్పృశింపకయే యతిక్రమించి హేమ

కూట హిమాలయ పర్వతముల శృంగముల నస్ఖలితవేగముచే భేదించుకొని కర్మక్షేత్ర మగుభారతవర్షంబునం బడి ప్రవహించుచు దక్షిణసముద్రమునఁ గలియుచున్నది. ఇంతియ కాక మేరువు మొద లగుపర్వతములందుఁ బుట్టిననదులు ప్రతివర్షమందును నూఱులకొలఁదిగఁ బ్రవహించుచున్నవి. ఈజంబూద్వీపమునందును, భారతవర్షమే పుణ్యాపపరూపకర్మముల ననుభవించుటం జేసి కర్మక్షేత్ర మనిపించుకొన్నది. *తక్కిన యెనిమిదివర్షం

---

* ఇందు భారతవర్షము దక్కఁ దక్కినవి పుణ్యశేషానుభవయోగ్యదేశంబులని చెప్పంబడినందుపై శంకించుచున్నాఁడు. ఓయీ! ఈచెప్పినది మిక్కిలి విరుద్ధముగా నున్నది. ఇష్టాపూర్తాదు లగుపుణ్యకర్మము లాచరించినవారుధూమాదిరూప మగుపితృయానమార్గముచే, జంద్రలోకమునుబొంది యచ్చటసుఖానుభవముచేఁ బు[illegible]ములను క్షీణింప[illegible]జేసికొని మగుడ నీలోకమునకువచ్చుచున్నారని చెప[illegible]కర్మ[illegible]మురు. అ[illegible]తులు చెప్పుచున్నవి. శ్రు॥ "యావత్సంపాతముషిత్వా[illegible] తమేవాధ్వానం పునర్నివర్తంతే" అనఁగాఁ గర్మానుభవమగునంతవఱకు చ[illegible]టనుండిమగుడ నీమార్గంబున నే మగిడివచ్చుచున్నారనియర్థము. ఇందులకువ[illegible]టియొకశ్రుతి "ప్రాప్యాంతంకర్మణస్తస్యయత్కించేహకరోత్యయం తస్మా[illegible]ల్లోకాత్పునరేత్యస్మై లోకాయ కర్మణః" అనఁగా నీలోకంబునఁ జేసికొన్నకర్మఫ[illegible]లనుభవించుచునవి [illegible]ంతము పొందునంతవఱకునచ్చట నేయుండిమగుడఁ గ[illegible] పుణ్యశేషాత్మకమై యీలోకమునకు వచ్చుచున్నారని భావము. అట్లుండఁ బుణ్యశేషానుభవమునకై యీలోకమునకు వచ్చుచున్నారని భావము. ప్రశ్న[illegible] ముందు టెట్లు? వారికి వర్షములు భోగస్థానము లగు టెట్లు? అని యుం[illegible]పరాము. వారు త్తరలోకములం దనుభవింపఁగాఁ గొంతకర్మము మిగిలి దని[illegible] మునని తప్పక చెప్పితీరవలెను. అట్లైకాక వారికర్మము పూర్తిగానశించినశ్రు[illegible] మే చెప్పినచోఁ గర్మనిమిత్త మయినజన్మమే యుండదు. ఇట్లు చెప్పుట [illegible] "రమణీయచరణారమణీయయోనిమాపద్యేరన్ బ్రాహ్మణయోనిం [illegible] [illegible]యోనిం వైశ్యయోనించ" అను శ్రుతిప్రమాణము. ఇందులకు స్మృ॥ [illegible]

బులును, బుణ్యాత్ములకుం దా మనుభవింపఁగా మిగిలినపుణ్యము లనుభవింప నుపభోగస్థానములు గుచున్నవి. కావుననే వానిని భూలోకస్వర్గము లని చెప్పుదురు. అట్టి పుణ్యము లనుభవింపఁ దగినవేకాని భారతవర్షమువలెఁ గర్మక్షేత్రములు కావు. ఓరాజా! ఆవర్షములందలి పురుషులకుఁ ద్రేతాయుగమందుం దున్నవారికిం బలెసుఖముగాఁగాలము వర్తించుచుండును. వారు దేవతల కెన వచ్చుచుందురు. అచ్చటివారు పదివేల యేనుగులబలము గలవారై యుందురు. మఱియుఁ బదివేలవర్షము... యాయుర్దాయము గలవారై వజ్రకాయులై బలముచేతను,వయస్సుచేతను, ...ము లగునురతాది సౌఖ్యము లు గల్గియుందురు. వారి కళత్రము లొక నాయువొకసంవత్సరము మాత్రమున్నదనఁగాఁ గర్భమును దాల్చి యొక్క సంతానమును మాత్రమే కందురు. కావున నచ్చటివారికిఁ గళత్రసుఖ మెప్పుడును దఱుగ నేరదు. మఱియు నచ్చటి కాననవృక్షములు సర్వఋతువులందును లభించెడి కుసుమగుచ్ఛంబులచేతను,ఫలంబులచేతను గిసలయములచేతనుమిక్కిలి నమ్రములైన శాఖాసముదయములతోను లతలతోను మిక్కిలి శోభిల్లుచుండును. అట్టిరమణీయ కాననములందును, నాశ్రమములందును,బర్వతపుఁజఱియలయందును వికసించిననానావిధతామరసంబులచే సంతుష్టిఁ జెందుచాడపగాంప

మాశ్చస్వకర్మనిష్ఠాఃప్రేత్యకర్మ ఫలమనుభూయతతోశేషేణ విశిష్టదేశ జాతి కులరూపాయు ర్వృత్తవృత్తసుఖమేధసో జన్మప్రతిపద్యంతే॥ అని ప్రమాణము న్నది. కావున నుత్తరలోకములం దనుభవింపఁగా మిగిలిన పుణ్యకర్మముచే నతిశయింపఁబడినగొప్పభోగములనుభవించుటకునాయాదేశములందుఁబుట్టుట సంభవించుచున్నది.

లును, జలకుక్కుటములును
లును, జక్రవాకాకులున , కన్నెలేడిపిట్టలును, బెగ్గురుపక్షు
తములచేతను, మధు'ఎ, జతలుగట్టి చేయుచున్న మధురకూజి
లగు తామరకొలంకులరఝుంకారములచేతను, బ్రతిధ్వనితము
నున్న మనోహరములందును, జలక్రీడాదివినోదము లొనర్చుచు,
విలాసములచేహింగు లగుదేవకాంతల మన్మథసంబంధు లగు
చూపులచేతను, మందహాసములచేతను, మనోహరము లగు
గల దేవపత్ను, నాకృష్టము లగు చిత్తంబులును, జూపులును
నతిముదములు తమతమ దేవతాగణములచే బూజితు లగుచు
తొమ్మిదిమున యథేష్టముగా విహరించుచుందురు. ఓరాజా! ఈ
ద్వర్షాధిశ్వములందును భగవంతుండగునారాయణుండు త త్త
వర్ష ముతి యగుమహాపురుషునిచే సంసేవింపబడుచు, నాయా
మగు వం దున్నపురుషుల ననుగ్రహించుటకై పరిదృశ్యమాన
గుణాపస్తుసజాతీయ మని యూహింపదరము కాని కల్యాణ
డునుశిష్ట మగు స్వరూపముచే నిప్పటికిని బ్రత్యక్ష మగుచుం
దక్క ఇలావృతివర్షమున భవానీదేవిశాపముచే శంకరుండు
నెతిఁవేఱొక్కపురుషుండు గానరాడు. భవానిశాపనిమిత్తము
డను కాని యెఱుంగక కాని యావర్షమునకు బోయినవా
మునరులతో గూడ స్త్రీత్వంబును బొందును. ఇలావృతవర్ష
శాప బ్రవేశించినవారికి స్త్రీత్వము రావలయు నన్నభవాని
భవనిమిత్తమును నవమస్కంధమున వక్కాణించెద. అచ్చట
భవానీదేవి యధిపతిగా గలయర్బుద సహస్రసంఖ్య గల స్త్రీ
సమూహములచే సేవింపబడుచు భవుండు తనకు గా
భూతముగను, వాసుదేవాదిరూపమున నున్న పరమపురుష
నాల్గు వ్యూహములలో నాల్గవదియు, తమోగుణమున కధి

త్రియు నగుమూర్తిని దనచిత్త ఐన సమాధిరూప మగునుపా యముచే సాక్షాత్కరించుకొని ముం ను చెప్పఁబోయెడుమంత్రా త్మకమగు వాక్యమును జపించుచు స్తోత్రము చేయుచుండును. ఓ పరమాత్మా! [1] భగవంతుఁడవును [2] మహాపురుషుఁడవును, వాసుదేవుఁడవును, [3] సర్వగుణ నిధానమవును, [4] ననంతుఁడవును, [5] నవ్యక్తుండవును నగు నీకు నమస్కారము. ఓయీ శ్వరా! నీపాద పద్మములు సేవకుల కుపాసింపఁదగి ప్రాప్యము లగుచున్నవి. నీవు సంపూర్ణమగు నైశ్వర్యాది షట్కమునకాధారభూతుఁడవు. నీవు భక్తులందు మిక్కిలి వాత్సల్యము కలవాఁడవయి వారిసంసార బంధమును దొలంగించుచున్నావు. నీవు సమస్తభూతముల య

---

1. ఈవిశేషణముచేఁ బరబ్రహ్మము జ్ఞానాదిషడ్గుణములచే నిండినవాఁడని తెలియవచ్చుచున్నది.

2. ఈవిశేషణముచేఁ బరబ్రహ్మము నిఖిలప్రపంచకముయొక్క సృష్టిస్థితిలయములుగావించి మహాపురుషత్వంబునుబొందుచుండు. శ్రు। "వేదాహమేతం పురుషం మహాంతం" అని పురుషసూక్తమునఁ జెప్పఁబడుటచేతను, "తస్మాద్విరాడజాయత" అని సమస్తప్రపంచమునకును కారణత్వముఁ బ్రతిపాదించుటచేతను పరబ్రహ్మమునకు మహాపురుషత్వము స్థిరమగుచున్నది.

3. 'సర్వగుణ' యని చెప్పుటచేఁ జేతనాచేతనముల కూహింపఁదరముకానివై జగత్కారణ మగుట కుపయోగించుచు నాశ్రితుల కార్యములకై వేర్పఁదగిన సర్వజ్ఞత్వము, సర్వశక్తిత్వము, వాత్సల్యము, సౌశీల్యము, సౌలభ్యము, జ్ఞానశక్తి, మొదలగునసాధారణగుణము లున్నట్లు తెలియుచున్నది.

4. 'అనంత' అనుటచే భగవంతుఁడు రూపముచేతను గుణములచేతను ననంతుఁడని తెలియవచ్చుచున్నది.

5. 'అవ్యక్త' అనుటచే నింద్రియాదులకు గోచరుండు కాఁడనుట స్పష్టం.

భ్యుదయంబునకును హేతుభూతుండవు. నీసంకల్పముచేత నేజీవు
లు బంధమును మోక్షమును బొందుచున్నారు. అట్టి మహాపురు
షుఁడ వగు నిన్ను సేవించుచున్నాను.ఓపరమాత్మా! సమస్తము
ను సర్వకాలములందును జూచుచున్నప్పటికి నెవ్వనిజ్ఞానముకొం
చెమైనను బ్రకృతిగుణకార్యములగురాగద్వేషాదులచే క్రోధాది
గుణములఁ జయింపలేని మావంటివారి జ్ఞానమువలెఁ గలుషత్వ
మందదో, యట్టిభగవంతుఁడ వగు నిన్ను సంసారమును జయిం
పఁదలంపు గలయేపురుషుండు సంతసంబున సమాదరించి భజిం
పఁడు? ఓపరమపురుషా! దేహాత్మాభిమానము గలవారికి నీవు
మద్యపానముచేఁ దామ్రలోచనములు గల్గి మత్తుఁడవై యున్న
ట్లు, మాయచేఁ గానవచ్చుచుందువు. కాని నీవు వాస్తవముగా
నప్రాకృతమై స్వేచ్ఛచేస్వీకృతమై కర్మవశ్యముగాకయున్నదివ్య
మంగళవిగ్రహుండవు కదా! అట్టివాఁడవు కనుక నే నాగకన్య
కలు నీపాదపంకజస్పర్శమువలన సంచలితహృదయేంద్రియ లై
"గామపరవశల మగుమేము రాగాదిదుర్గుణములకుఁ బ్రతిభట
మగుశుద్ధసత్వస్వరూపుఁడ వగునీపాదముల స్పృశింప నెట్లుగా స
మర్థుల మగుదు"మని తలంచుచు నిశ్శంకముగా నీకుఁబూజలొన
ర్ప సమర్థులుగాకపోయిరి. ఇట్టిమహనీయుఁడ వగునిన్నెవ్వఁ డా
దరించి సేవింపఁడు? ఓవాసుదేవా! వేదాంతము లెవ్వనిఁ జిదచి
దాత్మకమగు ప్రపంచము సృష్ట్యాదులకు హేతు వని చెప్పుచున్న
వో, ఎవనిని సత్త్వాదులగు ప్రకృతిగుణముల కవశునిఁగాను,
స్వరూపముచేతను, స్వభావముచేతను దేశకాలవస్తువులచే నప
రిచ్ఛిన్నునిగాను నుడువుచున్నవో, ఎవఁడుసహస్రఫణములలో
నొకదానియందు భూమండలము నావగింజంత సులభముగా

వహించుచున్నాఁడో, యట్టియమేయప్రభావుఁడ వగునిన్నైవం
డు సంతసమున నాదరింపఁడు? ఓయీశా! మహత్తత్త్వాభిమా
నమున నొప్పుచు,జగన్నిర్మాణమున కుపయుక్తములగు జ్ఞానాదు
ల కాశ్రయుండవై యస్మదాదులకంటె నాద్యుండగు కమలాస
నుండెవనివలనసంభవించెనో,యానీవలననే నేనును ద్రివిధాహం
కారసంపాదనమునిమిత్తము సముద్భూతుండనై యహంకార
ప్రవర్తనమున కుపయోగించునట్లు నీవొసంగినజ్ఞానముచే దేవాది
శరీరములందుఁ ద్రివిధమగు నహంకారమును బ్రవర్తింపఁజే
యుచున్నాను. ఓమహాత్మా! మహత్తత్త్వము,సాత్త్వికరాజసతా
మసములను త్రివిధాహంకారము, బ్రహ్మమొదలగు మేమును
సూత్రబద్ధములగుపశువులవలె నీకు వశులమయి నీయనుగ్రహము
వలన నీబ్రహ్మాండమును, దదంతర్వర్తియగు వస్తుజాలమును, సృ
జించుచున్నాము. సత్త్వాదిగుణపరిణామములగు దేహేంద్రియా
దులసంబంధముచే స్వాత్మపరమాత్మజ్ఞానసహితుఁడై సంసారబ
ద్ధుఁడగు జీవుఁ డెవనిచే నిర్మితమగుకర్మగ్రంథియైనమాయను
సులభముగాఁ దరింప నుపాయము నెఱుంగఁడో, ప్రకృతిసంబంధ
నాశనమును, దత్సంబంధమును జేయ సమర్థమగుజ్ఞానము గల
యట్టినీకు నమస్కార" మని యిలావృతవర్షమున భవుండు
నుతించుచుండు. ఇది పదునేడవయధ్యాయము.

ఓపరీక్షిన్నరేంద్రా! అట్లె, భద్రాశ్వవర్షాధిపతియును ధర్మ
సుతుండును భద్రశ్రవుఁడను పేరు గలవాఁడును, సేవకముఖ్యులు
ను,రాక్షసాపహృతము లగువేదములను నుద్ధరించి తెచ్చుటవలన

{శుకుఁడు రాజునకు భద్రాశ్వాదులందలి విశేషములను జెప్పుట.}

ధర్మస్వరూపమును, హయగ్రీవాభిధానముగలదియు భగవంతుఁడగు వాసుదేవునకు మిక్కిలిప్రియమునగుశరీరమును దృఢసమాధిచే సాక్షాత్కరింపఁ జేసికొని చెప్పఁబోయెడి మంత్రమును జపించుచు నిట్లు స్తోత్రము చేయుచుందురు. "ఓపరమేశ్వరా! నీవు సంపూర్ణమగుషాడ్గుణ్యముగలవాఁడవు. నీవు పూర్వోత్తరభాగములగు వేదాదులందు కర్మమగుధర్మమే స్వరూపముగాఁగలవాఁడవు. నీవు నీయనుగ్రహాతిశయముచే జీవులను రజస్తమంబులకు లోఁబడకుండునట్లు జేసి బ్రహ్మప్రాప్తిరూప మగు ముక్తిని గల్గించువాఁడవు. అట్టినీకు నమస్కారము గావించుచున్నాము. లోకమున దేవాలు పిత్రాదులమరణమును గన్నులారఁ గాంచియు నట్లె తామును మృతినొందవలయునని తలంపరు. మఱియుఁ జచ్చినపితృపుత్త్రాదులనుదహించివచ్చి యప్పుడయినఁదామస్థిరులని తలంపక వారు సంపాదించినధనాదులచే జీవింపఁదలంచుచు శబ్దాదివిషయసుఖముల ననుభవించుచు సర్వదా పాపకార్యములనే ధ్యానముఁ జేయుచుందురు. మానవాదు లనిత్యులయినట్లు ప్రత్యక్షముగాఁ జూచినను లోకుల కట్టిబుద్ధి జనింపకపోవుట భగవంతునిమాయావైభవమె. ఔరా! ఏమియాశ్చర్యము! ఇది మిక్కిలి విచిత్రముగా నున్నది. ఓపరమాత్మా! వేదాంతవిద్యను నభ్యసించినకవీశ్వరులు ప్రపంచ మనిత్య మని చెప్పుచున్నారు. కాని తాము ట్లనుసంధానము చేయలేకున్నారు. అట్లె యధ్యాత్మవిద్యల నభ్యసించి స్వాత్మపరమాత్మజ్ఞానము గల పండితులును నీవిశ్వము నశ్వర మని చెప్పుచున్నారేకాని యనుసంధాన

ముచేయలేకున్నారు. వారు నీమాయచే మోహితులై పుత్త్ర
మరణాదినిమిత్త మగుదుఃఖమును బొందుచున్నారు. కావున
నీయీకృత్యము మిక్కిలి యాశ్చర్యముగా నున్నది.జన్మమరణా
ది సంసారమును నశింపఁజేయు నీకు నమస్కారము. ఓపరమేశా!
వాస్తవముగా నీవకర్తవైనను జగత్సృష్టిస్థితిలయాదికార్యము
లొనర్చుటచేతను, స్థూలసూక్ష్మము లగు చిదచిత్తులు శరీరము
గాఁ గలవాఁడ వగుటచేతను, ప్రపంచగతము లగువికారాదుల
కాశ్రయుఁడ వగుటచేతను విశ్వసృష్ట్యాదికర్మము జీవునకువలె
నీకును జ్ఞానసంకోచాదులకుఁ గారణములగుచున్నవని తలంచుట
యుక్తమేకాని విశ్వోద్భవాదికర్మములు లీలారూపము లగుట
చేతను, ప్రకృతిపురుషరూప మగుశరీరమునకే కార్యకారణరూ
పావస్థ లంగీకరించుటచేతను, విశ్వోద్భవాదికర్మము నీకుఁ బ్రతి
బంధకము కాదు. సర్వదా వికారాదులు గలుగుటకుఁదగినసం
బంధ మున్నను, జీవునికి శరీరగతకౌమారయౌవనాదివికారము
లు గలుగనట్లు, నీ కావికారములు గలుగకపోవుట చిత్రము.
ఓదేవా ! ఒకానొకదైనందినప్రళయమున వేదముల నొకదై
త్యుఁ డపహరింపఁగా, నీవు నరహయస్వరూపము దాల్చి హయ
గ్రీవుండ వని ప్రఖ్యాతి వహించి వానిఁజంపి యావేదములఁ గొ
ని వచ్చి యాచించుచున్న బ్రహ్మ కర్పించితివి. అట్టియమోఘచే
ష్టలుగలనీకు నమస్కారము" అని యిట్లు నుతించు చుందురు.
హరివర్షమున భగవంతుఁడు నరహరిరూపమున నెలయుచుం
డును. భగవంతుఁడు నరసింహావతార మెత్తుటకుఁ గారణము
ముందుముందు చెప్పెదను. ఆహరివర్షమునందు భగవంతునితో
సమానమగు గుణములు గలవాఁడును, భక్తశ్రేష్ఠుండును, దై

్యదానవకులములను బవిత్రముచేయు చున్నశీలాచారములు గలవాఁడును, నగుప్రహ్లాదుండు, ప్రయోజనాంతరరహిత మగు నవిచ్ఛిన్నభక్తియోగముచే నావర్షమం దున్నప్రజలతోఁ గూడఁ దనకుఁ బ్రియతమ మగునరసింహాకృతిని ధ్యానముచేయుచు నిట్లు నుతించుచుండును. "నరసింహస్వరూపుఁడ వగు నోభగవంతా ! నీకు నమస్కారము. సమస్తతేజస్సులను బ్రకాశింపఁజేయు నీకు వందనము. ఓదేవా! మాకుఁ బ్రత్యక్షము కమ్ము. ఓవక్రనఖా ! ఓవజ్రదంష్ట్రా! బహుళము లైనమాకర్మాశయములను, దొలంగింపుము తొలంగింపుము. మాభయములు పోవునట్లు మాకు సాక్షాత్కరింపుము. జగంబునకు మంగళ మగుఁగాక, దుర్మతులు నిర్మలమనస్కు లగుదురుగాక. భూతములు పరస్పరము మంగళములను గోరుకొనుచుండుఁగాక. వానిమనస్సు శమాదిగుణయుక్త మగుఁగాక. మామతియు, భూతములమతియు, ఫలాదుల నపేక్షింపక యే యధోక్షజునియందుఁ బ్రవేశించుఁగాక. ఓ పరమేశ్వరా! గృహములయందును భార్యాసుతులందును ధనంబులయందును బంధువులందును మాకాసక్తి లేకుండుఁగాక. కేవలము భగవద్భక్తులందు మాత్రమే మాకట్టియాసక్తి గల్గుఁగాక. భగవద్భక్తులస్నేహముచే స్థిరమగు మనస్సులు గలవారు, ప్రాణధారణకుపయుక్త మగునంతమాత్ర వస్తువులచేతనే పరితుష్టిఁ జెందుచు నతిశీఘ్రముగా ముక్తిచెందినట్టు లింద్రియపోషణమందుఁ దత్పరు లై శబ్దాదివిషయములందు సక్తచిత్తు లగు వారికి ముక్తి సిద్ధింపనేరదు. అట్లుండ గృహాదులందలి యాసక్తి వలన మా కేమిలాభము ? ఏహరి తనభక్తులతో స్నేహము చేసి వారు నుడువుచున్న తనచరిత్రములను వినునట్టిపురుషుః

శ్రవణపుటములనుండి లోపలికిఁ బ్రవేశించి తనపాదపంకజములనుండి యుదయించిన గంగానది శరీరమలమునట్లు లోపలిమలమును దొలఁగించునో యట్టిముకుందునిపాదముల నెవఁడు సేవింపఁడు ? ఐహికాముష్మికఫలములను గోరనిభక్తివిశేషము భగవంతునియం దేపురుషునకుఁ గలదో వానిని నింద్రాదిదేవతలును శమదమాది గుణములును ననుసరించుచుండును. నీయందు భక్తిని నెలకొల్పక శబ్దాదులందు మనంబును బ్రవేశింపఁజేసి వర్తించువానికిభగవద్భక్తులకు లభించినమహాగుణము లెట్లుగా లభించు? ఓమహనీయా ! ఆలోచింప మీనములకు జలమే జీవనాధారమైనట్లు*శరీరాదుల కెల్ల నీవేజీవనాధారము. కావునఁ దాను వయస్సౌందర్యాదులచేతను గృహపుత్త్రధనాదులచేతను సంపూర్ణుఁడైనను భగవంతుఁడగునిన్ను విడిచి గృహాసక్తుఁడైనఁ చో నప్పుడు దంపతులకు వయోరూపాదులవలనఁ గల్గుక్షణికసుఖమే కాని నిరతిశయానందమును బొందఁ జాలఁడు. నీభక్తి నిరతిశయసుఖమునకు హేతు వగుచుంటం జేసియు, విషయాసక్తి నకు దుఃఖహేతు వగుటం జేసియు రజోగుణజాతములగురాగము విషాదము కోపము గర్వము పేరాస భయము దైన్యము వ్యా

---

* భగవంతుఁడె యెల్లరకును ధారకుఁడనుటకు శ్రు॥ కోహ్యేవాన్యాత్కః ప్రాణ్యాద్య దేష ఆకాశ ఆనందో నస్యాత్'' అనఁగా నిరతిశయానంద రూపమును సర్వప్రకాశమును నగు పరమాత్మయుపాసితముకానిచో నెవఁడైహికాముష్మికసుఖసంపాదనముచే జీవించు నని శ్రుత్యభిప్రాయము. ఈ యర్థమే వాల్మీకిరామాయణమున ''నచసీతాత్వయాహీనా నచాహమపి రాఘవ। ముహూర్తమపి జీవావో జలాన్మత్స్యావివోద్ధృతౌ'' అని యున్నది. కావున భగవంతుని విడిచి యొకముహూర్తమైనను జీవించుట కష్టము.

[redacted]యుదలగు వానికి మూలమై సంసారచక్రపరివర్తనమునకు హేతువయిన గృహమును విడిచి నరసింహస్వరూపుఁడవగునీపాదపద్మములను భజించువారి కెందువలనను భయ ముండదు." అని హరివర్షంబునఁ బ్రహ్లాదాదులు పరమేశ్వరుని నుతించుచుందురు. ఓరాజా! ఇఁకఁ గేతుమాలమున నుపాసనీయులును నుపాసకులును నెవ్వరో తెలిపెదను. ప్రజాపతికి రాత్ర్యభిమానదేవత లనెడిపుత్త్రికలును సహరభిమానదేవు లనెడి పుత్త్రులును గలరు. రాత్రిందివాధిష్ఠాత లగువారలే శతవత్సరరూప మగు నాయుర్దాయమును బరిగణించుచుందురు. వారలే కేతుమాలవర్షమున కధిపతులు. మహాపురుషుఁ డయిననారాయణునిచక్రకాంతులకు భీతచేతస్కలగుటం జేసి యేవారల గర్భస్థశిశువులు గర్భాధానము మొదలుకొని సంవత్సరాంతమున విగతజీవులయి పడుచున్నారో, యట్టి రాత్ర్యభిమాన దేవతలకును సహరభిమానదేవతలకు లక్ష్మికిని బ్రియంబును జేయఁ దలంచి భగవంతుఁడు కేతుమాలవర్షంబున బ్రద్యుమ్నరూపంబున వర్తించుచుండును. అచ్చట నాపరమపురుషుండు మిక్కిలిసుందర మగు గతివిలాసము చేతను మనోహర మగు మందహాసవిలసితము లగు దృష్టిలీలల చేతను గించిదున్నత మగు సుందరభ్రూమండలము చేతను సుందర మగు రమావదనారవిందసంపదచేఁ బాను సంతసించుచు రమాదేవిని సంతసింపఁ జేయుచు విలసిల్లు చుండును. మాయామయ మగు భగవంతునియారూపమును లక్ష్మీదేవి సమాధియోగనిష్ఠురాలై, రాత్రులయందు రాత్ర్యభిమానదేవతలతోను బవళుల సహరభిమానదేవులతోను గూడికొని సేవించుచు నీవిధమున జపించి స్తోత్రము చేయుచుండును. 'ఓదేవా!

నీవు సమస్తేంద్రియంబులకు నధిపతివి. నీవు ప్రకృతిపురుషులకు సంభవింప నేరని జ్ఞానగాంభీర్యాదిగుణములకు నిధానమవు. మఱియు నీవు కర్మేంద్రియవ్యాపారములకును జ్ఞానేంద్రియ వ్యాపారములకు సంకల్పాధ్యవసాయాదులకును బంచమహాభూతములకును నియంతవు. నీవు మనస్సహితములగు నేకాదశేంద్రియములును బంచమహాభూతములును శరీరముగాఁ గలవాఁడవు. నీవు వేదస్వరూపుఁడవు. వ్యష్టితత్త్వసంఘాతమే శరీరముగాఁ గలవాడవు. ఓమహానీయా! నీవు జీవశరీరమునఁ వెలయువాఁడవు. వెక్కేల? నీవు సమస్తప్రపంచస్వరూపుఁడవు. మఱియు మనస్సామర్థ్యము గలవాఁడవై పటుతర మగునింద్రియశక్తిచేతను దనరారుచు నిరతిశయప్రీతికి హేతువవై, స్వీయములందు నిరతిశయప్రీతిగలవాఁడవై భగవత్స్వరూపుఁడ వయియున్న నీకు నమస్కారములు. ఓమహానీయా! నిరుపాధికుఁడ వయ్యు సమస్తేంద్రియంబుల కధిపతి వగు నిన్ను నువ్రతములచే నారాధించి లోకంబున స్త్రీలు పతినిఁగోరుకొనుచున్నారు. అట్లు కోరి తెచ్చుకొన్న భర్తలా స్త్రీలకు నిరతిశయప్రీతివిషయము లగుపుత్త్రులను ధనములను నాయువులను రక్షింపఁజాలకున్నారు. ఆస్త్రీలపతులు కర్మవశ్యు లయి యుండఁగా వారెట్లు వారికిఁ బ్రియవస్తువుల రక్షించి * పతి యనునామమును సార్థకపఱుచుకొనఁగలరు. నిరుపాధికరక్షకత్వము గలనీవే పతిశబ్దవాచ్యుఁడవు గాని తక్కినవా రెట్లగుదురు? ఓపరమేశ్వరా! మఱియుఁ గర్మవశ్యుండవు కాకపోవుటచే నీకెందునుండియు భయము సంభవింపనేరదు. సకలభయంబులనుండియు రక్షింపఁ గల

* పతి అనఁగా "పాతి, భార్యాప్రియవస్తూని రక్షతీతి పతిః" భార్యకిష్టములగు వస్తువులను రక్షించినవాఁడే యని భావము.

నీకుఁ గలదుగాని వేఱొకనికి లేదు. కావున నీవే నిరుపాధిక పతిశబ్దవాచ్యుండవు కాని తక్కినవారు కారు. వారు కర్మవశ్యులై కావున నే సోపాధికులై యుండఁగా భయములనుండి యెట్లు రక్షింపఁగలుగుదురు? కావున నీవొక్కఁడవే పతివి. మఱియొక పతి యున్నచో నన్యోన్యము భయంబు సంభవింపక మానదు. నీవొక్కఁడవే యైనచో నాత్మలాభముకంటె నన్యమైన దధికమని తలంపవు. మఱియు లోకమునఁ బతిసుతధనాదులందుఁ బరాయణ యగు నేస్త్రీ యుక్తవిధశక్తిగల నీపాదపద్మముల కారాధనముచే యదో యట్టిస్త్రీకి, నీవొకానొకప్పు డర్పితుం డయ్యు నట్టిక్షుద్రఫలంబునే యొసంగుచుందువు. నీవు, ప్రీతివిషయ మయినపురుషార్థమ వయియున్న నీకంటె నితరమగు నపురుషార్థములు గోరుకొనునప్పుడు తాదృశమూఢస్త్రీకట్టిఫలమునె యిచ్చుచుందువు. అల్పకాలస్థాయు లగునావస్తువులను బొంది యవి కర్మవశమువలన నశింపఁగానే మిక్కిలి దుఃఖమును బొందును. కావున నిన్నుఁ బతిగాఁ బడసిన నాకుం బోలె లోకమున నెవ్వతెకును సౌఖ్యంబు లేదు. 'ఓలక్ష్మీ! నీవే లోకమునందుఁ బురుషార్థమ వగుచుండఁగా నీవన్న దెట్లు సరిపడు' ననియందువేని వినుము. ఆలోచింపఁగా బ్రహ్మ, యీశ్వరుండు, దేవేంద్రుఁడు మొదలగువారు శబ్దాదులం దాసక్తులై నీపాదారవిందశరణముఁ జేయకుండ నితరమగు తపంబును జేయుచున్నారు. కాని యందువలన నన్నెంతమాత్రమును బొందలేరు. ఓయమేయా! నిరతిశయప్రీతివిషయుఁడ వయిననీవే హృదయముగాఁ గల నేను నీయారాధనముఁ జేయనిచో నెట్లు సంతసింతును? కావున నీపాదారవిందములు గొల్చువారలే నన్నుఁ బొందఁగలరు కాని తక్కినవారు పొందలేరు. సర్వపురుషార్థరూపుఁడ

వగు నోపరమేశ్వరా! సర్వపుషార్థదాయి యని నుతింపఁదగిన నీహస్తమును దయాసూచకముగా నీభక్తులతలలం దుంచుచున్నట్లు నాశిరంబునందును నుంపుము. 'నీ విదివఱకే నాపరిపూర్ణదయకుఁ బాత్రురాలవయి యుండఁగా నీవిట్లు ప్రార్థించెదవేమి' యనియడుగవచ్చు. నీవు మాయారూప మగుశ్రీవత్సమువలె నన్ను హృదయమందు ధరించుచున్నావు. *అయిన నీకుజ్ఞానులు ప్రియతము లయినట్లు నేను గాను. కావున నన్ను నీభక్తులఁ జూచిన కనికరపుఁజూపుతోఁ జూడవలయును. ఆనీభక్తులం దట్టిదయ యేల యుదయించునో నేఁ జెప్పఁజాల. ఈశ్వరుండవగు నీచేష్టితము నూహింప నెవ్వరు సమర్థులు?' అని యిట్లు లక్ష్మి భగవంతునిఁ బ్రార్థించుచుండును. ఇఁక రమ్యకవర్షమునం దుపాస్యులును నుపాసకులు నెవ్వరో తెలిపెద వినుము. రమ్యకవర్షమునకు మను వధిపతి. అతఁడు యుగాంతమందుఁ జూచిన భగవంతునికి ప్రియతమ మగుమత్స్యరూపమును నవిచ్ఛిన్నభక్తియోగముచే నారాధించుచు నిట్లు నుతించును. 'ఓదేవా! నీవు

రమ్యకవర్షముఁగూర్చి దెలుపుట.

శుద్ధసత్వమూర్తివి. నీ వింద్రియశక్తికిని. మనశ్శక్తికిని, శరీరశక్తికిని నధిష్ఠాతవు. మఱియు నీ వవతారములలో మొదటివాఁడవు. వ్యష్టిజాతమున కంతరాత్మవై మత్స్యస్వరూపుఁడవగునీకు నమస్కారము. ఓమహనీయా! నీరూపము లోకపాలాదుల కెంతమాత్రమును గోచరంబు గాదు.నీవు వేదాత్మకమగు

* ఇందులకుఁ బ్రమాణము "ప్రియోహి జ్ఞానినో త్యర్థ మహం సచ మమ ప్రియః, జ్ఞానీత్వాత్మైవ మే మతమ్" ఇత్యాదులు.

నాదము గలవాఁడవు. లోకమున మానవుఁడు కఱ్ఱబొమ్మను సూత్రమునకు బంధించి స్వవశము గావించికొని యాడించుచున్నట్లు నీవు నావేదాత్మకమగు నాదముచేఁ జిదచిదాత్మకమగు నీలోకంబును స్వవశము గావించికొని నియమించి యీశ్వరుండ వని పిలువఁబడుచున్నావు. ఓయీశ్వరా ! ఇంద్రాదిదేవత లందఱును మాత్సర్యరహితులై యైకమత్యమున నొప్పుచుఁ జరాచరాదులచేఁ బరిదృశ్యమానమగు ప్రపంచమును రక్షింపఁ బ్రయత్నించియు నట్లు చేయ నసమర్థు లయిరి. కావున జగన్నేతృత్వము నీకుఁ దక్కఁ దక్కినవారి కలవడ నేరదు. అట్టియసాధారణశక్తి గలనీకు నమస్కారము. ఓపరమాత్మా ! ఒకానొకదైనందిన ప్రళయమున మహాతరంగంబులతో ఘూర్ణిల్లు సముద్రంబున నోషధులకును లతాగుల్మాదులకు నాధారమగు నీక్షోణీమండలమును నన్నును ధరించి మహావిక్రమమున నందఁ జరించుచు రక్షించితివి. నీకుఁగాక తక్కినవారి కెవ్వరి కట్టిశక్తి గలదు? జగంబునకుఁ బ్రాణనిరూపణ చేయుటయే స్వభావముగాఁ గలయట్టి నీకు నమస్కారము " అని సర్వదా నుతించుచుండును. హిరణ్మయవర్షమందు భగవంతుఁడు కూర్మరూపము నొంది వర్తించుచుండును. పితృగణంబుల కధిపతి యగునర్యముఁడు భగవంతునికిఁ బ్రియతమ మగునాకూర్మరూపము నావర్షమం దుండుజనులతోఁగూడ నుపాసించుచు నిట్లు స్తోత్రము చేయుచుండు. "ఓదేవా! సమస్తజంతువులును, సద్గతము లగుహేయగుణములును గల్యాణగుణములును సద్వారకముగాను నద్వారకముగను నీకు సంభవించుచుండును. మఱియు నీవు సముద్రమధ్యమున మందరపర్వతమూలమున నుండి సాధారణముగా గోచరుండవు

కావు. నీశరీరము ప్రాకృతసంబంధి కానేరదు, నీవు కాలముచేఁ బరిచ్ఛిన్నుండవు కావు. నీవు మహామహిమగలవాఁడవు. మఱియు సమస్తమున కాధారభూతుండవు. అట్టి నీకు నమస్కారములు కావించుచుందుము. ఓదేవా! నానావిధజాతిగుణాదులచే నిరూప్యమయి భోగ్యవస్తురూపముగాఁ బ్రతీయమాన మగు నీప్రపంచము నీప్రకృతిచే నిర్వర్తింపఁబడు చున్నదో, యాబ్రహ్మాత్మకత్వముగాఁ బ్రతీయమాన మగుటచే దేనికిఁ బ్రకాశము లేదో, నీవాప్రపంచమే శరీరముగాఁ గలవాఁడవు. మఱియు లెస్సగా జ్ఞానమును బ్రవర్తింపఁ జేయుచున్నావు. అట్టి నీకు నమస్కారము. ఓదేవా! చరాచరరూప మని ద్వివిధముగాను నవాంతరభేదముచే జరాయుజము లనియు, స్వేదజము లనియు, నండజము లనియును, నుద్భిజ్జము లనియుఁ జతుర్విధములు గానుఁ బరిదృశ్యమానమగు నీ ప్రపంచము నీకు శరీరవిశేష మై తనర్చుచున్నది. కావున స్వర్గము, గగనము, భూమి, పర్వతము, నది, సముద్రము, ద్వీపము, గ్రహము, నక్షత్రము, మొదలగు శబ్దములచే నీ వొక్కరుండవే చెప్పఁబడుచున్నావు. అనంతములగుటచే లెక్కింపఁ దరము కాని విశేషములును, దేహాదినామములును, పృథివ్యాదిరూపములును నాకారముగాఁ గలిగి, ప్రకృతిపురుషకాల శరీరకుండ వన నొప్పునీయందుఁ బృథివ్యాది తత్త్వయాథాత్మ్యము నెఱింగిన కపిలాచార్యాదిమహామహులు మందబుద్ధులు సుఖముగా గ్రహించునిమిత్త మిరువదినాల్గు తత్త్వములనియు నిరువదియైదుతత్త్వములనియు సంఖ్యను గల్పించిరి. కాని వాస్తవముగా నవాంతరభేదముల నెంచిన లెక్కింపఁ దరము గాదు. నీ వనంతముగు విభూతులు గలవాఁడ వగుటచే నీ

యందుఁ బరికల్పితమగు సంఖ్య వాస్తవబుద్ధిచేఁ దిరస్కరింపఁబడక మానదు. తాదృశసాంఖ్యజ్ఞానముచేఁ దెలియఁబడు*నీకు నమస్కారములు. ఇట్టి గురువర్గమునందుఁ గల యుపాస్య

---

* భగవంతునికి విభూతిభూత మగుజగంబున కానంత్యము కలుగఁగా భగవత్స్వరూపమున కానంత్య మెట్లంగీకరింపవచ్చును? భగవత్స్వరూపమునకుఁ గల్గు నానంత్యము ప్రకృతిపురుషులచేతఁ గదా కలుగవలెను? ప్రకృతిపురుషుల కానంత్య మంగీకరించినప్పుడే యది యలవడును. కావునఁ బ్రకృతిపురుషులు దేశకాలవస్తుపరిచ్ఛిన్నులు కారని యందువా? అగుదురని యందువా? వానికట్టిసాధారణగుణ మంగీకరింతువేని పరమాత్మకు వానికి భేదమే లేకపోవలసి వచ్చును. అంగీకరింపనిచోఁ దాదృశప్రకృతిపురుషనిరూపిత మగుభగవత్స్వరూపము గూడఁ గాలాదిపరిచ్ఛిన్నమే కావలసివచ్చునని యందువేని సమాధానము వినుము. 'అనంతమ్' అనఁగా దేశముచేతను, గాలముచేతను, వస్తువులచేతను పరిచ్ఛిన్నము కాకపోవుటయే కదా? ఈమూఁడింటిచేతను నపరిచ్ఛిన్నమగుట పరమాత్మయందు స్థిరపడియేయున్నది. మఱియు దేశపరిచ్ఛేద మనఁగా నీవస్తు విచ్చట నున్నది, యిది యిచ్చట లేదు, అనునది. ఇది యీకాలమందున్నది యిది యీకాలమందు లేదు; అనునది కాలపరిచ్ఛేదము. ఇది యీవస్తువు ఇది యీవస్తువు కాదు; అనునది వస్తుపరిచ్ఛేదము. పైనిఁ జెప్పఁబడినమూఁడింటిచేతను బరబ్రహ్మస్వరూపము పరిచ్ఛిన్నము కాదు. పరబ్రహ్మమన్నికాలములందుండుటచేతను, నన్నిదేశములందున్నను దనశరీరభూతమగు వస్తురూపము గానున్నవాఁ డగుటచేతను, నెట్లు పరిచ్ఛిన్నుఁ డగును. అతఁ డంతట నున్నవాఁడగుటచే నీప్రదేశమందున్నాఁడు లేఁడని కాని సర్వకాలములందున్నవాఁడగుటచే నీకాలమున నున్నాఁడులేఁడని కాని, సమస్తవస్తువు లతనికిశరీరభూతమగుటచే నీవస్తు వితనిరూప మిది కాదని కాని, చెప్ప వలనుపడదు. కావున పరబ్రహ్మము త్రివిధము చేతను బరిచ్ఛిన్నుఁడు కాలేఁడు. కాన యపరిచ్ఛిన్నత్వము సిద్ధమగుచున్నది. జీవు లణుస్వరూపు లయినప్పటికిని, ధర్మభూతజ్ఞానము

లను నుపాసకులను దెల్పెదను వినుము. కురువర్షమునందు భగవంతుఁడు వరాహరూపమున వర్తించుచుండును. భూదేవి యు

సంసారదశయందుఁ గర్మముచే సంకుచిత మగుచున్నను ముక్తిదశయందు దానికి "సచానంత్యాయ కల్పతే" యని యెంతయు ఆనంత్య మంగీకరించు టవలనను, "అనేన జీవే నాత్మనా ప్రవిశ్య" యనుటచేఁ బరబ్రహ్మము చేతనములకంతరాత్మ యగుటలో జీవుఁడు ద్వారక మగుటచేతను, వాస్తవముగా జీవుఁడు నిత్య మగుటచేతను జీవులకును దేశకాలములచే నానంత్యము సంభవించుచున్నది. ప్రకృతికూడఁ గారణావస్థయందు నిరతిశయసూక్ష్మదశను గార్యావస్థయందపరిచ్ఛిన్న మగుచున్నది. కాని ప్రకృతిపురుషుల కున్న యానంత్యమునకును బరమాత్మ కున్న యానంత్యమునకును గొంచెము భేద మున్నది. పరబ్రహ్మమునకుఁ గార్యావస్థయందును గారణావస్థయందును స్వరూపము చేతను చేతను నానంత్యము సంభవించుచున్నది. జీవునికి దేశకాలములవలన నానంత్యము సంభవించుచున్నను నది ధర్మభూతజ్ఞానకృతమై యున్నది. కావున దానికి సంకోచము లేని ముక్తిదశయందు మాత్రమే సంభవించుచున్నది. సంసారదశయందు లేదు. అట్లె ప్రకృతికిని దేశకాలాపరిచ్ఛిన్నత్వము కార్యదశయందున్నను గారణావస్థయందు లేదు. మఱియు ప్రకృతిపురుషులకు భేదముండుటవలన నీవస్తు విది కాదని వస్తుకృతపరిచ్ఛిన్నత్వము ప్రకృతిపురుషులకు సంభవించుచున్నది. ఈప్రకృతిపురుషులు పరమాత్మకు శరీరములగుటచే "ఈజీవుఁడు పరమాత్మరూపముకాదు" ఈప్రకృతి పరమాత్మరూపము కాదు" అని పరిచ్ఛిన్నత్వము సంభవింపనేరదు. బ్రహ్మము సర్వాత్మకము కాన సామానాధికరణ్యాత్మక మగు వస్తుపరిచ్ఛేద మున్నప్పటికిని నతనిగుణములకు వస్తుపరిచ్ఛేదత్వ మెట్లని తలంపరాదు. బంగారు మొక్కటి యని యనుకొనుచున్నను బదివన్నె బంగారమునకంటె తొమ్మిదవవన్నె బంగారమునకును బరిశుద్ధియుఁ బ్రకాశము బరువు మొదలయినవి తఱిగి యుండును. సువర్ణముకంటె వెండి గురుత్వాదులలో దఱిగియుండును. కావున నట్టినికర్ష

చ్చుటిపురుషులతోఁ గూడ నవిచ్ఛిన్నభక్తియోగము గలదయి యావరాహరూపుఁడయిన భగవంతుని నారాధించుచు నీయుప నిషద్వాక్యము జపించుచుండును. 'ఓదేవా! నీవు మంత్రప్రతిపాద్యు లగునింద్రాదులు శరీరముగాఁ గలవాఁడవు. అసోమకము లగుయజ్ఞములును, ససోమకము లగుక్రతువులును, నీకు స్వరూప మగుచున్నవి. నీవు యోగస్వరూపుఁడవు, మఱియు సంసారనిరోధకము లగుకర్మములు గలవాఁడవు. నీవు జ్ఞానశక్త్యాదులనుగుణములు గలవాఁడవు శ్వేతవరాహరూపమున వెలయుచున్నవాఁడవు. భగవంతుఁడవు, అట్టినీకు నమస్కారంబులు. ఓపరమాత్మా! ప్రకృతిపురుషేశ్వరులతత్త్వము తెలిసినపండితులు గుణపరిణామభూతము లగుభూతములందు సర్వజ్ఞుఁడ వగునీస్వరూపమును సాక్షాత్కరించుకొనఁ దలంపుగలవారై, మథనసాధన కాష్ఠముచే దారువులం దగ్నివలె వివేకసాధనమగు మనస్సుచే వివేచించి పంచవింశతితత్త్వంబులకంటెు వేఱుగాఁ జేసి చూచుచున్నారు. ఇట్లు కవులచే నుపాస్యమానుం డగునీకు నమస్కారము,ఓమహాత్మా! ఆత్మానాత్మజ్ఞానముగలబుద్ధిమంతులచే భూతకర్మజ్ఞానేంద్రియములసంఘాతరూప మగుశరీరమందు దేహముతోడను, నింద్రియములతోడను, గుణత్రయముతోడను, జీవాత్మలతోడఁ గూడఁ బ్రకృతిపురుషవిలక్షణ మని చూడఁబడుచున్నస్వరూపముగలవాఁడ వై మాయాకృతిదొలంగించియున్న నీకు నమస్కారము. ఓదేవా! స్వార్థమగుటలో నీప్సితము గా

ము భగవద్గుణంబులకు లేదు గాన "యిది యీగుణము గా" దని వస్తుపరిచ్ఛేదము వచ్చుచున్నది. వర్ణాదులచే బంగారమునకు భేదముండుటచేఁ దాదృశవస్తుపరిచ్ఛేదము సంభవింపనేరదు.

కున్నను జీవానుగ్రహార్థ విహాస్రిత మగుచున్న సృష్టిస్థితిలయములు ప్రకృతిగుణము లగుసత్త్వాదులవలనఁ జేయుచున్నావు గదా! సంకల్పరూపజ్ఞానము గలయట్టినీసన్నిధియందు సత్త్వాదిగుణమయయు,నీకు శరీరభూతమును నగుప్రకృతి యయస్కాంతశిలసన్నిధియందు లోహముపలెఁ దిరుగుచున్నది. నీవు సత్త్వాదిగుణములకును బుణ్యాపపరూపకర్మములకును సాక్షివై వఱలుచున్నావు. అట్టినీకు నమస్కారము. ఎవఁ డాదియం దాదివరాహరూపముఁ దాల్చి, రసాతలమును బొందియున్ననన్ను దంష్ట్రాగ్రమున నిల్పి మదపుటేనుఁగువలె నెదిరించి వచ్చుచున్నహిరణ్యాక్షు సంహరించి ప్రళయకాలసముద్రమునుండి విలాసముగాఁ బైకిఁ గొనివచ్చెనో,యట్టియమేయశక్తినగునీకు వందనములు''అని భూదేవి నుతించుచుండును. ఇది పదునెనిమిదవ యధ్యాయము.

ఓరాజా! కింపురుషవర్షమునందు భగవంతుఁడు శ్రీరామస్వరూపమును దాల్చి వర్తించుచుండును. అచ్చట జగత్కారణభూతుఁడును, లక్ష్మణున కగ్రజుండును, సీతాభిరాముండు నగు నమ్మహాపురుషుని తదీయపాదకమలసేవాసక్తుఁడును,బరమభాగవతోత్తముండును నగుహనుమంతుండు కింపురుషవర్షస్థు లగుప్రజలతోఁ గూడియవిచ్ఛిన్నభక్తిపరుండయి యుపాసించుచుండును. మఱియు నతఁడు భగవంతుఁ డగుశ్రీరామునిపరమమంగళకథను సమీపమున గంధర్వులు గానము చేయుచుండఁ గింపురుషవర్షస్థులలో శ్రేష్ఠుఁ డయినయార్ష్టిషేణునితోఁ గూడ సర్వదా వినుచుండుటయే కాక తాను స్వయముగా నిట్లుజపించుచుండును.

దేవా! బ్రహ్మాదులచే నుతింపఁబడుచున్న నీకు నమస్కారము. నీవు పూజ్యము లగులక్షణములును, శీలమును వ్రతములును గలవాఁడవు. సంయత మగుచిత్తము గలవాఁడవు. నీవు లోకులచే నుపాసింపఁబడుచున్నావు. సాధువాద మేదో, యసాధువాద మేదో తెలిసికొన సమర్థుండవు. బ్రాహ్మణసంరక్షణమందు బద్ధకంకణుండ వయి యున్నాఁడవు. నీవు జగత్కారణత్వమున కుపయుక్తము లగుకల్యాణగుణములు గలవాఁడవు. నీవు రాజాధిరాజవు. అట్టినీకు నమస్కారము. ఓపరమేశ్వరా! నీ వెప్పుడును రాగద్వేషాదులచే దూషితుండవు కాక, జ్ఞానస్వరూపుఁడ వయి యొప్పుచున్నావు నీవు నిత్యాసంకుచితమగుధర్మభూతజ్ఞానముచే రజస్సు మొదలగు దుర్గుణములను దత్కృతము లగుసృష్టిస్థితిలయములనెడియవస్థలను నిరసించుచున్నావు. నీ వశనపిపాసాదులనుషడూర్ములు లేనివాఁడవు. నీవు దీపాదులవలెఁ బరులనిమిత్తముగాక నీనిమిత్తమే ప్రకాశించుచున్నవాఁడవు. నీవునిశ్చలజ్ఞానమునను గోచరుండ వగుచుందువు. నీకు శరీరభూతు లగు ప్రకృతిపురుషులవలననే నామరూపములు గల్గుచున్నవి కాని ప్రత్యక్షముగా నట్టివి లేవు. అన్ని వేదాంతములందుఁ బ్రసిద్ధుండవును బురుషశ్రేష్ఠుండవును నగునీకు నమస్కారములు గావించెద. ఓదేవా! నీవు మర్త్యులకు సంసారదోషములను దెలిపి యాయావర్ణాశ్రమములకు విహితము లగునీశ్వరారాధనరూపయాగాదిధర్మముల నుపదేశించి సాధుపరిత్రాణముఁ గావించుకొఱకు స్వస్వభావమునువిడువకయే శ్రీరామరూపముగా నవతరించితివి. నీవు మర్త్యశిక్షణమే ముఖ్యఫలముగా నెంచుకొని యవతరించినను రావణాదిరాక్షసులవధ యానుషంగికముగా

సమకూరినది మానవశిక్షణమే నీయవతారమునకు ముఖ్యఫలము. కానిచో, నిరతిశయమును నపరిచ్ఛిన్నంబు నగునానందస్వరూపము సర్వదా క్రీడించుచు విషయాసక్తిరహితుఁడ వగుయున్న నీకు సీతావియోగాదికష్టములును, దత్కృతము లగుదుఃఖంబులును నెట్లుగాఁ గల్గినవి? సంసారము నిరతిశయదుఃఖావహం బని మనుజులకుఁ దెలుపుటకే సీతావియోగాదికృతదుఃఖంబుల ననుసరించితివి. అట్లు గాక రావణాదిరాక్షసవధార్థమే యైనచో దక్కినయవతారములందుంబోలెఁ దాదృశదుఃఖాదులనుభవింపకయే యాక్రూరులం జంపవచ్చునుగదా? సర్వశక్తిసముపేతుండ వగునీ వేమి చేయ సమర్థుండవు కావు? ఓమహానీయా! శ్రీరామరూపమవలంబించి పరబ్రహ్మమ వగునీవు సంసారధర్మములను బూర్తిగాఁ దొలంగించుకొని నిన్నాశ్రయించిన వారియందు నిరతిశయప్రేమ గలవాఁడవు. *లోకములు నీయందు వసించుటచేతను, నీవు లోకమందంతటను నంతరాత్మరూపముగా వసించుటచేతను, వాసుదేవుండ వని పిలువఁబడుచున్నావు. నీవిట్లు జగదంతర్భూతుండ వయియున్నను శబ్దాదివిషయమునం దొకదానియందైనను సక్తుండవు కానేరవు. కావుననే సీతావియోగాదికృత మగుదుఃఖంబుల ననుభవింపలేదు. అట్లే*నిన్ను సర్వకాలములందును సేవించుచు నిన్ను విడిచియుండ

---

* "సర్వత్రాసౌ సమస్తంచ వసత్యత్రేతి వై యతః । తతస్స వాసుదేవేతి విద్వద్భిః పరికీర్త్యతే" అని వాసుదేవశబ్దనిర్వచనము చేయఁబడినది.

† లక్ష్మణుఁడును సీతయు రామునకు నిత్యానపాయు లెట్లగుదు రని శంకింప నవసరములేదు. లక్ష్మణుఁడు భగవంతునకు నివాసము, శయ్య, ఆసనము, అంశుకము, వర్షాతపములను నివారించుట మొదలగునుపచారములను దనశరీరభేద

నొల్లని సీతాలక్ష్మణులను మానవశిక్షనిమిత్తమే విడిచితివి. అట్లు కానిచో మిత్రభావముచేఁ బొందినవానిని విడువనేర నని పల్కెడి నీవు నిత్యానపాయు లగు సీతాలక్ష్మణుల నెట్లు విడుతువు? ఓమహనీయా! నీవు శరణాగతుఁడయిన వానిఁ బ్రాణమైనను రక్షింతు నని దీక్షవహించి శ్రీరామరూపమున నున్న పరబ్రహ్మమవు. అట్టి నీకు బ్రాహ్మణాదిజన్మము సంతోషదాయకము కాదు. తిర్యక్కులందుఁ గూడ ననుగ్రహము గలవాఁడవగుటచే సౌందర్యాదులును నీకు సంతోషకరములు కావు బుద్ధి సంతోషకరము కాదు. ఆకారము సంతోషకరము కాదని నిక్కము చెప్పవచ్చును. వెనుకఁ జెప్పినబ్రాహ్మణత్వాదులే నీకు సంతోషదాయకములై తదితరము లసహ్యాకరము లయినచో శేషావతార మగులక్ష్మణునితో నిత్యము సహచరుండ వయి వర్తించునీవు పశుత్వధర్మపురస్కారముగా సృజింపఁబడినకోఁతుల మయినమాతో సఖ్యము చేయుదువా? ఓదేవా! ఎవఁడు భక్తానుగ్రహార్థము మనుజాకృతి నవలంబించెనో, యెవఁడుత్తరకోసలములం దున్నప్రజల

ములచేత నే చేయుచు భగవంతుని విడువనొల్లక యుండు శేషాహియొక్క యవతారమె రామాయణమందు "భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే। అహంసర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చ తే। కురుష్వమా మనుచరం వైధుర్యం నేహవిద్యతే।కృతార్థోహం భవిష్యామి తవచార్థః ప్రకల్ప్యతే" అని లక్ష్మణుండు తనకు నిత్యకింకరత్వమునుఁ బ్రార్థించెను. కావున లక్ష్మణుఁడు రాముని నొకప్పుడును విడువనివాఁడు. అట్లే సీతయు "నిత్యైవైషాజగన్మాతా లక్ష్మీర్నిత్యానపాయినీ" యనియు, "రాఘవత్వే భవత్సీతా రుక్మిణీ కృష్ణజన్మని। అన్యేష్వప్యవతారేషు విష్ణోరేషానపాయినీ" అనియుఁ జెప్పఁబడుటచే సీత రామునకు నిత్యానపాయిని యగుచున్నది.

కండఱకును స్వర్గసుఖ మలవడఁ జేసెనో, యెవఁడు నిరతిశయప్రీతి విషయుఁడో, యెవఁ డుపకారాభిజ్ఞుఁడో, యట్టి శ్రీరాముఁడ వయిననిన్ను సుర లైనను, రాక్షసులైనను, మానవులైనను, వానరులైనను సర్వప్రకారముల సేవించినచో వారిని దప్పక నీ వనుగ్రహించుచున్నావు” అని యిట్లు హనుమదాదులు సర్వదా నుతించుచుందురు. ఓ రాజా! భారతవర్షమున భగవంతుఁడు

శుకుఁడు భారతవర్షమున నుపాస్యులను జెప్పుట.

నారాయణుఁ డనునామమున నొప్పుచుండును. అతఁడు కల్పాంతమువఱకు బదరికావనమందు నివసించి తపంబొనర్చుచుండు. ఆతఁ డట్లు చేయుచు నాత్మసాక్షాత్కారమున కుపయుక్తములగు కర్మయోగమును, జ్ఞానయోగమును, మనోనిగ్రహమును, నణిమాదు లగు నైశ్వర్యములను, బ్రాణజయమును, బాహ్యేంద్రియనిగ్రహమును వర్ధించుచుండును. పరమేశ్వరుం డగునతం డెందునిమిత్తి మిట్లాచరించుచున్నాఁడో సామాన్యులకుఁ దెలియదు కాని యాలోచింప ముముక్షువులంద ఱిట్లాచరింపవలసిన దని లోకశిక్షనిమిత్తమే యు ట్లొనరించుచుండును.అంతియ కాని యతనికి ఫలాపేక్ష లేదు. అట్టి నారాయణుని నారదమహర్షి వర్ణాశ్రమధర్మముల ననుసరించుచున్న భారతవర్షజనులతోఁ గూడి భగవంతునిచే సముక్తము లగు సాంఖ్యయోగ కర్మయోగములను సాధనముగాఁ జేసికొని పంచరాత్రముచే భగవదనుభవమును సావర్ణిమనువున కుపదేశించుచుఁ బరమభక్తితో నారాధించు చుండును. మఱియు నిట్లు స్తోత్రము చేయు చుండును. “ఓ దేవా! నీవు నిరతిశయ మగుసౌశీల్యము కలవాఁడవు.నీకు దేహేంద్రియాదులకు ధర్మము లగు నశనాయాది పదార్థములు

లేవు. నీవు ముముక్షువులకు ధనమువంటివాఁడవు. నీవు నిరతిశయకల్యాణగుణములు కలవాఁడవు. మఱియు సమస్తదోషములను నిరసించుచున్నవాఁడవు. నీవు నిరతిశయమగు హితము నుపదేశించుచుందువు. నీ వెప్పుడును సంకోచము నొందని యపరిచ్ఛిన్నమగు నానందమే స్వరూపముగాఁ గలవాఁడవు. నీవు సర్వభూతములకు నధిపతివి. అట్టి నీకు నమస్కారములు" అని పల్కి నారదుం డిట్లు గానము చేయుచుండును. "ఓ మహానీయా! చిదచిదాత్మకమైన యీ ప్రపంచమునకు సృష్ట్యాదియందుఁ గర్తయగుచున్న నెవఁడు నేనే కర్తయని యభిమానమును పొందఁడో, యంతరాత్మస్వరూపమున సమస్తదేవాదిశరీరములం దవభాసించుచున్నను నెవండు దద్గతము లగుగుణములచే సంకుచితజ్ఞానవంతుండు కాఁడో, సర్వదా ప్రకృతిపురుషసంబంధ మున్నను నెవఁడు జీవుని సంసారిత్వాది గుణములచేతను, బ్రకృతిసంబంధు లగు జాడ్యాదిగుణములచేతను స్పృశింపఁబడఁడో, యట్టి మహానీయుఁడవును, స్వతుల్యాధికవస్తురహితుఁడవును చరాచరజగంబునకు సాక్షిభూతుఁడవును నగు నీకు వందనంబులు. ఓ యోగేశ్వరా! భగవంతుఁడు హిరణ్యగర్భుఁడు శరీరధారులు తమతుచ్ఛదేహములందును దదనుబంధులందును నుపేక్ష యుంచినవారై మరణకాలమందు భక్తియుతుండై హేయగుణరహితుఁడ వగు నీయందు మనస్సును నిల్పుటే యోగచాతుర్య మని పలికియున్నాఁడు. అట్లు చేయఁగలుగుట మహాకార్యము కదా! ఓ నారాయణా! ఐహికసుఖము లగు గృహపశుపుత్త్రాదులందును, నాముష్మికము లగు స్వర్గాదులందును గొంద ఱాసక్తులయి సర్వదా తమ భార్యాదులును, బుత్త్రులును, ధనములును నిరపాయముగా

నుండవలయు నని చింతించుచుందురు. వారు శాస్త్రాదులను జక్కఁగా నభ్యసించినను గుత్సిత మగు కళేబరత్యాగమునకు భయపడుచుందురు. అట్టివారిశాస్త్రాభ్యాసాదులు కేవలము వ్యర్థములు గదా! కళేబరత్యాగాదులకు భయపడనివారు నీయనుగ్రహమును సంపాదించినవారే కదా! కావున నోమహాప్రభూ! మాయందు దయయుంచి నిరుపాధిక మగుయోగమును మా కొసంగుము. మేము దానివలన నీకుత్సితకళేబరమందున్నదియు, నుపాయాంతరములచే విడువఁదరము కానిదియు నహంకారమమకారరూప మైనదియు నగు నవిద్యను సుఖముగా విడుతుము" అని సర్వదా నుతించుచుందురు. ఓరాజేంద్రా! ఈభార

శుకుండుభారతవర్షమునఁగలనదీశైలములనిరూపించుట.

తవర్షమునందును మలయము; మంగళప్రస్థము, మైనాకము, త్రికూటము, ఋషభము, కూటకము, కొల్లము, సహ్యము, వేదగిరి, ఋశ్యమూకము, శ్రీశైలము, వేంకటము, మహేంద్రము, వారిధరము, వింధ్యము, శుక్తిమంతము. ఋక్షగిరియుఁ, బారియాత్రము, ద్రోణము, చిత్రకూటము, గోవర్ధనము, రైవతకము, కుకుంభము, నీలము, కాకముఖము, ఇంద్రకీలము, రామగిరి మొదలగుపర్వతములు పెక్కులు గలవు. ఇంకను నూఱులకొలంది పర్వతములు గలవు. ఆపర్వతములం దుద్భవించిన నదీనదంబులును పెక్కులుగలవు. అవియన్నియును మిక్కిలిపుణ్యదాయకము లయినవి. భారతవర్షీయు లానదులందుఁ దానము లాడి వానినామస్మరణంబు గావించి పవిత్రులగుచున్నారు. ఆనదులలోఁ జంద్రవస, తామ్రపర్ణి, యవటోద, కృతమాల, వైహాయసి, కావేరి, వేణి, పయస్విని, పయోద, శర్కావర్త, తుంగభద్ర, కృష్ణవేణి,

భీమరథి, గోదావరి, నిర్వింధ్య, పయోష్ణి, తాపి, రేవ, శిల, సురస, నర్మద, చర్మణ్వతి, మహానది, వేదస్మృతి, ఋషికుల్య, యత్రిసమ, కౌశికి, మందాకిని, యమున, సరస్వతి, దృషద్వతి, గోమతి, సరయువు, భోగవతి, సుషమ, శతద్రువు, చంద్రభాగ, మరున్నది, వృధ, వితస్త, విశ్వ, మొదలగునవి మహానదులు. సింధువు, శోణ, నదము లనఁబడుచున్నవి. ఓరాజా ! ఈభారతవర్షమునందుఁ బుట్టినపురుషులు సత్త్వరజస్తమోగుణకల్పితములును బుణ్యపాపరూపములును నగు తమకర్మములచే బహువిధము లగు గతులను సంపాదించుచున్నారు. *అందు సాత్త్వికకర్మలకు దివ్యగతియు, రాజసకర్మలకు మానవలోకగతియు, తామసకర్మలకు నధోలోకగతియుఁ గలుగుచుండును. కర్మానుసారముగా ఓనరపాలా! ఈవర్షమునందే బ్రహ్మక్షత్త్రియాదివర్ణములును, వారలకు విహితములగు ధర్మములును మోక్షసాధనములగు ననేకధర్మములును నిర్ణీతములై యున్నవి. పురుషుఁడు పుణ్యాపుణ్యరూప మగునవిద్యను ముందుగా నిరసించుకొని దానివలన భగవత్ప్రసంగము నలవఱచుకొనవలెను. ఆభగవత్ప్రసంగము మోక్షసాధనమైనది. దానివలననే భగవంతునియం దనన్యఫలక మగు భక్తి యుదయించును. ఏపురుషుఁడు సర్వభూతస్వరూపుఁడును. † దేవమనుష్యాదుల నామరూపములచేఁ జెప్పఁబడని

---

* ఇందులకుఁ బ్రమాణము. ఊర్ధ్వంగచ్ఛంతి సత్త్వస్థా, మధ్యేతిష్ఠతిరాజసాః। జఘన్యగుణవృత్తిస్థా అధోగచ్ఛంతి తామసాః॥ అనెడి భగవద్గీతావాక్యము.

† ఇందు దేవమనుష్యాదినామముచేఁ జెప్పఁబడనివాఁడనుటచే వానిచేఁ జెప్పఁబడుజీవునికి వ్యావృత్తి గలుగుచున్నది. దేహముకంటె వ్యతిరిక్తుఁడను

వాఁడును, దేహముకంటె వ్యతిరిక్తుఁడును నితరమగు నాధారము నపేక్షింపనివాఁడును, ముక్తులకంటెను నిత్యసిద్ధులకంటెను బరుఁ డగువాఁడును సమస్తము తనయందుఁ గలవాఁడును నగు పరమాత్మయందు ఫల మపేక్షింపకుండ భక్తిని నెలకొల్పునో, వానికిఁ దత్కాలమందే యపవర్గము లభించును. ఓరాజా! ఊర్ధ్వలోకమునందు వసించిన దేవతలు భారతవర్షముప్రశస్తత్వమును గుఱించి యిట్లు గానము చేయుచున్నారు. "అయారే! భారతవర్షమందు వాసుదేవునిఁ బ్రత్యక్షముగా సేవింప సాధనమగు మానవరూపము నొందినవా రెంత భాగ్యవంతులు? అవురా! వా రెట్టిసుకృతము నాచరించుకొనిరో కదా! సాధనము లక్కఱలేకుండఁగనే భగవంతుని సాక్షాత్కరింపఁ జేసికొనుచున్నారు! ఇంతియ కాక భగవంతుఁడు స్వయముగానే వీరికిఁ బ్రసన్నుఁ డగుచున్నాఁడు. ఆలోచింప వీరెంతో సుకృతము చేసికొనుటచేతనే వీరికిట్టిది సంభవించినది. లేనిచో సంభవించునా? మాకీమానవజన్మమందుఁ గోర్కె పొడముచున్నది. స్వర్గాదులు సుఖకరంబులని మూఢు లనుకొనుచుందురు. కాని యచ్చటనేమి సౌఖ్యము కలదు? అచ్చట శ్రీనారాయణునిపాదపద్మస్మృతియే లేదు. నిరతిశయము లగునింద్రియసుఖములవలన మత్తులై యచ్చటివారు భగవంతుని స్మరింపనే స్మరింపరు. తాదృశతుచ్ఛ

టచే జడమునకును, 'నాధారాంతర మపేక్షింపని' అనుటచే ముక్తజీవులకు, 'ముక్తాదులకంటెఁ బరుఁ' డనుటవలన నిత్యసిద్ధులకును, వ్యావృత్తి గల్గుచున్నది. ఆలోచింపఁ బ్రకృతికంటెను, బద్ధజీవులకంటెను, ముక్తజీవులకంటెను, నిత్యజీవులకంటెను బరుఁడయినవాఁడయి భగవంతుఁడు వెలయుచున్నాఁడని తెలియవచ్చుచున్నది.

మగుస్వర్గము నపేక్షించి దుష్కరము లయినతపంబు లాచరించుచుందురు. యాగము లొనర్చుచుందురు. వ్రతములను దానములను సల్పుచుందురు. ఇట్లు దుష్కరకార్యములవలన నస్థిరఫలమగు స్వర్గమును బొందినను నేమిలాభము గలదు? ఈభారతవర్షమందు మరణశీల మగు శరీరముచేతఁ జేయఁబడినక్రియాకలాపమును భగవంతునికి సమర్పించి భగవదుపాసకులయి జన్మజరామరణాదులు లేని శ్రీవైకుంఠమును బొందుచున్నారు. ఇట్లుండ నొకకల్పముకాల మాయువున్నప్పటికి మగుడ జన్మము గల్గించెడియూర్ధ్వలోకప్రాప్తికంటె క్షణకాల మాయువు గలవారైనను నాశనరహిత మగుమోక్షపదవిని బొందింపఁ జాలినభారతవర్ష నరజన్మప్రాప్తియే మిక్కిలియుత్తమ మైనది కదా? కావున నేప్రదేశమున నారాయణునికథారూపము లగు సుధావాహినులు ప్రవహింపవో, ఏప్రదేశమున భగవత్కథాప్రవృత్తినదులను సేవింపఁ దలఁపు గలసాధుజను లుండరో, ఏస్థలము నిత్యోత్సవము పక్షోత్సవము మాసోత్సవము మొదలగుగొప్పయుత్సవములును భగవంతునారాధనరూపము లగుయజ్ఞములు నుండవో, యాస్థలము బ్రహ్మదేవునిలోక మైనను సేవింపఁదగినది కాదు. ఈభారతవర్షమున నెవ్వరు భగవంతునిఁ గీర్తించి, పూజించి ప్రదక్షిణనమస్కారము లొనరించి సందర్శించి తదీయ మగుతులసి నాఘ్రాణించి దేవతామాల్యమును దీసికొని తన్నివేదితప్రసాదాదులను గైకొని భగవత్సేవను గాంచి తదనుగ్రహము సంపాదింపఁదగిననరజన్మమును బొందియుఁ బునర్జన్మరహిత మగుముక్తికై యత్నింపరో, వారు వ్యాధునివలనఁ దప్పించుకొన నవకాశము గల్గియు నచ్చటనే విహరించి తద్బం

ధనంబునకుఁ జిక్కినపక్షులవంటివా రని నిశ్చయింపవచ్చును. భగవంతుఁ డవాప్తసమస్తకాముఁ డయినను నేకరూపుఁ డయినను భారతవర్ష వాసులు యాగములందు నగ్నీంద్రాదుల నామములచేఁ బిలిచి మంత్రపూర్వకముగా శ్రద్ధతో నర్పించుచున్న హవిర్భాగంబులను సంతోషముతో గ్రహించుచున్నాఁడు. పరిపూర్ణుఁ డగు భగవంతుఁ డట్లు గ్రహించుట యాగకర్తల కోర్కుల నెఱవేర్చుటకే కదా? ఇట్లు భగవంతు నారాధించి యతనివలనఁ గోర్కులను బడయు భారతవర్ష వాసులదే భాగ్యముగాని తక్కినవారిదా భాగ్యము? మఱియు మానవులు భగవంతు నారాధించి యేయే పురుషార్థములను గోరుకొందురో, యా భగవంతుఁ డా యా పురుషార్థములను వారికొసంగుచుండుట సత్యమే. తాఁ గోరిన పురుషార్థమును బొందియు మానవుఁడు మఱియొక పురుషార్థమును గూర్చి భగవంతుని నారాధింప, వాని కాతఁడు నిరతిశయనిత్యపురుషార్థము నొసంగక యనిత్యమగుదాని నే యొసంగును. ఫలము నపేక్షించి కోరువారి కట్లె యిచ్చుచుండును. కాని యే మహాత్ములతని పాదపద్మములను నిష్కాములై భజించుచుందురో వారికి సమస్తవాంఛాపూర్వక మగు స్వరూపమునే యొసంగుచుండును. కావున నా భారతవర్షీయులలో ముముక్షువుల భాగ్యము నిరతిశయ మైనదని చెప్పవచ్చును. మఱియు నీభారతీయులు తమలో "మాకు భారతవర్షమందు భగవత్స్మృతి గల్గించు నరజన్మము సంభవించినచో భగవంతు నారాధించి నిరతిశయసుఖరూపమగు మోక్షము నందవచ్చును. కావున మే మొనరించిన యాగాది పుణ్యకర్మములు స్వర్గసుఖ మనుభవింపఁగా మిగిలియున్న

చో దానివలన మాకు భారతవర్షమున నరజన్మము సంప్రాప్త మగుఁగాక" యని కోరుకొనుచుందురు. ఓరాజేంద్రా! సగరకుమారు లశ్వమును వెదకుటకై భూమిని ద్రవ్వి నిర్మించినయుపద్వీపము లెనిమిది జంబూద్వీపమునకుఁ గల వని కొందఱు చెప్పుచున్నారు. అవి స్వర్ణప్రస్థము, చంద్రశుక్లము, ఆవర్తనము, రమణకము, మందహారిణము, పాంచజన్యము, సింహళము, లంక యను నామములచేత వ్యవహరింపఁబడుచున్నవి. ఓ రాజోత్తమా! జంబూద్వీపమునఁ గలవర్షవిభాగములను యథాక్రమముగా వర్ణించి నీకుఁ జెప్పితిని. ఇది పందొమ్మిదవయధ్యాయము.

శుకుఁడు ప్లక్షాదిద్వీపములవృత్తాంతమును చెప్పుట.

అని రాజునకుఁ జెప్పి వెండియు శుకుం డిట్లనియె. "ఓరాజేంద్రా! ఇఁకఁ బ్లక్షాదిద్వీపములపరిమాణమును, లక్షణములను, నచ్చటి విశేషాంశములను జక్కఁగ విభాగించి యథాక్రమముగా వర్ణించెద. జంబూద్వీపమంతప్రమాణము గల లవణసముద్రముచే జంబూద్వీపము పరివేష్టింపఁ బడినట్లును, మేరువు జంబూద్వీపముచేఁ బరివేష్టిత మగునట్లును, నాలవణసముద్రమును రెండులక్షలయోజనములపరిమితి గలప్లక్షద్వీపముచే బాహ్యోద్యానవనముచే నగరమువలె నన్నివైపుల నావృతమై యున్నది. ఓరాజా! యాద్వీపమందు జంబూవృక్షమంతప్రమాణమున నొప్పుప్లక్షవృక్ష మున్నది. దానిచేతనే యాద్వీపమున కాపేరు వచ్చినది. మఱియుఁ బ్రకాశబహుళమును యున్నతమయినయాప్లక్షవృక్షము మొదట నేడుజ్వాలలు గలయగ్నిహోత్రము వెలయుచుండును. ప్రియవ్రతునికుమారుఁ డగునిధ్మజిహ్వుఁ డా

ద్వీపమును జిరకాలము పరిపాలించి దాని నేడువర్షములుగా విభజించి యావర్షములనామములతో నొప్పుచున్న తనకుమారులకేడ్వుర కొసంగి తాను భగవదుపాసనాత్మక మగుయోగముచే సంసారముక్తుం డయ్యె. శివ మనియు, యశస్యమనియు,సుభద్ర మనియు, శాంత మనియు, క్షేమ మనియు, నభయ మనియు, నమృత మనియు నావర్షంబులు వ్యవహరింపఁబడు. ఆవర్షనామములచేత నే యాప్రియవ్రతునికుమారులును వ్యవహరింపఁబడిరి. ఆవర్షములలో నేడునదులును, నేడు పర్వతరాజములును సుప్రసిద్ధము లయినవి. ఆపర్వతములు, మణికూటము, వజ్రకూటము, ఇంద్రసేనము, జ్యోతిష్మంతము, ధూమ్రవర్ణము, హిరణ్యగ్రీవము, మేఘమాలము. నాఁబడునామంబులచేఁ బిలువఁబడుచుండును. ఆమహానదు లేడును నరుణ, నృమణ, యాంగిరసి,సావిత్రి, సుప్రభాత, ఋతంభర, సత్యంభర యనునామంబులు గలవి. ఆయరుణాదినదులందు స్నానపానంబు లాచరించువారికి రజస్తమోగుణంబులు తొలంగి సత్వగుణం బలవడును. ఆద్వీపమున నాలుగువర్ణములవారు వెలయుచుందురు. వారికి బ్రాహ్మణాదిసంజ్ఞలకుమారుగా హంసు లనియుఁ,బతంగు లనియు, నూర్ధ్వాయను లనియు, సత్యాంగు లనియు, నాలుగువర్ణసంజ్ఞలు గలవు. వారికి వేయువత్సరంబు లాయువు గలదు. వారిసంతానములు సౌందర్యంబున దేవతల మింతురు. వారు వేదోక్త మగుకర్మయోగముచే వేదమయుఁడును, సూర్యుఁడు శరీరముగాఁ గలఁ వాఁడునునగుభగవంతునిసర్వదాపూజించుచుందురు. "ఓ దేవా! నీవు జగంబునకుఁగారణంబవు. నీవువికారాదులు లేని వాఁడవు. నీవు నిరతిశయఫలము నొసంగువాఁడవు. నీవు బంధమోక్షము

లకు హేతుభూతుండవు. నీవు జగద్వర్ధకుండవు. అట్టి నీకు శరీరమై సూర్యుఁ డనునామమున నొప్పుజీవవిశేషుని శరణునొందుచున్నాము" అని జపించుచుందురు. ఓరాజేంద్రా! ప్లక్షాదులం దైదు వర్షములందును బరమాయువును, నింద్రియపటుత్వమును, మనోబలమును, దేహబలమును, బుద్ధిబలమును, సామాన్యముగా నెల్ల వారికిని సహజములై యుండును. ప్లక్షద్వీపమునందుఁ గల సమస్తవిశేషములనువర్ణించిచెప్పితిని. ఇఁక శాల్మలద్వీపమునువర్ణించెదను.వినుము, ఓరాజా! రెండులక్షలయోజనములవైశాల్యము

శాల్మలద్వీపవృత్తాంతకథనము.

గలప్లక్షద్వీపమంతపరిమాణము గలయిక్షురససముద్రముచే నావృతమైనట్లు నాలుగులక్షలయోజనములవైశాల్యముగలశాల్మలద్వీపముగూడ నాలుగులక్షలయోజనములవైశాల్యము గలసురాసముద్రముచే వర్తులముగాఁ బరివేష్టితమయి యున్నది. ఆ శాల్మలద్వీపమునఁ బ్లక్షవృక్షమంతయౌన్నత్యము గలశాల్మలీవృక్షము గలదు. కావుననే దానికాపేరు గల్గినది. గాయత్ర్యాదు లగుఛందస్సులే యవయవములుగాఁ గలవాఁడును, బక్షులకధిపతియు నగుగరుత్మంతున కావృక్షము నిలయమై యుండునని చెప్పుదురు. పూర్వ మాద్వీపమును బ్రియవ్రతునికుమారుఁడగుయజ్ఞబాహుఁడు చిరకాలము పరిపాలించి, దాని నేడువర్షములుగా విభజించి తనకుమారుల కేడ్వురకును బంచి యిచ్చెను. ఆవర్షాధిపతులును నావర్షములును, సురోచనము, సౌమనస్యము రమణకము, దేవబర్హము. పారిబర్హము, ఆప్యాయనము, అభిజ్ఞాతము నాఁబడునామములచే వ్యవహరింపఁబడుచుందురు; ఆయేడువర్షములందు నేడువర్షపర్వతములుగలవు. అవి స్వరస మని

యు, శీతశృంగ మనియు, వామదేవ మనియుఁ గుముదమనియు ముకుంద మనియుఁ, బుష్పవర్ష మనియు, శతశ్రుతి యనియుఁ, బిలువఁబడుచుండును. ఆవర్షములం దేడుమహానదులు గలవు. అవి యనుమతి, శినీవాలి, సరస్వతి, కుహువు, రజని, నంద, రాక, యనునామములచే వ్యవహృతము లగుచుండును. అచ్చటి పురుషులు శ్రుతధరు లనియు, విద్యాధరు లనియు, వసుంధరు లనియు, నిషంధరు లనియు నాలుగువర్ణములవారై యుందురు వారు వేదోక్తములగువర్ణాశ్రమధర్మములచే వేదప్రచురుండును బరమపురుషునికి శరీరంబు నగుచంద్రుఁ డనుజీవవిశేషుని నారాధించుచు నిట్లు నుతించుచుందురు. "ఏమహానుభావుఁడు శుక్లపక్షమందు దేవతలకును, కృష్ణపక్షమునఁ బితృదేవతలకును స్వకిరణములచే నన్నమును విభాగించి యిచ్చుచున్నాఁడో, ఆచంద్రుఁడు మా కందఱకును బ్రభు వయి మాకు సుఖము గల్గించుఁ గాక" అని ప్రార్థించుచుందురు. ఓరాజా! ఇఁకఁ గుశద్వీపవృ

కుశద్వీప వృత్తాంతము.

త్తాంతంబు వినుము. శాల్మలద్వీపముసురాసముద్రముచే నావృతమై యున్నట్లు గుశద్వీపము శాల్మలమునకంటె ద్విగుణవిశాలమయి తనతో సమముగా నెనిమిదిలక్షలయోజనముల వైశాల్యము గలఘృతసముద్రముచే నావృతమైయున్నది. ఆద్వీపమునకు గుశద్వీప మని వ్యవహారము గల్గించునదై యగ్నివలెఁ బ్రకాశబహుళమై యున్నకుశస్తంభ మొకటి బ్రహ్మచే నందు నిర్మింపబడెను. ఆకుశస్తంభము బాలతృణములకాంతులచేఁ బదిదిక్కులును బ్రకాశించుచున్నవి. ఆద్వీపమునకుఁ బ్రియవ్రతునికుమారుఁడు హిరణ్యరేతసుం డధిపతి. వాఁడు దానిఁ గొంతకాలము

పరిపాలించియాద్వీపము నేడువిధములఁగా విభజించి వసువు, దానుఁడు, దృఢరుచి, నాభిగుప్తుఁడు, సత్యవ్రతుఁడు, విప్రనాముఁడు, దేవనాముఁడు నాఁబడుతన యేడ్వురకొమరులకుఁ బంచియిచ్చి తాఁ దపంబునఁ గరిగె. ఆవర్షాధిపతులనామములచేతనే యావర్షములును వ్యవహరింపఁబడుచున్నవి. ఆవర్షములం దేడువర్షపర్వతములు గలవు. వానికిఁ గ్రమంబుగా బభ్రువనియుఁ, జతుశ్శృంగ మనియుఁ, గపిల మనియుఁ, జిత్రకూట మనియు, దేవానీక మనియు, నూర్ధ్వరోమ మనియు, ద్రవిణ మనియు, నామంబులు చెల్లుచుండు. మఱియు నందు మహానదు లేడు రసకుల్యయు, మధుకుల్యయు, శ్రుతవిందయు, మిత్రవిందయు, దేవగర్భయు, ఘృతచ్యుతియు, మంత్రమాలయు, నను నామంబులతోఁ బ్రఖ్యాతంబులై యుండు. ఆనదీజలములస్పర్శముచేఁ గుశద్వీపవాసులు పాపరహితు లయి కుశలులు, కోవిదులు అభియుక్తులు, కులకులు నాఁబడునాలుగువర్ణములతో వెలయుచు, నగ్నిశరీరకుఁ డయిన భగవంతునిఁ గ్రియాచాతుర్య మొప్పఁగా నారాధించుచు నిట్లు నుతించుచుందురు. "ఓవీతిహోత్రా! నీవు శ్రీపరమేశ్వరుని శరీరభూతమ వయితివి. అట్లె భగవచ్ఛరీరభూతు లగునింద్రాదులకు యాగసంబంధి యగుహవిస్సును గొనిపోయి యిచ్చుచుందువు. కావునఁ బరమపురుషునికి శరీరభూతు లగునింద్రాదుల నుద్దేశించి చేసినయాయాగముచేఁ దదంతరాత్మ యగుపరమాత్మకుఁ బ్రీతిని గల్గింపుము." అని సర్వదా యగ్నినిఁ

క్రౌంచద్వీప వృత్తాంతము.

బ్రార్థించుచుందురు. ఓరాజేంద్రా ! కుశద్వీపము ఘృతసముద్రముచే నావృత మయినట్లు కుశద్వీపమునకుఁ బిమ్మటఁ బదాఱు

లక్షలయోజనములవైశాల్యము గలక్రౌంచద్వీపము దానితో సమానపరిమాణము గలదధిమండ సముద్రముచేఁ బరివృత మగుచుండును. ఆద్వీపమందుఁ గ్రౌంచపర్వతము కలదు. ఆక్రౌంచము పూర్వము కుమారస్వామిబాణములచే భిన్నమై దధిమండమున విలీనం బయి వరుణునిచే సురక్షిత మగుచు నిర్భయమై యుండును. ఆక్రౌంచముచేత నే దాని కాపేరు గలిగినది. ఆద్వీపంబును బ్రియవ్రతునికుమారుండు ఘృతపృష్ఠుం డనువాఁడు పరిపాలించెను. పిమ్మట నతఁ డాద్వీపమును నేడుభాగములుఁగా విభజించి తనకుమారుల కేడ్వురకును నొసంగి స్వయంప్రకాశుండును నిరతిశయ మంగళరూపము గలకీర్తి గలవాఁడును నగుపరమాత్మయందు స్థిరమనస్కుం డయి తదీయపాదసన్నిధిని జెందెను. ఆఘృతపృష్ఠునికుమారు లామోదుఁడు,మధువహుఁడు, మేఘపృష్ఠుఁడు, సుదాముఁడు, ఋషిజ్యుఁడు, లోహితార్ణుఁడు, వనస్పతి, యను నామంబులతోఁ బరఁగుచుందురు. వారినామంబులచేత నే యాద్వీపంబులును వ్యవహరింపఁబడుచున్నవి. వర్షములను విభాగించెడిపర్వతము లం దేడుగలవు. అవి శుక్లమనియు, వర్ధమానమనియు, భోజనమనియు, నుపబర్హణమనియు, నానందమనియు, నందనమనియు, సర్వతోభద్రమనియుఁ బిలువఁబడుచుండును. ఆవర్షములం దేడునదులు నుప్రసిద్ధంబు లయినభయ, యమృతౌఘ,యార్యక, తీర్థవతి, తృప్తిరూప, పవిత్రవతి, శుక్ల, యను నామంబులతో వ్యవహృతంబులగుచున్నవి. ఆనదులజల మతిపవిత్రమైనది. గురువు లనియు, ఋషభులనియు, ద్రవిణకులనియు, దేవకులనియు నాలుగువిధములుగా విభక్తు లయినయావర్షపురుషు లానదుల విమలజల

ము నుపయోగించుకొనుచు జలశరీరకుఁ డయినపరమపురుషుని నుదకాంజలులతో నారాధించుచు నిట్లు నుతించుచుందురు. "ఓజలములారా! మీరు పరమపురుషునికి శరీరభూతములై వఱలుచున్నారు. అట్లై భూర్భువస్స్వర్లోకముల మూఁడింటికిని బవిత్రత గల్గించుచున్నారు. అట్టిమిమ్మును స్పృశించు చున్నమా పాపములను హరింపుఁడు." అని ప్రార్థించుచుఁ గ్రౌంచద్వీపవాసులు పరఁగుచుందురు. ఓరాజా! క్రౌంచద్వీపము దధిమండ

శాకద్వీపవృత్తాంతము.

ముచేతం బోలె నది శాకద్వీపముచేఁ బరివేష్టిత మై యున్నది. ఆద్వీపముముప్పదిరెండులక్ష లయోజనములయాయామము గలది. అది స్వమానముచే నొప్పుక్షీరసముద్రముచేఁ బరివేష్టితమై యున్నది. దానియందు గొప్ప శాకవృక్షమున్నది. తదీయపుష్ప పరిమళములచే నది యాద్వీపము నెల్లను బరిమళింపఁజేయుచు దానికి శాకద్వీప మనునామమును గల్గించుచున్నది. ఆద్వీపమును బ్రియవ్రతునికుమారుఁడు మేధాతిథి పరిపాలించి తన పుత్రనామములతో వ్యవహృతము లగువర్షముల నేడింటి విభజించి కుమారులకిచ్చి తాను భగవంతుఁ డగువాసుదేవునియందు మనంబు నిలిపి తపోవనంబు ప్రవేశించె. పిమ్మట నతనికుమారులు తమతమభాగములను జక్కఁగఁ బరిపాలించిరి. వారు పురోజవుఁడు, మనోజవుఁడు, వేపమానుడు, ధూమ్రానీకుఁడు, చిత్రరథుఁడు, బహురూపుఁడు, విశ్వాధారుఁడు ననునామములు గలవారు. ఆనామములే యాయా వర్షంబులకు సైతము చెల్లు. ఆవర్షముల కేడు మర్యాదాగిరులు గలవు. అవి యీశానమనియు,నురుశృంగమనియు, బలభద్రమనియు, శతకేసరమనియు

సహస్రస్రోత మనియు, దేవపాల మనియు, మహానస మనియు నేతన్నామంబులచే వ్యవహరింపఁబడుచున్నవి. మఱియు నామేడువర్షములందును నేఁడునదులు గలవు. అవి యనఘయు, నాయుర్దయు, నుభయస్పృష్టియు, నపరాజితయుఁ, బంచపదియు, సహస్రస్మృతియు. నిజధృతియు నాఁబడు నామంబులచేఁ బిలువఁబడుచున్నవి. ఈవర్షములందలి ప్రజలు, ఋతవ్రతులు, సత్యవ్రతులు, దానవ్రతులు, సువ్రతులు నను వర్ణవిభేదము గలవారై ప్రాణాయామాదులచే రజస్తమంబులఁ దొలంగించుకొని నిశ్చల సమాధి నవలంబించి వాయుశరీరకుఁ డగుపరమపురుషు నారాధించి "వాయుశరీరకుఁడ వగునోపరమాత్మా! ఎవఁడు, ముఖ్యప్రాణరూపముగా సమస్తజీవులలోను బ్రవేశించి చిహ్నభూతము లగు ప్రాణాదివృత్తులచే సమస్తమును వర్ధించుచున్నాఁడో యెవనియధీన మై యీజగం బంతయు వర్తించుచున్నదో, నిఖిలాంతర్యామి వగునట్టి నీవు మమ్మును రక్షింతువు గాక" యని నుతించుచుందురు. ఓరాజేంద్రా! క్షీరసాగరమునకుఁ దరు

పుష్కరద్వీప వృత్తాంతము.

వాతఁబుష్కరద్వీప మున్నది. అది యెనుబదినాల్గులక్షల యోజనముల వైశాల్యము గలది. అది తనయంత పరిమాణ గల శుద్ధజలార్ణవముచేఁ బరివేష్టిత మయి యున్నది. ఆద్వీపమున గొప్ప కమల మొకటి కలదు. దాని కొకలక్షపత్రములు గలవు. అవి యగ్నిశిఖవలె నమలములై సువర్ణమయము లయి వఱలుచుండును. దానియందు బ్రహ్మ యధివసించి యచ్చటిప్రజలచే సేవింపఁబడుచుండును. ఆపుష్కరము బ్రహ్మ కాసన మగుటచే నతనికిఁ బుష్కరాసనుఁ (కమలాసనుఁ)డను నామము కల్గించు

టయే కాక, యాద్వీపంబునకును బుష్కరద్వీప మని నామము కల్గించుచున్నది. దాని మధ్యభాగమునందుఁ బదివేల యోజనములయౌన్నత్యంబును, నంతియ విస్తృతియుఁ గలమానసోత్తర మనుపర్వత మొకటి యున్నది. అది యంతర్బహిర్భాగంబుల నున్నవర్షములకు మర్యాదాగిరి యై యున్నది. ఆగిరియందు నాల్గుదిక్కులందును నింద్రయమవరుణకుబేరులపురంబులు గలవు. ఆ యింద్రాదిపురములకు మీఁదుగా మేరువునకుఁ బ్రదక్షిణముగాఁ దిరుగుచున్నసూర్యునిరథంబునకుఁ జక్రమై దేవతల కహోరాత్రరూప మయి సంవత్సర మనుపేరు గలదై యుత్తరాయణ దక్షిణాయనము లను నవయవములతో వెలయుచు బండిచక్రమువలెఁ బరిభ్రమించుచుండును. ఆ పుష్కరద్వీపమును బ్రియవ్రతునికుమారుఁడు వీతిహోత్రుఁడు మొదటఁ బరిపాలించి రమణకధాతకు లనెడి తన యిర్వురుకుమారులకును బంచియిచ్చి సత్కర్మశీలుఁ డయి తనసోదరులవలెఁ బరమపురుషునందు భక్తిసంయుతుఁడై పరమపదము నొందెను. ఆవర్షములందుండుప్రజలు చతుర్ముఖశరీరకుఁడయినభగవంతునిఁ, గర్మయోగ విశిష్ట మయిన భగవదుపాసనముచే నారాధించుచుందురు. ఇట్లు నుతించుచుందురు. "ఓ దేవా! నీవు పరబ్రహ్మమునకు శరీరభూతుండవు. నీవు చరాచరాత్మకప్రపంచమును సృజించి కర్మప్రచురుండ వగుచున్నావు. పరమాత్మకు శరీరమ వగునిన్ను జనులందఱును దేవమనుష్యాది కార్యవర్గమును గుఱించి సమష్టిరూపుఁడ వగుటచేఁ గార్యజాతముకన్న నభిన్నునిఁగాఁ దలపోసి యవ్యభిచరితముగాఁ బూజించుచుందురు. జగత్కర్తవై జనవంద్యుండ వగు నీకు నమస్కారము" అని యావర్షస్థజనము బ్రహ్మను శ్లా

షించుచుండురు. ఓరాజా! సప్తద్వీపాత్మక మగు భూమండల మును వర్ణించి చెప్పితిని. తరువాత వానినిగూర్చి చెప్పెద వినుము. ఆశుద్ధజలసముద్రమునకుఁ బరముగా లోకాలోకము కంత రాళమునుండి లోకాలోక మనుపేరు వహించినపర్వత మొకటి కలదు. ఓరాజేంద్రా! అలోక మనఁగా నేమి యని నీకు సంది యము కలుగవచ్చును. దానిని వివరింతును. వినుము. మేరువు మధ్యభాగము మొదలుకొని మానసోత్తరము వఱకును వ్యాపించి యున్నభూమి, యొకకోటి యేఁబదియేఁడులక్షల యేఁబది వేల యోజనముల పరిమితిచే నొప్పుచున్నది. శుద్ధోదధి మొదలు లోకాలోకముదాఁకఁ గలభూమియునంతియపరిమాణముగలది. లోకాలోకశుద్ధజలసముద్రములకు మధ్యభాగమున నున్నభూమి కాంచనమయమై, యద్దమువలె నిర్మలమై జలశూన్యమై యు న్నది. ఆభూమియం దుంచినవస్తువును దేనినైనను మగుడఁ బొందలేము. ఆలోకాలోకపర్వతమునకు వెలుపట సమస్త జంతుశూన్యమై యున్నభూమి కలదు. ఓనరేంద్రా! మేరువు మొదలుకొని లోకాలోకమువఱకుఁ గలదంతయు లోక మనఁ బడుచున్నది. లోకాలోకమునకుఁ దరువాతిభాగ మలోక మని చెప్పఁబడుచున్నది. లోకాలోకముల కంతరాళమున నాపర్వత ముండి వ్యవస్థ చేయుచున్నది. కావున దాని కా పేరు గల్గుచు న్నది. ఆలోకాలోకము భూరాదిలోకత్రయంబునకును నవ్వల వృత్తాకారముగా భగవంతునిచేఁ గల్పింపఁబడినది. భూరాది లోకములు మూఁడును దాని కంతర్వర్తులై యే యున్నవి. కా వున సూర్యుండు మొదలు ధ్రువునివఱకుఁ గల జ్యోతిర్మండల ముల కాంతిసమూహములు దమకుఁ గ్రిందుగా నున్నవానిని

మాత్రమే యంతటను బ్రకాశింపఁజేయుచున్నవి. కాని యాచక్రవాళము ప్రతిబంధమై నిల్చుటంజేసి యవతలిభాగమును బ్రకాశింపఁ జేయలేకున్నవి. కావుననే సూర్యప్రకాశము కలది లోకమనియు లేనిదలోకమనియు నన్న యవయవార్థము సరిపడుచున్నది. అది ధ్రువమండల మంతయున్నతముగా నుండుటచేతను, ముల్లోకములును దాని కంతర్భూతములయి యుండుటచేతను లోకాలోకముల కెల్లయైవిలసిల్లుచున్నది. ఓరాజేంద్రా! ఈరీతిగా భూమండలముపరిమితి యేఁబదికోట్ల యోజనములని ప్రకృతిశాస్త్రజ్ఞులచే నూహింపఁబడుచున్నది. ఆలోకాలోకము భూమండలమునకుఁ గలయేఁబదికోట్ల యోజనములపరిమాణములోను నాల్గవవంతగు పండ్రెండుకోట్ల యేఁబదిలక్షల యోజనముల యౌన్నత్యముచేతను దదనుగుణ మగు నాయామము చేతను విలసిల్లుచున్నది. ఆచక్రవాళము నుపరిభాగమున నాల్గుదిక్కులందును నిఖిలజగద్గురుండగు బ్రహ్మ ఋషభ మనియుఁ, బుష్కరచూడ మనియు, వామన మనియు, నపరాజిత మనియుఁ బిలువఁబడు నాల్గుకరీంద్రములను సకలలోకముల క్షేమము కొఱకు నిల్పెను. ఆద్విరదపతులకును, నింద్రాదులకును, నానావిధసామర్థ్య మలవడుటకుఁగా సర్వోత్కృష్టుండును, బరమపురుషుండును, ప్రకృతిపురుషుల కధిపతియు నగువాసుదేవుండు సమస్తమునకు నంతరాత్మయై వర్ణాశ్రమోచిత కర్మయోగము చేతను, బ్రకృతికంటె వివిక్త మగు నాత్మయాథాత్మ్యజ్ఞానము చేతను, వైరాగ్యముచేతను, ననుగృహీత మయి యణిమాద్యష్టైశ్వర్యపర్యంత మగునుపాసనముచే దర్శనీయ మగు శుద్ధసత్త్వ

మయు దివ్యమంగళవిగ్రహమును దాల్చి, తన పరిచారకులలో వరిష్ఠు లగు విష్వక్సేనాదులచేఁ బరివేష్టితుండై భుజాదండము లందుఁ జక్రాదిసాధనములు వెలుఁగొందఁ దనమాయచేఁ గల్పిత మగులోకముల రక్షణమందు బద్ధాదరుండై సకలలోకముల సుఖమును గోరుచు నాగిరిశ్రేష్ఠమందుఁ గల్పాంతముదాఁక నివసించుచుండును. ఓరాజా! లోకాలోకమున కంతర్వర్తి యైన భూపరిమాణముఁ జెప్పుటచే దానికవతలనున్న భూపరిమాణము గూడఁ *జెప్పినట్లైకదా! ఆలోకాలోకమున కవతల విశుద్ధమగు

---

* భూమండల మేఁబదికోట్లయోజనములపరిమితి గలదని పెద్దలు చెప్పుచున్నారు. ఆభూమండలమునకు మధ్యమున మేరు వున్నది. ఆమేరువుదగ్గఱ ప్రారంభించి యండభిత్తివఱకును, తిన్నగా నాల్గుదిక్కులకునునడచినచో నిరువదియైదుకోట్లయోజనములదూర ముండును. అండభిత్తియొక్క దక్షిణభాగము మొదలు ఉత్తరపుకొనవఱకు నడచినచో నేఁబదికోట్లయోజనములదూరముండును. అట్లేపడమటనుండి తూర్పునకునడచిన నంతయె దూరముండును. మేరువు మొదలండభిత్తివఱకుఁ గలభూభాగమున జంబూద్వీపభాగ మేఁబదివేలయోజనములపరిమితి గలది. అట్లే తక్కినద్వీపములయొక్కయు సముద్రములయొక్కయుఁ బరిమాణముఁ గలిపినచో రెండుకోట్లయేఁబదిమూఁడులక్షలయేఁబదివేలయోజనములపరిమితి సాగరసప్తకములోను, ద్వీపసప్తకముతోనుగూడి నభూమికిఁ గలదని స్పష్టమగుచున్నది. మంచినీటిసముద్రమునకు తరువాతిభూమి యొక్కకోటి యేఁబదియేడులక్షల యేఁబదివేలయోజనముల పరిమితి గలది. దానికంటెఁ బరముగానున్న యాదర్శభూమి యెనిమిదికోట్లముప్పదితొమ్మిది లక్షల పరిమాణముకలది. వీనినిగలిపి గణించినచోఁ బండ్రెండుకోట్ల యేఁబది లక్షల యోజనములపరిమాణ మని తెల్లమగుచున్నది. అట్లే లోకాలోకపర్వతముకంటెఁ బరముగా నున్నది. పండ్రెండుకోట్ల యేఁబదిలక్షలప్రమాణ మని పరిశేషన్యాయముచే స్పష్టమగుచున్నది. వర్తులాకారముగా నున్నభూమి

యోగప్రభావముగలయోగీశ్వరులు మాత్రమే సంచరింపఁగలుగుదురు. భూమండలమునకు మధ్యమున మేరు వున్నది. ఆమేరువునకు మీఁదుగా భూమ్యాకాశముల నూర్ధ్వాధఃకర్పరములకు మధ్యమున సూర్యుఁ డుండు. ఆ సూర్యునకు నండభిత్తికి నెలు చూచినను నిరువదియైదుకోట్ల యోజనముల పరిమాణము. ఈ యండము నశ్వరమైనది కాన నిది మృతండ మని పిలువఁబడుచున్నది. ఆ మృతండమువలన నయినవాఁడు కాన సూర్యుండు మార్తండుఁడని చెప్పఁబడు చున్నాఁడు. ఈయండముమధ్యభాగము హిరణ్మయమై యున్నది. ఈ హిరణ్మయాండ ముత్పత్తిస్థానముగాఁ గలవాఁడు కాన; బ్రహ్మ హిరణ్యగర్భుఁడని చెప్పఁబడుచున్నాఁడు. సూర్యబ్రహ్మల కీయండమువలననె యీరెండు నామములును గలిగినవి. *సూర్యుఁ డండపరిమాణమునకే య

యొక్క నాభిప్రదేశము మొదలు రెండవప్రక్క వాస్థలమునకు నిరువదియైదు కోట్లపరిమితి కలదు. అట్లె రెండవవైపునఁ జూచిన నంతే యుండును. దీని వలన భూవలయ మేఁబదికోట్లయోజనముల పరిమాణ మని తెలియఁదగినది.

* భూమండలపరిమాణము నిట్లుగాఁ దెలిసికొనవలెను. భూమండల మేఁబది కోట్లయోజనములపరిమితి గలది. వానికి మధ్యమందు మేరు వున్నది. మేరుమూలము మొదలుకొని యండగోళముపర్యంతము నలువైపులను నాలుగువిధములుగా విభజింపవలెను. ఇట్లు విభజింపఁబడిన నాలుగుభాగములు మొదట సన్నముగానుండి తరువాతఁ గ్రమక్రమముగా విశాలమగుచు, అనఁగాఁ ద్రికోణాకారముగా నుండును. అందొకొక్కభాగమున మేరువు మొదలుకొని యండభిత్తిపర్యంతమును దిన్నగా నడిచినచో నిరువదియైదుకోట్ల యోజనము లదూర ముండును. ఆభాగములలో నొకొక్కదానిపరిమాణము పండ్రెండుకోట్లయేఁబదిలక్షలు. ఏలాగున ననఁగా, జంబూద్వీపపరిమాణము లక్షయోజనము

వధి కాఁడు. మఱియు దిగ్విభాగమునకుఁ గూడ నవధి యగుచు

లు. కావున మేరువుమొదలు లవణోదధిపర్యంతమును గలనాల్గుభాగములలో నొకదానిపరిమాణము. జంబూద్వీపమందుఁ గలవిభాజకరేఖలలో నొకదాని కొననుండి వేఱొకదానికొనకు నడిచినచో నేఁబదివేలయోజనములు. కావున మేరువుమొదలు లవణోదధిపర్యంతము గలయొక్కొక్కభాగ మిరువదియైదు వేలయోజనంబుల వైశాల్యము గలది. అట్లె తక్కిన మూఁడుభాగములపరిమాణము నుండును. వానినాల్గింటిపరిమాణమును సంకలనముచేసినచో లక్షయోజనములపరిమాణమును సరిపడును. అట్లె యాయాద్వీపములందును సముద్రము లందును గలవిభాజకరేఖలకు మధ్యమున నున్న నాల్గుభాగములలోను నొక్కొక్కదానిపరిమాణ మేఁబదివేలయోజనములు. నాలుగుభాగముల మొత్తము రెండులక్షలయోజనములు. ఇట్లె శుద్ధోదధిపర్యంతము నుజూచుచుండవలెను. కావున నొక్కొక్కభాగమునందు మేరువుమొదలుకొని శుద్ధోదధిపర్యంతమునుదిన్నఁగా నడిచినచో 2,53,50,000 యోజనములదూరముండును. ఆశుద్ధోదధి మొదలుకొని లోకాలోకపర్యంతమునుఁ బోయినచో 1,57,50,000 వేల యోజనములపరిమితి యుండును. లోకాలోకము మొదలుకొని యండభిత్తిపర్యంతము గలలోకభాగము 8,39,00000 వేలయోజనములపరిమితిగలదు. కావున మేరువు మొదలుకొని యండభిత్తివఱకుఁ గలయొకవైపుపరిమాణము 12,50,00000 వేలయోజనములు. అట్లె తక్కిన మూఁడుభాగములు నంతపరిమాణము కలవి కాఁగా సంకలనముచే భూమండలపరిమాణము 50,0000000 యోజనంబులపరిమాణంబును సరిపడును. కావున దక్షిణమున నున్నయండభిత్తినుండి యుత్తరమున నున్నయండభిత్తికి ఋజుగమనంబునఁ బోయినను బూర్వభిత్తి మొదలుకొని పశ్చిమభిత్తిదాఁకఁ బోయినను 50,0000000 యోజనములపరిమితియేయుండును. ఇచ్చట మఱియొకవిశేషము. భూమండలము నాల్గుభాగంబులుగాఁ జేసినప్పు డందులో నొకటి పండ్రెండుకోట్లయేఁబదిలక్షలయోజనముల

న్నాఁడు. ఓరాజా! సూర్యు నవధిగాఁ జేసికొనియె పూర్వదక్షిణాది దిక్కులును, గగనంబును, స్వర్గలోకమును, భూమిని, భోగమోక్షప్రదేశములను, నరకములను, నతలాది లోకములను, బూర్తిగా విభజించుచున్నారు. ఇంతియకాక భగవదాత్మకుఁడయిన సూర్యుండు, దేవతలు తిర్యక్కులు మనుష్యులు లతలు వృక్షములు మొదలగు సమస్తజీవనికాయముల దృగింద్రియములకు నధిష్ఠాతయై యున్నవాఁడు. ఇది యిరువదవయధ్యాయము.

పరిమితిగలది. ఆభాగములో మేరుమూలము మొదలుకొని లవణోదధిపర్యంతమునుగొల్చినచో జంబూద్వీపభాగము 50,000 వేలయోజనములపరిమాణము కలది. పిమ్మట లవణోదధిభాగమును గొల్చిన లక్షయోజనములుండును ప్లవద్వీపపరిమాణము రెండులక్షలయోజనములు. దానితరువాతనున్న యిక్షుసముద్రము రెండులక్షలయోజనములపరిమితి గలది. తరువాత శాల్మలద్వీపపరిమాణము నాలుగులక్షలు. సురాసముద్రమునింతియె. పిమ్మటఁగుశద్వీపమును ఘృతసముద్రమును పదాఱులక్షలయోజనములు. ఇట్లె శుద్ధోదధిపర్యంతముగలతక్కినవానిపరిమాణములనుసంకలనముచేయఁగా 2,53,50000 యోజనములసంఖ్య సరిపడును. తరువాతఁ గాంచనభూమి 1,57,50000 యోజనములు. అట్లె లోకాలోకము మొదలు మరల లోకాలోకముదాఁక నడచినచో 10,14,00,000. భూమియొుఁ దక్కినపరిమితి గలది. ఇట్లు భూమండలము 50,00,00,000 యోజనముల విస్తీర్ణత గలది యని యెుఱుంగునది.